8

మహాకవి బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీమహాభాగవతము

రెండవ సంపుటము

(చతుర్థ, పంచమ, షష్ఠ స్కంధములు)

మహా పాఠాంతర పరిష్కార విజ్ఞల పీఠికా సహితము



294.592
POT

ప్రదేశ సాహిత్య అకాడమి
హైదరాబాదు.
1964.

Ci

Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY
CALL NO: 294.592 POT ACC. NO: N-10099
AUTHOR: పోతన, పద్యాలు
TITLE:

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

మహాకవి బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీమహాభాగవతము

COMPLIMENTARY

రెండవ సంపుటము

(చతుర్థ, పంచమ, షష్ఠ స్కంధములు)

బహు పాఠాంతర పరిష్కార విపుల పీఠికా సహితము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10099

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10099

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి
హైదరాబాదు.
1964.

్ర సంకలితము.

ద్రణము 2000 ప్రతులు.

2 ఆం.సా
ప్ర

మూల్యము : అయిదు రూపాయలు



ముద్రణ :
శివాజీ ప్రెస్,
సికింద్రాబాదు.

A0UA105B159

సంపాదక వర్గము

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు - (అధ్యక్షులు)

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

డాక్టర్ బి. రామరాజు - (సమావేశకర్త)

శ్రీ తాపి ధర్మారావు

శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి

శ్రీ

లలిత స్కంధము, కృష్ణమూలము, శుకా
లాపాభిరామంబు, మం
జులతా శోభితమున్, సువర్ణసుమన
స్సుజ్ఞేయమున్, సుందరో
జ్జ్వలవృత్తంబు, మహోఫలంబు, విమల
వ్యా సాలవాలంబు నై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వు
ర్వీన్ సద్ద్విజ శ్రేయమై.

విషయ సూచిక

చతుర్థ స్కంధము

విషయము.		పుట సంఖ్య
మైత్రేయుండు విదురునకు స్వాయంభువ మను పుత్రికల వంశవిస్తారంబుఁ దెలుపుట	....	1
కర్దమ ప్రజాపతి సంతతి	....	2
దక్షప్రజాపతి సంతతి	....	6
ఈశ్వరునకును దక్షప్రజాపతికిని విరోధము సంభవించుట	....	7
దక్షప్రజాపతి యజ్ఞము చేయునపుడు దాక్షాయణి యచ్చటికిఁ బోవుట	....	12
శివుఁడు వీరభద్రునిచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు చేయించుట	....	20
దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితు లయి బ్రహ్మతో విన్నవించుట	....	24
బ్రహ్మాదులు దక్షిణామూర్తిరూపుం డగు నీశ్వరుని స్తుతించుట	....	26
ఈశ్వరుండు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుండయి దక్షాదుల ననుగ్రహించుట	....	30
దక్షాధ్వరంబునకు వచ్చిన నారాయణుని దక్షాదులు స్తుతించుట	....	32
ధ్రువోపాఖ్యానము	....	40
ధ్రువుండు నారదోపదేశంబు వడసి తపంబు చేయుట	....	42
ధ్రువుఁడు భగవంతుని స్తుతించుట	....	49
ధ్రువుండు మరలఁ దన పురంబునకు వచ్చుట	....	54
అంగ పుత్రుం డగు వేనుని చరిత్రము	....	72
పృథు చక్రవర్తి గోరూపధారిణి యగు భూమివలన నోషధులఁ బిదుకుట	....	85
పృథు చక్రవర్తి యశ్వమేధంబు సేయునెడ నింద్రుం డశ్వము నపహరించుట	....	91
యాగంబున నారాయణుండు ప్రసన్నుం డై పృథు చక్రవర్తి ననుగ్రహించుట	....	96
పృథు చక్రవర్తి సభాసదులకు సద్ధర్మము నుపదేశించి బ్రాహ్మణ ప్రశంస చేయుట	....	101
పృథు చక్రవర్తి యొద్దకు సనకాదు లరుగుదెంచుట	....	108
పృథు చక్రవర్తి జ్ఞాన వైరాగ్యవంతుఁ డగుచు ముక్తి నొందుట	....	114
రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశ మను స్తోత్రమును దెలియఁ జేయుట	....	122
రుద్రగీత	....	124
నారదుండు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలియఁ జేయుట	....	130
పురంజనోపాఖ్యానము	....	131

పంచమ స్కంధము

ప్రథమాశ్వాసము.

మనుపుత్రుం డగు ప్రియవ్రతుని యుపాఖ్యానము	....	171
భగవంతుం డగు నారాయణుండు ఋషభావతార మెత్తుట	....	178
ఋషభుండు పుత్రులకు నీతి నుపదేశించుట	....	183
భరతోపాఖ్యానము	....	191
వృషల రాజ భృత్యులు కాళి బలికి భరతునిఁ గొంపోవుట	....	198

ద్వితీయాశ్వాసము.

శుకయోగివరుం డుపదేశ రూపముగాఁ దెలుపు భూగోళ స్వరూపాది నిర్ణయము 214
భగోళ విషయము 228
శుకయోగి పరీక్షిత్తునకు నరకలోక వర్ణనము తెలుపుట 241

షష్ఠ స్కంధము

షష్ఠ్యంతములు 252
కథా ప్రారంభము 252
అజామిళోపాఖ్యానము 255
విష్ణుదూత యమదూతల సంవాదము 257
దక్షుఁడు కావించిన హంసగుహ్యం బను స్తవరాజము 277
నారదుండు శబళాశ్వులకు నివృత్తిమార్గంబు నుపదేశించుట 284
దక్షుండు నారదుని శపియించి ప్రజాసర్గం బొనరించుట 285
దేవాసుర యుద్ధ ప్రారంభము 292
శ్రీమన్నారాయణ కవచ ప్రారంభము 295
వృత్రాసుర వృత్తాంతము 301
చిత్రకేతూపాఖ్యానము 326
చిత్రకేతుండు తప మాచరించి భగవత్ప్రసాదంబు నొందుట 331
విద్యాధరాధిపతి యగు చిత్రకేతుం డీశ్వర ధిక్కారంబున గౌరిచే శాప మొందుట 336
సవిత్రవంశాది ప్రవచన కథ 340

ఓమ్

శ్రీ మహా భాగవతము

—o—

చతుర్థ స్కంధము

క. (శ్రీ)విలసిత ధరణీతన, యా వదన[1]సరోజ వాసరాధిప! సితరా
జీవదళనయన! నిఖిలధ. రావరనుత! సుగుణధామ! రాఘవరామా! 1

అధ్యాయము - ౧

వ. మహనీయ గుణగరిష్ఠు లగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యానవైఖరీ సమేతుం డయిన సూతుం డిట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుం డైన పరీక్షి న్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 2

మైత్రేయుండు విదురునకు స్వాయంభువ మనుపుత్రికల వంశవిస్తారంబుఁ దెలుపుట.

సీ. జననాథ! విను విదురునకును మైత్రేయ మునినాథచంద్రుఁ డిట్లనియె మఱియు
స్వాయంభువున కర్థి శతరూపవలనను గూఁతులు మువ్వు రాకూతి దేవ
హూతి ప్రసూతులు నొనరఁ బ్రియవ్ర తోత్తానపాదులు ననుఁ తనయయుగము
[2]జనియించి రం దగ్రసంభవ యైన యాకూతిని సుమహిత భ్రాతృమతినిఁ

తే. దనకు సంతాన వి స్తరార్థంబుగాఁగఁ
బుత్రికా[3]ధర్మ మూఁది యాపువ్వుఁబోఁడిఁ
బ్రకటమూ ర్తి రుచిప్రజాపతికి నిచ్చె
మనువు ముద మొంది శతరూప యనుమతింప. 3

వ. అట్లు వివాహం బైన రుచిప్రజాపతి బ్రహ్మవర్చస్వియుఁ బరిపూర్ణగుణుండును గావునఁ జిత్తైకాగ్రతం జేసి యాకూతియందు (శ్రీవిష్ణుండు) యజ్ఞరూపధరుం డగు పురుషుండుగను, జగదీశ్వరి యగు నాదిలక్ష్మి య మ్మహాత్మునకు నిత్యానపాయిని గావునఁ ద దంశంబున దక్షిణ యను కన్యకారత్నంబుగను, మిథునంబు

---

1. సరోజభాస్కరా వికసిత (బ); సరోజవాసరాధిప, నుత (హ) 2. జనియింపఁగా నందు (హ)
3. ధర్మమొంది (హ. వా.)

సంభవించె. అందు స్వాయంభువుండు సంతుష్టాంతరంగుం డగుచుఁ బ్రతికా పుత్రుండును, విత తేజోధనుండును, శ్రీ విష్ణుమూ ర్తి రూపుండును నగు యజ్ఞునిఁ దన గృహంబునకుఁ దెచ్చి యునిచె. రుచియుఁ గామగమన యైన దక్షిణ యను కన్యకాలలామంబును దనయొద్దన నిలిపె. అంత సకల మంత్రాధిదేవత యగు శ్రీయజ్ఞుండు దనుఁ బతిగఁ గోరెడు దక్షిణ యను కన్యకం బరిణయం బయ్యె. వా రాదిమిథునంబు గావున నది నిషిద్ధంబు గాకుండె. అని చెప్పి మైత్రేయుండు వెండియు నిట్లనియె. 4

క. ధీమహిత! యంత వారల, యామాఖ్యులు గలుగు దేవతావళి గడఁకఁ
వేమఱు [1]నభినందించుచు, నా మిథునము[2]వలనఁ బుట్టె [3]నతిబలయుత మై. 5

వ. వారు తోషుండును, ప్రతోషుండును, సంతోషుండును, భద్రుండును, శాంతియు, నిడస్పతియు, నిధ్ముండును, గవియు, విభుండును, వహ్నియు, సుదేవుండును, రోచనుండును ననం బన్నిద్దఱు సంభవించిరి. వారలు(స్వాయంభు వాంతరంబునం దుషితు లను దేవగణంబు లై వెలసిరి. మఱియు) మరీచి ప్రముఖు లైన ఋషీశ్వరులును, యజ్ఞుండును, దేవేంద్రుండును, మహాతేజో రూప సంపన్నులైన ప్రియవ్రతోత్తానపాదులునుం గలిగి, పుత్ర పౌత్ర నప్తృ [4]వంశంబులచే వ్యాప్తం బై యా మన్వంతరంబు (పాలితం బగుచు)వర్తిల్లె. మనువు ద్వితీయ పుత్రి యైన దేవహూతిం గర్దమున కిచ్చి, త ద్వంశవిస్తారంబు గావించె నని మున్ను మొఱిఁగించితి. వెండియు న మ్మనువు మూఁడవచూ లయిన ప్రసూతి యను కన్యకను బ్రహ్మపుత్రుం డగు దక్షప్రజాపతికి నిచ్చె. ఆ దక్షునకుం బ్రసూతి వలన నుదయించిన ప్రజాపరంపరలచేత ముల్లోకంబులు విస్తృతంబు లయ్యె. మఱియుఁ గర్దమపుత్రికా సముదయంబు బ్రహ్మర్షి భార్య లగుటంజేసి వారివలనం గలిగిన సంతానపరంపరల వివరించెద. 6

—: కర్దమప్రజాపతి సంతతి :—

సీ. ఘనుఁ డౌ మరీచికిఁ గర్దమాత్మజ యగు కళ యను నంగనవలనఁ గశ్య
పుం డను కొడుకును, బూర్ణిమ యను నాఁడుబిడ్డయుఁ బుట్టిరి, పేర్చి వారి
వలనఁ బుట్టిన ప్రజావళి పరంపరలచే భువనంబులెల్ల నాపూర్ణ మగుచు
జరిగెను బూర్ణిమ జన్మాంతరంబున హరిపద ప్రక్షాళి తాంబువులను

---

1. నభినందించిరి (చ. ట. త. డ. ద.) 2. నందు (క. చ. ట. త. డ. ద.) 3. అమర గణం బుల్ (క. చ. ట. త. డ. ద.) 4. జననసంకీర్ణం బైన (క-ద).

తే. గంగ యను పేరఁ బుట్టిన కన్య దేవ
కుల్య యను దాని నొక్కతెఁ గూఁతు నఖిల
విష్టప వ్యాపకుం డగు విరజుఁ డనెడి
తనయు నొక్కనిఁ గాంచె మోదంబుతోడ. 7

క. అనఘుం డత్రిమహాముని, యనసూయాదేవివలన హ ర్యృజ పురసూ
దనుల కళాంశంబుల నం, దనులను ‡మువ్వురను గాంచెఁ దద్దయుఁ బ్రీతిఁ. 8

క. అనవుడు విదురుఁడు మైత్రే, యునిఁ గనుఁగొని పలికె మునిజనో త్తమ! జగతిఁ
జనన స్థితి లయకారణు, లన వెలసిన పద్మగర్భ హరి హరు లెలమిఁ. 9

క. ఏమి నిమి త్తం బత్రిమ, హాముని మందిరమునందు ననసూయకు ను
ద్దామగుణు లుదయ మై రన, నా మైత్రేయుండు వలికె న ద్విదురునితోఁ. 10

సీ. సుచరిత్ర! విను విధిచోదితుం డై యత్రి తప మాచరింపఁ గాంతాసమేతుఁ
డై ఋక్షనామ కులాద్రి తటంబున ఘుమఘుమారావ సంకుల విలోల
కల్లోలజాల సంకలిత నిర్వింధ్యానదీ జలపరిపుష్ట రాజిత ప్ర
సూనగుచ్ఛ స్వచ్ఛమాని తాశోక పలాశ కాంతారస్థలమున కెలమి

తే. నరిగి యచ్చట నిర్ద్వంద్వుఁ డగుచుఁ బ్రాణ
నియమనమున[1] నేకాంఘ్రిచే నిలిచి గాలిఁ
దివుటఁ గ్రోలి కృశీభూతదేహుఁ డగుచుఁ
దపముఁ గావించె దివ్యవత్సర శతంబు. 11

వ. ఇ ట్లతిఘోరం బై న తపంబు సేయుచుం దన చి త్తంబున. 12

క. ఏ విభుఁడు జగదధీశ్వరుఁ, డా విభు శరణంబుఁ జొత్తు నతఁ డాత్మసమం
బై వెలసిన సంతతిని ద, యావరమతి నిచ్చుఁగాక యని తలఁచు నెడఁ. 13

చ. మునుకొని య త్తపోధనుని మూర్ధజ మైన తపఃకృశానుచే
తను ద్రిజగంబులుం [2]గరఁగి త ప్తము లై నను జూచి పంకజా
సన మురశాసన త్రిపురశాసను లచ్చటి కేఁగి రప్పురో
జన సుర సిద్ధ సాధ్య మునిసన్నుత భూరి యశోభిరాము లై. 14

వ. అట్లు మునీంద్రు నాశ్రమంబు డాయుంజను నవసరంబున. 15

---

‡ అత్రేఃపత్న్యనసూయాఽఽఖ్యా, సుషువే సుయశ స్స్వనామ్, దత్తం దుర్వాససంసోమ మాత్మేశ బ్రహ్మసంభవాఁ (1–15ఏ). 1. నియమమున నేకపదమున నిలిచి (తం. వా.) 2. గలిగి (చ)

చ. అనఘతపోభిరాముఁ డగు నత్రిమునీంద్రుఁడు గాంచెఁ దప్తకాం
చన ఘనచంద్రికా రుచిర చారు శరీరుల, హంస నాగసూ
దన వృషభేంద్ర వాహుల, నుదారకమండలు చక్ర శూల సా
ధనుల విరించి విష్ణు పురదాహుల, వా క్కమ లాంబి కేశులన్. 16

వ. మఱియును గృపావలోక మందహాస సుందర వదనారవిందంబులు గల మహాత్ముల దర్శించి, యమం దానంద కందళిత హృదయారవిందుం డై సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి, పుష్పాంజలి గావించి నిటలతట ఘటిత కరపుటుం డై దుర్నిరీక్షుం బైన తత్తేజోవిశేషంబుఁ దేఱిచూడం జాలక ముకుళితనేత్రుం డై [1]తత్పదాయత్తచిత్తుం డగుచు సర్వలోక [2]ప్రశస్యంబు లైన మృదు మధుర గంభీర భాషణంబుల నిట్లని స్తుతియించె. 17

సీ. ప్రతికల్పమందు సర్వప్రపం చోద్భవ స్థితి వినాశంబులఁ జేయునట్టి
మహిత మాయాగుణమయ దేహములఁ బొల్చు నజ వాసుదేవ శివాభిధాన
ములు గల్గు మీ పాదజలజాతముల కేను నతిభక్తి వందనం బాచరింతు
నఖిల చేతన మానసాగమ్య మన నొప్పు మూర్తులు గల్గు మీ మువ్వురందుఁ

తే. బరఁగ నాచేతఁ బిలువంగఁబడిన ధీరుఁ
డెవ్వఁ డే నొక్కరునిఁ బిల్వ నిపుడు మీరు
మువ్వు రేతెంచుటకు నాదుబుద్ధి విస్మ
యంబు గదిరెడిఁ జెప్పరే! యనఘులార! 18

వ. అదియునుం గాక సంతానార్థంబు నానావిధ పూజలు గావించి, నా చిత్తంబున ధరియించిన మహాత్ముం డొక్కరుండ. అనిన న మ్ముమ్మువ్వురు విబుధశ్రేష్ఠులు నతనిం గనుంగొని, సుధామాధుర్య సమంబు లయిన వాక్యంబుల నిట్లనిరి. 19

క. వినుమేము ముగురమయ్యును, ననుపమమతిఁ దలఁప నేక మై యుందుము నీ
మనమందు నేమి కోరితి? వనయము నా కోర్కి సఫల మయ్యెడుఁ జుమ్మీ! 20

క. మా మువ్వుర యంశంబుల, ధీమతులగు సుతులు వుట్టి త్రిభువనములలో
నీ మంగళ గుణకీర్తిన్, శ్రీమహితము సేయఁగలరు సిద్ధము సుమ్మీ! 21

క. అని మునిచంద్రుఁడు దన మన, మునఁ గామించిన వరంబు బుధవరులు ముదం
బున నొసఁగి [3]యతని సత్కా, జనములఁ బరితృప్తు లగుచుఁ [4]జనిరి యథేచ్ఛన్. 22

---

1. తత్పరాయత్త (తం. వా. చ. డ.) 2. గరిష్ఠంబులైన (తం. వా.) 3. యతనిచే పూజనముల (చ. ట. త. జ.) 4. జనిరద్దివికిన్ (క. చ. ట. జ. డ.); "ప్రతిజగ్ముస్సురేశ్వరాః, సభాజితా స్తదా స్వమ్య గ్దంపత్యో ర్మిషతో స్తతః" అని మూలము (1-32).

ఉ. ఆ సుచరిత్రదంపతు లుదంచితలీలఁ గనుంగొనంగ; న
జ్ఞాసను నంశమందు నమృతాంశుఁడు, విష్ణుకళఁ సుయోగవి
ద్యా సుభగుండు దత్తుఁడు, పురాంతకు భూరికళాంశమందు దు
ర్వాసుఁడు నై జనించి రనవద్య పవిత్రచరిత్రు లిమ్ములఁ. 23

క. అంగిరసుఁ డనెడు మునికిఁ గు, లాంగన యగు శ్రద్ధయందు నంచిత సౌంద
ర్యాంగులు గూఁతులు నలువురు, మంగళవతు లుదయ మైరి మాన్యచరిత్రా!

క. వారు సినీవాలియును గు, హూరాకానుమతు లనఁగ నొప్పిరి మఱియుం
గోర సుతయుగము గలిగెను, స్వారోచిషమనువువేళ శస్తఖ్యాతిన్. 25

వ. వారలు భగవంతుం డగు నుచథ్యుండును, బ్రహ్మనిష్ఠుం డగు బృహస్పతియు
ననం బ్రసిద్ధి వహించిరి. పులస్త్యుండు హవిర్భ క్కను నిజభార్యయందు
నగస్త్యునిం బుట్టించె. ఆ యగస్త్యుండు జన్మాంతరంబున జఠరాగ్నిరూపం బై
ప్రవర్తించె. వెండియు నా పులస్త్యుండు విశ్రవసునిం గలిగించె. ఆ విశ్రవసునకు
నిళబిల యను భార్యవలనం గుబేరుండును, గైకసి యను దానివలన రావణ
కుంభకర్ణ విభీషణులును బుట్టిరి. పులహునకు గతి యను భార్యయందుఁ గర్మ
శ్రేష్ఠుండు, వరీయాంసుండు, సహిష్ణుండు నను మువ్వురు కొడుకులు జనియించిరి.
మఱియుఁ గ్రతువునకుఁ గ్రియ యను భార్యయందు (బ్రహ్మతేజంబున జ్వలింపు
చున్న) షష్టిసహస్ర సంఖ్యలుగల వాలఖిల్యులను మహర్షులు గలిగిరి. వసిష్ఠుం డూర్జ
యను భార్యయందుఁ జిత్రకేతుండును, సురోచియును, విరజుండును, మిత్రుం
డును, నుల్బణుండును, వసుభృద్ధ్యానుండును, ద్యుమంతుండును, నను సప్తఋషు
లను, భార్యాంతరంబున శక్తిప్రముఖ పుత్రులనుం బుట్టించె. †అధర్వుం డను
వానికిఁ ‡జిత్తి యనుభార్యయందు ధృతవ్రతుండును, అశ్వశిరస్కుండు నైన
దధ్యంచుండు పుట్టె. (మహాత్ముం డగు) భృగువు ఖ్యాతి యను పత్నియందు
ధాతయు, విధాతయు నను పుత్రద్వయంబును, భగవత్పరాయణ యగు శ్రీ
యను కన్యకం బుట్టించె. ఆ ధాతృ విధాతృలు మేరు వను వాని కూఁతు లైన
యాయతి, నియతు లను భార్యలవలన మృకండ ప్రాణు లను కొడుకులం
బుట్టించిరి. అందు మృకండునకు మార్కండేయుండును, ప్రాణునకు వేదశిరుం
డను మునియుం బుట్టిరి. భార్గవునకు నుశన యను కన్యయందు కవి యను
వాఁడు వుట్టె. ఇట్లు కర్దమదుహిత లైన కన్యకానవకంబు వలనం గలిగిన

---

† స్వధర్మ్మఁడు(క); అధర్వణుఁడు(చ); స్వధర్మ్మణుఁడు(ట) ‡ జత్తి (క); చిత్ర(త); శాంతి(డ); శాంత (ద)

సంతాన పరంపరలచేత సమస్తలోకంబులు పరిపూర్ణంబు లయ్యె. ఇట్టి సద్యఃపాపహరంబును, శ్రేష్ఠతమంబు నైన కర్దమదౌహిత్ర సంతానప్రకారంబు శ్రద్ధాగరిష్ఠ చిత్తుండవగు నీకుం జెప్పితి. ఇంక దక్షప్రజాపతి వంశం బెఱింగింతు. వినుము.

—: దక్షప్రజాపతి సంతతి :—

క. వనజజునివలన భవమం, దిన యా దక్షప్రజాపతికి మను నిజనం
దన యగు ప్రసూతి[1]సతియం, దనఘా ! పదియార్వు రుదయ మందిరి కన్యల్.

వ. ఇట్లావిర్భవించిన కన్యకలందు శ్రద్ధయు, మైత్రియు, దయయు, శాంతియుఁ, దుష్టియుఁ, బుష్టియుఁ, గ్రియయు, నున్నతియు, బుద్ధియు, మేధయుఁ, దితిక్షయు, హ్రీయు, మూర్తియు ననునామంబులం గల పదుమువ్వురను ధర్మరాజున కిచ్చె. ఒక్క కన్యక నగ్నిదేవునకు, నొక్కతెం బిత్రదేవతలకు, నొక్కతె జన్మమరణాది నివర్తకుం డగు నభవునకుం బెండ్లిసేసె. అంత నా ధర్ముని పత్నులయందు శ్రద్ధవలన శ్రుతంబును, మైత్రివలన ప్రసాదంబును, దయవలన నభయంబును, శాంతివలన సుఖంబును, తుష్టివలన ముదంబును, పుష్టివలన స్మయంబును, క్రియవలన యోగంబును, ఉన్నతివలన దర్పంబును, బుద్ధివలన నర్థంబును, మేధవలన స్మృతియుఁ, దితిక్షవలన క్షేమంబును, హ్రీవలన ప్రశ్రయంబును, మూర్తివలన [2]సకల కల్యాణగుణో త్పత్తిస్థానభూతు లగు నరనారాయణు లను ఋషు లిద్దఱును సంభవించిరి. వారల జన్మకాలంబున. 28

సీ. గంధవాహుఁడు మందగతి ననుకూలుఁ డై వీచె [3]నల్దిక్కులు విశద మయ్యె
నఖిలలోకంబులు నానందమును బొందెఁ దుములమై దేవదుందుభులు మ్రోసెఁ
గర మొప్ప జలధులఁ [4]గలఁకువ లుడిగెను మించినగతిఁ బ్రవహించె నదులు
గంధర్వ కిన్నర గానముల్ వీతెంచె నప్సరోజనుల [5]లాస్యములు చెలఁగె

తే. సురలు గురియించి రందంద విరులవాన,
మునిజనంబులు సంతోషములఁ జెలంగి
వినతు లొనరించి రవ్వేళ విశ్వమెల్లఁ
బరమ మంగళ మై యొప్పె భవ్యచరిత ! 29

వ. ఆ సమయంబున బ్రహ్మాదిదేవత లమ్మహాత్ములకడకుం జనుదెంచి యిట్లని స్తుతియించిరి.

---

1. వలనను, అనఘ ! జనించిరి పదార్వు రబ్జాతాక్షుల్ (క. చ. ట. డ. బ.) 2. సర్వగుణోత్పత్తి (క–బ) 3. నయ్యెను దిశల్ విశదములుగ (హ) 4. కలఁక లడంగెను (హ. తం. వా) 5. నృత్యంబు లొనరె (హ)

సీ. [1]గగనస్థలిం దోఁచు గంధర్వనగరాది రూపభేదము లట్ల రూఢి మెఱసి
యే యాత్మయందేని [2]నేపారు మాయచే నీ విశ్వ మిటు రచియింపఁ బడియె
నట్టి యాత్మప్రకాశార్థ మై మునిరూపముల ధర్మగృహమునఁ బుట్టినట్టి
పరమపురుష ! నీకుఁ బ్రణమిల్లెదము నది గాక సృష్టి దుష్కర్మవృత్తి

తే. [3]జరుగనీకుండుకొఱకు నై సత్త్వగుణము
చే సృజించిన మ మ్మిట్లు శ్రీనివాస
మైన సరసీరుహప్రభ నపహసించు
[4]నీ కృపాలోకనంబుల నెమ్మిఁ జూడు. 31

క. అని యిట్లు దేవగణములు, వినుతింపఁ గృపాకటాక్ష వీక్షణములచేఁ
గని వారు గంధమాదన, మున కేఁగిరి తండ్రిముదము ముప్పిరిగొనఁగన్. 32

క. ధరణీభర ముడుపుట కా, నరనారాయణులు భువి జనన మనయము నొం
దిరి యర్జున కృష్ణాఖ్యల, గురు యదువంశముల సత్త్వగుణయుతు లగుచున్. 33

వ. మఱియు నగ్ని దేవునకు [5]దక్షపుత్రి యైన స్వాహాదేవి యను భార్యయందు
హుతభోజను లగు పావకుండును, పవమానుండును, శుచియు ననుమువ్వురు
కొడుకులు గలిగిరి. వారివలనం బంచచత్వారింశ త్సంఖ్యలం గల యగ్ని
లుత్పన్నంబు లయ్యె. ఇట్లు పితృ పితామహ యుక్తంబుగా నేకోనపంచాశ
త్సంఖ్యలం గల *(యగ్నుల కొఱకు బ్రహ్మవాదులచే) యజ్ఞ కర్మంబులం దగ్ని
దేవతాకంబు లయిన యిష్టులు దత్త న్నామంబులచేత జేయంబడుచుండు.
(ఆ యగ్ని లెవ్వ రనిన నగ్నిష్వాత్తులు, బర్హిషదులు, సౌమ్యులు, పితలు,
ఆజ్యపులు, సాగ్నులు, నిరగ్నులు నన నేడుతెఱంగు లయి యుందురు.
దాక్షాయణి యగు స్వధ యను ధర్మపత్నియందు వారలవలన వయునయు,
ధారిణియు ననునిద్దరు కన్యలుదయించి, జ్ఞానవిజ్ఞాన పారగ లగుచు బ్రహ్మనిష్ఠ
లయి పరఁగిరి.) వెండియు. 34

—: ఈశ్వరునకును దక్షప్రజాపతికిని విరోధము సంభవించుట :—

సీ. దక్షప్రజాపతి తనయోయు, భవుని భార్యయు ననఁదగు సతి యను లతాంగి
సతతంబు పతిభక్తి సల్పుచుండియుఁ దనూజాతలాభము నందఁజాల దయ్యె

---

1. గగనమందుల (క. బ) 2. యేపార (హ) 3. జరుగకనె యుండు (హ) 4. మీ కృపా లోకనంబుల మించి గనుఁడు (హ) 5. మనుపౌత్రి(చ. ద.) * కొన్ని ప్రతులందు లేదు.
6. యా భవుని భార్య యనఁగాఁ దగు(తం. వా.); యభవుని భార్య యన్నఁ గాఁదగు (హ)

భర్గునిదెసఁ జూలఁ బ్రతికూలుఁ డై నట్టి తమ తండ్రిమీఁది రోషమునఁ జేసి
వలనేది తా ముగ్ధవలె నిజయోగమార్గంబున నాత్మదేహంబు విడిచె

తే. నని మునీంద్రుఁడు వినిపింప న మ్మహాత్ముఁ
డైన విదురుండు మనమున నద్భుతంబు
గదురఁ దత్కథ విన వేడ్క గడలుకొనఁగ
మునివరేణ్యునిఁ జూచి యిట్లనియె మఱియు. 35

అధ్యాయము - ౨

సీ. చతురాత్మ ! దుహితృవత్సలుఁ డైన దక్షుండు దనకూఁతు సతి ననాదరము సేసి
యనయంబు నఖిల చరాచర గురుఁడు ని ర్వైరుండు శాంతవిగ్రహుఁడు ఘనుఁడు
జగముల కెల్లను జర్చింప దేవుండు నంచితాత్మారాముఁ డలఘుమూర్తి
శీల[1]వంతులలోన శ్రేష్ఠుండు నగు నట్టి భవునందు విద్వేషపడుట కేమి

తే. కారణము ? సతి దానేమి కారణమున
విడువరానట్టి ప్రాణముల్ విడిచె ? మఱియు
శ్వశురజామాతృ విద్వేషసరణి నాకుఁ
దెలియ నానతి యిమ్ము సుధీవిధేయ ! 36

క. అని యడిగిన న ద్విదురునిఁ, గనుఁగొని మైత్రేయుఁ డనియెఁ గౌతుకమొప్పఁ
[2]విను మనఘ ! తొల్లి బ్రహ్మలు, జననుతముగఁ జేయునట్టి సత్రముఁ జూడన్. 37

చ. సరసిజగర్భ యోగిజన సర్వసుపర్వ మునీంద్ర హవ్యభు
క్పరమబుషి ప్రజాపతులు భక్తిమెయిం జనుదెంచియుండ [3]న
త్తరణిసమానతేజుఁ డగు దక్షుఁడు వచ్చినఁ [4]ద త్సభాసదుల్
దరమిడి లేచి రప్పుడు పితామహ భర్గులు దక్క నందఱున్. 38

క. చనుదెంచిన యా దక్షుఁడు, వనజజునకు మ్రొక్కి భక్తివశు లై [5]సభ్యుల్
దన కిచ్చిన పూజలు గై, కొని యర్ఘ్యాసనమునందుఁ గూర్చుండి తగన్. 39

తే. తన్నుఁ బొడగని [6]సభ్యు లందఱును లేవ
నాసనము డిగ్గకున్న పురారివలనుఁ

---

1. శీలవ్రతులలోన (క. చ. ట. బ.) 2. అనఘాత్మ ! తొల్లి (క.చ.ట.బ.) 3. న, త్తరిఁ దరుణార్క తేజుఁడగు (క.చ.ట.త.బ.) 4. తత్సదస్యులా, దరమున (హ. వా.) 5. సభికుల్ (క.జ.డ.బ.) 6. సభికులందఱును (ట.జ.)

గన్నగొనలను విస్ఫులింగములు చెదరఁ
జూచి యి ట్లను రోషవిస్ఫురణ మెఱయ. 40

తే. *(వినుఁడు [1]మీరలు రొదమాని విబుధ ముని హృ
తాళనాది సురో త్తములార ! మోహ
మత్సరోక్తులు గావు నామాట లనుచు
వారి కందఱి కా పురవై రిఁ జూపి.) 41

సీ. పరికింప నితఁడు [2]దిక్పాల యళోహాని కరుఁ డీ క్రియాశూన్య పరునిచేతఁ
గరమొప్ప సజ్జనాచరితమార్గము దూషితం బయ్యె నెన్న గతత్రపుండు
మహిత సావిత్రీసమాననుఁ సాధ్వి నస్మ త్తనూజను మృగశాబనేత్ర
[3]ననల భూసుర బంధుజన సమక్షమున మర్కట లోచనుఁడు కరగ్రహణ మర్థిఁ

తే. జేసి తా [4]శిష్టభావంబుఁ జెందు టాత్మఁ
దలఁచి ప్రత్యుద్గ మాభివందనము లెలమి
[5]నడపకుండిన మాననీ ననుఁ గన్న
నోరిమాటకుఁ దన కేమి [6]గోరువోయె? 42

సీ. అనయంబు లుప్త క్రియాకలాపుఁడు మాన హీనుఁడు మర్యాద లేనివాఁడు
మ త్తప్రచారుఁ డున్మ త్తప్రియుఁడు దిగంబరుఁడు భూత ప్రేత పరివృతుండు
దామస ప్రమథ భూతములకు నాథుండు భూతి [7]లిప్తుం డస్థిభూషణుండు
నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్ట [8]హృదయుండు నుగ్ర పరేతభూ ని

తే. కేతనుఁడు విత త్రస్తకేశుఁ డశుచి
[9]యైన యితనికి శివనాముఁ డను ప్రవాద
[10]మెటులఁగలిగె? నశివుఁ డగు నితని నెఱిఁగి
యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినటుల. 43

వ. ఇతనికి నస్మ త్తనయను [11]విధిప్రేరితుండ నై యిచ్చితి. 44

---

* ఈ పద్యము - క. చ. ట. జ. డ. ద. బ. ప్రతులలో లేదు. 1. నామాట (త) 2. దిక్పాలక వరయళో, హానికరుఁడు క్రియాహీనుచేత (క. చ. త. జ. డ.) 3. సకల భూమీ సురజన సమక్షమున (హ. వా.) 4. శిష్య (హ. తం. వా.) 5. నడువకుండినమానె వినతుఁడు గాక (హ) 6. గోర (తం. వా.) 7. త్రిపుండ్రాస్థి (క. చ. ట. బ. డ.) 8. హృదయుఁడుగ్రుఁ డును (తం. వా.) 9. యైన తనకొక (క. చ. బ.) 10. గలిగెఁగాని యశివుఁడని కాన కెఱిఁగి (క. ట. త. డ. బ. తం.) 11. విధివత్ప్రకారంబుగా (ట. త. జ. డ. ద. బ. తం.)

క. అని యిట్టులు ప్రతికూల వ, చనములు దక్షుండు వలికి [1]శర్వు శపింతు
న్నని జలములు గొని సుస్థల, మున [2]నిలి చిట్లనియె రోషమున ననఘాత్మా! 45

క. ఇతఁ డింద్రోపేంద్ర పరీ, వృతుఁ డై మఖసమయమున హవిర్భాగము దే
వతలం గూడఁగ మహితని, యతిఁ బొందక యుండుఁగాక యని శపియించెన్.

వ. ఇట్లు దక్షుండు వల్కిన గర్హితవాక్యంబులు వినిందితంబులుగ నుండినను, [3]అర్థాంతరంబున వాస్తవంబు లగుచు భగవంతుం డగు రుద్రునందు ననిందితంబు లై స్తుతిరూపంబున నొప్పె. తదనంతరంబ రుద్రునకు శాపం బిచ్చి, దక్షుండు సదస్యముఖ్యులచే నకృత్యం బని నిషేధింపంబడి, ప్రవృద్ధం బయిన క్రోధంబుతోడ నిజనివాసంబునకుం జనియె. అంత గిరిశానుచరాగ్రేసరుం డగు నందికేశ్వరుండు, దక్షుండు నిటలాక్షుని శపియించిన శాపంబును, అతనిం బల్కిన యనర్హవాక్యంబు లును విని కోపారుణిత లోచనుం డై యిట్లను. ఈ దక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబుగాఁ దలంచి, యప్రతిద్రోహి యైన భగవంతునందు భేదదర్శి యై యపరాధంబు గావించె. ఇట్టి మూఢాత్ముండు దత్త్వవిముఖుం డగు. మఱియుం గూటధర్మంబు లైన నివాసంబుల గ్రామ్యసుఖాకాంక్షలం జేసి సక్తుం డై యర్థవాదంబు లయిన వేదంబులచేత నష్టమనీషం గలిగి, కర్మతంత్రంబు విస్తృతంబు సేయుచు, దేవాదికంబులుపాదేయంబులుగాఁ దలఁచుచు, బుద్ధిచేత నాత్మతత్త్వంబు మఱచి వర్తించి, పశుప్రాయుండు స్త్రీకాముకుండు నగు. ఇదియునుం గాక దక్షుం డచిరకాలంబున మేషముఖుం డగు. అని మఱియు. 47

మ. అనయంబుఁ దనమానసంబున నవిద్యఁ ముఖ్యతత్త్వంబుగాఁ
గని గౌరీశుఁ దిరస్కరించిన యసత్కర్మాత్ము నీ దక్షుని
న్ననువర్తించిన[4]వారు సంసరణ కర్మారంభు లై నిచ్చలుఁ
జననం బందుచుఁ జచ్చుచుఁ మరల నోజం బుట్టుచు న్నుండెడుఁ. 48

వ. అదియునుం గాక యీ హరద్వేషు లైన ద్విజు లర్థవాదబహుళంబు లైన వేదవాక్యంబులవలన మధుగంధసమం బైన చిత్తక్షోభంబుచేత విమోహిత మనస్కు లై కర్మాసక్తు లగుదురు. మఱియును భక్ష్యాభక్ష్య విచారశూన్యు లై, దేహాది పోషణంబుకొఱకు ధరియింపంబడు విద్యా తపో వ్రతంబులు గల వార లై, ధన దేహేంద్రియంబులయందుఁ బ్రీతింబొంది యాచకు లై, విహరింతు రని

---

1. శపియింతును శర్వుని నని జలములు గొని కర (హ. తం. వా.) 2. నిలిచి యిటులనె రోషమున ననఘాత్మా ! (తం. వా.) 3. యథార్థంబున (హ) 4. వాఁడు.....కర్మారంభుఁ డై....బుట్టుచుఁ వర్తిలున్ (హ)

నందికేశ్వరుండు బ్రాహ్మణజనంబుల శపియించిన వచనంబులు విని భృగుమహాముని
మఱల శపియింపం బూని యి ట్లనియె. 49

తే. వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు వారు
వారి కనుకూలు రగుదు రెవ్వారు వార
లట్టి సచ్ఛాస్త్ర పరిపంథు లైనవారు
నవని పాషండు లయ్యెద రని శపించె. 50

వ. అది యెట్లంచేని. 51

సీ. సకల వర్ణాశ్రమాచార హేతువు లోకములకు మంగళమార్గమును సనాత
నము పూర్వఋషి సమ్మతము జనార్దనమూలమును నిత్యమును శుద్ధమును [1]బరంబు
[2]నార్యపథానుగం బగు వేదమును విప్రగణము నిందించిన కారణమున
నే శివదీక్షయం దేని మధ్యమపూజ్యఁ డై భూతపతి దైవ మగుచునుండు

తే. నందు మీరలు భస్మ జటాస్థి ధార
ణములఁ దగి మూఢబుద్ధులు నష్టశౌచు
లై నశింతురు పాషండు లగుచు ననుచు
శాప మొనరించె నా ద్విజసత్తముండు. 52

వ. ఇ ట్లన్యోన్య శాపంబులం బొందియు, భగవ దనుగ్రహంబు గలవార లగుటంజేసి
నాశంబు నొంద రై రి. అట్టియెడ విమనస్కుం డగుచు ననుచరసమేతుం డై
భవుండు చనియె. అంత. 53

సీ. అనఘాత్మ ! యే యజ్ఞమందు సర్వశ్రేష్ఠుఁ డగు హరి సంపూజ్యఁ డై వెలుంగు
నట్టియజ్ఞంబు సమ్య గ్విధానమున సహస్ర వత్సరములు నజుఁ డొనర్చెఁ
గర మొప్ప నమరగంగా యమునా[3]నదీ యోగంబు గలుగు ప్రయాగయందు
నవభృథస్నానంబు లతిభక్తిఁ గావించి గత కల్మషాత్ము లై ఘనత కెక్కి

తే. [4]తగ నిజాశ్రమభూములఁ దలఁచి వార
లందఱును వేడ్కతోఁజని రనుచు విదురు
నకును మైత్రేయుఁ డను మునినాయకుండు
నెఱుఁగ వినిపించి వెండియు నిట్టు లనియె. 54

---

1. శివంబు (హ) 2. ఆర్యపథంబును నగు (క. చ. ట. జ.) 3. సంగ, మంబునఁ (హ)
4. తమతమాశ్రమ (చ. ట. జ.)

అధ్యాయము - 8

—: దక్షప్రజాపతి యజ్ఞము చేయునపుడు దాక్షాయణి యచ్చటికిఁ బోవుట :—

వ. అంత శ్వశురుం డగు దక్షునకు జామాత యైన భర్గునకు నన్యోన్యవిరోధంబు పెరుఁగుచుండ నతిచిరం బగు కాలం బరిగె. అంత దక్షుండు రుద్రవిహీనం బగు యాగంబు లేనిది యైనను శర్వుతోడి పూర్వవిరోధంబునను, బరమేష్ఠికృతం బై న సకల ప్రజాపతివిభుత్వ గర్వంబుననుం జేసి *(బ్రహ్మనిష్ఠు లగు నీశ్వరాదుల ధిక్కరించి) యరుద్రంబుగా వాజపేయసవనంబు గావించి, తదనంతరంబ బృహస్పతిసవన నామకం బై న మఖంబు సేయ నుపక్రమించిన నచ్చటికిం గ్రమంబున.

చ. కర మనురక్తి న మ్మఖము గన్గొను వేడుక దొంగలింపఁగాఁ
బరమముని ప్రజాపతి సుపర్వ మహర్షివరుల్ సభార్యు లై
పరువడి వచ్చి యందఱు శుభస్థితి దీవన లిచ్చి దక్షుచేఁ
బొరిఁబొరి నచ్చటఁ విహితపూజల నొందిరి సమ్మదంబునఁ. 56

తే. దక్షతనయ సతీదేవి దవిలి యాత్మ
సదనమున నుండి జనకుని సవనమహిమ
గగనచరులు నుతింప నా కలకలంబు
విని [1]కుతూహల మెప్ప గగనముఁ జూడ. 57

వ. అ య్యవసరంబున త దుత్సవదర్శన కుతూహలు లై సర్వదిక్కులవారును చను సమయంబున. 58

పి. తనరారు నవరత్న తాటంకరోచులు చెక్కుటద్దములతోఁ జెలిమిసేయ
మహనీయ తపనీయమయ పదకద్యుతు లంసభాగంబుల [2]నావరింప
నంచిత చినిచినాంబర ప్రభలతో మేఖలాకాంతులు మేలమాడఁ
జంచల సారంగ [3]చారు విలోచనప్రభలు నల్దిక్కులఁ బ్రబ్బికొనఁగ

తే. మించువేడుక భర్తృసమేతముగను
మానితము లై న దివ్య విమానయాన
లగుచు నాకాశపథమున నరుగుచున్న
ఖచర గంధర్వ కిన్న రాంగనలఁ జూచి. 59

---

* తా. ప్ర. ప్రతులందు లేదు. 1. కుతూహలయై వినువీథిఁ జూడ (చ); కుతూహలిని యయి విన్వీథిఁ జూడ (తం);.....విన్వీథిఁ జూడ (వా) 2. నాదరింప (క. ట. త. జ. డ.) 3. చంచల లోచన (చ. త. జ. డ.)

క. సతి దనపతి యగు నా పశు, పతిఁ జూచి సముత్సుకతను భాషించెఁ బ్రజా
పతి మీ మామ మఖము సు, వ్రతమతి నొనరింపుచున్న [1]వాఁ డని వింటిఁ. 60

క. కావున న య్యజ్ఞమునకు, నీ విబుధగణంబు లర్థి నేఁగెద రదిగో!
దేవ! మన మిప్పు డచటికిఁ, బోవలె నను వేడ్క నాకుఁ బుట్టెడు నభవా! 61

క. ఆ యజ్ఞముఁ గనుఁగొనఁగా, నా యనుజలు భక్తిఁ బ్రాణనాథులతోడఁ
బాయక వత్తురు మనముఁ, బోయిన నే వారి నచటఁ బొడగనఁ గల్గుఁ. 62

క. జనకుని మఖమున కర్థిం, జన నీతోఁ బారిబర్హ సంజ్ఞికములచేఁ
దనరిన భూషణములఁ గై, కొన వేడ్క జనించె నీశ! కుజనవినాశా! 63

క. నాతోడను స్నేహము గల, మాతనుఁ ద తోన్సదరీసమాజము బుషిసం
భూత కృత మఖ సమంచిత, కేతువుఁ గన వేడ్క గగనకేశ! జనించెన్. 64

వ. అదియునుం గాక దేవా! *(మహా)శ్చర్యకరం బై *(గుణత్రయాత్మకం బగు) ప్రపంచంబు భవదీయ మాయా వినిర్మితం బగుటంజేసి నీకు నాశ్చర్యకరంబుగాదు. అయినను భవదీయ తత్త్వం బెఱుంగఁజాలక కామినీ స్వభావంబు గలిగి, కృపణురాల నై మదీయ జన్మభూమిఁ గనుంగొన [2]నిచ్చయించితి. అని వెండియు నిట్లనియె. 65

చ. ముదమునఁ [3]ద న్మఖోత్సవ విభూతిఁ గనుంగొన [4]దివ్యకామినుల్
పదువులు గట్టి భూషణ విభాసిత లై నిజనాథయుక్త లై
మదకలహంస పాండుర సమంచిత దివ్యవిమానయాన లై
యదె చనుచున్న వారు గను మభ్రపథంబున నీలకంఠరా! 66

క. అనఘా! విను లోకంబున, జనకుని గేహమునఁ గలుగు సకలసుఖంబుల్
దనయలు జని సంప్రీతిఁ, గనుఁగొన కేరీతి నిల్చుఁ? గాయము లభవా! 67

క. అనయముఁ బిలువక యుండఁ, [5]జన ననుచిత మంటివేని జనక గురు సుహృ
జ్జననాయక గేహములకుఁ, జనుచుందురు పిలువకున్న సజ్జను [6]లభవా! 68

వ. అని మఱియు నిట్లనియె. దేవా! నాయందుఁ బ్రసన్నుండ వై మదీయ మనోరథంబుఁ దీర్చ నర్హుండవు. సమధికజ్ఞానంబు గల నీచేత నేను భవదీయ దేహంబునం దర్ధంబున ధరియింపం బడితి. అట్టి నన్ను ననుగ్రహింప వలయు. అని

---

1. వాఁడఁట వించె (డ) * తా. ప. ప్రతులందులేవు. 2. నాసచేసితినని (చ. ట. త. డ.) 3. తన్మఖోద్భవ (క. ట. త. ప. హ. తం. వా.) 4. నన్యకామినుల్ (హ. తం. వా.) 5. జనుటను చిత మంటివేని (చ. త. జ.); జనుటుచిత మె యంటివేని (బ) 6. లనఘా (చ. త. జ. డ. తం.)

ప్రార్థించిన మందస్మిత వదనారవిందుం డగుచు [1]జగత్సృష్టల సమక్షంబున దక్షుండు
ద న్నాడిన మర్మభేదంబు లైన కూహక వాక్య సాయకంబులం దలంచుచు
ని ట్లనియె. 69

సీ. కల్యాణి ! నీమాట కడు నొప్పు బంధువుల్ పిలువకుండినను సంప్రీతిఁ జనుదు
[2]రంటివి యది లెస్స యైనను దేహాభిమాన మదమున నమర్షమునను
గడఁగి యారోపిత ఘన కోపదృష్టులు గా రేని పోఁదగుఁ గాని వినుము
వినుత విద్యా తపో విత్త వయో రూప కులములు సుజనులకును గుణంబు

తే. లివియ కుజనుల యెడ దోష హేతుకంబు
లై వివేకంబు చెఱుచు మహాత్ములైన
వారి మాహాత్మ్య మాత్మగర్వమునఁ జేసి
జడులు వొడగానఁజాలరు జలజనేత్ర ! 70

క. విను మట్లు కుటిలు లగు దు,ర్జనుల గృహంబులకు బంధు సరణిని బోవఁ
జనదు వినీతుల కది కడు, ననుచిత మై యుండు నింతి ! యది యెట్లనినఁ. 71

ఆ. కుటిలబుద్ధు లైన కుజనుల యిండ్లకు, నార్యు లేఁగ వా రనాదరమున
బొమలు ముడివడంగ భూరిరోషాతు లై, చూతు రదియుఁగాక సుదతి! వినుము.

చ. సమద రిపుప్రయు క్త పటుసాయక జర్జరితాంగుఁ డయ్యు దుఃఖమును దొఱంగి నిద్రఁ గనుఁ గాని కృశింపఁడు మానవుండు నో
యుమ ! విను మిష్టబాంధవ దురుక్తులు మర్మములంట నా టఁ జి
త్తమున నహర్నిశంబు పరితాపము నొంది కృశించు[3]చాడ్పునఁ.

క. [4]విను ముత్కృష్టుం డగు ద,క్షునికిఁ దనూభవలలోనఁ గూరిమి సుతవై
నను నా సంబంధంబున, జనకునిచేఁ బూజ వడయఁ జాలవు తరుణీ ! 74

వ. అది యెట్లు? అతనిచేత భవ త్సంబంధంబునం జేసి పూజఁ బడయమికి నతనికినీకు
విరోధంబునకు హేతు వెట్టిది ? అని యంటివేని. 75

మ. [5]నిరహంకార నిర స్తదోష సుజ నానిం ద్యోల్ల[6]సత్కీర్తి కొం
దలు కామించి యశక్తు లై మనములన్ దందహ్య మా నేంద్రియా

---

1. బ్రహ్మ సమక్షంబున(చ); బ్రహ్మల..... (ట. త.) 2. రంటి విదియు లెస్స (తం. వా.) 3. నెప్పుడున్ (హ. తం. వా.) 4. విను లోకోత్కృష్టుఁడు (తం. వా.) 5. నిరహంకార మహత్స మృద్ధి (చ. త. ప. హ.) నిరహంకార నిర స్తపాప (తం. వా.) 6. కీర్తియున్, ధరఁ గామించి(హ)

తురు లై [1]యూరక మచ్చరింతురు మహాత్ముం డీశ్వరుం డై న యా
హరితో బద్ధవిరోధముఁ దొడరు దై త్యశ్రేణి చందంబునఁ. 76

వ. అదియునుం గాక నీ వతనికిం బ్రత్యుత్థా నాభివందనంబులు గావింపకుండుటం
జేసి యతండు దిరస్కృతుం డయ్యె. అంటివేని, లోకంబుల జను లన్యోన్యంబును
బ్రత్యుత్థా నాభివందనంబులు గావింతురు అదియ ప్రాజ్ఞు లయినవారు సర్వభూ
తాంతర్యామి యైన పరమపురుషుండు నిత్యపరిపూర్ణుండు గావునఁ గాయిక
వ్యాపారం బయుక్తం బని, త దుద్దేశంబుగా మనంబునందు నమస్కారాదికంబులు
గావింతురు. కాని దేహాభిమానంబులు గలుగు పురుషులందుఁ గావింపరు. కాన
నేనును వసుదేవశబ్దవాచ్యుండు శుద్ధస త్త్వమయుండు నంతఃకరణంబు
నందు నావరణ విరహితుండు నై ప్రకాశించు వాసుదేవునకు నా హృదయం
బున నమస్కరింపుచుండుదు. ఇ ట్లనపరాధి యైన నన్నుఁ బూర్వంబున బ్రహ్మలు
సేయు సత్రంబునందు దురుక్తు లం జేసి పరాభవించి మ ద్ద్వేషి యైన దక్షుండు
భవ జ్ఞునకుఁ డై న నతఁడును ద దనువ ర్తను లయిన వారలును జూడఁదగరు.
కావున మ ద్వచనాతిక్రమంబుం జేసి యరిగితివేని యచట నీకుఁ బరాభవంబు
సంప్రా ప్తం బగు. లోకంబున బంధుజనంబులవలనఁ బూజ పడయక తిరస్కారంబు
నొందుట చచ్చుటయ కాదే? యని పలికి మఱియు భవుండు పొమ్మని
యనుజ్ఞ యిచ్చిన నచ్చట నవమానంబునం జేసి యశుభం బగు ననియు, నిచ్చటఁ
బొమ్మనక నివారించిన మనోవేదన యగు ననియు మనంబునం దలపోయుచు
నూరకుండె నంత. 77

అధ్యాయము - ౪

సీ. సతి సుహృద్ధర్మ నేచ్ఛా ప్రతికూల దుఃఖస్వాంత యగుచు నంగములు వడఁక
నందంద దొరఁగెడు నశ్రుపూరంబులు గండభాగంబులఁ గడలు కొనఁగ
నున్నత స్తనమండ లోపరి హారముల్ వేడినిట్టూర్పుల వెచ్చఁ గంద
నతిశోక రోషాకు లాత్యంత దోదూయమాన మై హృదయంబు మలఁగుచుండ

తే. [2]మఱియుఁ గుపితాత్మ యై స్వసమానరహితు
నాత్మదేహంబు సగమిచ్చినట్టి ధవుని
విడిచి మూఢాత్మ యగుచు న వ్వెలఁది సనియె
జనకుఁ జూచెడి వేడుక సందడింప. 78

---

1. కొందఱు (హ) 2. మహిత కుపితాఽయై (క. చ. త. డ. ద.)

వ. ఇట్లతిశీఘ్ర గమనంబున. 79

సీ. మానిని చనుచుండ మణిమన్మదాది సహస్ర సంఖ్యాత రుద్రానుచరులు
యతులు నిర్భయు లై వృషభేంద్రుని మున్నిడికొనుచు న మ్మోదిత దాల్చు
కందుకాంబుజ శారికా తాళవృంత దర్పణ ధవళాతపత్ర ప్రసూన
మాలికా సౌవర్ణమణివిభూషణ ఘనసార కస్తూరికా చందనాది
తే. వస్తువులు గొంచు నేగి శర్వాణిఁ గదిసి
శంఖ దుందుభి వేణు నిస్వనము లొప్ప
మానితం బై న వృషభేంద్రయానఁ జేసి
[1]యజ్ఞభూమార్గ లై యర్థి నరిగి యరిగి. 80

వ. ముందట. 81

చ. మనమున మోదమందుచు [2]సుమాతరుణీమణి గాంచె [3]దారు మృ
త్కనక కుశాజి నాయస నికాయ వినిర్మిత పాత్రసీమము
న్ననుపమ వేదఘోష సుమహా త్పశుబంధన కర్మభూమముఁ
మునివిబు ధాభిరామము సముజ్జ్వల హోమము యాగధామముఁ. 82

వ. ఇట్లు గనుంగొని యజ్ఞశాలం బ్రవేశించిన. 83

క. చనుదెంచిన య మ్మగువను, జననియు సోదరులు దక్క సభఁ గల జను లె
ల్లను దక్షువలని భయమున, ననయము నపు డాదరింప రై రి మహాత్మా! 84

క. మఱి తల్లి యుఁ బినతల్లులు, పరిరంభణ మాచరింపఁ బరితోషాశ్రుల్
దొరఁగఁగ డగ్గుత్తికతో, సరసిజముఖ సేమ మరయ సతి దా నంతఁ. 85

క. జనకుం డవమానించుట,యును సోదరు లర్థిఁ దనకు నుచిత క్రియఁ జే
సిన పూజల నందక శో,భన మరసిన మాఱుమాటఁ బలుకక యుండెఁ. 86

వ. ఇట్లు తండ్రిచేత నాదరింపఁ బడని దై విభుం డై న యీశ్వరునందు నావ్హాన క్రియా శూన్యత్వ రూపం బై న తిరస్కారంబును, నరుద్రభాగం బై న యజ్ఞం బునుం, గనుంగొని నిజ రోషానలంబున లోకంబులు భస్మంబు సేయం బూనిన తెఱంగున నుద్రేకించి, రుద్రవిద్వేషియుఁ, గ్రతుకర్మాభ్యాస గర్విష్ఠుండును నగు దక్షుని వధియింతు మనుచు లేచిన భూతగణంబుల నివారించి, రోషావ్యక్తభాషణంబుల నిట్లనియె. లోకంబున శరీరధారు లై న జీవులకుఁ బ్రియాత్మకుం డై న

---

1. యజ్ఞ భూమార్గమున కర్థి (చ. ట. డ. బ.) 2. రమణీమణి (చ. త. డ.) 3. చారు (హ. తం. వా.)

యీశ్వరునకుఁ బ్రియాప్రియులు, నధికులును లేరు. అట్టి సకలకారణుండు, నిర్మత్సరుండు నైన రుద్రునందు నీవు దక్క నెవ్వండు ప్రతికూలం బాచరించు? అదియునుం గాక మిముబోఁటివారలు పరులవలని గుణంబులందు దుర్గుణంబు లన యాపాదింతురు. మఱియుం గొందఱు మధ్యస్థు లయినవారలు పరుల గుణంబులయందు దోషంబుల నాపాదింపరు. కొందఱు సాధువర్తనంబు గల వారలు పరుల దోషంబుల నైన గుణంబులుగా ననుగ్రహింతురు. మఱియుం గొంద ఱుత్త మోత్తములు పరులయందు దోషంబుల నాపాదింపక తుచ్ఛగుణం బులు గలిగినను సద్గుణంబులుగాఁ గైకొందురు. అట్టి మహాత్ములయందు నీవు పాపబుద్ధిం గల్పించితివి. అని వెండియు నిట్లను. మహాత్ము లగువారల పాద ధూళిచే నిరస్త ప్రభావు లై జడస్వభావంబుగల దేహంబు నాత్మ యని పల్కు కుజను లగువారు మహాత్ముల నిందించు [1]టాశ్చర్యంబు గాదు. అదియు వారి *కనుచితం బగు. అని వెండియు నిట్లనియె. 87

పి. అనయంబు శివ యను నక్షరద్వయ మర్థి వాక్కునఁ బలుక భావమునఁ దలఁప
సర్వజీవుల పాపసంఘముల్ చెడు నట్టి మహితాత్మునందు నమంగళుండ
వగు నీవు విద్వేషి వగుట కాశ్చర్యంబు నందెద వినుము నీ వదియుఁ గాక
చర్చింప నెవ్వని చరణపద్మంబుల నరసి బ్రహ్మానంద మను మరంద

తే. మతులభక్తినిఁ దమ హృదయంబు లనెడి
తుమ్మెదలచేతఁ గ్రోలి సంతుష్టచిత్తు
లగుదు రత్యంత విజ్ఞాను లట్టి దేవు
నందు ద్రోహంబు సేసి తేమందు నిన్ను? 88

క. [2]మఱియును న మ్మహితాత్ముని, [3]చరణ సరోజాతయుగము సకలజగంబుల్
[4]నెఱిఁ గొలువఁ గోరు కోర్కులు, దరమిడి వర్షించు నతనిఁ దగునే తెగడఁగ? 89

చ. పరఁగఁ జితాస్థిభస్మ నృకపాల జటా ధరుఁడుఁ బరేత భూ
చరుఁడు పిశాచయుక్తుఁ డని శర్వు నమంగళుఁగాఁ దలంప రె
వ్వరు నొకఁ డీవు దక్క మఱి వాక్పతిముఖ్యులు న మ్మహాత్ము స
చ్చరణసరోజ రేణువులు సమ్మతిఁ దాల్తురు మస్తకంబులఁ. 90

---

1. నిందించుట కార్యంబుగాదు (హ. తం. వా. క. జ. ద. బ.) 2. మఱిగడు (హ)
3. యఱిముఱి జరచాబ్జయుగము నఖిల జగంబుల్ (హ) 4. నెఱి గోరిన కోరికలం (హ)
* తదేవ శోభనమ్ - మూలము(4-13)అతోసత్సు మహాన్నిందన మేవ ఉచిత మి త్యర్థ :-వ్యాఖ్య.

చ. నెలకొని ధర్మపాలన వినిర్మలు భర్గుఁ దిరస్కరించు న
క్కలుషుని జిహ్వాఁ గోయఁ దగుఁగా కటు సేయఁగ నోపఁడేనిఁ దాఁ
బొలియుట యొప్పు రెంటికిఁ బ్రభుత్వము చాలమిఁ గర్ణరంధ్రముల్
బలువుగ మూసికొంచుఁ జనఁ బాడి యఁ టందురు ధర్మవర్తనుల్. 91

వ. అది గావున, 92

మ. జనుఁ డజ్ఞానమునఁ భుజించిన జుగుప్సం బైన యన్నంబు స
య్యన వెళ్లించి పవిత్రుఁ డైనగతి దుష్టాత్ముండ వై యీశ్వరుఁ
ఘను నిందించిన నీ తనూభవ యనంగా నోర్వ నీ హేయ భా
జన మైనట్టి శరీరముఁ విడిచి [1]భాస్వచ్ఛుద్ధి [2]ప్రాపించెదఁ. 93

వ. అదియునుం గాక దేవతల కాకాశగమనంబును, మనుష్యులకు భూతలగమనంబును స్వాభావికంబు లైనట్లు ప్రవృత్తి నివృత్తి లక్షణ కర్మంబులు రాగ వైరాగ్యాధికారంబులుగా వేదంబులు విధించుటంజేసి రాగయుక్తు లై కర్మతంత్రు లైన సంసారులకు వైరాగ్యయుక్తు లై యాత్మారాము లైన యోగిజనులకు విధి నిషేధ రూపంబు లయిన వైదిక కర్మంబులు గలుగుటయు, లేకుండుటయు నైజంబు లగుటఁజేసి స్వధర్మనిష్ఠుం డగువాని నిందింపంజనదు. ఈ యుభయ కర్మ శూన్యుండు, బ్రహ్మభూతుండు నైన సదాశివునిఁ గ్రియాశూన్యుం డని నిందించుట పాపం బగు. తండ్రీ! సంకల్ప మాత్ర ప్రభవంబు లగుటంజేసి మహాయోగిజన సేవ్యంబు లైన యస్మదీయంబు లగు నణిమా ద్యష్టైశ్వర్యంబులు నీకు సంభవింపవు. భవదీయం బగు నైశ్వర్యంబులు ధూమమార్గ ప్రవృత్తు లై యాగాన్నభోక్త లైనవారిచేత యజ్ఞశాలయందె చాల నుతియింపంబడి యుండుఁగాన నీ మనంబున నే నధికసంపన్నుఁడ ననియుఁ జితాభస్మాస్థిధారణుం డైన రుద్రుండు దరిద్రుం డనియును గర్వింపం జనదు. అని వెండియు నిట్లనియె.

ఉ. నీలగళాపరాధి యగు నీకుఁ దనూభవ నౌట చాలదా?
చాలుఁ గుమర్త్య! నీదు తనుజాత ననఁ మది సిగ్గు వుట్టెడి
[3]న్నేల, ధరఁ మహాత్ములకు నెగ్గొనరించెడి వారి జన్మముల్
గాలుపనే, తలంప జనకా! కుటిలాత్మక! యెన్ని చూడఁగఁ. 95

చ. వర వృషకేతనుండు భగవంతుఁడు నైన హరుండు నన్ను నా
దర పరిహాసవాక్యముల దఱుతనూభవ! యంచుఁ బిల్వ నేఁ

---

1. భాస్వచ్ఛుద్ధి వాటిల్లెదన్ (హ. తం.); శుద్ధిఁ బాటిల్లెదన్ (వా) 2. జాల ధరన్ మహాత్ములకుఁ, జయ్యన నెగ్గొనరించు జన్మముల్ (హ)

బురబుర బొక్కుచున్ ముదము బొందక నర్మవచః స్మితంబులఁ
దొఱఁగుదు నీ తనూజ నను దుఃఖముకంటెను జచ్చు టొప్పగున్. 96

వ. అని యిట్లు యజ్ఞసభా మధ్యంబున [1]విరోధి యైన దక్షు నుద్దేశించి పలికి, కామ క్రోధాది శత్రు విభూతిని యగు సతీదేవి యుదఙ్ముఖి యై, జలంబుల నాచమనంబు చేసి, శుచి యై మౌనంబు ధరియించి, జితాసన యై భూమియందాసీనయగుచు యోగమార్గంబునం జేసి శరీరత్యాగంబు సేయం దలంచి. 97

సీ. వరుస ఘ్రాణాపాన వాయునిరోధంబు గావించి వాని నేకముగ నాభి
తలమున గూర్చి యంతట నుదానము దాఁక నెగయించి బుద్ధితో హృదయపద్మ
మున నిల్పి వాని మెల్లన గంథమార్గము నను మఱి భ్రూమధ్యమున వసింపఁ
జేసి శివాంఘ్రి రాజీవచింతనముచే నాథునిఁ దక్క నన్యంబుఁ జూడ

తే. క మ్మహాత్ముని యంకపీఠంబునందు
నాదరంబున నుండు దేహంబు దక్షు
వలని రోషంబునను విడువంగఁ దలఁచి
తాల్చెఁ దనువున ననిలాగ్ని ధారణములు 98

వ. ఇట్లు ధరియించి గతకల్మషం బైన దేహంబు గల సతీదేవి నిజ యోగసమాధి జనితం బైన వహ్నిచేఁ దత్క్షణంబ దగ్ధ యయ్యె నంత. 99

క. అది గనుగొని హాహా [2]రవ, మెదవఁగ నిట్లనిరి మానవులుఁ ద్రిదశులు నీ
మదిరాక్షి యకట! దేహము, వదలెఁ గదా! దక్షుతోడి వైరము కతనన్. 100

వ. మఱియు నిట్లనిరి. 101

సీ. సకల చరాచర జనకుఁ డై నట్టి యీ దక్షుండు దన కూర్మితనయ మాన
వతి పూజనీయ యీ సతి దనచే నవమానంబు నొంది సమక్షమందుఁ
గాయంబుఁదొఱఁగంగఁ గనుఁగొనుచున్న వాఁ డిట్టి [3]దురాత్ముఁ డెం దేనిఁ గలఁడె?
యనుచుఁ జిత్తంబుల నాశ్చర్యములఁ బొంది రదియును గాక యిట్లనిరి యిట్టి

తే. దుష్టచిత్తుండు బ్రహ్మబంధుండు నైన
యీతఁ డనయంబు దా నపఖ్యాతిఁబొందు
నింద పడి మీఁద దుర్గతిఁ జెందుఁగాక
యనుచు జనములు పలుకు న య్యవసరమున. 102

---

1. ప్రతికూలుండగు (హ. తం. వా.) 2. ధ్వని, వొదలఁగ (వా) 3. దౌరాత్మ్య మెందేని గలదె (తం)

క. దేహము విడిచిన సతిఁగని, బాహాబల మొప్ప రుద్ర పార్షదులును ద
ద్రోహిం ద్రుంచుటకై యు, త్సాహంబున లేచి రసి[1]గదాధరు లగుచున్.

క. ఆ రవ మపు డీషించి మ, హారోషముతోడ భృగుమహాముని గ్రతుసం
హారక మారక మగు [2]నభి, చారక హోమం బొనర్చె సరభస మొప్పన్. 104

వ. ఇట్లు దక్షిణాగ్నియందు వేల్చిన నందుఁ *(దపం బొనర్చి, సోమలోకంబున నుండు సహస్రసంఖ్యలుగల) ఋభునామధేయు లైన దేవత లుదయించి, బ్రహ్మతేజంబు నంజేసి దివ్యవిమాను లై యుల్కాకంబులు సాధనంబులుగా ధరియించి, రుద్ర పార్షదు లైన ప్రమథగుహ్యక గణంబులఁ బాఱందోలిన, వారును పరాజితు లై రి. త దనంతరంబ నారదువలన భవుండు *(దండ్రిచే నసత్కృతుఁ లగుటంజేసి) భవాని పంచత్వంబు నొందుటయుం బ్రమథగణంబులు *(ఋభునామక దేవత లచేఁ) [3]బరాజితు లగుటయు విని. 105

—: శివుఁడు వీరభద్రునిచే దక్షయజ్ఞంబు ధ్వంసంబు చేయించుట :—

శా. ఆద్యుం డుగ్రుఁడు నీలకంఠుఁ డిభద్వై త్యారాతి దష్టోష్ముఁ డై
మాద్య ద్భూరిమృగేంద్ర ఘోషమున భీమప్రక్రియన్ నవ్వుచున్
విద్యు ద్వహ్ని శిఖా సముచ్చయరుచిన్ వెల్గొందు చంచజ్జటన్
సద్యఃక్రోధముతోడఁ బుచ్చి వయిచెన్ ఙ్ఞాచక్ర మధ్యంబునన్. 106

వ. ఇట్లు పెటికి వైచిన రుద్రుని జటయందు. 107

అధ్యాయము — ౪

సీ. అభ్రంలి హోదభ్ర విభ్ర మాభ్రభ్రమ కృ న్నీల దీర్ఘశరీర మమరఁ
బ్రజ్వల జ్జ్వలన దీప్త జ్వాలికా జాల జాజ్వల్యమాన కేశములు మెఱయఁ
జండ దిగ్వేదండ శుండాభ దోర్దండ సాహస్రధృత హేతిసంఘ మొప్ప
వీక్షణత్రయ లోకవీక్షణ ద్యుతి లోకవీక్షణతతి దుర్నిరీక్ష మగుచుఁ

తే. గ్రక్కచకఠిన కరాళదంష్ట్రలు వెలుంగ
ఘనకలా పాస్థి వనమాలికలును దనర

---

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

1. గదాధారణులై (చ. త. డ. ద. బ.) గదాపాణులు నై (హ. త. వా.) 2. నభి, చారము గావించె నంత (క. చ. ట. త. జ. బ.) 3. పలాయన మగుటయు (చ. ట.)

నఖిలలోక భయంకరుఁ డగుచు వీర
భద్రుఁ డుదయించె మాఱటరుద్రుఁ డగుచు. 108

తే. వీరభద్రుండు [1]విహతవిద్వేషి భద్రుఁ
డగుచుఁ దన వేయుచేతులు మొగిచి వినయ
మెసఁగ నే నేమిసేయుదు? నెఱుఁగ నాకు
నానతిమ్మన్న నతని క య్యభవుఁ డనియె. 109

చ. గురు భుజశౌర్య! భూరి రణకోవిద! మ ద్భటకోటి కెల్ల నీ
వరయ వరూధినీవరుఁడ వై చని యజ్ఞముగూడ దక్షునిఁ
[2]బరువడి ద్రుంపు మీ వచట బ్రాహ్మణతేజ మజేయ మంటి వే
నరిది మ దంశసంభవుఁడ వై తగు నీకు [3]నసాధ్య మె య్యెడఁ? 110

వ. అని కుపితచిత్తుం డై యాజ్ఞాపించిన నట్ల కాక యని. 111

చ. అనఘుఁడు రుద్రుఁ జేరి ముదమారఁ బ్రదక్షిణ మాచరించి వీ
డ్కొని యనివార్య వేగమునఁ గుంభిని బ్రక్కదలఁ ఝళంఝళ
ధ్వని మణినూపురంబులు పదంబుల బ్రమోయఁగ భీషణప్రభల్
దనరఁ గృతాంతకాంతక శిత స్ఫుట శూలముఁ బూని చెచ్చెరఁ. 112

చ. సరభసవృత్తి నట్లరుగు సైన్య పదాహత [4]ధూత దూళి ధూ
సరిత కుబేరది క్తటము సఖ్యులు దక్షుఁడుఁ జూచి యెట్టి భీ
కరతమ మం చనం దమము గాదు రజఃపటలం బటంచు [5]ని
వ్వెఱపడి పల్క రాత్మల వివేకవిహీనతఁ బొంది వెండియున్. 113

సీ. ఈ ధూళి వుట్టుట కెయ్యెది హేతువో? విలయస మీరమా? పొలయ దిపుడు
ప్రాచీనబర్హి ధరాపతి మహితోగ్ర శాసనుం డిపుడు రాజ్యంబుసేయఁ
జోరసంఘములకో? రారాదు మఱి గో గణాళి రాకకు సమయంబు గాదు
కావున నిప్పుడు గల్పావసానంబు గాఁబోలుఁ గా కటు గాకయున్న

తే. [6]నిట్టి యౌత్పాతికరజ మెందేనిఁ గలదె?
యనుచు మనమున భయమంది రచటి జనులు

---

1. నిహత (చ. జ. డ. ద. బ.) 2. బరిపరిసేసి (జ. తం.) 3. నసాధ్యమున్నదే (క. చ. త. జ. డ. ద. బ.) 4. పాదధూళి (హ.తం.వా.) 5. న,చ్చరియము నొంది రాత్మల విచక్షణతా రహితాత్మ లై కడున్ (హ) 6. ఇట్టి యుత్పాత జనక మెందేని గలదె (క-బ)

సురలు దక్షుఁడు నంత ప్రసూతిముఖ్య
లైన భూసురకాంత లిట్లనిరి మఱీయు. 114

క. తన కూఁతులు సూడఁగ నిజ, తనయను సతి ననపరాధఁ [1]దగవే ది ట్లై
గ్లొనరించిన యీ దక్షుని, ఘన పాపవిపాక మిదియుఁ గాఁదగు ననుచున్. 115

వ. వెండియు ని ట్లనిరి. [2]కుపితాత్ముం డైన దక్షుండు దన కూఁతుతో విరోధంబు చాలక జగ త్సంహారకారణుం డైన రుద్రునిం గ్రోధింపఁజేసిన న మ్మహాత్ముం డెంతటివాఁ డంచేని ప్రళయకాలంబున. 116

సీ. సుమహిత నిశిత త్రిశూలాగ్ర [3]సంప్రోత నిఖల దిక్కరిరాజ నివహుఁ డగుచుఁ
జటులోగ్ర నిష్ఠుర స్తనిత గంభీరాట్టహాస నిర్భిన్నాఖిలాశుఁ డగుచు
భూరి కరాళ విస్ఫార దంష్ట్రాహతి పతిత తారాగణ ప్రచయుఁ డగుచు
వివిధ హేతివ్రాత విపుల ప్రభాపుంజ మండిత చండ దోర్దండుఁ డగుచు

తే. వికటరోష భయంకర భ్రుకుటి దుర్ని
రీక్ష్య దుస్సహ తేజోమహిమఁ దనర్చి
ఘన వికీర్ణ జటాబంధ కలితుఁ డగుచు
నఖిల సంహారకారణుఁ డై నటించు. 117

తే. అట్టి దేవునిఁ ద్రిపుర సంహారకరునిఁ
జంద్రశేఖరు సద్గుణసాంద్రు నభవు
మనము రోషింపఁజేసిన మంగళములఁ
బొందవచ్చునె? పద్మగర్భునకు నైన. 118

వ. అని యి ట్విధంబున భయ విహ్వల లోచను లై పలుకుచున్న సమయంబున మహాత్ముం డైన దక్షునకు భయావహంబు లై సహస్రసంఖ్యాతంబు లైన మహోత్పాతంబులు భూనభోంతరంబులఁ గానంబడుచుండె. ఆ సమయంబున రుద్రానుచరులు [4]నానావి ధాయుధంబులు ధరియించి, కపిల పీత వర్ణంబులు గలిగి వామనాకారులు మకరోద రాననులు నై యజ్ఞశాలా ప్రదేశంబునం బరువులు వెట్టుచుఁ గదియంజనుదెంచి దక్షాధ్వరవాటంబుల విటతాటంబు

---

1. దగవటియిట్లై, గ్లొనరించిన (తం. వా.) 2. కుటిలాత్ముండైన (క. చ. జ.) 3. కుంఠిత (క. చ. ట. త. జ. డ. బ.) "స్వ ఋూల సూచ్యర్పిత దిగ్గజేంద్రః" (ఈ-10) 'స్వ ఋూలస్య సూచ్యాః అగ్రే అర్పితాః ప్రోతాః; దిగ్గజేంద్రా యేన? (వ్యా) 4. నానావిధ సాధనంబులు (క. చ. బ.)

సేయుచుం గొందఱు ప్రాగ్వంశంబును, గొందఱు పత్నీశాలయుఁ, గొందఱు సదస్యశాలయు, నందుఁ గొంద ఱాగ్నీధ్రశాలయుఁ, గొందఱు యజమాన శాలయుఁ, గొందఱు మహానసగృహంబును విధ్వంసంబులు గావించిరి. మఱియుఁ గొందఱు యజ్ఞపాత్రంబుల నగ్నులం [1]జఱచిరి. వెండియుఁ గొందఱు హోమాగ్ను లార్చిరి. పదంపడి కొందఱు హోమకుండంబులయందు మూత్రం బులు విడిచిరి. కొంద ఱుత్తరవేదికా మేఖలలు ద్రెంచిరి. కొందఱు మునుల బాధించిరి. కొందఱు దర్భత్నుల వెఱపించిరి. మఱికొందఱు దేవతానిరోధంబు గావించిరి. అంత మణిమంతుండు భృగువును, వీరభద్రుండు దక్షుని, జండీశుండు పూషుని, భగుని నందీశ్వరుండును బట్టిరి. ఇ ట్లిధంబున సదస్య దేవ ఋత్వి జ్నీ కాయంబుల శిలల నువ్వియు, జానువులఁ బొడిచియు, నఱచేతుల నడిచియుఁ, [2]గూర్పరంబులఁ బొడిచియు, వివిధబాధలం బఱచిన వారు కాందిశీకు లై యొక్క డెక్క డేనియుం జనిరి. మఱియును. 119

క. మును దక్షుఁ డభవుఁ బలుకఁగఁ, గనుగీటిన భగునిఁ బట్టి కన్నులు పెకలిం
చెను నందీశ్వరుఁ డచ్చటి, జనములు హాహారవముల సందడి పెట్టఁ. 120

తే. కుపితుఁ డై నాఁడు భవుని దక్షుఁడు శపింపఁ
బరిహసించిన పూషుని పండ్లు డుల్లఁ
గొట్టె బలభద్రుఁ డా కళింగుని రదంబు
లెలమి డులిచిన పగిదిఁ జండీశ్వరుండు. 121

క. తగవేది దక్షుఁ డా సభ, నగచాపుఁ దిరస్కరించు[3]నాఁ డట శ్మశ్రుల్
నగుచుం జూపుట నా భృగు, పగకై శ్మశ్రువులు వీరభద్రుఁడు వెఱికెఁ. 122

సీ. అతుల దరోద్ధతుం డై వీరభద్రుండు గైకొని దక్షు వక్షంబు ద్రొక్కి
ఘన శితధారాసిఁ గొని [4]మేను వొడిచియు మంత్రసమన్విత మహితశస్త్ర
జాలావినిర్భిన్న చర్మంబుఁగల దక్షుఁ జంపఁగాలేక విస్మయము నొంది
త ద్వధోపాయంబు దనచిత్తమునఁ జూచి కంఠ నిష్పీడనగతిఁ దలంచి

తే. మస్తకము ద్రుంచి సంచి తామర్షణమున
దక్షిణానలమున వేల్చెఁ ద దనుచరులు
హర్షమును బొంద నచటి బ్రాహ్మణజనంబు
లాత్మలను జాల దుఃఖంబు లందుచుండ. 123

---

1. చెఱచిరి (తం.వా.) 2. గుల్ఫంబులఁ(హ) 3. నాడు శ్మశ్రుల్ (హ) 4. మేన నడఁచియు(హ)

వ. ఇట్లు వీరభద్రుండు దక్షుని యాగంబు విధ్వంసంబు గావించి, నిజనివాసం బైన కైలాసంబునకుం జనియె. అ య్యవసరంబున. 124

అధ్యాయము - ౬

—: దేవతలు వీరభద్రాదులచేఁ బరాజితు లయి బ్రహ్మతో విన్నవించుట :—

చ. హర భటకోటిచేత నిశితాసి గదా కరవాల శూల ము
ద్గర ముసలాది సాధన విదారిత జర్జరి తాఖిలాంగు లై
సురలు భయాకులాత్మ్ములగుచుఁ సరసీరుహజాతుఁ జేరి త
చ్చరణ సరోరుహంబులకు సమ్మతిఁ జాఁగిలి మ్రొక్కి నమ్రులై. 125

క. తము ధూర్జటి సైనికు లగు
ప్రమథులు దయమాలి పెలుచ బాధించుట స
ర్వముఁ జెప్పి రనుచు మైత్రే
య మునీంద్రుఁడు విదురుతోడ ననియె్ఁ మటీయున్. 126

తే. ఇంతయును మున్ను మనమున నెటిఁగియున్న
కతన విశ్వాత్మ్మకుండును గమలలోచ
నుండు నన నొప్పు నారాయణుండు నజుఁడు
చూడ రాదెరి వినుము దక్షునిముఖంబు. 127

వ. అని చెప్పి సుర లిట్లు విన్నవించిన చతుర్ముఖుండు వారల కి ట్లనియె. 128

క. ఘన తేజోనిధి పురుషుం, డనయంబు గృతాపరాధుఁ డైనను [1]దామ
ట్లన ప్రతికారము గావిం, చిన జనులకు లోకమందు సేమము గలదే? 129

వ. అని మటీయు ని ట్లనియె. 130

క. క్రతు భాగార్హుం డగు పశు, పతి నీశ్వరు నభవు శర్వు భర్గుని దూరీ
కృత యజ్ఞ భాగుఁ జేసిన, యతిదోషులు దుష్టమతులు నగు మీ రింకన్. 131

సీ. పూని యే దేవుని బొమముడిమాత్రన లోకపాలకులును లోకములును
నాశమొందుదు రట్టి యీశుండు ఘన దురు క్తాస్త్రనికాయ విద్ధాంతరంగుఁ
డును బ్రియావిరహితుండుగ నైనవాఁ డ మ్మహాత్మ్మునిఁ ద్రిపుర సంహారకరుని
ముఖ పునస్సంధానమతి నపేక్షించు మీరలు సేరి శుద్ధాంతరంగు లగుచు

---

1. దామల్లన (తం. వా.); దా మెల్లన (హ).

తే. భక్తి నిష్ఠలఁ ద త్పాదపద్మ యుగళ
ఘన పరిగ్రహపూర్వంబు గాఁగ నతని
శరణ మొందుఁ డతండు ప్రసన్నుఁ డైనఁ
దివిరి మీకోర్కి సిద్ధించు దివిజులార ! 132

వ. అని మఱియు ని ట్లనియె. అద్దేవుని డాయంజన వెఱతు మని తలంపకుండు. అతనిఁ జేర నుపాయం బెఱింగింపు మంటి రేని నేను, నింద్రుండు, మునులు, మీరలు, మఱియు దేహధారు లెవ్వ రేని న మ్మహాత్ముని రూపంబు, నతని బల పరాక్రమంబుల కొలఁదియు నెఱుంగఁజాలము. అతండు స్వతంత్రుండు గావునఁ ద దుపాయం బెఱింగింప నెవ్వఁడు సమర్థుం డగు ? ఐన నిపుడు *(భక్తపరా ధీనుండు శరణాగత రక్షకుం డగు నీశునిఁ జేరంబోవుద మని పలికి) పద్మసంభ వుండు దేవ పితృగణ ప్రజాపతులం గూడి కైలాసాభిముఖుం డై చని చని. 133

ఉ. భాసురలీలఁ గాంచిరి సుపర్వులు భక్తజనైక మానసో
ల్లాసముఁ గిన్నరీజన విలాసము నిత్యవిభూతి మంగళా
వాసము సిద్ధ గుహ్యక నివాసము [1]రాజతభూ వికాసి కై
లాసము కాంతినిర్జిత కులక్షితిభృ త్సు[2]మహా ద్విభాసమున్. 134

సీ. ధాతువిచిత్రి తోదా త్త రత్న ప్రభా సంగ తోజ్జ్వల తుంగ శృంగములును
గిన్నర గంధర్వ కింపురు షాప్సరో జననికరాకీర్ణ సానువులును
మానిత నిఖిల వైమానిక మిథున స ద్విహరణైక శుభప్రదేశములును
గమనీయ నవమల్లికా సుమనో వల్లికామతల్లీ లస త్కందరములు

తే. నమర సిద్ధాంగనా శోభితాశ్రమములు
[3]విబుధజన యోగ్య సంప న్ని వేశములును
గలిగి బహువిధ పుణ్యభోగముల నొప్పు
వినుత సుకృతములకు దండ వెండికొండ. 135

వ. అది మఱియును మందార పారిజాత సరళ తమాల సాల తాల తక్కోల కోవి దార శిరీ షార్జున చూత కదంబ నీప నాగ పున్నాగ చంపక పాట లాశోక వకుళ కుంద కురవక కన కామ్ర శతపత్ర కింశు కైలా లవంగ మాలతీ మధూక

---

* కొన్ని తాళపత్ర ప్రతులందు లేదు.

1. చారువిరాజమాన (క. త. జ. బ. తం.) 2. మహా విభాసమున్ (త) 3. సిద్ధజన యోగ్య సంపద్విశేషములును (ట)

మల్లికా పనస మాధవీ కుట జోదుంబ రాశ్వత్థ ప్లక్ష వట హింగుళ *(భూర్జ పూగ రాజపూగ జంబూ ఖర్జూ రామ్లాతక ప్రియాళు నాళికే రేంగుద) వేణు కీచక తరుశోభితంబును, గలకంఠ కాలకంఠ కలవింక రాజకీర మత్తమధుకర నానా విహంగకోలాహల నినద బధిరీభూత రోదోంతరాళంబును, సింహ తరక్షు శల్య గవయ శరభ శాఖామృగ వరాహ వ్యాఘ్ర కుర్కుర రురు మహిష వృక సారంగ ప్రముఖ వన్యసత్త్వ సమాశ్రయ విరాజితంబును, గదళీషండ మండిత కమల కల్హార కైరవకలిత పులినతల లలిత కమలాకర విహరమాణ కలహంస కారండవ సారస చక్రవాక బక జలకుక్కుటాది జలవిహంగకుల కూజిత సంకులంబును, సలిలకేళీ విహరమాణ సతీరమణీ రమణీయ కుచమండల విలిప్త మృగమద మిళిత హరిచందన గంధసుగంధిత జలపూరిత గంగాతరంగిణీ సమావృతంబును నైన కైలాస పర్వతంబు వొడగని, యరవిందసంభవ పురందరాది దేవగణంబు లత్యద్భు తానందంబులం బొంది, ముందట దార హీర హేమమయ విమానసంకులంబును, పుణ్యజన మానినీశోభితంబును నైన యలకాపురంబు గడచి, తత్పర భావ్య ప్రదేశంబునం దీర్థపాదుం డైన పుండరీకాక్షు పాదారవింద [1]రజఃపావనంబును, రతికేళీవ్యాసంగ పరిశ్రమ నివారక సలిలకేళీవిలోల దేవకామినీ పీనవక్షోజ విలిప్త కుంకుమపంక సంగత పిశంగవర్ణ వారిపూర విలసితంబును నగు నందాలక నందాభిధానంబులం గల నదీద్వితయంబు దాటి, తత్పరోభాగంబున వనగజ సంఘృష్ట మలయజ పరిమిళిత పవనాస్వాదన ముహుర్ముహు రున్మాదితమానస పుణ్యజన కామినీకదంబంబును, వైడూర్యసోపాన సమంచిత కనకోత్పల వాపీ విభాసితంబును, గింపురుష [2]వ్యాప్తంబును నగు సౌగంధికవన సమీపంబునందు.

—: బ్రహ్మాదులు దక్షిణామూర్తిరూపుం డగు నీశ్వరుని స్తుతించుట :—

సీ. ఉజ్జ్వలం బై శతయోజనంబుల [3]పొడవును పంచసప్తతి యోజనములఁ
బఱపును గల్గి యే పట్టునఁ [4]దిరుగని నీడ శోభిల్ల నిర్ణిత మగుచుఁ
బర్ణ శాఖా సమాకీర్ణ మై మాణిక్యములఁ బోలఁగల ఫలములఁ దనర్చి
కమనీయ సిద్ధ యోగక్రియామయ మయి యనఘ ముముక్షు జనాశ్రయంబు

---

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

1. పాలితంబును (క. చ. ట. జ. డ. ద. బ.) 2. సంచారయోగ్యంబునగు (క. చ. త. జ. బ. తం. వా.) 3. పొడవొగి (వా) 4. దఱుగని నీడ (హ. తం. వా.) 'పర్యక్కృతాచల చ్ఛాయః' (6-32)

తే. భూరి సంసారతాప నివారకంబు
నగుచుఁ దరురాజ మనఁగఁ బెం పగ్గలించి
భక్తజనులకు నిచ్చలుఁ బ్రమద మెసఁగ
వలయు సంపద లందు నావటము వటము. 137

వ. ఆ వృక్ష మూల తలంబున. 138

సీ. ఇద్ధ సనందాది సిద్ధసంసేవితు, శాంతవిగ్రహుని [1]వాత్సల్య గుణుని
గమనీయ లోక మంగళదాయకుని శివు విశ్వబంధుని జగద్వినుత యశుని
గుహ్యక సాధ్య యక్షో రక్షనాథ కుబేరసేవితుని దుర్వారబలుని
[2]నుచిత విద్యా తపో యోగ యుక్తుని బాల చంద్రభూషణుని మునీంద్రసుతునిఁ

తే. దాపసాభీష్టకరు భస్మదండలింగ
ఘన జటాజినధరుని భక్తప్రసన్న
విత సంధ్యాభ్రరుచి విడంబిత వినూత్న
రక్తవర్ణ సనాతను బ్రహ్మమయుని. 139

సీ. అంచిత వామపా దాంభోరుహము దక్షి ణోరుతలంబున నొయ్య నునిచి
సవ్యజానువు మీఁద [3]సవ్యబాహువు సాఁచి వలపలి ముంజేత సలలితాక్ష
మాలిక ధరియించి మహనీయ తర్కము ద్రాయుక్తిఁ డగుచుఁ జిత్తంబులోన
నవ్యయం బైన బ్రహ్మానందకలిత సమాధినిష్ఠుఁడు వీతమత్సరుండు

తే. యోగపట్టాభిరాముఁ డై యుచితవృత్తి
రోషసంగతిఁ బాసి కూర్చున్న జముని
యనువునను దర్భరచిత బృస్యాసనమున
నున్న మునిముఖ్యు నంచిత యోగనిరతు. 140

క. అలఘుని నభవుని యోగీం, ద్రులు వినుచుండంగ నారదునితోఁ బ్రియ భా
షలు జరుపుచున్న రుద్రుని, సలలిత పన్నగవిభూషు సజ్జనపోషున్. 141

క. కని లోకపాలురును ముని, జనులును సద్భక్తి నతని చరణంబులకున్
వినతు లయిరి యపు డబ్జా, సనుఁ గని య య్యభవుఁ డధికసంభ్రమ మొప్పన్.

---

1. వాత్సల్యమునను (హ) విద్యా తపో యోగపథ మాస్థితం తదధీశ్వరం చరంతం విశ్వ సుహృదం వాత్సల్యా ల్లోక మంగళమ్ (6-35) 2. ఉదిత (తం. వా.) 3. భవ్య (హ. తం. వా.)

క. అనఘ! మహోత్త్మం డగు వా, మనుఁ డా [1]కశ్యపున కొగి నమస్కారము చే
సినగతి నజునకు నభివం,దన మొగిఁ గావించె హరుఁడు దద్దయుఁ బ్రీతిన్. 143

తే. అంత రుద్రానువర్తు లై నట్టి సిద్ధ
[2]గణ మహర్షి జనంబులు గని పయోజ
గర్భునకు మ్రొక్కి రంత నా కమలభవుఁడు
శర్వుఁగని పల్కె మందహాసంబుతోడ. 144

తే. జగములకు నెల్ల యోని బీజంబు లై న
శక్తిశివ కారణుండ వై జగతి నిర్వి
కార[3]బ్రహ్మంబ వగు నిన్నుఁ గడఁగి విశ్వ
నాథుఁగా నెఱిఁగెద నా మనమున నభవ! 145

తే. సమత నది గాక తావకాంశంబు లై న
శక్తిశివ రూపములఁ గ్రీడ సలుపు [3]దూర్ణ
నాభిగతి విశ్వజనన వినాశ వృద్ధి
హేతుభూతుండ వగుచుందు వీశ! రుద్ర! 146

సీ. అనఘ! లోకంబులయందు వర్ణాశ్రమ సేతువు లనఁగఁ బ్రఖ్యాతి నొంది
బలసి మహోజన పరిగృహీతంబు లై యఖిల ధర్మార్థ దాయకము లై న
వేదంబులను [4]మటి వృద్ధి నొందించుట, కొఱకు నై నీవ దక్షుని నిమిత్త
మాత్రునిఁ జేసి య మ్మఖము గావించితి వటుగాన శుభమూర్తి వై న నీవు

తే. గడఁగి [1]జనముల మంగళకర్మ్ము లై న
వారి ముక్తి నమంగళాచారు లై న
వారి నరకంబు నొందింతు భూరిమహిమ
భక్తజనపోష! రాజిత ఫణివిభూష! 147

వ. అట్లగుటం దత్కర్మ్మంబు లోకానొకనికి విపర్యాసంబు నొందుటకుఁ గారణం
బెయ్యదియో? భవదీయ రోషంబు హేతు వని దలంచితినేని త్వదీయ పాదార
వింద నిహితచిత్తు లై సమస్త భూతలంబులయందు నినుం గనుంగొనుచు భూతం

---

1. కశ్యపునకు నొగి (హ. త. వా.) 2. దేవమహాఋషి జనము లర్థిని బయోజ (క-బ, తం) 3. తత్త్వంబగు (క. చ. ట. తం.) 4. నూర్ణ (హ) 5. పరి (చ. ట. త. జ.) 6. జగముల (చ. తం.)

బుల నాత్మయందు వేఱుగాఁ జూడక వర్తించు మహాత్ములయందు నజ్ఞు లైన
వారియందుం బలె రోషంబు దఱుచు పొరయ దఁట. నీకుఁ గ్రోధంబు గలదే?
యని. 148

సీ. మఱి భేదబుద్ధిఁ గర్మప్రవర్తనముల మదయుతు లై దుష్టహృదయు లగుచుఁ
బరవిభ వాసహ్య భవ మనోవ్యాధులఁ దగిలి మర్మాత్మభేదకము లైన
బహు దురుక్తులచేతఁ బరులఁ బీడింపుచుఁ నుండు మూఢులను దై వోపహతులఁ
గాఁ దలపోసి య క్కపటచిత్తులకు నీవంటి సత్పురుషుఁ డేవలన నైన

తే. హింసఁ గావింపకుండు సమిద్ధ చరిత!
నీలలోహిత! మహితగు ణాలవాల!
లోకపాలన! కలిత గంగాకలాప!
హర! జగన్నుతచారిత్ర! యదియుఁ గాక. 149

సీ. అమర సమస్తదేశములందు నఖిల కాలములందుఁ దలప [1]దుర్లంఘ్య మహిముఁ
డగు బద్మనాభు మాయామోహితాత్మకులై భేదదర్శను లైనవారి
వలనను ద్రోహంబు గలిగిన నంతయు నది దై వకృత మని యన్యదుఃఖ
ముల కోర్వలేక సత్పురుషుండు దయసేయుఁ గాని హింసింపఁడు గాన నీపు

తే. నచ్యుతుని మాయ మోహము నందకుంటఁ
జేసి సర్వజ్ఞుఁడవు మాయచేత మోహి
తాత్మ లై కర్మవర్తను లైన వారి
వలన ద్రోహంబు గలిగిన వలయుఁ బ్రోవ. 150

వ. అది గావున యజ్ఞభాగార్హుండ వైన నీకు సవనభాగంబు సమర్పింపని కతన
నీచేత విధ్వస్తం బై పరిసమాప్తి నొందని దక్షాధ్వరంబు మరల నుద్ధరించి దక్షుని
పునర్జీవితుం జేయుము. భగుని నేత్రంబులును, భృగుముని శ్మశ్రువులును,
పూషుని దంతంబులును గృపసేయుము. భగ్నాంగు లైన దేవ ఋత్విజ్నికా
యంబులకు నారోగ్యంబు గావింపుము. ఈ మఖావశిష్టంబు యజ్ఞపరిపూర్తి
హేతుభూతం బై న భవదీయ భాగం బగుఁగాక. 151

---

1. దుర్లంఘనీయమగు (క. చ. ట. త. డ.)

అధ్యాయము – ౭

—: ఈశ్వరుండు బ్రహ్మాదులచేఁ బ్రార్థితుం డయి దక్షాదుల ననుగ్రహించుట :—

చ. అని చతురాననుండు వినయంబున వేఁడిన నిందుమౌళి స
య్యనఁ బరితుష్టి బొంది [1]దరహాసమునన్ గృప దొంగలింప ని
ట్లను హరిమాయచేత ననయంబును భామరు లైన వారు చే
సిన యపరాధ దోషములు చిత్తములో గణియింప నెన్నఁడున్. 152

వ. అ ట్లయ్యను. 153

క. [2]బలియుర దండించుట [3]దు,ర్బల జనరక్షణము ధర్మపద్ధతి యగుటఁ
గలుషాత్ముల నపరాధము, కొలఁదిని దండింపుచుండుఁ గొనకొని యేనుఁ. 154

వ. అని దగ్ధశీర్షుం డైన దక్షుం డజముఖుం డగు. భగుండు బర్హిస్సంబంధ భాగం
బులు గలిగి మిత్రనామధేయ చక్షుస్సునం బొడగాంచు. పూషుండు పిష్ట భు
క్కగుచు *(యజమానదంతంబులచే భక్షించు.) దేవతలు (యజ్ఞావశిష్టంబు నా
కొసంగుటం జేసి) సర్వావయవ పరిపూర్ణ లై వర్తింతురు. ఖండితాంగు లైన
ఋత్విగాది జనంబు లశ్వినీదేవతల బాహువులచేతను, బూషుని హస్తంబుల చేతను
లబ్ధ బాహుహస్తు లై జీవింతురు. భృగువు బస్తశ్మశ్రువులు గలిగి వర్తించు నని
శివుం డానతిచ్చిన సమస్త భూతంబులు సంతుష్టాంతరంగంబు లై, తండ్రి!
లెస్సయ్యె నని సాధువాదంబుల నభినందించిరి. అంత నా *(శంభుని యామం
త్రణంబు వడసి) శునాసీర ప్రముఖు లగు దేవతలు *(ఋషులతోడం గూడి రా)
నజుండును రుద్రునిం బురస్కరించుకొని దక్షాధ్వర వాటంబునకుం జనె. అంత.

క. శర్వుని యోగక్రమమున, సర్వావయవములు గలిగి సన్మని ఋత్వి
గ్గీర్వాణముఖ్య లొప్పిరి, పూర్వతనుశ్రీల నార్యభూషణ ! యంతన్. 156

క. విను దక్షు సవనబస్తము,ఖునిఁ జేసిన నిద్ర మేలుకొనిలేచిన పో
ల్కని నిలిచె దక్షుఁ డభవుఁడు, గనుగొనుచుండంగ నాత్మఁ గౌతుక మొప్పన్.

వ. ఇట్లు లేచి నిలిచి ముందఱననున్న శివునిం గనుంగొనిన మాత్రన శరత్కాలంబున
నకల్మషం బైన సరస్సునుం బోలి పూర్వ రుద్రవిద్వేష జనితంబు లయిన కల్మ

---

1. దరహాసము మోమున దొంగలింప (క. ట. జ.) 2. బలియురదండింపను దు, ర్బలులను రక్షింప (చ. ట. త. జ. తం.)

* ఈగుర్తుగల భాగములు కొన్ని తాళపత్ర ప్రతులయందు లేవు.

షంబులం బాసి నిర్మలుం డై యభవుని నుతియింపం దొడంగి, మృతిఁబొందిన సతీతనయం దలంచి, యనురాగోత్కంఠ బాష్పపూరిత లోచనుండు, గద్గద కంఠుండు నై పలుకం జాలక యెట్టకేలకు దుఃఖంబుల సంస్తంభించికొని ప్రేమాతిరేక విహ్వలుం డగుచు సర్వేశ్వరుం డగు హరున కిట్లనియె. 158

క. విను నీ కపరాధుఁడ నగు, నను దండించు టది దండనము గాదు మదిన్
నను రక్షించుటగా మన, ముసఁ దలఁతును దేవ ! యభవ ! పురహర ! రుద్రా !

సీ. అనఘాత్మ ! నీవును నబ్జనాభుండును, పరికింప బ్రాహ్మణాభాసు లైన
వారల యెడల నె వ్వలను నుపేక్షింపరఁట దృఢ వ్రతచర్యు లైన వారి
యెడ నీ కుపేక్ష యెక్కడిది ? సర్గాదిని నామ్నాయ సంప్రదాయ ప్రవర్త
నము నెఱింగించుట కమర విద్యా తపో వ్రత పరాయణు లైన బ్రాహ్మణులను

తే. వరుసఁ బుట్టించితివి గాన వారి నెపుడుఁ
గేల దండంబుఁ బూని గోపాలకుండు
బలసి గోవుల రక్షించు పగిది నీవు
నరసి రక్షింపుచుందు గదయ్య ! రుద్ర ! 160

సీ. తలపోయ నవిదిత తత్త్వ విజ్ఞానుండ నైన నాచేత సభాంతరమున
నతిదురు క్తాంబక ఱతుఁ డయ్యు నస్మ త్కృతాపరాధము హృదయంబునందుఁ
దలఁపక [1]త్ర్యక్ష ! నిందాదోషమున నధోగతిఁ బొందుచున్న దుష్కర్మ నన్నుఁ
గరుణఁ గాఁచిన [2]నీకుఁ గడఁగి ప్రత్యుపకార మెఱిఁగి కావింప నేనెంతవాఁడ ?

తే. నుతచరిత్ర ! భవత్పరానుగ్ర హాను
రూపకార్యంబుచేత నిరూఢ మైన
తుష్టి నీ చిత్తమందు నొందుదువు గాక
రుద్రసంహార ! కరుణాసముద్ర ! రుద్ర ! 161

వ. అని యిట్లు రుద్రస్తుమాపణంబు గావించి, పద్మసంభవునిచేత ననుజ్ఞాతుం డై దక్షుం డుపాధ్యా యర్త్విగ్గణ సమేతుం డగుచుఁ గ్రతుకర్మంబు నిర్వర్తించు సమయంబున బ్రాహ్మణ జనంబులు యజ్ఞంబులు నిర్విఘ్నంబు లై సాగుటకుఁ బ్రమథాది వీరసంసర్గ కృత దోష నివృత్త్యర్థంబుగా విష్ణుదేవతాకంబును, త్రికపాల పురోడాశ ద్రవ్యకంబు నైన [3]కర్మంబు గావింప [4]నుపాత్త హవిష్యుం డగు

---

1. సుజన (క) 2. నీదు, ఘనసద్గుణంబుల, నెఱిఁగి సంస్తుతిసేయ నెంతవాఁడ (హ)
3. యాగంబు (క. చ. ట. త) 4. నధ్వర్యుకృత్య ప్రవిష్టుండగు (హ)

భృగువుతోడం గూడి నిర్మలాంతఃకరణుం డగుచు దక్షుండు ద్రవ్య త్యాగంబు
గావింపఁ బ్రసన్నుం డై సర్వేశ్వరుండు. 162

—: దక్షాధ్వరంబునకు వచ్చిన నారాయణుని దక్షాదులు స్తుతించుట :—

సీ. మానిత శ్యామాయమాన శరీర దీధితులు నల్ దిక్కులఁ దీటుకొనఁగఁ
[1]గాంచనమేఖలా కాంతులతోడఁ గౌ శేయ చేలద్యుతుల్ చెలిమిసేయ
లక్ష్మీసమాయుక్త లలితవక్షంబున వైజయంతీప్రభల్ వన్నెఁజూప
హాటకరత్న కిరీటకోటి ప్రభల్ బాలార్కరుచులతో మేలమాడ

తే. లలిత [2]నీలాభ్రరుచిఁ గుంతలములు దనరఁ
బ్రవిమలాత్మీయ దేహజప్రభ సరోజ
భవ భవామరముఖ్యుల ప్రభలు మాప
నఖిల లోకైకగురుఁడు నారాయణుండు. 163

చ. సలలిత శంఖ చక్ర [3]జలజాత గదా శర చాప [4]ఖడ్గ ని
ర్మలరుచులఁ సువర్ణరుచిమ న్మణికంకణ ముద్రికా ప్రభా
వళులను దేజరిల్లు భుజవర్గ మనర్గళకాంతి యుక్త మై
విలసిత కర్ణికార పృథివీరుహముఁ [5]బురణింప బిట్టుగఁ. 164

క. సరసోదార సమంచిత, దరహాస విలోకనములఁ దగ లోకములఁ
బరితోషము నొందింపుచుఁ, బరమోత్సవ మొప్ప విశ్వబంధుం డగుచున్. 165

చ. మఱియును రాజహంసరుచిమ ద్భ్రమణీకృత తాలవృంతచా
మరములు వీవఁగా దివిజమానిను లచ్ఛ సుధామరీచి వి
స్ఫురిత సితాతపత్ర రుచిపుంజము దిక్కులఁ బిక్కటిల్లఁగాఁ
గరివరదుండు వచ్చె సుభగ స్తుతిపర్ణ సుపర్ణయానుఁ డై. 166

చ. ఘనరుచి నట్లు వచ్చిన వికారవిదూరు ముకుందుఁ జూచి బో
రన నరవిందనందన పురందర చంద్రకళాధ రామృతా

---

† 'ధియా విశుద్ధయా దధ్యౌ, తదా ప్రాదురభూద్ధరిః' అని, మూ. 7–18.

1. కాంచనాంబర నూత్న కాంతి విలాసంబు, తొలుకారు మెరుపుతో చెలిమిసేయ (డ)
2. నీలాళిరుచి (క. చ. ట. జ.) 3. జలజాసి (డ) 4. వర్మ (డ) 5. బురణించు (హ);
బురుడింత బట్టుగఁ (తం. వా.) 6. చామర లిరువంకలఁ దివిజ (త. డ. ద. బ. తం.)

శనముఖు లర్థి లేచి యతిసంభ్రమ మొప్పఁ నమో నమో దయా
వన నిధయే, యటంచు ననివారణ మ్రొక్కిరి భక్తియుక్తు లై. 167

వ. అట్లు కృతప్రణాము లైన యనంతరంబ. 168

ఉ. ఆ నలినాయతాక్షుని యనంతపరాక్రమ దుర్నిరీక్ష్య తే
జోనిహత ప్రదీప్తు లగుచుఁ నుతిసేయ నశక్తు లై భయ
గ్లాని వహించి బాష్పములు గ్రమ్మఁగ గద్గదకంఠు లై [1]తనుల్
మ్రానుపడంగ న ద్విభుని మన్నన గైకొని యెట్టకేలకున్. 169

వ. నిటలతట ఘటిత కరపుటు లై య మ్మహాత్ముని యపారమహిమం బెఱిఁగి నుతియింప శక్తులు గాకయుండియుఁ [2]గృతానుగ్రహనిగ్రహం డగుటంజేసి తమతమ మతులకు గోచరించిన కొలంది నుతియింపం దొడంగిరి. అందు *(గృహీతంబు లగు పూజా ద్యుపచారంబులు గలిగి బ్రహ్మాదులకు జనకుండును, సునంద నందాది పరమ భాగవతజన సేవింతుడును, యజ్ఞేశ్వరుండును నగు భగవంతుని శరణ్యునిఁగాఁ దలంచి) దనుం డిట్లనియె. దేవా! నీవు స్వస్వరూపమం దు*(న్న యప్పు డుపరతంబులుగాని) రాగా ద్యఖిల బుద్ధ్యవస్థలచే విము క్తుండవును, నద్వితీయుండవును, భయరహితుండవునుసై, మాయం దిరస్కరించి, మఱియు నా మాయ ననుసరించుచు లీలామానుషరూపంబుల నంగీకరించి, స్వతంత్రుండ వయ్యును మాయాపరతంత్రుండ వై రాగాదియుక్తుం బలె రామకృష్ణా ద్యవతారంబులఁ గానంబడుచుందువు కావున నీ లోకంబులకు నీవ యీశ్వరుండ వనియు, నితరు లైన బ్రహ్మరుద్రాదులు భవ న్మాయావిభూతు లగుటంజేసి లోకంబులకు నీశ్వరులు గారనియు భేదదృష్టిం గల నన్ను రక్షింపుము. ఈ విశ్వకారణు లైన ఫాలలోచనుండును, బ్రహ్మయు, దిక్పాలు రును, సకల చరాచర జంతువులును నీవ. భవ ద్వ్యతిరిక్తంబు జగంబున లే దని విన్నవించినఁ ద దనంతరంబ ఋత్విగ్జనంబు లి ట్లనిరి. 170

సీ. వామదేవుని శాపవశమునఁ జేసి కర్మానువర్తనుల మే మైనకతన
బలసి వేదప్రతిపాద్య ధర్మోపలక్ష్యం బై నయట్టి మఖంబునందు
దీపింప నింద్రాది దేవతాకలిత రూపవ్యాజమును బొంది పరఁగు నిన్ను
యజ్ఞస్వరూపుండ [3]వని కాని కేవల నిష్కించనుండవు నిర్మలుఁడవు

---

* కొన్ని తాళ ప్రతులందు లేదు. 1 వెసన్ (చ. ట. త. జ. బ.) 2. భక్తానుగ్రహ (క. చ. ట. జ.) 3. వనియును కేవల, నిర్గుణుండవు నిత్య (హ)

తే. నరయ ననవద్యమూర్తివి యైన నీదు
లలిత తత్త్వ స్వరూపంబు దెలియఁజాల
మయ్య! మాధవ! గోవింద! హరి! ముకుంద!
చిన్మయాకార! నిత్య లక్ష్మీవిహార! 171

వ. సదస్యు లి ట్లనిరి. 172

సీ. శోక దావాగ్ని శిఖా[1]కులితంబు పృథు క్లేశ [2]ఘనదుర్గ దుర్గమంబు
దండధర క్రూరకుండలి శ్లిష్టంబు పాపకర్మ వ్యాఘ్ర పరివృతంబు
గురు సుఖదుఃఖ కాకోలపూరిత గర్త మగుచు ననాశ్రయ మైనయట్టి
సంసారమార్గ సంచారు లై మృగతృష్ణికలఁ బోలు విషయసంఘము నహా మ్మ

తే. మేతి హేతుక దేహనికేతనములు
నను మహాభారవహు లై నయట్టి మూఢ
జనము లేనాఁటి మీ పదాబ్జములు గానఁ
జాలు వారలు? భక్తప్రసన్న! దేవ! 173

వ. రుద్రుం డి ట్లనియె. 174

చ. వరద! నిరీహ యోగిజనవర్గ సుపూజిత! నీ పదాబ్జముల్
నిరతము నంతరంగమున నిల్పి [3]సమగ్ర భవత్ పరిగ్రహ
స్ఫురణఁ దనర్చు నన్ను నతి[4]మూఢులు సంతతము న్నమంగళా
[5]చరణుఁ డటంచుఁ బల్క నది సమ్మతి నే గణియింప నచ్యుతా! 175

వ. భృగుం డి ట్లనియె. 176

మ. అరవిందోదర! తావకీన ఘనమాయా మోహితస్వాంతు లై
పరమం బైన భవ న్మహామహిమమున్ బాటించి కానంగ నో
పరు బ్రహ్మాది [6]శరీరు లజ్ఞు లయి యో పద్మాక్ష! భక్తార్తిసం
హరణాలోకన! నన్నుఁ గావఁదగు నిత్యానందసంధాయి వై. 177

వ. బ్రహ్మ యి ట్లనియె. 178

సీ. [7]సమధిక జ్ఞానార్థ సత్త్వాది గుణముల కాశ్రయభూత మై నట్టి పురుషుఁ
డగ్రపదార్థ భేదగ్రాహకము లైన చతురింద్రియముల సరవిఁ జూడఁ

---

1. కలితంబు (చ. ట. జ. డ.) 2. భవ (చ. ట.) 3. భవత్సమగ్రహాధిక (హ) 4 మూఢుల విద్యలు మున్నమంగళా(హ) 5. వరణుడటంచు బల్కిన భవన్మతి (హ) 6. శరీరధారులను నో పద్మాక్ష (తం) 7. జ్ఞానార్థకారణ సత్త్వాది గుణముల కాశ్రయభూతమై యలరుచున్న(హ)

గలఁడె? నీరూపంబు గడఁగి మాయామయంబగు నసద్వ్యతిరిక్త మగుచు మఱీయు
నిరుపమాకారంబు నీకు విలక్షణ మై యుండు ననుచు నే నాత్మఁ దలఁతు

తే. నిర్వికార ! నిరంజన ! నిష్కళంక !
నిరతిశయ ! నిష్క్రియారంభ ! నిర్మలాత్మ !
విశ్వ సంబోధ్య ! నిరవద్య ! వేదవేద్య ! 179
ప్రవిమలానంద ! సంసారభయ విదూర !

వ. ఇంద్రుం డిట్లనియె. 180

మ. దితిసంతాన వినాశసాధన సముద్దీప్తాష్టబాహా సమ
న్విత మై యోగిమనోనురాగకర మై వెల్గొందు నీ దేహ మా
యత మైనట్టి ప్రపంచముం బలెను మిథ్యాభూతముం గామి శా
శ్వతముం గా మదిలోఁ దలంతు హరి ! దేవా ! దైవ చూడామణీ ! 181

వ. ఋత్విక్పత్ను లిట్లనిరి. 182

చ. కడఁగి భవ త్పదార్చనకుఁగా నిటు దక్షునిచే రచింపఁగాఁ
బడి శితికంఠరోషమున భస్మము నొంది పరేతభూమి యై
చెడి కడు శాంతమేధమునఁ జెన్నలరీయున్న మఖంబుఁ జూడు మే
ర్పడ జలజాభనేత్రములఁ బావన మై విలసిల్లు నచ్యుతా ! 183

వ. ఋషు లిట్లనిరి. 184

మ. అనఘా ! మాధవ ! నీవు మావలెనె కర్తారంభి వై యుండియున్
వినుత త్కర్మఫలంబుఁ బొంద వితరుల్ విశ్వంబునఁ భూతికై
యనయంబుఁ భజియించు నిందిరఁ [1]గరం బర్థిఁ నినుం జేరఁ గై
కొన వేమందుము ? నీ చరిత్రమునకుఁ గోవింద ! పద్మోదరా ! 185

వ. సిద్ధు లిట్లనిరి. 186

చ. హరి ! భవదుఃఖ భీషణదవానల దగ్ధ తృషార్త మ న్మనో
ద్వారదము శోభితంబును బవిత్రము నైన భవ త్కథాసుధా
సరి దవగాహనంబునను సంసృతి తాపముఁ బాసి క్రమ్మఱఁ
దిరుగదు బ్రహ్మాముం గనిన ధీరునిభంగిఁ బరోరుహోదరా ! 187

వ. యజమాని యగు ప్రసూతి యిట్లనియె. 188

---

1. నినున్నర్థించియేతెర (చ)

చ. కరచరణాది కాంగములు గల్గియు మస్తములేని మొండెమున్
బరువడి నొప్పకున్న గతిఁ బంకజలోచన! నీవు లేని య
ధ్వరము [1]ప్రయాజలం గలిగి తద్దయు నొప్పకయున్న దీయెడన్
హరి! యిటు నీదురాక శుభ మయ్యె రమాధిప! మమ్ముఁ గావవే! 189

వ. లోక పాలకు లిట్లనిరి. 190

సీ. దేవాదిదేవ! యీ దృశ్యరూపం బగు సుమహిత విశ్వంబుఁ జూచు ప్రత్య
గాత్మభూతుండ వై నట్టి నీవు నస ప్రకాశ రూపంబు లై కలుగు మామ
కేంద్రియంబులచేత నీశ్వర! నీమాయ నొందించి పంచభూతోపలక్షి
తం బగు దేహి విధంబునఁ గానంగఁ బడుదువు గాని యేర్పడిన శుద్ధ

తే. సత్త్వగుణ యుక్తమైన భాస్వత్స్వరూప
ధరుఁడవై కానఁబడవు గా? పరమపురుష!
యవ్యయానంద! గోవింద! యట్లు గాక
యెనయ మా జీవనము లీక [2]నేమికలవు? 191

వ. యోగేశ్వరు లిట్లనిరి. 192

సీ. విశ్వాత్మ! నీయందు వేఱుగా జీవులఁ గనఁ దెవ్వఁ డటు వానికంటెఁ బ్రియుఁడు
నీకు లేఁ డైనను నిఖిల విశ్వోద్భవ స్థితి విలయంబుల కతన వై వ
సంగతి నిర్భిన్న సత్త్వాది గుణవిశి ష్టాత్మీయ మాయచే నజ భవాది
వివిధ భేదము లొందుదువు స్వస్వరూపంబు నం దుండుదువు వినిహత విమోహుఁ

తే. డగుచు నుందువు తగ ని న్ననన్యభక్తి
భృత్యభావంబుఁ దాల్చి సంప్రీతిఁ గొల్చి
మమ్ము రక్షింపు మో కృపామయ! రమేశ!
పుండరీకాక్ష! సంతత భువనరక్ష! 193

వ. శబ్దబ్రహ్మ యిట్లనియె. 194

చ. హరి! భవదీయ తత్త్వము సమంచితభక్తి నెఱుంగ నేను నా
సరసిజసంభ వాదులును జాలము సత్త్వ గు ణాశ్రయుండవున్
బరుఁడవు నిర్గుణుండవును [3]బ్రహ్మము నై తగు నీకు [4]నిప్పు డిం
దఱము చతుర్విధార్థ ఫలదాయక! మ్రొక్కెద మాదరింపుమా! 195

---

1. ప్రయాజులం గలిగి (క.ట.తం.వా.); ప్రయోక్తలం గలిగి(త) 2. ఏమి శెలవు (క.చ.ట. త. డ.) 3. బ్రహ్మమును నగు నీవు (డ. ద. బ.) 4. నందఱున్. గరము...ఫలకాండుల (హ)

వ. అగ్నిదేవుం డిట్లనియె. 196

మ. హవరశ్రాచరణుండ వై నెగడుచు న్న య్యగ్నిహోత్రాది పం
చ విధంబుల మఱి మంత్రపంచక సుస్పష్టం బై తగం బొల్చు నా
హవరూబం బగు నీకు మ్రొక్కెదను నీ యాజ్ఞ భువి హవ్యము
సవనవ్రాతములఁ వహింతు హరి! యుష్మత్తేజము బూనుచుఁ. 197

వ. దేవత లి ట్లనిరి. 198

మ. మును గల్పాంతమునందుఁ గుఱి నఖిలంబుఁ దాఁచి యేకాకి వై
జనలో కోపరిలోక వాసులును యుష్మ త్తత్త్వమార్గంబు చిం
తనముం జేయఁ బయోధియందు నహిరా ట్తల్పంబునం బవ్వళిం
చిన నీరూపము నేఁడు చూపితివి లక్ష్మీనాథ! దేవోత్తమా! 199

వ. గంధర్వ లి ట్లనిరి. 200

మ. హర పంకేజభ వామరాదులు మరీచ్యాది ప్రజానాథు లో
యరవిందాక్ష! రమాహృదీశ! భవదీ యాంశాంశ సంభూతు లై
పరఁగం దావకలీల [1]యై నెగడు నీ బ్రహ్మాండ మున్నట్టి యీ
శ్వర! నీ కే మతి భక్తి మ్రొక్కెదము [2]దేవా! దేవచూడామణీ! 201

వ. *విద్యాధరు లి ట్లనిరి. 202

సీ. నలినాక్ష! విను భవ న్మాయావశంబున దేహంబు దాల్చి తద్దేహమందు
నాత్మ [3]నహ మ్మమే త్యభిమానమును బొంది పుత్ర జాయా గృహక్షేత్ర బంధు
ధన పశుముఖ వస్తుతతుల సంయోగ వియోగదుఃఖంబుల నొందుచుండు
ధృతివిహీనుఁడు నసద్విష యాతిలాలసుఁ డతిదుష్టమతియు నై నట్టివాఁడు

తే. దవిలి భవదీయగుణ సత్కథావిలోలుఁ
డయ్యెనేనియు [4]నాత్మమోహంబు వలనఁ

---

1. లీలకై (హ) 2. దేవాధీశ రక్షింపుమా (హ)

* ఈ క్రింది పద్యము 'తం' ప్రతిలో అధికముగా నున్నది.

మ. భవదంశాంశజు లీ మరీచి ముఖరుల్ బ్రహ్మమరేంద్రాది జా
ధవ ముఖ్యుల్ దివిషద్గణంబుఁ బరమాత్మా! నీకు విశ్వంబు ను
త్సవ లీలా కరకందుకోపమము నాథా! వేదశాఖాశిఖా
స్తవనీయాంఘ్రికి నీ కొనర్తుము నమస్కారంబు లశ్రాంతముఁ.

3. ఆత్మ-యహమ్మను యను నభిమానియై (క.ట.ప.ద.బ.హ.) 4. నాత్మమోహంబు (హ)

భాసి వర్తించు విజ్ఞాన పరతఁ దగిలి
చిర దయాకార! యిందిరా చిత్తచోర! 203

వ. బ్రాహ్మణజనంబు లిట్లనిరి. దేవా! యీ క్రతువును, హవ్యంబును, నగ్నియు, మంత్రంబులును, సమి ద్దర్భ పాత్రంబులును, సదస్యులును, ఋత్విక్కులును, దంపతులును, దేవతలును, నగ్నిహోత్రంబును, స్వధయు, సోమంబును, నాజ్యం బును, పశువును నీవ. నీవు దొల్లి వేదమయ సూకరాకారంబు ధరియించి, దంష్ట్రాదండంబున వారణేంద్రంబు నళినంబు ధరియించు చందంబున రసాతలగత యైన భూమి నెత్తితివి. అట్టి యోగిజన స్తుత్యుండవును, యజ్ఞ క్రతురూపుం డవు నైన నీవు బరిభ్రష్ట కర్ముల మై యీకాంక్షించు మాకుఁ బ్రసన్నుండ వగుము. భవదీయ నామ కీర్తనంబుల సకల యజ్ఞ విఘ్నంబులు నాశంబునొందు. అట్టి నీకు నమస్కరింతుము. 204

క. అని తను సకల జనంబులు, వినుతించిన హరి భవుండు విఘ్నము గావిం
చిన యీ దక్షుని యజ్ఞము, ఘనముగఁ జెల్లించెఁ గొఱఁత గాకుండంగన్. 205

క. సకలాత్ముఁడు దా నగుటను, సకల హవిర్భోక్త యయ్యు జలజాతుండుఁ
[1]బ్రకట స్వభాగమున న,య్యకలంకుఁడు దృప్తిఁ బొంది యనె దక్షునితోన్. 206

వ. అనఘా! *(ఏను, బ్రహ్మయు, శివుండు) నీ జగంబులకుఁ గారణ భూతులము అందు నే నీశ్వరుండను, నుపద్రష్టను, స్వయంప్రకాశకుండను నై గుణమయం బైన యాత్మీయమాయం బ్రవేశించి, జనన వృద్ధి విలయంబులకు హేతుభూతంబు లగు త త్త్రి్కయోచితంబు లైన బ్రహ్మ రుద్రాది నామధేయంబుల నొందు చుండుదు. అట్టి యద్వితీయ బ్రహ్మరూపకుండ నైన నాయందు నజ భవాదు లను భూతగణంబులను మూఢుఁ డగువాఁడు వేఱుగాఁ జూచు. [2]మనుజుండు శరీరంబునకుఁ గరచరణాదులు వేఱుగాఁ దలంపని చందంబున మ ద్భక్తుండు నాయందు భూతజాలంబుల భిన్నంబుగాఁ దలంపఁడు. కావున మా మువ్వుర నెవ్వండు వేఱుసేయకుండు వాఁడు గృతార్థుం డని యానతిచ్చిన దక్షుండు.

క. విని [3]విష్ణుదేవతాకం, [4]బనఁగాఁ ద్రికపాల కలిత మగు నా యాగం
బునఁ దగ న ద్విష్ణుని పద, వనజంబులఁ [5]బూజచేసి వారని భక్తిఁ. 208

---

1. ప్రకటస్వభావమున (క. ట. త. డ. బ. వా.) * కొన్ని తా. ప. ప్రతులలో లేదు.
2. మద్భక్తుండగు వాడు శరీరంబునకుఁ గరచరణాదులు వేఱుగా దలంపని చందంబున నా యందు భూతజాలంబు భిన్నంబుగా దలంపండు (క. చ. ట. బ. తం. వా.) 3. విను (హ. తం. వా.)
4. బనఘా (హ) 5. పూజఁజేసి (హ)

209

వ. మఱియును.

సీ. అంగ ప్రధానక యాగంబులను జేసి యమరుల రుద్రుని నర్థిఁ బూజ
సేసి [1]విశిష్టేష్ట శిష్టభాగమున నుదవసానకర్మంబు దవిలి తీర్చి
[2]తాను ఋత్విక్కులుఁ దగ సోమపులఁ గూడి యవభృథ స్నానంబు లాచరించి
కడఁక నవాప్త సకలఫలకాముఁ డై తనరు దక్షునిఁ జూచి ధర్మబుద్ధి

తే. గలిగి సుఖవృత్తి జీవింతు గాక యనుచుఁ
బలికి దివిజులు మునులును బ్రాహ్మణులును
జనిరి నిజమందిరములకు జలజనయన
భవులు వేంచేసి రాత్మీయ భవనములకు. 210

వ. అంత దాక్షాయణి యైన సతీదేవి పూర్వకళేబరంబు విడిచి, హిమవంతునకు మేనకయందు జనియించి, విలయకాలంబునం బ్రసుప్తం బైన శక్తి సృష్టికాలం బున నీశ్వరునిఁ బొందు చందంబునం బూర్వదయితుం డగు రుద్రుని వరియించె. అని దక్షాధ్వర ధ్వంసకుం డగు రుద్రుని చరిత్రంబు బృహస్పతి శిష్యుఁ డైన యుద్ధవునకు నెఱింగించె. అతండు నాకుం జెప్పె. నేను నీకుం జెప్పితి. అని మైత్రేయుండు వెండియు విదురున కిట్లనియె. 211

క. ఈ యాఖ్యానముఁ జదివిన, ధీయుతు లై వినినయట్టి [3]ధృతిమంతులకు
న్నాయుఃకీర్తులు గలుగును, బాయును దురితములు దొలఁగు భవబంధంబుల్.

వ. అని వెండియు నిట్లనియె. 213

అధ్యాయము - ఆ

క. విను సనకాదులు నారదుఁ
డును హంసుఁడు నరుణియు ఋభుఁడు యతియుఁ గమలా
సనజులు నైష్ఠికు లనికే
తను లగుట సాగ వయ్యెఁ ద ద్వ్యంశంబుల్. 214

వ. మఱియు నధర్మునకు మృష యను భార్యయందు దంభుండును, మాయ యను [4]నంగనయుఁ బుట్టిరి. అధర్మ సంతానం బగు వారిరువురును మిథునం బై రి. వారిని సంతానహీనుం డగు నిర్ఋతి గైకొనియె. వారలకు లోభుండును

---

1. విశిష్టేష్టి (జ. డ.బ.) 2. ఋత్విక్కులును దాను గృతసోమపానులై (క. చ. ట. త. బ.)
3. ధీరుల కైశ్వర్యాయుఃకీర్తులు (హ. వా.) 4. కామినియుం (క. చ. బ. తం.)

నికృతి యను సతియునుం గలిగి మిథునం బై రి. ఆ మిథునంబునకుఁ గ్రోధుండు, హింస యను నంగనయుం బుట్టి మిథునం బై రి. ఆ మిథునంబునకుఁ గలియు, దురు క్తి యను నతివయు జన్మించి దాంపత్యంబు గై కొనిరి. ఆ దంపతులకు భయమృత్యువు లను మిథునంబు గలిగె. దాని వలన, యాతనయు, నిరయం బునుం బుట్టిరి. వీరలు సంసార హేతు వగు నధర్మ తరుశాఖ లై నెగడిరి. వీని శ్రేయస్కా ముం డగు జనుం డీషణాత్రయంబు ననువ ర్తింపం జనదు. ఇ వ్విధం బునం బ్రతిసర్గంబును సంగ్రహంబున వినిపించితి. ఇ ప్పుణ్యకథ నెవ్వండేని ముమ్మాటు వినిన నతండు నిష్పాపి యగు నని చెప్పి మఱియు. 215

—: ధ్రు వో పా ఖ్యా న ము :—

క. విను మఖిల భువన పరిపా, లనమునకై [1]చక్రధరకళా కలితుండై
వనజజునకు స్వాయంభువ, మను వపు డుదయించెఁ గీ ర్తిమంతుం డగుచున్. 216

తే. రూఢి న మ్మనువుకు శతరూపవలన
భూనుతు లగు ప్రియవ్ర తోత్తానపాదు
లనఁగ నిద్దఱు పుత్రు లై రందులోన
భవ్యచారిత్రుఁ డుత్తానపాదునకును. 217

క. వినుము సునీతియు సురుచియు
నను భార్యలు గలరు వారియందును ధ్రువునిన్
గనిన సునీతియు నప్రియ
యును సురుచియుఁ బ్రియయు నగుచు నున్నట్టి యెడన్. 218

సీ. ఒకనాఁడు సుఖలీల నుత్తానపాదుండు [2]నెటిఁ బ్రియురా లై న సురుచి గన్న
కొడుకు నుత్తముఁ దన తొడలపై నిడికొని యుపలాలనము సేయుచున్న వేళ
నర్థిఁ ద దారోహణా పేక్షితుం డై న ధ్రువునిఁ గనుంగొని తివక యాద
రింపకుండుటకు గర్వించి యా సురుచియు సవతి బిడ్డం డై న ధ్రువునిఁ జూచి

తే. తండ్రితొడ నెక్కు వేడుక దగిలెనేని
పూని నాగర్భమున నాఁడు పుట్ట కన్య
గర్భమునఁ బుట్టఁ గోరినఁ గలదె నేఁడు
జనకు తొడ యెక్కు భాగ్యంబు సవతి కొడుక! 219

---

1. చంద్రధరకళా (హ. తం. వా.) 2. మటి (హ)

క. అది గాన నీ వధోక్షజు, పదపద్మము లాశ్రయింపు పాయక హరి నా
యుదరమునఁ [1]బుట్టు నిచ్చును, వదలక య ట్లైన ముదము [2]వడసెద వనఘా !

క. అని [3]యీలాగు నసహ్యవచనములు పినతల్లి యపుడు జనకుఁడు వినఁగాఁ
దను నాడిన దుర్భాషా, ఘనశరములు మనసు నాఁటి గాటియ పెట్టఁ. 221

క. తన నట్లుపేక్ష సేసిన, జనకుని కడఁ బాసి దుఃఖజలనిధి లోనఁ
మునుఁగుచును దండతాడిత, ఘన భుజగముఁ బోలి రోషకలితుం డగుచున్,222

క. ఘనరోదనంబు సేయుచుఁ, గనుఁగ[4]వలను శోక బాష్పకణములు దొరఁగఁ
జననికడ కేఁగుటయు నిజ, తనయునిఁ గని యా సునీతి దద్దయుఁ బ్రేమన్.223

వ. తొడలపై నిడికొని. 224

క. కర మనురక్తిని మోము ని,విరి త ద్వృత్తాంత మెల్ల వెలఁదులు నంతఃపుర[5]వాసలుఁ జెప్పిన విని, పఱపుగ నిట్టూర్పు లెసఁగ బాష్పాకుల యై. 225

తే. సవతి యాడిన మాటల సారెఁ దలఁచి
కొనుచుఁ బేర్చిన దుఃఖాబ్ధిఁ గుందుచుండె
దావ పావక శిఖలచేఁ దగిలి కాంతి
వితతిఁ గందిన మాధవీలతిక వోలె. 226

వ. అంత నా సునీతి బాలకునిఁ జూచి తండ్రీ ! దుఃఖింపకు మని యి ట్లనియె. 227

క. అనఘా ! యీ దుఃఖమునకుఁ, బనిలే దన్యులకు సొలయ బలవంతం బై
తన పూర్వజన్మ దుష్కృత, ఘనకర్మము వెంటనంటఁగా నె వ్వలనఁ. 228

వ. కావున. 229

క. పెనిమిటిచేతను బెండ్లా, మని కాదు నికృష్టదాసి యనియునుఁ బిలువం
గను జాలని దుర్భగురా, లనఁగల నాకుక్షి నుదయ మందిన కతనఁ. 230

---

1. పుట్టనిచ్చును (హ. తం.); పుట్టఁజేయును (వా) 2. వఱలెడి నీకున్ (తం. చ. బ.)
3. అని యీరీతి (తం. వా.); అని యిదియు మొదలసహ్య (జ) 4. నురుశోక (క. బ.)
5. వాసులు (క. బ. తం. వా.); "నిశమ్య త త్పౌరముఖా న్నితాంతం" (8–16); 'అంతఃపుర జన ముఖా చ్ఛ్రుతా్వ' (వ్యా)

క. నిను నాడిన యా సురుచి వ,చనములు సత్యంబు లగును సర్వశరణ్యం
డనఁగల హరి చరణంబులు, గను జనకునియంక మెక్కఁగాఁ దలఁతేనిఁ. 231

వ. కావున పినతల్లి యైన యా సురుచి యాదేశంబున నధోముఖు నాశ్రయింపు మని వెండియు ని ట్లనియె. 232

సీ. పరికింప నీ విశ్వపరిపాలనమునకై యర్థి గుణవ్యక్తుఁ డైన యట్టి
నారాయణుని పాదనళినముల్ సేవించి బ్రహ్మయు బ్రహ్మత్వ పదము నొందె
ఘనుఁడు మీతాత యా మనువు సర్వాంతర యామిత్వ మగు నేక మైన దృష్టిఁ
జేసి యాగముల యజించి తా భౌమసుఖములను దివ్యసుఖముల మోఁజు

తే. సుఖములను బొందె నట్టి యచ్యుతునిఁ బరుని
వితత యోగీంద్రనికర [1]గవేష్యమాణ
చరణ సరసిజ యుగళు శశ్వత్ప్రకాశు
భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని. 233

వ. మఱియును. 234

క. [2]కరతల గృహీత లీలాం,బురుహ యగుచుఁ బద్మగర్భముఖ గీర్వాణుల్
పరికింపం గల లక్ష్మీ, తరుణీమణిచేత వెదకఁదగు పరమేశుఁ. 235

—: ధ్రువుండు నారదోపదేశంబు వడసి తపంబు చేయుట :—

వ. నిజ ధర్మ పరిశోభితం బైన యేకాగ్రచిత్తంబున నిలిపి సేవింపుము. అమ్మహాత్మునికంచె నీదుఃఖం బపనయించువాఁ డన్యుం డొక్కరుండు గలఁడే? యని పలికిన పరమార్థ హేతుకంబు లైన తల్లి వాక్యంబులు విని, తన్నుఁ దాన నియమించికొని, పురంబు వెడలు నవసరంబున నారదుండు తద్వృత్తాంతం బెఱింగి యచ్చటికిం జనుదెంచి, యతని చికీర్షితంబుఁ దెలిసి, పాపనాశకరం బైన తన కర తలంబున ధ్రువుని శిరం బంటి, మానభంగంబునకు సహింపని క్షత్త్రియుల ప్రభావం బద్భుతంబుగదా! బాలకుం డై యుండియుఁ బినతల్లి యాడిన దురుక్తులు చిత్తంబునం బెట్టి చనుచున్నవాఁ డని మనంబున నాశ్చర్యంబు నొంది,

---

1. సంవేద్యమాన (హ); సంవేష్ట్యమాణ (తం) 2. కరమున గృహీతలీలాం, బురుహాయు నరవింద గర్భ (హ); కరసరసీజగృహీతాం, బురహాయు (తం. వా.); "యోమృగ్యతే హస్త గృహీత పద్మయా, శ్రియేతరై రంగ విమృగ్యమాణయా" (8–24)

†(యో బాలక ! సకల సంప త్సమృద్ధం బగు మందిరంబు దెగడి యొంటి
నెందు నేఁగెదవు ? స్వజనకృతం బగు నవమానంబుచే నిను సంతప్తుంగాఁ దలం
చెద. అనిన ధ్రువుం డి ట్లనియె. సపత్నీమాతృ వాగిషుహతం బగు వ్రణంబు
భగవద్ధ్యాన యోగ రసాయనంబున మాపుకొందు. అను) ధ్రువునికి నారందుం
డి ట్లనియె. 236

క. వినుఁ పుత్రక ! బాలుఁడ వై, యనయంబును క్రీడలందు నాసక్తమనం
బునఁ దిరిగెడు ని క్కాలం, బున నీ కవమాన మానములు లే వెందున్. 237

తే. కాఁగ మనమునఁ ద ద్వివేకంబు నీకుఁ
గలిగెనేనియు సంతోషకలితు లై న
పురుషు లాత్మీయ కర్మవిస్ఫురణఁ జేసి
వితత సుఖదుఃఖము లనుభవింతు రెపుడు. 238

వ. కావున వివేకంబు గల పురుషుండు దనకుం బ్రాప్తంబు లగు సుఖదుఃఖంబులు
దై వవశంబులుగాఁ దలంచి తావన్మాత్రంబునం బరితుష్టుం డగు. నీవును దల్లి
చెప్పిన యోగమార్గ ప్రకారంబున సర్వేశ్వ రానుగ్రహంబుఁ బొందెద నంటివేని.

సీ. అనఘాత్మ ! యోగీంద్రు లనయంబు ధరఁ బెక్కు జన్మంబులందు నిస్సంగ మైన
మతినిఁ బ్రయోగ సమాధి నిష్ఠలఁ జేసి యైనను దెలియలే రతనిమార్గ
మది గాన యతఁడు దురారాధ్యుఁ డగు నీవు నుడుగుము నిష్ఫలోద్యోగ మిపుడు
గాక నిశ్శ్రేయసకాముఁడ వగుదేని తండ్రి! వర్తించు త త్కాలమందుఁ

తే. బూని సుఖదుఃఖముల రెంటిలోన నేది
దై వవశమునఁ జేకుఱుఁ దానఁజేసి
డెందమునఁ జాల సంతుష్టి [1]నొందుచుండ
విమల విజ్ఞాని యన భువి [2]వెలయు దెపుడు. 240

---

† ఈ వచసమునకు బదులు 'ట' ప్రతిలో ఈ క్రింది పద్యములు గలవు.

గీ. సకలసౌభాగ్య సంపూర్ణ సదన సుఖము, నుడిగి యొందేగెదవు వత్స యొక్కరుడవ
అనఘ ! యాత్మీయ జన జనితావమాన, సంగతునిగా దలంచితి నింగితమున.

క. వర యోగిసిద్ధి కొరకై, పరమాత్మ ధ్యానమెట్లు వాటిల్లు నినున్
మరలింపనేర సురుచి. స్థిరవాక్ దండహ్యమాన చిత్తుడ వగుటన్.

1. నొందుచుండ (హ) 2. వెలయు దెపుడు (హ)

వ. మఱియు గుణాఢ్యుండగువానిఁ జూచి సంతోషింపుచు, నాభాసుండగు వానిం జూచి కరుణింపుచు, సమానునియెడ మైత్రి సలుపుచు వర్తింపుచున్నవాఁడు తాప త్రయాదికంబులం దొరంగు. అని నారదుండు వలికిన విని ధ్రువుం డిట్లనియె. అనఘా! యీ శమంబు సుఖదుఃఖ హితాత్ముల లగు పురుషులకు దుర్గమం బని కృపాయత్తుండ వైన నీచేత వినంబడె. అ ట్లైనం బర భయంకరం బగు శాస్త్ర ధర్మంబు నొందిన యవినీతుండ నగు నేను సురుచి దురుక్తబాణ వినిర్భిన్న హృదయుండ నగుట మదీయ చిత్తంబున శాంతి నిలువదు. కావునం ద్రిభువనో త్కృష్టంబు, ననన్యాధిష్ఠితంబు నగు పదంబును బొంద నిచ్ఛయించిన నాకు సాధు మార్గంబు నెఱింగింపుము. నీవు భగవంతుం డగు నజుని యూరువువలన జనియించి వీణావాదన కుశలుండ వై జగద్ధితార్థంబు సూర్యునిఁబోలి వర్తింతు వనిన విని.

క. నారదుఁ డిట్లను ననఘ! కు, మారక! విను నిన్ను మోక్షమార్గంబునకుఁ
బ్రేరేచిన వాఁ డిప్పుడు, ధీరజనోత్తముఁడు వాసుదేవుం డగుటన్. 242

వ. నీవు న మ్మహాత్ముని [1]నజస్ర ధ్యానప్రవణ చిత్తుండ వై భజియింపుము. 243

క. పురుషుఁడు దవిలి చతుర్విధ, పురుషార్థశ్రేయ మాత్మఁ బొందెద ననినఁ
ధరఁ ద త్ప్రాప్తికి హేతువు, హరిపదయుగళంబు దక్క నన్యము గలదే? 244

వ. కావున. 245

క. వర యమునానది తటమున, †హరిసాన్నిధ్యంబు శుచియు నతిపుణ్యము నై
పరఁగిన మధువనమునకును, సరసగుణా! చనుము మేలు సమకుఱు నచటఁ. 246

క. ఆ యమునాతటినీ శుభ, తోయములఁ గ్రుంకి నిష్ఠతో నచ్చట నా
రాయణునకును నమస్కృతు, లాయతమతిఁ [2]జేసి చేయు యమనియమములన్.

వ. మఱియుం బాలుండ వగుటంజేసి వేదాధ్యయనా ద్యుచిత కర్మానర్హుండ వయ్యు నుచితంబు లగు కుశాజినంబులంజేసి స్వస్తిక ప్రము ఖాసనంబులం గల్పించికొని, త్రివృ త్ప్రాణాయామంబులచేతం బ్రాణేంద్రియ మనోమలం బను చాంచల్యదోషంబు ప్రత్యాహరించి స్థిరం బైన చిత్తంబున. 248

---

1. పదధ్యాన (క. బ. తం)

* 'హరి సాన్నిధ్యదము' అని యుండుట లెస్స "సాన్నిధ్య నిత్యదాహరేః)"
అని మూలము. (8-44)

2. జేయుమయ్య (హ)

సీ. ఆశ్రిత సత్ప్రసా దాభిముఖుండును [1]స్నిగ్ధప్రస న్నాననేక్షణుండు
సురుచిర నాసుండు సుభ్రూయుగుండును సుకపోలతలుఁడును సుందరుండు
హరినీల సంశోభితాంగుండుఁ దరుణుండు నరుణావలోక నోష్ఠాధరుండు
గరుణాసముద్రుండు పురుషార్థనిధియును ప్రణతాశ్రయుండు శోభనకరుండు

తే. లలిత శ్రీవత్సలక్షణ లక్షితుండు
సర్వలోకశరణ్యుండు సర్వసాక్షి
పురుషలక్షణ యుక్తుండు పుణ్యశాలి
యసిత మేఘనిభ శ్యాముఁ [2]డవ్యయుండు. 249

వ. మఱియును. 250

సీ. హార కిరీట కేయూర కంకణ ఘన భూషణుఁ డాశ్రిత పోషణుండు
లాలిత కాంచీకలాప శోభిత కటి మండలుం డంచిత కుండలుండు
మహనీయ కౌస్తుభమణి ఘృణి చారు గ్రై వేయకుం డానందదాయకుండు
సలలిత ఘన శంఖ చక్ర గదా పద్మ హస్తుఁడు భువనప్రశస్తుఁ డజుఁడుఁ

తే. గ్రమసౌరభ వనమాలికాధరుండు
హతవిమోహుండు నవ్య పీతాంబరుండు
లలిత కాంచననూపు రాలంకృతుండు
నిరతిశయ సద్గుణుఁడు దర్శనీయతముఁడు. 251

క. సరస మనో [3]లోచన ము, త్కరుఁడును హృత్పద్మ కర్ణికానివసిత వి
స్ఫుర దురు నఖమణి శోభిత, చరణసరోజాతుఁ డతులశాంతుఁడు ఘనుఁడుఁ.

వ. అయిన పురుషోత్తముం బూజింపుచు హృదయగతుండును, సానురాగ విలోక
నుండును, వరదశ్రేష్ఠుండును నగు నారాయణు నేకాగ్రచిత్తంబున ధ్యానంబు
సేయుచుం బరమ నివృత్తిమార్గంబున ధ్యానంబుసేయఁబడ్డ పురుషోత్తముని దివ్య
మంగళ స్వరూపంబు చిత్తంబునం దగిలిన మరల మగుడనేరదు. అదియునుం గాక
యేమంత్రంబేని సప్తవాసరంబులు పఠియించిన ఖేచరులం గనుంగొను సామ
ర్థ్యంబు గలుగు నట్టి ప్రణవయుక్తం బగు ద్వాదశాక్షర కలితంబును, దేశకాల
విభాగవేది బుధానుష్ఠితంబును నైన వాసుదేవ మంత్రంబునంజేసి. 253

---

1. నిద్ధ ప్రసన్నా.....(ట. బ. తం. వా.) 2. డచ్యుతుండు (జ) 3. నయన సము, త్కరుఁడును (హ)

సీ. దూర్వాంకురంబుల దూర్వాంకురశ్యాము జలజంబులను జారుజలజనయనుఁ
దులసీదళంబులఁ దులసికాదామని మాల్యంబులను వినిర్మలచరిత్రుఁ
బత్రంబులను బఱిపత్రునిఁ గడు వన్య మూలంబులను నాది మూలఘనుని
నంచిత భూర్జత్వగాది నిర్మిత వివిధాంబరంబులను [1]బీతాంబరధరు

తే. దనరుభక్తిని మృ చ్ఛిలా దారు రచిత
రూపములయందుఁ గాని నిరూఢ మైన
సలిలములయందుఁ గాని సుస్థలములందుఁ
గాని పూజింపవలయు న క్కమలనాభు. 254

క. ధృతచిత్తుఁడు శాంతుండు ని, యతపరిభాషణుఁడు సుమహితాచారుఁడు వ
ర్ణిత హరిమంగళగుణుఁడును, మితవన్యాశనుఁడు నగుచు మెలఁగుచు మఱియున్.

వ. ఉత్తమశ్లోకుం డగు పుండరీకాక్షుండు నిజమాయా స్వేచ్ఛావతార చరితంబుల చేత నచింత్యంబుగా నెద్ది సేయు, నద్ది హృదయగతంబుగా ధ్యానంబు సేయుం దగు. మఱియుం గార్యబుద్ధిం జేసి చేయం బడు పూజావిశేషంబుల వాసుదేవ మంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింపవలయు. ఇట్లు మనో వా క్కాయ కర్మంబులచేత మనోగతం బగునట్లుగా భక్తియుక్తంబు లైన పూజలచేతం బూజింపంబడి, సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక సేవించు పురుషులకు ధర్మాది పురుషార్థంబులలోన నభిమతార్థంబు నిచ్చు. విరక్తుం డగువాఁడు నిరంతరభావం బైన భక్తియోగంబునం జేసి మోక్షంబు కొఱకు భజియించు. అని చెప్పిన విని ధ్రువుండు నారదునకుం బ్రదక్షిణ పూర్వకంబుగా నమస్కరించి *(మహర్షిజన సేవ్యం బై సకలసిద్ధుల నొసంగుచు) భగవత్పాదసరోజాలం కృతం బైన మధువనంబునకుం జనియె, అంత.

తే. పద్మభవసూనుఁ డుత్తానపాదుకడకు
నరిగి యా రాజుచే వివిధార్చనముల
నంది సంప్రీతుఁ డై యున్న తాసనమున
నెలమిఁ గూర్చుండి యాతనివలను చూచి. 257

వ. ఇట్లనియె. 258

క. భూనాయక! నీ వివు డా, మ్లానాస్యుఁడ వగుచుఁ జాల మదిలోఁ జింతం
బూనుట కేమి కతం బన, నా నారదుతోడ నాతఁ డనియెఁ మరలఁ. 259

---

1. బీతాంబరునిని (క. చ. బ. తం.) * తా. ప. ప్రతులలో లేదు.

క. మునివర ! వివేకశాలియు, ననఘుఁడు నై దేండ్లబాలుఁ డస్మ త్ప్రియనం
దనుఁ డదయుఁడ నగు నాచే, తను బరిభవ మొంది చనియెఁ దల్లియుఁ దానున్.

మ. చని యుగ్రాటవిఁ జొచ్చి యచ్చటఁ బథి శ్రాంతుండు తుతీ్పడితుం
డును సంమ్లానముఖాంబుజుండు ననఘుండున్ బాలుఁడు నైన మ
త్తనయున్ ఘోర వృకాహి భల్లముఖ సత్వ్రశేణి భక్షించెనో
యని దుఃఖించెద నాదు చిత్తమున నార్యస్తుత్య ! యి ట్లౌటకున్. 261

తే. అట్టి యుత్తమబాలు నా యంకపీఠ
మందుఁ గూర్చుండనీక నిరాకరించి
యంగనాసక్త చిత్తుండ నైన యట్టి
నాదు దౌరాత్మ్య మిది మునినాథచంద్ర! 262

ఉ. నా విని నారదుండు నరనాథుని కిట్లను నీ కుమారుఁ డా
దేవకిరీట రత్నరుచి దీపిత పాదసరోజుఁ డైన రా
జీవదళాతు రక్షితుఁ డశేష [1]జగజ్జన కీర్తనీయ [2]కీ
ర్తివిభవ ప్రశస్త సుచరిత్రుఁడు వానికి దుఃఖ మేటికిన్ ? 263

ఉ. కావున న మ్మహాత్ముఁడు సుకర్మముచేత సమస్తలోకపా
లావళి కందరాని సముదంచిత నిత్యపదంబునన్ ప్రభు
శ్రీ విలసిల్లఁ జెందుఁ దులసీదళధాము భజించి యా జగ
త్పావనుఁ డైన నీ సుతుప్రభావ మెఱుంగవు నీవు భూవరా ! 264

వ. అదియునుం గాక. 265

క. నీ కీర్తియు జగములయం, దాకల్పము నొందఁజేయు నంచిత గుణ ర
త్నాకరుఁ డిట కేతెంచును, శోకింపకు మతనిఁగూర్చి సుభగచరిత్రా ! 266

క. అని నారదుండు వలికిన, విని మనమున విశ్వసించి విభుఁడును ప్రియనం
దనుఁ జింతింపుచు నాదర, మునఁ జూడం డయ్యె రాజ్యమునుఁ బూజ్యమునన్.

వ. అంత నక్కడ ధ్రువుండు. 268

క. చని ముందటఁ గనుగొనె మధు, వనమును మునిదేవయోగి వర్ణిత గుణపా
వనమును దుర్భవ జలద ప, వనమును నిఖిలైక పుణ్య వరభవనంబున్. 269

---

1. జగత్పరికీర్తనీయ (క) 2. సు, శ్రీ విభవప్రశస్త (డ)

వ. అట్లు గని డాయంజని యమునానదిం గృతస్నానుం డై నియతుండును, సమాహిత చిత్తుండును నై, సర్వేశ్వరుని ధ్యానంబు సేయుచుం ద్రిరాత్రంబుల కొక్క మాఱు కృత కపిత్థ బదరీఫల పారణుం డగుచు దేహస్థితి ననుసరించి యొక్క మాసంబు హరిం బూజించి, యంతనుండి, యాఱేసి దినంబుల కొకపరి కృత జీర్ణ తృణ పర్ణాహారుం డగుచు, రెండవ మాసంబున విష్ణు సమారాధనంబు సేసి, యంతనుండి నవరాత్రంబుల కొకమా ఱుదక భక్షణంబు సేయుచు, మూఁడవ మాసంబున మాధవు నర్చించి, యంతనుండి ద్వాదశదినంబుల కొకమాఱు వాయు భక్షణుం డగుచు, జితశ్వాసుం డై నాలవ మాసంబునం బుండరీకాక్షుని భజియించి, యంతనుండి మనంబున నలయక నిరుచ్ఛ్వాసుం డై యేకపదంబున నిలిచి, పరమాత్మం జింతింపుచు నచేతనం బైన స్థాణువుం బలె నై దవ మాసంబునుం జరపె. అంత. 270

సీ. సకల భూతేంద్రియాశయ మగు హృదయంబునందు విషయములఁ జెందనీక
మహదాది తత్త్వ సమూజములకును నాధారభూతమును బ్రధానపూరుషేశ్వరుఁ డై నట్టి శాశ్వతబ్రహ్మంబుఁ [1]దన సిత హృదయపద్మమున నిలిపి
హరిరూపమునకంచె నన్యంబు నెఱుఁగక చిత్త మవ్విభునందుఁ జేర్చియున్న

తే. కతన ముల్లోకములు చాలఁ గంప మొందె
వెండియును బేర్చి యయ్యర్భకుండు ధరణి
[2]నొక్కపాదంబు మోపి నిల్చున్న వేళఁ
బేర్చి య బ్బాలు నంగుష్ఠపీడఁ జేసి 271

తే. వసుమతీ[3]తల మర్ధము వంగఁ జొచ్చె
భూరిమద దుర్ని వారణ వారణేంద్ర
మెడమఁ గుడి నొరగఁగ నడుగడుగునకును
[4]జలన మొందు నుదస్థిత కలముఁవోలె. 272

చ. అతఁడు ననన్యదృష్టినిఁ జరాచర [5]దేహి శరీరధారణ
స్థితిగల యీశునందుఁ దన జీవితముఁ ఘటియింపఁ జేసి యే
కతఁ గనఁ ద న్నిరోధమునఁ గైకొని కంపమునొందె నీశ్వరుం
డతఁడు చలింప ని జ్జగము లన్నియుఁ [6]జంచల మయ్యె భూవరా! 273

---

1. దన్నైన (తం. వా.) 2. పాదంబుఁ జేర్చి (హ); పాదంబుచేర్చి (తం. వా.)
3. తలమును వడవడ వడంక (డ) 4. జలన మొందుచు నడగెడు కలముఁవోలె (క. చ. ట. త. డ. ద. బ. హ.); చలన మందు నుదస్థితకలముఁవోలి (జ); చలనమగు నుదధిస్థిత కలముఁవోలె (తం)
5. దేహశరీర ధారణా (హ. తం. వా.) 6. చంచలమందె నత్తఱిఁ (హ)

క. ఆ లోకభయంకర మగు, నాలోక మహావిప ద్ధశాలోకను లై
యా లోకపాలు రందఱు, నా లోకశరణ్యు గాన నరిగిరి భీతిఁ. 274

వ. అ ట్లరిగి నారాయణు నుద్దేశించి కృతప్రణాము లై కరంబులు ముకుళించి యి ట్లనిరి. 275

చ. హరి! పరమాత్మ! కేశవ! చరాచర భూతశరీరధారి వై
పరఁగుదు వీవు నిట్టులుగఁ [1]ప్రాణనిరోధ మెఱుంగ మెందు ముఁ
దిరముగ దేవదేవ! జగదీశ్వర! సర్వశరణ్య! నీ పదాం
బురుహము లోలిమై శరణుఁ బొందెద మా ర్తి హరించి కావవే! 276

వ. అని దేవతలు విన్నవించిన నీశ్వరుండు వారల కి ట్లనియె. ఉత్తానపాదుం డను వాని తనయుండు విశ్వరూపుం డైన నాయందుఁ దన చిత్తం బైక్యంబుఁజేసి తపంబు గావింపుచుండ దానంజేసి భవదీయ ప్రాణనిరోధం బయ్యె. అట్టి దురత్యయంబై న తపంబు నివర్తింపఁ జేసెద. వెఱవక మీ మీ నివాసంబులకుం జనుండని యానతిచ్చిన నా దేవతలు నిర్భయాత్ము లై యీశ్వరునకుం బ్రణామంబు లాచరించి త్రివిష్టపంబునకుం జనిరి. త దనంతరంబ. 277

అధ్యాయము - ౯

సీ. హరి యీశ్వరుండు విహంగ కులేశ్వర యానుఁ డై నిజభృత్యుఁ డై న ధ్రువునిఁ
గనుఁగొను వేడుక జనియింప నా మధువనమున కప్పుడు సని ధ్రువుండు
పరువడి యోగవిపాక తీవ్రం బై న బుద్ధిచే నిజమనోంబురుహ ముకుళ
మందుఁ దటి త్ప్రభాయతమూ ర్తి యటఁ దిరోధానంబునను బొంది తత్క్షణంబ

తే. తన పురోభాగమునను నిల్చినను బూర్వ
సమధిక జ్ఞాననయన గోచర సమగ్ర
మూ ర్తిఁ గనుఁగొని సంభ్రమమునను సమ్మ
దాశ్రువులు రాలఁ బులకీకృతాంగుఁ డగుచు. 278

—, ధ్రువుఁడు భగవంతుని స్తుతించుట :—

తే. నయనముల విభుమూ ర్తిఁ బానంబు సేయు
[2]పగిదిఁ దన ముఖమునను జుంబనము సేయు
లీలఁ దగ భుజములను నాలింగనంబు
సేయుగతి దండవ న్నమస్కృతు లొనర్చె. 279

---

1. నిరోధము లెందు మున్ను నే మెఱుఁగ మనాథనాథ(తం); విరోధ మెఱుంగ మెందు ముం, దిరవుగదేవదేవ (వా) 2. పగిది గనుచును ముఖము (చ. ట. త.)

వ. ఇట్లు దండప్రణామంబు లాచరించి, కృతాంజలి యై స్తోత్రంబుసేయ నిశ్చయిం చియు *(స్తుతి క్రియా సమర్థుండు గాకయున్న) ధ్రువునకు సమస్త భూతంబు లకు నంతర్యామి యైన యీశ్వరుండు ధ్రువుని తలం పెఱింగి, వేదమయం బైన తన శంఖంబుచేత న బ్బాలుని కపోలతలం బంటిన, జీవేశ్వర నిర్ణయజ్ఞుండును, భక్తి భావ నిష్ఠుండును నగు ధ్రువుండు నిఖిలలోక విఖ్యాతకీర్తి గల యీశ్వరుని (భగవ త్ప్రతిపాదితంబు లగుచు) వేదాత్మకంబు లైన తనవాక్కుల నిట్లని స్తుతియించె. దేవా ! నిఖిల శక్తిధరుండవు, నంతఃప్రవిష్టుండవు నైన నీవు లీనంబు లైన మదీయ వాక్యంబులం బ్రాణేంద్రియంబులం గర చరణ శ్రవణ త్వగాదులను జిచ్ఛక్తిచేఁ గృపంజేసి జీవింపంజేసిన భగవంతుండవును, పరమపురు షుండవును నైన నీకు నమస్కరింతు. నీ వొక్కరుండ వయ్యును మహాద్యం బైన యీ యశేషవిశ్వంబు మాయాఖ్యం బైన యాత్మీయ శక్తిచేతం గల్పించి, యందుం బ్రవేశించి, [1]యింద్రియంబులందు వసింపుచుఁ *(దత్తద్దేవతా రూపం బులచే) నానాప్రకారంబుల దారువులం దున్న వహ్నిచందంబునం బ్రకాశింతువు. అదియునుం గాక. 280

చ. వరమతి నార్త బాంధవ ! భవద్ధ్వన బోధ సమేతుఁ డై భవ
చ్చరణముఁ బొందినట్టి విధి సర్గము సుప్రజనుండు బోధమం
దరయఁగఁ జూచురీతిఁ గను నట్టి ముముక్షు శరణ్య మైన నీ
చరణములం గృతజ్ఞుఁ డగు సజ్జనుఁ డెట్లు దలంప కుండెడున్ ? 281

సీ. మహితాత్మ ! మఱి జన్మ మరణ ప్రణాశన హేతుభూతుండవు నిద్ధ కల్ప
తరువవు నగు నిన్నుఁ దగ నెవ్వరే నేమి పూని నీ మాయావిమోహి తాత్ము
లగుచు ధర్మార్థ కామాదుల కొఱకుఁ దా మర్థింపుచుం ద్రిగుణాభ మైన
దేహోప భోగ్య మై దీపించు సుఖముల నెనయంగ మది నిచ్ఛయింతు రట్టి

తే. విషయ సంబంధ జన్య మై వెలయు సుఖము
వారికి నిరయమందును వఱలు దేవ !
భూరి సంసారతాప నివార గుణ క
థామృతాపూర్ణ ! యీశ ! [2]మాధవ ! ముకుంద ! 282

మ. అరవిందోదర ! తావకీన చరణ ధ్యానానురా గోల్లస
చ్ఛరి తాకర్ణనజాత భూరి సుఖముల్ స్వానందక బ్రహ్మమం

---

1. ఇంద్రియంబుల చేష్టింప జేయుచు (ట) *కొన్ని తా. ప. ప్రతులలో లేదు. 2. అవ్యయ (ట)

దరయఁ లేవఁట దండభృద్ధ *తవిమా నాకీర్ణ లై కూలు నా
సురలోకస్థులఁ జెప్పనేల? సుజన స్తోమైక చింతామణీ! 283

చ. హరి! భజనీయ మార్గనియ తాత్మకు లై భవదీయ[1]మూ ర్తిపై
వరలిన భ క్తియుక్తు లగు వారల సంగతి గల్గఁజేయు స
త్పురుష సుసంగతిన్ వ్యసన దుర్భవసాగర మప్రయత్నతఁ
సరస భవత్క థామృతరసంబున మత్తుఁడ నై తరించెదఁ. 284

చ. నిరతముఁ దావకీన భజనీయ పదాబ్జ [2]సుగంధలబ్ధి యె
వ్వరిమది వొందఁగాఁ గలుగు వారలు దత్ప్రియ మర్త్య దేహము
[3]న్నరయఁ దదీయ దార తనయాది సుహృద్గృహ బంధువర్గముఁ
మఱతురు విశ్వతోముఖ! రమాహృదయేశ! ముకుంద! మాధవా! 285

సీ. పరమాత్మ! మర్త్య సుపర్వ తిర్య జ్మృగ దితిజ సరీసృప ద్విజగణాది
సంవ్యాప్తమును సదస ద్విశేషంబును గైకొని మహదాది కారణంబు
నై న విరాడ్విగ్రహంబు నే నెఱుఁగుదుఁ గాని తక్కిన [4]సుమంగళము నై న
సంతత సుమహి తై శ్వర్య రూపంబును భూరి శబ్దాది వ్యాపారశూన్య

తే. మైన బ్రహ్మస్వరూప మే నాత్మ నెఱుఁగఁ
బ్రవిమలాకార! సంసార భయవిదూర!
పరమ మునిగేయ! సంతతభాగధేయ!
నళినసేత్ర! రమాలలనా కళత్ర! 286

సీ. సర్వేశ! కల్పాంత సమయంబునందు నీ యఖిల ప్రపంచంబు నాహరించి
యనయంబు శేష సహాయుండ వై శేష పర్యంకతలమునఁ బవ్వళించి
యోగనిద్రారతి నుండి నాభీసింధుజ స్వర్ణలోక కంజాతగర్భ
మందుఁ జతుర్ముఖు నమరఁ బుట్టింపుచు రుచి నొప్పు బ్రహ్మస్వరూపి వై న

తే. నీకు బ్రొక్కెద నత్యంతనియమ మొప్ప
భవ్యచారిత్ర! పంకజపత్ర నేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!
యవ్యయానంద! గోవింద! హరి! ముకుంద! 287

---

* దండభృదభట (తం. వా.) కిన్న్వంతకాసి లులితా ద్విమానాత్ (మూల) 4-9-10.

1. రూపమై (తం. వా.) 2. సుగంధలుబ్ధు, లెవ్వరి మదిఁ బొందఁగాఁ గలుగు వారలు (తం. వా.); సుగంధలబ్ధి నెవ్వరిమది (హ) 3. కరము తదీయదార సుతకామ (హ)
4. సమంగళమునై న (తం)

వ. అట్లు యోగనిద్రాపరవశుండ వయ్యును జీవులకంటె నత్యంత విలక్షణుండ వై యుండుదువు. అది యెట్లనిన, బుద్ధ్యవస్థా భేదంబున నఖండితం బైన స్వశక్తిం జేసి చూచు లోకపాలన నిమిత్తంబు యజ్ఞాధిష్ఠాతవు గావున నీవు నిత్యముక్తుండవు, పరిశుద్ధుండవు. *(సర్వజ్ఞుండవు, నాత్మవు, కూటస్థుండవు, నాదిపురుషుండవు,) భగవంతుండవు, గుణత్రయాధీశ్వరుండవు నై వర్తింతువు. భాగ్యహీనుం డైన జీవునియందు నీ గుణంబులు గలుగవు. ఏ సర్వేశ్వరునం దేనేమి విరుద్ధగతు లై వివిధశక్తియుక్తంబు లైన యవిద్యాదు లానుపూర్వ్యంబునం జేసి ప్రలీనంబు లగుచుండు నట్టి విశ్వకారణంబు నేకంబు ననంతంబు నాద్యంబు నానందమాత్రంబు నవికారంబు నగు బ్రహ్మంబునకు నమస్కరించెద. మఱియు దేవా! నీవు సర్వవిధ ఫలంబని చింతించు నిష్కాము లైన వారికి రాజ్యాది కామితంబులలోనఁ బరమార్థం బైన ఫలంబు సర్వార్థరూపుండ వైన భవదీయ పాదపద్మంబుల సేవనంబ. ఇట్లు నిశ్చితంబ యైనను సకాము లైన దీనులను, గోవు వత్సంబును స్తన్యపానంబు సేయింపుచు వృకాది భయంబువలన రక్షించు చందంబునం గామప్రదుండవై సంసార భయంబువలనం బాపుదువు. అని యిట్లు సత్యసంకల్పుండును, సుజ్ఞానియు నైన ధ్రువునిచేత వినుతింపంబడి భృత్యాను రక్తుం డైన భగవంతుండు సంతుష్టాంతరంగుం డై యిట్లనియె. 288

క. ధీరవ్రత! రాజన్య కు, మారక! నీ హృదయమందు మసలిన కార్యం
బారూఢిగా నెఱుంగుదు, నారయ నది వొందరాని దైనను నిత్తున్. 289

వ. అది యెట్టి దనిన నెందేని మేధియందుఁ బరిభ్రామ్యమాణ గో చక్రంబునుం బోలి గ్రహ నక్షత్ర తారాగణ జ్యోతిశ్చక్రంబు నక్షత్ర రూపంబు లైన ధర్మాగ్ని కశ్యప [1]శక్రులును, సప్తర్షులును, [2]దారాసమేతు లై ప్రదక్షిణంబు దిరుగు చుండుదు రట్టి దురాపంబును, ననన్యాధిష్ఠితంబును, లోకత్రయ ప్రళయ కాలంబునందు నశ్వరంబు గాక ప్రకాశమానంబును నైన ధ్రువక్షితి యను పదంబు ముందట నిరువదియాఱువే లేండ్లు సనఁ బ్రాపింతువు. తత్పదప్రాప్తి పర్యంతంబు భవదీయ జనకుండు వనవాసగతుం డైనం దద్రాజ్యంబు పూజ్యంబుగా ధర్మమార్గంబున జితేంద్రియుండ వై చేయుదువు. భవదనుజుం డగు నుత్తముండు మృగయార్థంబు వనంబునకుం జని మృతుం డగు. తదన్వేషణార్థంబు ద దాహితచిత్త యై తన్మాతయు వనంబునకుం జని యందు దావదహాననిమగ్న యగు. వెండియు. 290

---

* కొన్ని తా. ప. ప్రతులలో కానరాదు. 1. శుక్రులు (చ. త. డ. బ.) 2. దారకా సమేతులై (తం. వా.) "భ్రమంతో యత్సతారకాః" (9-21)

సీ. అనఘాత్మ ! మఱి నీవు యజ్ఞరూపుం డనఁదగు నన్ను సంపూర్ణ దక్షిణంబు
లగు మఖంబులచేత నర్చించి సత్యంబు లగు నిహసౌఖ్యంబు లనుభవించి
యంత్యకాలమున న న్నాత్మఁ దలంపుచు మఱి సర్వలోక నమస్కృతమును
మహిఁ బునరావృత్తి రహితంబు స ప్తర్షి మండలోన్నత మగు మామకీన

తే. పదముఁ దగఁ బొందఁగల వని పరమపురుషుఁ
డతని యభిలషితార్థంబు లర్థి నిచ్చి
యతఁడు గనుఁగొనుచుండంగ నాత్మపురికి
గరుడగమనుఁడు వేంచేసెఁ గౌతుకమున. 291

తే. అంత ధ్రువుఁడును బంకేరుహోక్ష పాద
కమల సేవోపసాదిత ఘనమనోర
థములఁ దనరియుఁ దనదు చిత్తంబులోనఁ
దుష్టిఁ బొందక చనియె విశిష్టచరిత ! 292

వ. అట్లు. 293

క. అని మైత్రేయుఁడు ధ్రువుఁ డ
ట్లనయము హరిచేఁ గృతార్థుఁ డైనవిధం బె
ల్లను వినుపించిన విదురుఁడు
విని మునివరుఁ జూచి పలికె వినయం బెసఁగఁ. 294

క. మునినాయక ! వినుఁ కామక, జన దుష్ప్రాపంబు విష్ణుచరణాంబురు హా
ర్చన [1]హితజన సంప్రాప్యము, ననఁగల పంకేరుహోక్షు నవ్యయపదముఁ. 295

వ. పెక్కుజన్మంబులం గాని పొందరాని పదంబుఁ దా నొక్క జన్మంబుననే పొంది
యుం దనమనంబునం దప్రాప్తమనోరథుండ నని పురుషార్థవేది యైన ధ్రువుం
డెట్లు తలంచె? అనిన మైత్రేయుం డి ట్లనియె. 296

తే. అనఘ ! పినతల్లి దన్నుఁ బల్కిన దురుక్తి
బాణ విద్ధాత్మఁ డగుచుఁ ద దాభషణములు
చిత్తమునఁ దల్చుచుండుటఁ జేసి ముక్తిఁ
గోరమికి నాత్మలో వగఁ [2]గుందుచుండె. 297

వ. అంత నా ధ్రువుండు. 298

---

1. మునిజన (తం. వా.) 2. గూరుచుండె (ట. డ. తం.)

చ. అనఘ జితేంద్రియుల్ సుమహితాత్ములు నైన సనందనాదు లిం
దనయ మనేకజన్మ సముపార్జిత యోగసమాధిఁజేసి యె
వ్వని చరణారవిందములు వారనిభక్తి నెఱుంగుచుందు రా
ఘనుఁ బరమేశు నీశు నవికారు నమేయు నజేయు నాద్యునిన్. 299

వ. ఏను షణ్మాసంబులు భజియించి తత్పాదపద్మచాయం బ్రాపించియు భేద
దర్శనుండ నైతి. అక్కటా! ఇట్టి భాగ్యహీనుండ నైన యేను భవనాశకుం
డైన యతనిం బొడంగనియు నశ్వరంబు లైన కామ్యంబు లడిగితి. ఇట్టి
దౌరాత్మ్య మెందునుం గలదే? తమ పదంబులకంటె నున్నతపదంబు నొందుదునో?
యని సహింపం జాలని యీ దేవతలచేత మదీయమతి గలుషితం బయ్యెం గాక.
నాఁడు నారదుం డాడినమాట తథ్యంబయ్యె. అతని వాక్యంబు లంగీకరించక
యే నసత్తముండ నై స్వప్నావస్థలం బొందినవాఁడు దైవికం బైన మాయం
జెంది భిన్నదర్శనుం డగు చందంబున నే నద్వితీయుండ నైనను భ్రాత యను
శత్రువుచేఁ బ్రాప్తం బైన దుఃఖంబు నొంది జగదాత్మకుండును, సుప్రసాదుం
డును, భవనాశకుండును నైన యీశ్వరు నారాధించి తత్ప్రసాదంబు వడసియు,
నాయుర్వీహీనుం డైన రోగికిం బ్రయోగించు నౌషధముం బలె నిరర్థకంబు
లై *(నశ్వరంబు లయిన) యీ కామితంబులు గోరితి. అని వెండియు. 300

మ. ధనహీనుండు నృపాలుఁ జేరి మిగుల ధాటిన్ ఫలీకార మి
మ్మని యర్థించినరీతి ముక్తిఫలదుం డైనట్టి పంకేజలో
చనుఁడే చాలఁ బ్రసన్నుఁ డైన నతనిన్ సాంసారికం బర్థిఁ గో
రిన నావంటి విమూఢమానసులు ధాత్రిన్ గల్గిరే? యెవ్వరున్. 301

—: ధ్రువుండు మరలఁ దనపురంబునకు వచ్చుట :—

సీ. అని యిట్లు చింతించె ననుచు న మ్మైత్రేయ ముని విదురునకు నిట్లనియెఁ దండ్రి!
కమనీయ హరిపాదకమల రజోభిసంస్కృత శరీరులును యాదృచ్ఛికముగ
సంప్రాప్త మగుదాన సంతుష్టచిత్తు లై వఱలుచునుండు మివంటివారు
తగ భగవత్పాద దాస్యంబు దక్కంగ నితరపదార్థంబు లెడఁదలందు

తే. మఱచియును గోరనొల్లరు మనుచరిత్ర!
తవిలి యిట్లు హరిప్రసాదంబు నొంది
మరలి వచ్చుచునున్న కుమారువార్తఁ
జారుచే విని యుత్తానచరణుఁ డపుడు. 302

---

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

వ. మనమున ని ట్లని తలంచె. 303

క. చచ్చినవారలు గ్రమ్మఱి, వచ్చుటయే కాక యిట్టి వార్తలు గలవే ?
నిచ్చలు నమంగళుఁడ నగు, [1]దిచ్చట మఱి నాకు శుభము లేల ఘటించున్? 304

క. అని విశ్వసింప కుండియు, [2]మనమందును నారదుఁడు గుమారుఁడు వేగం
బున రాఁగలఁ డనుచును బలి, కిన పలుకులు దలఁచి నమ్మి కృతకృత్యుం డై 305

క. తన సుతుని రాకఁ జెప్పిన, ఘనునకు ధనములును మౌక్తికపుహారములున్
మనమలర నిచ్చి తనయునిఁ, గనుఁగొను సంతోష మాత్మఁ గడలుకొనంగన్.

సీ. వలను [3]మీఱిన సైంధవంబులఁ బూన్చిన కనకరథంబు నుత్కంఠ నెక్కి
బ్రాహ్మణ కులవృద్ధ బంధుజ నామాత్య పరివృతుఁ డగుచు విస్ఫురణ మెఱసి
బ్రహ్మనిర్ఘోష తూర్యస్వన శంఖ కాహళ వేణురవము లందంద చెలఁగ
శిబిక లెక్కియు విభూషిత లై సునీతి సురుచు లుత్తముండు నారూఢి నడువఁ

తే. గరిమ దీపింప నతిశీఘ్రగమన మొప్ప
నాత్మనగరంబు వెలువడి యరుగుచుండి
బలసి నగరోపవన సమీపంబునందు
వచ్చు ధ్రువుఁ గని మేదినీశ్వరుఁడు నంత. 307

చ. అరదము డిగ్గి ప్రేమ దొలఁకాడ ససంభ్రముఁ డై రమామనో
హర చరణారవిందయుగ ళార్చన నిర్దళి తాఖిలాఘు నీ
శ్వర కరుణావలోకన సుజాత సమగ్రమనోరథు సుతు
గర మనురక్తి డాసి పులకల్ ననలొత్తఁ బ్రమోదితాత్మఁ డై. 308

తే. బిగియఁ గౌఁగిటఁ జేర్చి నె మ్మొగము నివిరి
శిరము మూర్కొని చుబుకంబు చేతఁ బుణికి
యవ్య యానందబాష్ప ధారాభిషిక్తుఁ
జేసి యాశీర్వదింప నా చిరయశుండు. 309

క. జనకుని యాశీర్వచనము, లనయము గైకొని ప్రమోది యై తత్పదముల్
దన ఫాలతలము సోఁకఁగ వినతులు గావించి భక్తివిన్వ్యాలుఁ డగుచున్. 310

తే. అంత నా సజ్జనాగ్రణి యైన ధ్రువుఁడు
దల్లులకు భక్తివినతులు దగ నొనర్చి

---

1. నిచ్చట (తం. వా.) 2. మనమున మును నారదుడు (చ) 3. మీరగ (హ)

సురుచికిని ప్రొక్క నర్భకుఁ జూచి యెత్తి
నగుమొగంబున నాలింగనంబుఁ జేసి. 311

సీ. కరమొప్ప నానందగద్గద స్వరమున జీవింపు మనుచు నాశీర్వదించె
భగవంతుఁ డెవ్వనిపై మైత్రి వాటించు సత్కృపానిరతిఁ బ్రసన్నుఁ డగుచు
నతనికిఁ దమయంత ననుకూల మైయుండు సర్వభూతంబులు సమతఁబేర్చి
మహిఁ దలపోయ నిమ్నప్రదేశములకు ననయంబుఁ జేరు తోయములపగిదిఁ

తే. గాన ఘను న మ్మహాత్ముని గారవించె
సురుచి పూర్వంబుఁ దలఁపక సుజనచరిత!
విష్ణుభక్తులు ధరను బవిత్రు లగుట
వారి కలుగరు ధరణి నెవ్వారు మఱియు. 312

వ. కావున నుత్తముండును ధ్రువుండును ప్రేమవిహ్వలు లగుచు ననోన్యాలింగితు లై పులకాంకు రాలంకృత శరీరులై యానంద బాష్పంబుల నొప్పిరి. అంత సునీతియుఁ దన ప్రాణంబులకంటెఁ బ్రియుం డైన సుతు నుపగూహనంబు చేసి తదవయవ స్పర్శనంబుచేత నానందంబు నొంది విగతశోక యయ్యె. అప్పుడు సంతోషబాష్ప ధారాసిక్తంబు లై చనుబాలు గురిసె. అంత. 313

సీ. ఉన్నతసంతోష ముప్పతిల్లఁగఁ బౌర జనము లా ధ్రువుతల్లి నెనయఁ జూచి
తొడరిన భవదీయ దుఃఖనాశకుఁ డైన యీ నీ తనూజుఁ డెందేని పెద్ద
కాలంబు క్రిందటఁ గడఁగి నష్టుం డైన వాఁ డిప్డు నీ భాగ్యవశముచేతఁ
బ్రతిలబ్ధుఁ డయ్యెను నితఁడు భూమండల మెల్లను రక్షించు నిద్ధమహిమఁ

తే. గమలలోచనుఁ జింతించు ఘనులు లోక
దుర్జయం బైనయట్టి మృత్యువును గెల్తు
రట్టి ప్రణతార్తి హరుఁ డైన యబ్జనాభుఁ
డర్థి నీచేతఁ బూజితుఁడగుట నిజము. 314

వ. అని ప్రశంసించిరి. అట్లు పౌరజనంబులచేత †నుపలాల్యమానుం డగు ధ్రువుని నుత్తానపాదుం డుత్తమసమేతంబుగా గజారూఢునిం జేసి సంస్తూయమానుండును, ప్రహృష్టాంతరంగుడును నగుచు పురాభిముఖుం డై చనుదెంచి. 315

---

† "లాల్యమానం జనై రేవం ధ్రువం సభ్రాతరం నృపః,
ఆరోప్య కరిణం హృష్టః స్తూయమానోఽవిశత్పురమ్" (మూ. 9-53)

సీ. స్వర్ణపరిచ్ఛద స్వచ్ఛ కుడ్యద్వార లాలితగోపు రాట్టాలకంబు
ఫల పుష్ప మంజరీ కలిత రంభా స్తంభ పూగపోతాది విభూషితంబు
ఘనసార కస్తూరికా గంధజల బంధురాసిక్త విపణిమా ర్గాంచితంబు
మానిత నవరత్నమయ రంగవల్లీ విరాజిత ప్రతిగృహా ప్రాంగణంబు

తే. శుభనదీ జలకుంభ సంశోభితంబు
తండుల స్వర్ణలాజాఖ్యత ప్రసూన
ఫల [1]బలిభ్రాత కలిత విభ్రాజితంబు
నగుచు సర్వతోలంకృత మైన పురము. 316

వ. ప్రవేశించి రాజమార్గంబునఁ జనుదెంచు నప్పుడు. 317

మ. హరిమధ్యల్ పుర[2]కామినీజనులు సౌధాగ్రంబులం దుండి భా
స్కర సిద్ధార్థఫలాఖ్యత ప్రసవ దూర్వాభ్రాత దధ్యంబువుల్
కరవల్లీ మణిహేమకంకణ ఝణత్కారంబు శోభిల్లఁ జ
ల్లిరి యా భాగవ తోత్తమోత్తమునిపై లీలానుమేయంబుగన్. 318

వ. ఇట్లు వాత్సల్యంబునం జల్లుచు సత్యవాక్యంబుల దీవించుచు సువర్ణపాత్రరచిత
మణిదీపనీరాజనంబుల నివాళింపం *(పౌర జానపద మిత్రామాత్య బంధుజన
పరివృతుం డై) చనుదెంచి. 319

సీ. కాంచనమయ మకరతకుడ్య [3]మణిజాల సంచయ రాజత సౌధములను
వర సుధా ఫేన పాండుర రుక్మ పరికర దాంతపరిచ్ఛద తల్పములను
సురతరుశోభిత శుకపిక మిథునాళి గాన విభాసి తోద్యానములను
సుమహిత వైదూర్య సోపాన విమల శోభిత జలపూర్ణ వాపీచయముల

తే. వికచ కల్హార దర దరవింద కైర
వ ప్రదీపిత బక చక్రవాక రాజ
హంస సారస కారండవాది జలవి
హంగ నినదాభిరామ పద్మాకరముల. 320

వ. మఱియును. 321

---

1. భరభ్రాత (హ) 2. కామినుల్ సతులు (హ)

* తా. ప. ప్రతులలో లేదు.

3. మణిపరి, చ్ఛదవిరాజి స్వచ్ఛ సౌధములను (డ. తం. వా.)

తే. చారు బహువిధ వస్తు[1]వి స్తరత నొప్పి
యంగనాయు క్త మగుచుఁ బెం పగ్గలించి
యర్థిఁ దనరారు జనకు గృహంబుఁ జొచ్చె
నెలమిఁ ద్రిదివంబుఁ జొచ్చు దేవేంద్రుపగది. 322

అధ్యాయము - ౧౦

వ. ఇట్లు ప్రవేశించిన రాజర్షి యైన యుత్తానపాదుండు సుతుని యాశ్చర్యకరంబైన ప్రభావంబు వినియుం జూచియు మనంబు విస్మయంబు నొంది ప్రజానురక్తుం డయ్యును, బ్రజాసమ్మతుండును, నవయౌవన పరిపూర్ణుండును నైన ధ్రువుని రాజ్యాభిషిక్తుం జేసి, వృద్ధవయస్కుం డైన తన్నుం దాన యెఱింగి యాత్మ గతిఁ బొంద నిచ్ఛయించి విరక్తుం డై వనంబునకుం జనియె. అంత నా ధ్రువుండు శుంశుమార ప్రజాపతి కూఁతు రైన భ్రమి యను దాని వివాహం బై దానివలనఁ గల్ప వత్సరు లను నిద్దఱు కొడుకులం బడసి వెండియు వాయు పుత్రి యైన యిల యను భార్యయందు నుత్కలనామకుం డయిన కొడుకు, నతిమనోహర యైన కన్యారత్నంబునుం గనియె. అంతఁ ద ద్భాగ్యోత యైన యుత్తముండు వివాహంబు లేకుండియు, మృగయార్థంబు వనంబున కరిగి హిమవంతంబున యక్షుని చేత హతుం డయ్యె. అతని తల్లియుఁ ద ద్దుఃఖంబున వనంబున కేఁగి యందు గహనదహనంబున మృతిం బొందె. ధ్రువుండు భ్రాతృ మరణంబు విని కోపామర్ష శోకవ్యాకులిత చిత్తుం డై త్రైపురం బగు రథం బెక్కి యుత్తరాభిముఖుం డై చని హిమవద్ద్రోణియందు భూతగణ సేవితంబును, గుహ్యక సంకులంబును నైన యలకాపురంబు వొడగని యమ్మహాబాహుండు.

మ. ఘన శౌర్యోన్నతితోడ సర్వకకు బాకాశంబులందుఁ బ్రతి
ధ్వను లోలిఁ నిగుడంగ శంఖము మహోద్యల్లీలఁ బూరింపఁ ద
న్నినదంబుఁ విని యక్షకాంతలు భయాన్వితాత్మ లై [2]రుగ్రసా
ధనులై యక్షభటుల్ పురిఁ వెడలి రుత్సాహంబు సంధిల్లఁగఁ. 324

వ. ఇట్లు వెడలి యా ధ్రువునిం దాఁకిన. 325

చ. కరము మహారథుండు భుజగర్వ పరాక్రమ శాలియుఁ ధను
ర్ధరుఁడును నైన యా ధ్రువుఁడు దన్ను నెదిర్చిన యక్షకోటిఁ జె

---

1. విస్తారములను (క. చ. బ.) 2. పోయిచె,ప్పిన నయ్యక్షభటుల్ ..... గంభీరోద్ధతిన్నుగ్రులై (త. బ.)

చ్చెరఁ బదుమూఁడువేల నొక చీరికిఁ గైకొన కొక్కఁ పెట్ట భీ
కరముగ మూఁడు మూఁడు శితకాండము[1]లం దగ గ్రువ్వనేసినఁ. 326

ఉ. వారు లలాటముల్ వగిలి వారక [2]శోషిలి తేటి య మ్మహో
దారు పరాక్రమ ప్రకటధైర్యముఁ ద త్కరలాఘవంబు ప
ల్మాఱు నుతింపుచుఁ గుపితమానసు లై పదతాడిత ప్రదు
ష్టోరగకోటిఁ బోలి చటులోగ్ర భయంకర రోషమూర్తు లై 327

ఉ. ఆ రథికో త్తముం దొడరి యందఱు నొక్కట జుట్టుముట్టి యా
ఘాఱు శిలీముఖంబులఁ ద దంగములఁ బగిలించి వెండి వి
స్ఫార గదా శర తురిక పట్టస తోమర శూల ఖడ్గముల్
సారథియుక్తుఁ డైన రథిసత్తముపైఁ గురియించి రేపునఁ. 328

వ. అట్లు గురియించిన నతండు. 329

క. పెంపటియుండెను ధారా, సంపాత చ్ఛన్న మైన శైలము భంగిఁ
గుంపులు గొని యాకసమునఁ, గంపింపుచు నపుడు సిద్ధగణములు వరుసఁ. 330

క. హాహాకారము లెసఁగఁగ
నోహో! యీ రీతి ధ్రువప డొరుహ హితుఁ డు
త్సాహము చెడి యిటు దైత్యస
మూ హార్ణవమందు నేఁడు మునిఁగెనె యకటా! 331

వ. అని చింతించు సమయంబున. 332

క. తా మాతని గెలిచితి మని, యా మనుజాశనులు వలుక నట నీహార
స్తోమము సమయించు మహో, ద్దాముం డగు సూర్యుఁ బోలి తద్దయుఁ దోఁచెఁ.

వ. అట్లు దోఁచిన. 334

మ. అరిదుఃఖావహ మైన కార్ముకము శౌర్యస్ఫూర్తితోఁ దాల్చి భీ
కర బాణావళిఁ బింజపింజ గరవంగా నేసి ఝుంఝూనిలుం
డురు మేఘావళిఁ బాఱఁదోలుగతి నత్యు గ్రాహిత క్రూర బం
ధుర శస్త్రావళి రూపుమాపె [3]విలస ద్దోర్లీల సంధిల్లఁగఁ. 335

---

1. లంగములందు గ్రుచ్చినఁ (త. జ. డ. బ.) 2. సోలియుతేలి (హ) 3. విలసద్దోర్దండ మేపారఁగఁ (త)

చ. మఱియును నమ్మహాత్ముఁ డసమానబలుండు మహోగ్రబాణముల్
[1]గఱిగఱిఁ దాఁకనేసి భుజగర్వ మెలర్ప విరోధివర్మముల్
[2]పఱియలు సేసి యంగములు భంగము నొందఁగఁ జేసె వ్రేల్మిడిఁ
[3]గుఱికొని పర్వతంబులఁ బగుల్చు మహాశనికోటిరూపునఁ. 336

వ. అ య్యవసరంబున. 337

చ. అలఘుచరిత్రుఁ డమ్మునికులాగ్రణిచే వికలాంగు లైన [4]వా
రల సకిరీట కుండల విరాజిత మస్తకకోటిచే సము
జ్జ్వల మణికంక ణాంగద లస ద్భుజవర్గముచేత సంగర
స్థల మతిరమ్య మై తనరె సంచిత వీరమనోహరాకృతిఁ. 338

వ. అంత హతశేషులు. 339

క. వరబలుఁ డగు మను మనుమని, శరసంఘ న్నాంగు లగుచు సమరవిముఖు లై
[5]హరిరాజముఁ గని పఱచెడు,కరిబృందముఁ బోలి చనిరి కళవళపడుచుఁ. 340

క. అప్పుడు రాక్షసమాయలు, గప్పిన ధ్రువుఁ డసురవరుల కార్యం బెఱుఁగఁ
జొప్పడక వారిఁ బొడగన, దెప్పర మగుటయును సారథిం గని యంతఁ. 341

క. తలపోయఁగ భువి మాయా, వుల కృత్యం బెఱుఁగ నెవ్వరోపుదు రనుచుఁ
బలుకుచుఁ ద త్పురిఁ జొరఁగాఁ, దలపఁగ నది గానరాక తద్దయు మానెన్. 342

వ. అట్లు పురంబున కరుగుట మాని చిత్రరథుం డైన యా ధ్రువుండు నప్రయత్నం
డయ్యును [6]బరప్రతియోగ శంకితుం డై యుండె. అ య్యెడ మహోజలధి
ఘోషంబు ననుకరించు శబ్దంబు వినంబడె. అంత సకల దిక్తటంబుల వాయు
జనితం బైన రజఃపటలంబునుఁ దత్క్షణంబున నాకాశంబున విస్ఫుర త్తటి
ద్ప్రభాకలిత గర్జారవయుక్త మేఘంబులు నమోఘంబు లగుచు భయంకరా
కారంబు లై తోఁచె. అంత. 343

మ. అనయంబుఁ ధ్రువుమీఁద దైత్యకృత మాయాజాల మ ల్లేచి భో
రన మస్తిష్క పురీష మూత్ర పల దుర్గంధాస్థి మేద శ్శరా
సన నిస్త్రింశ శరాసితోమర గదా చక్ర త్రిశూలాది సా
ధన భూభృ ద్భుజగావళిం గురిసె నుద్దండ క్రియాలోలతన్. 344

---

1. గఱికరి (హ) 2. పరిపరిజేసి (క. త. డ. బ.) 3. గిఱికొని పర్వతంబుల నొగిం దెగ
ఁగొట్టెడు నింద్రు కైవడిఁ (హ); "గిరి నశనయో యథా" అని మూలము (10-17)
4. వా, రలఘు (త) 5. హరియఱుముగని (క.డ.ద.బ.) 6. పరోద్యోగ (క-బ.); పరప్రయోగ (హ)

ప. మఱియును మత్తగజ సింహ వ్యాఘ్ర సమూహంబులును, నూర్మిభయంకరం
బై సర్వతః ప్లవనం బైన సముద్రంబును గానంబడియె. వెండియుం గల్పాం
తంబు నందుం బోలె భీషణం బైన మహోద్రాదంబును దోఁచె. ఇవ్వి ధంబున నానా
విధంబుల ననేకంబులు నవిరళ భయంకరంబులు నైన యసురమాయలు క్రూర
ప్రవర్తను లగు యతులచేత సృజ్యమానంబు లై యడరె. ఆ సమయంబున.345

క. [1]అనయంబును న య్యతుల, ఘనమాయ నెఱింగి మునినికాయము వరుస
మను మనుమని మను మను మని, మనమునఁ దలఁపుచును ద త్సమతుంబునకున్.

వ. చనుదెంచి యి ట్లనిరి. 347

సీ. అనఘాత్మ! లోకు లెవ్వని దివ్యనామంబు సమత నాకర్ణించి సంస్మరించి
దు స్తరం బైన మృత్యువు నైన సుఖవృ త్తిఁ దరియింతు రట్టి యీశ్వరుఁడు పరుఁడు
భగవంతుఁడును శార్ఙ్గపాణియు నతసుజనా ర్తి హరుండును నైన విభుఁడు
భవదీయ విమతులఁ బరిమార్చుఁ గా కని పలికిన మునుల సంభాషణములు

తే. విని కృతాచమనుఁడు రమావిభుని పాద
కమలము దలంచి రిపుభయంకర మహోగ్ర
కలిత నారాయణాస్త్రంబు గార్మ్మకమునఁ
బూనఁ దడవఁ దదీయ సంధానమునను. 348

అధ్యాయము - ౧౧

తే. కడఁగి గుహ్యక మాయాంధకార మపుడు
వెరవు చెడి దవ్వు దవ్వుల విరిసిపోయె
విమల మైన వివేకోదయమునఁ జేసి
సమయు రాగాదికంబుల సరణి నంత. 349

మ. వర నారాయణ దైవ తాస్త్ర [2]భవ దుర్వారప్రభా హోమపుం
ఖ రుచిస్ఫార మరాళరాజ సితపఙ్క్తి క్రూరధారా [3]పత
చ్చరసాహస్రము లోలి భీషణ విపఙ్క్తిశ్రేణిపై వ్రాలె భీ
కరరావంబునఁ గానఁ జొచ్చు శిఖసంఘాతంబు చందంబునన్. 350

వ. అ ల్లేసిన. 351

---

1. అనయము మాయావ్యసురుల (హ) 2. జని (హ); నారాయణ బాణరాడ్జనిత (తం)
3. రణత్ (చ. డ. తం.)

చ. [1]ఖర నిశితోగ్ర సాయకనికాయ నిరంతరవృష్టిచేఁ బొరిం
బొరి వికలాంగు లై యడరి పుణ్యాజనుల్ పృథు హేతిపాణు లై
గరుడునిఁ జూచి భూరి భుజగప్రకరంబు లెదిర్చి వేర్చి చె
చ్చెర నడతెంచు చందమునఁ జిత్రరథుం బబుపూని తాఁకినన్. 352

ఉ. వారలఁ జండ తీవ్ర శరవర్గముచేత నికృత్త పాదజం
ఘోరు శిరోధరాంబక శిఖోదరకర్ణులఁ జేసి యోగిపం
కేరుహ మిత్రమండల [2]సకృద్భిద [3]నెట్టిపదంబుఁ జెందు నా
భూరిపదంబునం బెలుచఁ బొందఁగఁ [4]బంపె భుజావిజృంభి యై. 353

వ. ఇ ట్లవిధంబున నా చిత్రరథుం డగు ధ్రువునిచేత నిహన్యమానులును నిరపరాధులును నై న గుహ్యకులం జూచి యతని పితామహుం డై న స్వాయంభువుండు ఋషిగణ పరివృతుం డై చనుదెంచి ధ్రువునిం జూచి యి ట్లనియె. వత్సా! నిరపరాధు లై న పుణ్యజనుల నెట్టిరోషంబున వధియించితి వట్టి నిష్ఠాతు వై న రోషంబు చాలు. భ్రాతృవత్సల! భ్రాతృవధాభితప్తుండ వై కావించు నీ యత్నం బుడుగుము. అని. 354

క. అనఘా! మనుకులమున కిది, యనుచితకర్మంబ యొకనికై పెక్కుం ద్రి
ట్లనిమొనఁ ద్రుంగిరి యిది నీ, కనయంబును వలవ దుడుగుమయ్యా! కుమారా!

వ. అదియునుం గాక దేహాభిమానంబునం బఱుప్రాయు లై భూతహింస గావించుట హృషీకేశానువర్తను లై న సాధులకుం దగదు. నీవు సర్వభూతంబుల నాత్మ భావంబునఁ దలఁచి సర్వభూతావాసుఁడును, దురారాధ్యుండును నై న విష్ణుని పదంబులు పూజించి త త్పరమపదంబునఁ బొందితివి. అట్టి భగవంతుని హృదయంబున ననుధ్యాతుండవు, భాగవతుల చిత్తంబులకును సమ్మతుండవు, మఱియు సాధువర్తనుండ వన నొప్పు నీవి పాపకర్మం బెట్లు సేయ సమకట్టితివి? ఏ పురుషుం డై న నేమి? మహాత్ములయందుఁ దితిక్షయు, సములయందు మైత్రియు, హీనులయందుఁ గృపయు, నితరము లగు సమస్తజంతువుల యందు సమత్వంబును గలిగి వర్తించు వానియందు సర్వాత్మకుం డై న భగవంతుండు ప్రసన్నుం డగును. అతండు ప్రసన్నుం డై న వాఁడు ప్రకృతిగుణంబులం బాసి లింగశరీరంబు భంగంబుఁ గావించి బ్రహ్మానందంబునం బొందు. అదియునుం గాక

---

1. ఖరనిశిత ప్రదీప్త ఘనకాండ (త. బ.) 2. నికృత్తత (క. చ. ట. జ. బ) 3. నేపద మందుఁ జెందు (క. బ.) 4. జంపె (క. చ. జ. డ. బ.)

కార్యకారణ సంఘాతరూపం బైన సర్గం బీశ్వరునందు నయస్కాంత సన్నిధా
నంబు గలిగిన లోహంబుచందంబున వర్తించు. అందు సర్వేశ్వరుండు నిమిత్త
మాత్రంబుగాఁ బరిభ్రమించు. అట్టి యీశ్వరుని మాయాగుణ వ్యతి కరంబున
నారబ్ధంబు లైన పంచభూతంబులచేత యోషి త్పురుషవ్యవాయంబువలన
యోషిత్పురుషాది రూపసంభూతి యగు. ఇ ట్లిధంబున సర్గంబు, ద త్సంస్థానంబు,
ద ల్లయంబు నగుచు నుండు. ఇట్లు దుర్విభావ్యం బైన కాలశక్తిం జేసి గుణ
క్షోభంబున విభజ్యమానవీర్యుండు, ననంతుండు, ననాదియు నై జనంబులచేత
జనంబులఁ బుట్టింపుచుండుటం జేసి గదా ! యాదికరుండు, మృత్యుహేతువు లగు
జనంబుల లయంబునొందించుటం జేసి యంతకరుండు నై, యనాది యగుటం జేసి
యవ్యయుండు నైన భగవంతుండు జగత్కారణుం డగు. కావున నీ సృష్టి
పాలన విలయంబులకుం గర్త గానివాఁడుంబలెం దానిం జేయుచుండు. ఇట్లు
మృత్యురూపుండు, పరుండు, సమవర్తియు నైన యీశ్వరునికి స్వపక్ష పరపక్షం
బులు లేవు. కర్మాధీనంబు లైన భూతసంఘంబులు రజంబులు మహావాయువు
ననుసరించు చాడ్పున నస్వతంత్రంబు లగుచు నతని ననువర్తించు. ఈశ్వరుండు
జంతుచ యాయు రుపచయాపచయ కరణంబులం దస్పృష్టుం డగుచు
జీవుండు గర్మబద్ధుం డగుటంజేసి వానికి నాయు రుపచయాపచయంబులం
జేయుచుండు. మఱియు సర్వజగ త్కర్మసాక్షి యగు సర్వేశ్వరుని, 356

క. కొందఱు స్వభావ మందురు, కొందఱు గర్మం బటంద్రు గొందఱు కాలం
బందురు కొందఱు దైవం, బందురు కొంద అది కామ మంద్రు మహాత్మా ! 357

వ. ఇట్టు లవ్యక్తరూపుండును, నప్రమేయుండును, నానా శక్త్యుదయ భూత
హేతుండును నైన భగవంతుండు సేయు కార్యంబుల బ్రహ్మరుద్రాదు లెఱుంగ
రన నతని తత్త్వంబు నెవ్వ రెఱుంగనోపుదురు ? కావునం బుత్రా ! యి ట్లుత్పత్తి
నాశంబులకు దైవంబ కారణం బై యుండుఁ గాన ని ద్దనదానుచరులు భవదీయ
భ్రాతృహంతకు లగుదురే ? భూతాత్మకుండు భూతేశుండు భూతభావనుండు
సర్వేశ్వరుండు పరాపరుండు నగు నీశుండ మాయాయుక్తుం డై స్వశక్తిచే సృష్టి
స్థితి లయంబులం జేయు. ఐన ననహంకారంబునంజేసి గుణకర్మంబులచే
నస్పృశ్యం డగుచు వర్తించు. అదియునుం గాక యీ ప్రజాపతులు విశ్వసృ
ష్టామంబుల నియంత్రితు లై ముకుఁదాళ్లు వెట్టిన పశువులం బోలి యెవ్వని
యాజ్ఞాధీనకృత్య లై వర్తింతు రట్టి దుష్టజన మృత్యువు, సుజనామృత
స్వరూపుండు, సర్వాత్మకుండు, జగత్పరాయణుండు నైన యీశ్వరుని సర్వ
ప్రకారంబుల శరణంబుఁ బొందుము. అదియునుం గాక. 358

సీ అనఘాత్మ ! నీవు పంచాబ్దవయస్కుండ వై పినతల్లి ని న్నాడినట్టి
మాటల నిర్భిన్న మర్మ్ముండ వగుచును జనయిత్రి దిగనాడి వనము కేఁగి
తప మాచరించి యచ్చపు భక్తి నీశ్వరుఁ బూజించి మహితవిభూతి మెఱసి
[1]ప్రకట త్రిలోకోత్తరం బైన పదమునుఁ బొందితి వదిగాన [2]పూని భేద

తే. రూప మైన ప్రపంచంబు రూఢి నే మ
హాత్మ్మనందుఁ బ్రతీత మై యలరు నట్టి
యగుణుఁ డద్వితీయుండును నఖురుండు
నైన యీశ్వరుఁ బరమాత్మ్మ ననుదినంబు. 359

సీ. నై కొని శుద్ధంబు గతమత్సరాదికం బమలంబు నగు హృదయంబునందు
సొలయ కన్వేషింపుచును బ్రత్యగాత్మ్మండు భగవంతుఁడును బరబ్రహ్మమయుఁడు
నానంద మాత్రుండు నవ్యయుం డుపపన్న సకలశక్తియుతుండు సగుణుఁ డజుఁడు
నైన సర్వేశ్వరు నం దుత్తమం బైన సద్భక్తిఁ జేయుచు సమత నొప్పి

తే. [3]రూఢిని 'నహా మ్మమ' యని ప్రరూఢ మగుచు
[3]ఘనత కెక్కు నవిద్యయఁ గ్రంథి నీవు
ద్రెంచి వై చెదు గావున ధీవరేణ్య !
సర్వశుభహాని యైన రోషంబు వలదు. 360

క ‡విను రోషహృదయ [5]చేతను, ననయము లోకము నశించు [6]నౌషధములచే
ఘన [7]రోగములు నశించిన, యనువున నదిగాన రోష మణఁపు మహాత్మా ! 361

తే. అనఘ ! విను నీ సహోదరహంత లనుచుఁ
బెనఁచి యీపుణ్యజనులఁ జంపితి కడంగి
పరఁగ నిదియె సదాశివ భ్రాత యైన
యర్థవిభునకు నపరాధ మయ్యెఁ గాన. 362

క. [8]నతి నుతులచేత నీ విపుఁ, డతనిఁ బ్రసన్ననిఁగఁ జేయు మని మనువు దయా
మతిఁ జెప్పి ధ్రువునిచే స, త్కృతుఁ డై [9]రయమొప్పఁ జనియె బుషియుక్తుం డై.

వ. అంత. 364

---

1. రమణ (హ) 2. భూరి (హ) 3. ఘనతకెక్కు నవిద్యయన్ గ్రంథి నీవు (ద.తం.వా.)
4. రూఢి సోహమ్మమేతి ప్రరూఢ మగుచు (తం. వా.); రూఢి సోహమ్మమయని——(హ);
‡ సంయచ్ఛ రోషం భద్రంతే ప్రతీపం శ్రేయసాం పరమ్
శ్రుతేన భూయసా రాజ న్మగదేన యథాఽమయమ్. (11-31)
5. గనుగొని (హ) 6. నతిభయయుతమై (హ) 7. రోగమౌషధంబుల (హ) 8. ధృతి(హ)
9. నయమొప్ప (హ)

అధ్యాయము - ౧౨

తే. *యక్ష చారణ సిద్ధ విద్యాధరాది
జనగణ స్తూయమానుఁ డై ధనదుఁ డంతఁ
బుణ్యజన వైశస నివృత్తు భూరిరోష
రహితుఁ డై నట్టి ధ్రువునిఁ జేరంగ వచ్చె. 365

సీ. చనుదెంచి వెసఁ గృతాంజలి యై ధ్రువునిఁ జూచి తివుట నిట్లనియె ఉత్త్రియ కుమార!

తగ భవదీయ పితామహాదేశంబు నను దుస్త్యజం బైన ఘనవిరోధ
[1]ముడిగితి వట్లుగావునఁ దానఁ జేసి నీయందుఁ బ్రసన్నుండ నైతి భూత
జనన లయంబుల కనయంబుఁ గాలంబె కర్త యై వర్తించుఁ గాన యుష్మ

తే. దనుజుఁ జంపినవార లీ యక్షవరులు
గారు తలపోయ నీ యక్షగణము నిట్లు
నెఱి వధించినవాఁడవు నీవు గావు
వినుతగుణశీల! మాటలు వేయునేల? 366

వ. అదియునుం గాక యే బుద్ధిం జేసి కర్మసంబంధ దుఃఖాదికంబులు దేహాత్మాను సంధానంబునం జేసి సంభవించు నట్టి యహం త్వ మ్మను నపార్థజ్ఞానంబు స్వప్న మందుం బలెను పురుషునకుం దోఁచు. అది గావున సర్వభూతాత్మవిగ్రహుం డును, నధోక్షజుండును, భవచ్ఛేదకుండును, భజనీయ పాదారవిందుండును, ననంతామేయ శక్తియుక్తుండును, గుణమయాత్మ మాయావిరహితుండును నైన యీశ్వరుని సేవింపుము. నీకు భద్రంబయ్యెడు. భవదీయ మనోగతం బైన వరంబు గోరుము. నీ వంబుజనాభ పాదారవింద సేవనంబుఁ దిరంబుగఁ జేయుదు వని యెఱుంగుదు. అని రాజరాజుచేత నిట్లు మహామతియు, భాగవతోత్త ముండు నైన ధ్రువుండు ప్రేరేపింపంబడి యే హరిస్మరణంబుచేత నప్రయత్నం బున దురత్యయం బైన యజ్ఞానంబుం దరియింతు రట్టి హరిస్మరణం బచలితం బగున ట్లొసంగు మని యడిగిన నట్లకాక యని యంగీకరించి యంతఁ గుబేరుండు సంప్రీతచిత్తుం డై ధ్రువునికి శ్రీహరిస్మరణం బట్ల యనుగ్రహించి యంతర్ధా

★ చ. ట. డ. ద. ప్రతులలో ఈ క్రింది పద్య మున్నది.
'అంత ధ్రువుడు వరకృపాయత్తచిత్తుడై, గుహ్యకులను యక్షకోటి జూచి
అభయ మిచ్చి కాచి యర్థేశు గనుగొన, దలచి యలుకమాని యలక జొచ్చె.'

1. ఉడిగితి వటుగాన యొనరంగ నిపుడు నీ (తం. వా.)

నంబునొందె. అంత ధ్రువుండు యక్ష కిన్నర కింపురుషగణ సంస్తూయమాన వైభవుం డగుచు నాత్మీయపురంబునకు మరలి చనుదెంచి. 367

సీ. గణుతింప భూరిదక్షిణలచేఁ గడు నొప్పు యజ్ఞముల్ సేయ న య్యజ్ఞవిభుఁడు
ద్రవ్యక్రియాదేవతా ఫల రూప స త్కర్మఫల ప్రదాతయును నైన
పురుషోత్తముని నర్థిఁ బూజించి మఱియు స ర్వోపాధివర్జితుఁ డుత్తముండు
సర్వాత్మకుం డగు జలజాక్షునందుఁ దీవ్రంబుం బ్రవాహరూపంబు నైన

తే. భక్తి సలుపుచు [1]భూతప్రపంచమందు
నలరఁ దనయందు నున్న మహాత్మ హరినిఁ
జిదచిదానందమయుని [2]లక్ష్మీశుఁ బరము
నీశ్వరేశ్వరుఁ బొడగనె నిద్ధచరిత! 368

వ. ఇట్లు సుశీలసంపన్నుండును, బ్రహ్మణ్యుండును, ధర్మసేతు రక్షకుండును, దీన వత్సలుండును నై యవనిఁ బాలించు ధ్రువునిం బ్రజలు దండ్రి యని తలంప నిరువది యాఱువే లేండ్లు భోగంబులచేతం బుణ్యక్షయంబును, నభోగంబు లయిన యాగాదులచేత నశుభక్షయంబునుఁ జేయుచు బహుకాలంబు దనుకఁ ద్రివర్గసాధనంబుగా రాజ్యంబుచేసి కొడుకునకుం బట్టంబు గట్టి యచలితేంద్రియుం డై యవిద్యారచిత స్వప్నగంధర్వనగరోపమం బైన దేహాదికం బగు విశ్వంబు భగవన్మాయా రచితం బని యాత్మం దలంపుచు వెండియు. 369

చ. మనునిభుఁ డంత భృత్యజన మంత్రి పురోహిత బంధు మిత్ర నం
దన పశు విత్త రత్న వనితా గృహ రమ్యవిహారశైల వా
రినిధి పరీత భూతల హరి ద్వీపముఖ్య పదార్థజాలముల్
ఘనమతిచే ననిత్యములుగాఁ దలపోసి విరక్తచిత్తుఁ డై. 370

సీ. పురము వెల్వడి చని †పుణ్యభూ బదరికా ఘన విశాలానదీకలిత మంగ
ళాంబుపూరంబుల ననురక్తి మైఁ గ్రుంకి కమనీయ పరిశుద్ధ కరణుఁ డగుచుఁ
[3]బద్ధాసనస్థుఁ డై పవనుని బంధించి నెలకొని ముకుళితనేత్రుఁ డగుచు
[4]హరి రూపవైభవ ధ్యానంబు సేయుచు భగవంతు నచ్యుతుఁ బద్మనేత్రు

---

1. అఖల (హ. తం. వా.) 2. లక్ష్మివరుఁ (తం. వా.)

† ప్రయయౌ విశాలామ్. (మూలము 12.16) విశాలామ్ = బదరికాశ్రమమ్ (వ్యా)

3. పద్మాసనస్థుఁడై (హ. తం. వా.) 4. నచలితమతి హరిధ్యానంబు సేయుచు (త)

తే. నందు సతతంబు నిశ్చల మైన యట్టి
భక్తిఁ బ్రవహింపఁ జేయుచుఁ బరమమోద
బాష్పధారాభిషిక్తుండు భవ్యయశుఁడు
పులకితాంగుండు నగుచు నిమ్ములఁ దనర్చి. 371

వ. మఱియు విగతక్లేశుండును, ముక్తలింగుండును నై ధ్రువుండు దన్నుఁ దా మఱచియుండు సమయంబున దశదిక్కుల నుద్యద్రాకానిశానాయకుం బోలి వెలింగింపుచు నాకాశంబుననుండి యొక్క విమానంబు చనుదేర నందు దేవ శ్రేష్ఠులును, జతుర్భుజులును, రక్తాంబుజేక్షణులును, శ్యామవర్ణులును, గదాధరు లును, సువాసస్సులును, గిరీట హారాంగద కుండల ధరులును, గౌమార వయస్కులును, నుత్తమశ్లోకకింకరులును నైన వారల నిద్దఱిం గని సంభ్ర మంబున లేచి మధుసూదను నామంబులు సంస్మరింపుచు వారల భగవత్కింక రులుగాఁ దలంచి దండప్రణామంబు లాచరించిన కృష్ణ పాదారవింద విన్యస్త చిత్తుండుఁ గృతాంజలియు వినమితకంధరుండు నైన ధ్రువునిం గనుంగొని పుష్కరనాభ భక్తు లైన సునందనందులు ప్రీతియుక్తు లు మందస్మితులు నగుచు నిట్లనిరి. 372

ఉ. ఓ నృప! నీకు భద్ర మగు నొప్పగుచున్న మదీయవాక్యముల్
వీనులయందుఁ జొన్పము వివేకముతో నయిదేండ్లనాఁడు మే
ధానిధి వై యొనర్చిన యుదాత్త తపోవ్రతనిష్ఠచేతఁ దే
జోనయశాలి యైన మధుసూదనుఁ దృప్తి వహింపఁ జేయవే? 373

తే. అట్టి శార్ఙ్గపాణి యఖిలజగత్కర్త
దేవదేవుఁ డతుల దివ్యమూర్తి
[1]పార్షదులము మేము భగవత్పదంబున
కర్థి నిన్నుఁ గొనుచు నరుగుటకును. 374

వ. వచ్చితిమి. ఏ పదంబునేని సూరిజనంబులు సర్వోత్తమం బని పొందుదురు, దేనిఁ జంద్ర దివాకర గ్రహ నక్షత్ర తారాగణంబులు ప్రదక్షిణంబుగాఁ దిరుగుచుండు, నేది నీ పితరులచేతను నన్యులచేతను ననధిష్ఠితంబును, జగద్వంద్యంబును, నభక్తజ నాతిదుర్జయంబును నగు నట్టి విష్ణుపదంబు బొందుదువు రమ్ము. ఇది విమాన శ్రేష్ఠంబు. ఉత్తమశ్లోకజన మౌళిమణి యైన శ్రీహరి వుత్తెంచె. దీని నెక్క నర్హుండ

---

1. మమ్ముఁ బనుప మేము మాధవు పదమున (హ. తం. వా.)

వనిన నురుక్రమప్రియుం డైన ధ్రువుండు త న్మధురవాక్యంబులు విని కృతాభి
షిక్తుం డై యచ్చటి మునులకుం బ్రణమిల్లి త దాశీర్వాదంబు గైకొని విమా
నంబునకుం బ్రదక్షిణార్చనంబులు గావించి పార్షదు లైన సునందనందులకు
వందనం బాచరించి *(భగవద్రూప విన్యస్త చక్షు రంతఃకరణాదికుం డగుచు
నా విమానాధిరోహణంబు గావించుటకు) హిరణ్మయరూపంబు ధరియించె.

క. సురదుందుభి పణ వానక, మురజాదులు మొరసె విరులమునురు గురిసెఁ గి
న్నర గంధర్వుల పాటలు, భరితము లై చెలఁగె నపుడు భవ్యచరిత్రా! 376

వ. *(అట్టి సమయంబున ధ్రువుండు దుర్గమం బగు త్రివిష్టపంబునకు నేఁగువాఁ
డగుచు దీనయగు జననిం దిగనాడి యెట్లు పోవుదు నని చింతించువానిం
బార్షదు లవలోకించి యగ్రభాగంబున విమానారూఢ లయి యేఁగుచున్న
జననిం జూపిన సంతుష్టాంతరంగుం డగుచు). 377

క. ‡[1]జనని సునీతిని [2]మును గనుఁ, గొని యమలవిమాన మెక్కి గొనకొని విబుధుల్
దనమీఁదఁ బుష్పవర్ష ము, లనయము గురియింప ధ్రువుఁడు హర్షముతోడన్. 378

క. చని చని వెస గ్రహమండల, మునుఁ దై్రలోక్యంబు సప్తమునిమండలమున్
ఘనుఁ డుత్తరించి యవ్వలఁ, దనరెడు హరిపదము నొందెఁ దద్దయుఁ బ్రీతిన్. 379

వ. అది మఱియును నిజకాంతిచేతం ద్రిలోకంబులం బ్రకాశింపఁజేయుచు నిర్దయా
గమ్యంబును, శాంతులు సమదర్శనులు (శుద్ధులు) సర్వభూతానురంజనులు,
నచ్యుతభక్త బాంధవులు నైన భద్రాచారులకు సుగమ్యంబును నై గంభీర
వేగంబు ననిమిషంబు నగు జ్యోతిశ్చక్రంబు సమాహితం బయి గోగణంబు మేధి
యందుం బలె నెందుఁ బరిభ్రమించుచుండు నట్టి యచ్యుత పదంబునుం బొంది
విష్ణుపరాయణుం డైన ధ్రువుండు త్రిలోకచూడామణి యై యొప్పుచుండె.
అప్పుడు భగవంతుం డైన నారదుండు ధ్రువుని మహిమం గనుంగొని ప్రచేత
స్సత్రంబునందు వీణ వాయింపుచు. 380

---

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

‡ "ఇతి వ్యవసితం తస్య వ్యవసీయ సురోత్తమౌ,
దర్శయామాసతు ర్దేవం దేవయానేన గచ్ఛతమ్" మూలము (12–32)

1. జనకునిమున్ను సునీతిడుకొని (క) 2. మున్నిడుకొని (చ. బ.)

సీ. పతియె దై వంబుగా భావంబులోపలఁ దలఁచు సునీతి నందను [1]తపఃప్ర
భావము బలె ధర్మభవ్యనిష్ఠలఁ బొందఁ జాలరు బ్రహ్మర్షి జనము లనిన
ఋత్త్రియకులు నెన్నఁగానేల ? యెవ్వఁడు పంచసంవత్సర ప్రాయమునను
సురుచి దురు క్త్యుగ్రశర భిన్నహృదయుఁ డై మద్వాక్య హితబోధ మతిఁ దనర్చి

తే. వనమునకు నేఁగి హరిభ క్తివశత నొంది
యజితుఁ డగు హరిఁ దనవశుఁడై చరింపఁ
జేసి వెసఁ ద త్పదంబునుఁ జెందె నిట్టి
హరిపదంబునుఁ బొంద నెవ్వరికిఁ దరము ? 381

క. అని పాడె ననుచు విదురున, కనఘుఁడు మైత్రేయుఁ డనియె నంచితభ క్తిన్
వినుతోద్దామయశస్కుం, డనఁగల యా ధ్రువుని చరిత మార్యస్తుత్యా ! 382

సీ. మహిత సత్పురుష సమ్మతమును ధన్యంబు సర్గప్రదంబు యశస్కరంబు
నాయుష్కరంబుఁ [2]బుణ్య ప్రదాయకమును మంగళకర మఘమర్షణంబు
సౌమనస్యముఁ బ్రళంసాయోగ్యమును పాపహరమును ధ్రువపద ప్రాపకంబు
నై యొప్పు నీ యుపాఖ్యానంబుఁ దగ నీకు నెఱిఁగించితిని దీని నెవ్వఁడేని

తే. తివుట శ్రద్ధాగరిష్ఠుఁ డై తీర్థపాద
చరణసరసీరుహ ద్వయాశ్రయుఁడు నగుచు
భవ్యచరిత [3]దినాంత ప్రభాతవేళ
[4]లను సినీవాలి పూర్ణిమలందు మఱియు. 383

తే. ద్వాదశినిఁ బద్మబాంధవ వాసరమున
శ్రవణ నక్షత్రమున దినత్రయమునందుఁ
బరఁగ సంక్రమణ వ్యతీపాతలందు
సఫల భక్తిని విను నట్టి సజ్జనునకు. 384

వ. క్లేశనాశంబును, మహాప్రకాశంబును నైన భగవద్భక్తియు, శీలాదిగుణంబులును గలుగు. మఱియుఁ దేజఃకామునకుఁ దేజంబును, నిష్కామునకుఁ ద త్త్వజ్ఞానంబును గలుగు. వినిపించువారికి దేవతానుగ్రహంబు గలుగు. ఇట్టి యుపాఖ్యానంబు నీ కెఱిఁగించితి. అని మైత్రేయుండు విదురునకుఁ జెప్పిన క్రమంబున శుకయోగి

---

1. తపః ప్రభావము క్రియ (తం. వా.) 2. పుణ్యం బధికంబును (క. బ.) 3. సాయం ప్రభాతములను (జ) 4. నలఘుమతి పౌర్ణిమాస్యలందు మఱియు (చ.ట.త.జ.) నలఘుమతిఁ బూర్ణిమా ..... (తం. వా.)

పరీక్షిత్తున కెఱిఁగించిన తెఱంగున సూతుండు శౌనకాదులకు వినుపించి వెండియు ని ట్లనియె. అట్లు చెప్పిన మైత్రేయునిఁ గని విదురుం డి ట్లనియె.385

అధ్యాయము - ౧౪

సీ. అనఘాత్మ! నారదమునిపతి ధ్రువచరిత్రము ప్రచేతసుల సత్రంబునందు
నర్థిమైఁ గీ ర్తించె నంటి ప్రచేతసు లన నెవ్వ? రెవ్వనితనయు? లెట్టి
వంశజుల్? సత్ర మెవ్వలనుగాఁ జేసి? ర[1]ధ్వరమందు నిజకులధర్మశీలు
రగు ప్రచేతసులచే యజియింపఁ బడునట్టి యజ్ఞపూరుషుఁ డగు నచ్యుతాంఘ్రి

తే. భ క్తియుక్తుఁడు విదిత సద్భాగవతుఁడు
దివిరి హరిపాదసేవావిధి ప్రయు క్త
దేవదర్శనుఁ డగు నట్టి దివ్యయోగి
[2]నారదుఁడు పొగడె నఁట! శ్రీనాథు కథలు. 386

క. నా కిపు డెఱిఁగింపుము సు, శ్లోకుని చరితామృతంబు శ్రోత్రాంజలులం
బై కొని జుఱ్ఱియుఁ దనివిం, గై కొనకున్నది మనంబు కరుణోపేతా! 387

క అని యడిగిన విదురునిఁ గనుఁ, గొని మైత్రేయుండు వలికెఁ గొనకొని
ధ్రువుఁడుఁ
వనమునకుఁ జనిన నాతని, తనయుం డగు నుత్కలుండు గళితాఘుం డై. 388

సీ. చతురుఁ డాజన్మ ప్రశాంతుండు నిస్సంగుఁడును సమదర్శనుండును ఘనుండు
నై యాత్మయందు లోకావళి లోకంబులందు నాత్మయుఁ జూచు ననఘు మైన
యనుపమ యోగక్రియా పావకాదగ్ధ కర్మ మలాళయకలనఁ బేర్చి
జడునికై వడిఁ జీకుచందంబునను [3]మూకు పగిది నున్మత్తునిభంగిఁ జెవిటి

తే. వడువునను గానఁబడుచు సర్వజ్ఞుఁ డై ప్ర
శాంతకీలహుతాశనుకరణిఁ బొల్చి
సతతశాంతంబు నంచితజ్ఞానమయము
నై న బ్రహ్మస్వరూపంబు నాత్మఁ దలఁచి. 389

క. తనకంచె నితర మొక చెఱుఁ, గనికతమున సార్వభౌమకశ్రీఁ బొందఁ
మనమునఁ గోరకయుండుటఁ, గని కులవృద్ధులును మంత్రిగణములు నంతఁ.390

---

1. యాగంబునను నిజాచారశీలు (హ) 2. నారదుం డెట్టు గొనియాడె శౌరికథలు (హ.తం.వా) 3. మూఢు (హ. తం. వా.)

వ. అతని నున్మత్తునింగాఁ దెలిసి తదనుజుం డైన వత్సరునికిఁ బట్టంబు గట్టిరి. ఆ వత్సరునికి సర్వర్థి యను భార్యయందుఁ బుష్పార్ణుండు, చంద్రకేతుండు, నిషుండు, నూర్జుండు, వసువు, జయుండు నన నార్వ్వురు తనయులు గలిగిరి. అందుఁ బుష్పార్ణుం డనువానికి ప్రభయు, దోషయు నన నిద్దరు భార్య లైరి. అందుఁ ప్రభ యను దానికిం ప్రాత ర్మధ్యందిన సాయంబు లను సుత్రయంబును, దోష యనుదానికిఁ ప్రదోష నిశీథ వ్యుష్టు లనువారు ముగ్గురును బుట్టిరి. అందు వ్యుష్టుం డనువానికిఁ బుష్కరిణి యను పత్నియందు సర్వతేజు డను సుతుండు వుట్టె. వానికి నాకూతి యను మహిషివలనఁ జక్షుస్సంజ్ఞుం డైన మనువు జనించె. వానికి నడ్వల యను భార్యయందుఁ బురువు, కుత్సుఁడు, ద్రితుండు, ద్యుమ్నుండు, సత్యవంతుండు, ఋతుండు, వ్రతుండు, అగ్నిష్టో ముండు, అతిరాత్రుండు, ప్రద్యుమ్నుండు, శిబి, ఉల్ముకుండు నను పన్నిద్దఱు తనయులు గలిగిరి. అందు నుల్ముకునికిఁ బుష్కరిణి యనుదానివలన నంగుండు, సుమనసుండు, ఖ్యాతియుఁ గ్రతువు, నంగిరసుండు, గయుండు నను నార్వ్వురు కొడుకులు వుట్టిరి. అందు నంగునికి సునీథ యను ధర్మపత్ని వలన వేనుండను పుత్రుం డుదయించిన. 391

మ. క్షితినాథో త్తముఁ డాత్మనందనుని దుశ్శీలంబు వీక్షించి దుఃఖితుఁ డై యొంటిగఁ దత్పురిఁ వెడలి యేఁగెఁ వేగ నెందేని త
ద్గతి నీక్షించి మునీశ్వరుల్ గుపితు లై దంభోళిసంకాశ వా
క్యతతిఁ జావ శపింప వాఁ డపుడు వీఁకం గూలె న మ్మేదినిఁ. 392

సీ. కై కొని యపుడు లోకం బరాజక మైనఁ ప్రజలు తస్కరపీడఁ బల్లటిల్లఁ
గనుఁగొని దుఃఖించి మునులు గతాసుఁ డై పడిన వేనుని వలపలి భుజంబు
నర్థి మథింప నారాయణాంశంబున నాదిరా జన నొప్పునట్టి పృథుఁడు
జనియించె ననవుడు పిని విదురుఁడు మునిఁ గనుఁగొని పలికె నోయనఘచరిత !

తే. సాధువు సుశీలనిధియును సజ్జనుండు
నలఘు ప్రహ్మణ్యుఁడును [1]నై న యట్టి యంగ
ధరణివిభునకు దుష్టసంతాన మెట్లు
గలిగె ? న య్యంగపతి యేమి కారణమున 393

వ. విమనస్కుం డగుచుఁ బురంబు విడిచె ? ధర్మకోవిదు లైన మునులు దండవ్రత ధరుండును రాజును నగు వేనునియందు నే పాపంబు నిరూపించి *(ప్రహ్మ

---

1. మహాత్మం డనంగ (హ) * తా. ప. ప్రతిలో లేదు.

దండం బొనర్చిరి?) అదియునుం గాక లోకంబుల రాజులు లోకపాల తేజో ధరులుఁ *(ప్రజాపాల నాసక్తులును) గావునఁ గల్మషంబు గలిగినం ప్రజలచేత [1]ననవద్యేయు లై యుందురు కావున నా వేనుని చేష్టితంబులు శ్రద్ధాగరిష్ణుండు భక్తుండు నైన నాకుం బరాపర వి దగ్రేసరుండ వైన నీ వెఱింగింప నర్హుండ వనిన మైత్రేయుం డతని కిట్లనియె. 394

—: అంగపుత్రుం డగు వేనుని చరిత్రము :—

సీ. అనఘాత్మ! రాజర్షి యైనట్టి య య్యంగమేదినీవిభుఁ డశ్వమేధమఖము
గావింప ఋత్విజ్ఞ కాయంబుచేత నాహూతమయ్యును సురవ్రాతమందు
నాత్మహవిర్భాగ మంద రాకుండిన నప్పుడు ఋత్విక్కు లద్భుతంబు
నందుచు యజమానుఁ డైన య య్యంగమహీవరుఁ జూచి రాజేంద్ర! యిట్లు

తే. త్రిదశు లిదె పిల్వఁబడియు సంప్రీతి నాత్మ
భాగములఁ బొంద రారైరి భవ్యచరిత!
యేమిహేతువొ? యిది మాకు నెఱుఁగఁజెప్పు
కడఁగి హోమంబు దుష్టంబు గాదు మఱియు. 395

వ. శ్రద్ధాయుక్తు లై ధృతవ్రతు లైన యీ బ్రహ్మవాదులచేత [2]యోజితంబు లైన యీ ఛందస్సులు వీర్యవంతంబు లై యున్నయవి. ఇందు దేవతాపరాధం బణుమాత్రం బైన నెఱుంగము. ఇట్టిచోటం గర్మసాక్షు లైన దేవతలు స్వకీయ భాగంబు లంగీకరింప కుండుటకుఁ గతం బెయ్యదియో? యనిన న య్యంగుడు దుఃఖితస్వాంతుం డై త న్నిమిత్తంబు సదస్యుల నడుగం దలంచి *(వారల యనుమతిం బడసి) మౌనంబు మాని యిట్లనియె. 396

ఆ. అనఘచరితులార! యాహూతు లయ్యు సు
పర్వగణము లాత్మభాగములను
స్వీకరింప రేను జేసిన యపరాధ
మెట్టి? దనిన వార లిట్టులనిరి. 397

క. నరనాథ! యిదియు నిప్పుడు, పొరసిన దుష్కృతము గాదు పూర్వభవమునఁ
బరఁగిన దురితం బిది [2]యా, దరమున నెఱిఁగింతు మింత ధన్యచరిత్రా! 398

క. నీ వింతవాఁడ వయ్యును, భూవర! సంతానలాభమునుఁ బొందమి నా
దేవతలు యాగభాగము, లీ వేళ భుజింప రైరి యిందుకు నీవుఁ. 399

---

1. అవజ్ఞా నర్హులయి (హ) 2, సంప్రయుక్తంబులైన (హ) 3. నీ, కెఱిగింతుము విన గదయ్య యిద్ధచరిత్రా (క)

తే. పుత్రకామేష్టిఁ గావించి పుత్రుఁ బడయు
మట్లు చేసిన దేవత లాత్మభాగ
మర్థి నంగీకరింతు ర య్యజ్ఞపురుషు
హరి భజించిన సకలకార్యములుఁ గలుగు. 400

వ. అనిన నాతండు సంతానార్థంబు శిపివిష్టదేవతాకం బైన పురోడాశంబుచే హోమంబు గావించినం దదీయ హోమకుండంబునందు హేమమాల్యాంబరుం డైన పురుషుండు హిరణ్మయ పాత్రంబున సిద్ధపాయసంబు గొనుచు నుదయించిన, నప్పుడు విప్రానుమతంబున రాజు త త్పాయసంబు నంజలిచే గ్రహించి యాఘ్రాణించి సంతోషయుక్తుం డగుచు భార్య కొసంగె. అంత. 401

చ. కమలదళాక్షి పాయసము కౌతుకమొప్ప భుజించి [1]భర్తృ సం
గమమునఁ జేసి తత్క్షణమ గర్భము దాల్చి కుమారుఁ గాంచె న
క్కొమరుఁడు నంత మాతృజనకుం డగు మృత్యువుఁ [2]బోలి తా నధ
ర్మమునఁ జరింపుచుండె గుణమండన ! వేనుఁ డనంగ నిచ్చలున్. 402

చ. ఎనయఁగ బాల్యమందుఁ దన యీడు కుమారులఁ గ్రీడవోలె నె
మ్మనమున భీతిలేక కృపమాని పశుప్రకరంబు నొంచు పో
ల్కిని నరికట్టి చంపుచును గిల్బిష లుబ్ధకవృత్తిమై శరా
సన శరముల్ ధరించి మృగజాతి నసాధుగతిన్ వధింపుచున్. 403

వ. ఇట్లు పాపవర్తనుం డై చరియించు కొడుకుం జూచి యంగుండు వివిధ శాసనంబుల దండించియు నతని దుశ్చేష్టితంబులు మానుపం జాలక దుఃఖితాత్ముం డై మనంబున. 404

క. అనయము నిట్టి కుపుత్రునిఁ, గని పరితాపమునుఁ బొందుకంటెను ధరలో
ననపత్యుం డగు టొప్పును, వనజాక్షు భజించునట్టివాఁ డగువాఁడున్. 405

వ. అని వెండియు నిట్లనియె. 406

సీ. జనులకు దుష్పుత్రకునిచేత నపకీర్తి యు నధర్మమును సర్వజనవిరోధ
మును మనోవ్యథయును [3]మునుకొని ప్రాపించు నట్టి కుపుత్రు మోహంబు విడువఁ
జాలక బహుమాన సంగతిఁ గను నెవ్వఁ డతని గేహంబు దుఃఖాలయంబు
నగు నని మతీయు నిట్లను మనుజుండు శోకస్థాన మగు పుత్రుకతనఁ జేసి

---

1. భవ్య (హ) 2. బోలుచున్న ధర్మమున (క. చ. డ.ద.బ.) 3. ననయము (క.తం.వా.)

తే. యనుపమ క్లేశభాజనం బైన గృహము
విడుచుఁ గావున నిట్టి వివేకహీనుఁ
డగు కుపుత్రు సుపుత్రుఁగా నాత్మఁ దలఁతు
ననుచు నా రాజు బహుదుఃఖితాత్మఁ డగుచు. 407

క. తగు [1]మహాదైశ్వర్యోదయ, మగు గృహమును [2]బ్రబల నిద్ర నందిన భార్యఁ
దిగవిడిచి యొక్కడేనియు, జగతీశుఁడు చనె నిశీథ సమయమునందున్. 408

వ. అంతఁ ద ద్వృత్తాంతం బంతయు సుహృ ద్బాంధవ పురోహి తామాత్య ప్రభృతు
లైన ప్రజ లెఱింగి †దుఃఖింపుచున్న తదనంతరంబ. 409

అధ్యాయము - ౧౪

సీ. సమధిక బ్రహ్మనిష్ఠాతి గరిష్ఠులౌ భృగ్వాది మౌనీంద్ర బృంద మపుడు
[3]లోకావనై కావలోకనోత్సుక మౌట జనులు స్వరక్షక జనవిభుండు
లేమిఁ బశుప్రాయు లై మెలంగుటఁ గని యంత వేనునిమాత యగు సునీథ
యనుమతి నఖిల ప్రజావళి కప్రియుం డైన న వ్వేనుఁ బట్టాభిషిక్తుఁ
తే. జేసె నంతట మహితోగ్రశాసనుఁ డగు
వేనుఁ బట్టంబు గట్టుట విని సమస్త
తస్కరులు సర్పభీతిచేఁ దలఁగు మూష
కములకై వడిఁ గడఁగిరి గహనములకు. 410

వ. అంత నతండు. 411

చ. పరువడి నష్ట లోకపరిపాలకముఖ్య విభూతియుక్తుఁ డై
పరఁగి నృపాసనంబున విభాసితుఁ డౌట స్వభావసిద్ధ మై
వఱలు మహావలేపమున వారక సంతత మాననీయ స
త్పురుషుల నెల్ల నెందుఁ బరిభూతులఁ జేయుచు నుండె నిచ్చలున్. 412

---

1. సుమహైశ్వర్యోదయ (తం. వా.) 2. ప్రబల (డ) 3. కైకొని లోకరక్షకులగుట నిజ లోక జనరక్షకుండగు జనవిభుండు (క. జ. బ.)

† ఈ క్రిందివాక్యము తం. వా. ప్రతులలోను, మూలములోను నున్నది. వ్రాఁతప్రతులలో లేదు.

దుఃఖించుచు భూమియం దెల్ల యెడలఁ దదన్వేషణం బాచరించి గూఢుండై న పరమపురుషునిం గానలేని కుయోగి చందంబున నారాజుం బొడగానలేక విఫలోద్యోగులయి మగిడి పురంబునకు వచ్చిరి. తదనంతరంబ.

చ. మటియు నతండు భూ గగనమార్గములం దొకవేళ నొక్కఁడే
యరదము నెక్కి క్రుమ్మరు నిరంకుశవృత్తిఁ జరించు మత్తసిం
ధురవిభుపోల్కి సత్పురుషదూషితవర్తన నొప్పుచుఁ నిరం
తర సుజనాపరాధ కృతితత్పర మానసుఁ డై క్రమంబునఁ. 413

క. దివ్యులు వెఱఁగందఁగఁ బ్ర, థ్వీవ్యోమము లగల భేరి వ్రేయించె "[1]నయ
ష్టవ్య మదాతవ్య మహో, తవ్యం విప్రాయ" యను చుదాత్త ధ్వనులఁ. 414

క. అని యిట్టులు భేరీరవ, మునఁ జేసి సమస్తధర్మములు వారింపఁ
మును లవినీతుం డగు వే, నుని దుశ్చరితంబు జనమనోభయ మగుటఁ. 415

తే. కని కృపాయత్తు లగుచు నిట్లనిరి యిట్టి
రాజచోరభయంబు లీ భూజనులను
బలిసి యిరువంకలను బాధ పఱుపఁజొచ్చె
దారువందుల వహ్నిచందమునఁ బెలుచ. 416

చ. అరయ నరాజకం బగు మహాభయముం [2]దొలఁగించు వార మై
‡కర మతదర్హా గర్హాతుని ఢ్మాపతిఁ జేసినయట్టి దోషమున్
బరువడిఁ జెందె దుగ్ధరసపానమునం బరివృద్ధి నొందు న
[3]య్యురగభయంబు పోషకుని నొందినరీతి ననర్థహేతు వై. 417

వ. అదియునుం గాక 418

క. మునుకొని సునీథ గర్భం, బున జనియించియు స్వభావమున దుర్జనుఁ డై
యెనయఁ బ్రజాపాలనమున, కును బాల్పడి ప్రజల [4]మనికిఁ గొనఁ జొచ్చెఁగదే! 419

వ. అదిగాన యీ వేనుండు పూర్వంబున జ్ఞానసంపన్నుల మైన మనచేత రాజుగాఁ జేయంబడియె. ఇట్టివాని మన మందఱమును గూడి ప్రార్థింతము. లోకరక్షణార్థంబు గావునఁ ద ద్దోషంబు మనల స్పృశింపదు. సమీచీనోక్తులఁజేసి వీని ననునయింప వాని గ్రహింప కుండెనేనియు మున్న లోకధిక్కా రాగ్ని సందగ్ధుం డగు వీని మన తేజోమహాగ్నిచేత భస్మీభూతుం జేయుదము. అని (యాలోచించి గూఢమన్యు లగుచు) వేనునిం గదియం జని యతని కి ట్లనిరి. 420

---

1. న యష్టవ్యం దాతవ్యం హోతవ్యం విప్రాయ యను నుదాత్త ధ్వనులన్. (హ)
2. దొలఁగింపఁ గోరి యిట్లెఱుఁగక యీ యనర్హుని మహీపతిఁ జేసినయట్టి (తం. వా.)
‡ అరాజక భయాదేష కృతో రాజాఽతదర్హణః" (14-9).
3. ఉరగముభీతి (తం. వా.) ఉరగము నై జపోషకుని నొంచినరీతి (హ) 4. మన్నిగొనఁజొచ్చె (తం. వా.)

క. నరపాలక ! నీ కాయువు, సిరియును బలమును యశంబు చేకుఱు వృద్ధిఁ
బొరయుదు గా కనుచు మనో, హరముగ నాశీర్వదించి యతివినయమునఁ.

వ. ఇట్లనిరి. నరేంద్రా! యే మొక్కటి విన్నవించెదము. అవధరింపుము. పురుషులకు వాఙ్మనఃకాయ వృత్తులవలన నాచరించు ధర్మంబు సమస్తలోకంబుల విశోకంబులం జేయు. అసంగులైనవారికి మోక్షంబు నిచ్చు. అట్టి ధర్మంబు ప్రజలకు క్షేమకారణంబు గావున నీయందుఁ జెడకుండుం గాక యని పలికి, మఱియు ధర్మంబు నాశంబు నొందిన నైశ్వర్యంబుచే రాజు విడువంబడు. అనిచెప్పి వెండియు నిట్లనిరి. దుష్టచిత్తులగు నమాత్యులవలనను దస్కరులవలనను ప్రజలు నాశంబు నొందకుండ రక్షింపుచు *(యథాన్యాయంబుగ వారలచేఁ గరంబుగొనుచునుండు) మహీపతి యిహపరసౌఖ్యంబుల నందు. అదియునుం గాక యెవ్వని రాష్ట్రంబుననేని పురంబుననేని యజ్ఞేశ్వరుం డైన పురుషోత్తముండు నిజవర్ణాశ్రమోచితం బైన ధర్మంబు గలవారిచేత యజియింపంబడు నట్టి నిజశాసనవర్తియగు రాజువలన సర్వభూతభావనుండు మహాభాగుండు భగవంతుండు నగు సర్వేశ్వరుండు నంతుష్టుం డగు. అట్టి సకలజగదీశ్వరుం డైన సర్వేశ్వరుండు సంతోషించిన రాష్ట్రాధిపతికి సర్వసౌఖ్యంబులుఁ బ్రాపించు. లోకపాలకు లగువారు సర్వేశ్వరునికొఱకు బలిప్రదానంబులు సేయుదురు. సమస్తలోక దేవతా యజ్ఞాది సంగ్రహుండు, వేదమయుండు, ద్రవ్యమయుండు, దపోమయుండు నగు నారాయణుని విచిత్రంబు లైన యజ్ఞంబులచేత యజనంబు చేసిన నీకు నభయం బగు. మోక్షంబును గలుగు. కావున నీ రాజ్యంబున మఖంబులు సేయుమని యాజ్ఞాపింపుము. నీ దేశంబునం జేయంబడిన యజ్ఞంబులచేత హరికళాయుక్తంబు లగు దేవగణంబులు (స్విష్టంబు లై) తుష్టంబు లగుచు భవదీయ వాంఛితార్థంబు లిత్తురు గావున దేవతా తిరస్కారంబు నీకు యుక్తంబు గాదు. (వేదచోదితంబు లగు ధర్మంబులం దాసక్తుండవు గమ్ము.) అనిన వేనుండిట్లనియె. 422

క. మునులార ! మీర లిప్పుడు, నను నీగతిఁ బడుచుఁదనమునం బలికితి రై
నను, మీర లధర్మముఁ దగ, ననయము ధర్మం బటంచు ననియెద రైనఁ. 423

వ. అదియునుం గాక. 424

చ. ఎనయఁగ జారకామిని నిజేశుని మ్రుచ్చిలి జారపూరుషుఁ
దనపతిఁగా దలంచుగతిఁ దద్దయు మూఢమనస్కు లై తన

---

* తా. ప. ప్రతులలో లేదు. బాలిశా బత యూయం వో అధర్మే ధర్మమానినః (4. 14. 23) అది యధర్మ ముందుల నెనయఁగ ధర్మమనఁ గలదె యెచ్చటనైనన్ (తం. వా.)

ర్చిన నరపాలరూపము ధరించిన యీశ్వరు న న్నెఱుంగ క
న్యుని భజియింప మీ రిహపరోన్నత సౌఖ్యము లంద రెన్నఁడుఁ. 425

వ. అని మఱియు ని ట్లనియె. యజ్ఞపురుషుం డన నెవ్వఁ డెవ్వనియందు మీకు భ క్తి
స్నేహంబు లుదయించె. భర్తృస్నేహ విదూరంబు లై కుయోషిద్గణంబులు
జారునందు చేయు భ క్తిచందంబునఁ బలికెదరు. అదియునుం గాక. 426

క. హరి హర హిరణ్యగర్భ, స్వ రధీశ్వర వహ్ని శమన జలధిపతి మరు
న్నరవాహన శశి భూ రవి, సురముఖ్యులు నృపశరీర సూచకు లగుటఁ. 427

క. పరికించి నను భజింపుఁడు, ధరణీశుఁడు సర్వదేవతామయుఁ డగు మ
త్సర ముడుగుఁడు నాకంచెను, బురుషుఁడు మఱి యెవ్వఁ డగ్రపూజార్హుఁ డిలఁ.

వ. అదిగాన మీరు నాయందు బలివిధానంబులు సేయుఁడు. అని పాపకర్ముండును,
అసత్ప్రవర్తకుండును, నష్టమంగళుండును, విపరీతజ్ఞానుండును నగు వేనుండు
*(పండితమాని యగుచుం) బలికి మునులవచనంబులు నిరాకరించి యూర
కుండిన మునులు భగ్నమనోరథు లై తమలో నిట్లనిరి. ఈ దారుణకర్ముం డైన
పాపుండు హతుండు గాక జీవించెనేని వీనిచేత నీజగంబులు భస్మంబులు గాఁగలవు.
ఇది నిశ్చయంబు. (దుర్వృత్తుం డగు) వీఁడు మహారాజ సింహాసనంబున
కర్హుండుఁ గాడు. ఇతండు నే సర్వేశ్వరు ననుగ్రహంబున నిట్టి విభూతియుక్తుం
డయ్యె నట్టి యజ్ఞపతి యైన శ్రీవిష్ణుని నిందింపు చున్నవాఁడు గావున నిర్లజ్జుం
డైన హరిదూషకుని హననంబు సేయవలయు. అని మును లుద్యోగించి, యాత్మ
ప్రకాశితం బైన క్రోధంబునంజేసి హుంకార మాత్రంబున నా యీశ్వర నిందా
హతుం డగు వేనునిం బొలియఁజేసి రంత. 429

క. అరయ సునీథయు శోకా, తుర యై తనసుతుఁడు తనువుఁ దొఱఁగినఁ దదనం
తరమునను యోగశక్తిఁ బరువడి [1]నిజతనయు తనువుఁ బరిపాలించెఁ. 430

వ. అంత నొక్కనాఁడు. 431

సీ. మునివరేణ్యులు భక్తిదనర సరస్వతీ సలిలంబులను గృతస్నాను లగుచు
మునుకొని త త్తీరమున నగ్నిహోత్రముల్ విలసిల్ల నియతిఁ గావించి యచటఁ
దవిలి సత్పురుష కథా వినోదంబులు సలుపుచు నుండంగ సకలలోక
భయదంబు లగు మహోత్పాతముల్ దోఁచిన మసలి లోకంబు లమంగళమొంద

---

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

1. నిజరాజ్య మరసి పరిపాలించెన్ (క. చ. జ. తం.)

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

తే. పొరయకుండెడుఁ గాకని బుద్ధిలోనఁ
దలఁపుచుండఁగఁ బెలుచ నుదగ్ర మగుచు
సర్వదిశలను బాంసువర్ష ంబు గురిసెఁ
దస్కరులు సర్వజనుల విత్తములు గొనిరి. 432

వ. ఇట్టి లోకోపద్రవం బెఱింగి జననాథుం డుపరతుం డగుటంజేసి జనపదంబు లరాజకంబు లై యన్యోన్యహింసల నొందుచుం దస్కరబాధితంబు లగుచు నుండుట యెఱింగియుఁ ద న్నివారణంబునకు సమర్థు లయ్యును జోరాది బాధలం గనుఁగొనుచు మునులు వారింపక యుండిరి. సమదర్శనుండును, శాంతుండును, మననశీలుండును నగు బ్రాహ్మణుండు దీనుల నుపేక్షించిన, నతనితపంబు భిన్నభాండగతం బైన క్షీరంబు చందంబున [1]స్రవించుం గావున నంగదేశాధీశ వంశోద్భవులు హరిపదాశ్రయు లగుటం జేసియు, నమోఘ సత్త్వనిష్ఠు లగుటంజేసియు, వీరల వంశంబు విచ్ఛిత్తినొందింప ననర్హ్యంబు గాన స్థాపనీయం బని నిశ్చయించి, మృతుం డైన వేనుని కళేబరంబు డగ్గఱ వచ్చి తదూరుమథనంబు గావింప నందు.

సీ. ఘన కాకకృష్ణసంకాశ వర్ణుండును హ్రస్వావయవుఁడు మహాహనుండు
హ్రస్వబాహుండును హ్రస్వపాదుండును నిమ్ననాసాగ్రుండు నెఱయు రక్త
నయనుండుఁ దామ్రవర్ణ శ్మశ్రుకేశుండు నతిదీన వదనుండు నై నయట్టి
యొక్క నిషాదకుం డుదయించి యేమిచేయుదు? నని పలుకుచునున్నఁ జూచి

తే. వరమునులు 'నిషీద' యనుచుఁ బలుకుటయును
దాన వాఁడు నిషాదాభిధానుఁ డయ్యె
నతనివంశ్యులు గిరికాననలందు వేను
కల్మషము [2]చెర్పుచుండిరి కడఁక మెఱయు. 434

అధ్యాయము - ౧౪

క. [3]కని వా రనపత్యుం డగు, మనుజేంద్రుని బాహు లంత మథియించిన నం
దనఘుం బగు నొక మిథునము, జనియించెను సకలజనులు సమ్మద మందన్. 435

---

1. ఱయించున్ (హ. తం. వా.) "స్రవతే బ్రహ్మ తస్యాపి భిన్నభాండా త్పయో యథా" (14. 41) 2. తెల్పుచుండిరి (హ. తం. వా.) "తస్య వంశ్యాస్తు నైషాదా గిరికానన గోచరాః యే నాహరజ్జాయమానో వేన కిల్బిష ముల్బణమ్ (14-47) 3. అనయము ననపత్యుఁడు నగు (క. చ. తం.)

వ. అందు లోకరక్షణార్థంబుగా నారాయణాంశంబున నొక పురుషుండును, వారికి నిత్యానపాయిని యగు లక్ష్మీకళాకలితయు, *(గుణంబులకు భూషణంబు లకు నలంకార ప్రదాత్రియు నగు) కామినియు జనియించె. అందుఁ బృథుశ్ర వుండును, బృథుయశుండు నగుట నతండు పృథుచక్రవర్తి యను పేరం బ్రసిద్ధుం డయ్యె. అంగనయు నర్చి యను నామంబునం దనరుచు నతని వరియించె. ఆ సమయంబున. 436

సీ. అందంద గురియించి రమరులు మునినాథవితతి మోదం బంద విరులవానఁ
బరమానుర క్తి శుంభల్లీలఁ జూపట్టె సురపతి వీట నచ్చరలయాట
కర్ణరసాయన క్రమమున వీతెంచెఁ బఱపైన తేట కిన్నరులపాట
యనిమిష కరహతం బై చాలఁ జెలఁగెను [1]విభవోత్సవంబు దుందుభిరవంబు

తే. మునినుతి చెలంగె [2]శిఖి గుండముల వెలింగె
నంత నచటికి సరసీరుహాసనుండు
గరుడ గంధర్వ కిన్నర గణముతోడ
నర్థిఁ జనుదెంచె సంతోష మతిశయిల్ల. 437

వ. అంత. 438

కవిరాజవిరాజితము :

అరయఁగ వైన్యుని దక్షిణహ స్తమునందు [3]రమారమణీ సుమనో
హరు లలితాయుధచిహ్నము పాదములందు సమగ్ర హలాంకుశ భా
స్వరకులిశ ధ్వజ చాప సరోరుహ శంఖ విరాజిత రేఖలు వి
స్ఫురగతి నొప్పఁ బితామహముఖ్యులు చూచి సవిస్మయు లై మఱియున్. 439

వ. *(ఇతండు నారాయణాంశ సంభూతుండు నితని యంగన రమాంశ సంభూతయుం గానోపుదు రని తలంచిరి. అ య్యవసరంబున బ్రహ్మవాదు లగు బ్రాహ్మణో త్తము లతనికి విధ్యు క్త ప్రకారంబున రాజ్యాభిషేకంబు [4]గావించు సమయంబున. 440

క. సరి దంభోనిధి ఖగ మృగ, ధరణీ సురవర్త్మ పర్వత ప్రముఖము లై
పరఁగిన భూతశ్రేణులు, నరవరునకుఁ దగు నుపాయనము [5]లిచ్చె నొగిన్. 441

---

* కొన్ని తా. ప. ప్రతులలోలేదు.

1. ప్రభవోత్సవకర దుందుభి రవంబు (హ) 2. రవిచంద్రములు వెలింగె (క. చ. ట. త. జ) 3. రమారమణీయమనో, హర లలితాయుధ చిహ్నము లంఘ్రుల (తం. వా.) 4. కావించిరి తదనం తరంబ (చ. తం. వా) 5. లిచ్చిరొగిన్ (హ)

తే. సమధికఖ్యాతి నా పృథుచక్రవర్తి
దేవి యగు నర్చితోఁగూడ దివ్యవస్త్ర
గంధ మాల్య [1]ప్రభూషణకలితుఁ డగుచుఁ
బావకునిఁ బోలి సత్ప్రభాభాసి యయ్యె. 442

సీ. రాజరా జా పృథురాజుకు హేమమయం బైన వీరవరాసనంబు
జలపతి జలకణ స్రావకం బగు పూర్ణచంద్ర సన్నిభ సితచ్ఛత్రకమును
బవమానుఁ డతులశోభన మగు వాలవ్యజనసమంచిత సిత చామరములు
ధర్మ్మిండు నిర్మలోద్య త్కీర్తిమయ మగు మహనీయ నవపుష్ప మాలికయును

తే. జంభవైరి కిరీటంబు శమనుఁ డఖిల
జన నియామక దండంబు జలజభవుఁడు
నిగమమయ కవచమును వాణీలలామ
[2]యచ్చ మగు నవ్యహారంబు లిచ్చె మఱియు. 443

సీ. దామోదరుండు సుదర్శనచక్రంబు నవ్యాహ తైశ్వర్య మబ్జపాణి
[3]చంద్రార్ధధరుఁడును జంద్రమండల దళ కమనీయ కోశసంకలిత ఖడ్గ
మంబిక శతచంద్ర మను [4]జోడు చందురు డమృతమయ శ్వేత హయచయంబుఁ
ద్వష్ట రూపాస్త్ర యోదా త్తరథంబును భానుండు ఘృణిమయ బాణములును

తే. [5]శిఖియు నజగోవిషాణ సంచిత మహోజ
గవ మనం దగు చాపంబు నవనిదేవి
యోగమయ మైన పాదుకాయుగము గగన
చరులు గీతంబు లిచ్చిరి సంతసమున. 444

వ. వెండియుం బ్రతిదినంబు నాకాశంబు పుష్పంబులు గురియింప మహర్షులు సత్యంబు లైన యాశీర్వచనంబులు సలుప సముద్రుండు శంఖంబును, నదంబులు పర్వతంబులు నదులును రథమార్గంబులు నొసంగె. తదనంతరంబ సూత మాగధ వంది జనంబులు దన్ను నుతియించినం (బ్రతాపశాలి యగు) న వైన్యుండు మందస్మిత సుందరవదనారవిందుం డై చతురవచనరచనుం డగుచు మేఘ గంభీర భాషణంబుల ని ట్లనియె. 445

---

1. విభూషణ (తం.వా) 2. స్వచ్ఛమగు నవ్యహారంబు సమత నిచ్చె (క. బ. తం. వా)
3. చంద్రార్ధధరుం డర్ధచంద్రరేఖాంకిత (క. చ. త. తం. వా.) "దళ చంద్ర మసిం రుద్రః" (15-17) 'దళచంద్రాకారాణి బింబాని కోశే యస్య త మసిం ఖడ్గం' (వ్యా) 4. ఫలకము జంద్రుఁడు (హ.తం.వా) 5. శిఖ యజా గో విషాణ (క.త. డ. ద. బ.)

సీ. వందిమాగధ సూతవరులార ! నాయందుఁ గమనీయగుణములు గలిగెనేని
యర్హాంబు నుతిఁ జేయ నవి లేవు నాయందు నదిగాన మీ నుతి వ్యర్థమయ్యె
నిటమీఁద గుణముల నేపారియుండిన నపుడు [1]నుతించెద రగుట మీరు
[2]సభ్యనియుక్తు లై చతురత నుత్తమశ్లోకుని గుణము లస్తోక భూప్ర

తే. సిద్ధములు గాన సన్నుతిసేయుఁ డజుని
నతని బహువిధ [3]భావంబు లభినుతింప
నలవిగాకయె యుండుదు రదియుఁ గాక
చతురమతులార ! మాగధజనములార ! 446

వ. మఱియు మహాత్ముల గుణంబులు దనయందు సంభావితంబులు సేయ సామ
ర్థ్యంబు గలిగిన నందు మహాత్ముల గుణంబులు ప్రసిద్ధంబులు గావునం ద త్సమం
బుగా నెట్లు నుతింపవచ్చు? ఎవ్వండే నొకండు శాస్త్రాభ్యాసంబునం దనకు
విద్యా తపో యోగ గుణంబులు గలుగు నని పలికిన, వానిం జూచి సభ్యులు
పరిహసింతురు. (అది కుమతి యగువాఁ డెఱుఁగండు.) అదియునుం గాక. 447

క. [5]అతి పరిశుద్ధులు లజ్జా, న్వితులు మహోదారు లధికనిర్మలు లాత్మ
స్తుతి పరనిందలు దోషము, లతిహేయము లని తలంతు రాత్మల నెపుడుఁ 448

క. వందిజనంబులు [6]లోకము, లందున విదితవరకర్మ లగు భూపతులఁ
నందించు టవశ్యం బై, నం దగదు నుతింప శిశుజనంబుల పగిదిఁ. 449

అధ్యాయము — ౧౬

క. అన సూత వంది మాగధ, జను లా నరనాయకుని వచనములు వినియుఁ
మునిచోదితు లై క్రమ్మఱ, ననురాగము లుప్పతిల్ల న మ్మనుజేశుఁ. 450

వ. అమృతోపమానంబు లైన మధురవాక్యంబుల ని ట్లనిరి. 451

క. వేనాంగ సంభవుండవు, శ్రీనాథ కళాంశజుఁడవు చిరతరగుణ స
న్మానార్హాండ వతర్కిత, మైన భవన్మహిమఁ బొగడన లవియె? మాకుఁ. 452

---

1. నుతించెద మంటి రేని (తం. వా.) 2. చతుర భాషణులైన సభ్యులు నుత్తమ (క. చ. బ. తం.) 3. భావంబులను నుతింప (హ) 4. అలవి గాదని సేయరు నదియుగాక (క. త. ద. బ.) 5. అతిప్రసిద్ధులు లజ్జాన్వితులును నగునట్టి సభ్యనికరము లాత్మ (క. బ.) 6. లోకమునందు-నవిదిత (వా): లోకమునందును బరిశిష్ట కర్ములగు (తం)

ప్రభవో హ్యాత్మనః ఖ్యాతిం జుగుప్సం త్యతి విశ్రుతాః (15-26)
ప్రభవోఽపి విశ్రుతా అపి హ్రీమంతః జుగుప్సంతి (వ్యా)

క. అని వెండియు నిట్లని రై, నను నొక మార్గంబు గలదు నందింప భవ
ద్ఘన చరితామృతపానం, బునఁ జేసియు మునుల వచనములఁ జేసి తగఁ. 453

వ. శ్లాఘ్యంబు లైన భవదీయ చరిత్రంబుల స్తుతియించెద మని యి ట్లనిరి. 454

సీ. ఈ వైన్యుఁ డఖిలలోకావళి ధర్మానువర్తనముల నెపుడు వఱలఁజేసి
ఘన ధర్మమార్గ [1]వర్తనులలో ధుర్యుఁ డై ధర్మసేతువుఁ బ్రీతిఁ దగిలి ప్రోచు
[2]ధర్మశాత్రవులను దండించు [3]నష్టదిక్పాలకమూర్తి సంకలితుఁ డగుచు
న య్యయి కాలంబులందు [4]పోషణదానములఁ బ్రజారంజనములఁ దనర్చు

తే. [5]సవన సద్వృష్టి కరణాది సక్తుఁ డౌట
నుభయలోకంబులకుఁ బ్రీతి నొదవఁజేయు
న్యాయమార్గంబునను భూజనాళి ధనముఁ
బుచ్చుకొను నిచ్చు సూర్యునిఁ బోలి యితఁడు. 455

వ. మఱియును. 456

సీ. సర్వభూతములకు సముఁడును బర్యతిక్రమమున లోకాపరాధములను
నతిశాంతి సంయుక్తుఁడై సహింపుచు నార్తులగు వారియెడఁ గృపాయత్తుఁ డగుచు
నరరూపుఁ దాల్చిన హరిమూర్తి గావున నింద్రుండు వర్షించి యెల్లప్రజల
రక్షించుగతిఁ దానురక్షించు నమృతాంశు సన్నిభ వదనాబ్జ సస్మితాను

తే. రాగమిళి తావలోకనరాజిఁ జేసి
సకలజనులకు సంప్రీతి సంభవింపఁ
జేయు సంతతమును గూఢచిత్తుఁ డగుచు
శత్రువరుల [6]కగమ్యుఁ డై సంచరించు. 457

వ. అని వెండియుం బ్రవేశనిర్గమశూన్య మార్గ [7]నిగూఢకార్యుండును, నపరిమిత మహత్త్వాది గుణగణైక ధాముండును, సముద్రునిభంగి గంభీరచిత్తుండు (నుపగుప్త విత్తుండును, వరుణునింబోలి సంవృతాత్ముండును శాత్రవా) సహ్య ప్రతాప యుక్తుండును, *(దురాసదుండును) సమీపవర్తియయ్యును దూరస్థుని భంగి వర్తింపుచు, వేనారణి జనిత హుతాశనుండు గావున హుతాశను చందంబున నన్యదుస్స్పర్శనుండును నై చారులవలన సకలప్రాణి బాహ్యాభ్యంతర కర్మంబులఁ

---

1. వర్తనులతోఁ దుల్యుఁడై (తం) ——ధన్యుఁడై (వా) 2. ధరను శాత్రవులను (తం. వా.) 3. దిక్పాలకావయవ (క. బ. తం.) 4. దండాదండముల (హ). భాషణదాన(క.ట.ద.బ.); 5. సవనకరణాది కాచారసమితిచేత (చ. ట. త. డ. ద. బ.) 6. అసాధ్యుఁడై (హ) 7. నిరూఢ (హ)

* తా. ప. ప్రతులలో లేదు.

దెలియుచు, (దేహధారులకు నాత్మభూతుం డయి సూత్రాత్మకుం డైన వాయువుభంగి వర్తించుచు నాత్మస్తుతి నిందల వలన నుదాసీనుం డగుచు, (ధర్మపథంబున వర్తించుచు) నాత్మీయ సుత సుహృజ్జనుల వలనం దప్పు గలిగినను దండించుచు (నాత్మశత్రు పుత్రుల నైన) నదండ్యుల దండింపక, ధర్మమార్గగతుం డగుచుఁ, దన యాజ్ఞాచక్రం (బప్రతిహతం బగుచు) మానసాచల పర్యంతంబు వర్తింప సూర్యుండు నిజకిరణంబులచేత నెంతపర్యంతంబు భూమిం బ్రకాశింపంజేయు నంతపర్యంతంబు నిజగుణంబులచేత లోకంబుల రంజిల్లంజేయు. అదియునుం గాక ప్రకృతిరంజకంబు లైన గుణంబులచేత ధృఢవ్రతుండును, సత్యసంధుండును, బ్రహ్మణ్యుండును, సర్వభూతశరణ్యుండును, వృద్ధసేవకుండును, మానప్రదుండును, దీనవత్సలుండును, పరవనితా మాతృభావనుండును, తన పత్ని నర్ధశరీరంబుగాఁ దలంచువాఁడును నగుచుం బ్రజలయెడఁ దండ్రివలెఁ బ్రీతిసేయుచు రక్షింపుచు నుండు. మఱియు. 458

సీ. తలపోయ బ్రహ్మవిద్యా[1]యుక్త జనముల కనయంబుఁ గింకరుం డైనవాఁడు
[2]నఖిల శరీరి గుణాప్త సుహృజ్జనతానందకరుఁ డన నలరువాఁడు
సంసార ఘనకర్మ సంగహీనులయందు [3]సంగసంప్రీతుఁ డై జరుగువాఁడు
దుర్మార్గ మనుజ సందోహంబునకు నుగ్ర దండధరుం డనఁ దనరువాఁడు

తే. ప్రకృతి[4]పురుషకావేశుఁ డై పరఁగువాఁడు
భగవ దవతారయుక్తుఁ డై నెగడువాఁడు
నగుచు వర్తించు సమ్మోద మతిశయిల్లఁ
జారుతరమూర్తి యా రాజచక్రవర్తి. 459

వ. మఱియుం*(ద్రష్టీశుండుఁ)గూటస్థుండుఁ, బరమాత్మయు, బ్రహ్మకళారూపుండు నగువాఁడు నై యుదయించెం గావున నితనియందు నవిద్యారచితం బై ప్రతీతం బగు భేదంబు నిరర్థకం బగు నని పెద్ద లగువారలు చూతురు. అని మఱియు ని ట్లనియె. 460

సీ. ఉదయాద్రిపర్యంత మురీకృతలం బేకవీరుఁ డై రక్షించి వెలయు నీతఁ
డొకనాఁడు విజయయాత్రోత్సవం బేపార సన్నద్ధుఁ డై మణిస్యందనంబు
నెక్కి చాపముఁ బూని దిక్కుల సూర్యుని పగిదిని శత్రుభూపాలతమము
విరియింతు నని చాల వెలుఁగొందుచును ధరాచక్ర ప్రదక్షిణశాలి యగుచుఁ

---

1. నిష్ఠ (హ) 2. అఖిలశరీరగుఁ డాప్త సుహృజ్జనతా (త.వా.) దేహినామాత్మ వత్ప్రేష్ఠః (16.18) అని మూలము. 3. సంతత (త) 4. ప్రకృతి పురుషుల కధీశుడై (క); ప్రకృతిపురుషకాదేశుడై (ట) * కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

తే. దిరుగునెడ సర్వదిక్పాలవరసమేత
పార్థివోత్తమనికర ముపాయనంబు
లిచ్చి తనుఁ జక్రపాణికి నెనయు నాది
ధరణివిభుఁ డని నుతియించి తలఁతు రనుచు. 461

క. ఈ నృపతి ధరాచక్రము, ధేనువుఁగాఁ జేసి పితుకు ధృతి నఖిల పదా
ర్థానీకము విబుధులు స, న్మానింపఁగఁ బ్రజకు జీవన ప్రదుఁ డగుచున్. 462

చ. అమరవరేణ్యుఁ బోలి యనయంబు నితండును గోత్రభేదన
త్వమునఁ జెలంగుచు న్నజగవ ప్రదరాసన శింజినీ నినా
దమున విరోధిభూపతులు దల్లడమంద నసహ్య సింహ వి
క్రమమున సంచరించు ననిఁ కౌతుకమొప్పఁగఁ బల్కఁ వెండియున్. 463

వ. ఇట్లనిరి. 464

చ. [1]సకలజగన్నుతుం డితఁడు చారుయశోనిధి యశ్వమేధముల్
[2]ప్రకటముగా శతంబు దగఁ బావన మైన సరస్వతీ తటీ
నికటధరిత్రిఁ జేయుతటి నేర్పున నంతిమయాగమందుఁ గొం
జక మఖసాధనాశ్వమును జంభవిరోధి హరించు నుద్ధతిన్. 465

సీ. ఒకనాఁడు నిజమంది రోపాంతవనమునఁ జని యందు [3]సద్గుణశాలి యైన
ఘనుని సనత్కుమారునిఁ గాంచి య మ్మునివరు బ్రహ్మతనయుని వరుస భక్తిఁ
బూజించి [4]విజ్ఞానమునుఁ బొందు [5]దానిచే బ్రహ్మవేత్తలు మునిప్రవరు లవని
[6]భావిత ముక్తిసంపన్ను లై వర్తింతు రి మ్మహారాజు మహీతలంబు

తే. నందు విశ్రుతవిక్రముఁ డగుచు మిగులఁ
దన కథావళి భూప్రజాతతి నుతింప
నక్కడక్కడ వినుచు శౌర్యమున నఖిల
దిక్కులను గెల్చి వర్తించు ధీరయశుఁడు. 466

అధ్యాయము - ౧౯

వ. ఇట్లు [7]విపాటిత విరోధి శల్యుండు సురాసుర [8]జేగీయమాన నిజవైభవుండు నై ధరాచక్రంబున కితండు రా జయ్యెడి. అని యి ద్విధంబున స్తోత్రంబుసేసిన వంది

---

1. సకలదిగంతరాళముల (క. చ. బ. తం.) 2. ప్రకటముగా నొనర్చుటను భారతిసన్నిధి నుండి వెండియున్ (క. బ.) 3. షడ్గుణ (హ) 4. తత్ఫలమునుబొందు (చ. ట. జ. డ. బ.) 5. నచ్చట (క. చ. ట. జ. బ.) 6. మానితలబ్ధ విజ్ఞానులై (క. చ. ట. ద. బ.) 7. విపాటిత విరోధి మనళ్ళల్యుండు (హ) 8. జేగీయమానుండును నై (క. డ. ద. బ.)

మాగధ సూత జనంబులం బృథుచక్రవర్తి పూజించి మఱియుం బ్రాహ్మణ భృత్యామాత్య పురోహిత పౌర జానపద తైలిక తాంబూలిక (నియోజ్య) ప్రము ఖాశేషజనంబులం దత్తదుచితక్రియలం బూజించె. అని మైత్రేయుండు చెప్పిన విని విదురుం డిట్లనియె. 467

—: పృథుచక్రవర్తి గోరూపధారిణి యగు భూమివలన నోషధుల బిదుకుట :—

సీ. [1]ఏమి నిమిత్త మై భూమి గోరూపిణి యయ్యె? దానికి వత్స మయ్యె నెద్ది?
[2]గొనకొని దోహనమునకు నర్హం బైన పాత్ర మెయ్యది? దలఁపంగ దోగ్ధ
యైన యా పృథు వే పదార్థముల్ పితికెను? బరికింప నవని స్వభావమునను
విషమ మై యుండియు వెలయంగ నేరీతి సమగతిఁ జెందెను? జంభవైరి

తే. క్రతుహయంబును గొనిపోవఁ గార్య మెద్ది?
ధీరనిధి [3]యాతఁడు సనత్కుమారువలనఁ
గలితవిజ్ఞానుఁ డగుచు నేగతినిఁ బొందె
ననఘచారిత్ర! మైత్రేయ! యదియుఁ గాక. 468

వ. మఱియుఁ (బరబ్రహ్మంబును) భగవంతుండును (బుణ్యశ్రవణకీర్తనుండును సర్వనియామకుండును నగు కృష్ణుని యవతారాంత రాశ్రయం బగు పుణ్యకథ లన్నియు) నీకును, నధోక్షజునకును దాసుండ నైన నాకు నెఱింగింపు మనిన వాసుదేవకథా సంప్రీతచేతస్కుం డగు విదురుం బ్రళంసించి మైత్రేయుం డిట్లనియె. అట్లు బ్రాహ్మణజనంబులచేత రాజ్యంబునం దభిషిక్తుం డగుచు సకల ప్రజాపాలన నియుక్తుం డై పృథువు రాజ్యంబు సేయుచుండు నంత *(నీరస యగు ధరిత్రియం దన్నరహితు లగుచుం) బ్రజలు తుత్పీడా క్షీణ దేహు లై వైన్యునిఁ జూచి యిట్లనిరి. 469

క. అరయఁగ నేము బుభుక్షా, పరిపీడం బడితి మయ్య! పైకొని తరుకో
టరజనిత వహ్నిచేతను, దరికొను వృక్షములఁ బోలి ధరణీనాథా! 470

క. శరణశరణ్యుఁడ వగు నిను, శరణము వేఁడెదము మాకు సత్కృప నన్నం
బరసి కృపఁ జేసి బ్రోవుము, నరనాయక! యనుచుఁ బ్రజలు నతు లై పలుకన్. 471

క. విని దానికి సదుపాయము, జననాయకుఁ డాత్మఁ దలఁచి సక్రోధుం డై
ధనువున బాణముఁ దొడిగెను, ఘన రౌద్రుం డైన త్రిపురఘస్మరు పగిదిన్. 472

---

1. ఏవిధంబున భూమిదేవి గో రూపయై, వరలెను దానికి వత్స మెద్ది (త.బ.) 2. కొనగొని—శుద్ధంబైన (త. ద. బ.); 3. యైన బ్రహ్మకుమారువలన (హ) * తా. ప. ప్రతులలో లేదు.

వ. ఇట్లు దొడిగిన. 473

క. మహిపతి నప్పుడు గనుఁగొని, [1]మహి గోరూపమునఁ గంప్యమానయు నగుచుఁ
గుహకుం డగు లుబ్ధకుఁ గని, గహనంబునఁ బాఱు హరిణికై వడిఁ బాఱెఁ.474

వ. ఇట్లు ధరణి పాఱిన నతండును గుపితారుణేక్షణుండై వెంటం దగిలి నల్దిక్కులను విదిక్కులను భూ నభోభాగంబుల నెక్కడఁ జనియె నక్కడక్కడికి వెనుదగిలి యుద్యతాయుధుం డై చనుచుండ, న వైవ్యన్యనిం గని [2]మృత్యుగ్రస్తు లగు ప్రజలచందంబున *(నన్యశరణ్య యై యతిభయంబునం బరితప్యమానహృదయ యగుచు ని ట్లనియె.) వైన్యా! ధర్మజ్ఞుండ, వాపన్నవత్సలుండవు, మహోత్సాహుండవు, సకలప్రాణి పరిపాలనావస్థితుండవు నైన నీ వీ దీనయుం, బాప రహితయుం, గామినియు నగు ననువధియింపం బూని యేల వెనుఁ దగులు చున్నవాఁడవు? *(ధర్మతత్త్వం బెఱుంగువారు) సతీజనంబులు కృతాపరాధ లైనం దీనవత్సలతం జేసి వధియింపరు. అని పలికి, మఱియు నా ధరణి పృథు చక్రవర్తి కి ట్లనియె. 475

క. జననాథచంద్ర! యీ భూ, జనకోటికి యానపాత్ర [3]సదృశస్థితితో
ఘన దృఢ శరీర నగుచును, ననయము [4]నాధారభూత నయి చరియింతుఁ. 476

తే. ఇట్టి నన్నుఁ గృపామతి యెడలి యిటు వి
పాటనము సేసి త్రుంచెదు ప్రజలు నీట
మునుఁగకుండంగ నే రీతి ననఘచరిత!
యరసి రక్షింతు వన నతం డవని కనియె.[5] 477

వ. ధరిత్రీ! మదీ యాజ్ఞో ల్లంఘనంబు సేయుచున్నదానవు. అదియునుం గాక నీవు యజ్ఞంబులందు హవిర్భాగంబుల ననుభవింపుచు ధాన్యాదికంబుల విస్తరింపం జేయక గోరూపంబు ధరియించి యనయంబుఁ దృణభక్షణంబు సేయుచుఁ బాలుం బితుకక నీయం దణంచికొంటివి. నీయం దున్న యోషధీ బీజంబులు బ్రహ్మచేతం బూర్వంబునందె కల్పింపంబడినయవి. వానిని (నీ దేహమంద యణంచికొని) యిప్పు డీయక మూఢహృదయపు, మందమతివియు నై యప రాధంబుఁ జేసిన *(దుష్టురాల వగు) నిను నా బాణంబులచే జర్జరీభూత శరీరం జేసి వధియించి నీ మేని మాంసంబునం జేసి (క్షుద్బాధితులు దీనులు) నగు నీ

---

1. మహివలయము కంపమాన మానసయగుచో (క. ట. త.)

* కొన్ని తా. ప. ప్రతులలో లేదు.

2. మృత్యుసముంగా భావించి (క. చ. ట. బ.); 3. సంగతితోడన్ (క. బ.) 4. నాధార భూతమనఁ (చ.ట.త.జ.డ.ద.)... భూతయగు (హ) 5. మాం విపాట్యాజరా న్నావం యత్రవిశ్వం ప్రతిష్ఠితం, ఆత్మానం చ ప్రజా శ్చైమాపి కథ మంభసి ధాస్యసి. (17.21) అని మూలము.

ప్రజల యూ ర్తి నివారించెద. నీవు కామిని నంటివి. స్త్రీ పురుష నపుంసకులలో నెవ్వరేని భూతదయ లేక స్వమాత్ర పోషకు లగుచు నిరనుక్రోశంబున భూత ద్రోహు లై వ ర్తింతురు, వారిని రాజులు వధించినన్ వధంబు గాదు గానఁ దానఁ బాపంబు వొరయదు. నీవు కామిని వై నను (దుర్మదవు, స్తబ్ధవు) నగుచు మాయా గోరూపంబునం బాటిపోవుచున్న నిన్నఁ దిలలంతలు ఖండంబులు చేసి నా యోగమహిమం ప్రాణికోటి నుద్ధరించెద. అని పలికి, రోషభీషణాకా రంబు ధరియించి, దండధరుండునుఁ బోలి వ ర్తించు పృథునిం జూచి వడంకుచు మేదిని ప్రాంజలి యై యి ట్లని నుతియింపం దొడంగె. 478

క. ఓ నాథ! పరమపురుషుఁడ, వై నిజ మాయాగుణంబు లందిన కతనన్
నానావిధ దేహములం, బూనుదు సగుణుండ వగుచు బుధనుతచరితా! 479

వ. అట్టి నీవు. 480

క. నను సకల జీవతతికిని, మును నీ వాధారభూతముగ నిర్మింపఁ
విను నాయందుఁ జతుర్విధ, ఘన భూతవిసర్గ మర్థిఁ గై కొనవలసెఁ. 481

వ. అ ట్లై యుండ. 482

క. నను నుద్య దాయుధుఁడ వై, మనుజేంద్ర! వధింపఁ బూని మసలెదు [1]నీకం
టె నితరు నెవ్వని నిపు డే, ఘనముగ శరణంబు సొత్తుఁ గరుణాభరణా! 483

వ. అదియునుం గాక. 484

సీ. అనఘ! స్వకీయంబు నై యతర్క్యతము నై మహిమ నొప్పిన భవ న్మాయచేత
సకల చరాచర సర్గంబు నిర్మించి [2]ధర్మపరుండ వై తనరు దీవ!
నీ విక్రమము నవనీరజలోచన! సకలలోకులకు దుర్జయము దలఁపఁ
దగునట్టి నీవు స్వతంత్రుఁడ వగుటను బ్రహ్మఁ బుట్టించి యా బ్రహ్మచేత

తే. సకలజగములఁ జేయింతు సమతఁ బేర్చి
యేకమయ్యు మహాత్మ! యనేకవిధము
లగుచు వెలుఁగొందుచుందు వీ యఖిలమందుఁ
జారుతరమూ ర్తి! యోపృథుచక్రవ ర్తి! 485

వ. మఱియు మహాభూ తేంద్రియ క్రియా కారక చేతనాహంకారంబు లను శక్తులం జేసి యీ జగంబుల కుత్పత్తి స్థితి లయంబులఁ గావింపుచు సముత్కట

---

* తా. ప. ప్రతులలో లేదు.

1. నీ కం, టెను నన్యునిం నెవ్వనినే (క. చ. తం. వా.) 2. ధర్మార్థపరుఁడవై (హ.తం.వా.)

విరుద్ధశక్తులుం గల పురుషునకు నమస్కరించెద. అట్టి పరమపురుషుండ వైన నీవు నిజనిర్మితంబు, భూతేంద్రియాంతఃకరణాత్మకంబు నైన యీ విశ్వంబు సంస్థాపింపం బూని. 486

సీ. [1]ఆదివరాహంబ వగుచు రసాతల గత నైన నన్ను నక్కటికతోడ
నుద్ధరించితి వట్టి యుదగ్రభాగంబునం దర్థి నున్న నే ననెడి నావ
యం దున్న నిఖిల ప్రజావళి రక్షింపఁ గోరి యీ పృథురూపధారి వైతి
వట్టి భూభరణుండ వైన నీ విపుడు పయోనిమిత్తంబుగా నుగ్రచరుఁడ

తే. వగుచు నన్ను వధించెద ననుచు బుద్ధిఁ
దలఁపుచున్నాఁడ విది విచిత్రంబు గాదె!
విశ్వసంపాద్య! నిరవద్య! వేదవేద్య!
భవ్యగుణసాంద్ర! వైన్యభూపాలచంద్ర! 487

వ. కావున నీశ్వరగుణ సర్గరూపం బైన [2]మాయచే మోహితాంతఃకరణుల మైన మావంటివారలచేత హరిభక్తుల చేష్టితం బెఱుంగంబడ దన్న హరిచేష్టితం బెట్లెఱుంగం బడు? అట్టి జితేంద్రియ యశస్కరు లైన వారలకు నమస్కరింతు. అనుచు ని ట్లధ్వంబునం గోపప్రస్ఫురితాధరుఁ డైన పృథుని నభినుతించి ధైర్యం బవలంబించి వెండియు ని ట్లనియె. 488

అధ్యాయము - ౨౦

క. విమలాత్మ! నాకు నభయము, సమకూరెడు నట్లుగాఁగ సన్మతి నీ క్రో
ధము నుపశమించి కరుణిం, పుము నా విన్నపము వినుము పురుషనిధానా! 489

క. ధర విరులు గందకుండఁగ, సరసగతిఁ బూవుఁదేనెఁ జవిగొను నిందిం
దిరవిభు కైవడి బుధుఁ డగు, పురుషుఁడు సారాంశ [3]మాత్రఁ బూని గ్రహించున్.

సీ. వినుమయ్య! తత్త్వదర్శను లైన యట్టి సన్మునులచే నైహికాముష్మికంబు
లైన ఫలప్రాప్తి కర్థిఁ గృష్ణా ద్యగ్నిహోత్రా ద్యుపాయంబు లుర్వీమీఁద
దృష్టంబులును నాచరితములు నగుచుఁ దా నెనయంగఁ దదుపాయ మెవ్వఁ డాచ
రించును వాఁడు ప్రాపించుఁ దత్ఫలమును విద్వాంసుఁ డైనను వెలయ దీని

తే. నాదరింపక తనయంత నాచరించె
నేని నాయాసమే యగుఁ గాని తత్ఫ
లమును బొందండు బహుళకాలమున కైన
వినుత గుణశీల! మాటలు వేయునేల? 491

---

1. ఆదివరాహంబవై యారసాతలగత, నైననన్ను (తం. వా.) 2. మాయామోహితాంతఃకరణులమైన (క. చ. తం.) 3. మాత్రబూని (చ).

వ. అని మఱియు మహి యి ట్లనియె. 492

చ. జలరుహగర్భచేత మును చాల సృజింపఁగఁబడ్డ యోషధుల్
కలుషమతిఁ ధృతవ్రతులు గాని యసజ్జన భుజ్యమాన లై
[1]వెలయుట చూచి యే నృపతివీరులు మాన్పమిఁ జోరబాధలఁ
బలుమఱుఁ బొంది తా నపరిపాలిత నై కృశియించి వెండియుఁ. 493

క. అనుపమ మఖ కర్మక్రియ, లనయము లేకుంట నే ననాదృత నగుచుఁ
జననాయక ! యీ లోకము, ఘనచోరీభూత మగుటఁ గనుఁగొని యంతఁ. 494

క. సవనాది సిద్ధికొఱకై, తవిలి తదీయౌషధీ వితతులను ధరణీ
ధవ ! యే నపుడు గ్రసించితి, నవియును నాయందు జీర్ణ మయ్యెఁ గడంకన్. 495

క. విను వాని నొకయుపాయం, బునఁ గ్రమ్మఱఁ బడయవచ్చు భూవరచంద్రా !
విను మది యెటీఁగించెద నీ, కనువత్సలురాల నగుట ననఘచరిత్రా ! 496

క. అనయము నా కొకవత్సము, ననురూప సుదోహనమ్ము ననురూపక దో
గ్ధనుఁ [2]గల్పింపుమ య ట్లై, నను నీ భూతముల కవనినాయక ! దానఁ. 497

క. పరఁగ నభీప్సితములు బల, కరములు నగు నన్న దుగ్ధ కలితము లగు భా
సురకామంబులఁ బితికెద, నరనాయకచంద్ర ! వినుము నా వచనంబుల్. 498

చ. మనుజవరేణ్య ! యేను విషమస్థలి నై [3]యిపు డున్నదానఁ గా
వున జలదాగమోదిత పయోనివహంబు ద దాగమంబు పో
యినను ద దంబువుల్ పుడమి నింకక యంతట నిల్చినట్లు గా
మనునిభ ! నన్ను నిప్పుడు సమస్థలి నై పెనుపొందఁ జేయవే ! 499

క. అని యి ట్విధమున నా భూ, వనితామణి వలుకు మధురవచనంబులు దా
విని యనురాగము దన మన, మునఁ గడలుకొనంగ రాజముఖ్యుం డంతఁ.

చ. మనువును దూడఁ జేసి గరిమఁ నిజపాణితలంబు లీల దో
హనముగఁ జేసి యందు సకలౌషధులం బితికెం గ్రమంబునఁ
దనరఁగఁ ద ద్విధంబునను ద త్పృథువత్సల యైన భూమియం
దనయము వారు వారును బ్రియం బగు కోర్కులఁ బొంది రున్నతిఁ. 501

---

1. మెలఁగుటఁ జూచి యేను నృప మీరలు మాన్పమి (హ) 2. కల్పింపుము దగనై నను (హ)
3. 'ఉన్నదాన నొ, య్యనజలదాగమోదిత పయఃప్రకరంబు' (వా)

సీ. బలసి ఋషుల్ బృహస్పతి వత్సకంబుగా [1]నర్థించి తమ యింద్రియంబులందు
నంచిత చ్ఛందోమయ ఖీరమును, దేవతలు సురరాజు వత్సకము గాఁగఁ
[2]గనక పాత్రమునందుఁ దనరు నోజో బల [3]వీర్యామృతంబు నై వెలయు పయసు
దైత్య దానవులు దైత్యశ్రేష్ఠుఁ డగు గుణశాలిఁ బ్రహ్లాదు వత్సంబుఁ జేసి

తే. [4]స త్సురాసవ పయ మాయస చషకమున
నప్సరోజన గంధర్వ లలరి యపుడు
[5]దనర విశ్వావసును వత్సమునుగఁ జేసి
పద్మమయ నిర్మితం బైన పాత్రమందు. 502

వ. మాధుర్య సౌందర్య సహిత గాంధర్వ ఖీరంబును, పితృదేవతలు సూర్యవత్స కంబుగా నామపాత్రమందుఁ గవ్యం బను దుగ్ధంబును, సిద్ధులు కపిలవత్సకంబుగా నాకాశపాత్రమందు సంకల్పనారూ పాణిమాదిసిద్ధి యను ఖీరంబును, విద్యాధరాదులు ద ద్వత్సకంబుగఁ ద త్పాత్రకంబునుగా ఖేచరత్వాది [6]విద్యా రూప ఖీరంబును, గింపురుషాదులు మయవత్సకంబును నాత్మపాత్రంబునుంగా సంకల్పమాత్ర ప్రభవంబును నంతర్ధా నాద్భుతాత్మ సంబంధియు నగు మాయ యను ఖీరంబును, యక్ష రక్షో భూత పిశాచంబులు భూతేశవత్సకంబుగాఁ గపాలపాత్రకంబునుగా రుధిరాసవం బను ఖీరంబును, నహి దందశూక సర్ప నాగంబులు తక్షకవత్సకంబుగా బిలపాత్రంబున విషరూప ఖీరంబును, బభువులు గో వృష వత్సకంబును, నరణ్యపాత్రంబునుంగాఁ దృణం బను ఖీరంబును, గ్రవ్యాద మృగంబులు మృగేంద్రవత్సకంబుగా, నాత్మకళేబర పాత్రకంబుగాఁ గ్రవ్యం బను దుగ్ధంబును, విహంగంబులు సువర్ణవత్సకంబు, నిజకాయ పాత్రం బునుఁ గాఁ గీటకఫలాదికం బను దుగ్ధంబును, వనస్పతులు వటవత్సకంబుగా భిన్నరోహరూప పయస్సును, గిరులు హిమవ ద్వత్సకంబును, నిజసాను పాత్ర కంబును గా నానాధాతువు లను దుగ్ధంబులు ని ర్విధంబున సమస్తచరాచర వర్గంబు స్వ ముఖ్యవత్సకంబును, స్వ స్వ పాత్రకంబునుగా భిన్నరూపంబు లైన ఖీరంబులం బితికి రని చెప్పి మఱియును. 503

క. క్రమమున నిటు పృథ్వాదులు, దమతమ కామితము లనఁగఁదగు భిన్న ఖీ
రము దోహన వత్సక భే, దమునం దగఁ బితికి రంత ధరణీధవుఁడున్. 504

---

1. హత్తించి (ద) 2. పాత్రికయందు (క. చ. ట. డ.) 3. వీర్యస్వరూపంబు (క. చ. త. జ.) 4. ఘనసురాసవరూప దుగ్ధంబువరుస (తం.వా.) 'దైతేయా దానవావత్సం ప్రహ్లాద మసురర్షభమ్, విధాయ దుదుహుః ఖీర మయః పాత్రే సురాసవమ్' (18-16) 5.వలనుమెరయ విశ్వావసు వత్సజేసి (చ. ట. త. డ.) 6. వ్యాపార (హ)

తే. సముచి తానందమును బొంది సర్వకామ
దుఘ యనం దగు భూమిని దుహిత గాఁగఁ
గోరి కైకొని నిజధనుఃకోటిచేత
భూరి గిరికూటములఁ జూర్ణములుగఁ జేసి. 505

తే. చండ దోర్దండలీల భూమండలంబు
సమతలంబుగఁ జేసి శశ్వత్ప్రసిద్ధి
నొంది య వ్విభుఁ డీ లోకమందు నెల్ల
ప్రజకుఁ దండ్రియు, జీవనప్రదుఁడు నగుచు. 506

తే. అక్కడక్కడ పూర్వంబునందు లేని
గ్రామ పట్టణ దుర్గ ఖర్వట పుళింద
ఖేట శబరాలయ వ్రజవాట ఘోష
వివిధనిలయము లర్థిఁ గావించె నంత. 507

క. వారును భయవిరహితు లై, భోరనఁ ద త్తన్నివాసములయందు సుఖ
శ్రీరుచి నొప్పుచు నుండిరి, వారక యా పృథునిఁ బొగడ వశమె? ధరిత్రిన్.

అధ్యాయము - ౧౯

సీ. అని చెప్పి మునినాథుఁ డైన మైత్రేయుఁ డ వ్విదురున కిట్లను వేడ్కతోడ
ననఘాత్మ! రాజర్షి యైన వైన్యుం డశ్వమేధ శతంబు సన్నేధతోడఁ
గావింతు ననిదీక్ష గైకొని వ్రతనిష్ఠఁ దివిరి బ్రహ్మావర్తదేశమందు
నలరు మనుక్షేత్రమందు సరస్వతీ నది పొంతఁ దా మహోన్నతి నొనర్చు

తే. సవనకర్మక్రియకు నతిశయవిశేష
ఫలము గలిగెడి ననిబుద్ధిఁ దలఁచి యచట
వరుసఁ గావించు నతిశ యాధ్వర మహోత్స
వము సహింపక యుండె న య్యమరవిభుఁడు. 509

—: పృథుచక్రవర్తి యశ్వమేధంబు సేయునెడ నింద్రుం డశ్వము నపహరించుట :—

సీ. అట్టి యధ్వరకర్మమందు సాక్షా ద్భగవంతుండు హరి రమేశ్వరుఁడు లోక
గురుఁడును సర్వాత్మకుండును విభుఁడును నీరజభవ భవాన్వితుఁడు లోక
పాలక నిఖిల సుపర్వానుగుండును యజ్ఞాంగుఁ డఖిలాధ్వరాది విభుఁడు
గంధర్వ ముని సిద్ధగణ సాధ్య విద్యా ధ రాప్సరో దైత్య గుహ్యోళి దాన

తే. వాది జేగీయమానుఁడు నలఘుయశుఁడు
ప్రకట నంద సునందాది పార్షదుండు
కపిల నారద వర సనక ప్రముఖ్య
మహిత యోగీంద్ర సంస్తూయమానుఁ డజుఁడు. 510

వ. మఱియుం బరమ భాగవత [1]సేవితుండును, నారాయణాంశ ప్రభవుండును, నైన పృథుచక్రవర్తికి భూమి హవిరాది దోగ్ధ్రి యయ్యును, సర్వకామదుఘ యై సమస్త పదార్థంబులం బితుకుచుండె. మఱియుఁ దరువులు ఘనతరాకారంబులు గలిగి, మకరందస్రావు లగుచు నిక్షుద్రాక్షాది రసంబులు దధి క్షీరాజ్య తక్ర పాన కాదికంబులు వర్షింప నవియెల్ల నదులు వహించె. సముద్రంబులు హీరాది రత్న విశేషంబుల నీనుచుండె. పర్వతంబులు భక్ష్య భోజ్య లేహ్య చోష్యంబు లను చతుర్విధాన్నంబులఁ గురియుచుండె. లోకపాల సమేతు లైన సకల జనంబులుపాయనంబులు దెచ్చి యిచ్చుచుండిరి. ఇట్టి పరిపూర్ణ విభవాభిరాముం డై యధోక్షజ సేవాపరాయణుం డగు పృథుచక్రవర్తి యేకోనశతాశ్వమేధంబులు సన్మేధంబునం గావించి నూఱవ యాగంబు నందు యజ్ఞపతి యైన పుండరీకాక్షుని యజింపుచుండం దదీయ పరమోత్సవంబు సహింపం జాలక. 511

క. అమరేంద్రుఁడు ఘన రోషో, ద్గముఁ డై పాషండవేష కలిత తిరోభా
వమునం ద న్మఖపశువుం, గ్రమ మేది హరించి చనియె గగనంబునకున్. 512

వ. అట్లు చను నప్పుడు 513

క. అనఘుం డగు నత్రిమహా, మునిచోదితుఁ డగుచుఁ బృథుని పుత్రుఁడు బాణా
సనతూణీరధరుం డై, యనిమిషపతి వెనుకఁ జనియె నతిదర్పమునన్. 514

వ. అట్లు చనిచని ముందట. 515

సీ. యజ్ఞసాధన పశుహరణుని వధియించు ధర్మంబునందు నధర్మ మనెడి
బుద్ధిఁ బుట్టఁగ జేయ భూరి మాయావేషధారి యై యరుగు సుత్రాముఁ గదిసి
నిలు నిలు మని యార్చి నిజ గుణధ్వని సేసి ఘన జటా భస్మాస్థి కలిత మైన
మూర్తిఁ గనుఁగొని మూర్తిభవించిన ధర్మంబుగా బుద్ధిఁ దలఁచి యమర

తే. నాయకునిమీఁద సాయక మేయఁ జాల
కున్నఁ గనుఁగొని యత్రి విద్వన్నుతుండు
వైన్యజున కనె వాసవు వలనుఁ జూపి
మనములోపల రోషంబు మల్లడింప. 516

---

1. శ్రేష్ఠుండును (ద)

క. విను మితఁడు యజ్ఞహంతయు, ననిమిష నికరాధముండు నగు నింద్రుఁడు గా
వున నితని జయింపును నీ, వని ముమ్మా ఱుచ్చరింప న వ్యాజ్యుఁడుఁ. 517

మ. వినువీథిన్ జను దేవవల్లభునిపై వీరుండు గ్రోధాంతరం
గ నిరూఢిఁ మృగరా ట్కిశోరము మహాగంధద్విపేంద్రంబు మీఁ
దను లంఘించు విధంబునం బడిన నాతం డశ్వ చౌర్యైక సా
ధనరూపంబును నశ్వమున్ విడిచి యంతర్ధానముం బొందినఁ. 518

క. వీరుఁడు పృథుభూపాల కు, మారుఁడు నిజ యజ్ఞపశువు మఱలం గొని దు
ర్వార బలుఁ డగుచు జనకుని, భూరి సవనరాజ పుణ్యభూమికి వచ్చెఁ. 519

వ. అ య్యవసరంబున నచ్చట నున్న పరమర్షిపుంగవు లతని యద్భుతకర్మంబు
గనుంగొని, యాశ్చర్యంబు నొంది, యతనికి జితాశ్వుండను నన్వర్థ నామంబు వెట్టి
యున్న సమయంబున. 520

చ. మఱియును దేవతాపతి తమఃపటలంబు జనింపఁ జేసి యె
వ్వరుఁ దనుఁ గానకుండ ననివారణఁ గాంచనపాశ బద్ధ మై
సురుచిర యూపదారు పరిశోభిత మైన హయంబుఁ గొంచుఁ జె
చ్చెర వినువీథి నేఁగఁగ ఋషిప్రవరుం డగు నత్రి చెప్పినఁ. 521

క. విని పృథు భూవరతనయుఁడు, ఘనబలమునఁ జని కపాల ఖట్వాంగము లో
లిని ధరియించి రయంబునఁ, జను నింద్రునిఁ గాంచి నొంపఁజాలక యంతఁ. 522

ఉ. క్రమ్మఱ నత్రిచేఁ దెలుపఁగాఁబడి వైన్యతనూభవుండు రో
షమ్మునఁ దోఁకఁ ద్రొక్కిన భుజంగమపుంగవుఁ బోలి యుగ్రుఁ డై
య మ్మరిఁబోసినం గని సురాధిపుఁ డెప్పటియట్ల పాఱ న
శ్వమ్మును రూపమున్ విడిచి చాలఁ దిరోహితుఁ డై రయంబునన్. 523

వ. అట్లు చనినం బశువుం గొని మఱలి య వ్వీరోత్తముండు పితృయజ్ఞశాలకుం
జనుదెంచె నంత. 524

సీ. హరిహయుం డధ్వరహయ రక్షణార్థ మై మించి గై కొని విసర్జించినట్టి
భూరి యమంగళభూత మాయారూపములను ధరించిరి మూఢజనులు
పాషండచిహ్నముల్ పరఁగుట వారలు జగతిపై నగ్న వేషములు గలుగు
జైనులు భూరి కాషాయవస్త్రంబులు ధరియించు బౌద్ధులుఁ దగ జటాస్థి

తే. భస్మధారులు నైన కాపాలికాదు
లనఁగ వెలసిరి లోకంబులందుఁ జాలఁ
దలఁప ధర్మోపమం బనఁదగు నధర్మ
మందు నభిరతి వొడమిన యజ్ఞజనులు. 525

వ. తదీయచిహ్నంబులు పారంపర్యంబుగా ధరియింపం దొడంగిరి. త ద్వృత్తాంతంబు భగవంతుం డైన పృథుచక్రవర్తి యెఱింగి, కుపితుం డై యుద్యతకార్ముకుం డగుచు నింద్రునిమీఁద బాణంబు నేయ నుద్యమించిన, ఋత్విక్కులు శక్ర వధోద్యుక్తుండు, నసహ్యరంహుండు నైన పృథుచక్రవర్తిం గనుంగొని యిట్లనిరి.

క. జననాయక ! యజ్ఞములం, దనుపమ విధిచోదితంబు లనఁదగు పశుబం
ధనహింసల కా కితరుల, ఘన దీక్షితునకు వధింపఁ గాదంద్రు బుధుల్. 527

వ. కావున నీ విపు డింద్రవధోద్యోగం బుపసంహరింపుము. భవదీయ ధర్మవిరోధి యైన యింద్రుని. 528

క. జనపాల ! వీర్యవంతము, లనఁదగు మంత్రములచేత నాహ్వానముచే
సిన నతఁ డిచటికి వచ్చును, జనుదెంచిన యమరవిభుని సరభసత దగఁ. 529

క. ధృతి చెదరఁబట్టి శిఖ కా, హుతిఁ గా వేల్చెదము దాన నుర్వీవర ! నీ
వితతమహో హతవీర్యు, న్నతుఁ డై చెడిపోవు నమరనాథుం డంతఁ. 530

వ. అని పృథు నివారించి, ఋత్విగ్జనంబులు కుపితస్వాంతు లై హస్తంబుల స్రు క్స్రువంబులు ధరించి వేల్చు సమయంబునం జతుర్ముఖుండు చనుదెంచి, ఋత్వి క్కులం గనుంగొని యి ట్లనియె. యజ్ఞంబులందు యజింపంబడు దేవత లెవ్వని యంశంబు, లెవ్వండు యజ్ఞనామకం బగు భగవదంశం బగు, నట్టి యింద్రుండు మీచేత వధార్హుండు గాఁ డితండు భగవదంశసంభవుం డగుట నీ యజ్ఞకర్మ విధ్వంసనేచ్ఛుం డై గావించు ధర్మవ్యతికరంబులు చూచుచుండవలయుం గాని ప్రతికారంబులు కర్తవ్యంబులు గావు. *(ఈ పృథుకీర్తి యగు) పృథునకు నేకోనశతం బగు నధ్వరప్రయోగఫలంబు సిద్ధించుం గాక యని పృథుచక్రవర్తికి ని ట్లనియె. 531

సీ. మనుజేంద్ర ! మోక్షధర్మము నెఱింగిన నీకు సవనముల్ సేయుట చాలు మఱియు
నేవిధంబున నైన దేవేంద్రు మనమునఁ గైకొని రోషంబు గదురకుండ
వర్తింపవలయును వాసవుండును నీవు పూని సుశ్లోకులు గాన మీకు
మంగళం బగుఁగాక మానవనాథ ! నీ చిత్తంబులోపలఁ జింతఁ దొఱఁగి

తే. మించి మద్వాక్యముల నాదరించి వినుము
దైవహత మగు యజ్ఞంబుఁ దగిలి సేయు
కొఱకు భవదీయచిత్తంబు గుంది రోష
కలుషితం బైన నజ్ఞానకలిత మగును. 532

---

* తా. ప. ప్రతులలో లేదు.

వ. భవదీయ యజ్ఞహననార్థం బళ్వహరణుం డైన యింద్రుండు (దేవతలలోనం దురాగ్రహుం డగుటంజేసి యతనిచేత) నిర్మింపంబడి చిత్తాకర్షకంబు లైన యీ పాషండ ధర్మంబులచేత ధర్మవ్యతికరంబు గలుగుఁ గాన నీయజ్ఞంబు చాలింపుము. అని మఱియు ని ట్లనియె. 533

సీ. †ఆదిగాక వినుము వేనాపచారంబునఁ బూని విలుప్తంబు లై నయట్టి
యలఘు నానా సమయానుధర్మంబులఁ బరిపాలనము సేయఁ బరఁగి వేను
దేహంబువలనను దివిరి జనించియున్నాఁడవు నారాయ ణాంశజుఁడవు
[1]గావున నీ వీశ ! కలిత ప్రపంచంబు పుట్టిన తెఱఁగు నీబుద్ధిఁ దలఁచి

తే. యెవరిచే నేమిటికి సృజియింపఁ బడితి
వట్టి యీ బ్రహ్మసంకల్ప మవనినాథ !
తప్పకుండంగఁ బాలింపు ధర్మగతినిఁ
జారుశుభమూర్తి ! యో పృథుచక్రవర్తి ! 534

వ. అని మఱియు నిట్లనియె. ఉపధర్మమాతయుం బ్రచండ పాషండమార్గంబు నైన యీ యింద్రకృతం బగు మాయను జయింపుము. అని వనజసంభవుం డానతిచ్చినం బృథుచక్రవర్తియుఁ ద దాజ్ఞాపితుం డై దేవేంద్రునితోడ బద్ధ సఖ్యుం డయ్యె. అంత నవబృథానంతరంబున. 535

చ. సురుచిర లబ్ధదక్షిణల సొంపునఁ బొంపిరివోయి భూసురుల్
వరుసన పెక్కు దీవెన లవారణ నిచ్చిరి సర్వదేవతల్
భరిత ముదంతరంగములఁ బాయనివేడ్క వరంబు లిచ్చి రా
నరవరుఁ డైన వైన్యునకు నందితకీర్తికిఁ బుణ్యమూర్తికిన్. 536

వ. అంత నచ్చటి జనంబు లి ట్లనిరి. 537

తే. అనఘ ! నీచేత నాదృతు లై రి సర్వ
జనులు మఱి దానమానోపచారములను
బితృ సుదేవర్షి మానవవితతి పూజ
నొంది సంచిత మోదంబు నొందె నయ్య ! 538

---

† ఈ సీసములోని నాల్గు పాదములు తా. ప. ప్రతులలోఁ గానరావు. గీతము మాత్రము కలదు. సీసపాదములకు బదులు, ఈ క్రింది వచనమున్నది.

భవదీయ యజ్ఞహరణార్థం బళ్వహరుండై న యింద్రునిచేత నిర్మింపబడి మనోహరంబులై న యీ పాషండధర్మంబులన్ పరిపాలనము సేయుకొఱకై వై నదేహంబువలనన్ దివిరి జనియించిన చారునారా యణాంశజుండపు గావున నీవు ఈ కలిత ప్రపంచంబు పుట్టిన తెఱంగు నీ బుద్ధిదలంచి (చ.ట.త.జ.డ.)

1. కావున నీ విళకలిత లోకంబనఁ బుట్టి తెఱఁగు (హ) కావున నీ నరకలిత లోకంబున.... (తం. వా.)

అధ్యాయము - ౨౦

వ. అని పలుకు సమయంబున యజ్ఞభోక్తయు, యజ్ఞవిభుండును, భగవంతుడును నైన సర్వేశ్వరుం డింద్రసమేతుం డై యచ్చటికిం జనుదెంచి యా పృథున కిట్లనియె.

-: యాగంబున నారాయణుండు ప్రసన్నుం డై పృథుచక్రవర్తి ననుగ్రహించుట :-

క. జనవర! భవదీయం బై, జననుత మగు నశ్వమేధ శతమున కిపు డీ
యనిమిషపతి భంగముచే, సినకతన ఋమాపణంబు సేసెడిఁ గంటే? 540

వ. కావున నితని ఋమింపుము. సత్పురుషు లగువారు దేహాభిమానులు గాకుండుటం జేసి భూతంబులయెడ ద్రోహం బాచరింపరు. అ ట్లగుటంజేసి నీవంటి మహాత్ములు దేవమాయా మోహితు లై పరోపతాపంబులు సేసిరేని దీర్ఘతరం బైన వృద్ధజనసేవ వ్యర్థంబు గాదె? అదియునుం గాక యీ శరీరం బవిద్యా కామ కర్మంబులచేత నారబ్ధం బని తెలిసిన పరమజ్ఞాని యీ దేహంబునందు ననుషక్తుండు గాకుండుట *(సహజం బన) దేహోత్పాదితంబు లైన గృహ దారాదుల యందు మమత్వంబు లేకుంటం జెప్ప నేల? ఇట్టి దేహంబునం దున్న యాత్మ యేకంబును, శుద్ధ స్వరూపంబు (స్వయంజ్యోతియు) నిర్గుణంబును, గుణాశ్ర యంబును, వ్యాప్యవ్యాపకంబును, నసంవృతంబును, సాక్షిభూతంబును, (నిరాత్మకంబును నగు.) దీని దేహంబునకంటె వేఱుగా నెవ్వండు దెలియు వాఁడు మత్పరుం డగుటంజేసి దేహధారియైయుండియుఁ ద ద్గుణంబులంబొరయక వర్తించు. మఱియు నెవ్వండేని స్వధర్మాచారపరుండును, నిష్కాముండును, శ్రద్ధాయుక్తుండును నైన నెల్లప్పుడు భజియించు నట్టివాని మనంబు (క్రమం బునఁ) బ్రసన్నం బగు. అట్లు ప్రసన్నమనస్కుండును త్రిగుణాతీతుండును సమ్యగ్దర్శ నుండు నైన యతండు (మదీయ సమవస్థానరూప శాంతి నొందు.) అదియ కైవల్యపదం బనంబడు. కూటస్థం బైన యీ యాత్మ యుదాసీన భూతం బైనను, దీని ద్రవ్య జ్ఞాన క్రియా మనంబులకు నీశ్వరుం గా నెవ్వండు దెలియు, వాఁడు భవంబు నొందకుండు. ఈ సంసారము ద్రవ్య క్రియా కారక చేతనాత్మకం బగుటంజేసి ప్రభిన్న దేహోపాధికంబు గావునఁ ప్రాప్తంబు లైన యాపత్సంపదల యందు మత్పరు లైన మహాత్ములు వికారంబు నొందరు. కావున నీవు సుఖ దుఃఖములయందు సమచిత్తుండవును, సమా నోత్తమ మధ్య మాధముండవును, జితేంద్రియాశయుండవును నై (వినిష్పాది తాఖిలామాత్యాది సంయుతుండ వై) యఖిలలోక రక్షణంబు సేయుము. అని వెండియు ని ట్లనియె. 541

---

* తా. ప. ప్రతులలో లేదు.

సీ. పార్థివోత్తములకుఁ బ్రజల రక్షించుట పరమధర్మం బగు నరవరేణ్య!
ధరణీశులకుఁ బ్రజాపరిపాలనంబునఁ బూని లోకులు సేయు పుణ్యమందు
షష్ఠాంశ మర్థిని సంప్రాప్త మగునట్లు ప్రజలఁ బ్రోవని రాజు ప్రజలచేత
నపహృత సత్పుణ్యుఁ డై వారు గావించు ఘన పాపఫలము దా ననుభవించుఁ

తే. గాన నీవును విప్రవరానుమతము
సాంప్రదాయిక విధము నై జరుగు ధర్మ
మహిమఁ జేపట్టి యర్థకామములఁ జెందు
సమత న మ్మ్మోఁటియందు నాసక్తి లేక. 542

వ. ఇ ట్విధంబున. 543

క. జనులకు ననురక్తుఁడ వై, జననాయక! నీవు ధరణి సమచిత్తుఁడ వై
యనయముఁ బరిపాలించిన, సనకాదులఁ గాంతు వాత్మసదనమునందుఁ. 544

వ. అని వెండియు ని ట్లని యానతిచ్చె. 545

సీ. భూవర! యోగ తపో మఖంబులచేతఁ గై కొని సులభుండు గాని యేను
సమచిత్తు లైన సజ్జనుల చిత్తంబుల వర్తింపుచుండెడి వాఁడ నగుటఁ
జేసి తావక శమ శీల విమత్సర [1]కీర్తనముల వశీకృతుఁడ నై తి
నేను నీ కొకవరం బిచ్చెద వేఁడుము నావుడు విని మేదినీవరుండు

తే. లోకగురుఁ డై న య ప్పుండరీకనయనుఁ
డానతిచ్చిన మృదు లలి తామృతోప
మాన వాక్యము లాత్మీయ మస్తకమునఁ
దాల్చి సమ్మోద చిత్తుఁ డై ధరణివిభుఁడు. 546

క. తన పాదములకు భక్తిఁ, వినతుం డై యాత్మకర్మవితతికి లజ్జం
దనరుచు నున్న సురేంద్రునిఁ, గనుఁగొని సత్ప్రేమ మొదవఁ గౌఁగిటఁ జేర్చెఁ.

వ. ఇట్లు గౌఁగిటం జేర్చి గతద్వేషుం డై యున్న యనంతరంబ. 548

మ. భగవంతుండును, విశ్వరూపకుఁడు నై భాసిల్లు న ట్విష్ణుఁ డా
జగతీనాథకృ తార్చనానతులచే సంప్రీత చేతస్కుఁడుఁ
నిగృహీ తాంఘ్రిసరోరుహా ద్వయుఁడు నై నిల్చెఁ బ్రయా ణాభిము
ఖ్య గరిష్ఠాత్మకుఁ డయ్యు నా పృథునిపైఁ గారుణ్య మేపారఁగఁ. 549

---

1. గుణములచే వశీకృతుడ నై తి (చ. ట. త. డ. ద.)

వ. ఇట్లు తనమీఁది యనుగ్రహంబునంజేసి విలంబితుం డగుటయు న య్యాది రాజన్యుం డైన పృథుచక్రవర్తి య మ్ముకుందసందర్శ నానందబాష్పజల బిందు సందోహ కందళిత నయనారవిందుం డై య వ్విభుమూ ర్తిం గనుంగొని, గనుం గొనలేక గద్గదకంఠుం డై పలుకలేక యుండియు నెట్టకేలకుఁ దనహృదయంబున న ద్దేవుని నుపగూహనంబు గావించి, త న్మూ ర్తి ధరియించి కన్నులం దొరంగు నానందబాష్పంబులు దుడిచికొని, విలోకనంబు సేయుచు నతృప్త దృగ్గోచరుం డును, గరుడస్కంధ విన్యస్తహస్తుండును, వసుధాతలస్థిత పాదకమలుండును నై యొప్పు నాదిపురుషున కి ట్లనియె. 550

క. వరదా! యీశ్వర! నిను స, త్పురుషుఁడు దేహాభిమాన [1]భోగ్యములకు నీ
వర మెట్లు గోరు? నిహసుఖ, వరములు నారకుల కైన [2]వఅలవె? చెపుమా! 551

చ. ఘన మగు దేవ! యీ వరమె కాదు మహాత్మక! వా గ్వినిర్గతం
బనఁదగు తావకీన చరణాంబుజ చారు మరందరూప మై
తనరిన కీర్తియుఁ విని ముదంబునుఁ బొందఁగలేని మోఱు మై
ననుమదిఁ గోర నొల్ల నఘనాశ! రమేశ! సరోజలోచనా! 552

క. అది గానఁ బద్మలోచన!, సదమల భవదీయ ఘనయశము వినుటకు నై
పదివేల చెవులు కృపని, [3]మ్మదియే నా యభిమతంబు నగును ముకుందా! 553

చ. అనఘ! మహాత్మ వా గ్గళిత మైన భవ త్పదపంకజాత సం
[4]జనిత సుధాకణానిలము సక్కఁగ విస్మృత త త్త్వమార్గ వ
ర్తను లగు దుష్టయోగులకుఁ గ్రమ్మఱఁ ద త్త్వముఁ జూపఁ జాలుఁ గా
వున నిది దక్క నన్యవర మొల్లఁ బయోరుహపత్రలోచనా! 554

సీ. వినుత మంగళ యశోవిభవ! సర్వేశ్వర! యిందిర గుణసంగ్రహేచ్ఛఁ జేసి
యే? నీదు శివతరం బై న సత్కీర్తిని నర్థిమై వరియించె నట్టికీ ర్తి
[5]చతుర సత్పురుష [6]సంగతము గల్గుచునుండ ధృతి నెవ్వఁడేని యాదృచ్ఛికమునఁ
జేసియు నొకమాటు చెవులార విన్నవాఁ డనయంబును గుణజ్ఞుఁ డయ్యెనేని
తే. విరతి నేరీతిఁ బొందును? ధరణిఁ బశువుఁ
దక్కఁ దక్కిన తద్జ్ఞుండు దనుజభేది!
కాన నుత్సుకమతి నై న యేను లక్ష్మి
కరణి నిన్ను భజింతు నో పరమపురుష! 555

---

1. భోగములకు (హ. తం. వా.) 2. వరలునె (హ)
3. ఇదియే నా యభిమతంబు లెసఁగు ముకుందా (హ) 4. జనితసుధా కణానిలవశంబున (క. బ.) 5. కలిత (హ) 6. సంగమము (హ)

వ. ఇట్లు భవదీయ సేవాతత్పరుల మైన యిందిరయు నేను నేకపదార్థాభిలాషం జేసి స్పర్ధమాను లగుచున్న మా యిద్దఱికినిఁ బర్యాయసేవం జేసి కలహంబు లేకుండ ని మ్మట్లుగాక భవదీయ చరణసరోరుహ సేవాసక్త మనోవిస్తారుల మగుటం జేసి నేను నేన మున్ను భజియింతు నను తలంపులం గలహం బైనను గానిమ్ము దేవా! యని వెండియు ని ట్లనియె. 556

సీ. జగదీశ! దేవ! యుష్మ త్పదకైంకర్య పరతఁ దనర్చు సాగరతనూజ
కృత్యంబునందు నకిల్బిషబుద్ధి నేఁ బ్రీతిఁ గోరుట జగన్మాత యైన
యా రమాసతితోడి వైర మవశ్యంబు గల్గు నైనను దయాకార! నీవు
దీనవత్సలుఁడవు గాన స్వల్పం బైన నధికంబు సేయుదు వట్లు గాన

తే. భవ్యచరిత! నిజస్వరూపంబునందు
నభిరతుఁడ వైన నీవు న న్నాదరించు
పగిది నిందిర నాదరింపవు మహాత్మ!
భక్తజనలోక మందార! భవవిదూర! 557

వ. ఇ ట్లగుటం జేసి సత్పురుషు లైనవారలు నిరస్త మాయాగుణ [1]విభ్రమోదయంబు గల నిన్ను భజియింతురు. వారలు భవ త్పాదానుస్మరణ రూపం బైన ప్రయోజనంబు దక్క నితర ప్రయోజనంబుల నెఱుంగరు. దేవా! సేవకజనంబులను వరంబులు వేఁడు మని జగద్విమోహనంబైన వాక్యంబులం బలుకుదువు. అట్టి భవదీయ వాక్యతంత్రీనిబద్ధులు లోకులు గాకుండిరేని ఫలకాము లై కర్మంబుల నెట్టు లాచరింతురు? ఈశా! భవదీయ మాయావిమోహితు లై జను లేమి కారణంబున నీకంటె నితరంబుల గోరుచుందురు? ఇట్లగుటం జేసి తండ్రి దనంతన బాలహితం బాచరించు నట్లు మాకు నీవ హితాచరణం బాచరింప నర్హుండ వని పలికిన *(యాది) రాజర్షి యైన పృథుచక్రవర్తి యర్థవంతంబు లైన వచనంబులు విని (విశ్వద్రష్ట యగు) నారాయణుండు సంతుష్టాంతరంగుం డై *(యి ట్లనియె. ఓ మహారాజ! దైవప్రేరితుండ వై నాయెడ నిట్టి బుద్ధి కలుగుటం జేసి యచంచల మగు భక్తి వొడము. దానిచే దుస్తరం బగు మదీయ మాయం దరింతువు. నీవు నాచే నాదిష్టం బగు కృత్యం బప్రమత్తుండ వగుచు నాచరించిన సకల శుభంబులం బొందుదువు. మదీయ భక్తజనంబులు స్వర్గాపవర్గ నరకంబులం దుల్యంబులుగా నవలోకింతురు. కావున నీ యధ్యవసాయంబు నట్టిదియ. మఱియు మదీయాదేశంబున దుస్త్యజం బగు రోషంబును ద్యజించి నాయెడ

---

1. సముదయంబుల (హ) * తా. ప. ప్రతులలో లేదు.

భక్తిసలిపితివి గాన నిదియె నాకుఁ బరమార్హణం బగు. అని యభినందించి యను గ్రహించి) యతండు గావించు పూజలు గైకొని గమనోన్ముఖుం డయ్యె. అ య్యవసరంబున. 558

సీ. నర సిద్ధ చారణ సురముని గంధర్వ కిన్నర పితృ సాధ్య పన్నగులును
నఖిలజనంబులు హరిపార్శ్వవర్తులు నానందమగ్నాంగు లగుచు వేడ్క
యజ్ఞేశచింతనుం డైన యా పృథువుచే సత్కారములఁ బొంది సమ్మదమునఁ
జనిరి నిజాధివాసములకు భగవంతుఁ డైన నారాయణుం డచ్యుతుండు

తే. దగ నుపాధ్యాయసహితుఁ డై తనరు పృథుని
విమలమతు లయి చూచుచు నమరవరులు
దన్ను జయజయకలిత శబ్దములఁ బొగడఁ
జనియె నప్పుడు వైకుంఠ సదనమునకు. 559

అధ్యాయము - ౨౦

వ. అంతఁ బృథుచక్రవర్తియు నింద్రియాగోచరుం డయ్యును దర్శితాత్మఁడు, దేవ దేవుండు నైన వాసుదేవునకు నమస్కరించి, నిజపురంబునకుం జనుదెంచు సమ యంబున, మౌక్తిక కుసుమమాలికా దుకూల స్వర్ణతోర ణాలంకృతంబును, లలిత సుగంధధూప విలసితంబును, రత్నమయ రంగవల్లికా విరాజితంబును, ఫల పుష్ప లాజాంకుర దీపమాలికా స్తంభ పూగపో తాభిరామ ప్రతిగృహ ప్రాంగ ణంబును, మృగమద ఘనసార చంద నాగరు వాఃపూర సంసిక్త రథ్యావళీ విభాసితంబును, దరుపల్ల వాభిశోభితంబు నైన పురంబుఁ బ్రవేశించి, మండిత రత్నకుండల మణిమరీచులు గండఫలకంబులం దాండవంబులు సలుపం, బురకామి నులు కనకపాత్ర విరచితంబు లయిన యశేషమంగళ నీరాజనంబుల నివాళింప, శంఖ దుందుభి ప్రముఖ తూర్యఘోషంబులును, బుత్వి జ్నికా యాశీర్వచనంబు లును జెలంగ, వంది మాగధ జన సంస్తూయమానుం డగుచు విగతగర్వుం డై యంతఃపురంబుఁ బ్రవేశించి యనంతరంబ. 560

సీ. సమధిక [1]గతిఁ బౌరజన జానపదులచేఁ దనరారు వివిధపూజనల నొంది
రాజు సంతుష్టాంతరంగుండు ప్రియవరప్రదుఁడు నై వారల బహువిధములఁ
బూజించె ని ద్విధంబున మహత్తరము లైనట్టి కర్మంబుల నాచరింపు
చును ననవద్యచేష్టుం డై మహత్తముఁ డన నొప్పు నా పృథు మనుజవిభుఁడు

---

1. మతి (హ. త. వా.)

తే. మించి భూమండలమ్మునఁ బాలించి విశద
యశము సర్వ ధరాచక్రమందు నిలిపి
చారు శుభమూ ర్తి రాజన్యచక్రవ ర్తి
పరమమోదమునఁ బరమపదము నొందె. 561

క. అని మైత్రేయమహాముని, యనఘుఁడు విదురునకుఁ జెప్పె ననిశుకుఁ డభిమ
న్యుని సుతునకుఁ జెప్పినతెఱఁగని సూతుఁడు నెప్పె శౌనకాదులతోడన.562

-పృథుచక్రవ ర్తి సభాసదులకు సద్ధర్మము నుపదేశించి బ్రాహ్మణప్రశంస చేయుట-

వ. అ ట్లెఱింగించియు వెండియు ని ట్లనియె. ఇ ట్లిధంబున నాదిరాజన్యుం డై న పృథుచక్రవ ర్తి యశేష గుణ విజృంభితంబును, నిర్దోషంబును, సత్పురుష సత్కృతంబును నై న పృథుచక్రవ ర్తి యశంబును బ్రకటంబుగాఁ జేయంజాలు మైత్రేయునిం జూచి మహాభాగవతుం డై న విదురుం డి ట్లనియె. 563

సీ. మునినాథ! వినుపృథుజనపాల చంద్రుఁడు సొబగొప్ప మేదినీసురులచేత
రాజ్యాభిషేక సంపూజ్యుఁ డై దేవతా గణముచే లబ్ధార్హగుణుఁడు నగుచు
వైష్ణవతేజంబు వలనొప్ప ధరియించి యర్థి నె య్యే కర్మ మాచరించె
నది నాకు నెఱఁగింపు [1]మనఘాత్మ! యెవ్వని రూఢి గోదోహనరూప మైన

తే. [2]విక్రమోచ్ఛిష్ట మై యొప్పి వెలయుచుండు
కర్మమున నిప్డు రాజన్యగణము బ్రదుకు
నట్టి పృథుకీ ర్తి [3]ధరలోన నతివివేకి
తవిలి యెవ్వఁడు వినకుండు? ధన్యచరిత! 564

క. నావుడు విని మైత్రేయుం, డా విదురునిఁ జూచి పలికె నతివినయమునం
బావనచరితుఁడు పృథుఁడు ధ, రావరనుతుఁ డలఘుయశుఁడు ప్రమదం బలరన్,

సీ. రంగ దుత్తుంగతరంగ గంగాయమునా మధ్యమందు నున్నతి వసించి
కై కొని ప్రారబ్ధ కర్మ [4]సంఘములఁ బుణ్యఋయార్థంబుగా ననుభవించు
చును సర్వదేశంబులను దనయాజ్ఞ యప్రతిహత సత్ప్రతాపమునఁ జెలఁగఁ
బూని స ప్తద్వీపములకుఁ దా నొక్కండ వైష్ణవ భూసురావళికిఁ దక్క

---

1. అనఘాత్మ: భూమియే, రూఢి గవాక్యతి రూఢ యెవని (హ. తం. వా.) 2. విక్రమో ద్ధీ ప్తయై యొప్పి వెలయు నట్టి (తం. వా.) యద్విక్రమోచ్ఛిష్ట మశేష భూపాఃలో కాస్సపాలా ఉపజీవంతి కామ, మద్యాపి తన్మే వద కర్మ శుద్ధమ్ (21-10) 3. ధరవివేకై నవాడు (క-బ) 4. ఋయార్థంబు నఖల పుణ్యంబుల ననుభవింపుచును (హ)

తే. ధరణిఁ దక్కినప్రజ కెల్ల దండధరునిఁ
బోలి వర్తింపుచును గొంతకాల మరుగఁ
దవిలి యొకనాఁడు దీర్ఘసత్రంబు సేయ
నర్థిఁ గైకొని దీఱితుం డయ్యె నందు. 566

తే. రాజఋషి దేవఋషి పితృ బ్రహ్మఋషులు
జనవరునిచేత విహితపూజనము లొంది
సమధి కైశ్వర్యగతి నున్న సమయమునను
జిరశుభాకారుఁ డా రాజశేఖరుండు. 567

సీ. ఉన్నతోన్నతుఁడు సముత్తుంగభుజుఁడు స న్మహనీయతర శోభమానముఖుఁడు
చారు సంఫుల్ల కంజారుణేక్షణుఁడు సు నాసాపుటుండు మందస్మితుండు
వక్రసూక్ష్మ స్నిగ్ధ వర నీలకేశుండు కమనీయరుచి కంబుకంధరుండు
సుభగ విశాలవక్షుండును ద్రివళిశోభిత మధ్యభాగుండు పృథునితంబ

తే. మండలుండు నావర్తసమాన నాభి
వివరుఁడును గాంచనస్తంభ విలస దూరు
రాజితుండును నరుణచరణుఁడు లలిత
నవదుకూలోత్తరీయుఁ డున్నతయశుండు. 568

వ. మఱియు నియమనిమిత్తంబునం బరిత్యక్తభూషణుఁ డగుటంజేసి వ్యక్తాశేష గాత్రశ్రీకుండు, కృష్ణాజినధరుండు, శ్రీమంతుండు, కుశహస్తుండు, కృతోచితుండు, శిశిర స్నిగ్ధ తారాక్షుండు నైన పృథుచక్రవర్తి సభామధ్యంబున తారాగణమధ్య భాసితుం డగు సుధాకరునిం బోలి వెలుంగుచు లేచి నిలుచుండి సదస్య సంతోష దాయకంబులు, చిత్రపద విరాజితంబులు, ప్రసన్నంబులు, పరిశుద్ధంబులు, గంభీరార్థంబులు, నవ్యాకులంబులు నైన భాషణంబుల నిట్లనియె. 569

క. వినుఁ డీ సభ్యులు ధర్మము, ననయము నెఱుఁగంగఁ గోరునట్టి జనుఁడు దాఁ
దన తలఁపునఁ గల యర్థముఁ, జను నెఱిఁగింపంగ ధీరసత్పురుషులకుఁ. 570

సీ. ఏను నీ లోకవితానంబు లెల్లను శాసించి భూప్రజా సంతతులను
దత్త ద్విహితవృత్తి దానంబులను జేసి రక్షింప వివిధమర్యాద దప్పి
పోకుండ నిలుపుటకై కమలజుచే నియోగింపఁబడితి ని ట్లొనరియుంట
నట్టి ప్రజాపాలనా ద్యనుష్ఠాన వశంబునఁ బ్రాక్కర్మసాక్షి యీశుఁ

తే. డెట్టి వానికి సంతుష్టి నెసఁగుచుండు
నట్టివానికి నేలోక మండ్రు బుధులు
[1]కామదుఘములు నై న లోకములు నాకు
సరవి గలుగు ననుష్ఠానపరుఁడ నగుట. 571

వ. ఇట్లు ప్రజల ధర్మంబులయందు ననుశాసింపక యర్థకాముం డై వారివలన నప్ప
నంబులు గొనెనేని వారల పాపంబు దనకుఁ ప్రాపింపం దేఱోహీనుఁ డై భూ
విభుండు చెడుం గావున *(భూపతిహితార్థంబునకు స్వార్థంబునకు) ననూయా
రహితు లై ప్రజలు వాసుదేవార్పణ బుద్ధిం జేసి ధర్మం బాచరింపవలయు.
ఇదియ న న్ననుగ్రహించుట. అదియునుం గాక (పితృ దేవర్షి తుల్యు లగు మీర
లనుమోదించి) కర్తయు ననుశాసకుండు (ననుజ్ఞాతయు నై న) నాకుఁ బరలో
కంబున నేఫలంబు గలుగు నట్టి ఫలంబునకు సదృశం బై న కర్మం బాచరింప
వలయు. అట్లైన సంతోషంబు నొందుదు. అనిన వార లా రాజేంద్రున కి ట్లనిరి.

క. జననాయక ! ప్రజ లిరవొం, దిన ధర్మము లెల్ల వాసుదేవార్పణ బు
ద్ధినిఁ జేయవలయు నంటివి, యనయము న వ్వాసుదేవుఁ డనఁ గలఁడె ! మహిఁ. 572

సీ. [2]అన విని వారికి మనుజేశుఁ డను నర్హ్యతములార ! వినుఁడయ్య ! తవిలి మీరు
యజ్ఞాధిపతి యైన యఖిలేశ్వరుఁడు గొన్ని మతములఁ గలఁడు ధీమంతులార !
యట్లైన మీరలు నందుకు విప్రతిపత్తి [3]గల్గుట నుపపన్న మరయఁ
గాదంటిరేని యా ఘనునిచే రచిత మై కాంతి మంత మగు జగంబు గానఁ

తే. బడుచునున్నది యిట్టి ప్రపంచ రచిత
కర్మమై చిత్ర్య మ మ్మేటి గలుగకున్న
[4]నమర దది త దుక్తు లుపపన్నములు గావు
కాన న వ్వాసుదేవుండు గలఁడు మఱియు. 574

వ. అదియునుం గాక యీ జగద్వైచిత్ర్యంబు కర్తయైన యీశ్వరుండు లేకున్నం
గర్మవశంబునం జేసి యుపపన్నం బగు నంటి రేని. 575

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. కామదుఘమైన యట్టి లోకంబు నాకు (జ. చ. బ. డ. ద.)
2. అనిన వారికిని జనాధిపుఁడను నర్హ్య (హ) 3. గల్గుటను బ్రపన్నమరయ (హ. తం. వా.)
4. నది తదీయోక్తులను ప్రపన్నములు గావు (హ); అమర నది తదుక్తులుఁ బ్రపన్నములు గావు (హ. తం. వా)

సీ. పూని ప్రియవ్ర తోత్తానపాద ధ్రువ మనుల కస్మ త్పితామహుఁ డనంగఁ
దగు నంగ మేదినీధవునకు మఱియును వినుతి కెక్కిన పృథివీపతులకుఁ
బద్మసంభవ భవ ప్రహ్లాద బలిచక్ర వర్తి ప్రముఖ భాగవతుల కర్థి
వర్గ సుస్వ ర్గాపవర్గంబులకు ననుగత కారణుం డన ఘనత కెక్కి

తే. హీను లగు మృత్యు దౌహిత్రుఁ డైన వేన
ముఖ దురాత్ములు ధర్మవిమోహితులును
దక్కఁ దక్కినవారికిఁ దాఁ [1]బ్రపన్న
వరదుఁ డై యిచ్చు నభిమతావళుల నతఁడు. 576

వ. ఇట్టి విద్వ దనుభవంబున భువనహితుం డగు వాసుదేవుండు లేఁడనుట యుప
పన్నంబుగాదు. అదియునుం గాక. 577

ఉ. భూరి తపోభిరామ [2]ముని పూజన మెవ్వని పాదపద్మ సే
వారతి వృద్ధిఁ బొంది యనివారణఁ బూర్వ[3]భవానుసార సం
సార మహోగ్ర తాపము భృశంబుగఁ బాపఁగ నోపుఁ ద త్పదాం
భోరుహజాత దేవనదిఁ బోలి యశేష మనోఘ హారి యై. 578

వ. మఱియు. 579

చ. అనుపమభ క్తి నెవ్వని పదాంబుజమూలము మందిరంబుగా
ననయముఁ బొందువాఁడు నిహతాఖిల భూరి మనోమలుండు స
ద్వినుత విర క్తి బోధ ధృతి [4]వీర్య విశేష సమన్వితుండు దా
ననఁ దగి భూరి సంసృతి మహా త్తర దుఃఖము నందఁ డెన్నఁడుఁ. 580

క. నారాయణుండు జగదా, ధారుం డగు నీశ్వరుండు దలఁప నతనికిఁ
లే రెందు సములు నధికులు, ధీరో త్తముఁ డతఁడు నద్వితీయుం డగుటఁ. 581

వ. అదియునుం గాక. 582

ఉ. కర్మవశంబునం జగము గల్గును హెచ్చు నడంగు నన్నచోఁ
గర్మము బుద్ధిఁ జూడ జడకార్యము గాని ప్రపంచ కల్పనా
కర్మమునందుఁ గ ర్త యనఁగా విలసిల్లఁగఁజాల దీ జగ
త్కర్మక కార్యకారణము గావున నీశుఁడు విష్ణుఁ డారయఁ. 583

వ. కావున మీర ల వ్వాసుదేవుని నధికారానుసారంబున నిశ్చితార్థఫలసిద్ధి గలవార
లై మనో వా క్కాయ కర్మంబుల నిష్కపటవృ త్తిం దగిలి వినుతి నతి

---

1. బ్రపన్న (హ) 2. పూజ్యము లెవ్వని (చ. జ. డ.) 3. భవానుబంధ (ట. జ.)
4. వీర్యవిశేష మనీష వంతుడుఁ (క. చ. ట. త. బ.)

పరిచర్యా పూర్వకంబుగాఁ గామదుఘుంబు లైన యతని పాదపంకజంబులు భజి
యింపుండు. అదియునుం గాక. 584

సీ. రూఢి నీశ్వరుఁడు స్వరూపంబునంజేసి పూని విశుద్ధ విజ్ఞాన ఘనుఁడు
నగుణుండు [1]నైనఁ దా నరయని కర్మమార్గమునందు వ్రీహ్యాది ద్రవ్యములను
శుక్లాది గుణము విస్ఫుర దవఘాతాది సత్క్రియలును మంత్ర సంచయంబు
సంకల్పమును యాగసాధ్య మైనట్టి యఖండోపకారంబు ఘనపదార్థ

తే. [2]శక్తియు మఱి జ్యోతిష్టోమ సంజ్ఞకమ్మ్ర
నను ననేక విశేష గుణతను మెఱయు
నట్టి యధ్వరరూప మై యఖిల జగము
నందు ననిశంబు ప్రఖ్యాతి నొందుచుండు. 585

వ. అదియునుంగాక దారుస్థితం బైన యనలంబు తద్దారు గుణంబు లైన దైర్ఘ్య
వక్రత్వాదికంబుల ననుసరించు చందంబున నవ్యక్తంబును, దత్ క్షోభకం బైన
కాలంబు, వాసనయు, నదృష్టంబు నను కారణంబులచేతం బుట్టిన శరీరంబునందు
విషయాకారం బైన బుద్ధి నొంది, త ద్విషయాభివ్యంగ్యం బైన యానంద
స్వరూపుం డగుచు క్రియాఫలంబునఁ బ్రసిద్ధియు నొందు. అని చెప్పి వెండియు
నిట్లను. మదీయ జనంబు లీ మేదినీతలంబున దృఢవ్రతు లై యజ్ఞభుగీశ్వరుం
డును, గురుండును నైన సర్వేశ్వరుని హరిని నిరంతరంబును స్వధర్మయోగం
బునం బూజింపుచున్నవారలు. (వారు) న న్నాశ్చర్యకరంబుగా ననుగ్ర
హించువారు. అని హరిభక్తిరతు లైన య మ్మహాత్ముల నుతియించి వెండియు
నిట్లనియె. 586

మ. వర సంపద్విభవ ప్రతాప [3]మహదైశ్వర్యంబులం బొల్చు నీ
ధరణీనాథుల తేజ మంచిత తపో దాంతి క్షమా విద్యలం
గర మెప్పారు ధరాసుపర్వ హరిభక్తశ్రేణులం దెప్పుడుం
ధరలోనం బ్రభవింపకుండు నని యద్ధాత్రీవిభుం డిట్లనున్. 587

చ. అరయఁగ నే ధరామర పదాంబుజ రేణువు లర్థిఁ దాల్చి య
ప్పరమ పురాణపూరుషుఁడు బ్రాహ్మణదేవుఁడు నైనయట్టి యీ
శ్వరుఁడు [4]సదానపాయినిని సాగరకన్యను సర్వలోక వి
స్ఫురిత పవిత్రకీర్తియును బొంది విభూతిఁ దనర్చుఁ గావునన్. 588

---

1. నయినను నరయ నీ (చ. ట. త. జ. డ.) 2. శక్తియును మఱి సోమాది సంజ్ఞికమ్మ్ర(హ)
3. సుమహైశ్వర్య (తం. వా.) 4. సదానపాయియగు (హ)

సీ. ఏ వసుధామర సేవను జేసి యశేషగుణాన్విత స్థితిఁ దనర్చు
సర్వేశ్వరుఁడు మఱి సంతుష్టుఁ డగు నట్టి ధరణి[1]దివిజులఁ ద ద్ధర్మపరులు
నలఘు వినీతులు నై యవశ్యంబును [2]సేవింపరే! ధరాదేవ నిత్య
సేవచేఁ బురుషుఁడు చిరతర జ్ఞాన విద్యాభ్యాసి గాకున్న నైన నతఁడు

తే. వేగమున నంతరంగంబు విశద మగుటఁ
జేసి కైవల్య పదమునుఁ జెందు నట్లు
గాన లోకులు భూదేవతా నికరముఁ
దగిలి భజియింపవలయు నుదాత్త మతిని. 589

వ. మఱియు. 590

సీ. విజ్ఞానఘనుఁ డన వెలయు నీశ్వరుఁడు తత్త్వ జ్ఞాను లైనట్టివారిచేత
దీపింప నింద్రాది దేవతోద్దేశంబు ననుఁ భూమిసుర ముఖంబున హుతంబు
లగు హవిస్సులఁ దృప్తి నందినగతి నచేతన మైన హుతాశన ముఖంబు
వలన వేల్చిన హవిస్సులచేతఁ దృప్తుండు గాకుండుఁ గావున లోకమందు

తే. నగ్నిముఖమునకంచె ధరామరేంద్ర
ముఖము పరిశుద్ధ మత్యంత ముఖ్య మనఁగఁ
దనరు నదిగాన భూసురార్చనము సకల
జనులు గావింపఁ దగు నార్యజనములార! 591

వ. అదియునుం గాక, 592

సీ. ఏ వేదమం దేని యీ విశ్వమెల్లను [3]దర్పణ ప్రతిబింబిత ప్రభూష
నివహంబు కైవడిఁ [4]దవిలి ప్రకాశించు [5]నట్టి విరజమును నవ్యయంబు
నగుచు సనాతనం బగు వే దమే ధరాదేవతాజనములు దినముఁ దగిలి
[6]మహిత శ్రద్ధా తపో మంగళ మౌన సంయమ సమాధులఁ బొలుపారు చుండి

తే. యర్థ సదసద్విచారు లై యధికరింతు
రట్టి వారల పద[7]రజం బర్థిఁ దాల్చు
నలఘులకు సర్వ పాపక్షయంబు నఖిల
సద్గుణావాప్తియును నగుఁ జతురులార! 593

---

1. దివిజులు (హ) 2. సేవింపుఁడీ (హ) 3. దర్పణ ప్రతిబింబిత మగు వస్తు (హ. వా.) 4. దివిరి (హ) 5. నది విరజము మఱి యవ్యయంబు (హ) 6. మహిని (హ) 7. రజంబంది తాల్చు (హ)

వ. కావున నట్టి విప్రపాద సరోజరేణువు లేనును గిరీటంబున ధరియింతు. ఇట్లు బ్రాహ్మణ భజనంబునం జేసి యవాప్త సకల గుణుండు, శీలధనుండు, కృత జ్ఞుండు, శ్రద్ధాయుక్తుండు నైన మహాత్ము నఖిల సంపదలు ప్రాపించు. కావున గోబ్రాహ్మణ కులంబును, ననుచర సమేతుం డైన జనార్దనుండును నాయెడం బ్రసన్ను లయ్యెదరు గాక. అని పలుకుచున్న పృథుచక్రవర్తిం గనుంగొని పితృ దేవ ద్విజ సత్పురుషులు సంతుష్టాంతరంగు లై సాధువాదంబుల నభినందించి యిట్లనిరి. 593

క. మనుజేంద్ర! నీ కతంబున, ననుపమ ఘన బ్రహ్మదండహతుఁ డత్యఘవ
ర్తనుఁడు నగునట్టి వేనుం, డనయము నరకంబువలన నర్థిఁ దరించెఁ. 594

వ. కావునం 'బుత్రేణ లోకాఁ జయతి' యను వేదవచనంబు నిశ్చయంబు. అదియు నుం గాక. 596

చ. పురుషవరేణ్య! హేమకశిపుండు రమాలలనేకు నిందచే
నరకము నందఁగోరియు గుణజ్ఞుఁడు భాగవతుండు నైన యా
వర తనయప్రభావమున వాసికి నెక్కి విధూతపాపుఁ డై
[1]నిరయముఁ బొందఁ డయ్యె నతి నిర్మలకీర్తిఁ దనర్చెఁ గావునఁ. 597

క. అని పలికి వీరవర్యుం, డనఁ దగు[2] పృథుచక్రవర్తి నయుతాబ్దంబుల్
దనరఁగ జీవింతువు గా, కని తగ నాశీర్వదించి యభిమత మొప్పఁ. 598

వ. వెండియు నిట్లనిరి. †(దేవా! నీకు సకల లోకభర్త యగు నారాయణునందు నిట్టి భక్తి వొడముటంజేసియు) బ్రహ్మణ్యదేవుండు, నుత్తమశ్లోకుండు నైన సర్వేశ్వరుని సత్కథాజాలంబు వ్యక్తంబుసేయుచున్న నీవు మాకు నాథుండ వగుటంజేసియు, నేము ముకుందదాసుల మైతిమి. భవదీయ ప్రజాశాసనంబును ప్రజానురాగంబును గారుణ్యమూర్తు లైన మహాత్ములకు స్వభావంబులు గావున నాశ్చర్యంబు గాదు. దైవసంజ్ఞితంబు లైన కర్మంబులచేత వినష్టజ్ఞానుల మై పరిభ్రమించు మాదగు తమఃపారంబుఁ గంటిమి. ఏ సర్వేశ్వరుండు బ్రాహ్మణ జాతి నధిష్ఠించి క్షత్రియులను, క్షత్రియజాతి నధిష్ఠించి బ్రాహ్మణులను, నీ యుభ యంబు నధిష్ఠించి విశ్వంబును భరించు నట్టి వివృద్ధసత్త్వుండు, సర్వరూపుండు, మహాపురుషుండు నైన పృథునకు నీశ్వరబుద్ధిం జేసి యేము నమస్కరింతు మను సమయంబున. 599

---

1. నిరయమునందు బొందక వినిర్మల కీర్తి (క. ట. జ. డ.) 2. శాశ్వతంబులగు హాయన ముల్ (హ) † తా. ప. ప్రతులలో లేదు.

అధ్యాయము - ౨౨

—: పృథుచక్రవర్తి యొద్దకు సనకాదు లరుగుదెంచుట :—

క. వినువీథినుండి మెల్లన, జనుదెంచిరి బాలసూర్య సంకాశతనుల్
జనవినుత ! సిద్ధవర్యులు, సనకాదులు శేముషీ విచక్షణు లంతన్. 600

వ. ఇట్లు చనుదెంచిన. 601

క. అనఘాత్మ లతిథిరూపం, బున రా గృహమేధి ప్రాణములు నుద్గతిచేఁ
దనరినఁ బ్రత్యుద్గతి [1]వం, దనముల మరలం బ్రతిష్ఠితము లగు ననుచున్. 602

క. వినఁబడు వచనన్యాయం, బున నుద్గతము లగు ప్రాణములఁ గ్రమ్మఱఁ బొం
దను గోరువాఁడునుం బలె, ననుచర ఋత్వి క్సదస్యుఁ డై పృథుఁ డంతన్. 603

తే. [2]ఇంద్రియేశుఁడు గంధాది కేష్టగుణముఁ
గూర్చి యుద్గమనక్రియఁ గోరి చేయు
పగిదిఁ బృథుచక్రవర్తి సంభ్రమముతోడ
మహితభక్తినిఁ బ్రత్యుద్గమంబు సేసె. 604

క. ఘనగౌరవమున న మ్మునిఁ, జన చిత్తవశీకృతుండు సభ్యుఁడు ప్రియుఁడున్
వినయానత కంధరుఁ డై, జనవరుఁ డా పరమయోగిచంద్రుల నెలమిన్. 605

సీ. పూని యర్ఘాసనాసీనులఁ గావించి కర మర్థి విధివ త్ప్రకారమునను
బూజించి త త్పదాంభోరుహ క్షాళనసలిలంబు లాత్మమ స్తమునఁ దాల్చి
హాటకకలిత సింహాసనాసీను లై విహితాగ్నులను బోలి వెలుఁగుచున్న
శర్వాగ్రజన్మ్మల సనకాదులను జూచి యతుల శ్రద్ధా సంయ మాన్వితుండుఁ

తే. బరమ సంప్రీతమతియు నై పలికె రాజు
గోరి యో మంగళాయనులార ! పూర్వ
భవమునం దెద్ది మంగళప్రద సుకర్మ
మేను జేసితి ? మిముఁ జూడ నిపుడు గలిగె. 606

వ. అని వెండియు. 607

క. భువి నెవ్వనియెడ విప్రులు, భవుఁడును విష్ణుఁడుఁ దదీయభక్తులును బ్రస
న్నవదను లగుదురు వానికి, భువిని దివి నసాధ్యకర్మములు లే వనఘా ! 608

వ. అని మఱియు ననఘాత్ములారా ! లోకంబుల నీక్షింపుచుం బర్యటనంబు సేయు
మిమ్ము సర్వదర్శనుం డైన యాత్మనుం గనుంగొనం జాలని సర్వదృశ్యంబు

---

1. వం,దనముల పునఃప్రతిష్ఠితము (క. జ.) 2. ఇంద్రియాధీశు డగు జీవు డింద్రియముల(క. చ.)

చందంబున నీ లోకంబు గనుంగొనం జాలకుండు. అట్టి మహాత్ముల నైన మీ
దర్శనంబునంజేసి [1]యేను ధన్యుండ నైతి. అదియునుం గాక. 609

చ. అరయ ధరిత్రి నెవ్వనిగృహంబు మహార్హ [2]జనోపభోగ్య వి
స్ఫురిత తృణాంబు భృత్య గృహభూముల సారెఁ దనర్చు నట్టి మం
దిరపతి వేదయైన జగతిం గడు ధన్యుఁ డటంద్రు గాన సు
స్థిరమతి మీరు వచ్చుట నశేషశుభంబుల నేను బొందెదన్. 610

వ. అదియునుం గాక. 611

చ. వరమతులార! యెవ్వని నివాసముఁ [3]దీర్థపదాంతరంగు లై
పరఁగినయట్టి భాగవత పాదజలంబులు సోఁకవేని త
త్పురుషుఁడు భూరిసంపదలఁ బొంపిరిపోయిన నైన వాని మం
దిర మురగప్రకీర్ణ జగతీజముఁ బోలు నటంద్రు కోవిదుల్. 612

వ. అని పలికి వెండియు నిట్లనియె. 613

సీ. పరమపావనులార! బాల్యంబునం దుండి మానిత శ్రద్ధాసమన్వితులును
గుణనిధుల్ ధైర్యయుక్తులు ముముక్షువులు నై యధికవ్రతంబుల నాచరింతు
రట్టి పుణ్యులు భవదాగమనంబు స్వాగతమయ్య! సత్కృపాకలితులార!
యనివారిత వ్యసనార్ణవం బైనట్టి భూరి దుర్లంఘ్య సంసారమందు

తే. [3]మతివిహీన స్వకీయ కర్మములఁ జేసి
యడరి మగ్నుల మై యింద్రియార్థములనె
తివిరి పురుషార్థములు గాఁగఁ దెలియు మాకుఁ
గుశల మున్నదె? లోకైక కుశలులార! 614

వ. మీరలు నాత్మారాము లగుటంజేసి మీయందుఁ గుశలాకుశలరూపంబు లైన
మతివృత్తులు సంభవింపవు. కావునం గుశలప్రశ్నం బుపపన్నంబు గాదు. కాన
నేను గృతవిశ్వాసుండ నై సంతప్తు లైన వారలకు సుహృత్తు లైన మిమ్ము
నాకు నీ సంసారంబునందు నేమిట వేగంబ క్షేమంబు గలుగు నని యడిగెద.
ఆత్మవంతులకు నాత్మయు, నాత్మభావనుండు నైన యీశ్వరుండు భక్తానుగ్ర
హంబుకొఱకు నీ లోకంబుల మీ వంటి సిద్ధరూపంబున వర్తింపుచుండు. అని
పలికిన యతని గంభీరార్థ గౌరవంబులును, [4]శుభకరంబులును, న్యాయ సహితంబు

---

1. యేము ధన్యుల మైతిమి (క. చ. ట. త.) 2. యోగ్య (క. తం.) 3. మరిగియున్న (క)
4. శోభమానంబులు (క. త. డ.)

లును, మితాక్షరంబులును, శ్రోత్రప్రియంబులును నైన వచనంబులు విని, సంప్రీత చేతస్కుండును, మందస్మితుండును నై సనత్కుమారుం డిట్లనియె. 615

మ. ధరణీశోత్తమ! సర్వభూత హిత[1]చేతస్కుండ వై ధర్మసు
స్థిర భాగ్యోదయ[2]శాలి వై యెసఁగు నీచే సాధులో కోత్తరో
త్తర సంప్రశ్నము సేయఁగాఁబడె మహాత్మా! సాధులోకైక స
చ్చరితంబుం దలపోయ నిట్టిద కదా! చర్చింప లోకత్రయిన్. 616

తే. ధరణి సజ్జనసంగంబు దలఁప నుభయ
సమ్మతం బగు వారలు సలుపునట్టి
సరస సంభాషణ ప్రశ్న సరణి నిఖిల
జనములకు సుఖకర మగు జనవరేణ్య! 617

వ. అని యభినందించి మోక్షసాధ నోపదేశకాముం డైన పృథుచక్రవర్తికి వెండియు నిట్లనియె. 618

సీ. ధరణీశ! మధునిషూదనుఁ డైన యట్టి నారాయణు లలిత పాదారవింద
వర గుణధ్యాన ధీ పరిణతత్వంబున సకలాత్మ మలవిమోచనము నైన
రతియును నిత్యవై రాగ్యంబు మొదల నే లోకోత్తరుఁడ వైన నీకుఁ గలవు
సమ్యగ్విచార! శాస్త్రములందు జనులకు నేమంబునకును నిశ్చితము లైన

తే. [3]యాత్మ కన్యము లగువానియందు వీత
రాగత దలంప నిర్గుణబ్రహ్మ మైన
యాత్మయందుల రతియును ననఁగ నివియ
హేతువులు బుద్ధిఁ జింతింప నిద్ధచరిత! 619

వ. కావున శ్రద్ధయు, భగవ ద్ధర్మచర్యయుఁ, ద ద్విశేషజిజ్ఞాసయు, నాధ్యాత్మిక యోగనిష్ఠయు, [4]యోగేశ్వరోపాస్తియుఁ, [5]బుణ్యశ్రవణుం డైన నారాయణ కథాలాపంబు, నర్థేంద్రియారాము లై నవారలతోడి సంగతియందు [6]విరక్తియు, వారల కభిమతంబులై న యర్థకామంబులందు ననాకాంక్షయు, సర్వేశ్వరుని గుణకీర్తనామృతపానంబు దక్క నితరపదార్థ వైరాగ్యంబు నొంది యాత్మా రామతం గలిగి విజనస్థలంబులందుల రుచిగలుగుటయు, నహింసయు, [7]శమాది ప్రధాన వృత్తియు, నాత్మహి తానుసంధానంబును, భగవత్క థానుస్మరణంబును,

---

1. చేతస్కుండవు (క) 2. శాలియునైన (క. చ. డ. ద.) 3. ఆత్మవ్యతిరిక్త వస్తువునందు (చ.జ ద.) 4. యోగీశ్వరోపాస్తి (హ. తం. వా.) 5. బుణ్యశ్లోకుడు (క.ట.) 6. విరతియు (క. చ. జ. డ) 7. శమదమాది (క. చ. త,)

నకామ్యంబు లైన యమనియమంబులు *(నితర భక్తిమా ర్గాగర్హ్యాణంబును, యోగక్షేమార్థ క్రియారాహిత్యంబును) శీతోష్ణాది ద్వంద్వసహిష్ణుతయు, భాగవత కర్ణాలంకారభూతంబు లగు భగవద్గుణాభిధానంబులు నను వీనిచేత విజృంభమాణం బైన భక్తియోగంబునంజేసి యనాత్మయందు నసంగంబును, (గార్యకారణ రూపం బగు) నిర్గుణ బ్రహ్మంబునందు రతియు నెప్పుడు గలుగు నప్పుడ సదాచా ర్యానుగ్రహవంతుం డైన పురుషుండు (బ్రహ్మనిష్ఠులతోడఁ) జెలిమి నేయుచు నీషణత్రయంబు వర్జించి ప్రకృతిం జేరక జ్ఞానవైరాగ్య వేగంబునం జేసి. 620

సీ. అనఘ! సాక్షాత్కార మగు భక్తియోగాగ్నిఁ గడఁగి జీవాధారకమును [1]బంచ
భూతాత్మకంబు నై పొలుచు హృద్గ్రంథినిఁ బూని స్వకారణభూత మైన
యరణి దహించు హుతాశను కైవడి నిర్దహించిన నిట్లు నెఱసి దగ్ధ
చిత్తుఁ డై ముక్త నిశ్శేషాత్మగుణుఁడు సద్ధర్ముఁడు నైన యతండు మిగుల

తే. నర్థి బాహ్యంబు లైన ఘటాదికములు
నాంతరము లైన సౌఖ్యదుఃఖాదికములు
నను విభేదము లాత్మ [2]భేదనము లగుట
న య్యుపాధివినాశంబు నందఁగలఁడు. 621

వ. అది యెట్లనిన 622

చ. పురుషుఁడు నిద్రవోఁ గలలఁ బొందిన యాత్మసుఖైకహేతు వై
పరఁగిన రాజభృత్యజన భావ గుణంబులు సంప్రబోధమం
దరయఁగ మిథ్య యైనగతి నాంతర బాహ్య గుణప్రభేదముల్
పరువడి గానకుండు జనపాలనశీలన! నిత్యఖేలనా! 623

వ. మఱియును ద్రష్ట యైన యాత్మయు, దృశ్యం బైన యింద్రియార్థంబు ననువీనికి నహంకారంబు సంబంధహేతు వగుటంజేసి, యది యంతఃకరణంబునం గలుగుచుండు జాగ్ర త్స్వప్నంబులయందు నీ భేదంబు గనుంగొనుచుండు. ఇట్టి యంతఃకరణంబు లేనిది యగు సుషుప్తికాలంబునం బురుషుండు జలదర్పణాది నిమిత్తాభావం బగునప్పుడు బింబప్రతిబింబభేదంబు గనుంగొనని చందంబున దృశ్య భేదంబు గనుంగొనకుండుం గావున నంతఃకరణవిలయంబు నొందిన బాహ్యాంతర భేదంబు గనకుండుట నిశ్చయం బని వెండియు నిట్లనియె. 624

---

* తా. ప. ప్రతులలో లేవు.

1. బంధ (తం.వా.) 2. భేదకములగుట(హ); సాధకములగుట(క); సాధనములగుట (జ.డ.బ.)

సీ. భువి విషయాకృష్టభూతంబు లైన యింద్రియములచేతను దివిరి మనము
దగ విషయాసక్తిఁ దగిలి యాంతర మైన మహిత విచారసామర్థ్య మెల్ల
శరకుశాది స్తంబ జాలంబు ప్రాదతోయములు ప్రగోలుగతిఁ ప్రగమంబున హరించు
నీ రీతి నంతర్విచార సామర్థ్యంబు నపహృతం బైన పూర్వాపరాను

తే. మేయ [1]సంధానరూప సంస్మృతి నశించు
నది నశించిన విజ్ఞాన మంతఁ దొలఁగు
నట్టి విజ్ఞాననాశంబు నార్యజనులు
స్వాత్మ కది సకలాపహ్నవం బటంద్రు. 625

వ. అదియునుం గాక "ఆత్మన స్తు కామాయ సర్వం ప్రియం భవతి" యను వేద వచనంబునంజేసి విషయంబులకుం ప్రియతమత్వంబై యాత్మోపాధికంబు నొంది, యాత్మాపహ్నవంబునం బాటిల్లు స్వార్థనాశం బెద్ది గలుగు దానికంటె లోకం బున నధికం బైన స్వార్థనాశంబు లేదు. అది యెట్లనిన సర్వార్థనాశంబునకు స్థైర్యంబు నొందించునట్టి యర్థకామాభిధ్యానంబునం ద ద్ధేతుకం బైన స్వార్థ నాశంబునం బరోక్షాపరోక్షరూప జ్ఞానంబు నశించుం గావున నాత్మాపహ్నవంబున కంటె నధికతరం బైన సర్వార్థనాశంబు లేదు. అని వెండియు నిట్లనియె, 626

సీ. ఆనఘ ! యీ సంసార మతిశయంబునఁ దరియింపంగ మది నిశ్చయించువాఁడు
గైకొని ధర్మార్థ కామ మోక్షములకు నతివిఘాతుక మెద్ది? యట్టిదాని
వలన సంగము సేయవలవదు ధర్మాదులందుఁ ద్రివర్గంబు నంతకోగ్ర
భయకారి యగుటను బరమమోక్షంబె ముఖ్యార్థ మై విలసిల్లు నంద్రు బుధులు

తే. భువి గుణవ్యతికరమునఁ బుట్టినట్టి
యబ్జజాతాదులకు నస్మ దాదులకును
గాలవిధ్వంసి తాఖిలక్రమము గల్గుఁ
గలుగ దెన్నఁడు సేమంబు గాన వినుము. 627

వ. కావున మోక్షంబె పరమపురుషార్థం బని చెప్పి వెండియు నిట్లనియె. నరేంద్రా ! దేహేంద్రియ [2]ప్రాణ బుద్ధ్యహంకార పరివృతంబు లైన యీ స్థావరజంగమంబుల హృదయంబులందు వ్యాపకుండును, ప్రత్యక్షభూతుండును, ప్రత్యగ్రూపుండును, భగవంతుండును, నైన యీశ్వరుం డంతర్యామి రూపంబునం ప్రకాశింపుచుం డును. అదినారాయణుని సదూపంబుగాఁ దెలియుము. అని వెండియు నిట్లనియె.

---

1. సంధానురూప (హ) 2. ప్రాణేంద్రియ (హ)

ఉ. భూవర ! యే మహాపురుష భూషణునందుల నీ సమస్త వి
శ్వావళి లీలమై సదసదాత్మక భావము నొంది భూరి మా
యావిభవంబులం [1]దగి సమగ్ర వివేకవిరోధి ప్ర గ్ల్భనా
శీవిషబుద్ధిఁ [2]దోఁచుచు విశేషగతిన్ వెలుఁగొందు నెప్పుడున్. 629

చ. సుమహిత నిత్యముక్త పరిశుద్ధ విబుద్ధ సుతత్త్వుఁ డై యురు
క్రముఁ డభిభూత సత్ప్రకృతి కర్మకళంకుఁడు నై న యట్టి యు
త్తమచరితుం గృపాకరు నుదాత్తగుణోన్నతు నీశ్వరేశుఁ జి
త్తమునఁ దలంపుమయ్య ! జనతా పరిరక్షణ ! దుష్టశిక్షణా ! 630

సీ. వసుమతీనాథ ! యెవ్వని పాదపద్మపలాశవిలాస సల్లలితభ క్తి
సంస్మరణంబుచే సజ్జనప్రకరంబు ఘనకర్మసంచయ [3]గ్రథిత మగు న
హంకార మను హృదయగ్రంథిఁ [4]జెఱుతురు వివరింప నిట్లు నిర్విషయమతులు
మహి నిరుద్ధేంద్రియమార్గులు నై నట్టి [5]యతులకుఁ జేరంగ నలవికాని

తే. యట్టి పరమేశుఁ గేశవు నాదిపురుషు
వాసుదేవుని భువనపావనచరిత్రు
నర్థి శరణంబుగాఁ ద త్పదాంబుజములు
భ క్తి సేవింపు గుణసాంద్ర ! పార్థివేంద్ర ! 631

మ. అరిషడ్వర్గ [6]మహోగ్ర నక్రనికర వ్యాకీర్ణ సంసార సా
గర మబ్జోదర [7]కీ ర్తనాతరణి సాంగత్యంబునం బాసి తా
[8]మరుదార న్నసుఖావహ ప్రకట యోగాది క్రియాయు క్తిచేఁ
దరియింప న్మదిఁ గోరువారలకు దుర్దాంతం బగుం గావునన్. 632

మ. ధరణీశో త్తమ ! నీవు కేవల సముద్యద్భ క్తి ధీయు క్తివై
వర గోవింద పదారవిందయుగ భాస్వ న్నావ సంధించి దు
స్తర భూరి వ్యసనాక రోల్లసిత దుర్దాంతోగ్ర గంభీర సం
సరణాంభోధిఁ దరింపుమయ్య ! పర మోత్సాహంబు దీపింపఁగన్. 633

క. అని యీగతిఁ బంకరుహో, సనసుతుఁడు[9]ను బ్రహ్మబోధశాలియు నగు నా
ఘన యోగివల్లభునిచే, తను దెలియఁగఁబడిన బ్రహ్మతత్త్వం డగుచున్. 634

---

1. దగిలియగ్ర వివేక (చ.ట జ.డ.) 2. దోపుచు (హ) 3. గ్రథితమైన (క.జ.డ.ద.బ.) 4. చేరరు (హ) 5. యతులును జెరుపలేరేమి జెప్ప (క.చ.త.జ.డ.బ.ద.) 6. మహోర్మి నక్ర (హ. తం. వా) 7. కీర్తనాద్యుడుప (హ) 8. అరుదారంగ నఘూపహా .... (హ. తం. వా.) "భవార్ణవ మప్ల వేశాఃషడ్వర్గ నక్ర మసుభేన తితీర్ష యంతి" అని మూలము (22-40) 9. సనత్కు మార సన్మని నాథుం, డనుయోగి (హ)

క. జనపతి మునిఁ బొగడి ముదం, బున నిట్లనుఁ బూర్వ[1]కాలమున దీనజనా
వనుఁ డైన యీశ్వరునిచే, తను [2]నేను ననుగ్రహింపఁ దగితి మునీంద్రా! 635

క. వినుఁ డట్టి యనుగ్రహ సా, ధనమునకై మీర లిపుడు దగ నిచ్చటికిం
జనుదెంచితిరి దయాళులు, ననఘులు [3]భగవత్తములును నగు మీచేతఁ. 636

సీ. నిరతంబు నాయందు నిష్పాదితము లగు దేహసమేత మదీయరాజ్య
సర్వసంపదలును సద్ద్విజ దత్తముల్ గావునఁ బ్రాణ కాంతా విభూతి
మందిర సుత రాజ్య మహి బల కోశ పరిచ్ఛదంబుల నెల్ల ధృతిఁ దలంప
రాజుకు భృత్యుండు రాజకీయము లగు తాంబూలముఖ పదార్థములఁ జేసి

తే. సమత సంతర్ప ణోపచారములు నడపు
గతిని వారల కవి నివేదితము లయ్యెఁ
గాన మీ కుపచార మేగతి నొనర్తు?
నతులగుణసాంద్ర! యోగికులాబ్ధిచంద్ర! 637

వ. అది యెట్లు బ్రాహ్మణాధీన మంటిరేని, సేనాధిపత్య రాజ్య దండ నేతృత్వ సర్వలో కాధిపత్యంబులు వేదశాస్త్రవేది యైన బ్రాహ్మణునకుం గాని, యితరు లకు యోగ్యంబులు గావు. కావున బ్రాహ్మణులకు భోజన వసన దానంబులు స్వకీయంబు లై యుండు. ఈ త్రియాదులకు బ్రాహ్మణానుగ్రహంబున నన్న మాత్రంబు దక్కుం దక్కిన వస్తుస్వాతంత్ర్యంబు లేదు. కావున మీకు గురుదక్షిణ నేమి సమర్పించువాఁడ? అదియునుం గాక స్వాతంత్ర్యంబు గలిగిన నిట్టి యధ్యాత్మవిచారులు వేదాంతవేదులు నై భగవద్భక్తి నుపదేశించెడు మీవంటి పుణ్యాత్ములకుం బరిహాసాస్పదుండు దక్కుఁ దక్కినవాఁ డెవ్వం డంజలిమాత్రంబు దక్కుఁ దక్కిన ప్రత్యుపకారంబు సేయం దలంచు? అది గావున దయాళువు లై న మీరలు స్వకృతోపకారంబునం జేసి సంతుష్టాంతరంగు లగుదురు గాక. అని పలుకుచున్న యాదిరా జైన పృథుచక్రవర్తిచేతం బూజితు లై యాత్మయోగ నిష్ఠు లై న సనకాదు లతని స్వభావంబుఁ బ్రశంసింపుచు సమస్తజనంబులు సూచు చుండ నాకాశగమనంబునం జనిరి. అయ్యవసరంబున. 638

—: పృథుచక్రవర్తి జ్ఞానవైరాగ్యవంతుఁ డగుచు ముక్తినొందుట :—

ఆ. విను మహాత్మ! ముఖ్యుఁ డన నొప్పు వైన్యుఁ డే
కాగ్రచిత్తుఁ డగుచు నాత్మనిష్ఠుఁ
డై నయట్టి తను నవాప్తకామునిఁ గాఁగ
బుద్ధిలోనఁ దలఁచె భూవరుండు. 639

---

1. జన్మమున నేదీనా (హ) 2. నిక్క మనుగ్రహింప (హ) 3. భాగవతవరులు నగు నుత్తములున్ (హ. వా.)

వ. అంత. 640

సీ. కర్మంబులను యథాకాల దేశోచిత బల విత్తములుగాఁగఁ [1]బరఁగు ధర్మ
ములను బ్రహ్మార్పణబుద్ధినిఁజేసి [2]నిరాసక్తుఁడగుచు సమాహితుండు
ప్రకృతికంటెను దన్నుఁ బర మైన యాత్మను గర్మసంచయ సాక్షిఁ గాఁగ బుద్ధి
నర్థిఁ దలంపుచు[3] నాచరింపుచు నట్లు మెఱసి సామ్రాజ్య లక్ష్మీసమేత

తే. మంది రోద్యాన వనభూములందు రాజ్య
గరిమ వర్తింపఁగా నహంకారరహితుఁ
డగుచుఁ దన చిత్తమున నింద్రియార్థములను
[4]దగులకయ యుండె నాతండు తరణిపగిది. 641

వ. ఇట్లధ్యాత్మ యోగనిష్ఠుం డై కర్మంబుల నాచరింపుచు నర్చి యను భార్య
యందు విజితాశ్వుండు, ధూమ్రకేశుండు, హర్యశ్వుండు, ద్రవిణుండు, వృకుండు
నను నాత్మసము లైన పుత్రుల నేవురం గనియె. అంత. 642

క. జనవినుత! భూమివలనను, ధనముల మర్యాదఁ గొనుచు దాననిమిత్తం
బునఁ గ్రమ్మఱఁ దా నిచ్చుచు, దిననాయకుఁ బోలి వసుమతీవిభుఁ డొప్పెన్. 643

వ. అతండు మఱియు నగ్నిచందంబునం దేజోదుర్ధర్షుండును *(మహేంద్రుని పగిది
దుర్జయుండును) ధరణికరణి సతత క్షమాయుక్తుండును †(స్వర్గంబునుంబోలె
నభీష్టదుండును, బర్జన్యునిభాతిఁ గామిత ప్రవర్షణుండును, సముద్రురీతి గాంభీర్య
యుక్తుండును) మేరువుపోలికి సత్త్వవంతుండును, ధర్మరాజుకైవడి ననుశాస
కుండును (మహేంద్రునివిధంబున నైశ్వర్యవంతుండును) కుబేరునిమాడ్కి ధన
వంతుండును, వరుణునిసరణి గుప్తార్థుండును, సర్వాత్మకుం డగు వాయువు
చొప్పున బలౌజస్తేజో యుక్తుండును, రుద్రునిపగిది నసహ్యతేజుండును, గంద
ర్పునియనువున సౌందర్యవంతుండును, మృగరాజునోజ నధిక శౌర్యోపేతుండును,
మనువురూపున వాత్సల్యయుక్తుండును, నజునిచందంబునం బ్రభుత్వసమేతుం
డును, బృహస్పతిగరిమ బ్రహ్మవాదియు, సర్వేశ్వరునిజాడ జితేంద్రియుండును
నై విష్వక్సేనానువర్తు లైన గో గురు విప్రజనంబులందు భక్తి గలిగి, లజ్జా
వినయ శీలంబులందుం, బరోపకారంబునందును నిరుపమం డై యి ట్లిధంబున
సర్వ లోకపాలక పృథగ్విధ గుణంబుల నన్నింటినిం దా నొక్కరుండ ధరియించి.

---

1. బరమధర్మ (క.డ.ద.బ.) 2. నిరాసంగుడగుచు (క.చ.త.డ.ద.) 3. కర్మాధ్యక్షుం చ
మన్వాన ఆత్మానం ప్రకృతేః పరమ్. (22-51) అని మూలము, 4. దగులకుండెను నమ్మహాత్మాదారు
డంత (క. బ. తం. వా.)"నా సజ్జతేంద్రియార్థేషు నిరహంమతి రర్కవత్" (22-52) * కొన్ని ప్రతు
లలో లేదు. † ఈ భాగము మూలములో నున్నది. వ్రాఁతప్రతులలో లేదు.

క. అనఘాత్మక! లోకత్రయ, మున సజ్జన కర్ణరంధ్రముల వినఁబడు నా
వినుత యళోమహానీయుఁడు, జనవినుతుం డగును[2] రామచంద్రుని మాడ్కిఁ.

చ. సరస వచోర్థ సత్పురుషసంఘ సమంచితగీయమాన సు
స్థిర వర[1]కీర్తిపూరము సుధీజన కర్ణములందు నించి తా
నిరుపమ సౌఖ్యభాషణ మనీషలతోడఁ బ్రజానురక్తుఁ డై
ధరణిని రాజనామమునఁ దాఁ దగు రెండవ చంద్రుఁడో! యనఁ. 646

అధ్యాయము - ౨౪

వ. ‡మఱియు నమ్మహాత్ముండు విజ్ఞానియు, వర్ధితాశేష స్వానుసర్గుండును, ప్రజా పాలకుండును, స్థావరజంగమ వృత్తిదాయకుండును, సత్పురుషధర్మవర్తనుండును, నిష్పాది తేశ్వరాదేశకుండు నైన పృథుం డొక్కనాఁడు దన వార్ధకంబు వీక్షించి, []నిజాత్మజ నాత్మజులయందు నిలిపి, ప్రజలు చింతాతుర చిత్తు లగుచుండ నిజ భార్యాసమేతుం డై యప్రతిహత నియమంబున వైఖానస సమ్మతం బైన యుగ్రతపంబునందుఁ బూర్వంబున దిగ్విజయప్రవృత్తుం డగు చందంబునం బ్రవృత్తుం డై తపోవనంబునకుం జని యందు. 647

మత్తకోకిల. కందమూల ఫలాశి యై బహుకాల ముగ్రతపఃపరి
స్పందుఁ డై యట మీఁదటం దృణ పర్ణ భక్షణఁ జేసి యా
చంద మేది జలాశి యై నృపసత్తముం డది మాని తా
మంద గంధవహాశి యయ్యుఁ గ్రమంబునం దృఢచిత్తుఁ డై. 648

వ. ఇట్లు వర్తింపుచు. 649

సీ. మెండుగా మిటమిట మండు వేసవియందుఁ దప్త పంచాగ్ని మధ్యమున నిలిచి
మానక జడి గొన్న వానకాలంబునఁ బైఁ గోక వేయక బయట నిలిచి
జనులు హూ! హూ! యను చలివేళఁ గుత్తుకబంటి తోయములలోపల వసించి
శిశిరంబు చాల నల్దిశలఁ బర్వినవేళ వెలయ భూశయనుఁ డై విశ్రమించి

తే. మహితనియతిఁ దితిక్షా సమన్వితుండు
నియత పరిభాషణుఁడు జితానిలుఁడు దాంతుఁ
డిద్ధమతి నీశ్వరారాధనేచ్ఛుఁ డనఘుఁ
డూర్ధ్వరేతస్కుఁ డును నై క్రమోచితముగ. 650

---

1. కీర్తి పూరముల దిగ్గజ కర్ణములందు (తం) 2. డైన (తం. వా.)

‡ వాక్యమున 'పృథుండు' అను కర్తృపద మున్నది గావున— 'మఱియు నమ్మహాత్ముండు' అనుమాట లేకుండుట యుచితము.

[] ఆత్మజ = పృథ్వి (వ్యాఖ్య)

వ. అతిఘోరం బైన తపం బాచరించె. ఇ ట్లివిధంబునం బ్రమానుసిద్ధం బైన తపంబున విధ్వ స్తాశేష కర్మమలాశయుండును *(బ్రాణాయామంబులచే జితారిషడ్వర్గుండును, ఛిన్నబంధనుండును) నై పురుషశ్రేష్ఠుండైన పృథు చక్రవర్తి భగవంతుండైన సనత్కుమారుం డెఱింగించిన యోగమార్గంబున సర్వేశ్వరభజనంబు గావించె. ఇట్లు భగవద్ధర్మపరుండును, సాధువర్తనుండును, శ్రద్ధాసమన్వితుండును నైన పృథునకు నారాయణునందు భక్తి యనన్యవిషయం బై ప్రవృద్ధం బయ్యె ఇ విధంబున. 651

క. నరలోకోత్తర ! భగవ, త్పరిచర్యారాధనములఁ బరిశుద్ధాంతఃకరుణుం డగు నా పృథునకు, సరసిరుహోదరు కథానుసంస్మరణమునన్. 652

క. పరిపూర్ణం బగు భక్తిని, గర మనిశము సంశయాత్మకం బై చాలన్ వఱలిన హృదయగ్రంథిని, [1]నిరసించు విరక్తియుత మనీష జనించెన్. 653

వ. దానంజేసి యతండు సంఛిన్న దేహాత్మజ్ఞానుండు, నధిగ తాత్మ స్వరూపుండు నై గదాగ్రజుం డైన శ్రీకృష్ణుని కథాసక్తి నొంది సమస్త యోగసిద్ధులందు నిస్పృహుం డగుట హృదయగ్రంథి విచ్ఛేదకం బైన జ్ఞానయోగంబును విడిచి, యాత్మయందు నాత్మయోగంబుఁ గావించి, బ్రహ్మభూతుం డై నిజకళేబరంబు విడువ నిశ్చయించి.

సీ. కోరి మడమలచే గుదపీడనము చేసి పూని [2]ముక్తాసనాసీనుఁ డగుచుఁ
దనరు మూలాధారమున నుండి వాయువు నొయ్యన నెగయించి యెనర నాభి
కలితంబు గావించి క్రమమున హృ ద్వ్యత్స [3]కంఠ శిరః కోష్ఠకములఁ జేర్చి
కైకొని మూర్ధభాగమునకు నెగయించి ప్రాణముల్ విడిచి యా పవనుఁ బవను

తే. నందు నాకాశ మాకాశమందుఁ దేజ
మందుఁ దేజంబు నుదకంబునందు నుదక
మర్థిఁ గాయంబు మేదినియందుఁ గలిపెఁ
బూని వాని యథోచిత స్థానములుగ. 655

వ. మఱియు భూమి నుదకంబునందును, నుదకంబును దేజమందును, దేజంబును వాయువున, వాయువు నాకాశంబునందును, నాకాశంబును మనంబున, మనంబు నింద్రియంబుల, నింద్రియతన్మాత్రలు భూతాది యైన యహంకారంబునం,

---

* తా. ప. ప్రతులలో లేదు

1. నెఱిద్రుంచు (క.చ.డ.డ.బ.) 2. యుక్తాసనా .... (హ. తం. వా.); బద్ధాసనా...(త)
3. కంఠశీర్షిక కోష్ఠకముల జేరి) (త. జ.)

దహంకారంబు మహత్తత్త్వంబునందును గూర్చి, యట్టి సర్వకార్య హేతుభూతం బైన మహత్తత్త్వంబును జీవోపాధిభూతం బైన ప్రకృతియందుఁ గలిపి, జీవ భూతుం డైన పృథుండు జ్ఞాన వైరాగ్యంబుల చేత బ్రహ్మనిష్ఠుం డై, మాయో పాధిం బాసి, ముక్తుం డయ్యె. అని చెప్పి వెండియు ని ట్లనియె. 656

సీ. అంత నా పృథుని భార్యామణియగు నర్చి పుడమిపైఁ దన యడు గిడినఁ గందు
సుకుమార పాదాబ్జ సుందరీరత్నంబు నతుల పతివ్రత యగుటఁజేసి
యాత్మేశకృత సుప్రతాచరణంబును [1]సుమహిత భక్తి శుశ్రూషణమును
నాప్తేయ మగు దేహయాత్రయు ననువినిచేత మిక్కిలి కృశీభూతదేహ

తే. యయ్యుఁ బ్రియనాథకృత కరుణావలోక
కరతల స్పర్శనాది సత్కారములను
నబల సుఖవృత్తిఁ జెంది య య్యడవులందుఁ
గృశత మదిఁ దోఁపకుండఁ జరించు నపుడు. 657

క. తన మనమున నే దుఃఖం, బనయంబు నెఱుంగనట్టి యర్చి నిజాధీ
శుని ప్రాణరహిత దేహముఁ, గనుఁగొని విలపించి విగతకౌతుక యగుచున్.

సీ. మానిత మందర సానుప్రదేశంబునందుఁ జితారోప మర్థిఁ జేసి
లలిత మహానదీ సలిలసుస్నాత యై కలిత మహోదారకర్మ్మఁ డైన
నాథున కుదకదానక్రియల్ గావించి యతిభక్తి సురలకు నతు లొనర్చి
వహ్నికి ముమ్మాటు వలగొని పతిపాద కమలయుగంబు చిత్తమున నిలిపి

తే. †వీరవరుఁ డైన పృథు పృథివీతలేశు
నందు ననుగమనము సేయునట్టి సాధ్వి
నర్చిఁ గనుఁగొని [2]దేవాంగనాసహస్ర
మాత్మనాథులఁ గూడి నెయ్యంబుతోడ. 659

క. పరమోత్కంఠమున న్మం, దరగిరి సానుప్రదేశతలమున వసుసం
గురియించిరి నవసురభిత, వర మందార ప్రసూన వర్ష ము లంతన్. 660

క. [3]తరమిడి యచ్చర లాడిరి, మొరయించిరి శంఖతూర్యములు దివిజులు పా
డిరి కిన్నరజనులు పర, స్పరనుతు లొనరించి రా సుపర్వాంగనలున్. 661

వ. మఱియు ని ట్లనిరి. 662

---

1. సుమహిత శుశ్రూషణమును జేసి(హ)

† ఈ గీతము, ఒక్క 'హ' ప్రతిలో మాత్రము 'సంస్మరింపుచు శిఖప్రవేశంబు సేసె' అనుపాదముతో ప్రారంభమై, పంచపాదిగా నున్నది.

2. దేవభార్యా సహస్ర (తం. వా.) 3. కరమపు డచ్చర (హ)

సీ. చర్చింప నిట్టి యాశ్చర్య మెందేనియుఁ గనుఁగొంటిరే? యర్చి యను లతాంగి
ధన్యాత్మురాలు గదా! తన విభుఁ గూడి యిందిరారమణి యజ్ఞేశుఁ గూడి
వెనుచను కైవడి ననుగమనముఁ జేసె నియ్యమ నిజహృదయేశుఁ డైన
ఘను వైన్య నూర్ధ్వలోకంబును బొందును నేఁ డింతవట్టును నిశ్చితంబు

తే. పరమయోగీంద్రులకు దుర్విభావ్య మైన
దృఢ సుకర్మమువలన నతిక్రమించి
వైన్యభూమీశు వెనుచని వరుస నూర్ధ్వ
[1]గామినియు నగు నీ యింతి ఘనత నొంది. 663

వ. [2]కానం బతివ్రతలకు నసాధ్యం బెందునుం గలదె? అని మఱియు. 664

క. పరికింపఁగ నే మనుజుఁడు, హరిపదమునుఁ బొందఁజేయు నట్టి వివేక
స్ఫురణం దనర్చు వానికిఁ, బరువడి నిలఁ బొందరాని పదముం గలదే! 665

తే. అట్టి యపవర్గసాధన మైన మనుజ
భావ మొందియు విషయసంబద్ధుఁ డగుచు
వసుధ నెవ్వఁడు వర్తించు వాఁడు ధరణి
ననయమును నాత్మవంచకుఁ డనఁగఁ బరఁగు. 666

క. అని వారలు ద న్నర్థిని, వినుతింపఁగ నర్చి యాత్మ [3]విభుఁడగు పృథుఁ డొం
దిన యచ్యుతలోకంబున, ననుపమ విభవమును బొందె నని విదురునకున్. 667

క. మునివరుఁ డగు మైత్రేయుఁడు, వినయంబున నెఱుఁగఁజెప్పి వెండియుఁ దగ ని
ట్లను [4]న మహ్మానుభావుం, డనఘుఁడు [5]భగవత్తముండు నగుఁ బృథుఁ డనఘా!

క. ఏ నీ కిప్పుడు సెప్పితి, మానుగ నీ పుణ్యకథను మహిత శ్రద్ధా
ధీనుం డై విస్ఫుర దవ, ధానుం డై యెవ్వఁ డేని తనరిన భక్తిన్. 669

క. వినినఁ బఠించిన వ్రాసిన, వినుపించిన వాఁడు పృథుఁడు విమలగతిం బొం
దినక్రియ హరిపద మొందెడు, ననయము నిర్ధూతపాపుఁ డగుచు మహాత్మా! 670

సీ. బ్రాహ్మణుం డంచితభక్తిఁ బఠించిన బ్రహ్మవర్చస్సు సంప్రాప్త మగును
క్షత్రియుం డర్థిమైఁ జదివిన విన్నను జగతీవిభుత్వంబు సంభవించు
వైశ్యుండు విని ధనవంతుఁ డై యొప్పును శూద్రుండు వినిన సుశ్లోకుఁ డగును
మఱియును భక్తి ముమ్మాఱు పఠించిన విత్తవిహీనుండు విత్తపతియు

---

1. గామియగుచున్నది యింతిగాన యిపుడు (క.బ) 2. కాన పతివ్రతలకు (తం. వా.)
3. విభు వెను వెంటం జని (హ) 4. నాత్మభూతభావుం (త) 5. భగవద్వరుండు (తం. వా.)

తే. నప్రసిద్ధుఁడు ప్రఖ్యాతయశుఁడు ప్రజలు
లేని యధముఁడు వితత సంతానయుతుఁడు
మూర్ఖచిత్తుండు విజ్ఞానబోధమతియు
నగుచు నుతి కెక్కుదురు మహితాత్మ! మటీయు. 671

వ. ఈ లోకంబునం బురుషులకు స్వాస్థ్యయనంబు నమంగళనివారణంబు ధన ప్రదంబు యశస్కరంబు నాయుష్కరంబు స్వర్గదాయకంబు గలిమలాపహంబు నైన యీ పుణ్యచరిత్రంబు చతుర్విధ పురుషార్థకాము లైనవారికి చతుర్విధ పురుషార్థ కారణం బగుం గావున వినందగు. రాజు సంగ్రామాభిముఖుం డై యీ చరిత్రంబు ననుసంధించి, విరోధి నెదిర్చిన న ద్విరోధి పృథునకుం బలెఁ గప్పంబు లిచ్చు. ముక్తాన్యసంగుండు భగవద్భక్తుండు నైనవాఁడు పుణ్యంబును వైన్య మాహాత్మ్య సూచకంబును నైన యీ చరిత్రంబు వినుచుం బఠియింపుచుం గృతమతి యై దిన దినంబును నాదరంబునం బ్రకటంబు సేయ, వాఁడు భవ సింధుపోత పాదుం డైన సర్వేశ్వరునియందు నచలం బైన భక్తి గలిగి, పృథు చక్రవర్తి యొందిన విష్ణుపదంబుఁ బొందు. అని యి పుణ్యచరిత్రంబు మైత్రే యుండు విదురున కెఱింగించి వెండియు ని ట్లనియె. 672

అధ్యాయము - ౨౪

క. పృథునకు నర్చికిఁ బుట్టిన, పృథుకీర్తిధనుండు ఘనుఁడు పృథుతుల్యుం డై
పృథు శౌర్య ధైర్య ధుర్యుఁడు, పృథివిఁ [1]విజితాశ్వుఁ డొప్పెఁ బృథివీపతి యై.

క. †విను మంతర్ధానగతిం, దనరి సునాసీరువలనఁ దగ విజితాశ్వుం
డును మటి యంతర్ధానుం, డను పేరఁ బ్రసిద్ధుఁ డయ్యె నతిచతురుం డై. 674

సీ. స్థిరమతి రాజ్యాభిషిక్తుఁ డై య మ్మేటి సమమతి న య్యనుజన్ము లైన
హర్యశ్వనకు సమాదరమునఁ [2]దూర్పు దక్షిణదిశఁ దగ ధూమ్రకేశునకును
బరఁగంగ వృకునకుఁ బశ్చిమభాగంబు ద్రవిణున కర్థి నుత్తరపుదిశను
గొమరొప్ప నలువురకును బంచి యిచ్చె [3]స కాంత యైనట్టి [4]శిఖండినికిని

తే. మనుజయోనిని జనియింపుఁ డనుచు మున్ను
పలికినట్టి వసిష్ఠు శాపమునఁ జేసి
పూని ప్రేతాగ్ను లతనికిఁ బుత్రు లగుచు
జనన మొందిరి సజ్జన స్తవ్యచరిత! 674

---

1. విజితాశ్వు డనెడి పేరన్ దనరెన్ (క. చ. ట. జ. డ)

† ఇది వ్రాఁత ప్రతులలో లేదు (హ. తం. వా) లలో కలదు. మూలమునఁ గలదు.

2. తూర్పును, దగ ధూమ్రకేశికి దక్షిణమును (క.బ) 3. స్వకాంత (హ. తం. వా.)

3. ఇది తం. వా. పాఠము; 4. శిఖండి వలన (హ) 'శిఖండిని యందు' అని యుండ నగును.

వ. వారలు పావకుండును, పవమానుండును, శుచియు నను నామంబుల మనుష్య యోనిం బుట్టియు నాత్మప్రభావంబునం గ్రమ్మఱ నగ్ను లై చనిరి. తదనంత రంబ. 676

క. అతఁడు నభస్వతి యనియెడి, ద్వితీయపత్నివలనను హవిర్ధానుఁడు నా
సుతుఁ గని విజితాశ్వుం †డా, నత విమతుఁడు రాజ్యవర్తనము దలపోయన్.

క. విమలాత్మ! కరాదానము, దమ శుల్కాదికము కరము దారుణ మని ధై
ర్యమునన్ దీర్ఘముఖ వ్యా, జమునన్ ద ద్వర్తనంబు సమమతి విడిచెన్. 678

వ. ఇట్లు విడిచి. 679

క. అతఁ డాత్మదర్శనుం డై, చతురతఁ బరమాత్మ హంసు సర్వేశ్వరుఁ ద
త్కృతువున యజించి కుశలా, ద్భుత యోగసమాధి ముక్తిఁ బొందె మహాత్మా!

వ. అంత విజితాశ్వుండు పరలోకగతుం డైన హవిర్ధానుండు హవిర్ధాని యను భార్యవలన బర్హిష్మదుండు గయుండు శుక్లుండు కృష్ణుండు సత్యుండు జిత వ్రతుండు నను పుత్రుల నార్వురం గాంచె. అందు బర్హిష్మదుండు. 681

సీ. సంతత సవనదీక్షాశాలి యగుచు ధరాతలం బెల్లను గ్రతువులకును
విలసిల్లు యజ్ఞశాలలు వేఱువేఱ కల్పించి యజ్ఞములు గావించుచుండి
చిరకీర్తి యతఁడు ప్రాచీనాగ్ర కుశలచే క్షితితలం బెల్ల నాస్తృతము సేయ
వసుధ యెల్లను యజ్ఞవాట మై విలసిల్ల సత్క్రియాకాండ [1]నిష్ణాతుఁ డగుచు

తే. సుభగ యోగసమాధి నిష్ఠుఁడు ప్రజాప
తి యగు నని తన్ను జనము నుతింప వెలయు
నట్టి ఘనుఁడు హవిర్ధాని యఖిల జగతిఁ
బరఁగుఁ గుశలను బ్రాచీనబర్హి యయ్యె. 682

వ. మఱియు నతండు. 683

చ. అలవడ నే సతీమణి సమంచితలీల వివాహవేళ ను
త్కలికఁ బ్రదక్షిణంబు లిడఁగాఁ గని హవ్యవహుండు దొల్లి యి
మ్మహిళ శుకిఁ జూచి మోహమును బొందినరీతి విమోహి యయ్యె నా
లలిత వినూత్న భూషణ యలంకృతచారుశుభాంగి వెండియున్. 684

---

‡ ఇట మూలమున "య ఇంద్ర మళ్వ హర్తారం విద్వా నపి న జఘ్నివాన్" అని కలదు.

1. నిష్ణాత్ముఁ డగుచు (హ) నిష్ణాస్థుఁ డగుచు (తం. వా.) "క్రియా కాండేషు నిష్ణాతః" అని మూ. (24—9)

చ. సురుచిరభంగి నా సతి కిశోరవయఃపరిపాకయై రణ
ద్వర మణి హేమ నూపుర రవంబు [1]చెలంగఁగ నాడుచుఁ దివా
కర రుచిరేఖ నొప్పెసఁగఁగాఁ గని నిర్జితు లైరి దేవ కి
న్నరవర సిద్ధ సాధ్య ముని నాగ నభశ్చర ముఖ్య లందఱున్. 685

వ. అట్టి సౌందర్యఖనియు సముద్రపుత్రియు నైన శతధృతి యను కన్యం బ్రహ్మ దేశంబునం బాణిగ్రహణంబు సేసె. ఆ శతధృతివలనం బ్రాచీనబర్హికిఁ బదుగురు కొడుకులు జనియించిరి. వారలు తుల్యనామవ్రతులును, ధర్మపారగులును నైన ప్రచేతసులు. ప్రజాసర్గంబునందుఁ దండ్రిచే నాజ్ఞాపితు లగుచుఁ దపంబు గావింప [2]వనంబునకుం జను సమయంబునం [3]ద న్మార్గంబునఁ బ్రసన్నుం డగుచు దృశ్యమానుం డైన రుద్రునిచేత నేది యుపదేశింపంబడె దాని [4]జప ధ్యాన పూజా నియమంబుల సేవింపుచుఁ [5]దపఃపతి యైన నారాయణుం బదివేల సంవత్సరంబులు పూజించిరి. అని చెప్పిన విని విదురుండు మైత్రేయున కిట్లనియె.

—: రుద్రుండు ప్రచేతసులకు యోగాదేశ మను స్తోత్రమును దెలియఁజేయుట :—

సీ. తాపసోత్తమ! ప్రచేతసులకు [6]నా వన మార్గంబునందు నా భర్తుతోడ
సంగ మె ట్లయ్యెఁ? బ్రసన్నుఁ డై హరుఁ డెద్ది తివుట వారల కుపదేశ మిచ్చె?
జీవరాసులకు నా శివుతోడి సంగంబు గడు దుర్లభం బీ జగంబునందుఁ
జర్చింప న మ్మేటి సన్మునీంద్రులకును సంచిత ధ్యానగోచరుఁడు గాని

తే. పుడమిఁ బ్రత్యక్షమునఁ గానఁబడఁడు మఱియు
నంచితాత్మ సదారాముఁ డఖిలలోక
[7]రక్షణార్థంబుగా విరూపాక్షుఁ డాత్మ
శక్తితోఁ గూడి జగతిపై సంచరించు. 687

క. కావున భగవంతుండును, [8]దేవాధీశుండు నైన దేవుని సంగం
బే వెరవున ఘటియించెనొ, యా విధ మంతయును దెలియ నానతి యీవే!

క. అనవుడు విదురున కమ్మునిజననాయకుఁ డనియె నట్టి సాధుమనీషం
దనరు ప్రచేతసులును నిజజనకుని [9]సద్భాషణములు సమ్మతితోడన్. 689

---

1. చెలంగ వివాహవేళఁ దాఁ గరము నవోఢయై బరఁగఁ గాంచి విని ర్జితులైరి (హ) 2. అర్ణవంబునకు (క.చ.ట.జ.డ.ద.తం.) "దిశం ప్రతీచీం ప్రయయు స్తప స్యాదృతచేతసః, సముద్ర ముపవి స్తీర్ణ మపశ్యన్ సుమహత్సరః" అని మూ. (24–20) 3. అర్ణవమార్గమున (క) 4. వస్తు జపధ్యాన (క); 5. దపస్పతి (హ.వా.) 6. అర్ణవమార్గంబునందు (క.తం) 7. రక్షకుఁడు పరముఁడు (హ) 8. దేవాధిపుడైన దేవ దేవుడు (ట. డ.) 9. పరిభాషణములు (చ.ట.జ.డ.)

క. [1]శిరమున వహించి [2]పడమటి, కరిగెడి సమయమున నెదుర నంబుధికంబె
బఱ పగు నొకసరసి మనోహర నిర్మల సలిలపూర్ణ మై యది మఱియున్. 690

సీ. రక్తోత్ప లేందీవర ప్రఫుల్లాంభోజ కమనీయ కల్హార కలిత మగుచుఁ
వర మత్తమధుప సుస్వర మోద పల్ల వాంకురిత లతా తరు భరిత మగుచుఁ
రమణీయ హంస సారస చక్రవాక కారండవ నినదాభిరామ మగుచుఁ
గంజాత కింజల్కపుంజ విక్షేపక మంద గంధాని లానంద మగుచు

తే. సజ్జనుని హృదయముఁ బోలి స్వచ్ఛ మగుచు
[3]హరిపదాకృతి దివిజవిహార మగుచు
ఘనుని సిరిభంగి నర్హాజీవనము నగుచు
మానవతి వృత్తిగతిని నిమ్నంబు నగుచు.‡ 691

వ. ఒప్పునట్టి సరోవరంబుఁ బొడగని యందు నొక్క దివ్యపురుషునిం గనిరి. 692
అతండును వారు.

మ. సమద శ్రీక మృదంగ వేణు ముఖ భాస్వన్నాద మై దివ్యమా
ర్గ మనోరంజక మై తనర్చు విలస ద్గాంధర్వగానంబు నె
య్యము సంధిల్లఁగ వించుఁ ద న్మహిమ కత్యాశ్చర్యముం బొంద వే
గమునం ద త్కమలాకరంబు వెడలెన్ గౌతూహ లోల్లాసి యై. 693

వ. ఇట్లు వెడలి వచ్చిన. 694

మ. కని రా తాపసవుంగవుల్ దివిజలోక శ్రేష్ఠునిం దప్త కాం
చనవర్ణు సనకాది యోగిజన భాస్వ ద్ధీయమానుఁ ద్రిలో
చను భక్తానుగుణానుగుఁ సుమహి తై శ్వర్యుఁ బ్రసాదాభి శో
భన వక్త్రున్ నిహ తాఘకర్తృజన సంపద్భద్రునిఁ రుద్రునిఁ. 195

---

1. శిరసావహించి (చ. జ. డ. తం.), 2. ప్రాగ్దిశ కరిగెడి (హ. తం.)

‡ ఇచ్చట హ. తం. వాలలో ఈ క్రిందిపద్యములు కూడఁ గలవు. ఇవి తా. ప. ప్రతులలో లేవు.

తే సిద్ధ చారణ గంధర్వ సేవ్య మగుచుఁ బుణ్యముల కాలయం బయి పొలుపు మిగిలి
లలిత మై చూడ నొప్పయి రమ్య మగుచు, దివ్యశుచి లఘు మధురాంబు భవ్య మగుచు.

తే. శశికరంబులఁ బోలి విశదము లగుచు, హరికథలఁ బోలి కల్మషహరము లగుచు
వహ్నులను బోలి భువనపావనము లగుచుఁ, బొగడఁదగు నీరములచేఁ బ్రపూర్ణ మగుచు.

శ. అర్థియును బోలె లఘుతరమగు జలమున,
నొప్పు నొక్క సరోవరం బుజ్జ్వలముగఁ
గాంచి యందొక్క పురుషునిఁ గని రతండు (క. చ.)
కుసుమ ఫలభరితం బనుకూల మగుచు
లలిత కల్ప లతాపుంజ కలిత మగుచు
గీరశారికాకలిత విహార మగుచు (ద)

క. కని వారలు దమమనముల, ననురాగము నద్భుతంబు ననయము వొడమన్
వినయము దోపఁగఁ ద త్పద, వనజములకు మ్రొక్కి భక్తి వశగతు [1]లగుచున్.

వ. భగవంతుండును, అఖిల ధర్మజ్ఞుండును, కృపాళుండును, దర్శనంబున నిఖిల పాప హరుండును, భక్తవత్సలుండును నైన హరుండు *(ప్రీతుం డగుచుం) బ్రసన్నాంతఃకరణులు ధర్మజ్ఞులు శీలసంపన్నులు సంప్రీతులు నైన వారల కిట్లనియె.

—: రుద్రగీత :—

సీ. వినుఁడు నృపాలనందనులార! మీ మదిఁ గల తలం పెల్ల ను గానవచ్చె
మీకు భద్రం బగు మీయెడ నే ననుగ్రహబుద్ధిచే నిటు గానఁబడితిఁ
గైకొని యిపుడు సూక్ష్ముఁ డ్రిగుణాత్మకము నగు నాప్రకృతికంచెను ధరణినిఁ
బరఁగు జీవునికంచెఁ బరుఁ డైన వాసుదేవుని చరణాబ్జముల్ దనరు భక్తి

తే. నర్థి నెవ్వరు భజియింతు రట్టివారు
నాకుఁ బ్రియతముల్ వారికి నయచరిత్రు
లార! యేను బ్రియుండ నై భూరి మహిమ
వెలయుచుండుదు నదిగాక వినుఁడు మీరు. 698

వ. స్వధర్మనిరతుం డైన పురుషుం డనేక జన్మాంతర సుకృత విశేషంబులం జతుర్ముఖత్వంబు నొంది, తదనంతరంబునం బుణ్యాతిరేకంబున నన్నుం బొంది, యధికారాంతంబున నేను దేవతాగణంబులు నవ్యాకృతం బైన యే హరిపదంబులు బొందుదు మట్టి పదంబు భాగవతుండు దనంతనె బొందుం గావున మీరు భాగవతత్వంబు నొందుటం జేసి నాకుం బ్రియు లై యుండుదురు. భాగవత జనంబులకు నాకంచె నధిక ప్రియుండు లేఁడు. కాన వివిక్తంబును, జప్యంబును, బవిత్రంబును, మంగళంబును, నిశ్శ్రేయసకరంబును నైన నా వచనంబు నాకర్ణింపుఁడు. సర్గాదిని బ్రహ్మ నిజనందనుల కెఱింగించిన శ్రీహరి స్తోత్రంబు మీకు నెఱింగింతు. వినుం డది యెట్టి దనిన. 699

క. వనజాసనుఁ డాత్మజు లగు, సనకాదులఁ జూచి పలికె సమ్మతితోడన్
వినుఁడు కుమారకులారా!, వనజోదరు మంగళ స్తవం బెఱిఁగింతున్. 700

వ. అని హరి నుద్దేశించి వారలు వినన ట్లనియె. ఓ యీశా! యాత్మవేదులైన వారలకు భవదీయోత్కర్షంబు స్వానంద లాభకరంబు గావున నట్టి స్వానంద లాభంబు మాకుం గలుగవలయును. నీవు పరిపూర్ణానంద స్వరూపుండవు. ఇట్టి సర్వాత్మకుండ వైన నీకు నమస్కరింతు. అని వెండియు నిట్లనియె. 701

---

1. అగుచున్ (హ. త. వా.) * తా. ప. ప్రతులలో లేదు.

సీ. పంకజ నాభాయ సంకర్షణాయ, శాంతాయ, విశ్వప్రబోధాయ, భూత
సూక్ష్మేంద్రియాత్మనే, సూక్ష్మాయ, వాసుదేవాయ, పూర్ణాయ, పుణ్యాయ, నిర్వి
కారాయ, కర్మనిస్తారకాయ, [1]త్రయీపాలాయ, త్రైలోక్య పాలకాయ,
సోమరూపాయ, తేజోబలాఢ్యాయ, స్వయం జ్యోతిషే, [2]దురంతాయ, కర్మ
తే. సాధనాయ, పురాపురుషాయ, యజ్ఞ
రేతసే, జీవతృప్తాయ, పృథ్వీరూప
కాయ, లోకాయ, నభసే, ఒంతకాయ, విశ్వ
యోనయే, విష్ణవే, జిష్ణవే, నమోఒస్తు. 702

సీ. స్వర్గాపవర్గ సుద్వారాయ, సర్వరసాత్మనే, పరమహంసాయ, [3]ధర్మ
పాలాయ, సద్ధిత ఫలరూపకాయ, కృష్ణాయ, ధర్మాత్మనే, సర్వశక్తి
యుక్తాయ, ఘన సాంఖ్య యోగీశ్వరాయ, హిరణ్యవీర్యాయ రుద్రాయ, శిష్ట
నాథాయ, దుష్టవినాశాయ, శూన్య ప్రవృత్తాయ, కర్మణే, మృత్యవే, వి
తే. రా ట్ఛరీరాయ, నిఖిల ధర్మ్మాయ, వాగ్వి
భూతయే, నివృత్తాయ సత్పూర్ణ భూరి
వర్చసే, ఒఖిల ధర్మదేహాయ, చాత్మ
నే, ఒనిరుద్ధాయ, నిభృతాత్మనే, నమోఒస్తు. 703

తే. సర్వ సత్తా వ్యయ, దేవాయ, సన్నియామ
కాయ, బహిరంతరాత్మనే, కారణాత్మ
నే, ఒసమస్తార్థ లింగాయ, [4]నిర్గుణాయ,
వేధసే, జితాత్మక సాధవే, నమోఒస్తు. 704

వ. అని మఱియుఁ బ్రహ్మమ్మునుండవు, నంతరాత్మవు, [5]సమస్త శేష కారణుండవు, చాతుర్హోత్ర రూపుండవు, నంతకుండవు, సర్వజ్ఞుండవు, జ్ఞానక్రియా రూపుండవు, నంతఃకరణ వాసివియు నైన నీకు నమస్కరింతు నని. 705

క. అనఘా ! దేవ ! భవత్పద, వనరుహ సందర్శనేచ్ఛ వఱలిన మాకున్
వినువైష్ణవ సత్కృత మై, యెనయు భవద్దర్శనంబు నీవె ! మహాత్మా ! 706

వ. అది యెట్టి దనిన. 707

క. అనఘ ! సకలేంద్రియ గుణాం, జనమును భక్తప్రియంబు జలదశ్యామం
బును సౌందర్య సమగ్రము, ననుపమమును నిత్యమంగళావహ మగుచున్. 708

---

1. క్షేత్రపాలాయ (తం. వా.) 2. దురంత్యాయ (తం.); దురన్యాయ (వా) 3. కర్మ పాకాయ (తం. వా.) 4. నిర్వికల్ప మేధనేఒహం కృతాత్మనే (జ.డ.బ.) 5. సమస్త జగత్కారణుండవు (జ) "సమస్త ఆశిషా మీశ మనవే కారణాత్మనే" (24-42)

వ. మఱియును. 709

సీ. అళికులోపమ లస దలకశోభిత మగు నమృతాంశు రేఖానిభాననమును
సమకర్ణ దివ్యభూషా ప్రభా కలితంబు సుందర భ్రూనాస సురుచిరంబు
సలలిత [1]కుందకుట్మల సన్నిభ ద్విజ పూరిత స్నిగ్ధ కపోలయుగము
పద్మపలాశ శోభన లోచనంబును మందస్మి తాపాంగ సుందరమును

తే. సస్మి తాలోక సతత ప్రసన్న ముఖము
కంబుసుందర రుచిర మంగళగళంబు
హార మణికుండల ప్రభాపూర కలిత
చారు మృగరాజ సన్నిభ స్కంధ [2]యుతము, 710

వ. వెండియు శంఖ చక్ర గదా పద్మ కలి తాయత బాహుచతుష్టయంబును, వైజయంతీ వనమాలికా కౌస్తుభమణి శ్రీ విరాజితంబును, నిత్యానపాయిని యైన యిందిరా సుందరీ రత్నపరిస్పందంబునం దనరి తిరస్కృత నికషోపల వక్షస్థలంబును, నుచ్ఛ్వాస నిశ్వాసంబులం జంచలంబు లైన వళిత్రయ రుచిర ప్రకాశమాన దళోదరంబును, పూర్వ వినిర్గత నిఖలవిశ్వంబును బ్రవిష్టంబు సేయు రీతి నొందు సలిలావర్త సన్నిభ గంభీర నాభీవివరంబును, పంకజ కింజల్క విభాసిత దుకూల నిబద్ధ కనక మేఖలా కలాప శోభిత శ్యామ పృథు నితంబ బింబంబును, నీల కదళీ స్తంభ రుచి రోరుయుగళంబును, సమ చారు జంఘుంబును. నిమ్న జానుయుగ[3]ళంబును, పద్మపత్ర భాసుర పాదద్వయంబును, మదీయాంతరంగ తమో నివారక నిర్మల చంద్రకళల సన్నిభ నఖంబును, గిరీట కుండల గ్రైవేయ హార కేయూర వలయ ముద్రికా మణినూపురాది వివిధభూషణ భూషితంబును, నిరస్త సమస్త నతజన సాధ్వసంబును, భక్తజన మనోహరంబును, సర్వమంగళాకరంబు నైన భగవద్దివ్యరూపంబుఁ దామసజన సన్మార్గ ప్రదర్శకుండవైన నీవు మాకుం జూపి మమ్మఁ గృతార్థులఁ జేయుము. అని వెండియు ని టనియె. 711

సీ. ఆత్మకుఁ బరిశుద్ధి నర్థించువారికి ధ్యేయవస్తువు [3]భవద్దివ్యమూర్తి
యంచిత స్వర్గరాజ్యాభిషిక్తున కైన సమధిక స్పృహణీయతముఁడ వీవు
సద్భక్తియుత భక్తజన సులభుండవు దుష్టాత్ములకుఁ గడు దుర్లభుండ
వాత్మదర్శనులకు నరయఁ గమ్యుండవు నై యర్థి విలసిల్లు దనఘచరిత !

---

1. కుట్మలరద స్ఫురితంబు, లాలితస్నిగ్ధ కపోలయుగము (జ) 2. ములును (చ.ట.త.డ.ద.బ.)
3. భవదీయమూర్తి (చ. ట.)

తే. యిట్టి నిఖిల దురారాధ్యు నీశు నిన్ను
నెఱయ సుజనుల కైన వర్ణింపరాదు
వఱల నెవ్వఁడు పూజించు వాఁడు విడువఁ
జాలునే ? పద్మదళనేత్ర ! సచ్చరిత్ర ! 712

చ. ఎనసిన భక్తియోగమున నే భవదీయ పదాబ్జమూలమున్
నినయముఁ బొందువాఁడు చటులాగ్రహ భీషణ వీర్య శౌర్య త
ర్జనములచే ననూనగతి సర్వజగంబులు సంహరించు న
య్యనుపముఁ డైన కాలుని భయంబునుఁ బొందఁడు సుమ్ము కావున. 713

తే. ఇట్టి మీ పాదమూలంబు లెవ్వఁడేని
పొంది ధన్యాత్ముఁ డౌ నట్టిపుణ్యుఁ డొండు
మనములోపలఁ గోరునే ? మఱచి యైన
నవ్యయానంద ! గోవింద ! హరి ! ముకుంద ! 714

క. హరి ! మీ భక్తజనులతో, నిరుపమగతిఁ జేయు సఖ్య నిమిషార్ధముతో
సరిగాదు మోక్ష మనిన న, చిరశుభ మగు మర్త్యసుఖముఁ జెప్పఁగ నేలా ?715

క. దురితవినాశక పదపం, కరుహ! భవత్కీర్తి తీర్థకణచయ బాహ్యం
తరసేక ధూతకల్మష, పురుషులు ధరమీఁదఁ దీర్థభూతులుగారే ? 716

వ. అట్టి భూతదయా సమేతులు, రాగాది విరహితచిత్తులు, నార్జవాది గుణయుక్తులు
నైన భాగవతజనుల సంగంబు మాకుం గలుగంజేయుము. ఇదియ మ మ్మనుగ్ర
హించుట. అని వెండియు ని ట్లనియె. 717

చ. సరసిజనాభ ! సత్పురుషసంగ సమంచిత భక్తియోగ వి
స్ఫురణ ననుగ్రహింపఁబడి శుద్ధము నొందినవాని చిత్త మ
స్థిర బహిరంగముం గనదు చెందదు భూరి తమస్స్వరూప సం
సరణగుహా జిరంబు గనఁజాలు భవన్మహనీయతత్త్వముఁ. 718

వ. అది యెట్టి దనిన. 719

సీ. అరయంగ నేమిటియందు నీ విశ్వంబు విదిత మై యుండు నీ విశ్వమందు
నేది ప్రకాశించు నెప్పుడు నిట్టి స్వయంజ్యోతి నిత్యంబు నవ్యయంబు
నాకాశమును బోలి యవిరళవ్యాపక మగు నాత్మతత్త్వంబు నధికమహిమఁ
దనరు పరబ్రహ్మ మా నని పల్కి యి ట్లనియె నవిక్రియుం డైనవాఁడు

తే. నెవ్వఁ డాతఁడు దనయందు నెపుడు నాత్మ
కార్య కరణసమర్థంబు గాని భేద
బుద్ధిజనకంబు నాఁదగు భూరిమాయఁ
జేసి విశ్వంబు సత్యంబుగా సృజించె. 720

ఆ. మరల మరలఁ బెక్కుమాఱు లీ విశ్వంబు
జనన వృద్ధి విలయ సంగతులను
నందఁజేయుచుండు నట్టి యీశ్వరుఁడ వై
తనరు నిన్ను నాత్మతత్త్వముగను. 721

వ. తెలియుదుము. అని వెండియు ని ట్లనిరి. యోగపరాయణు లగువారు శ్రద్ధా సమన్వితు లై క్రియాకలాపంబుల నంతఃకరణోపలక్షితం బైన భవదీయరూపంబు యజింతురు. వారు వేదాగమ తత్త్వజ్ఞానులు. నీ వాద్యుండవు, ననాదియు, నద్వితీయుండవు, మాయాశక్తి యుక్తుండవు నై విలసిల్లుచుండువు. అట్టి మాయాశక్తిచేత. 722

సీ. చతురాత్మ! సత్త్వ రజ స్తమోగుణములు వరుస జనించెను వానివలన
మహ దహంకార తన్మాత్ర నభో మరు దనల జలావని ముని సుపర్వ
భూతగణాత్మకస్ఫురణ నీ విశ్వంబు భిన్నరూపమున నుత్పన్న మయ్యె
దేవ! యీగతి భవదీయ మాయనుజేసి రూఢిఁ జతుర్విధరూప మైన

తే. పురము నాత్మాంశమునఁ జెందు పురుషుఁ డింద్రి
యములచే విషయసుఖము లనుభవించు
మహిని మధుమక్షికాకృత మధువుఁ బోలి
యతనిఁ బురవర్తి యగు జీవుఁడంద్రు మఱియు. 723

వ. ఇట్టి జగత్సర్జకుండ వై న నీవు. 724

క. భూతగణంబులచేతనె, భూతగణంబులను మేఘపుంజంబుల ని
ర్ధూతముగఁ జేయు ననిలుని, భీతినిఁ జరియింపఁ జేసి పౌరుష మొప్పఁ. 725

తే. రూఢిఁ దత్త్రిక్రియాలబ్ధ రూపుఁడవును
సుమహిత స్ఫుర దమిత తేజుఁడవుఁ జండ
వేగుఁడవు నయి ఘన భుజా విపుల మహిమ
విశ్వసంహార మర్థిఁ గావింతు వీవ! 726

వ. అది యెట్లనిన. 727

క. ఇతిక ర్తవ్య విచారక, మతిచేఁ దగ నెప్పుడుం బ్రమ త్తంబును సం
చిత విషయలాలసము నూ, ర్జితలోభము నై నయట్టి స్పృష్టి గడంక. 728

తే. అప్రమత్తుండ వగుచుఁ బద్మాక్ష ! నీవు
మ్రింగుదువు చాల నాఁకట [1]మ్రేఁగుచుండి
నాలుకలు [2]గ్రోయు భూరి పన్నగము వాతఁ
బడిన యెలుకను భక్షించుపగిది ననఘ ! 729

చ. అనిశము నస్మదీయ గురుఁ డైన సరోరుహ సంభవుండు న
మ్మనువులు నాత్మ సంశయము మాని భజించు భవత్పదాబ్జముల్
మనమున నిల్పి యుష్మ దవమాన మహోవ్యథఁ జెందునట్టి స
జ్జనుఁడు పరిత్యజించునె ? భుజంగమతల్పక ! భక్త కల్పకా ! 730

క. కావున నాకును సూరిజ,నావళికిని సర్వసంశయంబులు వాపం
గావను బ్రోవను దగుగతి, నీ వని వినుతించినట్టి యీ స్తవ మెలమి. 731

వ. రుద్రుండు ప్రచేతసుల కెఱిఁగించి వెండియు ని ట్లనియె. ప్రచేతసులారా ! యిట్టి యోగాదేశనామకం బైన యీ స్తోత్రం బాచార్యోపదేశంబున బహువారా వృత్తిచేఁ మనంబున ధరియించి, [3]సమాహిత చిత్తు లై మీ రందఱు నాదరంబున విశ్వాస యుక్తులు, స్వధర్మాచారవంతులు, భగవదర్పితాశయులు నై జపియించుచు సర్వభూతావస్థితుండు, నాత్మారాముండు నైన సర్వేశ్వరుని నుతింపుచు ధ్యానయుక్తంబుగాఁ బూజింపుఁడు. తొల్లి యీ స్తోత్రంబు భగవంతుఁ డైన పద్మసంభవుండు *(సిసృక్షు వగుచు) నాత్మజుల మైన మాకును (సృజియింపనిచ్చగించు) భృగ్వాదులకును నెఱిఁగించె. ఏము (నా భృగ్వాదులును) ప్రజాసర్గంబునందు బ్రహ్మచోదితుల మై యీ స్తోత్రంబునంజేసి విధ్వస్త సమస్త తమోగుణుల మై వివిధ ప్రజాసర్గంబు గావించితిమి. కావున నీ స్తోత్రంబు నెల్లప్పుడు నేకాగ్రచిత్తుండు, వాసుదేవ పరాయణుండు నై యెవ్వఁడు జపియించు, వాఁడు వేగంబె శ్రేయస్సునుం బొంది, తదీయ జ్ఞానప్లవంబున వ్యసనార్ణవ రూపం బైన సంసారంబును సుఖతరంబుగం దరియించు. ఇట్టి మదుపదిష్టం బైన శ్రీహరి స్తవంబు నెవ్వండు చదువుచు దురారాధ్యుం డైన శ్రీహరిం బూజించు, వాఁడు మదుక్త స్తోత్ర గాన సంతుష్టుండును, శ్రేయస్సులకు నేకాశ్రయభూతుండును నగు శ్రీమన్నారాయణుని వలన సమస్తాభీష్టంబులం బొందు. ఎవ్వఁడు ప్రభాతమున లేచి ప్రాంజలియు, శ్రద్ధా సమన్వితుండు నై

---

1. మ్రొగ్గు (హ) 2. చాచు (హ) 3. సమాధాన (క-బ) * తా. ప. ప్రతులలో లేదు.

యీ మంగళ స్తవరాజంబును విను, వినుపించు, వాఁడు కర్మబంధ విముక్తుం డగు.
అని మఱియు ని ట్లనియె. 732

క. నరదేవ తనయులారా !, పురుషాధీశుండు పరమ పురుషుఁడు నగు నీ
శ్వరు సుస్తోత్రము [1]మీ కా,దరమునఁ దెలిపితిని మీరుఁ దద్ధయు భక్తిఁ. 733

క. ఏకాగ్ర చిత్తులును సు,శ్లోకులు నై జపము సేయుచును ఘనతపముం
గైకొని చేసిన మీకును, జేకుఱు మహితేప్సితార్థసిద్ధి కడంకఁ. 734

అధ్యాయము - ౨౪

క. అని యీగతి నుపదేశం, బొనరించి సదాశివుండు నొగి వారలచే
తను బూజితుఁ డై వారలు, గన నంతర్ధానుఁ డయ్యెఁ గౌతుక మొప్పఁ. 735

వ. అంత. 736

తే. తివుట వారలు రుద్రోపదిష్ట మైన,
యచ్యుత స్తవము జపించు చయుత సంఖ్య
వత్సరము లుగ్రతపము దుర్వార వారి
మధ్యమునఁ జేయుచున్న సమయమునందు. 737

—: నారదుండు ప్రాచీనబర్హికి జ్ఞానమార్గమును దెలియఁ జేయుట :—

వ. ఘనకర్మాసక్త చిత్తుం డై యున్న ప్రాచీనబర్హి కడకు నధ్యాత్మవేదియుం గృపాళువు నై న నారదుండు చనుదెంచి, యా రాజునకు జ్ఞానబోధంబు సేయుకొఱకు నతని కి ట్లనియె. రాజా ! యీ కర్మంబునంజేసి యెట్టి శ్రేయస్సు నభిలషించుచున్న వాఁడ వట్టి యరిష్ట నిరసనంబును, నభీష్ట ప్రాప్తికరంబును నై న శ్రేయం బీ కర్మంబువలన లభింపదు. అనినం బ్రాచీనబర్హి నారదున కి ట్లనియె. 738

సీ. అనఘ ! మునీంద్ర ! మహాభాగ ! యేను [2]గర్మాపహత జ్ఞానుఁ డగుచు మోహ
మెఱుఁగంగలే నై తి నిట్టి నా కిప్పుడు గడు విమలంబును గర్మబంధ
నాశకంబును నగు జ్ఞానోపదేశంబు గావింపు మతిదయాకార ! కూట
ధర్మంబు లగు [3]గేహతతులందుఁ జెంది జాయా తనూజాత ధనాదికములె

తే. భూరి పురుషార్థములు గాఁగ బుద్ధిఁ దలఁచు
మతివిహీనుండు సంసారమార్గములను
దగఁ బరిభ్రామ్యమాణుఁ డై [4]నొగిలి మోహ
పదము నొందంగఁజాలఁడు భవ్యచరిత ! 739

---

1. మీకే, నెఱుగించితి మీరు దీని నెప్పుడు భక్తిఁ (ట. జ. డ. త.) 2. కర్మాపవిద్ధ జ్ఞాని న గుచు (తం); "కర్మాపవిద్ధ ధీఃఁ" (25-ఴ) 3. దేహ (క. చ. ట. డ. ద. బ.) 4. యొగిని (హ)

క. అనవుడు నతనికి [1]నతఁ డను, ననఘా ! యీ యధ్వరంబులందును గృపమా
లిన నీచే విశసింపం, జని కూలిన పసులు వేలసంఖ్యలు కనుమా ! 740

వ. కావునం బశుఘ్రాతంబులు త్వదీయ వైశసంబును స్మరింపుచున్నవి యగుచు లోహాయంత్రమయ శృంగంబులచేత నెపుడు నీవు పరలోకంబు నొందెద వపుడు నిను హింసింతు మని భవదీయమృతికి నెదురుచూచుచున్నవి. ఇట్టి సంకటంబు నొందంగల నీకు నిస్తారకం బైన యొక్క యితిహాసంబు గల దెఱింగింతు. అని యిట్లనియె. 741

—: పు ర ం జ నో పా ఖ్యా న ము :—

సీ. భూమీశ ! వినుమయ్య ! పూర్వకాలమునఁ బురంజనుఁ డను నొక రాజు గలఁడు
[2]నతని కవిజ్ఞాతుఁ డను పేరఁ దగిలి విజ్ఞాతచేష్టితుఁ డగు సఖుఁడు గలఁడు
ఆ పురంజనుఁడు పురాన్వేషి యై ధరాచక్రంబు గలయంగ సంచరించి
తన కనురూప మై పెనుపొందు పుర మెందు వీక్షింపఁ జాలక విమనుఁ డగుచు

తే. నే పురము లుర్వీ బొడఁగనె నా పురములు
కామములఁ గోరు తనకు న క్కామములను
బొందుటకు వానిని ననర్హాములుగఁ దన మ
నమునఁ దలఁచి యొకానొక నాఁ డతండు. 742

వ. *(చనుచున్న సమయంబున హిమవత్పర్వత దక్షిణసానువులందు.) 743

సీ. వర నవద్వార కవాట గవాక్ష తోరణ దేహళీ గోపురముల నొప్పి
ప్రాకార యంత్ర వప్ర ప్రతోళీ పరి ఘాట్టాల కోపవనాళిఁ దనరి
సౌవర్ణ రౌ ప్యాయస ఘన శృంగంబుల రమణీయ వివిధగేహముల మించి
రథ్యా సభా చత్వర ధ్వజ క్రీడాయతన సుచైత్యాపణతతిఁ దనర్చి

తే. మరకత స్ఫటిక విదూర మణి వినూత్న
మౌక్తికా యుత ఖచిత హర్మ్యములు గలిగి
విద్రుమ ద్రుమవేదుల వెలయు నొక్క
పురముఁ గనియె భోగవతినిఁ బోలుదాని. 744

వ. ఇట్లు గనుంగొని యనంతరంబ ముందట దివ్యద్రుమ [3]లతాకుంజ పుంజంబును, సమద నద ద్విహంగ మత్తమధుకర కుల కోలాహల సంకుల జలాశయ శోభి

---

1. నతఁడును (హ.తం.వా.) 2. అతనికి విజ్ఞాతుఁ డనుపేరఁ దగిలి (హ); అతనికి విజ్ఞాతుఁ డను పేరఁ దగిన (తం. వా.); "తస్యా విజ్ఞాత నామాఽసీత్ సఖావిజ్ఞాత చేష్టితః" (25-10) * తా. ప. ప్రతులలో లేదు. 3. లతాకులంబును (డ. బ.)

తంబును, హిమనిర్ఝర బిందుసందోహ పరిస్పంద కందళిత మందమలయ మరు
దుచ్చలిత ప్రవాళవిటప నళినీతటంబును, పాంథజన మనోరంజ నాహ్వాన బుద్ధి
జనక కలహంస రాజకీర కోకిలాలాప విరాజమానంబును, మునివ్రత నానావిధ
వనమృగవ్రాత బాధారహితంబును నైన పుర బాహ్యోద్యాన వనంబునందు
యాదృచ్ఛికంబున నేకైక శతనాయకు లైన యనుచర దశకంబును, పంచ
మస్తక సర్పప్రతిహారుండును దోడరా జనుదెంచుచున్న భర్త్రన్వేషిణియుం,
గామరూపిణియు, నప్రౌఢయు నైనయట్టి. 745

సీ. ఘన సమవిన్యస్త కర్ణకుండల రుచుల్ గండభాగంబుల [2]నిండి పర్వఁ
దమ్మిఱేకుల సిరిఁ దటమటింపఁగఁజాలు మెఱుఁగు కన్నులు దలఁ దిరిగిరాఁగఁ
జఘనసంకలిత పిశంగ నీవీద్యుతి కనక కాంచీరుచిఁ గరముఁ బెనుపఁ
జరణ సరోజ భాసుర చలన్నూపుర ఝుణఝుణధ్వని నర్మసరణిఁ జూప

తే. లలితయౌవనలక్ష్మీవిలాస భాసు
రోదయ వ్యంజిత ప్రభాయుక్త పీన
సమ నిరంతర కుచకుట్మలముల వ్రీడఁ
జెంది పయ్యెదఁ గప్పు బాలేందుముఖియు. 746

వ. మఱియును [2]బాలయు, సుదతియు, గజగామినియు నైన యొక్క ప్రమ
దోత్తమం గాంచి. 747

క. [3]తరమిడి ప్రేమోద్గత మై, మరువిండ్లం బోలు కన్నొమలు గల తరుణీ
సరసాపాంగ విలోకన, శర పరివిద్ధాంగుఁ డగుచు జనవిభుఁ డనియెన్. 748

క. ఎవ్వరిదానవు? జనకుం, డెవ్వఁడు? పేరేమి? భృత్యు లీ పదియొక రిం
దెవ్వరు? సతు లెవ్వరు? మఱి, యి వ్వనమున నుండఁ గార్య మెద్ది? మృగాక్షీ!

క. భవదీయ పురస్సరుఁ డగు, పవనాశనుఁ డెవ్వఁ డతికృపామతి నాకున్
వివరింపు మనుచు వెండియు, భవశేఖరుఁ జూచి ధరణిభవుఁ డి ట్లనియెన్. 750

సీ. తరళాక్షి పతి యగు ధర్మ్మ నన్వేషింపఁ జరియించు హ్రీ యను సతివొ? కాక
రుద్రు నన్వేషించు రుద్రాణివో? కాక బ్రహ్మను వెదకు భారతివొ? కాక
నారాయణుని భక్తిఁ గోరి యన్వేషించు నిందిరవో? కాక యెవ్వ రీవు?
త్వ త్ప్రాదకామనత్వమునను సంప్రాప్త సకలకాముం డగు [4]సరసు నెట్టి

---

1. నిండ బర్వ (చ-బ) 2. బాలకియు (చ. ట. త. డ. ద. బ.) 3. అరుదుగఁ బ్రేమ గ్గలమై (హ) 4. జనుని (క. చ. ట. త. బ.)

తే. వాని వెదకెదు? తరుణీ! భవ త్కరాగ్ర
పద్మకోశంబు [1]నేఁ డెందుఁ బతిత మయ్యె?
నాకు నెఱిఁగింపఁ దగుదు వివేకచరిత!
యని నృపాలుఁడు మఱియు ని ట్లనియె సతికి. 751

క. కర మొప్పఁగ నీ విటు భూ, చర వగుటన్ హ్రీవి శివవు శారదవును సా
గరకన్యవుఁ గా కుండుట, దరుణీ! పొడగంటి నని పదంపడి పలికెన్. 752

సీ. మొనసి యదభ్రకర్ముఁడ నైన నాచేత నిపుడు పాలిత మైన యీ పురంబు
సరసిజోదరుని భుజాపాలి తోదాత్త లలిత వైకుంఠ మలంకరించు
నిందిరాసుందరి చందంబునను నీ వలంకరింపఁ గడంగు పంకజాక్షి!
యది గాక తావకీ నాపాంగరుచి మోహి తాంతరంగుండ నైనట్టి నన్ను

తే. మహిత సవ్రీడభావ సన్మందహాస
చారు విభ్రమ భ్రూలతా ప్రేరితుఁడుగఁ
చనరు భగవంతుఁ డగునట్టి మనసిజుండు
పడఁతి! యుడుగక పీడింపఁ దొడఁగె నిపుడు. 753

వ. కావున. 754

చ. తరుణి! సు తార లోచనయుతంబును మంజు సుధాసమాన భా
సుర మృదువాక్యయు క్తమును శోభిత కోమల లంబమాన సుం
దర చికురాభిరామము నుదారము నైన భవ న్ముఖాబ్జమున్
సురుచిరలీల నెత్తి ననుఁ జూడుము సిగ్గును డెందనేటికిన్? 755

వ. అని యి వ్విధంబున నధీరుం డై పలుకు పురంజనుం జూచి, యా ప్రమదోత్తమ
వీరమోహిత యై, సస్మితానన యగుచు, నానందంబు నొంది యి ట్లనియె. 756

క. పురుషవర! నాకు నీకును, గురువును నామమును గులముఁ గోరి యెఱుఁగ నీ
పురమున నుండుదుఁ గా కీ, పురమును నిర్మించినట్టి పురుషు నెఱుంగన్. 757

క. వీరలు నా సఖు లీ లల, నారత్నము లార్యవినుత! నా చెలు లీ [2]వృ
ద్ధోరగ మే నిద్రింపఁగ, ధీరత మేల్కాంచి పురము ధృతిఁ బాలించున్. 758

వ. వెండియు ని ట్లనియె. 759

---

1. బదెక్కడ (క. చ. బ.) 2. కృద్ధోరగ (క. చ. జ. డ. బ.)

సీ. మనుజనాయక ! నీవు మ ద్భాగ్యవళమున నిటకు నేతెంచితి విపుడు నీకు
మంగళం బగు నీవు మహితేంద్రియ గ్రామ భోగ్యంబు లగు కామపుంజములను
అర్థి సంపాదింతు వనఘాత్మ ! యీ నవ ద్వారప్రయు క్త మై తనరు పురము
[1]నీవు గైకొని యేలు నీకంటె నిందుకు నధికుఁ డన్యుండు లేఁ డనఘ ! యిందు

తే. మ దుపనీతము లైన కామముల ననుభ
వింపుచును సమాశత మధిష్ఠింపు మెలమిఁ
గోరి నీకంటెఁ బ్రియులు నెవ్వారు ? నాకు
నరసిచూడంగ మనుజేంద్ర ! యదియుఁ గాక. 760

వ. మఱియు రతిజ్ఞాన విహీనుండును, నకోవిదుండును, నిహపర చింతా శూన్యుండును, బళుప్రాయుండును,*(ద్వ దన్యుండును నైన వాని) నే నెట్లు వరియింతు? గృహస్థాశ్రమమందు ధర్మార్థ కామ మోక్ష ప్రజానందంబులును, యశంబును, యతివేద్యంబులు గాని రజ స్తమో విహీన (పుణ్య) లోకంబులును గలుగు. పితృ దేవర్షి మర్త్య భూత గణంబులకుం దనకు నీ లోకంబున గృహస్థాశ్రమంబు సర్వథేమార్హం బైన యాశ్రమం బండ్రు. కావున వదాన్యుండవు, వీరవిఖ్యాతుండవు, ప్రియదర్శనుండవు, స్వయంప్రాప్తుండవు నై భోగిభోగ సదృశ భుజా (దండం) బులచే నొప్పు భవాదృశుం దగిలి (మాదృశ యగు) కన్య వరింపకుండునే ? యని వెండియు. 761

క. కరుణారస పరిపూర్ణ, స్ఫురిత స్మితరుచి విలోకపుంజముచేతఁ
గర మర్థి దీనజన భయ, హరణుఁడ వై సంచరింపు మఖిలజగములన్. 762

క. అని యీగతిఁ బలికిన యా, వనజాక్షీఁ బురంజనుండు వరియించి ముదం
బున నన్యోన్యప్రీతిఁ, దనరుచుఁ ద త్పురము సొచ్చి ధన్యుం డగుచుఁ. 763

చ. శతసమకాల మ ప్పురి నజస్రము భూరి సమ స్తసౌఖ్య సం
గతులఁ దనర్చి వందిజన గాయక [2]సద్వినుతోపగాన మో
దితమతి నొప్పి సుందర సతీజన సేవితుఁ డై నృపాలకో
చిత లలితస్థలంబుల వసింపుచుఁ గ్రీడలు సల్పుచుండఁగఁ. 764

క. నరనాథుఁడు లోకభయం,కరగతి వర్తించు గ్రీష్మకాలము దోఁపం
దరళ లహరీమనోహర, వరహ్రాదిని సలిలమందు వసియించెఁ దగఁ. 765

---

1. నందు నా చెలులచే నభిమత కామముల్, నెమ్మి వరింపుమ నీకుగూర్తు (ట)
* తా. ప. ప్రతులలో లేదు. 2. సద్వినుతోరుగాన (తం. వా.)

వ. ఇట్లు వసించి, కతిపయ దినంబు లరుగు సమయంబున. 766

సీ. అవనీశ్వరో త్తమ! య ప్పురంబున నాల్గువంకల నున్న [1]గవఁకులు వినుము
తూర్పుదిక్కునను నై దును దక్షిణో త్తరంబుల రెండుఁ బశ్చిమంబునను రెండుఁ
గాఁగ నా తొమ్మిది గవఁకుల నుపరిదిక్కున నేడుఁ గ్రిందిదిక్కునను రెండు
నై యుండు మఱి వానియందుఁ బృథగ్విధ విషయగత్యర్థ మై వెలయు నీశ్వ

తే. రుం డొకఁ డరయఁగఁ గలండు రూఢిఁ ద త్పు
రంబుఁ బాలించునట్టి పురంజనుండు
నా పురద్వార నవకంబు నందులోన
నర్థిఁ బ్రాగ్ద్వార పంచకమందు వరుస. 767

వ. ఖద్యోతయు, హావిర్ముఖియు నను నామంబులు గల ద్వారయుగంబున ద్యుమ
త్సఖుం డై విభ్రాజిత జనపదంబును బొందు. వెండియు నళినియు, నాళినియు
ననుపేళ్ళం గల వాకిళ్ళ రెంటియందు నవధూతసఖుం డై సౌరభరూపంబు
లైన విషయంబులం బొందు. మఱియు ముఖ్యానామకం బైన ప్రధాన ప్రాగ్ద్వా
రంబున రసజ్ఞు విపణాన్వితుం డై యాపణ, బహూదనంబు లను విషయంబులఁ
బొందు. పితృహూ నామకం బైన దక్షిణద్వారంబున శ్రుతధరాన్వితుం డై,
దక్షిణ పాంచాలం బను రాష్ట్రంబు నొందు. దేవహూ నామకం బైన యుత్తరపు
వాకిట శ్రుతధరాన్వితుం డై యుత్తరపాంచాలం బను రాష్ట్రంబు నొందు.
వెండియుం బడమటి వాకిళ్ళ రెంటియందు నాసురీనామకం బైన వాకిట
దుర్మద సమేతుం డై గ్రామకనామకం బైన విషయంబును, నిర్ఋతి నామకం బైన
వాకిటియందు లుబ్ధకయుక్తుం డై వైశసం బను విషయంబు నొందుచుండు.
వెండియుం బురంజనుం డ ప్పురంబునం బౌరజనంబులందుఁ గల నిర్వ్యా క్లేశస్మృ
తులను నిద్ధ అంధులచేత గమన, కరణంబులను క్రియల నొందుచు, నంతఃపుర
గతుం డగునప్పుడు విషూచీన సమన్వితుం డై, జాయాత్మజోద్భవం బైన మో
హప్రసాద హర్షంబుల నొందుచుండు. ఇ ట్వివిధంబునం గర్మాసక్తుండుఁ, గామాత్మ
కుండు నై బుద్ధి యను మహిషిచేత వంచితుం డయ్యె. అ క్కామిని. 768

సీ. పానంబు సేసినఁ దాను బానముఁ జేయుఁ గుడిచినఁ దానును గుడుచు మఱియు
భక్షింపఁ దానును భక్షించు నడిచిన నడుచును నవ్విన నవ్వు నేడ్వ
నేడుచుఁ బాడినఁ బాడు విన్నను వినుఁ జూచినఁ జూచుఁ గూర్చున్న నుండు
దుఃఖింప దీనుఁ డై దుఃఖించు నిలిచిన నిలుచు నిద్రింపంగ నిద్రవోవు

---

1. గవనులు (హ)

తే. ముట్టినను ముట్టు మూర్ఖొన్న మూరుకొనును
బలుకఁ బలుకును బవళింపఁ బవ్వళించు
హర్ష మును బొంద నాత్మను హర్ష మొందు
మోదమును బొందఁ దానును మోద మొందు. 769

వ. ఇ వ్విధంబున నతండు మహిపీ విప్రలబ్ధుండును, వంచిత స్వభావుండును నై పారవశ్యంబునం జేసి యజ్ఞుండును, ఇత రేచ్ఛా విరహితుండును నై క్రీడామృగంబు చాడ్పున ననుకరింపుచు, వర్తింపుచు నా పురంబునఁ గాపురం బుండె. ఆ పురం జనుం డొకానొక దినంబునం ధనుర్ధరుం డై. 770

అధ్యాయము - ౨౬

సీ. పంచాశ్వ యుక్తంబు పంచబంధనము చక్రద్వితయమును యుగద్వయంబు
నాశువేగంబు నేకాతపంబుఁ గూబర ద్వయముఁ బతాకా త్రితయయుతంబు
నేకరశ్మియుతంబు నేకసారథికంబు సప్తవరూథంబు స్వర్ణభూష
మును బంచవిక్రమమును నేకనీడంబుఁ బ్రకట పంచప్రహరణము నై న

తే. రథము కాంచన రచిత వర్మము ధరించి
విలస దక్షయ తూణీర కలితుఁ డగుచుఁ
గణఁక దీపింప నెక్కి యేకాదశ ప్ర
సంఖ్య సేనాసమేతుఁ డై సరభసముగ. 771

వ. పురంబు వెడలి, పంచప్రస్థం బను వనంబునకుం జని, యందు విడువరాని మహిషిని విడిచి, మృగయాసక్తుం డై *(దృప్తుం డగుచు) ధనుర్బాణంబులు ధరియించి సంచరించుచు, నాసురవృత్తిం దగిలి, ఘోరాత్ముండు, నదయుండు నై నిశాత సాయకంబులచేత న మ్మృగవ్రాతంబులం బరిమార్చె. రాజులకు మృగయావినో దంబు విహితానుష్ఠానం బగుచుండ నాసురవృత్తి యెట్లయ్యె నని యంటివేని, నిది రాగప్రాప్తం బగుటను విహితంబు గాదు. వినుము. [1]తీర్థంబులందె, ప్రఖ్యాత శ్రాద్ధదివసంబులయందె, రాజై నవాఁడె, మేధ్యంబులై న పశువులనె,వనంబునందే, యథోపయుక్తంబుగానె, వధింపం జను నను నియమమాత్రంబు గలదు. కావున జ్ఞాని యైన విద్వాంసుం డాచరింపఁడు గాక. ఆచరించినం గర్త్రానుష్ఠానజనితం బై న జ్ఞానంబునం జేసి యందుం బొరయండు.అట్లు గాక నియమోల్లంఘనంబునం గర్త్రాచరణుం డగువాఁ డభిమానంబు నొంది, కర్మబద్ధుం డై గుణప్రవాహ

---

* తా. ప. ప్ర. లలో లేదు. 1. శ్రాద్ధాదు (హ. తం. వా.)

పతితుండును, నష్టప్రజ్ఞుండును నై యధోగతిం గూలు. ఇ ట్లగుటంజేసి
(సాధుజనులకు సర్వప్రకారంబుల) నాసురవృత్తి మానం దగు. అని వెండియు
ని ట్లనియె. అంతం బురంజనుం డ వ్వనంబున. 772

క. వర చిత్రపత్ర సునిశిత, శరములచే శశ వరాహ చమరీ రురు కా
సర గవయ శల్య హరిణీ, కరి హరి వృక పుండరీక కపి ఖడ్గములన్. 773

వ. వధియించి మఱియు. 774

సీ. వరుస మేధ్యామేధ్య వనమృగంబుల [1]ఘృణ సన దుస్సహక్రీడ సంహరించి
శ్రమయుక్తుఁ డై వేఁట సాలించి మరలి మందిరమున కర్థి నేతెంచి యందు
సముచిత స్నాన భోజన కృత్యములు దీర్చి యతి[2]విశ్రమమున శయానుఁ డగుచుఁ
బరిమళ మిళిత ధూపవ్రాత వాసిత సర్వాంగుఁ డగుచు స్రక్చందనాది

తే. వివిధ భూషణ చేలముల్ వెలయఁ దాల్చి
తృప్తుఁడును హృష్టుఁడుఁ మఱి ధృష్టుఁ డయి య
నన్యజాకృష్టచిత్తుండు నై రతిప్ర
సంగ కౌతుక మాత్మను దొంగలింప. 775

వ. అంత స్వకీయ ప్రాణవల్లభ యగు మహిషియందు మనంబు నునిచి, యా వరా
రోహయు, గృహమేధినియు నైన గృహిణిం గానక, విమనస్కుం డై నిజాంతఃపుర కామినులం గనుంగొని యి ట్లనియె. 776

క. రామాజన సంఘములా, రా! మానవతీలలామ రామామణి [3]నా
రామకృప వడసి మెలఁగుదు, రా? మానుగఁ గుశలమా? పరామర్శింపఁ.

ఉ. సారవివేకలార! [4]గృహసంపద లీయెడఁ బూర్వరీతిచే
నారయఁగా రుచింపవు గృహస్థునకుఁ గృహమందు మాతగా
నీ రమణానుకూల రమణీమణి యై తనరారు భార్యగా
నీ రుచి నొందకున్నఁ గననేర్చునె? త ద్గృహమేధి సౌఖ్యముల్. 778

వ. అదియునుం గాక. 779

క. పొగ డొందు జనని గానీ, తగవున వర్తించునట్టి దయితయ కానీ
తగ నుండని గృహమున నుం, టగుఁ జక్రవిహీన రథమునం దుం టరయఁ. 780

వ. కావున. 781

---

1. ఘృణజన (హ) కృపాజన (క) 2. పరిశ్రాంతి (హ. వా.) 3. సారామల కృపచే (హ)

చ. తలకొని నాకుఁ [1]దా ననుపదంబును బ్రజ్ఞ జనింపఁజేసి సం
చల దురు దుర్భర వ్యసనసాగర మగ్నుఁడ నైన నన్ను ని
శ్చలమతి నుద్ధరించి యనిశంబును మత్ప్రియ యైన భార్య యే
వలనఁ జరింపుచున్న దనివారణ నా కెటిఁగింపరే! దయఁ. 782

క. అనవుడు విని య క్కాంతలు, జనపతి కిట్లనిరి రాజసత్తమ! [2]యదిగో!
తన కొంగై నను బఱపుగ, నొనరింపక నేలఁ బొరలుచున్నది వగలఁ. 783

తే. ఏమికతమున నున్నదో? యెఱుఁగ మేము
నీవు చూడు మటన్న నా భూవరుండు
నేలఁ బడి పొరలెడు భార్యఁ బోలఁ జూచి
మనములో దుఃఖతాపంబు మల్లడింప. 784

వ. అంత. 785

ఆ. జలజనేత్రి ప్రణయసంజాత రోషభా
వమున నైనయట్టి వక్రదృష్టి
జనవిభుండు సూచి యనునయ కోవిదుఁ
డగుచు నప్పయోరుహాక్షిఁ జేరి. 786

క. పొలఁతుక దన యుత్సంగం, బుల నిడి త త్పాదయుగళమును నంటుచు మం
జుల మృదుభాషణముల నా, లలనామణిఁ జూచి పలికె లాలన మొప్పఁ. 787

చ. రమణిరొ! భృత్యులందు నపరాధము గల్గిన నాయకుల్ స్వప
క్షముఁ దలపోసి యుగ్రతర శాసనముం దెగి చేయ రట్లుగా
క మనములోని కిన్కఁ దమకంబున నాజ్ఞ నొనర్చిరేని ని
క్కముగ ననుగ్రహించుటయ కాక తలంపఁగ నాజ్ఞ సేయుచే? 788

క. కమలానన బాంధవ కృ, త్యముఁ దలపఁక రోషచిత్తుఁ డగు [3]కుటిలాత్మున్
మమతం గ్రోధియు నీతి, క్రమరహితుఁడు నైన బాలుఁగా నెన్నఁ దగున్. 789

వ. అని వెండియు నిట్లనియె. 790

మ. సరసోదార సుధారసోపమ వచశ్చాతుర్య సౌభాగ్య మై
హరినీలోపమ కోమలాలకయుతం బై విభ్రమభ్రూలతా
పరిజుష్ట స్మిత సద్వీలోకనము నై భాసిల్లు యుష్మ న్ముఖాం
బురుహంబుఁ భవదీయ దాసునకుఁ బూఁబోణీ! కృపం జూపవే! 791

---

1. దాను సుపథంబున (హ) 2. ఇదిగో (తం. వా;) 3. కుటిలాత్మ, న్నమర్ష యుతుఁడును నీతి (క. ద.) కుటిలాత్మున్ సమదా మర్షుఁడు (తం. వా.)

క. విను వీరపత్ని ! నీ యెడ, ననయంబును బ్రాహ్మణులును హరిభక్తులుఁ ద
క్క నితరు లెగ్గొనరించిన, వనితా ! శిక్షింతు నెంతవారల నైనఁ. 792

క. ఈ ముల్లోకములందును, నా మనమున రోష మొదవినఁ భయరహితుం
డై మదిలోఁ బరితోషము, తో మెలఁగెడు వానిఁ గానఁ దోయజనేత్రా ! 793

సీ. ఇందీవరేక్షణ ! యే నెందు భవదీయ తిలకవిరహితము మలినయుతము
హర్షశూన్యంబు [1]నపాస్తరాగంబును నత్యమర్షయుతంబు నైన ముఖము
గళి తాశ్రుబిందు సంకలిత సంచితశోభమాన పీన స్తనమండలమును
రమణీయ తాంబూలరాగ విహీన మైనట్టి సుపక్వ బింబాధరంబుఁ

తే. [2]గాన నిట్లుంట కిపు డేమి కతము నాకు
నర్థి నెఱిఁగింపవే ! [3]మృగయాతిసక్తి
నబల ! నీ కెఱుంగింపక యరిగినట్టి
తప్పు నై రించి కావంగఁ దగుదు నేను. 794

క. వనితాజన పరవశుఁ డై, మనసిజశర బాధ్యమాన మానసుఁ డగువా
నినిఁ దగఁ గర్తవ్యార్థము, లను భజియింపక తొలంగు లలనలు గలరే ? 795

వ. అనుచుం దదీయ విభ్రమవళంగతుం డై పలికిన విని. 796

క. కంజాతపత్రనేత్ర పు, రంజనుదెస రోష ముడిగి రమణీయ శ్రీ
మంజుల మృదూక్తుల మనము, రంజింపుచుఁ బలికె సదనురాగ మెలర్పఁ. 797

వ. అంత. 798

అధ్యాయము - ౨౭

సీ. అ మ్మహాదేవి నెయ్యంబున మంగళస్నాత యై మృదుల వస్త్రములు గట్టి
స్రక్చందనాది భూషణములు ధరియించి కమనీయ మోహనాకార యగుచుఁ
బతికడ నిలిచిన నతఁడు సంతుష్టాంతరంగుఁ డై యభ్యంతరమున నుండి
యన్యోన్య సరస గాఢాలింగనంబులు గావించి గోప్య వాక్యములచేత

తే. నతఁడు ప్రమదా పరిగ్రహ వ్యసనమునను
గడఁక నపకృష్ట ఘనవివేకమును గలిగి
పగలు రేయను బ్రొద్దు లేర్పఱుపలేక
యెనసి యాయు ర్వ్యయంబు దా నెఱుఁగఁ డయ్యె. 799

---

1. మనోప్రకాశకమునై (హ. తం. వా.) 2. గాఁగ (హ. తం. వా.) 3. మృగవ్యసన మొంది (క. చ. ట తం.)

వ. మఱియు నతం డున్నద్ధమదుండును, మహామనుండును, అర్హాశయ్యా శయానుండును, మహిషీ భుజోపధానుండును నై యజ్ఞానాభిభూతుం డగుటంజేసి స్వరూపభూత పరమపురుషార్థంబు నెఱుంగక, నిజమహిషినే పరమ పురుషార్థంబుగాఁ దలంపుచు, రమింపుచుం గామ కళ్మల చిత్తుం డైన యతనికి నవ యౌవనం బైన కాలంబు ఋణార్థంబునుం బోలి గతం బయ్యె. అంత. 800

క. విశద [1]యశోజలనిధి యా, శశిముఖి యగు భార్యవలన సమ్మతి నేకా
దశశత పుత్రుల రణక, ర్కశదేహులఁ గాంచి కౌతుకంబున మఱియున్. 801

క. గురుశీ లౌదార్య గుణో, త్తరలను సల్లలిత గుణకదంబలఁ బ్రియలన్
వర కులపావనల దశో, త్తరశత దుహితలను గాంచెఁ ద త్కృతివలనన్. 802

వ. ఇట్లు పుత్ర పుత్రికా జనంబులం గని యున్నంత. 803

క. విను మాతని [2]యాయువులో, న నరిగె నర్థంబు నంత నరపతి కులవ
ర్ధను లగు సుతులకుఁ బరిణయ, మొనరించెన్ సదృశ లైన యువిదలతోడన్.

క. నరనాథుఁ డాడుబిడ్డల, వర రూప వయో విలాస వైభవములచేఁ
బరఁగిన [3]నిజ తనయ సదృశ, వరులకు సంప్రీతితో వివాహము చేసెన్. 805

వ. అట్లు వివాహంబు గావించి యున్న సమయంబున. 806

క. విను తత్సుత లొక్కొక్కని, కనయముఁ బాంచాలదేశ మందులఁ బౌరం
జన కులవర్ధను లగుచున్, జనియించిరి నూర్వు రేసి శౌర్యబలాఢ్యుల్. 807

ఆ. అనఘ ! యిట్టి రిక్థహారులు గేహ కో
శానుజీవ యుతులు నైన యట్టి
నందనాదులందుఁ జెందిన [4]మమత ని
బద్ధుఁ డయ్యె నంతఁ బార్థివుండు. 808

చ. తిర మగు నిష్ఠతో నతఁడు దీక్షితుఁ డై పశుమారకంబులు
[5]న్నరిది భయకరంబులును నైన మఖంబులు పెక్కు చేసి యా
దరమున నీవునుం బలెను ద త్త దనూన [6]ఫలప్రకాముఁ డై
సుర పితృ భూత సంఘము నసూయఁ దనర్చి భజించె భూవరా ! 809

వ. ఇ ట్లాత్మహితంబు లైన కర్మంబులయం దనవహితుండును, గుటుం బాస క్త మానసుండును నై యున్న యతనికి విరోధి యై ప్రియాంగనాజనంబులకు

---

1. యశోనిధి యగునా (త.ద) 2. యాయువు వలనను (క. చ. త. డ. ద. బ.) 3. స్వతనయల సదృశ (హ) 4. మమత్వ (చ. త. జ. డ. ద. బ.) 5. సరవిభయంకరంబులగు సన్మఖముల్ దగఁ (హ.వా) 6. ఫలాప్తి కాముఁ డై (హ)

నప్రియం బగు *(కాలంబు సంభవించినం) జండవేగ విఖ్యాతుం డగు ‡గంధర్వా
ధీశుండు షష్ట్యుత్తర శతత్రయ సంఖ్యాతు లైన గంధర్వులును, అందఱ గంధర్వీ
జనంబులును *(సితాసిత వర్ణంబులు గలిగి మిథునీభూతు లగుచు) ననుగమింపం
జనుదెంచి (స్వ పరిభ్రమణంబుచేతనే సర్వకామంబుల నిర్మితం బగు నా)
పురంబు నిరోధించిన, నప్పు డా చండవేగానుచరు లైన గంధర్వు లా పురంజను
పురంబు [1]వ్యాకులంబు నొందింపుచు నపహరింప నుపక్రమించు సమయంబునం
బురంజన పురాధ్యక్షుం డైన ప్రజాగరుం డనువాఁడు వింశత్యుత్తర సప్త
శతంబు లైన గంధర్వ గంధర్వీ జనంబుల నివారించి, బలవంతుం డై సంవత్సర
శతంబు యుద్ధంబు గావించి, యొక్కరుం డయ్యు న ప్పెక్కండ్రతో నిట్లు
వోరి, క్షీణుం డైనఁ బురంజనుండు దాన నిలిచి, త త్పురంబున నల్పసుఖంబు
లనుభవించుచుఁ బాంచాలదేశంబులందుల నిజ పార్శ్వదులచేత [2]నానీతంబు లైన
పదార్థంబుల నొందుచుం గామినీజన సమేతుం డై, భయపర్యాలోచనంబు సేయ
నేరక రాష్ట్ర పుర బాంధవ సమేతుం డై, యార్తి నొంది చింతాక్రాంతుం డై
యుండె. అంత. 810

క. అనయంబు కాలపుత్రిక, యను నొక కామిని వరేచ్ఛ నఖిలజగంబుం
దనయంతఁ గలయఁ దిరుగుచుఁ, జని చని యొకనాఁడు రాజసత్తమ! వింటే!

సీ. అనఘాత్మ! రాజర్షి యైన యయాతి కుమారకుం డైనట్టి పూరుచేత
వరియింపఁగాఁ బడి వలనొప్ప నతనికి వరమిచ్చి దౌర్భాగ్యవశత నొంది
ప్రఖ్యాతిఁ గనుట దుర్భగ యను పేరను బరఁగు న క్కాంత నే పురుషవరుఁడు
వరియింపఁ డయ్యె నా తరుణియు నొకనాఁడు గర మొప్ప బ్రహ్మలోకముననుండి

తే. వసుధ కేతెంచి విను బృహద్వ్రతుఁడ నైన
నన్ను వరియింపఁ గోరి మనమునఁ గామ
శర విమోహిత యై వేఁడఁ గరము నేను
సమ్మతింపక యున్న రోషమున నలిగి. 812

వ. ఇట్లను. మునీంద్రా! మదీయాశా విముఖుండ వైన నీకు నేకత్రావస్థానంబు
లేక యుండుం గాక. అని శపించి, విహతసంకల్ప యై మ దుపదేశంబునం జని,
యవనేశ్వరుండు, భయనామకుండు నైన వానిం గదిసి యిట్లనియె. 813

క. అవనీపతి! భయనామక యవన, కులాధీశ్వరుండ వగు నినుఁ బతిగాఁ
దవిలి వరింపఁగ వచ్చితి, సవినయముగ వినుము భూతసంకల్పమునఁ. 814

---

* తా. ప. ప్రతులలో లేదు. ‡ గంధర్వాధీశుఁడు = కాలము. "గంధర్వాః దివసాః (వ్యా)"
1. పర్యాయంబున విశీర్ణంబు నొందించుచు (క.త.డ.ద.బ.) 2. పాలితంబులైన (క.చ.ట.జ.డ.బ.)

వ. కలుగు మ త్కామితంబు వృథ గాదు. లోకంబున [1]వేదంబులయందు దేయ గ్రాహ్య రూపం బయిన వస్తువు యాచ్యమానం బగుచుండ *(నెవ్వం డొసంగఁడు) నెవ్వం డిందు దీయమానం బగుచుండం గోరండు, నట్టి వీర లిద్దఱును జడ స్వభావు లని సత్పురుషులు శోకంబు నొందుదురు. కావున నిన్ను భజియింపు చున్న నన్నుం గరుణార్ద్రచిత్తుండ వై భజియింపుము. ఇట్టి యార్తానుకంపయుఁ బురుషధర్మంబు. అని పలికిన న క్కాలపుత్రిక వచనంబులువిని యవనేశ్వరుండు దేహ గుహ్య చికీర్షు వగు దానిం గనుంగొని మందస్మిత వదనుం డగుచు ని ట్లనియె.

క. విను తరుణి! యాచ్యమానం, బనఁదగు నీ లోకమం దమంగళవును స
జ్జనముల కసమ్మతవు నగు, నిను నభినందింపకుండ్రు నెఱి నె వ్వారున్. 816

వ. కావున నేను జ్ఞానదృష్టిం జేసి నీకుం బతినిరూపణంబు సేసెద. అది యె ట్లనిన, మదీయ సేనాసహాయంబు వడసి, ప్రజానాశం బొనరించునట్టి నీ వవ్యక్తగతి వై కర్మనిర్మితం బై న లోకంబు ననుభవింపుము. ఈ ప్రజ్వారుం డనువాఁడు నాకు సహోదరుండు. నీవు మదీయ భగినివి. ఈ యిద్దఱిం గూడి యీ లోకంబునందు నవ్యక్తుండు, భీమసైనికుండు నై యేను వర్తింతును.

అధ్యాయము - ౨౮

అనిన నా భయనామకుం డై న యవనేశ్వరుని దిష్టకారు లై న సైనికులు ప్రజ్వార కాల కన్యాయుక్తు లై భూమండలం బెల్లఁ దిరుగుచు నొక్కనాఁ డతివేగంబున భౌమభోగాఢ్యంబుఁ, జరత్పన్నగ పాలితంబు నై న పురంజను పురంబు నావరించి యున్నంత, స్వాభిభూతుం డై న పురుషునకు నిస్సారత్వంబు గలిగించునట్టి కాలకన్యక బలాత్కారంబున నా పురంజను పురంబు ననుభవించె. అట్లు కాలకన్యకోపభుజ్యమానం బై న పురంబు సర్వద్వారంబులందును [2]సర్వతో దిశంబుగా న య్యవనులు ప్రవేశించి, త త్పురంబు సమస్తంబును బీడింప, నిట్లు పురంబు ప్రపీడ్యమానం బగుచుండ నభిమాని యైన పురంజనుండు.

సీ. అనఘ! యీతఁడు మమతాకులచిత్తుఁ డై బహువిధ భూరితాపములఁ బొంది
ఘన కుటుంబియుఁ గాలకన్యోపగూఢుండు నష్టసంపదుఁడు వినష్టమతియు
విషయాత్మకుండును వినిహ తైశ్వర్యుండుఁ గృపణుండుఁ జాల నకించనుండు
నగు పురంజనుఁడు శోకావిలభావుఁ డై గంధర్వ యవన సంఘముల చేత

---

1. శాస్త్రంబందు (క. బ.) *తా.ప. ప్రతులలో లేదు. 2. సర్వతోధికంబుగా (హ. తం. వా.)

తే. [1]నోజ చెడి వికలత నొందు నై జపురముఁ
దవిలి ప్రతికూలు రయి యనాదరణయుతులు
నై న పుత్రులఁ బౌత్రుల ననుచరులను
సచివ పౌరోహితుల నిజసతినిఁ జూచి. 818

వ. మఱియుం గాలకన్యాగ్రస్తుం డై న తన్నును, నరిదూషితంబు లై న పాంచాల బలంబులనుం జూచి, యపార చింత నొంది, త త్ప్రతీకారంబు సేయ నెఱుంగక కాలకన్యాపహృత వీర్యంబు లయినం, గామంబుల నభిలషింపుచు దీనుండును, విగతాత్మగతికుండును, (స్నేహంబునంజేసి) పుత్రదా రోపలాలన పరుండును నై కాలకన్యోపమర్దితంబును, గంధర్వ యవనాక్రాంతంబును నై న పురంబు విడువ నిచ్ఛలేకయు విడువ నుపక్రమించె. అప్పుడు. 819

క. అనఘా ! భయనా మాగ్రజుఁ, డనఁగల ప్రజ్వారుఁ డప్పు డరుదెంచి పురం
బును సకలంబును భయనా, మునికిం బ్రీతిగ దహించె మునుకొని యంతన్. 820

వ. అట్లు పురంబు దహ్యమానం బగుచుండ *(పౌర) భృత్యవర్గాది సమన్వితుం డును, గౌటుంబికుండును, పుత్రాది సమన్వితుండును, యవనోపరు ద్ధాలయుం డును, గాల కన్యా గ్రస్తుండును నై న పురంజనుం డ ప్పురంబునందుఁ బ్రజ్వార సంస్పృష్టుం డై యనుతాపంబు నొంది, త త్పురపాలనంబునందు సమర్థుండు గాక పురుక్రోశ్ఛోరువేపథుం డై యందుండ నశక్తుం డయ్యె. 821

క. దవశిఖయుత తరుకోటర, నివసిత పన్నగము పగిది నిజపురి వెడలం
దివురుచు నతఁడు [2]శిథిల దవ, యవుఁడును గంధర్వగణ వివశ శౌర్యుండున్.

సీ. అయి చాల ఘురఘుర మను శబ్ద మడరంగ మనమునఁ జింతానిమగ్నుఁ డగుచుఁ
గొడుకులఁ గోడండ్రఁ గూఁతుల నల్లుండ్ర మనుమల [3]నాప్తుల ననుచరాళి
ననయంబు స్వత్వమా త్రావశిష్టం బై న గృహ కోశనివహ పరిచ్ఛదముల
మసలు నహంకార మమకారములఁ జేసి మతిహీనుఁ డగుచు నెమ్మనములోనఁ

తే. గణుతిఁ దలఁచుచు విప్రయోగమునఁ దాను
గటకటా ! యిట్లు పరలోక గతుఁడ నై న
యిట్టి భార్య యనాథ యై యీ కుమార
వరుల నేరీతిఁ బ్రోచునో ? యవని ననుచు. 823

వ. మఱియు నిట్లని తలంచు. 824

---

1. భజనచెడి.....నిజపురమును (క. బ.) * తా. ప. ప్రతులలోలేదు.
2. శిథిలావయవుడు (క. చ. జ) 3. సచివుల ననుచరుల (చ. త. డ. ద. బ.)

సీ. పడఁతి యే మునుభుజింపక భుజింపదు నేను నిద్రవోవక మఱి నిద్రవోదు
నేను నీళ్ళాడక నీళ్ళాడ నొల్లదు పదరి యేఁ గోపింప భయము నొందు
భర్జించినను మాఱు పలుకక వాయోడు బుద్ధిహీనుఁడ నైన బుద్ధిఁ జెప్పు
లలి మిఱి నిట్టి కళత్రంబుతో నేనుఁ గడఁగి దేహాంతర గతుఁడ నైన

తే. ననయమును దాను [1]బుత్రిణి యగుటఁ జేసి
యాత్మ శోచిని యగుచు గృహస్థధర్మ
మాచరింపుచు నుండునో ? యనుగమనము
సేయునో ? యని మనమునఁ జింత నొంది. 825

క. తనపుత్రులుఁ దనతనయులు, ననయముఁదాఁ జనినయెడ నిరాశ్రయు లగుచున్
వననిధి మధ్యంబున నవి, సిన కలముం బోలి యెట్లు జీవించెదరో ? 826

క. అని యి వ్విధమునఁ గృపణుని, యనువున ఘన దుఃఖవిహ్వా లానర్హుం డ
య్యును దుఃఖించు పురంజను, ననయముఁ గొనిపోవ నిశ్చితాత్ముం డయ్యెన్.

క. చనుదెంచెను భయనాముం, డనువాఁ డప్పుడు పురంజనాఖ్యుఁడు పెలుచ
న్ననఘాత్మ ! పశువు భంగిని, [2]మనము గలఁగ యవన నీయమానుం డగుచున్.

వ. అనుచర వర్గంబు భృశాతురులు, దుఃఖితులు నై వెనుచనుచుండ, నుపరుద్ధం
బగు భుజంగమం బప్పురంబు నెపుడు వాసె నప్పు డా పురంబు విశీర్ణం బై
ప్రకృతిం బొందె. బలవంతుం డైన యవనునిచేత బలాత్కారంబున వికృష్య
మాణుం డైన పురంజనుండు దమఃపిహితుం డై పూర్వసుహృత్తగు సఖు
నీశ్వరు నెఱుంగ కుండె. అంతం బరలోకగతుం డైన పురంజనుం గదిసి, పూర్వం
బున నదయుం డైన యతనిచేత హింసింపం బడిన యజ్ఞపశువులు క్రోధోద్రేకం
బునఁ గుఠారంబుల నతని నటికె. ఇ వ్విధంబునం బ్రమదాసంగ దోషదూషితుం
డును, నపారతమో నిమగ్నుండును, నష్టజ్ఞానుండును నై పురంజనుం డనేక
కాలంబు పరలోకంబున నార్తి ననుభవించి, త భార్య యైన ప్రమదోత్తమం
జిత్తంబున నశ్రాంతంబును దలంచుచుండం, దదీయ సంస్మరణంబునం జేసి తరు
వాతి జన్మంబున విదర్భరాజ గృహంబునం బ్రమదోత్తమ యై జన్మించె. అంత.

సీ. నరవర ! వీర్య [3]పణం బై న యట్టి వైదర్భిని మలయకేతనుఁ డనంగఁ
బరపురంజయుఁ డైన పాండ్య భూమీశుండు దారుణ సంగర స్థలమునందు
శక్తి ననేక రాజన్యుల నిర్జించి పరిణయం బయ్యె నా గురుభుజుండు
నా విదర్భాత్మజయం దసితేక్షణ యైన కూఁతును ద్రవిడాధినాథు

---

1. పుత్రాళువగుటజేసి (చ. బ.) 2. మన మగలగ (ట. త.) 3. పణాప్త యైనట్టి (హ)

తే. లైన కొడుకుల నేడ్వుర నర్థిఁ గనియె
వారలకు నెల్ల నొక్కొక్క వరుస నర్భ
దార్బుద సుతులు సంజాతు లైరి యతని
సుత ధృతవ్రత నా యగస్త్యుఁడు వరించె. 830

క. అతఁ డా కన్యక వలనను, జతురుం డై యిద్మవాహ జనకుఁ డగు దృఢ
చ్యుతుఁడను మునీంద్రుఁ గనియెను, మతి నంత విరక్తుఁడగుచు మలయధ్వజుఁడున్.

తే. క్ష్మాతలం బెల్ల నిజ తనూజాతులకును
బంచియిచ్చి సరోజాతు పాదపంక
జార్చనాయత్తుఁ డగుచుఁ గులాద్రికరుగ
నంత మదిరాక్షి సతి యగు నా విదర్భి. 832

తే. కడఁక గృహములు నఖలభోగములు విడిచి
చంద్రు వెనుచను చంద్రిక చందమునను
భక్తి దళుకొత్తఁ బాండ్యభూపాలుఁ డైన
మలయ కేతను వెనుకొని మగువ సనియె. 833

వ. అట్లు ధర్మపత్ని వెంటరాఁ జని, యందుఁ ‡ జంద్రమసా తామ్రపర్ణి నవోదక
లను నదుల పుణ్యజలంబుల స్నాతుం డై, ప్రక్షాళిత బాహ్యాభ్యంతర మలుండును
గందమూల ఫల బీజ పుష్ప పర్ణ తృణ తోయాహారుండును నై కాయకర్శనం
బైన తపం బాచరింపుచు, శీతోష్ణ వర్ష వాతంబులు, క్షుత్పిపాసలు, ప్రియాప్రియం
బులు, సుఖదుఃఖంబులు నను ద్వంద్వంబుల సమదర్శనుం డై జయించి, తపో
విద్యా యమ నియమంబులం జేసి పక్వకషాయుం డై, బ్రహ్మమ్మునందు నిజాత్మ
ననుసంధించి, విజితేంద్రియ ప్రాణచిత్తుం డై, స్థాణువుం బోలి దివ్యవర్ష శతంబు
తపంబు సేసి, భగవంతుం డైన వాసుదేవునందుఁ బ్రీతి వహింపుచు, నన్యం బెఱుం
గక వర్తింపుచుఁ, దన్ను స్వప్నమందు “మమేదం శిర శ్ఛిన్న”, మిత్యాది ప్రతీతి
యందుం బలె వ్యతిరిక్తునిఁగ, వ్యాపకునిఁగ, నంతఃకరణవృత్తి సాక్షిఁగా నెఱింగి.

సీ. సాక్షాత్కృతుండును సర్వేశ్వరుండును భగవంతుఁడును గృపాపరుఁడు నైన
హరి యను లోకైక గురునిచే నుక్త మై సర్వతోముఖమును స్వప్రకాశి
తము నగు మహిత శుద్ధ జ్ఞాన దీప ప్రభాతతిచేఁ బరబ్రహ్మమందుఁ
దన్నును దనయందుఁ దగఁ బరబ్రహ్మంబు నెనయఁ గన్గొనుచు దగ్ధేంధ నాగ్ని

---

‡ 'తత్ర చంద్రమసానామ తామ్రపర్ణి నవోదకా' యని మూలము. (28.35)

తే. భంగి నీషణములఁ బెడఁబాసి భూరి
వ్యసన సాగర సంసృతి వలనఁ జాల
ననుపరతుం డయ్యె నా మహితోన్నతుండు
నవనినాయక ! విను మప్పు డతనిభార్య. 835

క. పతిదై వతశీల సమం,చిత వేణీభూతచికుర చీరాంబర సు
వ్రతచర్యా ఙామాంగి వి,గతదోష విదర్భరాజ కన్యక యచటన్. 836

తే. కమలలోచన నిఖలభోగములఁ దొఱఁగి
మలయ కేతనుఁ బరమధర్మజ్ఞుఁ జేరి
నిరుప మైక పతివ్రతా నియమ మొప్ప
సాధ్వి యై భక్తిఁ బరిచర్య సలుపుచుండె. 837

క. విమలమతి నిజేశు సమీ,పమునన్ సతి ధూమరహిత పవమాన సఖా
గ్రమున వెలుఁగొందు కీల వి,ధమునఁ బ్రకాశింపుచుండెఁ దద్దయు వేడ్కన్. 838

క. సతి దనప్రాణేశ్వరుఁ డుప,రతుఁ డగుట మనంబులో నరయకను బూర్వ
స్థితి ననుపచారక్రియలం,చితమతిఁ గావింపఁ దలఁచి చిరతరభక్తిన్. 839

క. అమపమ సుస్థిర నియమా,సనుఁ డగు నిజనాథు డాయఁజని పూర్వగతిన్
వినమిత యై సతి త త్పద,వనజము లర్చించునపుడు వరుపాదములన్. 840

క. విను మూష్మత లేకున్నను, గని యూథభ్రష్ట హరిణి కైవడి సతి నె
మ్మనమునఁ బెగడుచు [1]దీనత, ననయంబును బంధురహిత యై శోకించెన్. 841

చ. అనయము నిట్లు శోకవిపు లాశ్రుపయఃకణసిక్త మానిత
స్తనయుగ యై వియోగ పరితాపమునన్ హృదయంబు మాఁడ శో
భన లలితాధరోష్ఠ నవపద్మము గందఁగ సుస్వరంబుగా
వనజదళాక్షి యేడ్చె ననివారణఁ ద ద్విపినాంతరంబునన్. 842

ఉ. హా ! నరనాథ ! హా ! సుమహితాత్మక ! హా ! గుణశాలి ! యింక నం
భోనిధి మేఖలాకలిత [2]భూమి యధార్మిక రాజ చోర పి
డా నిరతిం గృశింప నకటా ! తగునయ్య యు పేక్షసేయ ? శో
భానయశాలి ! నీవు పరిపాలన సేయుము లెమ్ము భూవరా ! 843

చ. అని విలపించుచున్ సరసిజాక్షి నిజేశు పదారవిందముల్
దన నిటలంబు సోఁక బరితాపమునం బడి బిట్టు చాల రో
దన మొనరింపుచుం గఠినదారువులన్ జితి పేర్చి యందులోఁ
బెను పగు త త్కళేబరముఁ బెట్టి శిఖిం దరికొల్పి యిమ్ములన్. 844

---

1. దినా, ననయగుచు (త) 2. భూతలమెల్ల నుగ్రచోర (క. బ.)

క. తా ననుగమనము సేయం, బూనుటయును నంతలోన బూర్వసఖుఁడు వి
జ్ఞానస్వరూపకుండును, నైన ధరాదివిజుఁ డొక్కఁ డబలం గదియఁ. 845

క. చనుదెంచి యీ త్తలోదరి, సునయోక్తుల ననునయింపుచుం దగ ననియెఁ
వనితా! నీ వెవ్వతె? వె, వ్వని[1]దాన? వితం డెవండు? వగచెద వేలా? 846

క. అని యడుగుచు వెండియు ని, ట్లనియెను నే సృష్టిపూర్వమందును నీ వె
వ్వనితోడి సఖ్యసౌఖ్యం, బనవరతం బనుభవించి తట్టి సఖుండఁ. 847

క. న న్నెఱుఁగు దేని మనమున, న న్నెఱుఁగక యున్నయైన నళినదళాక్షీ!
"[2]నిన్నుఁ బురాతనసఖునిఁగ, నెన్నంగల దాన" [3]ననియు నెఱుఁగవె? చెపుమా!

వ. కావున నీవు నేనునుం బూర్వంబునందు మానసనివాసుల మైన హంసల మై
యుండి, గృహంబుఁ బాసి, సహస్రవత్సరంబులు సఖుల మై వర్తించునంత నీవు
నన్నుం బాసి భౌమభోగరతుండ వై పదంబు నిచ్చయించుచు మహీమండలంబు
గలయం గ్రుమ్మినప్పు డొక్క కామినీనిర్మితంబు పంచారామంబు నవద్వార
సమేతంబు నేకపాలకంబు త్రికోష్ఠంబు షట్కులంబుఁ బంచవిపణంబుఁ బంచ
ప్రకృతియుస్త్రీనాయకంబునైన యొక్కపురంబు వొడగంటివి. అది యెట్టిదనినం,
బంచారామంబు లనం బంచేంద్రియార్థంబులు. నవద్వారంబు లన నాసికాది
ద్వారంబులు. ఏకపాలకం బనం ఘ్రాణపాలనంబు. త్రికోష్ఠంబు లనం దేజోభిన్నం
బులు. షట్కులంబు లన నింద్రియ సంగ్రహంబు. విపణంబు లనం గర్మేంద్రియం
బులు. పంచప్రకృతి యన భూతంబులు. ప్రకృతి యను కామిని యన బుద్ధి.
ఇట్టి పురంబునం ప్రవిష్టుం డైన పురుషుం డంగనాపరతంత్రుండును, నజ్ఞుండును
నైన నీవ యప్పురంబునం గామినీ సంస్పృష్టుండ వై రమియింపుచుఁ ద త్సంగ
మంబున నష్టస్మృతి వై *(పురంజన వై దర్భీజన సంభావిత సుఖాభాసంబు లగు
దుఃఖంబులచే నిట్టి) పాపిష్ఠం బైన దశం బొందితివి. కావున. 849

సీ. నీవు వై దర్భివి గావు వీరుఁ డితండు వివరింపఁగాఁ గాఁడు విభుఁడు నీకు
నొగి మున్ను పురమున నుపరుద్ధుఁ జేసిన యా పురంజనపతి వరయఁ గావు
[4]అర్థి నీ విపుడు పరాంగన ననియును జర్చింపఁగాఁ బూర్వజన్మమందుఁ
బురుషుండ వనియును బుద్ధిఁ దలంచుట యరయంగ నీ యుభయము నసత్య

---

1. దానవు యీపడున్నవా డెవ్వడిలఁ (క. చ. ట. జ. డ. బ.) 2. నన్ను (హ. తం. వా.)
3. వైన (హ. తం. వా.)
* తా. ప. ప్రతులలో లేదు.
4. మఱియు నీ వన్య సీమంతిని యనియును (హ. తం. వా)

తే. మింతయును మామకీన మై యెసఁగు మాయఁ
జేసి కల్పిత మయ్యెఁ జర్చింప మనము
పూర్వమున హంసల మనియుఁ బూని యెఱుఁగఁ
బలికితిఁ దెలియు మనల రూపంబుఁ జూడు. 850

వ. ఏనే నీవు గాని యన్యుండవు గావు. నీవే నేఁ గాని యన్యుండం గాను. ఇక్లైఱుం గుము. విద్వాంసులు మన యిద్దఱియందు నంతరంబు నీక్షింపరు. పురుషుండు ద న్నొక్కనినె యాదర్శచతుష్టయులందు భిన్నరూపులుగా దలంచుచందంబున మన యిద్దఱికిని భేదంబు గలిగినయట్లు దోఁచు. అని యి ద్విధంబున నతం డతనిచేత నీవు పూర్వంబున మదీయసఖుండ వై న హంసవని తెలుపంబడి స్వస్థుం డై త ద్వియోగనష్టం బై న జ్ఞానంబుఁ గ్రమ్మఱం బొందె. అని చెప్పి నారదుండు ప్రాచీన బర్హిం జూచి, యీ యధ్యాత్మత త్త్వంబు రాజకథా మిషంబున నీ కెఱిఁగించితి. అనిన. 851

అధ్యాయము - ౨౯

క. విని భూమీశుఁడు నారద, మునికను భవదీయ వచనములు సూరులు ద
క్కను గర్మమోహితుల మై, వఱలెడు నే మెట్లు దెలియువారము చెపుమా!

వ. అనిన యోగీంద్రుండు రాజేంద్రున కి ట్లనియె. రాజేంద్రా! యేమి కతంబున నాత్మ యేక ద్వి త్రి చతుష్పాదంబు బహుపాదంబు నపాదంబు నగుచుఁ బురంజను దేహంబు ప్రకటం బొనర్చె నా కతంబునం బురంజనుండు పురుషుండయ్యె. అట్టి పురుషునకు నామ క్రియా గుణంబులచేత విజ్ఞాయమానుండు గాకుండుటం జేసి యవిజ్ఞాతశబ్దంబునం జెప్పంబడు సఖుం డీశ్వరుండు. పురుషుండు సాకల్యంబు నంజేసి దేహపరిగ్రహంబు సేయ నిచ్ఛయించు నప్పుడు నవద్వారకలితంబును, ద్విహ స్తచరణయు క్తంబును నై న పురం బేది గల దది లెస్స యని తలంచి, య ప్పురం బను దేహంబు నొందు. పురుషుం డింద్రియంబులంజేసి యే బుద్ధి నధిష్ఠించి విషయంబుల ననుభవించు, నహంకార మమకారంబులకు నే బుద్ధి త త్త్వంబు గారణం బగు, నట్టి బుద్ధి ప్రమదో త్తమ యనంబడు. దానికి సఖులు జ్ఞానకర్మ కారణంబులై న యింద్రియగుణంబులు. సఖీజనంబులు దదీయవృత్తులు. పంచముఖోరగం బనం బంచవృ త్తి యైన ప్రాణంబు. ‡ఏకాదశ మహాభటు లన బృహద్బలుండును, నుభయేంద్రియ నాయకుండును నై న మనంబు. నవద్వార సమేతంబై న యప్పురంబు చుట్టివచ్చిన పాంచాలదేశంబు లనం బంచవిషయంబులు.

---

‡ "ఏకాదశ భట ఇత్యనేన ఏకాదశో మహాభటో నాయకః" (29-7) (వ్యాఖ్య)

నవద్వారంబు లన నఱి నాసికా కర్ణ ముఖ గుద శిశ్నంబులు. అందు నఱి నాసాద్వారంబు లైదునుం బ్రాగ్ద్వార పురస్కృతంబులు. దక్షిణోత్తర కర్ణం బులు దక్షిణోత్తర ద్వారంబులు. గుద శిశ్నంబులు పశ్చిమద్వారంబులు. అందు నేకస్థల నిర్మితంబు లైన ఖద్యోతావిర్ముఖులు నేత్రంబులు. విభ్రాజితం బన రూపంబు. ద్యుమంతుం డనం జఱురింద్రియంబు. నళినీనాళిను లన నాసికా ద్వారంబులు. సౌరభం బనం గంధంబు. అవధూత యన ఘ్రాణేంద్రియంబు. ముఖ్య యన నాస్యంబు. విపణం బన వాక్కు. రసజ్ఞుం డన రసంబు. ఆపణం బన వ్యవహారంబు. బహూదనం బన వివిధాన్నంబు. [1]పితృహు వన దక్షిణకర్ణంబు. [2]దేవహు వన నుత్తరకర్ణంబు. చండవేగుం డనం గాలోపలక్షకం బైన సంవత్స రంబు. గంధర్వ లన దివంబులు. గంధర్వీజనంబు లన రాత్రులు. పరీవర్తనం బన నాయుర్హారణంబు. కాలకన్యక యన జర. యవనేశ్వరుం డన మృత్యువు. అతని సైనికు లాధి వ్యాధులు. ప్రజ్వారుం డనం ప్రాణిహింసయందు శీఘ్రవేగంబు గలిగి, శీతోష్ణభేదంబుల ద్వివిధం బైన జ్వరంబు. దక్షిణపాంచాలం బనం బిత్ర్యలోక ప్రాపకంబును, ప్రవృత్తిరూపకంబును నైన శాస్త్రంబు. ఉత్తరపాంచాలం బన దేవలోక ప్రాపకంబును, నివృత్తిసంజ్ఞికంబును నైన శాస్త్రంబు. శ్రుతధరుం డన శ్రోత్రంబు. ఆసురీనామకం బనం బశ్చాద్ద్వారం బైన మేఢ్రంబు. గ్రామకం బన సురతసుఖంబు. దుర్మదుం డన గుహ్యేంద్రియంబు. నిర్ బుతినామకం బైన పశ్చిమద్వారం బన గుదంబు. వైశసం బన నరకంబు. లుబ్ధకుం డనం బాయువు. అంధు లన హస్తపాదంబులు. అంతఃపురం బన హృదయంబు. విషూచి యన మనంబు. అని వెండియు. 853

సీ. అనఘాత్మ! వినుము జాయాత్మజులను గుణాక్తం బగు మఱి బుద్ధితత్త్వమర్థి
వెలయ నే యే గతి [3]వికృతిఁ జేయంబడు నే యే తెఱంగుల నింద్రియములు
వికృతిని బొందు నా విధమునఁ దద్గుణాన్వితుఁడును వరుసఁ ద ద్వృత్తులకును
ఘనుఁడు నుపద్రష్టయును దగు నాత్మయుఁ ద ద్వృత్తులను బలాత్కారమునను

తే. ననుకరింపంగ నర్థిఁ జేయంగఁ బడుట
ననవరత మాత్మమహిమని ననుచరించు
టయు నెఱుంగఁగఁ జెప్పి యి ట్లనియె మఱియు
జనవరేణ్యునితో యోగిసత్తముండు. 854

---

1. పితృహూయన (హ) 2. దేవహూయన (హ)
3. వివరింపగాబడు (క. త. ద. బ.); వికలింపగాబడు (చ. డ.) వికసింపగాబడు (ట. జ.)

వ. మఱియు నరదం బన దేహంబు. తురంగంబు లన నింద్రియంబులు. ఈషాద్వయం బన సంవత్సరంబును, ద త్కృత వయస్సును. చక్రద్వయం బనం బుణ్యాపాపకర్మ ద్వయంబు. వేణుత్రయం బన గుణత్రయంబు. పంచబంధురం బనం బంచప్రాణం బులు. రశ్మి యన మనంబు. సారథి యన బుద్ధి. రథికోపవేశ స్థానం బన హృద యంబు. కూబరంబు లన శోక మోహంబులు. పంచప్రహరణంబు లనం బంచేంద్రి యార్థ ప్రక్షేపంబు. పంచవిక్రమం బనం గర్మేంద్రియంబులు. *(సప్తవరూథంబు లన ధాతువులు.) హైమోపస్కరం బన రజోగుణంబు. అక్షయతూణీరం బన ననంత వాసనాహంకారోపాధి. ఏకాదశచమూపతి యన నేకాదశేంద్రియం బైన మనంబు. (ఆసురీవృత్తి యనం బాహ్యావిక్రమంబు.) పంచేంద్రియంబుల చేత మృగయావినోదంబు చందంబున హింసాదులం జేసి విషయంబు లనుభ వించుటయ మృగయాచరణంబు. ఈ విధంబున నుండ జీవుండు దేహంబున స్వప్న సుషుప్తి జాగ్రదవస్థలయందు నాధ్యాత్మి కాధిదైవి కాధిభౌతికంబు లైన బహువిధ దుఃఖంబులం జేసి క్లేశంబుల ననుభవింపుచు, నజ్ఞానావృతుం డై వర్ష శతంబు నిర్గుణుం డయ్యును ఘ్రాణేంద్రియ మనోధర్మంబులం దనయందు నధ్య వసించి, కామలవంబుల ధ్యానంబు సేయుచు, నహంకార మమకారసహితంబుగా గర్హ్యాచరణంబు సేయుచుండు. 855

క.. పురుషుఁడు నిజప్రకాశతఁ, బరఁగియు నలఘుఁడు పరుండు భగవంతుండున్
గురుఁడును నగు.న య్యాత్మను, బరువడి నెఱుఁగంగలేక ప్రకృతిగుణములఁ.

క. విను మెపుడు దగులు నప్పుడ, యెనరంగ గుణాభిమానియును గర్మవశుం
డనఁ దగు నా పురుషుఁడు దా, ఘన మగు త్రైగుణ్య కర్మకలితుం డగుచుఁ.

సీ. ధృతి నొప్పుచున్న సాత్త్వికకర్మమునను ప్రకాశ భూయిష్ఠ లోకముల భూరి
రాజస ప్రకటకర్మమున దుఃఖోదర్క లోలక్రియాయాస లోకములను
గైకొని తామసకర్మంబునను దమ శ్శోక మోహోత్కట లోకములను
బొందుచుఁ బుం స్త్రీ నపుంసకమూర్తుల దేవ తిర్య జ్మర్త్యభావములను

తే. గలుగుఁ గర్మానుగుణములుగాఁగ జగతిఁ
బుట్టి చచ్చుచుఁ గ్రమ్మఱఁ బుట్టునట్లు
దివిరి కామాశయుం డైన దేహి యెప్డు
నున్న తోన్నత పదవుల నొందుచుండు. 858

వ. అని మఱియు ని ట్లనియె. 859

---

* తా. ప. ప్రతులలో లేదు.

మ. ఎనయఁ దుత్పరిపీడఁ గుంది శునకం బింటింటికిం బోవఁ బూ
నినఁ ద ద్దైవిక మైన దండహతి గానీ, కాక చౌర్యాన్న మై
నను గానీ తగఁ బొందుచందమున నెన్నఁ దై వయోగంబు పెం
పున నీ జీవుఁడు దాఁ బ్రియాప్రియములం బొందుం ద్రిలోకంబులఁ. 860

చ. గొనకొని యిట్టి దుఃఖములకుం బ్రతికారము మానవేంద్ర! క
ల్గిన వినుఁ త త్ప్రతిక్రియ నకించనవృత్తి జనుండు మస్తకం
బున నిడు మోపు మూఁపునను బూనినఁ ద ద్భరదుఃఖ మాత్మఁ బా
యనిగతి జీవుడుం ద్రివిధ మై తగు దుఃఖముఁ బాయఁ డెన్నఁడుఁ. 861

క. ఘన దుఃఖహేతు కర్మం, బును ద త్ప్రతికార కర్మమును నన మాయా
జననము లగుటను బురుషుఁడు, గనుఁ గలలోఁ దోఁచినట్టి కలచందమునఁ. 862

వ. సవాసనోచ్ఛేదకంబు గాదని వెండియు ని ట్లనియె. 863

సీ. నరనాథ! వినుము స్వప్నంబుచందంబున నజ్ఞానవిలసితం బగుటఁ జేసి
తివిరి మిథ్యాభూత దేహాదికమునకు నరయ నివర్తనాయాస మేటి
కని యంటివేనియు నర్థంబు లేకున్న నర్థి సోపాధికం బైన మనము
వాంఛతో స్వప్నము వర్తింపఁ బురుషునిఁ బూని జాగ్రద్బోధచే నుపాధి

తే. చెడక స్వాప్నికసంసృతి విడువనట్లు
తత్త్వవిజ్ఞానమున నవిద్యానివృత్తి
దార దేహాదిక నివృత్తి దగులకున్నఁ
దివుట సంసృతిఁ దా నివర్తింపకుండు. 864

చ. ఘన పురుషార్థభూత మనఁగాఁ దగు నాత్మకు నే నిమిత్త మై
యొనర ననర్థహేతు వన నూల్కొను సంసృతి సంభవించిన
ట్లనయముఁ ద న్నిమిత్త పరిహారక మర్థి జగద్గురుండు నాఁ
దనరిన వాసుదేవ పదతామరస స్ఫుటభక్తి యూరయఁ. 865

క. పూనిన త ద్భక్తి సమి, చీనగతిం దెలియ ననఘ! చిర వైరాగ్య
జ్ఞాన జనక మగు భక్తిని, ధానము గోవిందవరకథాశ్రయమ యగుఁ. 866

వ. కావున నది త త్కథాకర్ణన గాన నిగతుండు, విశ్వాసయుక్తుండు నైన వానికి
సంభవించు. మఱీయును. 867

క. ధర సాధులు విమలాంతఃకరణులు భగవద్గుణానుకథన శ్రవణ
స్ఫురితస్వాంతులు ననఘులు, [1]వరమతులు నైన భాగవత నిలయములఁ. 868

క. సరసోదార మహాత్మ ము, ఖరితము లగు మధువిరోధి కమనీయ గుణో
త్కర సురుచిర చరితామృత, పరిపూరిత వాహినులను బరమప్రీతిఁ. 869

క. మన మలరఁగ శ్రోత్రాంజలు, లను బానముసేయు పుణ్యులకు తుత్తృష్ణా
ఘనభయ శోక విమోహము, లనయంబును సోఁకకుండు నవనీనాథా! 870

వ. కావున నిట్టి భాగవతసహవాసంబు లేక *(తనంతన భగవద్భాగవత గుణాభి
వర్ణన కథానుచింతనాదులయందుం బ్రవర్తించిన) నాలస్యాది దోషంబు లొంది,
యీ జీవలోకంబు సహజ తుథాదికంబున నుపద్రుతం బై సర్వేశ్వర కథామృత
వాహినియందు రతిం జేయదు. ఇది నిశ్చయంబు. అని మఱియు ని ట్లనియె.

సీ. పద్మసంభవుఁడును భవుఁడును మనుకులసమితి దక్షాది ప్రజాపతులును
నైష్ఠికు లైన సనకముఖ్యమునులుఁ బులస్త్యుండు భృగువు పులహుఁడుఁ గ్రతువు
నత్రి మరీచియు నంగిరసుండు నరుంధతీవిభుఁడును రూఢిమెఱయ
బహుపుణ్యులేఁ గడపలఁ గాఁగఁ గల బ్రహ్మవాదులు నందఱు వాక్సమితికి

తే. నెనయ నీశ్వరు లై యుండియును సమగ్ర
మతిఁ దపో యోగవిద్యా సమాధి వరవి
చారు లై యుండియును సర్వసాక్షి యైన
యీశ్వరుని వెదకియుఁ గాన రిద్ధచరిత! 872

వ. అది యెట్లంచేని. 873

మ. ఘనవిస్తార మపార మద్వయ మనంగా నొప్పు [2]వేదంబు దా
మనువర్తింపుచు మంత్రయుక్తి వివిధం బై నట్టి దేవాఖ్య శో
భన సామర్థ్యముచేత నింద్రముఖరూపం బిష్టదై వంబుగాఁ
గని వేడ్కఁ భజియించువారలు గనంగా నేర్తు రే? యీశ్వరున్. 874

క. వినుమాత్మభావితుం డన, నెనసిన భగవంతుఁ డెప్పు డెవ్వనిఁ గరుణన్
[3]దనరుచు ననుగ్రహించును, మనుజేశ్వర! యపుడ వాఁడు మహితాత్మకుఁ దై.

క. ధీరత నీ లోకవ్యవ, హారంబును వైదికంబు ననఁదగు కర్మా
చారములందు వినిష్ఠత, మై రూఢిఁ దనర్చు బుద్ధి నర్థిఁ విడుచున్. 876

---

1. వరధిషణులు నైన భాగవత జనులు సభఁ (తం. వా.)
* తా. ప. ప్రతులలో లేదు.
2. వేదము న్నను, వర్తించు (క. తం.) 3. ననయము (క. చ. ట. తం.)

సీ. కావున రాజేంద్ర! నీవును బరమార్థ [1]రూపంబు లగుచుఁ బ్రబోచమాన
ములును గర్ణప్రియంబులును నస్పష్ట వస్తువులును నైన యీ వివిధకర్మ
ములయందుఁ బురుషార్థబుద్ధి గావింపకు మతిఘనస్వాంతు లైనట్టివారు
పరఁగు జనార్దనప్రతిపాదకం బైన శ్రుతిఁ గర్మపర మని చూపుచుండు

తే. వారు వేదజ్ఞు లనఁదగువారు గారు
రూఢి మఱి వారు నిత్యస్వరూపభూత
మైన యీ యాత్మతత్త్వంబు నలరు వేద
కలిత తాత్పర్య మని యాత్మఁ దెలియ లేరు. 877

వ. కావునం బ్రాగగ్రంబు లైన దర్భలచేత సకలక్షితిమండ లాస్తరణంబు గావించి, యహంకారయుక్తుం డవు, నవినీతుండవు నై పెక్కుపశువులఁ జంపనే కాని కర్మస్వరూపంబును, విద్యాస్వరూపంబును నెఱుంగవు. ఆ కర్మవిద్యాస్వరూపంబు లెట్టి వనిన, సర్వేశ్వరపరితోషకం బేది యది కర్మంబు. ఆ సర్వేశ్వరునియందు నేమిట మతి సంభవించు నదియ విద్య. అతండె దేహులకు నాత్మయు, నీశ్వరుండు నగుచుండుం గావునం బురుషులకు క్షేమకరం బైన యాశ్రయంబు తత్పాదమూలంబ. అతండు ప్రియతముండును, సేవ్యమానుండును, నగుచుండ నణుమాత్రం బైన దుఃఖంబు లేదు. అట్టి యీ భగవత్స్వరూపం బెవ్వం డెఱుంగు వాఁడు విద్వాంసుండు, గురుండు, హరియు నని చెప్పి వెండియు నిట్లనియె.

క. అవనీశ! యీవిధంబున, భవదీయ ప్రశ్న మిట్లు పరిహృత మయ్యెఁ
దవిలి యిఁక నొక్కగోప్యము, వివరించెదఁ జిత్తగింపు విమలచరిత్రా! 879

సీ. లలి సుమనోవాటికలయందు నల్పప్రసూన మరంద గంధానుమోద
సంచారియును మృగీసహితముఁ ద న్నివేశితచిత్తమును మధుప్రతినాద
మేదుర శ్రవణానుమోదితమును బురోభాగచర న్నిజ ప్రాణహారి
దీపిత వృకగణాధిష్ఠితమును లుబ్ధక క్రూర ఘనసాయక ప్రభిన్న

తే. పృష్ఠభాగంబు నై తగ నెదను మృత్యు
భీతి వాటిల్ల నొండు దప్పింప వెరవు
గాన కడవిఁ జరించు మృగంబుపగిది
భూవరోత్తమ! వినవయ్య! పురుషుఁ డెపుడు. 880

వ. అంగనానివాసంబులయందు క్షుద్రతమం బగు కామ్యకర్మ పరిపాకజనితం బైన జిహ్వోపస్థాది కామజనిత సుఖవేళంబుల నన్వేషింపుచుఁ గామినీయుక్తుండును, దన్నివేశితమానసుండును, నతిమనోహరవనితాజనాలాపశ్రవణతత్పరచిత్తుండును,

---

1. కలితంబు లగుచు బ్రకాశమాన (క. చ.)

బ్రత్యఱుంబున నాయుర్వ్యాకరణకార ణాహోరాత్రాది కాలవిశేష గణనాపరుండు గాక పరోఱుంబునం గృతాంత శరనిర్భిన్న గాత్రుండు నగుచు నీ జీవుండు విహరింపుచుండుం గావున నీవు నీ జీవుని మృగచేష్టితునిఁగ విచారించి, శ్రోత్రాదు లందున్న శబ్దాదులంబలె బాహ్యావృత్తు లగు*(శ్రౌత స్మార్తాది రూపంబగు కర్మం బును హృదయంబునందు నియమింపుచు) నసజ్జనయూథ వార్తాసహితం బైన గృహాశ్రమంబు విడువుము. సకలజీవాశ్రయుం డైన యీశ్వరుని భజియింపుము. ఇట్లు సర్వతోవిరక్తుండవుగమ్ము. అని నారదుండు వలికినం బ్రాచీనబర్హి యిట్లనియె.

క. మునివర ! భగవంతుండవు, ననుపమ విజ్ఞాననిధివి ననఁదగు నీచే
తను వివరింపంగాఁ దగి, యెనసిన యీ యాత్మతత్త్వ మిటు నాచేతఁ. 882

వ. శ్రుతంబు విచారితంబు నయ్యె. కర్మనిష్ఠు లగు నుపాధ్యాయు లయిన వార లీ యాత్మతత్త్వంబు నెఱుంగరు. ఎఱింగి రేని యుపదేశింపరు. కావునఁ దత్కృతం బయిన మహాసంశయంబు నీచేత నివృత్తం బయ్యె. అని వెండియు ని ట్లనియె.

సీ. అనఘాత్మ ! యేమిటియందు నీ యింద్రియ వృత్తులు దగఁ బ్రవర్తింపకుండు టను జేసి బుషు లైన ఘనముగ మోహింతు రట్టి యర్థమునందు నాత్మసంశ యము గల్గుచున్నది యది యెట్టి దనినను బురుషుఁ డే యే దేహమునను జేసి కర్మముల్ నేసి త త్కాయంబు నీ లోకమందునే విడిచి తా నన్యదేహ

తే. మర్థితో ఘటియించి లోకాంతరమును
బొంది త త్కర్మఫలమును బొందు ననుచుఁ
బ్రకటముగ వేదవేత్తలు పలుకుచుందు
రన్న నదియెట్లు విన నుపపన్న మగును ? 884

వ. అదియునుం గాక యాచరితం బైన కర్మంబు దత్క్షణంబున వినష్టం బగుటం జేసి (జీవుండు) దేహాంతర లోకాంతర [1]భావి యైన ఫలం బె ట్లనుభవించు ? అనిన బర్హిష్మంతునకు నారదుం డిట్లు నియె. నరేంద్రా! స్వప్నావస్థయందు లింగశరీరాధి ష్ఠాత యైన జీవుండు జాగ్రద్దేహాభిమానంబు విడిచి, తాదృశంబ కాని యతా దృశంబ కాని యైన శరీరాంతరంబు నొంది, మనంబునందు సంస్కారరూపంబున నాహితం బైన కర్మంబు ననుభవించు చందంబునం బురుషుం డే లింగశరీరంబునం జేసి కర్మంబు నాచరించు నా లింగశరీరంబుననే లోకాంతరంబున దేహవిభేదంబు నొందక త త్ఫలం బనుభవించు. అదియునుం గాక దాన ప్రతిగ్రహాదులయందు స్థూలదేహంబునకుం గర్తృత్వంబు గల దంటివేని, నహంకార మమకారయుక్తుం

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. గామియై (హ)

డైన పురుషుండు మనంబునంజేసి యే యే దేహంబు పరిగ్రహించు నా యా దేహంబున సిద్ధం బైన కర్మం బా జీవుం డనుభవించు. అట్లు గాకున్నఁ గర్మంబు పునర్భవకారణం బగుట యుపపన్నంబు గాకయుండు. కావున మనఃప్రధానం బైన లింగశరీరంబునకె కర్తృత్వం బుపపన్నం బగు. అని వెండియు నిట్లనియె.

క. క్షితి నుభయేంద్రియ కర్మ, స్థితు లనుభవ మందఁబడిన చిత్తము పగిదిన్
ధృతిఁ జిత్తవృత్తులను ల, క్షిత మగుఁ ద త్పూర్వ[1]దేహ కృతకర్మంబుల్. 886

వ. అది యెట్లనిన నీ దేహంబునంజేసి యే రూపంబున నేప్రకారంబున *(నెప్పు డెచ్చట) నగు నది యననుభూతంబు, నదృష్టంబు, నశ్రుతంబు నై యుండును. అట్టిది యొకానొకకాలంబున వాసనాశ్రయుం డైన పురుషునకుఁ (ద దనుభవాదియుక్తం బగు) పూర్వదేహంబున ననుభూతంబును, దృష్టంబును, శ్రుతంబు నని విశ్వసింపుము. ఈ మనంబున ననుభూతార్థంబు గోచరింపఁజాలదు. ఈ మనం బె పురుషులకు శుభాశుభనిమిత్తంబు లైన పూర్వాపరదేహంబులం బ్రకాశింపం జేయుచుండు. ఈ మనంబునందు నదృష్టంబు, నశ్రుతంబు నైన యర్థంబు స్వప్నాదికమందుం దోఁచు నంటివేని, నది దేశ కాల క్రియాశ్రయం బని తలంపం దగు. సమస్తవిషయంబులు గ్రమానురోధంబున మనంబునంజేసి భోగ్యంబు లగు. అని మఱియు. 887

చ. సుమహిత శుద్ధ సత్వగుణ శోభితమున్ సరసీరు హోదరో
త్తమగుణ చింతనాపరము ధన్యము నైన మనంబునందు భూ
రమణ! సుధాంశునందు నుపరాగమునఁ దివిఁ దోఁచు రాహుచం
దమునను గోచరం బగు నుదారత నీ యఖిలప్రపంచమున్. 888

వ. అని వెండియు నిట్లనియె. (లింగదేహమునకుఁ) గర్తృత్వ భోక్తృత్వంబులు స్థూలదేహద్వారకంబు లగుటంజేసి స్థూలదేహవినాశనంబు గలుగం జీవునకుఁ గర్తృత్వ భోక్తృత్వంబులు లేకుండుటంజేసి ముక్తి గలుగునంటివేని, నీ స్థూల దేహ సంబంధంబు జీవునియందు బుద్ధి మనో మోహార్థ గుణవ్యూహ రూపాది లింగశరీర భంగపర్యంతంబును గలుగుచుండును. సుషుప్తిమూర్ఛాదులయందు *(నిష్టవియోగాది దుఃఖమందు) నహంకారంబు గలిగియుండు. అది యింద్రి యోపఘాతంజేసి యమావాస్య యందులఁ జంద్రునింబోలి తరుణపురుషునకు (గర్భ) బాల్యావస్థలయందు నింద్రియపాష్కల్యంబు లేకుండుటంజేసి యేకా దశేంద్రియస్ఫురణ సమర్థం బైన యహంకారంబు (గర్భాదులకుఁ) బ్రకాశింపని

---

1. కాలకృత (క. చ. ట. త.) *తా. ప. ప్రతులలో లేదు.

చందంబునం బోఁపకుండుం గావున స్థూలదేహ విచ్ఛేదంబు లేకుండుటంజేసి వస్తు భూతార్థంబు లేకున్న నీ సంసారంబు (విషయంబులయం దాసక్తుం డగు జీవునకు) స్వాప్ని కానర్థాగమనంబు (చందంబున) నివర్తింపదు. ఈ తీరునఁ బంచతన్మాత్రాత్మకంబును (త్రిగుణాత్మకంబును) షోడశవికారాత్మకంబును నై (విస్తృతం బైన) లింగశరీరంబు నధిష్ఠించి, చేతనాయుక్తుం డైన జీవుం డని చెప్పంబడు. మఱియు. 889

సీ. తివిరి య ప్పురుషుండు దేహంబుననుజేసి యనయంబుఁ బెక్కు దేహాంతరముల
నంగీకరింపుచు నది విసర్జింపుచు సుఖ దుఃఖ భయ మోహ శోకములను
బొలుపొందు తద్దేహములనె పొందుచునుండు నది యెట్లు లన్నను నగ్రభాగ
తృణ మూఁది మఱి పూర్వతృణ పరిత్యాగంబు గావించు తృణజలూకయును బోలి

ఆ. జీవుఁ డవనిఁ గొంత జీవించి మ్రియమాణుఁ
డగుచు నొండుదేహ మర్థిఁ జెంది
కాని పూర్వ మైన కాయంబు విడువఁడు
గాన మనమె జన్మకారణంబు. 890

తరల. నరవరో త్తమ! యిట్లు గాన మనంబె జీవుల కెల్ల సం
సరణకారణ మట్టి కర్మవశంబునఁ సకలేంద్రియా
చరణుఁ డౌట నవిద్య గల్గును సంతతంబు నవిద్యచేఁ
బరఁగుటఁ బహు దేహకర్మ నిబంధముల్ గలుగుం జుమీ! 891

చ. వినుమది గాన భూవర! యవిద్య లయించుటకై రమాపతిన్
ఘన జనన స్థితి ప్రళయ కారణభూతునిఁ బద్మపత్రలో
చనుఁ బరమేశు నీశ్వరుని సర్వజగంబుఁ ద దాత్మకంబుగా
గనుఁగొనుచుం దదీయ పదకంజము లర్థి భజింపు మెప్పుడున్. 892

క. అని యీగతి భగవంతుం, డనఘుఁడు భాగవతముఖ్యుఁ డగు నారదుఁ డా
ఘనునకు జీవేశ్వరగతి, ఘనకృప నెఱిఁగించి సిద్ధగతిఁ జనియెడఁగన్. 893

సీ. రాజర్షి యైనట్టి ప్రాచీనబర్హి తాఁ దగఁ బ్రజాపాలనార్థంబు సుతుల
ధరకు నియోగించి తపము సేయుటకు నై కపిలాశ్రమంబున [1]కరిగి వేగ
నచ్చట నియతి నేకాగ్రచిత్తుండును ముక్తసంగుండును భూరి ధైర్య
యుక్తుండు నగుచును భక్తి యోగంబున ననఘ! గోవింద పదారవింద

---

1. అపుడువేగ (తం. వా.)

తే. చింతనామృత పానవిశేష చిత్తుఁ
డగుచు విధి రుద్రముఖ్యుల కందరాని
యవ్య యానందమయపద మందె నప్పు
డనుచు మైత్రేయమని విదురునకుఁ జెప్పి. 894

వ. వెండియు నిట్లనియె. ఇట్లు ముకుందయశంబునం జేసి భువనపావనంబు, మనశ్శుద్ధి కరంబు, సర్వోత్కృష్ట ఫలప్రదాయకంబు, దేవర్షివర్య ముఖ వినిస్సృతంబు నైన యీ యధ్యాత్మ పారోక్ష్యంబు నెవ్వండు పఠియించు, నెవ్వండు విను, నట్టివాఁడు లింగశరీర విధూననంబు గావించి విముక్త సమస్త బంధుండై *(విదేహ కైవల్యంబు నొంది) సంసారంబుఁ నందుఁ బరిభ్రమింపండు. అనిన మైత్రేయునకు విదురుం డిట్లనియె. 895

అధ్యాయము - ౩౦

క. మునినాథ! [1]ప్రచేతసు లా, [2]ఘనముగ రుద్రోపదిష్ట కమలోదర కీ
ర్తనమున నేగతిఁ బొందిరి, వనజాతుఁడు సంతసింప వా రనఘాత్మా! 896

తే. కడఁగి మఱి వారు యాదృచ్ఛికమునఁ జేసి
హరికి నిత్యప్రియుం డగు హరునిఁ గాంచి
యతనివలన ననుగ్రహ మంది మోక్ష
మంది రని చెప్పి తది నిశ్చయంబు మఱీయు. 897

క. హరిదర్శనపూర్వం బిహ,పరలోకములందు నా నృపాలతనయు లం
దిరి యేఫలముల నందఱు?, నిరతి నెఱింగింపు మన మునీంద్రుఁడు వలికెన్.

క. విను జనకాదేశము ముద,మునఁ దాల్చి నృపాత్మజులు సముద్రోదరమం
దనుపమ జపయజ్ఞంబున, [3]నొనరఁ దపం బూని ముదము నొందుచు నుండఁ.

క. పదివే లేడులు నిష్ఠను, వదలక తప మాచరింప వారల కర్థిఁ
సదయాంతరంగుఁ డభయ, ప్రదుఁడు సనాతనుఁడు నైన పద్మోదరుఁడుఁ. 900

క. అనుపమ శాంతము లగు నిజ, తనురశ్మిలచే నృపాలతనయ తపోవే
దనలు శమింపఁగఁ జేయుచు, ననయముఁ బ్రత్యక్ష మయ్యె నచ్యుతుఁ డంతఁ.

సీ. ఘన మేరుశృంగ [4]సంగత మైన మేఘంబు నెఱి గరుడస్కంధ నివసితుండుఁ
గమనీయ నిజదేహకాంతి విపాటి తాభీ లాభి లాశాంతరాళ తముఁడు
సుమహి తాష్టాయుధ సుమనో మునీశ్వర సేవక పరిజన సేవితుండు
మండిత కాంచనకుండల రుచిరోప లాలిత వదన కపోలతలుఁడుఁ

---

1. ప్రచేతస్కులు(వా) * తా. ప. ప్రతులలో లేదు. 2. ఘనమగు (క)
3. నొనరింపం జనుఁడు ముదము నొందుచు నుండున్ (క) 4. నీలమేఘంబు (తం. వా.)

తే. జారు నవరత్న దివ్యకోటీర ధరుఁడుఁ
గౌస్తుభ ప్రవిలంబ మంగళ గళుండు
లలిత పీతాంబర ప్రభాలంకృతుండు
హార కేయూర వలయ మంజీర యుతుఁడు. 902

క. లలితాయ తాష్టభుజమం,డల మధ్య స్ఫురిత రుచివిడంబిత లక్ష్మీ
లలనా కాంతిస్పర్ధా, కలిత లస ద్వైజయంతికా శోభితుఁడుఁ. 903

క. సుర గరుడ యతు కిన్నర, నిరుపమ జేగీయమాన నిఖిల దిశా సం
భరిత యళో మహనీయ, స్ఫురణుఁడు నగు న ప్పురాణపురుషుం డెలమిఁ. 904

క. కరుణానలోకనంబుల, నిరవొంద నృపాలసుతుల నీఱింఁచి రమా
వరుఁ డంబుదగంభీర మ,ధుర భాషలఁ బలికెఁ బ్రియము దూఁకొనుచుండఁ. 905

తే. తాపసో త్తము లగు ప్రచేతస్కులార !
వినుఁడు మిగలు సౌహార్దము న భిన్న
ధర్మ్ము లగుట భవ త్సౌహృదమున కేను
జాలఁ బరితోష మందితి సమత నేఁడు. 906

క. అనయమును మీ మనోరథ, మొనరింతు నెఱుంగఁ బలుకుఁ డు త్తము లగు మి
మ్మనుదిన మే నరుఁడు సుఖశ,యనుఁ డై మదిలోనఁ దలఁచు నా నరుఁ డెపుడుఁ.

క. భ్రాతృజన సౌహృదంబును, భూతదయాగుణము విమలబుద్ధియు సుజన
ప్రీతియుఁ గల్గి సుఖించును, వీత సమస్తాఘుఁ డగుచు విశ్వములోనఁ. 908

వ. మఱియు రుద్రగీతం బై న మదీయ స్తవం బెవ్వ రనుదినంబును స్తోత్రంబు సేయుదురు, వారల కభిమత వరంబులు శోభనకరం బగు ప్రజ్ఞయు నిత్తు. మీరలు ముదన్వితు లై జనకాచేళం బంగీకరించుటం జేసి మీకీర్తి లోకంబుల విస్తరించు. మీకు ననూన బ్రహ్మగుణుండు, నాత్మ సంతతిం జేసి లోకత్రయ పరిపూర్ణ గుణాకరుండు నైన పుత్రుండు సంభవింపఁ గలండు. కండుమహాముని తపోవినా శార్థంబుగా నింద్రునిచేతఁ ప్రేరిత యగు ప్రమ్లోచ యను నప్సరస గర్భంబు దాల్చి య మ్మునీంద్రుని వీడ్కొని *(దివంబునకుఁ) జను సమయంబునం బ్రసూత యై త త్పుత్రిని వృక్షంబులందుఁ బెట్టి చనిన. 909

సీ. ఆ శిశు వపుడు పేరాఁకలిచేఁ గుంది [1]వావిచ్చి బిట్టు వాపోవుచుండ
నాలించి [2]యటకు రా జైన సోముఁడు వచ్చి వలనొప్ప నవసుధావర్షి యైన
యాత్మీయ తర్జని సర్థిఁ బానమ్ము సేయింపంగఁ బెరిఁగిన యిందువదనఁ
గన్య వరారోహఁ గడఁక [3]పుదసువర్తి యైన పుణ్యుండు ప్రాచీనబర్హి

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. వాక్రుచ్చి బిట్టుగవగచుచుండ (హ) 2. యగమ (హ)
3. మారిషయను. చెలువఁ బుణ్యుండు (హ. తం. వా.)

తే. యన్నృపునిచేఁ బ్రజావిసర్గంబునందుఁ
బూని వేడ్కఁ ద దాదిష్టు లైన మీర
లందఱును నెయ్యమున వివాహంబు గండ
యని సరోరుహ నయనుఁ డిట్లనియె మఱియు. 910

వ. అనఘాత్ములారా! యభిన్న ‡ధర్మశీలు లైన మీ కందఱకు నీ సుమధ్యమ యైన కన్య యభిన్న ధర్మశీలయు, భవదర్పితాశయయు నైన భార్య యగు. మీర లప్రతిహత తేజస్కుల లై దివ్యవర్ష సహస్రంబులు భౌమదివ్యభోగంబులు మ దనుగ్రహు లై యనుభవించెదరు .అంత నాయందుల భక్తిం జేసి నిర్మలాంతఃకరణు లై యీ భోగంబులు నిరయప్రాయంబులుగాఁ దలంచి మదీయస్థానంబు నొందెదరు. అని వెండియు ని ట్లనియె 911

చ. అరయ గృహస్థు లయ్యును మ దర్పిత కర్ములు నస్మదీయ సుం
దర చరితామృత శ్రవణ తత్పర మానస యాతయాములఁ
సరసగుణాఢ్యు[1] లై తనరు సాధుల కే గృహముల్ దలంప దు
ష్కర భవబంధహేతువులు గావు నృపాత్మజులార ! యెన్నఁడుఁ. 912
†

క. సరసుఁడ నగు ననుఁ బొందిన, పురుషులు ఘన శోక మోహ మోదంబులఁ బొం
దరు గావున నెనయఁగను ద్రి, పురు షాధీశ్వరుఁడ బ్రహ్మభూతుఁడ నగుదున్.

వ. ఆని యిట్లు పలుకుచున్న పురుషార్థభాజనుం డగు జవార్దనుని దర్శించి త
ద్దర్శన విధ్వస్త రజస్త మోగుణు లైన ప్రచేతస్కులు. 914

చ. కరసరసీరుహంబు [2]లెసకంబెసఁగఁ ముకుళించి గద్గద
స్వరములఁ జేసి యి ట్లనిరి [3]సర్వశరణ్య నగణ్య నిందిరా
వరు నజితు న్ననంతు ననవద్యచరిత్రుఁ బవిత్రు నచ్యుతుం
బరుఁ బరమేశు నీశు భవబంధవిమోచనుఁ బద్మలోచనుఁ. 915

---

‡ శీలనాములైన (క. బ. తం) 1. లున్నయిన (క. బ)
† వ. అది యెట్లంటి రేని.
చ. అనుపమ బ్రహ్మవాదు లగు నంచిత యోగిజ నానుగీయమా
న నిజకథా సముత్సుకుఁ డనందగు నేను మదీయులంద నూ
తనముగ నుందుఁ గావున నుదారత వారికి నీ గృహావళుల్
ఘన భవబంధ హేతువులు గా విది యంతయు నిక్క మారయఁ.
పై వచనము పద్యము కొన్ని ప్రతులలో లేవు. మూలమునఁ గూడ లేవు.
2. లెసగన్ ముకుళించి ప్రమోదగద్గద, స్వర (ట. ద. బ.) 3. సర్వశరణ్యుని నిందిరాసతీ(ట. జ.)

సీ. కేశవ! సంతత క్లేశనాశనుఁడవు [1]కోరి మనో వా గగోచరుఁడవు
నిద్ధ మనోరథ హేతుభూ తోదార గుణనాముఁడవు స త్త్వగుణుఁడ వఖిల
విశ్వోద్భవ స్థితి విలయార్థ [2]ధారిత విపుల మాయాగుణ విగ్రహుఁడవు
మహితాఖ లేంద్రియ మార్గ నిరధిగత మార్గుండ వతిశాంత మానసుఁడవు

తే. తవిలి సంసారహారి మేధస్కుఁడవును
దేవదేవుఁడవును వాసుదేవుఁడవును
సర్వభూతనివాసివి సర్వసాక్షి
వై న నీకు సమస్కారమయ్య! కృష్ణ! 916

వ. మఱియును. 917

ఉ. తోయరుహోదరాయ, భవదుఃఖహరాయ, నమోనమః పరే
శాయ, సరోజకేసర పిళంగ వినిర్మల దివ్య [3]నవ్య వ
స్త్రాయ, పయోజసన్నిభ పదాయ, సరోరుహ మాలికాయ, కృ
ష్ణాయ, పరాపరాయ, సుగుణాయ, సురారి హరాయ, వేధసే. 918

వ. అని వినుతించి. 919

చ. కమలదళాక్ష! దుఃఖలయ కారణ మై తగు తావకీన రూ
పము ననివార్య దుర్భర విపద్దళ దుఃఖము నొందు మాకు నీ
సుమహిత సత్కృపాగరిమఁ జూపుటకంటె ననుగ్రహంబు లో
కమునఁ దలంప నొండొకటి కల్గునె? భక్తఫలప్రదాయకా! 920

ఉ. భూరి [4]వివేకితావహ విభూతిసమేత! మహాత్మ! దీనర
క్షారతి నొప్పు నీవు చిరకాలమునఁ సుఖవృత్తి వీరు మా
వార లటంచు బుద్ధి ననవద్య! తలంచిన యంతమాత్ర స
త్కారమె చాలు నట్లగుటగా కిటు సన్నిధి వైతి వీశ్వరా! 921

చ. అరయఁగ క్షుద్ర భూతహృదయంబులయందుల నంతరాత్మ వై
తిరముగ నుండు నీవు భవదీయ పదాంబురుహ ద్వయార్చనా
పరమతు లైన [5]మామక శుభప్రద భూరి మనోరథంబు లీ
[6]వెఱుఁగవె? భక్తలోక హృద యేప్సితదాయక! ముక్తినాయకా! 922

---

1. గురుసన్మనో (హ) 2. ధృతనిత్య (హ) 3. భర్మ (హ) 4. శివేతరాపహ (తం.వా.)
5. మాకును (హ) 6. అరుదుగనీవె భక్త హృదయ ప్రమదప్రద ముక్తి దాయకా (హ)

సీ. అయినను విను సరోజాయతలోచన! [1]వర మోక్షమార్గ ప్రవర్తకుఁడవు
పురుషార్థభూత విస్తరుఁడవు నగు నీవు దగిలి ప్రసన్నుఁడ వగుట మాకు
నర్థి మనోభీష్ట మైన వరం బయ్యె నైనను నాథ! పరాపరుండ
వైన ని న్నొకవరం బర్థింతు మనినను భువిఁ దావకీన విభూతు లెన్న

తే. నంత మెఱుఁగంగరామి ననంతుఁ డనుచుఁ
బలుకుదురు నిన్ను నదిగానఁ బరమపురుష!
యే వరం బని కోరుదు మేము? దప్పి
[2]గొన్న బాలకుఁ డబ్ధినీ ళ్లెన్ని గ్రోలు? 923

వ. అదియునుం గాక. 924

ఉ. పూని భవ త్పదాంబురుహ మూలనివాసుల మైన మేము మే
ధానిధి! నీ విలోకనముఁ దక్కఁగ నన్యముఁ గోర నేర్తు మే?
మానిత పారిజాతకుసుమ స్ఫుట నవ్యమరంద లుబ్ధ శో
భానయశాలి యైన మధుపంబు భజించునె? యన్యపుష్పముల్. 925

చ. హరి! భవదీయమాయ ననయంబును జెందిన నేము నిచ్చలుఁ
గర మనురక్తి నేది దుదగా భవకర్మ ల మై ధరిత్రిపైఁ
దిరుగుదు మంతదాఁక భవదీయ జనంబులతోడి సంగతిఁ
గురుమతి జన్మజన్మములకుఁ సమకూరఁగఁ జేయు మాధవా! 926

మ. కమలాధీశ్వర! తావకీన వర భక్తవ్రాత సంసర్గ లే
శముతోడఁ సరిగాఁ దలంప మెలమిఁ స్వర్గాపవర్గాది సౌ
ఖ్యము లన్నఁ విను మానుషంబు లగు నీ కామంబులం జెప్పనే
ల? మునీంద్రస్తుత పాదపద్మ! సుజనాలాపానుమోదాత్మకా! 927

వ. మఱియు భగవ ద్భక్తసంగంబులయందుఁ దృష్ణాప్రళమనంబు లైన మృష్టకథలు
చెప్పంబడుటచే భూతంబులయందు వైరంబును, నుద్వేగంబును లేకుండు. అని.928

చ. వనముల ముక్తసంగు లగువారు నుతింపఁ దనర్తు నీవు గా
వున నిలఁ బుణ్యతీర్థముల నొప్పఁ [3]బునీతము సేయఁబూని య
ర్థిని బదచారు లై ధరఁ జరించు భవ త్పదభక్త సంగమం
బనుపమ భూరి సంసృతి భయస్థుని బుద్ధి రుచింపకుండునే! 929

వ. కావున. 930

---

1. తగుమోక్షమార్గప్రదర్శకుడవు (త. డ. ద. బ.) 2. గొన్న బాలుడు గంగ నీళ్లెన్ని గ్రోలు (ట. డ.) 3. బవిత్రము సేయఁబూని. (వా)

చ. వనరుహపత్రలోచన! భవ త్సఖుఁ డైన సుధాంశుమౌళితో
డి నిమిషమాత్ర సంగతిఁ గడింది వ్రణంబును దుశ్చికిత్సము
న్నను భవకష్టరోగమున కర్మిలి వైద్యుఁడ వైన నిన్ను నే
మనయముఁ జూడఁ గంటిమి కృతార్థుల మై తగ మంటి మీశ్వరా! 931

వ. దేవా! మదీయ స్వాధ్యా యాధ్యయనంబులును, గురుప్రసాదంబును, విప్రవృ
ద్ధానువ ర్తనంబును, ఆర్యజన నమస్కరణంబును, సర్వభూతానసూయయు, నన్న
విరహితంబుగా ననేకకాలం బుదకంబులయందు సుత ప్తం బైన తపంబుసేయు
టయు నివి యన్నియును బురాణపురుషుండ వైన భవదీయ పరితోషంబుకొఱకు
నగుం గాక యని విన్నవించెదము. అని వెండియు ని ట్లనిరి. 932

మ. మను పద్మాసన ధూర్జటి ప్రముఖ ధీమంతుల్ తపో జ్ఞాన స
త్వనిరూఢిం దగువారు నీ మహిమముఁ వర్ణింపఁ బారం బెఱుం
గనివా రయ్యును నోపినంత వినుతుల్ గావింతు రచ్ఛాట నే
మును ని న్నర్థి నుతింతు మీశ! వరదా! బుద్ధ్యాదిమూలంబుగఁ. 933

వ. అని మఱియు సముండవు, నాదిపురుషుండవు, శుద్ధుండవు, పరుండవు, వాసు
దేవుండవు, స త్త్వ మూ ర్తివి, భగవంతుండవు నై న నీకు నమస్కరించెదము. అని
*(యిట్లు ప్రచేతసులచేత నుతింపంబడి శరణ్యవత్సలుం డగు హరి సంతుష్టాంత
రంగుం డై వారలు గోరినయట్ల వరంబు లిచ్చిన) 934

తరల. [1]అనుచు నా నృపనందనుల్ ముదమార సన్నుతిఁ జేయఁగా
మనములోఁ బరితోష మంది రమాహృదీశుఁడు భ క్తపా
లనకరుండు తదీయ దర్శనలాలసా త్మకు లా త్మలం
దనివి సాలక చూడ నా త్మపదంబు కేఁగె రయంబునఁ. 935

వ. త దనంతరంబ ప్రచేతసులు (భగవదాజ్ఞ శిరంబుల ధరియించి) సముద్రసలిల
నిర్గతు లై. 936

క. భూరిసమున్నతి నాక, ద్వారనిరోధంబు గాఁగఁ దగఁ బెరిఁగిన యా
భూరుహ సంపిహి తాఖిల, ధారుణి నీక్షించి రాజతనయులు వరుసఁ. 937

చ. ఘన కుపితాత్ము లై విలయకాల భయంకర హవ్యవాహలో
చనుగతి నుగ్రు లై ధరణిచక్రము ని ర్వసుధారుహంబుగా
ననయముఁ జేయఁబూనిన జనాధిపసూనుల [2]మోముఁదమ్ముల
న్ననలసమీరముల్ జననమంది కుజంబులఁ గాల్పఁజొచ్చినన్. 938

---

* తా. ప. ప్రతులలోలేదు 1. అనయమా (హ) 2. మోములందుఁ దామనల (హ)

క. నలినభవుఁ డా మహీజ, ప్రళయముఁ గని వచ్చి ధరణిపాలతనూజా
తుల మధురోక్తుల నుపశాం, తులఁ గావింపుచును [1]ప్రియము దూఁకొనఁ బలికెఁ.

వ. అట్లు పలికి వారల నుపశమిత క్రోధులం జేసిన యనంతరంబ. 940

సీ. అవశిష్ట ధరణీరుహాంబులు భయమంది తివిరి చతుర్ముఖాదేశమునను
మారిష యను సతీమణిఁ దమకూఁతును నా ప్రచేతసులకు నర్థి నిచ్చె
నా నరపాలక సూనులు దక్షున కరయంగ [1]ము న్నీశ్వరాపరాధ
మునఁ ప్రాప్త మైనట్టి జనపాలజన్మంబునకుఁ గారణం బైన నలిననయన

తే. నాదరంబునఁ గమలజు నాజ్ఞఁ జేసి
కడఁక దీపింప విధివ త్ప్రకారమునను
వరుస నందఱుఁ గూడి వివాహ మైరి
గడవవచ్చునె దైవసంకల్ప మెందు. 941

క. కలదే? జగతిం బదురు నృ, పులకును నొక భార్యయందుఁ బొసఁగునె? వినఁగా
నలినోదరు ఘన మాయా, కలి తాద్భుతములకు నతులు గావింపఁ దగుఁ. 942

వ. అంతం జాక్షుషమన్వంతరంబున దైవచోదితుండై యిష్టప్రజాసర్గంబుఁ గావింపుచుఁ బ్రసిద్ధుం డైన దక్షుండు పూర్వదేహంబు కాలవిద్రుతంబుగాఁ బ్రచేతసులకు న మ్మారిష యను భార్యయందు సంభవించి, నిజకాంతిం జేసి సమస్త తేజోధనుల తేజంబునుం బిహితంబుగాఁ జేయుచుఁ, గర్మదాక్ష్యంబున దక్షుం డను నామంబు వహించి, బ్రహ్మచేతం బ్రజాసర్గ రక్షయందు నియోగింపంబడి, మరీచ్యాదులం దత్త ద్వ్యాపారంబులందు నియోగించియుండె. అంత. 943

అధ్యాయము - ౧౧

సీ. ఒనరఁ బ్రచేతస్కు లుత్పన్నవిజ్ఞాను లగుచు వేగంబ నారాయణోక్తిఁ
దలఁపుచు నాత్మనందనుకడ నిజభార్య నిడి వనవాసు లై కడఁగి మున్ను
జాబలి యను [2]మునీశ్వరుఁడు సిద్ధుం డైన భూరి పశ్చిమవార్ధి తీరమునను
సర్వభూతాత్మవిజ్ఞానంబు గల యాత్మ ఘనవిమర్శ కృతసంకల్పు లై రి

తే. యంత నచటికి సమ్మోద మతిశయిల్ల
నర సురాసుర యక్ష కిన్నరవరేణ్య
మానితోన్నతి సంపూజ్యమానుఁ డైన
నారదుండు వివేకవిశారదుండు. 944

---

1. నయము(హ.తం.వా.) 2.మునునీశ్వరాపరాధ(క.బ.) 3.మునీశ్వరు నాశ్రమంబైన(చ.ట.త.డ.ద.బ.)

వ. చనుదెంచి నిర్జిత ప్రాణ మనో వా గ్దర్శనులు, జితాసనులు, శాంతులు, సమాన విగ్రహులు, నిర్మలం బై న పరబ్రహ్మంబునందు నియోజితం బై న యంతఃకరణులు నై న రాజనందనులకడ నిలిచిన. 945

క. చనుదెంచిన నారదమునిఁ, గనుఁగొని నృపసుతులు లేచి కౌతుక మొప్పఁ
వినమితు లై సముచితపూ, జనములఁ బరితుష్టుఁ జేసి సద్వినయమునఁ. 946

చ. అనఘ! మునీంద్రచంద్ర! భవ దాగమనంబు సమ స్తలోక శో
భన మగు నస్మదీయ మగు భాగ్యవశంబున నేఁడు విశ్వపా
వన! నినుఁ జూడగంటి మనివార్య భవ ద్భ్రమణంబు లోకలో
చనుగతిఁ బోలి ప్రాణులకు సర్వభయాపహరంబు గావునన్. 947

వ. అని మఱియు ని ట్లనిరి. 948

సీ. అనఘాత్మ! భగవంతు లై న కేశవ వామదేవులచే నుపదిష్ట మైన
యాత్మతత్త్వంబు గృహస్థుల మగు మాకు ననయంబు విస్మృతం బయ్యె నట్టి
[1]యీశతత్త్వార్థ ప్రకాశకంబును [2]భూరి ఘోర సంసారాబ్ధి తారకంబు
నై కర మొప్పారు నాత్మతత్త్వము నేఁడు చిరదయామతిఁ బ్రకాశింపఁ జేయు

తే. మని ప్రచేతస్కు లర్థిఁ బల్కినఁ జెలంగి
భగవ దాయత్తచిత్తుండు భవ్యగుణుఁడు
నఖిలలోకవిహారుండు నై నయట్టి
నారదుఁడు వల్కె నా రాకుమారులకును. 949

సీ. చర్చింప నరుల కే జన్మకర్మాయు ర్మనోవచనంబుల దేవదేవుఁ
డఖిల విశ్వాత్మకుం డై న గోవిందుండు విలసిల్లు భక్తి సేవింపఁబడును
నవియ పో జన్మకర్మాయు ర్మనోవచనములను ధరణి నెన్నంగఁదగును
వనరుహనాభ సేవారహితము లై న జననోపనయన దీక్షాకృతంబు

తే. లై న జన్మంబు లేల? దీర్ఘాయు వేల?
వేదచోదిత యగు కర్మవితతి యేల?
జప తప శ్రుత వాగ్విలాసంబు లేల?
మహిత నానావధాన సామర్థ్య మేల? 950

వ. మఱియు హరివిరహితం బై న యింద్రియపాటవంబు, నిపుణ యైన బుద్ధియుఁ, ప్రాణాయామాది యోగంబు, దేహాది వ్యతిరిక్తాత్మజ్ఞానంబు, సన్న్యాసాధ్య

---

1. కలిత (క. చ. బ.) 2. భూరి, తరళ సంసారాబ్ధి తారణంబు (క. చ. ట. జ. డ. బ.)

యనంబులును, దక్కిన వ్రతవై రాగ్యాది శ్రేయస్సాధనంబులునేల? సర్వేశ్వరుండు సమస్త శ్రేయ స్స్వరూపుండు, సమస్త శ్రేయోవధిభూతుండు, సర్వభూతా వాసుండు, సర్వభూతాత్మప్రదుండు, సర్వభూతప్రియుండు, సర్వవ్యాపకుండును గావున. 951

మ. కమలాధీశ్వరుఁ బూజసేయుట సమగ్రప్రీతిఁ బ్రాణోపహా
రము సర్వేంద్రియ తృప్తిహేతువును సర్వశ్రీజ మూలాభిషే
కము శాఖాభుజపుష్టిదంబు నగు రేఖఁ సర్వదేవార్హణ
క్రమ మై యొప్పు ధరావరేణ్య సుతులారా! బుద్ధి నూహించినన్. 952

వ. అదియునుం గాక. 953

క. పెనుపగు వర్షాకాలం, బున దిననాయకునివలనఁ బొడమిన సలిలం
బనయముఁ గ్రమ్మఁ గ్రీష్మం, బున సూర్యునియందుఁ జెందు పోలిక మఱీయుఁ. 954

క. ధరణిఁ జరాచరభూతము, లరయఁగ జనియించి యందె యణఁగిన పగిదిఁ
హరిచేఁ బుట్టిన విశ్వము, హరియందె లయంబు నొందు నది యెట్లన్నన్. 955

మ. [1]అరయ న్నభ్రతమఃప్రభల్ మును నభంబం దొప్పఁగాఁ దోఁచి క్ర
మ్మఱ వీక్షింపఁగ నందె లేనిగతి బ్రహ్మాండందు నీ శక్తులుఁ
బరికింపఁ ద్రిగుణప్రవాహమున నుత్పన్నంబు లై క్రమ్మఱఁ
విరతిం బొందుచునుండుఁ గావున హరిఁ విష్ణుఁ భజింపం దగుఁ. 956

వ. మఱియు సమస్త దేహులకు నాత్మయు *(నిమిత్తభూతుండు) నద్వితీయుండు, [2]శశ్వత్ప్రకాశుండు, ప్రధాన పురుషుండు, స్వతేజో విధ్వస్త గుణప్రవాహుండు, (మానస బుద్ధి సుఖేచ్ఛా ద్వేషాది వికల్పరహితుండు, నగుణుండు, దేహాత్మ భ్రమ నివృత్త్యుపలభ్యుండు, నాది మధ్యాంత రహితుండు, నిత్యానంద స్వరూ పుండు, సర్వజ్ఞుండుఁ) బరమేశ్వరుండు నైన నారాయణు నభేదబుద్ధిం జేసి, భజింపుండు. అతండు [3]సర్వభూత దయాళువులును,ఎంతమాత్రంబు సంభవించునంత మాత్రంబున సంతుష్టచిత్తులును, సర్వేంద్రి యోపశాంతులును నగు పురుషుల యెడ సంతుష్టుం డగు. అని వెండియు నిట్లనియె. 957

---

1. అరుదౌ నభ్రతమఃప్రభల్ (హ) * తా. ప. ప్రతులలో లేదు.

2. స్వయం ప్రకాశుండు (క. చ. ద. బ.) 3. సర్వభూతదయయు.....సంతుష్టుం డగుటయును సర్వేంద్రియోపశాంతియు నను నీ గుణంబులు గలిగిన యెడ (తం. వా.)

"దయయా సర్వభూతేషు సంతుష్ట్యా యేన కేన చిత్,
సర్వేంద్రియోపశాంత్యాచ తుష్యత్యాశు జనార్దనః"(31-20)

చ. చతురత నట్టి యీశ్వరుఁడు సజ్జనలోక నిరస్త సర్వకా
మిత విమలాంతరంగమున మిశ్రితభావనఁ జేసి సన్నిధా
పితుఁ డగుచుఁ దయాకర గభీరగుణంబులఁ జాల నొప్పి యా
శ్రితజన పారతంత్ర్యమును జేకొని పాయకయుండు నిచ్చలుఁ. 958

క. శ్రుత ధన [1]కుల ధర్మ సము, న్నత మదములఁ జేసి సజ్జనవ్రతతికి సం
తత మెగ్గొనరించుచును గు,మతు లర్థిం జేయుపూజ మతిఁ గొనఁ డెందుఁ. 959

వ. అది యెట్లనిన. 960

సీ. వలనొప్పఁ దను ననువర్తించు నిందిరా కామినీమణిఁ ద దాకాంతు లగుచు
ధృతి ననువర్తించు దేవేంద్రముఖ్యుల [2]నే ననువర్తింప కెప్పు డాత్మ
నిత్య స్వతంత్రుఁడు నిజభక్త వరదుఁడు [3]దీనవత్సలుఁడును నై నయట్టి
పురుషోత్తముని జగద్భరితు సర్వేశ్వరు నారాయణునిఁ జిదానంద మయుని

తే. నజితు నచ్యుతుఁ బుండరీకాయతాక్షుఁ
దవిలి సేవింప కుండునే ? ధరఁ గృతజ్ఞుఁ
డై న పురుషుండు సమ్మోదితాత్మఁ డగుచుఁ
జారుమతులార ! రాజకుమారులార ! 961

వ. *(ఆని మఱియు ని ట్లనియె. భవదీయ వంశధుర్యుండుఁ, జిత్రరథుండు నగు
ధ్రువుండుఁ సపత్నీ మాతృ వాగ్బాణ భిన్నహృదయుం డై పంచ వర్షార్భకుం
డగుచుఁ దపోవనంబున కరుగునపుడు మార్గంబున నాచే నుపదిష్టంబయిన క్రమం
బున భగవంతుం డగు పుండరీకాక్షు నారాధించి, యితరులచే నొందరాని సర్వో
త్తమం బగు పదంబు నొందె. కాన మీరును రుద్రోపదేశక్రమంబున సర్వభూతాంత
ర్యామి యగు నీశ్వరు భవచ్ఛేదనంబునకై భజియింపుఁడు.) 962

క. అని యి ట్విధమున నారద, ముని రాజకుమారులకును ముదము దలిర్పఁ
వనజోదరు సచ్చరితము, వినుపించి సరోజభవుని వీటికిఁ జనియెఁ. 963

వ. ఇట్లు నారదుండు చనిన యనంతరంబ. 964

చ. నరవరనందనుల్ గణఁక నారదవక్త్ర వినిర్గతంబు సుం
దరమును మంగళావహము ధన్యము లోక మలాపహంబు నై
పరఁగిన విష్ణు[4]కీర్తి విని పాయక తత్పదభక్తి చింతనా
నిరుపమభక్తిఁ జెంది హరినిత్యపదంబును బొంది రున్నతిఁ. 965

---

1. కర్మ (హ) 2. నై న నెవ్వఁడు చూడఁడాత్మ నట్టి (హ) 3. దీనవత్సల గుణాధీశు నజుని (హ)
* తా. ఏ. ప్రతులలో లేదు. 4. సద్యశము భక్తినుతుంచి ముకుంద చింతనా (హ)

వ. అని మైత్రేయుండు విదురున కి ట్లనియె. మహాత్మా! నీవు నన్నడిగిన ప్రచేతో నారద సంవాదరూపం బైన హరికీర్తనంబును, మను పుత్రుం డైన యుత్తాన పాదుని వంశప్రకారంబును జెప్పితి. అని వెండియు ని ట్లనియె. నారదు వలనం బ్రియవ్రతుం డాత్మవిజ్ఞానంబు నొంది, [1]మహీమండలంబు పరిపాలించి, యనంత రంబునఁ బుత్రులకు రాజ్యంబుఁ బంచియిచ్చి పరలోకగతుం డయ్యె. అనిన. 966

క. విని విదురుం డా [2]తాపసు, ఘనచరణము లాత్మమస్తకంబున మధుసూ
దను చరణాంభోరుహాములు, మనమునఁ దగఁ దాల్చి పలికె మైత్రేయునితోఁ. 967

క. మునినాథచంద్ర! కరుణా, వననిధి! నీచేత భక్తవత్సలుఁ డగు నా
వనజాతు తత్త్వ మెఱిఁగితి, నని త త్పదములకు వినతుఁ డై వినయమునఁ. 968

క. [3]ఆ మునిచే నామంత్రితుఁ,డై మనమున బంధుదర్శ నాకాంక్షితుఁ డై
ధీమహితుఁ డైన విదురుఁడు, సామజపురమునకుఁ జనియె సమ్మద మొప్పన్. 969

క. అని శుకుఁడు పరీక్షిత్తున, కనుకంపం జెప్పె నీ యుపాఖ్యానంబుఁ
వినువాఁ డైశ్వ ర్యాయు, ర్ధన కీర్తి స్వస్తిగతులఁ దగఁ బ్రాపించుఁ. 970

క. అని శుకయోగి పరీక్షి, జ్జనపాల సుధాపయోధిచంద్రున కర్థిఁ
వినిపించిన కథ మోదం, బున సూతుఁడు శౌనకాది మునులకుఁ జెప్పెఁ. 971

చ. సరస వచోవిలాస! గుణసాగర! సాగరమేఖలా మహీ
భరణ ధురంధరప్రకట భవ్య భుజా భుజగేంద్ర! రాజశే
ఖర! ఖర దూషణప్రముఖ గాఢ తమఃపటల ప్రచండ భా
స్కర! కఱకంఠకార్ముక విఖండన ఖేలన! భక్తపాలనా! 972

క. శరవిదళిత సారంగా!, సరస దయాపాంగ! భక్తజలధి తరంగా!
దురితధ్వాంత పతంగా!, వర జనకసుతాభిషంగ! వననిధి భంగా. 973

మాలిని. సురవినుత విహారీ! సుందరీ శంబరారీ!
సరసవినుత సూరీ! సర్వలోకోపకారీ!
నిరుపమగుణహారీ! నిర్మలానందకారీ!
గురు సమరవిహారీ! ఘోరదైత్య ప్రహారీ! 974

---

1. మహాభోగానంతరంబున (త) 2. మునివరు (హ)

3. మునిచే నామంత్రితుడై, తన మనముల బంధుజనుల దర్శన కాంక్షన్
ఘన మహితుడైన విదురుడు, చనియెన్ గరిపురమునకును సమ్మద మొప్పన్ (ట. జ. ద.)

గద్య. ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన శ్రీ మహాభాగవతం బను మహా పురాణంబునందు స్వాయంభువ మనువునకు నాకూతి, దేవహూతి, ప్రసూతి, ప్రియవ్ర తోత్తానపాదులు జన్మించుటయు, నందు నాకూతిని రుచిప్రజాపతికి నిచ్చుటయు, నా రుచిప్రజాపతికి నాకూతిదేవియందు శ్రీ విష్ణుమూ ర్తి యంశజుం డైన యజ్ఞుండును, లక్ష్మీకళాంశజ యగు దక్షిణ యను కన్యకయు నుద్భవించుటయు, మనుపుత్రి యైన దేవహూతినిఁ గర్దమున కిచ్చుటయుఁ, బ్రసూతిం దక్షప్రజాపతి కిచ్చుటయుఁ, బ్రసూతిదక్షులవలనం బ్రజాపరంపరలు గలుగుటయు, మఱియుం గర్దమప్రజాపతి పుత్రికాసముదయంబును క్షత్రబ్రహ్మ ర్షుల కిచ్చుటయుఁ, గర్దమపుత్రిక యైన కళవలన మరీచికిఁ గశ్యపుఁ డను పుత్తుండు, పూర్ణి మ యను కూఁతురుం బుట్టుటయుఁ, బూర్ణిమవలన గంగయు, విరజుం డనెడి కుమారుండును జన్మించుటయుఁ, గశ్యప ప్రజాపతివలన నైన ప్రజాపరంపరలచే ముల్లోకంబు లాపూర్ణంబు లగుటయు, నత్రిమహాముని తపంబును, నతనికి హరి హర బ్రహ్మలు ప్రత్యక్షం బగుటయు, ననసూయా పాతివ్రత్య మాహాత్మ్యంబు వలన ననసూయాత్రులకుం ద్రిమూర్తుల కళాంశజు లయిన చంద్ర దత్తాత్రేయ దుర్వాసుల జన్మంబును, దక్షాత్మజల జన్మంబును, భృగువు వలన ఖ్యాతి యను నంగనకు శ్రీ మహాలక్ష్మి జన్మించుటయు, భృగు పౌత్రుం డైన మార్కండేయు జన్మంబును, ధర్మునకు మూ ర్తివలన నరనారాయణులు సంభవించుటయు, సత్రయాగంబునందు దక్షుండు శివుని నిందించుటయును, దక్షాధ్వర ధ్వంసంబును, బ్రహ్మచేఁ బ్రార్థితుం డై శివుండు దక్షాదుల ననుగ్రహించుటయు దక్షాదికృత శ్రీహరి స్తవంబును, శ్రీహరి ప్రసన్నుండై దక్షుని యజ్ఞంబు సఫలంబుగా ననుగ్రహించుటయు, సతీదేవి హిమవంతునకు జనించి హరునకుం ప్రా ప్తించుటయు, నుత్తానపాదుని వృత్తాంతంబును, ధ్రువోపాఖ్యానంబును, ధ్రువుండు దండ్రిచేత నవమానితుం డై నారదోపదేశంబున మధువనంబునకుం జని తపంబు సేయుటయు, హరి ప్రసన్నుం డై యతని మనోరథంబు లిచ్చుటయు, నతండు మఱల పురంబునకు వచ్చుటయుఁ, గుబేరానుచరులై న యక్షులతోడి యుద్ధంబును, ధ్రువుండు యజ్ఞంబులు సేయుచు రాజ్యభోగంబులం దనిసి దనయు నుల్కలునిం బట్టంబు గట్టి హరి యనుగ్రహంబున ధ్రువపదమును నిలుచుటయు, నుల్కలుండును వత్స రుఁడను తన సుతునిఁ బట్టంబుగట్టి హరిం జేరుటయు, వత్సరుని వంశ పరం పరయు, నందు నంగుని సుతుం డయిన వేను కళేబరంబున లక్ష్మీనారాయణుల

యంశంబున నర్చియుఁ, బృథుండును జన్మించుటయుఁ, బృథుండు భూమిం గామ ధేనువురీతి నఖిల వస్తువులం బితుక నియమించి, సమస్థలిం జేసి, యింద్రుండు వశవర్తి యై యుండ బహుయజ్ఞంబులు సేసిన నతనికి హరి ప్రత్యక్షం బగుటయు, నధ్యాత్మ ప్రబోధంబును, నింద్రునివలనం బాషండసంభవంబును, నింద్రుని జయించిన విజితాశ్వుని, నతని తమ్ములను బృథివీపాలనంబునకు నిలిపి, పృథుండు నర్చియుం బరమపద ప్రాప్తు లగుటయు, విజితాశ్వునకు వసిష్ఠు శాపంబునఁ ద్రైతాగ్నులు తనయు లయి జనియించుటయుఁ, బృథుని పౌత్రుం డైన ప్రాచీనబర్హి రాజ్యంబును, నతని యజ్ఞంబు లసంఖ్యాతంబు లయిన నారదుండు మాన్పం దలంచి, పురంజను కథ నధ్యాత్మ ప్రపంచంబుగాఁ దెలుపుటయుఁ, బ్రాచీనబర్హి సుతు లయిన ప్రచేతసులు పదువురకు శ్రీ మహా దేవుఁడు ప్రత్యక్షం బయి హరిస్తవం బుపదేశించుటయు, వారి తపంబునకు మెచ్చి హరి ప్రత్యక్షం బగుటయు, వారికి మారిష వలన దక్షుండు పూర్వ కాలంబున శివవిద్వేష ప్రయుక్త శాపంబున జనియించుటయుఁ, బ్రచేతస్కులు ముక్తికిం జనుటయు, మొదలగు కథలం జెప్పిన విని మైత్రేయుని విడ్కొని విదురుండు హస్తిపురంబున కరుగుటయు, ననుకథలం గల చతుర్థస్కంధము సంపూర్ణము.

★

ఓమ్

శ్రీ మహా భాగవతము

పంచమస్కంధము

ప్రథమాశ్వాసము

[1]శ్రీకర! కరుణాసాగర! ప్రాకట లక్ష్మీకళత్ర! భవ్యచరిత్రా!
లోకాతీత గుణాశ్రయ! గోకులవిస్తార! నందగోపకుమారా! 1

అధ్యాయము – ౧

వ. *మహనీయగుణగరిష్ఠు లగు నమ్ముని శ్రేష్ఠులకు నిఖిల పురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండై న సూతుం డిట్లనియె. 2

క. †భూనాథుఁ డుత్తరాత్మజుఁ, డైన పరీక్షిన్న రేంద్రుఁ డభిమన్యుసుతుం
డానంద మొంది ఘన సు, జ్ఞానుం డగు శుకునిఁ గాంచి సరసతఁ బలికెన్. 3

వ. మునీంద్రా! పరమభాగవతుండు, నాత్మారాముండు నైన ప్రియవ్రతుండు గృహంబుననుండి యెట్లు రమించె? ‡కర్మబంధంబు లైన పరాభవంబులు గల గృహంబులయందు ముక్తసంబంధు లైన పురుషులకు సంతోషంబు గానేరదు. ఉత్తమశ్లోకుఁ డైన [2]పుండరీకాక్షుని పాదచ్ఛాయంజేసి నిర్వృతచిత్తు లైన మహాత్ములు కుటుంబంబునందు నిస్పృహత సేయుదురు. కాన ప్రియవ్రతునికి సంసారంబునందుఁ దగులంబు గలుగు టెట్లు? దారాగార సుతాదులందుఁ దగులంబు గలవానికి నెట్లు సిద్ధి గలుగు? శ్రీహరియం దస్ఖలితమతి యెట్లు గలుగు? ఈ సంశయంబుఁ దేటపఱుపుము. అని పరీక్షిన్న రేంద్రుం డడిగిన శుక యోగీంద్రుం డిట్లనియె. 4

---

1 శ్రీ సీతానయనోత్పల, శ్రీసతి సహజన్మ! త్రిదశసేవిత! ఆశా
వాస ప్రకాశ! జయ భా,సాసురపతి హరణ! రామచంద్ర నృపాలా! (క.చ.ట.జ.బ.)

* వ. సకల పురాణార్థజ్ఞాన విఖ్యాతుం డగు సూతుండు శౌనకాదుల కిట్లనియె. (చ.ట.జ.డ.బ.)

† ఈ పద్యము, క. చ. ట. జ. డ.లలో లేదు.

‡ "కర్మబంధః పరాభవః" (అని మూలము) "కర్మణాం బంధః పరాభవశ్చ" (వ్యాఖ్య–5–1)

2. పుండరీకాక్షుని కటాక్షవీక్షణామృత ధారంజేసి (క. చ.)

క. హరి చరణాంబుజ మకరం, ద రసావేశిత మనఃప్రధానుం డగు స
త్పురుషుఁ డొకవేళ విఘ్నముఁ, బొరసినఁ దన పూర్వమార్గమును విడువఁ డిలన్.

—: మనుపుత్రుం డగు ప్రియవ్రతుని యుపాఖ్యానము :—

క. ధరణీవల్లభ! వినుమా, నరవరుఁడు ప్రియవ్రతుండు నారదముని [1]స
చ్చరణోపసేవఁ జెందుచు, నరుదుగ [2]నధ్యాత్మ సుతయోగంబందున్. 6

సీ. దీక్షితుం డై ధరిత్రీపాలనముఁ దండ్రి పనిచిన సుజ్ఞానభంగ మనుచు
[3]నంగీకరింపకుం టంతయుఁ దెలిసి పద్మాసనుం డతనికి నతులరాజ్య
మందుల మిక్కిలి యాసక్తిఁ బుట్టింతు ననుచును దనచిత్తమందుఁ దలఁచి
తారకా ధ్యానసృత తారాధిపుని మాడ్కి శ్రుతులతోఁ గూడి [4]యచ్యుతవిభూతి

తే. హంసవాహనుఁ డగుచు నింద్రాదులెల్లఁ
గదిసి సేవింప బ్రహ్మలోకముననుండి
సన్మనీంద్రులు దన్నుఁ బ్రశంస సేయ
నల్లనల్లన యుడుపీథి నరుగుదెంచె. 7

వ. మఱియు నయ్యె మార్గములయందు సిద్ధ సాధ్య గంధర్వ చారణ గరుడ
కింపురుషులు స్తోత్రంబులు సేయుచుండ గంధమాదన ద్రోణులం బ్రకాశంబు
నొందింపుచుం జనుదెంచిన పద్మాసనునకు నారదుండు స్వాయంభువ ప్రియవ్రతు
లతోఁ గూడి ముకుళిత [5]కరకమలుం డై యెదురు చనుదెంచి, సంస్తుతులతోడం
బూజించిన విరించి సంతసించి ప్రియవ్రతునిం జూచి నవ్వుచు ని ట్లనియె. 8

క. హరి నాముఖమున నీకును, [6]గర మెఱిఁగింపంగఁ బనిచెఁ గావున నిదె సు
స్థిరమతి వినుమంతయు శ్రీ, హరి వాక్యముగా నెఱింగి యవనీనాథా! 9

ఆ. కోరి వేడ్క నేను నారదుండును నీవు
నందఱు మిదె యీశ్వరాజ్ఞఁ బూని
యుడుగ కెపుడు సేయుచున్న వారము గాన
నతనియాజ్ఞఁ దప్ప నలవిగాదు. 10

వ. మఱియు శ్రీహరియాజ్ఞం జీవుండు తపోవిద్యలను యోగవీర్య జ్ఞానార్థ ధర్మం
బులను దనచేత నొరులచేతను దప్పింప సమర్థుండు గాఁడు. ఉత్పత్తినాశంబులకు

---

1. శ్రీ; చరణాబ్జసేవ (ట. త. జ. డ.) 2. సుజ్ఞాన (క.బ) 3. అంగీకరింపమి నంతయు (హ. తం. వా.) 4. నంచిత (చ.బ.) 5. హస్తుండై (హ) 6. నెఱుగింప దలంచినాకు నెఱిగించెను (చ. ట. జ. డ. ద.)

శోకమోహ సుఖదుఃఖంబులకు నీశ్వరాధీనుండె కాని జీవుండు స్వతంత్రుండు గాఁడు. శ్రీహరి వాగ్రూపంబు లైన శ్రుతులందు గుణత్రయం బను రజ్జువున బంధింపంబడ్డ యస్మదాదులము ముకుఁద్రాటిచేఁ బశువు మనుష్యులకు వశం బైన చందంబున నీశ్వరాజ్ఞం బ్రవర్తింపుచుందుము. నరుండు సుఖదుఃఖాను భవంబులకు నీశ్వరాధీనుండు నేత్రంబులు గలవానిచేతఁ దివియంబడ్డ యంధుం డునుంబోలె నీశ్వరుం డిచ్చిన సుఖదుఃఖంబు లనుభవింపుచున్న వారము. స్వప్నంబునం గన్న పదార్థము మేలుకాంచి మిథ్యగాఁ దలంచినచందంబున మోక్షార్థి యైన సుజ్ఞానవంతుండు ప్రాప్త సుఖదుఃఖంబు లనుభవింపుచు దేహా రబ్ధ కర్మంబులం బాయ నొల్లఁడు. వనవాసి యైనను జితేంద్రియుండు గాకుండె నేనిఁ *(గామాదిసహితుం డగుటంజేసి) సంసారబంధంబులు గలుగు. గృహస్థా శ్రమంబందును జితేంద్రియుం డై యాత్మజ్ఞానంబు గల పురుషునకు మోక్షంబు సిద్ధించు. శత్రువుల గెలువ నిచ్ఛయించిన పురుషుండు, దుర్గం బాశ్రయించి శత్రువుల గెలిచినమాడ్కి, మోక్షార్థి యగు [1]పురుషుండు గృహాశ్రయుం డగుచు శ్రీహరి చరణారవిందంబు లను దుర్గం బాశ్రయించి యరిషడ్వర్గంబుల జయించు. నీవును ముక్తసంగుండ వై (యీశ్వరకల్పితంబు లగు) భోగంబుల ననుభవించి ముక్తిం జెందుము. అనిన బ్రియవ్రతుండు ద్రిభువనగురుం డై న బ్రహ్మవాక్యంబు నవనతమస్తకుం డై బహుమానపూర్వకంబుగ నంగీకరించె. అంత. 11

ఆ. సరసిజాసనుండు స్వాయంభువునిచేత
నధిక మైన పూజ లంది నార
దుండు నా ప్రియవ్రతుండును జూడంగఁ
జనియెఁ దనదు పూర్వసదనమునకు. 12

ఆ. సత్యసంధుఁ డై న స్వాయంభువుం డను
మనువు బ్రహ్మచేత మన్ననఁ దగ
నంది యంత నారదానుమతంబునఁ
దనదు సుతుని [2]రాజ్యమునను నిలిపె. 13

వ. ఇట్లు స్వాయంభువమనువు భూపరిపాలనంబునకుం బ్రియవ్రతునిఁ బట్టంబుగట్టి (విషమంబులగు) విషయంబులను విషసముద్రాశవలన విముక్తుం డై వనంబునకుం జనియె. అంత. 14

---

* తా. ప. ప్రతులలోలేదు 1. నీవును (హ) 2. రాజ్యమునకు (క. చ. ట. జ. డ. ద. బ.)

మ. ధరణీవల్లభుఁ డా ప్రియవ్రతుఁడు మోదం బందుచుఁ లీల నీ
శ్వరవాక్యంబునఁ గర్మతంత్రపరుఁ డై సంగంబులం బాపు శ్రీ
హరి పాదాంబుజచింతనం దగిలి నిత్యానందముం బొంది దు
ర్భర రాగాదులఁ బాఱఁదోలి ప్రజలం బాలించె నత్యున్నతిఁ. 15

వ. ఇట్లు ప్రియవ్రతుండు రాజ్యంబు సేయుచు విశ్వకర్మప్రజాపతి పుత్రిక యగు బర్హిష్మతి యనుదానిం బెండ్లిగాఁ బడసి, యా సతివలన శీల వృత్త గుణ రూప వైశ్యాదార్యంబులం దనకు సమాను లైన యాగ్నీధ్ర, ఇధ్మజిహ్వా, యజ్ఞ బాహు, మహావీర, హిరణ్యరేతో, ఘృతపృష్ఠ, సవన, మేధాతిథి, వీతిహోత్ర, కవు లను నామంబులు గల పుత్రదశకంబును, ఊర్జస్వతి యను నొక్క కన్యకను గాంచె. అందుఁ గవి మహావీర సవనులు మువ్వురు బాలకు లగుచునుండియు నూర్ధ్వ రేతస్కు లై బ్రహ్మవిద్యా నిష్ణాతు లై, (యుపశమశీలు రగుచుం) బారమ హంస్య యోగం బాశ్రయించి, సర్వజీవనికాయావాసుండును, (భవభీతజన శరణ్యుండును, సర్వాంతర్యామియు) భగవంతుండును నగు వాసుదేవుని చరణారవిం దావిరతస్మర ణావిగళిత పరమభక్తి యో గానుభావంబున విశోధి తాంతఃకరణు లగుచు నీశ్వరు తాదాత్మ్యంబుఁ బొందిరి. అంత. 16

సీ. వసుధేశ ! యా ప్రియవ్రతుఁ డొండుకాంతయం దధికుల మన్వంత రాధిపతుల
మఱియు నుత్తముఁడు తామసుఁడు రైవతుఁ డను సుతులను బుట్టించె
సుమహితులను
మున్ను జన్మించిన పుత్రులలో మువ్వు రవ్యయపదవికి నరుగుటయును
నపుడు ప్రియవ్రతుఁ డఖిల శత్రవకోటిఁ దన బాహుబలముచేతను జయించి

తే. యతఁడు బర్హిష్మతీకాంతయందుఁ బ్రీతి
గలిగి యౌవన లీలావికాస హాస
హేలనాదులఁ జిత్తంబు గీలుపఱిచి
గతవివేకుండు వోలె భోగములఁ బొందె. 17

వ. ఇట్లు ప్రియవ్రతుం డేకాదశార్బుద పరివత్సరంబులు రాజ్యంబుసేసి, యొక్క నాఁడు మేరునగ ప్రదక్షిణంబు సేయు సూర్యునకు నపరభాగంబునం బ్రవర్తించు నంధకారంబు నివర్తింపం బూని, భగవదుపాసనాజని తాతిపురుష ప్రభావుం డై సవిత్ర రథసదృశ వేగంబు గలిగి తేజోమయం బైన రథంబు నారోహణంబు సేసి, రాత్రుల నెల్ల దివంబు లొనర్తు నని సప్తవారంబులు ద్వితీయతపనుండు వోలె నరదంబు వఱపుటయు, నా రథనేమి మార్గంబులు సప్తసముద్రంబులును, నా మధ్య భూసంధులు సప్తద్వీపంబులు నయ్యె. అందు. 18

సీ. సరస జంబూ ప్లక్ష శాల్మలిద్వీప కుశ క్రౌంచ శాక పుష్కరము లనఁగ
నలరు నా ద్వీపంబులందు జంబూద్వీప మొనరంగ లక్షయోజనము లయ్యె
నట యుత్తరోత్త రాయతసంఖ్యఁదా ద్విగు ణితము లై యొండొంటి కతిశయిల్లు
ఈ రేడురస సురాజ్య క్షీర దధ్యుద కంబులు గలుగు సాగరము లేడు

తే. ద్వీప పరిమాణములు గల్గి వి స్తరిల్లు
సంధి సంధులఁ బరిఘల చందమునను
గ్రమము దప్పక యొండొంటిఁ గలయకుండు
సకలజీవుల కెల్ల నాశ్చర్యముగను. 19

వ. అట్టి ద్వీపంబులందుఁ బరిపాలనంబునకుం బ్రియవ్రతుం డాత్మభవులు నాత్మ సమాన శీలురు నైన యాగ్నీ ధ్రధ్మజిహ్వ యజ్ఞబాహు హిరణ్యరేతో ఘృతపృష్ఠ మేధాతిథి వీతిహోత్రుల *(నొక్కొకని నొక్కొక ద్వీపంబునకుం) బట్టంబుగట్టి యూర్జస్వతి యను కన్యకను భార్గవున కిచ్చిన, నా భార్గవునకు నూర్జస్వతియందు దేవయాని యను కన్యారత్నంబు జనించె. అట్లు బలపరాక్రమ వంతుం డైన ప్రియవ్రతుండు విరక్తుం డై యొక్కనాఁడు నిజగురు వగు నారదుని (చరణానుసే వానుపతిత రాజ్యాది ప్రపంచసంసర్గంబు) దలంచి దుఃఖించి. 20

సీ. అక్కట! యే నింద్రియములచేఁ గట్టుంగఁ బడియుండి యందులఁ బాయలేక
యజ్ఞానవిరచితం బగు విషయములను నంధకూపంబుల నణఁగియుండి
తరుణుల కే వినోదమృగంబు నై యుండి నది యెల్ల నే నొల్ల ననుచు రోసి
హరికృపచే నప్పు డందిన యాత్మవిద్యను గల్గి తనవెంట నరుగుదెంచు

తే. కొడుకులకు నెల్ల రాజ్యంబు గుదురుపఱిచి
తనదు పత్నుల దిగనాడి ధనమువిడిచి
హరివిహారంబు చిత్తంబునందు నిలిపి
పరఁగ నలన నారదపదవి కరిగె. 21

వ. ఇట్లు తన రథమార్గంబులు సప్తద్వీప సాగరంబులుగాఁ జేసి సూర్యునకుఁ బ్రతి సూర్యుం డై సరిద్గిరి వనాదులచే (భూతనిర్వృతి కొఱకుఁ బ్రతిద్వీపంబునకు నవధులఁ గల్పించి) ద్వీప వర్ష నిర్ణయంబులఁ బుట్టించి, పాతాళ భూ స్వర్గాది జాతంబు లగు సుఖంబులు నరకసమానంబులుగాఁ దలంచి, విరక్తిం బొంది నిరంతర భగవద్ధ్యాన విమలీకృతాశయుం డగుచు (హరిభక్త ప్రియుం డై న)

---

* తా. ప. ప్రతులలోఁ గానరాదు.

ప్రియవ్రతుని చరిత్రంబు లీశ్వరునకుఁదక్క నన్యుల కెఱుంగఁ దరంబుగాదు, అతని మహిమలు నేఁడునుం గొనియాడుదురు. అని మఱియును శుకుం డి ట్లనియె.

క. హరిసేవ నా ప్రియవ్రతుఁ, డరయఁగఁ గైవల్యపదవి నందుట యరుదే?
ధరఁ జండాలుం డైనను, హరినామ స్మరణఁ జెందు నవ్యయపదమున్. 23

వ. అని పలికి శుకుండు మఱియు ని ట్లనియె. 24

అధ్యాయము - ఎ

మ. జనకుం డిట్లు విరక్తుఁ డైనను ద దాజ్ఞంజేసి యాగ్నీధ్రుఁ డే
పున ధర్మప్రతిపాలనుం డగుచు [1]జంబూద్వీప మేలెం దగం
దన సత్పుత్రులమాడ్కి నెల్లప్రజలం దాత్పర్యచిత్తంబునన్
ఘనతం బ్రోచె ననేకకాల మిలఁ బ్రఖ్యాతంబుగా భూవరా! 25

వ. ఇ ట్లాగ్నీధ్రుండు రాజ్యంబు సేయుచు నొక్కనాఁడు పుత్రకాముం డై మంద రాద్రిసమీపంబున నఖిలోపచారంబుల నేకాగ్రచిత్తుం డై యర్చించినం గమల సంభవుండు సంతసిల్లి, తన సమ్ముఖంబున సంగీతంబుసేయు పూర్వచిత్తి యను నప్సరోంగనం బంపుటయు, నా యప్సరోంగన చనుదెంచి, రమణీయ వివిధ నిబిడ విటపి విటప సమాశ్లిష్ట సమీప సువర్ణలతి కారూఢ స్థలవిహంగమ మిథు నోచ్చార్యమాణ షడ్జాది స్వరంబులచే బోధ్యమాన సలిలకుక్కుట కారండవ బక కలహంసాది విచిత్రకూజిత సంకులంబు లైన నిర్మలోదక కమలాకరంబులు గల త దాశ్రమోపవనంబున విహరింపుచు, విలాస విభ్రమ గతివిశేషంబులం జలనంబు నొందు స్వర్ణ చరణాభరణ స్వనం బన్నరదేవకుమారుం డాలించి, యోగసమాధిం జేసి ముకుళితనేత్రుం డై యుండి, యల్లన కనువిచ్చి చూచి తన సమీపంబునఁ మధుకరాంగనయుఁ బోలె పుష్పాఘ్రాణంబు సేయుచు దేవమానవులకు మనో నయనాహ్లాదంబు పుట్టింపుచున్న గతి విహార వినయావలోకన సుస్వరావయవంబుల మన్మథశరపరంపరల నొందింపుచు ముఖకమల విగళి తామృతసమాన హాసభాష ణా మోద మదాంధంబు లైన మధుకరమిథునంబుల వంచించి, శీఘ్రగమనంబునం జలించు కుచ కచ మేఖలలు గల దేవిం గనుంగొని, చిత్తచలనంబు నొంది మన్మథపరవశుం డై జడునిచందంబున ని ట్లనియె. 26

క. సతి! నీ వెవ్వతె? వీ ప, ర్వతమున కేమైనఁ గోరి వచ్చిన వనదే
వతవో? శారదవో? రతి, పతి పంపిన మాయవో? తపస్సారమవో? 27

---

1. జంబూద్వీపము న్నేలుచున్ (చ. ట. త.) 1. అప్సరాంగనఁ (హ)

ఉ. అంగజుఁ డెక్కుడించిన శరాసనముల్ ధరియించి యంత నా
యంగజు వేఁట మానవ మృగావళిఁ జూచుచు నున్న దానవో?
రంగగు నీదు చెయ్యుల తెఱం గెఱుఁగంగ నిజంబుఁ బల్కుమా
యంగన! నిన్నుఁ గన్గొనిన [1]యంత ననంగుడు సందడించెడున్. 28

క. పొలుపగుచున్న విలాసం, బుల నంగజుబాణములను బోలెడి నీ చం
చల సత్కటాక్షవీక్షణ, ముల నెవ్వని నింతి! చిత్తమునఁ గలఁచెదవే? 29

చ. చెదరఁగ వేదముల్ చదువు శిష్యులపైఁ దగఁ బుష్పవృష్టి స
మ్మదమున నంతలోఁ గురియు మాడ్కిని మన్మథసామగానముల్
చదివెడు శిష్యులో? యనఁగ షట్పదపంక్తులు చేరి ప్రేమయఁగాఁ
బదపడి మీఁద రాలుఁ గచభారమునందుల జాఱు ప్రొవ్విరుల్. 30

క. [2]అందియల వెలయు రత్నము, లందంబుగ లలితపదములఁ సుభగము లై
యందంద ప్రేమయుచును నా, డెందంబునఁ దగిలి [3]సందడించెడిఁ దరుణీ! 31

క. పాయక కదంబపుష్ప, చ్ఛాయం గల వస్త్రకాంతిఁ [4]జననీ కంత
న్నా యెడ నితంబరోచులు, గాయుచు నెడతెగక తమిమి కప్పెడుఁ దన్వీ! 32

క. నిరతము నీ తనుమధ్యముఁ, గర మరుదుగ నరసి చూడఁ గానంబడ దీ
కరికుంభంబులఁ బోలెడి, గురుకుచముల నెట్లు నిలుపుకొంటి? లతాంగీ! 33

క. పొంకము లగు కుచములపైఁ గుంకుమపంకంబు సొంపు గొని వాసనలం
గొంకక వెదచల్లెడు నీ, బింకం బగు చన్నుదోయి పెంపో! సొంపో! 34

శా. ఏలోకంబుననుండి వచ్చితివి? నీ విచ్చోటికిన్ మమ్మన్ను నే
నేలోకంబునఁ జెప్పఁ జూప నెఱుఁగ నీ సుందరాకారము
నీ లాలిత్యము లీ వినోదములు నీ కెట్లొప్పునే? కామినీ!
భూలోకంబున కెట్లువచ్చితివి? నా పుణ్యం బగణ్యంబుగన్. 35

క. హాసావలోకనంబుల, భాసిల్లెడు నీ ముఖంబు పలుమఱు నిపుడే
యాసలు పుట్టింపఁగ నే, నాసగొనెద నిన్నుఁ జూచి యంబుజనేత్రీ! 36

---

1. యంతన సందడి వెట్టనంగుడున్ (హ)
2. అందియలు డిండిమంబుల, చందమునఁ బాదపంకజంబుల యందున్ (క. తం. వా.);
   అందియలు టిట్టిభంబులు (చ. ట. ద.)
3. సందడింపుచు నున్నన్ (హ) 4. చల్లెడుఁ గంచే (హ. తం. వా.) జనునీకంతన్ (జ)
5. పంకంబుఁ బూసికొని (హ)

ఆ. కందులేని యిందుకళ మించి నెమ్మోమ
కాంతియుక్త మగుచుఁ గానుపించెఁ
గాన విష్ణుకలయుఁ గాఁబోలు ననినా మ
నంబు నందుఁ దోఁచె నళిననేత్రి! 37

మ. పటు తాటంక రథాంగ యుగ్మమునకుం బల్మాఱు భీతిల్లుచుఁ
నటనం బందెడు గండుమీనములతో నాసన్న నీలాలకో
త్కట భృంగావళితో ద్విజావళి లసత్కాంతిఁ విడంబించు మా
ఱుట కాసారముఁ బోలి నెమ్మొగము దా రంజిల్లు నత్యున్నతిఁ. 38

చ. కరువలిఁ బాయు వస్త్రమును గట్ట నెఱుంగవు చూడ్కి దిక్కులం
బఱపుచుఁ జంచరీకముల భాతిఁ జెలంగెడు కంధరంబునం
బొరలెడు ముక్తకేశభరముం దుఱుమంగఁ దలంప విప్పు డి
ట్లురుదుగ రత్నకందుక విహారము సల్పెదు సంభ్రమంబునఁ. 39

వ. మఱియు నిట్లను. తపోధను లగువారల తపంబుల నీ రూపంబున [1]నపహరించిన దానవు. [2]ఈ చక్కఁదనం బేమి తపంబున సంపాదించితివి? నాతోడం గూడి తపంబు సేయుము. సంసారంబు వృద్ధిఁ బొందం జేయుము. పద్మాసనుండు నాకుం బ్రత్యక్షుం బై నిన్ను నిచ్చినవాఁడు గావున నిన్ను విడువం జాలను. నీ సఖీజనంబులును మా వాక్యంబులకు ననుకూలించుదురు గాక. నీవు చను చోటికి ననుందోడ్కొని చనుము. అని స్త్రీలకు ననుకూలంబులుగాఁ బలుక నేర్చిన యాగ్నీధ్రుండు పెక్కు భంగులం బలికిన, నా పూర్వచిత్తియు నతని (యను నయ వాక్యంబులకు సమ్మతించి, వీరశ్రేష్ఠుఁ డగు నా రాజవర్యుని బుద్ధి రూప శీలౌదార్య విద్యా వయ శ్శీలచేఁ బరాధీన చిత్త యగుచు, జంబూద్వీపాధిపతి యగు నా రాజశ్రేష్ఠునితోడం గూడి) శత సహస్ర సంవత్సరంబులు భూ స్వర్గ భోగంబు లనుభవించె. (అంత నాగ్నీధ్రుం డా) పూర్వ చిత్తివలన నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, భద్రాశ్వ, కేతుమాల సంజ్ఞలు గల కుమారులఁ బ్రతివత్సరంబు నొక్కొక్కనిగఁ దొమ్మండ్రం గాంచె. అంత నా పూర్వచిత్తి యా (యర్భకుల గృహంబున) విడిచి, యాగ్నీధ్రుం బాసి, బ్రహ్మలోకంబునకుం జనిన, నా యాగ్నీధ్ర పుత్రులు మాతృసామర్థ్యం బునఁ జేసి (స్వభావంబుననె) శరీర బలయుక్తు లగుచుఁ దండ్రిచేత ననుజ్ఞాతు లై తమ తమ నామంబులఁ బ్రసిద్ధంబు లైన జంబూద్వీపాది వర్షంబులఁ

---

1. అపహ్నవించినదానవు (హ. తం. వా.) 2. నీ (హ)

పాలింపుచుండిరి. అంత నాగ్నీధ్రుండు నా పూర్వచిత్తి వలనం గామోపభోగం బులం దృప్తిం బొందక, పూర్వచిత్తిం దలంపుచు వేదోక్తంబు లగు కర్మంబులఁ జేసి త త్సలోకం బగు బ్రహ్మలోకంబునకుం జనియె. ఇట్లు దండి పరలోకంబు నకుం జనిన, నాభి ప్రముఖు లగు నాగ్నీధ్రకుమారులు దొమ్మండ్రును మేరు దేవియుఁ, బ్రతిరూపయు, నుగ్రదంష్ట్రయు, లతయు, రమ్యయు, శ్యామయు, నారియు, భద్రయు, దేవవతియు ననుఁ నామంబులు గల మేరు పుత్రిక లగు తొమ్మండ్రు కన్యకల వివాహం బైరి. అంత. 40

అధ్యాయము - ౪

—: భగవంతుం డగు నారాయణుండు ఋషభావతార మెత్తుట :—

ఆ. నరవరేణ్యుఁ డైన నాభి సంతానార్థ
మంగనయును దాను యజ్ఞపురుషుఁ
డైన వాసుదేవు నతుల భక్తిశ్రద్ధ
లను జెలంగి పూజ లొనరఁ జేసి. 41

వ. మఱియుం బ్రవర్గ్య సంజ్ఞికంబు లగు కర్మంబుల శ్రద్ధా విశుద్ధ ద్రవ్య దేశ కాల మంత్ర ఋత్విగ్దక్షిణావిధాన యోగంబులం బరమేశ్వరుని మెప్పించిన, నెవ్వ నికిం బ్రసన్నుండు గాని పుండరీకాక్షుండు భక్తవత్సలుం డై సురుచిరావయవం బులు గలిగి, యజన శీలం బైన యాతని హృదయంబునందుఁ బాయని రూపంబు గలిగి, మనోనయ నానందక రావయవంబులు గల తన స్వరూపంబుఁ జూపం దలంచి. 42

సీ. అంత నావిష్కృత కాంత చతుర్భుజంబులును పీతాంబరంబును వెలుంగ
శ్రీవత్స కౌస్తుభ శ్రీరమా చిహ్నంబు లురమందు రమ్య మై యిరవు వడఁగ
శంఖ చక్ర గదాంబుజాత ఖడ్గాది దివ్యాయుధంబులు చేతులందు మెఱయ
[1]నతులిత నవరత్న హాటకాంకిత నూత్న ఘన కిరీటద్యుతుల్ గడలుకొనఁగఁ

తే. గర్ణకుండల కటిసూత్ర కనకరత్న
హార కేయూర వర నూపురాది భూష
ణముల భూషితుఁ డైన శ్రీనాయకుండు
దంపతుల కప్పు డెదురఁ బ్రత్యక్ష మయ్యె. 43

---

1. కమనీయ కాంచన ఘన కిరీట ప్రభల్ గండమండల దీప్తి గడలు కొనగ (చ)

తే. ఇట్లు ప్రత్యక్ష మగు [1]పరమేశ్వరునినిఁ
బెన్నిధానంబు గనుఁగొన్న వేదమాడ్కి
హర్షమున ఋత్విగాదికు లవనతాస్య
లగుచు నభినుతి చేసి రిట్లనుచు నపుడు. 44

క. పరిపూర్ణుఁడ వై యుండియు, మఱవక మా పూజలెల్ల మన్నింతువు నీ
చరణారవింద సేవయు, ధరఁ బెద్దలు చెప్పినటులు దగఁ జేసెద మౌ. 45

క. ఏ మిపుడు సేయు సంస్తుతి, నీమహిమ నెఱింగి కాదు నిరతముఁ బెద్దల్
దా మెది యుపదేశించిరొ, యా మతమునఁ బ్రస్తుతింతుమయ్య ! మహాత్మా !

వ. మఱియు నీవు సంసారాసక్తమతి గలిగినవారికి వశుండు గావు. ఈశ్వరుండవును, ప్రకృతిపురుషవ్యతిరిక్తుండవును, పరమపురుషుండవు నైన నిన్నుఁ బొందని ప్రపంచాంతర్గతంబు లైన నామరూపంబులు గల యస్మదాదులచేత నిరూపింప నశక్యం బగు. సర్వజీవులం జెందిన దురిత సంఘంబుల నిరసించు స్వభావంబుగల నీ యుత్తమ గుణంబులయందు నేకదేశంబ కాని, సర్వగుణ నిరూపణంబుఁ జేయ శక్యంబు గానేరదు. నీ భక్తులు మిక్కిలి భక్తిఁ జేసి స్తుతియించు గద్గదాక్షరము లను, సలిల శుద్ధ పల్లవ తులసీదళ దూర్వాంకురములను, సంపాదించిన పూజచే సంతసిల్లెడి నీకు బహువిధ ద్రవ్యసంపాదనంబు గలిగి, విభవయుక్తంబు లైన యశ్వమేధాదులును, దృప్తికరంబులు గానేరవు. స్వభావంబున సర్వకాలంబు నందును సాక్షాత్కరించి, యతిశయం బై వర్తింపుచు, నశేషపురుషార్థ స్వరూప మవు, పరమానంద రూపమవు నైనవాఁడ వగుటంజేసి యజ్ఞాదులయందు నీకుఁ దృప్తి లేక యున్న నస్మదాదుల కోరికల కుపకరించు కతంబున యజ్ఞాదుల నొనరింతుము. అని మఱియు నిట్లనిరి. 48

క. బాలిశుల మగుచు మిక్కిలి, మే లెఱుఁగని [2]మమ్ము నీదు మించిన దయచేఁ
బాలించి యిత్తు వెప్పుడు, చాలఁగ నిహపరములందు సకల సుఖంబుల్. 48

ఆ. ఇపుడు మేము నీకు [3]నిష్టంబు లగు పూజ
లాచరింపకున్న నైన నధిక
మైన నీ కృపాకటాక్ష వీక్షణములఁ
జక్కఁ జూచి తగఁ బ్రసన్నుఁ డగుచు. 49

---

1. పరమేశ్వరునకు (హ)
2. మాకునీదు (క. ట. డ. బ.) 3. నిష్టమై తగుపూజ (క. త. జ. డ.)

క. [1]వర మీయఁదలఁచి మమ్మ్మం, గరుణించితి గాక నిన్నుఁ గనుఁగొనుటకు నై
యరసి నుతింపఁగ మాకుం, దర మగునే? వరద! నీరద శ్యామాంగా! 50

వ. మఱియు నిస్సంగు లై నిశిత జ్ఞానంబునఁజేసి దోషరహితు లై భవత్స్వభావులు *(నాత్మారాములు నగు మునులకు) స్తుతియింపం దగిన గుణంబులు గలవాఁడ వగుచు నుండియుఁ బ్రసన్నుండవు *(స్ఖలన ఋత పతన జృంభణాది దురవస్థ లందును) జ్వర మరణాది దుర్దశలందును, గల్మషనాశకరంబు లైన భవ ద్దివ్య నామంబులు మా వచనగోచరంబు లగుం గాక. మఱియు నీ రాజరి నీతోడ సమానుం డైన కుమారునిం గోరి*(కామంబుల)స్వర్గాపవర్గంబుల నీనోపిన నినుం బూజించి, ధనకాముం డైనవాఁడు ధనవంతునిం జేరి తుషమాత్రం బడిగిన చందంబున, మోక్షనాథుండ వైన నీవలన సంతానంబు గోరుచున్నవాఁడు. జయింపరాని నీ మాయచేత నెవ్వండు మోహంబు నొంది *(విషయాసక్తుండు గాక) యుండు? *(అర్థకాములము, మదాంధులము నగు మేము) నిన్ను నావ్హానంబు సేసిన యపరాధంబు *(సర్వాత్మకుండ వగుటంజేసి సామ్యంబుచే) మన్నింపందగుదువు. మమ్ముందయఁజూడుము. అని ప్రణమిల్లిన దేవతాశ్రేష్ఠుండైన సర్వేశ్వరుండు వర్షాధిపతి యగు నాభిచేతను, ఋత్విక్కులచేతను వందితుం డై దయాకలితుం డగుచు నిట్లనియె. 51

క. †మునులార! వేదవాక్యము, లను బ్రస్తుతిఁ జేసి సర్వలక్షణముల నా
కెన యగు పుత్రుని నిమ్మని, వినఁ బలికితి రిపుడు మిగుల వేడుకతోడన్. 52

క. [1]నాకాది లోకములలో, నాకుఁ సరివచ్చునట్టి నందను నెటు నా
లోకింపలేరు గావున, నాకుఁ సరి నేనకా మనమున నెఱుఁగుడీ! 53

వ. అదియునుం గాక భూసురోత్తములు నా ముఖం బగుటంజేసి విప్రవాక్యంబు దప్పింపరాదు. మీరు నా యీడు కుమారు నడిగితిరి గావున నాభిపత్ని యగు మేరుదేవియందు నేనే పుత్రుండ నై జనియించెద. అని పలికి, పరమేశ్వరుం డాగ్నీధ్రీయపత్ని యగు మేరుదేవి చూచుచుండ నా [2]హోమకుండంబున నంతర్ధానంబు నొంది, యానాభిమీఁది దయంజేసి(దిగంబరులుఁదపస్వులు, జ్ఞానులు, నూర్ధ్వరేతసులు నగు నైష్ఠికులకు) యోగధర్మంబుల నెఱింగింపం దలంచి, పుండరీకాక్షుండు నాభిపత్ని యగు మేరుదేవి గర్భాగారంబునం బ్రవేశించె. అంత

---

† చ. బ. ప్రతులలో, 52-53 కందములకు బదులుగా ఈ క్రింది వచన మున్నది.

'మునీంద్రులార! నన్ను నుపనిషద్వాక్యంబుల ప్రస్తుతి స్తబకంబులం బూజించితిరి గావున ప్రసన్న మనోరథుండ నైతి. నా కెనయగు పురుషుండు లోకాలోకంబుల యందు లేడు.'

1. వరమొసగ దలచి మమ్ముల (చ. డ. బ.) * తా. ప. ప్రతులలోఁ గానరాదు.
2. లోకాలోకము లందును (క. ట. జ. డ. ద.) 3. యజ్ఞంబున (హ. తం. వా.)

అధ్యాయము - ౪

ఆ. మేరుదేవియందు మేరుధీరుం డగు
హరి సమస్త లక్షణాన్వితుండు
శమదమాది గుణవిశారదుం డుదయించె
సకలజనుల కపుడు సంతసముగ. 55

ఆ. [1]ధవళకాంతియుక్తుఁ దనరు దేహంబును
మహిత బలపరాక్రమంబు వీర్య
మును దలంచి చూచి జనకుండు పేరిడె
సుతుని ఋషభుఁ డనుచు సొంపుతోడ. 56

క. ధరణీసురులును మంత్రులుఁ
[2]బరివారము హితులుఁ బ్రజలు బాంధవులును సు
స్థిరమతి నా బాలకునిం
గర మనురాగమున రాజుఁ గాఁ జూచి రిలన్. 57

క. †పురుహూతుఁ డతనిమహిమలు, సరగున విని చిత్తమునకు సహ్యము గామిం
బరికించి ఋషభుఁ డేలెడి, ధరణి ననావృష్టి మిగుల దట్టము సేసెన్. 58

ఆ. అది యెఱింగి ఋషభుఁ డంతట యోగమా
యా బలంబుకతన నఖలరాజ్య
మందుఁ గురియఁ జేసె నత్యంత సంపూర్ణ
వృష్టి దినదినంబు వృద్ధిఁ బొంద. 59

వ. ఇట్లు ఋషభుండు పురందరుండు సేయు [3]దౌష్ట్యంబునకు నవ్వి, యజనాభం బను తనమండలంబు సుభిక్షంబుగాఁ జేసె. నాభియుం దన కోరిన చందంబునం బుత్రుండు జనియించి వృద్ధిఁ బొందుటకు సంతసిల్లి, తనచేత నంగీకరింపంబడు నరలోకధర్మంబు గల పుండరీకాక్షుని మాయావిలసిత మతిఁజేసి బాలకు నా

---

1. అతని కాంతియుక్తమైన దేహంబును (క. త. జ. డ. ద.) 2. పరిజనులును హితులు (ట. త. జ. డ. ద.)

† ఈ పద్యమునకు ముందున్న రెండు పద్యములకు బదులుగా 'చ' ప్రతిలో ఈక్రింది వచన మున్నది.

"ఆ దివ్యపురుషుని దివ్యప్రభావంబును బలపరాక్రమంబును జూచి జనకుండు ఋషభుం డను నామంబున బిలుచుచు నుర్వి సుపర్వులును పరిజనులును బాంధవ ప్రజంబును నతని రాజుగా జూచి సేవించుచుండన్"

3. దుర్బుద్ధికి (క. చ. ట. జ. డ. ద. బ.)

తండ్రి యని మోహంబున నుపలాలింపుచుం బ్రజానురాగంబున సర్వసమ్మతుం డైన పుత్రుని *(సమయసేతు రక్షణంబునకుఁ) బూజ్యం బైన రాజ్యంబునం దభిషిక్తుం జేసి, భూసురులకుఁ బ్రధాన వర్గంబునకు నప్పగించి, మేరుదేవిం గూడి నరనారాయణస్థానం బైన బదరికాశ్రమంబునకుం జని, యచ్చట మహాయోగ సమాధిచే * (నరనారాయణాఖ్యుండును, బురుషోత్తముండు నగు వాసుదేవు నారాధించి) క్షీణదేహుం డై యా నాభి హరితాదాత్మ్యంబు నొందె. అంత. 60

చ. సరసత నే నృపాలకుని జన్నమునందును భూసురోత్తముల్
సరసిజనాభునిం దగఁ బ్రసన్నతఁ [1]జేసిన నంత మెచ్చి యీ
శ్వరుఁడు దనంత గర్భమున వచ్చి తనూభవుఁ డై జనించె నా
నరపతి నాభికిఁ సరి యనం దగునే ? నరనాథ ! యన్యులఁ. 61

వ. అంత. 62

సీ. †భూవరుఁ డగు బుషభుఁడు దన రాజ్యంబు గర్మభూమిగ నాత్మఁ గాంచి జనుల
కందఱకును బ్రియం బగు నట్లు గర్మతంత్రంబెల్లఁ దెలుపంగఁ దలఁచి కర్మ
ములు సేయుటకు గురువులయొద్ద వేదంబు చదివి వారల యనుజ్ఞను వహించి
శతమన్యుఁ డిచ్చిన సతి జయంతీకన్యఁ బరిణయం బై యట్టి పడఁతివలన

తే. భరతుఁ డాదిగ సుతుల నూర్వ్వరను గాంచె
నట్టి భరతుని [2]పేరను నవనితలము
పురవ రాశ్రమ గిరి [3]తరు పూర్ణ మగుచు
నమరి భారతవర్ష నామమున మించె. 63

వ. ఆ మహాభారతవర్షంబునందు తమ తమ పేరం గల భూములకుం గుశావర్త, ఇలావర్త, బ్రహ్మావర్త, ఆర్యావర్త, మలయకేతు, భద్రసేన, ఇంద్రస్పృక్, విదర్భ, [4]కీకటు లను తొమ్మండ్రు కుమారులను నవతి పుత్రులకుఁ [5]బ్రధానులనుగాఁ జేసె. అంతఁ గవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, ఆవిర్హోత్ర,

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. పెట్టిన (హ. తం. వా.)

† బుషభుండును తన రాజ్యంబు కర్మభూమిగా నాత్మనెరింగి జనంబు లందరికిని ప్రియంబగునట్లుగా కర్మతంత్రంబు దెలుపం దలంచి కర్మంబు సేయుచు గురువుల వలన వేదాభ్యాసంబు చేసి వారల యనుమతి వడసి శతమన్యుం డిచ్చిన సతిం జయంతి కన్యను పరిణయం బై య ప్పుణతి వలన భరతుం డాదిగా నూర్గురు కుమారులం గాంచె. కులగిరి కుంజంబులం గల ధరణి యా భరతునిపేర భారతవర్షం బని ప్రసిద్ధం బయ్యె. (చ. బ.)

2. పేరధరాతలంబు (హ) 3, కుంజపుంజములను(క.త.డ.ద.బ.) 4. కీకటులను రాజులంగా జేసి (ద) 5. రాజులనుగాజేసె (క. చ. ట. త. జ. డ. బ)

ద్రమీఢ, చమస, కరభాజను లనువారు తొమ్మండ్రును [1]భాగవతధర్మ ప్రకాశకు లైరి. *(భగవ న్మహిమోపబృంహితంబు లగు) వారల చరిత్రంబులు ముందఱ నెఱింగించెద. తక్కిన [2]యెనుబది యొక్క కుమారులును (బ్రాతాదేశకరులు, నతి వినీతులు) మహాశ్రోత్రియులు, యజ్ఞశీలురుఁ, గర్మనిష్ఠులు నైన బ్రాహ్మణోత్తము లైరి. ఋషభుండు స్వతంత్రుం డై సంసారధర్మంబులం బొరయక కేవలానం దాను భవుం డైన *(యీశ్వరుం డై యుండియుఁ) బ్రాకృతుండు వోలెఁ గాలానుగతంబు లగు ధర్మంబుల నాచరింపుచు*(ధర్మప్రవర్తకులకు సముండును) నుపశాంతుండును, మైత్రుండును, గారుణికుండు నై ధర్మార్థ యశః ప్రజా నందామృ తావరోధంబుచే గృహస్థాశ్రమంబులం బ్రజల నియమింపుచుఁ) గొంత కాలంబు నీతిమార్గంబు దప్పక ప్రజాపాలనంబు సేయుచు (వేదరహస్యంబు లగు సకలధర్మంబులు స్వవిదితంబు లైనను) బ్రాహ్మణోపదేశ (పూర్వకంబున ద్రవ్య దేశ కాల వయ శ్శ్రద్ధర్త్విగ్వి ధోద్దేశోపచితంబులుగ) నొక్కొక్క క్రతువును శతవారంబు యథావిధిగఁ జేసి సుఖంబుండె. అంత.) 64

క. జనవర! ఋషభుని రాజ్యం, బున నైహికఫలము గోరు పురుషుని నొకనిం
గనుఁగొన నెఱుంగ మెన్నఁడు, నినతేజుం డతనిమహిమ లేమని చెప్పఁ! 65

—: ఋషభుండు పుత్రులకు నీతి నుపదేశించుట :—

సీ. ఆ ఋషభుండు రాజ్యంబు సేయుచునుండి యంతట నొక్కనాఁ డాత్మయందుఁ
దలపోసి భూలోకఫల మపేక్షింపక మోహంబు దిగనాడి పుత్రులకును
దన రాజ్యమెల్ల నప్పనచేసి వెనువెంటఁ గొడుకులు మంత్రులుఁ గొలిచి రాఁగ
నల్లన యరిగి బ్రహ్మావర్తదేశంబు నందుల నపుడు మహాత్ము లైన

తే. యట్టి మునిజన సమ్ముఖంబందుఁ జేరి
తనదు పుత్రుల నందఱ దాయఁ బిలిచి
పరమపుణ్యుండు ఋషభుండు [3]ప్రణయ మొప్ప
హర్ష మందుచు నప్పు డి ట్లనుచుఁ బలికె. 66

అధ్యాయము - ౫

ఆ. తనయులార! వినుఁడు ధరలోనఁ బుట్టిన
పురుషులకును శునకములకు లేని
కష్టములను దెచ్చుఁ గానఁ గామంబుల
వలన బుద్ధి సేయవలదు మీరు. 67

---

1. భగవద్దర్శనంబు గలవారైరి (క. చ. ట. త. జ. డ. బ.) 2. యెనబదిద్ద(హ.తం.వా.)
* తా. ప. ప్రతులలో లేదు. 3. భక్తితోడ (హ)

చ. నరులకు నే తపంబున ననంతసుఖంబులు [1]గల్గుచుండు శ్రీ
కరమతి నా తపంబుఁ దగఁ గైకొని చేసిన బ్రహ్మసౌఖ్యముం
[2]దిరముగఁ గల్గు వృద్ధులను దీనులఁ బ్రోవుఁడు దుష్టవర్తనఁ
జరుగుచునుండు కామికుల సంగతిఁ బోకుఁడు మీఁద మేలగున్. 68

వ. *(మఱియు నంగనాసక్తు లగు కాముకుల సంగంబు నిరయరూపం బైన సంసారం బగు. మహత్సంగంబు మోక్షద్వారం బగు.) శత్రు మిత్ర వివేకంబు లేక సమచిత్తులు, శాంతులు (క్రోధరహితులు) సకలభూత దయాపరులు (సాధులు) నగు వారలు మహాత్ము లనం దగుదురు. అట్టి మహాత్ములు నాయందలి స్నేహంబె ప్రయోజనంబుగాఁ గల్గియుండుటంజేసి (విషయవార్తా ప్రవృత్తు లగు కుజనులందుఁ) దమ దేహ గృహ మిత్ర దారాత్మజాదులందుఁ బ్రీతి లేక యుండుదురు. విషయాసక్తుం డైన వాఁడు వ్యర్థకర్మంబులం జేయు. అట్టి దుష్కృతకర్మంబులం జేయువాఁ డెప్పుడును బాపకర్మం డగుచుం (గ్లేశదం బగు దేహంబు నొందుచుండుం గావునం) బాపమూలంబు లైన కామంబులు గోరకుఁడు. ఈ జ్ఞానం బెంతకాలంబు లేకయుండు నంతకాలం బాత్మతత్త్వం బెఱుంగంబడదు. ఆ తత్త్వం బెఱుంగకుండుటంజేసి దేహికి దుఃఖం బధికం బై యుండు. లింగదేహం బెంతతడ వుండు [3]నంతతడవు మనంబుఁ గర్మవశం బై జ్ఞానవంతంబు గాక యవిద్యం బాయకుండు. శరీరంబు కర్మమూలం బగుటవలనఁ గర్మంబులు సేయఁజనదు. (వాసుదేవుం డగు) నాయందుఁ బ్రీతి యెంతతడవు లేకయుండు నంతతడవు దేహధర్మంబులు బాధించు. విద్వాంసుం డైనను దేహేంద్రియాదులయందుఁ బ్రీతిసేసిన (మిథునీభావ సుఖప్రధానం బగు) గృహస్థాశ్రమంబు నంగీకరించి (స్వరూపస్మృతి శూన్యుం డై మూఢుం డగుచు) నందు సంసారతాపంబులఁ బొందు. [4]పురుషుండు స్త్రీతోడం గూడి యేకీభావంబు నొందుట (వారలకు హృదయగ్రంథి యై యుండు.) అందు జనునకు గృహ క్షేత్ర సుతాప్త విత్తంబులందు "నేను నాయది"యనియెడి మోహంబు గలుగు. అట్టి స్త్రీపురుష మిథునీభావంబుచే సంతానంబు గలుగు. ఆ సంతానకారణంబున గృహ క్షేత్ర విత్తాదులు సంపాదింపంబడు. అందు మోహం బధికం బగుటంజేసి మోక్షమార్గంబు దవ్వగు. ఇట్లు సంసారంబునం దుండియు మనంబున నెప్పుడు ముక్తిచింతం జేయు నప్పుడు సంసారంబును బాయు. పరమగురుఁడ నైన

---

1. బొందనౌను (హ) * తా. ప. ప్రతులలో లేదు. 2. దిరముగబొందు (క.ట.త.జ.డ.ద.బ.)
3. నంత తడవు కర్మంబులం బాయకుండు (క. చ. ట. డ.) 4. పురుషుండు యోషిజ్జన సంగమంబున నేకీభావంబు నొంది (త. డ. బ.)

నాయందు భక్తి సేయుటయు, విగత తృష్ణయు, [1]ద్వంద్వతితిక్షయు (సర్వ లోకంబులందుల) [2]జంతువ్యస నావగతియు, [3]నీశ్వరవిషయక జ్ఞానాపేక్షయుఁ (దపంబు) విగతేచ్ఛయు, మత్కృత కర్మంబులు, మత్కథలు వినుటయు, నన్నె దైవంబుగా నెఱుంగుటయు, నస్మ ద్గుణకీర్తనంబు, [4]నిర్వైర సామ్యోప శమంబులు, దేహ గేహాంబులందు నాత్మబుద్ధి జిహాసయు (నధ్యాత్మయోగంబు) నేకాంతసేవయుఁ(బ్రాణేంద్రియాత్మల గెలుచుటయుఁ, గర్తవ్యాపరిత్యాగంబు) సచ్ఛ్రద్ధయు, బ్రహ్మచర్యంబుఁ (గర్తవ్యకృత్యంబులందుల) నప్రమత్తుం డగు టయు, వాఙ్నియమనంబు సర్వంబు నన్నకాఁ దలంచుటయు, జ్ఞానంబు, విజ్ఞాన విజృంభితం బైన యోగంబు (ధృత్యుద్యమంబు) సాత్త్వికంబు నాదిగాఁ గల తెఱంగులచేత లింగదేహంబు జయించి దేహి కుశలుం డగుచు నుండవలయు.

ఆ. అరయఁ గర్మరూప మగు నవిద్యాజన్మ
[5]మైన హృదయబంధనాది లతల
నప్రమత్త యోగమను మహోచురికచేఁ
దెంపవలయు నంతఁ దెంపుతోడ. 70

ఆ. ఒనర నిట్టి యోగయుక్తుండు గురుఁ డైన
భూపుఁ డైన శిష్య పుత్రవరుల
యోగమతులఁ జేయ నొప్పు గావలయును
గర్మపరులఁ జేయఁ గాదు కాదు. 71

సీ. జనులెల్ల నర్థవాంఛలఁ జేసి యత్యంత మూఢు లై యైహికంబులు మనంబు
లందులఁ గోరుదు రల్పసౌఖ్యములకు ననోన్యవైరంబు లంది దుఃఖ
ములఁ బొందుదురు గాన నలయక గురుఁ డైన వాఁడు మాయామోహ
వశుఁడు నెంత
జడుఁడును నైనట్టి జంతువునందును దయ గల్గి మిక్కిలి ధర్మబుద్ధిఁ

ఆ. గన్ను లున్నవాఁడు గానని వానికిఁ
దెరువుఁ జూపినట్లు దెలియఁ బలికి
యతుల మగుచు దివ్యమైన యా మోక్షమా
ర్గంబుఁ జూపవలయు రమణతోడ. 72

---

1. ద్వంద్వ నివృత్తి (చ. త. జ. డ. ద. బ.) 2. జంతువ్యసన నిరీక్షణంబును (క.త.డ.ద.బ.)
3. ఈశ్వరదర్శనాపేక్షయు (క.చ.ట.త.డ.ద.బ.) 4. నిరహంకారంబును,కర్మత్యాగేచ్ఛయును(క.బ)
5. బంధనాదికంబు (క. చ. త. జ. ద. బ.)

వ. మఱియుఁ బితృ గురు (జననీ) బంధు (పతి) దైవంబులలో నెవ్వఁ డైనను (సంసారరూప) మృత్యురహితం బైన మోక్షమార్గంబుఁ జూపకుండె నేని వా రెవ్వరును హితులు గానేరరు. నాదు శరీరంబు దుర్విభావ్యంబును, నాదుమనంబు (సత్త్వయుక్తంబును, ధర్మసమేతంబును) పాపరహితంబు నగుటంజేసి పెద్దలు నన్ను బుషభుం డంత్రు. కావున (శుద్ధసత్త్వమయం బైన) [1]నా శరీరంబునం బుట్టిన మీర లందఱును సోదరుండు, మహాత్ముండు, నగ్రజుండు నైన భరతు నన్నెకాఁ జూచి (యక్లిష్టబుద్ధిచే భజింపుఁడు. అదియ నాకు శుశ్రూషణంబు.) ప్రజాపాలనంబు సేయుట మీకును బదమధర్మంబు. అని మఱియు ని ట్లనియె 73

సీ. భూతజాలములందు భూజముల్ వర్ష్యముల్ భూరుహంబులకంటె భోగికులము
భోగిసంతతికన్న బోధనిష్ఠులు బోధ మాన్యులకన్నను మనుజవరులు
వీరికన్నను సిద్ధ విబుధ గంధర్వులు [2]వారికన్న నసురుల్ వారికన్న
నింద్రాదిదేవత లిందఱికన్నను దక్షాది సన్మునుల్ దలఁప నెక్కు

తే. డంతకన్నను భర్గుఁ డా యభవుకన్నఁ
గమలభవుఁ డెక్కుఁ డాతనికంటె విష్ణుఁ
డధికుఁ డాతఁడు విప్రుల నాదరించుఁ
గాన విప్రుఁడు దైవంబు మానవులకు. 74

క. భూసురులకు సరి దైవం, బీ సచరాచరమునందు నెఱుఁగను నాకుఁ
భూసురులు గుడుచు నప్పటి, యా సంతోషంబు [3]దోఁచ దగ్నులయందుఁ. 75

సీ. ‡మంగళం బైన బ్రహ్మస్వరూపంబును వేదరూపంబున నాదిరూప
మగుచున్న నాదు దేహము బ్రాహ్మణోత్తముల్ ధరియింతు రెప్పుడు [4]తత్త్వబుద్ధి
శమదమానుగ్రహ సత్య తప స్థితిఘనులు గల్గు విప్రుండు సద్గురుండు
గాన మిక్కిలి భక్తిగల్గి యకించను లైన భూసురుల దేహములవలన

---

1. నాశరీరంబున నుద్భవించిన మీరు మీకగ్రజుం డైన (చ. త.) 2. వారికన్నను సురల్ (తం. వా.); "దేవాసురేభ్యో" మూలము 5-22. "దేవాఃఅసురేభ్యఃఁ" (వ్యాఖ్య).

3. లేదు యజ్ఞములందున్ (క. చ. ట. త.)

‡ మంగళ స్వరూపులైన బ్రాహ్మణులు నా రూపంబు గావున శమదమానుగ్రహంబు గలవారు మేదినీ సురులు గావున ఇట్లు సచ్చరిత్రులై యకించనులైన భూమి సుపర్వులు నారూపం బుగా నెఱింగి యేకాగ్రచిత్తులై పూజించు వారలు నాకును ప్రియంబు చేసిన వారగుదురు. ఈ విధంబెరింగినవారు మోక్షమార్గంబున జెందుదురు (చ-బ)

4. తాత్పర్యబుద్ధి (క. జ. డ. ద. బ.)

తే. నందుచుండును నాదుదేహంబు గాఁగ
[1]నెఱిఁగి వరులగు విప్రుల నెల్ల భక్తిఁ
బూజ సేయుటయే నన్నుఁ బూజసేయు
టనుచు వినుపించి మఱియు ని ట్లనుచుఁ బలికె. 76

క. ఈ తెఱఁగుఁ దెలిసి భూసుర, జాతిం బూజించునట్టి జనుఁడును మాయా
తీతుం డై నిక్కంబుగ, భూతలమున మోక్షమార్గమును బొడగాంచున్. 77

వ. ఇట్లు సదాచారులగు కుమారులకు [2]లోకానుశాసనార్థం బాచారంబు లుపదేశించి, మహాత్ముండుఁ, బరమసుహృత్తును నగు భగవంతుండు ఋషభావదేశంబునం గర్మ త్యాగంబుఁ జేసి *(యుపశమశీలు రగు) మునులకు భక్తి జ్ఞాన వైరాగ్య లక్ష ణంబులు గల పారమహంస్య ధర్మం బుపదేశింపం గలవాఁ డగుచుఁ, బుత్రశతంబు నం దగ్రజుండుఁ (బరమభాగవతుండు, భగవ జ్జనపరాయణుండు) నగు భరతుం (ధరణీపాలనంబునకుఁ) బట్టంబు గట్టి, తాను (గృహమందె) దేహమా త్రావలంబ నంబుఁ జేసి, దిగంబరుం డై యున్మత్తాకారుం డగుచుం (బ్రకీర్ణ కేశుం డై) యగ్నుల నాత్మారోపణంబు సేసి, బ్రహ్మావర్తదేశంబును బాసి, జడాంధ బధిర మూక పిశాచోన్మాదులుంబోలె నవధూతవేషంబునొంది, జనులకు మాఱువలుకక, మౌనవ్రతంబునం బుర గ్రామా (కర) జనప దారామ శిబిర వ్రజ ఘోష సార్థ గిరి వనాశ్రమాదులయందు వెంటం జనుదెంచు దుర్జన (తర్జన) తాడనావమాన మేహన నిష్ఠీవన పాషాణ శకృ ద్రజఃప్రక్షేపణ పూతివాత దురుక్తులం బరి భూతుం డై నను గడనం బెట్టక, వనమదేభంబు మక్షికాది కృ తోపద్రవంబును బోలెఁ గైకొనక, దేహాభిమానంబునం జిత్తచలనంబు నొందక, యేకాకి యై చరియింపుచుండ. నతిసుకుమారంబు లగు కరచర ణోరస్థ్సలంబులు (విపులంబు లగు బాహ్వంస కంధర వదనా ద్యవయవ విన్యాసంబులుం గలిగి, ప్రకృతి సుందరం బగుచు స్వతస్సిద్ధ దరహాస రుచిర ముఖారవిందం బై, నవ నళిన దళం బులఁ బోలి శిశిర కనీనికలఁ జెలువొంది, యరుణాయతంబు లగు నయనంబులచేఁ గొప్పి, యన్యూనాధికంబు లగు కపోల) కర్ణ కంధర నాసాదండంబులచేఁ దేజ రిల్లుచు, విగూఢ స్మితవదన విభ్రమంబులఁ బ్రకాశించు తన దివ్యమంగళ విగ్ర హంబుచేఁ బురసుందరుల మనంబుల నతిమోహంబు గలుగఁజేయుచు. 78

ఆ. ధూళిచేత మిగుల ధూసరితంబు నై
జడలుగట్టి కడు పిఱంగవర్ణ
ము నగు కేళపాశమును వెలిఁగింపుచు
నితరు లెవరుఁ దన్ను నెఱుఁగకుండ. 79

---

1. నెరిగి ఏకాంతులై విప్రవరుల నెల్ల (క. జ. డ.) 2. లోకప్రదర్శనార్థంబు (క.ట.త.డ.ద.)
* తా. ప. ప్రతులలో లేదు.

క. అవధూతవేషమున ని, ట్లవనిఁ మలినంబు లైన యవయవములతోఁ
దవిలి జరింపుచు [1]నుండెను, భువి భూతాక్రాంతుఁ డైన పురుషుని మాడ్కిఁ.80

ఆ. జనుల కిట్లు యోగసంచార మెల్ల వి
రుద్ధ మనుచు నాత్మ[2]బుద్ధిఁ జూచి
యజగరంబు మాడ్కి నవనిపై నుండె బీ
భత్సకర్మమునకుఁ బాలుపడుచు. 81

వ. ఇట్లు బీభత్సరూపంబున వసుంధరం బండియుండి, యన్నంబు భుజియింపుచు, నీరు
ద్రావుచు, మూత్రపురీషంబులు విడుచుచు, నవి శరీరంబున నంటం బొరలుచుండె. మఱియుఁ ద త్పురీష సౌగంధ్య యుక్తం బగు వాయువు దశదిశల దశయోజన పర్యంతంబు పరిమళింపం జేయుచుండ, గో మృగ కాక చర్యలం జరియింపుచు, భగవ దంశం బైన ఋషభుండు మహానందంబు ననుభవింపుచుం, దనయందు సర్వభూతాంతర్యామి యగు వాసుదేవునిం బ్రత్యక్షుంబుగాఁ గనుంగొనుచు, సిద్ధిం బొందిన వైహాయస మనోజవ పరకాయప్రవే శాంతర్ధాన దూరగ్రహణ శ్రవణాది యోగసిద్ధులు దమంత వచ్చినం గైకొనక యుండె. అని పలికిన శుకయోగీంద్రు నకుఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 82

అధ్యాయము - ౬

క. మునివర యోగజ్ఞానం, బునఁ జెఱుపంబడ్డ కర్మములు గల పెద్దల్
గనియుండెడి యైశ్వర్యం, బును ఋషభుం డెలమిఁగి యేల పొందకయుండెఁ ?

వ. అనిన శుకుం డిట్లనియె. 84

మ. ధరణీవల్లభ ! నీదు వాక్యములు దథ్యం బింతయుం దప్ప దె
ట్లరయఁ వన్యమృగంబు పట్టువడి తా నావేళ నా లుబ్ధకుఁ
ధర వంచించిన మాడ్కి నింద్రియములం దండించి చిత్తంబు ని
ర్భర కామాదుల కాసయిచ్చుఁ గడు సంరంభంబుతోఁ బ్రగ్మ్మఅఁ. 85

క. చిరకాలతపము నైనను, హరియింపఁగ నోపుఁ జిత్త మని పెద్దలు న
మ్మరు జారులకును జారిణి, కరణిని [3]నడరించు మనసు కామాదులకుఁ. 86

క. కామక్రోధాదులు దా, భూమీశ్వర ! కర్మబంధములు మఱియును జే
తోమూలము లగుటను దా, రీ మహిలో మనసు నమ్మ రెప్పుడు పెద్దల్. 87

---

1. నుండును (హ) 2. రోసిజూచి (క-బ) 3. మరలించు (బ)

సీ. అది గాన నెన్నఁడు నై శ్వర్యములను జేపట్టఁ జూడఁడు [1]లోకపాలముఖ్యు
లై నవారలచేత నభినందనము లొంది వెలయంగ నవధూత వేష భాష
ణంబుల నెఱిఁగికొనఁగరాని భగవ త్స్వరూపంబు గలిగి [2]యా రూపమందుఁ
బరమయోగ ధ్యాన పరులకు నెల్ల దేహత్యాగ సమయంబు నంతలోనఁ

తే. [3]జూపుచుండియు దేహంబుఁ [4]బాప నిచ్ఛ
యించె నచ్చట దివ్యయోగీంద్రుఁ డాద్యుఁ
డతుల దివ్య ప్రకాశకుఁ డమర గురుఁడు
పరమ పురుషుండు ఋషభుండు పార్థి వేంద్ర ! 88

వ. *(అంత విముక్త లింగుండు, భగవంతుండు నగు ఋషభుండు మనంబున దేహాభి మానంబు విసర్జించి, కులాలచక్రంబు కులాలునిచే భ్రమియింపఁబడి విస్పష్టం బై నను భ్రమియించుగతిం బ్రాచీన సంస్కారవిశేషం బగు నభిమానాభాసంబున దేహచలనాదికంబుల నొప్పియుండియు, యోగమాయా వాసనచే యుక్తుం డయ్యె. మఱియు నా ఋషభుం డొక్క దినంబునం‡ గొంకణవంక పటకుట కంబు లను దక్షిణ కర్ణాటక దేశంబులకు యదృచ్ఛచేఁ జని, కుటకాచ లోపవనం బున నిజాస్యకృత శిలాకబళుం డగుచు, నున్మత్తుని చందంబున వికీర్ణ కేశుండు, దిగంబరుడు నై సంచరింప, వాయువేగ విధూత వేణు సంఘర్షణ సంజాతం బగు నుగ్రదావానలంబు త ద్వనంబు దహింప నందు దగ్ధుం డయ్యె. అంత నతని కృత్యం బులు త ద్దేశవాసు లగు జనంబులు నెప్ప నర్హా న్నామకుం డగు త ద్రాష్ట్రాధిపతి విని, నిజధర్మంబులం బరిత్యజించి, స్వదేశస్థులతోడం గూడి, దానాయాచారంబుల నంగీకరించి, యధర్మ బహుళం బగు కలియుగంబున భవితవ్యతచే విమోహితుం డై మనుజుల నసమంజసం బగు పాషండ మతాభినివేశులం జేసె,) మఱియును గలియుగంబునందు మనుజాధములు దేవమాయా మోహితు లై శాస్త్రోక్త శౌచాచారంబులు విడిచి, నిజేచ్ఛం జేసి [5]దేవతాహేళనంబులు సేయుచు, నస్నానాచమనాశౌచ కేశోల్లుంచనాదికాపవిత్రవ్రతంబులం జేయుచు నధర్మ బహుళం బగు కలియుగంబునం జెఱుపంబడ్డ బుద్ధిధర్మంబులం గలిగి, వేద బ్రాహ్మణ యజ్ఞపురుషుల దూషింపుచు లోకంబులం దమ తమ మతంబులకుం దామే సంతసింపుచు, నవేదమూలం బగు స్వేచ్ఛం జేసి ప్రవర్తించి, యంధపరం పరచే విశ్వాసంబు సేసి, తమంతన నంధ తమసంబునం బడుచు నుండుదురు.

---

1. లోకభవ్యులై న వారలచే (హ) 2. యారూఢి నంత (తం) 3. అరయ జూపుచు నుండి దేహంబుబాప, నిశ్చయించెను దివ్యయోగీంద్రు డాద్యు(బ) 4. ప్రాయ (?) * తా.ప. ప్రతులలో లేదు.
‡ కోరకణ లేక కోంకణ ? మూలములో 'కోరకణ' అని కలదు. 5. నింద (క. తం.)

ఈ ఋషభుని యవతారంబు [1]రజోవ్యాప్తు లగు వురుషులకు మోక్షమార్గంబు నుపదేశించుటకు నయ్యె. అదియునుం గాక స ప్త సముద్ర పరివృతంబు లగు నీ భూద్వీప వర్షంబులందలి జనంబులు దివ్యావతార ప్రతిపాదకంబు, లతిశుద్ధంబులు నగు నెవ్వని కృత్యంబులం గీ ర్తింతురు. మఱియు †నెవ్వని వంశంబున నతికీ ర్తి మంతుం డగు ప్రియవ్రతుండు గలిగె, నెందు జగదాద్యుం డగు పురాణపురుషుం డవతారంబు నొంది కర్మహేతుకంబులు గాని మోక్షధర్మంబులం దెలిపె. వెండియు నెవ్వండు యోగమాయా సిద్ధుల నసద్భూతంబు లగుటంజేసి నిరసించె, నట్టి ఋషభునితోడఁ ద త్సిద్ధికృత ప్రయత్ను లగు నితరయోగీశ్వరులు మనో రథంబున నైన నెట్లు సరి యగుదురు? ఇట్లు సకల వేదలోక దేవ బ్రాహ్మణులకు గోవులకుం బరమగురుండు, భగవంతుండు నగు ఋషభు చరిత్రంబు వినిన వార లకు దుశ్చరిత్రంబు దొలంగు. మంగళంబులు సిద్ధించు. మిక్కిలి శ్రద్ధతోడ నెవ్వండు విను, వినుపించు, వానికి హరిభక్తి దృఢం బగు. అట్టి హరిభక్తి తాత్పర్యంబునం బెద్దలు భాగవతు లగుటంజేసి సంప్రాప్త సర్వపురుషార్థు లగుచు వివిధ వృజిన హేతుకం బగు సంసార తాపంబును బాసి, యవిరతంబు, ద ద్భక్తి యోగామృత స్నానంబుఁ జేసి పరమపురుషార్థం బైన ‡మోక్షంబును జెందుదు. అని స ప్తద్వీపంబులవారు నేఁడునుం గొనియాడుచుండుదురు. 89

ఆ. యాదవులకు మీకు నత్యంత కులగురు
వైన కృష్ణుఁ డెచట నైనఁ గలఁడు
కొలుచువారి కెల్ల సులభుఁ డై మోక్షంబు
నిచ్చుఁ జింత సేయనేల? నీకు. 90

సీ. నిత్యానుభూత మౌ నిజరూపలాభ నివృత్త మై దగు మహోతృష్ణ గలిగి
యతులిత విపుల మాయా రచితం బైన లాభంబునకుఁ దగులంబు లేని
మతి గల్గి లోకుల నతివేడ్కఁ గరుణించి యభయదానం బిచ్చి యందఱి కిల
నవ్యయం బై దివ్య మై మహానంద మై యత్యంత సేవ్య మై యతుల మైన

---

1. బ్రహ్మ ఋత్వియులకు (క)

† ఏ వంశంబునందు శ్రీహరి యవతరించి మహాయోగధర్మ ప్రకాశంబుసేసె. నా ఋషభుని చరిత్రంబు మనోరథంబున నైనను బొందలేరు. అతండు యోగమాయను నిరసించి మాయా కల్పిత సకల సిద్ధుల నసత్యంబుగా దలచె. ఇట్లు సర్వలోక పూజ్యు లైన దేవబ్రాహ్మణులకును గోవులకును పరమ గురుండగు ఋషభుని చరిత్రంబు నెవ్వరు వినినను దుశ్చరితంబులు తొలంగు (క-బ)

‡ ఇట "పరమ పురుషార్థ మపి స్వయమాసాదితం నో ఏవాద్రియంతే" యని మూలము.(6-18)

హరికథామృత పానంబున నిర్వృతులై పరమపురుషార్థంబైన మోక్షంబునపేక్షింపరనివ్రాఁతప్రతి(తం.)

తే. తనదు లోకంబు చూపంగఁ దగినయట్టి
మోక్షమార్గంబు నెఱిఁగించి ముక్తదేహుఁ
డగుచుఁ దాదాత్మ్య మొందఁ బ్రభ్యక్షు విష్ణు
వైన ఋషభుండు జనులకు నద్భుతముగ. 91

అధ్యాయము — ౪

—: భ ర తో పా ఖ్యా న ము :—

మ. భరతుం డంత ధరాతలంబు గడఁకం బాలింపుచుఁ ధారుణీ
శ్వరచంద్రుం డగు విశ్వరూపునకు ముఁ సంజాత యై యుండి ని
ర్భరకాంతిఁ విలసిల్లు పంచజని పేరం గల్గు కాంతామణిం
గర మర్థిం ధరఁ బెండ్లియాడె శుభలగ్నం బందు భూవల్లభా ! 92

వ. ఇట్లు వివాహితుం డై యా పంచజనివలన నహంకారంబునం బంచతన్మాత్రలు జనియించిన తెఱంగున సుమతి, రాష్ట్రభృక్, సుదర్శన, ఆచరణ, ధూమ్రకేతువు లను నేవురు పుత్రులం బుట్టించె. అటమున్న నజనాభం బను పేరంగల వర్షంబు భరతుండు పాలించుకతంబున భారతవర్షంబు నాఁ బరగె. అంత, 93

క. భరతుఁడు [1]నిజపిత లేలిన, కరణినిఁ గర్మముల నెల్ల ఁ గైకొని ప్రజలఁ
హరికృప నొందుచు నేలెను, ధరణీసుర వరులు వొగడ ధరణీనాథా ! 94

సీ. భగవంతుఁ డగు జగద్భరితు నల్పంబులు నధికంబు లై న పె క్కధ్వరముల
దర్శపూర్ణమలచేఁ దగను జాతుర్మాస్యముల నగ్నిహోత్రమువలనఁ గడఁకఁ
బశు సోమములచేతఁ బలుమాఱు పూజించి వేదో క్త మైన యా విమలకర్మ
ములఁ గల్గు ధర్మంబు పురుషో త్తమార్పణంబుగఁ జేయుచును మఖంబులనుమంత్ర

తే. ములను బలికెడు నా దై వములను శ్రీశు
నవయవంబులుగాను భూధవుఁడు ప్రేమ
ననుదినంబును బాయక ఘనత దలఁచి
యఖిల రాజ్యానుసంధానుఁ డగుచు నుండె. 95

క. ఈరీతిఁ గర్మసిద్ధుల, నారయ నత్యంతశుద్ధ మగు చి త్తముతో
నా రాచపట్టి భరతుఁడు, ధారుణిఁ బాలించె నధిక ధర్మాన్వితుఁ డై . 96

వ. మఱియు నా భరతుండు శ్రీవత్స కౌస్తుభ వనమాలాలంకృతుండును, సుదర్శనా
ద్యాయుధోపలక్షితుండును, నిజభ క్తజన హృదయారవింద వాసుండును, బరమ

---

1. పూర్వజు లేలిన (క. తం.)

పురుషుండును నైన వాసుదేవునియందు నధికభక్తి ననుదినంబును జేయుచు, నేబదిలక్షలవే లేండ్లు రాజ్యంబు చేసి, పితృ పితామహా ద్యాయాతం బగు నా ధనంబును యథార్హంబుగఁ బుత్రులకుఁ బంచియిచ్చి, బహువిధ సంపదలు గల గృహంబును బాసి, పులహాశ్రమంబున కరిగె. నంత. 97

సీ. ఏ యాశ్రమంబున నింద్రాధీశ్వరుఁ డచ్చటి వారల నాదరించి
ప్రత్యక్షమున నుండుఁ బాయక యెప్పుడు నట్టి రమ్యం బైన యాశ్రమమున
నిలిచి సాలగ్రామములు గల [1]గండకీనది యెందు నెంతయు గదిసియుండు
న చ్చోట నేకాకి యగుచును భరతుండు బహువిధ నవపుష్ప పల్లవముల

తే. నతుల తులసీదళంబుల నంబువులను
గందమూలాది ఫలములఁ గంజములను
ఘనత నర్పించి నిచ్చలుఁ దనివిలేక
సేవచేయుచు నుండె నా శ్రీశు హరిని. 98

వ. దానంజేసి విగత విషయాభిలాషుం డై శమదమాది గుణంబులు గలిగి, యథేచ్ఛం జేసి యెడతెగక పరమపురుషుని పరిచర్యా భక్తిభరంబున శిథిలీకృత హృదయగ్రంథిం గలిగి, సంతోషాతిశయంబునం బులకితాంగుండు, నానందబాష్ప *(నిరుద్ధావలోక)నయనుండు నగుచు నిజస్వామి యైన హరిచరణారవిం దాను ధ్యాన (పరిచితభక్తి) యోగంబునం బరమానంద (గంభీర) హృదయం బను నమృత [2]హ్రదంబున నిమగ్నుం డగుచుఁ, దా నపుడు పూజించు పూజ నెఱుం గక యిట్లు భగవద్వ్రతంబు ధరియించి, యేణాజిన వాస స్త్రిషవణ స్నానం బుల నార్ద్రకుటిల కపిశవర్ణ జటాకలాపంబులు గలిగి, మార్తాండాంతర్గతుం డైన పరమేశ్వరుని హిరణ్మయ పురుషునిం గాఁ దలంచుచు ని ట్లనియె. 99

సీ. కర్మఫలంబులఁ [3]గడఁక నిచ్చుచు మనోవ్యాపారమున నిట్టి యఖిలలోక
ములఁ జేసి యా లోకములకు నంతర్యామి యగుచుఁ బ్రవేశించి యంతమీఁద
నానందరూప మైనట్టి బ్రహ్మముఁ గోరుచున్న [4]జీవునిఁ దనయోగ మహిమ
శక్తిచేఁ దగ ననిశంబుఁ బాలనసేయుచుండి యంతటను మార్తాండమధ్య

ఆ. వర్తి యగుచు నిట్లు వఱలుచు జగముల
యందు నుండి ప్రకృతిఁ బొంద కంత
నతుల దివ్యమూర్తి యైన యానందరూ
పమును శరణ మొందె భరతవిభుఁడు. 100

---

1. చక్రతీర్థంబుచే పవిత్రంబుగాన (డ) * తా. ప. ప్రతులలోలేదు 2. కాసారంబున (క. చ. ట. త. జ. డ.) 3. కడుసమర్పణ (క); గడవరించుచు (చ. ట. త.) 4. జీవునిఁ దనందున్న యోగ (హ); జీవుఁ దనయం దున్న యోగ (తం)

అధ్యాయము - ౯

వ. అంత నా భరతుం డొక్కనాఁ డా [1]మహానదిం గృతాభిషేకుం డై ముహూర్త త్రయం బంతర్జలంబులందుఁ బ్రణవోచ్చారణంబు సేయుచుండు సమయంబున, నిర్భరగర్భిణి యగు హరిణి జలార్థిని యై యొంటి జలాశయ సమీపంబునకు వచ్చి, జలపానంబు సేయునెడ నా సమీపంబున మృగపతి గర్జించి (లోక భయంకరంబుగ) నాదంబు సేయ, హరిణి స్వభావంబున భీతయగుటం జేసి బెగ్గడిలి (హరివిలోకన వ్యాకులచిత్త యై) దిగ్గన [2]నదరి, గగనంబునకు [3]నెగిరి, *యపగతతృష యగుచు నది నుల్లంఘించునెడ నధికభయంబునంజేసి యా గర్భంబు యోనిద్వారంబున గళితం బై జలంబులం బడియె. (ఆ హరిణి యుల్లంఘనాది భయంబునంజేసి) త త్తీరంబున నుండు (గిరిదరిం) బడి శరీరంబును బాసె. అంత నా హరిణపోతంబు జలంబులం దేలుచున్న, భరతుండు గనువిచ్చి చూచి కరుణార్ద్రచిత్తుం డై (మృతజనని) యగు హరిణపోతంబును దన యాశ్రమంబునకుఁ గొనిపోయి, మిక్కిలి ప్రీతింజేసి యుపలాలనంబు సేయుచుండఁ బోషణ పాలన ప్రీణన లాల నానుధ్యానంబుల భరతునకు నాత్మ నియమంబులైన యష్టాంగ యోగంబులును *(బరమ పురుష పూజా పరిచర్యాదులు నొక్కొక్కటిగఁ గ్రమక్రమంబునం గొన్ని దినంబులకు సమస్తంబు నుత్సన్నం బయ్యె. అంత.

క. ఘనతపము చలన మొందుట, యును భరతుం డెఱుఁగ కాత్మయోగంబునఁ జ
య్యనఁ బాసె హరిణపోతముఁ, దన మదిలో నిల్పి ప్రీతిఁ దప్పక పలికెన్. 102

ఉ. అక్కట! తల్లిఁ బాసి హరిణార్భక మాప్తులు లేమిఁజేసి యే
దిక్కును లేకయున్న నిటఁ దెచ్చితి నాయెడ నీ మృగార్భకం
బెక్కుడు ప్రేమఁజేసి జరియింపుచునున్నది నాదుసన్నిధిన్
మక్కువ చేసి దీనిఁ గడు మన్ననలం దగఁ బ్రోతు నెంతయున్. 103

క. శరణ మని వచ్చు జంతువుఁ, గరుణం గనువిచ్చి చూచి కాచినఁ బుణ్యం
బరయఁగ నధికం బని ము, [4]న్నెఱిఁగించిరి సన్మునీంద్రు లెల్లం ప్రేమన్. 104

వ. అని యిట్లు హరిణపోతంబుం దన యాశ్రమంబున నత్యాసక్తిం జేసి యాసన శయ నాటన స్నాన సమి త్కుశ కుసుమ ఫల పలాశ మూలోదకాహరణ దేవ పూజా జపాదులయెడం దన యొద్దన యునిచికొనుచు, వృక సాలావృకాది

---

1. చక్రతీర్థంబున (క) 2. నుదరి (క. చ. ట. డ. తం.) 3. నెగసిన నుద్దవడికి గర్భంబు స్రవించి శంబరంబులం బడియె (క-బ) 4. కర మెఱిఁగించెను మునీంద్ర గణములు ప్రేమన్ (హ)

* అగతతృషా-అనిమూలము.

క్రూరమృగంబులవలని భయంబున వనంబుల వెనువెంటం దిరుగుచు (నధిక ప్రణయభర పరీతహృదయుం డగుచు, నతి స్నేహంబునంజేసి గొంతసేపు స్కంధంబుల వహించుచు, మఱి గొంతతడ వురంబున నుత్సంగంబున నుంచికొని లాలింపుచు, సంతసంబు నొందు. మఱియు నా భరతుండు నిత్య నైమిత్తికాది క్రియాకలాపంబు నిర్వర్తించునెడ నంత నంత లేచి హరిణకుణకంబుం జూచుచుఁ, గించి త్సన్వ్యస్తహృదయుం డై దాని నాశీఃపరంపరల (నభినందించుచుం) జుంబ నాదులం (బ్రీతి సేయుచు) నతిమోహంబునఁ బెంచుచుండు నెడ. 105

చ. † గురువులు వాఱి బిట్టుఱికి కొమ్మలఁ జిమ్మచు నంతనంత ద
గ్గఱుచును గాలు ద్రవ్వుచు నఖంబుల గీఱుచు గాసి సేయుచు
న్నొఱుగుచు ధారుణీశ్వరుని యూరువులఁ బ్రయనించి యంతలో
నఱకడ మెక్కుచుం బొదలి యాడుచు నా హరిణంబు లీలతోఁ. 106

తే. గరిమ నీరీతి నెల్లెడఁ గెరలు వొడిచి
చెలఁగి యాడంగ భరతుండు చిత్తమందు
సంతసిల్లుచునుండె నాశ్రమముఁ బాసి
హరిణడింభక మంతలో నుఱికి చనియె. 107

వ. భరతుం డంతఁ (ద న్మృగశాబకంబు గానంబడమి మిక్కిలి న్వ్యాకులితచిత్తుం డగుచు, నష్టధనుండువోలె నతిదీనుం డై కరుణతోడం గూడి, త ద్విరహావిహ్వల మతి యై దానిన తలంచుచు నతిశోకంబుతో) మనంబున దుఃఖించి యి ట్లనియె.

తే. హరిణపోతంబ ! నీకు వనాంతమందుఁ
గ్రూరమృగబాధ లేకుండఁ గోరుచుండఁ
దలఁగిపోయితె ? యనుచుఁ జిత్తంబునందు
రాజఋషభుండు భరతుఁ డారాట మొంది. 109

తే. తల్లిచచ్చిన హరిణపోతంబు వచ్చి
పుణ్యహీనుండ నగు ననున్నఁ బొంది పాసె
నేమిసేయుదు ? నే నింక నెట్లు గందుఁ ?
జేరి యేరీతిఁ గాంచి రక్షించువాఁడ ? 110

క. కట్టా ! యీ యాశ్రమమునఁ, బుట్టిన తృణచయము మేసి పొదలిన హరిణం
బిట్టట్టుఁ దిరుగుచుండఁగఁ, బట్టి మృగేంద్రుండు గొట్టి బాధించె నొకో ! 111

---

† ఈపద్యము (హ) లో లేదు.

వ. ఇట్లు భరతుండు హరిణకుణక క్షేమంబు గోరుచు నెప్పుడు వచ్చి నన్ను సంతోషపఱుచు? నానాప్రకారంబు లైన తన గతులచేత నెప్పు డానంద మొందించు? ధ్యానసమాధి నున్నప్పుడు నన్నుం గొమ్మల గోకుచు నుండు నట్టి వినోదంబు లెప్పుడు గనుఁగొందు? దేవపూజా ద్రవ్యాబులు ద్రొక్కి మూర్ఖనినం గోపించి చూచినం గుమారుండు వోలె దూరంబునకుం జని నిలిచిన మఱల నేఁ బిలిచిన వెనుక నిలిచియుండు నిట్టి మెలఁకువ స్వభావంబు గలుగుట యెట్లు? లీ భూదేవి యెంత తపంబుఁ జేసినదియో? ఏ హరిణపాద స్పర్శంబులం బవిత్రం బైన భూమి స్వర్గా (పవర్గ) కాము లైన మునులకు యజ్ఞాహ్వా యగు నట్టి హరిణపోతంబు నెట్లు గనుఁగొందు? అదియునుం గాక భగవంతుం డగు చంద్రుండు మృగపతిభయంబున మృతజననియు, స్వాశ్రమ పరిభ్రష్టంబు నైన మృగశాబకంబును గొనిపోయి పెంచుచున్న వాఁడో? మున్ను పుత్రవియోగ తాపంబును జంద్రకిరణంబులం బాపుదు. ఇపుడు హరిణపోతంబు దన శరీర స్పర్శంజేసి చంద్రకిరణంబులకన్న నధికం బగుచుఁ బుత్రవియోగ తాపంబు నివర్తింపం జేసె. అనుచుం బెక్కుభంగుల హరిణనిమిత్తంబు లైన మనోరథం బులచేతం బూర్వకర్మవశంబున యోగభ్రష్టుం డగు భరతుండు భగవదారాధ నంబువలన విభ్రంశితుం డగుచు, నితరజాతిం బుట్టిన హరిణపోతంబు మీఁది మోహం బగ్గలం బగుచుండ నుండె. అని పలికి శుకయోగీంద్రుండు మఱియు ని ట్లనియె. 112

సీ జననాథ! మున్ను మోక్షవిరోధ మని పాయఁగారాని పుత్రాదికంబు లెల్లఁ
బాసి తపస్వి యై భరతుండు హరిణశాబక పోషణంబునఁ బాలనమున
నతిలాలన ప్రీణనానుషంగంబున మూషకబిల మతిరోషమునను
సర్పంబు జొచ్చిన చందంబునను యోగవిఘ్నంబు మిక్కిలి విస్తరిల్లఁ

ఆ. గాన నెంతవాని కైనను గాలంబు
గడవరాని నటు గాకపోదు
పరమమునుల కైనఁ బాయదు కర్మంబు
నరు లనంగ నెంత? నరవరేణ్య! 113

వ. ఇట్లు భరతుండు మృగవియోగతాపంబు నొందుచుండు నెడ నా మృగశాబకంబు చనుదెంచిన సంతసిల్లుచుండె. అంత నొక్కనాడు. 114

మ. భరతుం డల్లన నంత్యకాలము వెసం బ్రాపించఁగా నప్పు డా
హరిణంబుం గడుభక్తిఁ బుత్రుగతి నత్యాసక్తి వీక్షింప నా
హరిణంబుం దన యాత్మలో నిలిపి దేహం బంతటం బాసి తా
హరిణీగర్భమునం జనించి హరిణం బై యొప్పెఁ బూర్వస్మృతిన్. 115

వ. ఇట్లు భరతుండు హరిణీ గర్భంబునం బుట్టియు భగవదారాధన సామర్థ్యంబునం దన మృగత్వ కారణంబు దెలిసి, మిక్కిలి తాపంబు నొందుచు నిట్లనియె. 116

ఉ. రాజులు ప్రస్తుతింప వసురాజ సమానుఁడ నై తనూజులన్
రాజులఁ జేసి తాపసులు రాజఋషీంద్రుఁ డటంచుఁ బల్కగాఁ
దేజమునొంది యా హరిణదేహము నందులఁ బ్రీతిఁజేసి నా
యోజ చెడంగ నేఁ జెడితి యోగిజనంబులలోన బేల నై. 117

వ. ఇట్లు శ్రీహరి శ్రవణ మనన సంకీర్త నారాధ నానుస్మర ణాభియోగంబులం జేసి యశూన్య సకలయామం బగు కాలంబు గల నాకు హరిణ పోతస్మరణం బునంజేసి (యోగ) విఘ్నంబు ప్రాప్తం బయ్యె. మోఱుదూరుండ నైతి. అని (నిగూఢ నిర్వేదుం డగుచుఁ) దల్లిం బాసి క్రమ్మఱ నుపశమశీల మునిగణ సేవితం బై భగవత్ క్షేత్రం బైన సాలతరు నిబిడతమ గ్రామసమీప పులస్త్య పులహాశ్రమంబునకుం (గాలాంజన పర్వతంబు) వలనం జనుదెంచి, యందు మృగ దేహత్యాగావసానంబు గోరుచు (సంగంబు విడిచి) యేకాకి యగుచు, శుష్క పర్ణ తృణ వీరుధాహారుం డై *(మృగత్వ నిమిత్తం బగు) నా నదీ తీర్థంబునందుఁ ద త్తీర్థోదక క్లిన్నం బగుచునుండు శరీరంబు విడిచె.అని శుక యోగీం ద్రుండు పరీక్షిన్న రేంద్రునకు వినుపించి మఱియు నిట్లనియె. 118

అధ్యాయము - ౯

సీ. హరిణదేహముఁ బాసి యంత నాంగిర[1]సాన్వయుండు శుద్ధుఁడుపవిత్రుండు ఘనుఁడు
శమదమ ఘనతప స్స్వాధ్యాయ నిరతుండు గుణగరిష్ఠుఁడు నీతికోవిదుండు
నై న బ్రాహ్మణునకు నాత్మజుం డై పుట్టి సంగంబువలనను జకితుఁ డగుచుఁ
గర్మబంధంబుల ఖండింపఁజాలు నీశ్వరుని నచ్యుతు నజు శ్రవణ మనన

తే. ములను హరి చరణధ్యానములను విఘ్న
భయమునను జేసి మనమందుఁ బాయనీక
నిలిపి సంస్తుతి సేయుచు నిలిచియుండె
భరిత యశుఁ డైన భరతుండు పార్థివేంద్ర ! 119

---

1. ఆహ్వాయుఁడు (హ)

వ. ఇట్లాంగిరసుండు ప్రథమ భార్యయందుఁ బుత్ర నవకంబును, గనిష్ఠభార్యయందు స్త్రీపురుషుల నిద్దఱను గలుగఁజేసిన నందుఁ బురుషుండుఁ, బరమ భాగవతుండు, రాజర్షి ప్రవరుండు, నుత్సృష్ట మృగశరీరుండుఁ, జరమ శరీరంబునం ప్రాప్త విప్రశరీరుండు నగు భరతుం డై) శ్రీహరి యనుగ్రహంబునం బూర్వజన్మ పరంపరల సంస్మరింపుచుఁ దన స్వరూపం బున్మత్త జడాంధ బధిర రూపంబున లోకులకుం జూపుచుండె. అంత. 120

మ. [1]జనకుం డాత్మజుని వాత్సల్యంబునం బెంచుచుఁ
దనరం జౌలముఖాగ్ర్య కర్మములచేతఁ సంస్కృతుం జేసి పా
యని మోహంబున నిచ్చలుం గడఁక శౌచాచారముల్ సెప్పినఁ
ఘనుఁ డా [2]విప్రసుతుం డసమ్మతినిఁ దత్కర్మంబులఁ గైకొనెన్. 121

వ. ఇట్లు బ్రాహ్మణకుమారుండు గర్మంబులయందు నిచ్చ లేకయుండియును [3]బిత్ర నియోగ నిర్బంధంబునం (బిత్ర సన్నిధియందె యసమీచీనంబుగా వ్యాహృతి ప్రణవశిర స్సహితం బగునట్లు) గాయత్రీమంత్రోపదేశంబు నొంది, చైత్రాది చతుర్మాసంబుల సమవేతంబుగ వేదంబుల నధ్యయనంబు సేయుచుండె. జనకుం డాత్మజుని శిష్టాచారంబుచే శిక్షింపవలయు ననుం లోకాచారంబు ననువర్తించి, యాత్మ భూతుం డగు నాత్మజునందు నభినివేశిత చిత్తుం డగుచు, శౌచాచమనాధ్యయన వ్రతనియమ గుర్వనలశుశ్రూషణాదికంబుల ననభియుక్తంబు లైనం, బుత్రునిచే నొనరింపుచు నప్రాప్తమనోరథుం డయ్యె. అంత. 122

క. ఈరీతినిఁ గొడుకున కా,చారం [4]బుపదేశమిచ్చి సద్గృహమున సం
సారి యగుచుండి విప్రుఁడు, బోరన దేహంబుఁ బాసి పోయిన మీఁదన్. 123

ఆ. తల్లి తండ్రితోడఁ దగ నగ్నిఁ జొచ్చిన
నతని మహిమ లెఱుఁగ కంతలోన
సవతితల్లి కొడుకు లవినీతులగుచును
శాస్త్రవిద్య లతనిఁ జదువనీక. 124

వ. ఇట్లు బ్రాహ్మణకుమారుని సవతితల్లి కొడుకులు వేదవిద్యలవలనం బాపి గృహకర్మంబుల నతని నియమించిన. 125

క. ధరణీసురోత్తముఁడు దా, నరుదుగఁ దమవారు సెప్పినవి యెల్లను నే
మఱ కందుఁ బ్రీతిసేయక, నిరతము గృహకర్మమట్లు నెఱపుచు నుండెన్. 126

---

1. జనకుండాంగిరసుండు నాత్మజుని(హ.తం.వా.) 2. ఘనుఁడా భాగవతుండు (హ.తం.వా) 3. పిత్రనిరోధంబున (చ.ట.త.డ.ద.బ.) 4. బులు, గరపిచింత (హ. తం. వా.)

వ. ఇట్లు గృహకర్మ ప్రవర్తనుం డగుచు *(నుండ మూఢులగు ద్విపాత్పశువులచే నున్మత్త ! జడ ! బధిర ! యని యాహూయమానుం డగునపుడు త దనురూపంబు లగు సంభాషణంబుల నొనర్చుఁ, బరేచ్ఛా యదృచ్ఛలం జేసి విష్టి వేతన యాచ్ఞాదుల వలన నియుక్త కర్మంబులం బ్రవర్తించుచు.) 127

తే. [1]అతుల మృష్టాన్న మైన శుష్కాన్న మైన
నెద్ది వెట్టిన జిహ్వకు హితముగానె
తలఁచి భక్షించుఁ గా కొండుఁ దలఁచి మిగులఁ
బ్రీతిసేయఁడు రుచులందుఁ బెంపుతోడ. 128

వ. మఱియు నా విప్రుండు నిత్యానంద సుఖలాభంబు గలిగి, బాహ్య సుఖదుఃఖంబుల యందు దేహాభిమానంబు సేయక, శీతోష్ణవాత వర్షాతపంబులకు నోడి పైచీర గప్పక, వృషభంబునుంబోలెఁ (బీనుండుఁ, గఠినాంగుండు నగుచు) (స్థండిల శాయి యై, రజఃపటలంబునం గప్పంబడ్డ దివ్యమాణిక్యంబు వోలె ననభివ్యక్త బ్రహ్మవర్చసుం డై (మలినాంబర పరీత కటితటుండు, నతిమషీ లిప్త యజ్ఞోప వీతుండు నగుటం జేసి యజ్ఞజనంబు లతఁడు) బ్రాహ్మణాభాసుండు, మందుండు నని పలుక, సంచరించుచుండం (గర్మమూలంబునం బరులవలన నాహారంబు గొనునపుడు) దమవారును వ్యవసాయ కర్మంబునందు నియమించిన క్షేత్రనిహిత సమవిషమ న్యూనాధికంబుల నెఱుంగక ప్రవర్తింపుచు, నూఁక, తవుడు, తెలిక పిండి (పొట్టు, నిప్పటి, మాఁడు) ద్రబ్బెడ యాదిగాఁగల ద్రవ్యంబులయందు నమృతంబుపగిది రుచిచేసి భక్షింపుచుం జేనికావలి యుండునెడ నొక్కనాడు.

—: వృషలరాజ భృత్యులు కాళిబలికి భరతునిఁ గొంపోవుట :—

క. పురిలోన వృషలపతి దా,నరుదుగ సంతానకాముఁ డై వేడుకతోఁ
బురుష పశువుఁ గాళికి [2]వే,దఱుముకఁ గొనిపోవఁ బనువు దలఁగిన భృత్యుల్.

ఆ. అరసి కానలేక యా రాత్రి వీరాస
నమునఁ జేని కాపు విమలబుద్ధి
నున్న విప్రయోగి నొయ్యనఁ బొడగాంచి
పశువు మంచి దనుచుఁ బట్టి రతని. 131

క. ఆరీతిని భూసురవరు, నారయ నా కాళికా గృహామునకు భృత్యుల్
బోరనఁ గొని చని సల్పరి, చారుతరాభ్యంజనాది సంస్కారంబుల్. 132

---

* తా. ప. ప్రతులలోలేదు.

1. అతుల దివ్యాన్నమైన మృష్టాన్నమైన (హ) 1. తరమిడి గొనిపోవ (జ. బ.)

వ. ఇట్లభ్యంజనాది కృత్యంబులు దీర్చి (నూతన వసనంబు గట్ట నిచ్చి) గంధ పుష్పా
భరణాక్షతాలంకృతునిం జేసి, మృష్టాన్నంబులు భుజియింపం బెట్టి, ధూప దీప
మాల్య లాజ కిసలయాంకుర ఫలోపహారాదులు సమర్పించి, పంచమహావాద్య
ఘోషంబుతోడ నా పురుషపశువుం గాళికాదేవి సమ్ముఖంబున నాసీనుం గావిం
చిరి. ఆ వృషలపతి పురుషపశువు రక్తంబునం భద్రకాళి సంతోషపెట్టం దలంచి,
కాళికా మంత్రాభిమంత్రితంబు (నతికరాళంబు నైన) ఖడ్గం బంది (నిజాభీష్ట
సిద్ధికి) హింసింపం దలఁచిన. 133

సీ. సర్వభూతములకు సఖుఁడును బ్రహ్మభూతాత్ముఁడు నిర్వైరుఁ డైన బ్రహ్మ
సుతునితేజం బంతఁ జూడ దుస్సహ మైన భయమంది వడఁకుచు భద్రకాళి
క్రోధంబు ముమ్మడి గొనఁగ హుంకారంబు సలుపుచు నట్టహాసంబుఁ జేసి
పాపాత్ములును దౌష్ట్యపరులును రాజస తామస కర్మసంధాను లగుచు

తే. విప్రవరు నట్లు హింసించు వృషలపతిని
భృత్యవర్గంబుతోఁ దలల్ బృథ్విఁ గూల్చి
యపుడు వృషలాధిపుని శిర మంది లీలఁ
బాడి యాడుచు నందంద క్రీడసలిపె. 134

క. ధరలోన నెవ్వరేనియు, ధరణీసురవరుల కెగ్గు దగఁ దలఁచిన వా
రరయఁగఁ జెడుదురు నిక్కము, హరి ధరణీసురవరేణ్యులం దుండుటచేఁ. 135

వ. మఱియు. 136

ఉ. అచ్చట విప్రసూనుఁడు భయం బొకయించుక లేక చంపఁగా
వచ్చినవారియందుఁ గరవాలమునందును గాళియందుఁ దా
$నచ్చుతభావ ముంచి హృదయంబునఁ బద్మదళాక్షు నెంతయుఁ
మచ్చికతోడ నిల్పి యనుమానము నొందక యుండె నత్తఱిఁ. 137

వ. మఱియు నా విప్రవరుండు చండికాగృహంబు వెలువడి కమ్మఱం జని కావలి
యుండు నెడ. 138

$ 'అచ్యుతభావ'మని అన్ని యచ్చుప్రతులలో గలపాఠము. ఈపాఠమునఁ బ్రాసము సరిపడదు. "అచ్యుత భావము" వ్యాకరణ సమ్మతము కాకపోయినను, పోతన రచనలో ఇట్టి సమాసములు తఱచు కనఁబడుచుండుటను బట్టియు, ప్రాసము ననుసరించియు, 'అచ్యుతుఁడు' అనుట వాడుకలో నుండుట వలనను, ఇదే కవిపాఠముగా గ్రహింపఁబడినది.

అధ్యాయము - ౧౦

సీ. అంతటఁ గొన్ని హాయనములు సన సింధు భూపాలనము సేయు భూవరుండు
ధీరత నిఱుమతీ తీరమున నున్న కపిలమహామునిఁ గాంచి తత్త్వ
విజ్ఞాన మెఱిఁగెడు వేడ్కతోడుత శిబికారోహణముఁ జేసి యరుగుచుండ
నాలోన నా శిబికారోహకులు చేనికాపున్న విప్రునిఁ గాంచి తెచ్చి

తే. శిబిక మోపింత మీతనిచేత ననుచుఁ
బట్టి మూఁపునఁ బల్లకిఁ బెట్టి మోవు
మనుచు మోపించునంత ధరామరుండు
శిబిక మూఁపున నిడి యెందుఁ జింతలేక. 139

క. తన మనసుకొలఁది నప్పుడు, మునుకొని యట్లప్రయత్నమున నడువఁగ నా
జనపతి నిమ్మోన్నత మై, చనుట యెఱిఁగి శిబిక మోయుజనులకు ననియెఁ.

ఆ. మీర లిప్పు డిచటఁ జేరి మిక్కిలి ప్రయ
త్నంబుతోడఁ దగిలి నడుచుచుండ
విషమమగుచు గమనవేగంబునను బాధ
పెట్టుచున్న దనిన బెత్త లనిరి. 141

వ. దేవా! యీ విషమగమనంబు మాపలన నై నది గాదు. ఈ [1]తురీయవాహకుండు సుఖగమనంబుగా నడువనేరండు. (వినితోడ మేమును నడువనేరము. అనిన రహూగణుండను) నా రా (జుపాసిత వృద్ధజనుం డైనను బలాత్కారంబునం బుట్టిన కోపంబునం) గోపించి, విమర్శ దప్పి, నీఱుగప్పిన నిప్పునుం బోలె నెఱుంగరాని బ్రహ్మతేజంబుగల బ్రాహ్మణునికిం గంటకంబుగా నిష్ఠురవాక్యం బుల ని ట్లనియె. 142

చ. అలసితి వెంతయుఁ ముసలి వాఁకట డస్సితి [2]మేను మిక్కిలిం
బలుచనయున్న దీ శిబికభారము దూరము [3]మోసి తే గతిన్
నిలిచెద ? వంచు భూవరుఁడు నిష్ఠురముల్ వినఁ బల్క నాయెడం
బలుకక మోసె నా శిబిక బ్రాహ్మణవర్యుఁడు పార్థివేశ్వరా! 143

వ. అప్పు డా విప్రవరుండు దనకుం గడపటిది యగు కళేబరంబునందు నహంకార మమకారంబులం బొరయక మిథ్యాజ్ఞానరహితుం డై బ్రహ్మభూతుం డై మౌన

---

1. వింతవాహకుండు (క.ట.త.జ.డ.ద.) 2. వెన్ను (తం. వా.) 3. ఇంక నేగతిన్ (క.చ.ట.బ.)

ప్రతంబున నా శిబిక ప్రేాయుచున్న విషమగమనంబుఁ జూచి (యతికుపితుం డగుచు) భూవరుండు వెండియు ని ట్లనియె. 144

సీ. ఓరి! దుర్మద! వినరోరి! జీవన్మృత! నా యాజ్ఞఁ [1]దప్పుచు నడచె దీవు
నీ వక్రమార్గంబు లిన్నియు విడిపించి నడపింతు నిన్ను సన్మార్గమందు
నని [2]రాజగర్వాంధుఁ డగుచు గుణత్రయం బున వృద్ధిఁ బొందిన భూవరుం డ
బద్ధ ప్రలాపముల్ పల్కుచుండినఁ జూచి శమదమాదులచేఁ ప్రశస్తుఁ డగుచు

తే. జగతి బ్రహ్మస్వరూప మై సకలభూత
ములకు నత్యంతహితుఁ డై న భూసురుండు
యోగివర్తనఁ దెలియకయున్న రాజు
నంత వీక్షించి మఱియు ని ట్లనుచుఁ బలికె. 145

వ. నరేంద్రా! నీవు చెప్పునది సత్యంబు. భారం బీ శరీరంబునకే కాని నాకుం గలుగనేరదు. ఐనను స్థౌల్య కార్శ్యంబులు వ్యాధులు నాధులు తుష్ణలు నిచ్ఛా విరోధ (భయంబులు) జరామరణంబులు రోష నిద్రా జాగరణంబు లహంకార మమకార మదశోషణాదులు దేహంబుతోడన జనియించుం గాని నాకుం గలుగనేరవు. జీవన్మృతుండ. నేనకా దాద్యంతంబులు గలుగుటంజేసి యందఱియందును గలిగియుండు స్వామిభృత్య సంబంధంబులు విధికృత్యంబు లగుచు, వ్యవహారంబులంజేసి శరీరంబులకుం గలుగుం గాని జీవులకు లేకయుండు. అదియునుం గాక రాజాభిమానంబున నీవు న న్నాజ్ఞాపించెద వేనియుం, బ్రమత్తుండ వై న నీకుం బూర్వస్వభావం బెట్లుండె, నట్లు గాక యే నేమిసేయుదు? నెఱిం గింపుము. ఉన్మత్త (మూకాంధ) జడుల బోలె సహజస్వభావంబునుం బొందిన నాయందు నీ శిక్ష యేమిలాభంబు బొందింప నేర్చు? అదియునుం గాక (స్తబ్ధుండు) మత్తుండు నై న నాకు నీ శిక్ష వ్యర్థం బగు. అని పలికి, యుపశమ శీలుం డై ముునివరుండు పూర్వకర్మశేషంబునం గల్గు భారవాహకత్వంబును దలంగందోలుటకు భారంబు వహించి, శిబిక మోచుచుం జనునెడ, నా రాజ వల్లభుండు తత్త్వజ్ఞానాపేక్షితుం డై చనియెడివాఁ డగుటం దన హృదయగ్రంథి విమోచకంబులు, బహు యోగగ్రంథ సమ్మతంబులు నగు బ్రాహ్మణవాక్యంబులు విని, యా శిబిక దిగ్గన డిగ్గనుఱికి, యా విప్రునికి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, గర్వవర్జితుం డై ముకుళితహస్తుం డగుచు ని ట్లనియె. 146

---

1. దప్పించి (క. ట. త. ద. బ.) 2. రాజ్య (క. ట. త. డ.)

సీ. ధరణీసురులలోనఁ దలఁప నెవ్వఁడ వీవు నవధూతవేషి వై యవనియందు
నేమిటికై చరియింపఁగ వచ్చి తిచ్చటికి నొక్కఁడ వొంటి సనుట నేఁడు
ననుఁ గృతార్థునిఁ జేయ ననుకూలుఁ డగుచున్న యట్టి యా కపిలమహా
మునీంద్రుఁ
డవొ? నీ మహత్త్వంబు దవిలి విచారింప నెఱుఁగక చేసితిఁ గరుణఁ జూడు

తే. తప్పు సైరింపు నే యమదండమునకు
హరుని శూలంబునకును వజ్రాయుధమున
కనల చంద్రార్క ధనద శస్త్రాస్త్రములకు
వెఱవ విప్రున కే మది వెఱచినట్లు. 147

వ. మఱియు నిస్సంగుండ వై జడుండవుం బోలె నిగూఢవిజ్ఞానంబు గలిగి చరియింపుచు నున్నవాఁడవు. నీ వచనంబులు యోగశాస్త్రసమానంబు లై వాఙ్మనంబులకు నభేద్యంబు లై యున్నవి. (ఏను విష్ణుకళావతీర్ణుండు, సాఙ్ఖ్యకరియునగు) కపిలమహాముని వలన బ్రహ్మవిద్య తెలియంగోరి చనుచున్న వాఁడ. నీవు లోకనిరీక్షణార్థం బవ్యక్తలింగుండ వై చరియింపుచున్న కపిలమహామునీంద్రుండవు గాఁబోలుదువు. మందుం డైన గృహస్థుండు యోగీశ్వరచరిత్రంబు లెట్టు లెఱుంగనేర్చు? కర్మవశంబున దృష్టం బై భ్రాంతి [1]వహించుచు నడచుచున్న యీ యా భ్రమంబు నాకునుం బోలె మీకు నగు నని తోఁచుచున్నది. అది యెట్లనిన, ఘటంబులేక జలంబులు దే నేరని తెఱుంగున, లేనిది గలుగనేరదు గావునం బ్రమాణమూలం బైన లోకవ్యవహారంబు సత్పథంబున సమ్మతం బై యుండుటం జేసి మీర లాడువాక్యంబులు నాకు సమ్మతంబు గానేరవు. అని, సింధుదేశాధీశ్వరుండు వినుపించిన, నా విప్రుండు లోకవ్యవహారంబునకు నిత్యత్వం బౌపాధికం బగుంగాని నిత్యంబు గానేరదు. అని దృష్టాంత నిదర్శనంబున నిట్లనియె.

సీ. పావకశిఖలచే భాండంబు దాఁ దప్త మగుఁ దప్తఘటముచే నందునున్న
జలము తపించు నా జలముచేఁ దండులంబులు తప్త మొంది యప్పుడు విశిష్ట
మైన యన్నం బగు నా చందమునను దా దేహేంద్రియంబులఁ దెలివితోడ
నాశ్రయించుక యున్నయట్టి జీవునకు దేహంబునఁ ఘ్రాణేంద్రియాదికమున

ఆ. జరుగుచుండు నిట్లు సంసారఘట [2]శిఖ
[3]రకుకుండు నైన రాజు దుష్ట
కర్మములకుఁ బాసి కంజాతపద సేవఁ
జేసెనేని భవముఁ జెందకుండు. 149

---

1. ాంతి (క.చ.ట.) భ్రాంతి (హ) 2. వృత్తి (హ) 3. దుండునైన రాజు దుష్టమైన (హ)

ఆ. అనుచు ధారుణీసురాత్మజుఁ డీ రీతిఁ
బల్కుటయును రాజు పరిణమించి
వినయవాక్యములను వినుతించి క్రమ్మఱఁ
బుణ్యుఁ డైన సింధుభూవరుండు. 150

వ. మహాత్మా! యేను రాజ ననియెడి యభిమాన మదాంధుండ నై మహాత్ముల
దిరస్కరించిన నన్నుం గరుణింపుము. నీ వార్తబంధుండవు. నీ కృపాదృష్టిం జేసి
మహాత్ముల నవమానంబుచేసిన దురితంబువలన విముక్తుండ నయ్యెద. విశ్వ
సుహృత్తవై న నీకుం గోపంబు గలుగనేరదు. అసమర్థు లై న మాబోఁటివారలు
మహాజనావమానంబున శీఘ్రుంబె నశింతురు. కాన నీవు దయాళుండ వై నన్ను
మన్నింపుము. అనిన నా విప్రుం డిట్లనియె. 151

ఆధ్యాయము - ౧౧

క. ‡కడువేడ్క [1]నీ వవిద్వాం,సుఁడవై యుండియును మిగులఁ [2]జోద్యము విద్వాం
సుఁడుపోలెను బలికెద వి, ప్పుడు మే లనవచ్చుఁ గొంత పురుషులలోనన్. 152

ఆ. పరఁగఁ బెద్ద లీ ప్రపంచమంతయుఁ దథ్య
మనరు నీవు తథ్యమనుచుఁ బలికి
తట్లుగాన నిన్ను నధికుండ వని పల్క
రాదు నాకుఁ జూడ రాజచంద్ర! 153

సీ. యజ్ఞాదికములందు నామ్నాయములయందుఁ దఱుచుగాఁ దత్త్వవాదంబు లేదు
స్వప్నంబునందుల సౌఖ్య మాకారంబు నందుల నిత్య మై యంత లేని
యట్టిచందమున వేదాంతవాక్యంబులు తత్త్వంబు నెఱిఁగించి తలఁగుఁ గాని
నిత్యంబు లై యుండనేరవు పురుషుని చిత్తంబు గుణములఁ జెంది యెంత

తే. కాల ముండును మఱి యంతకాలమందు
నరయ విజ్ఞాన కర్మేంద్రియములచేత
మరగి ధర్మంబు మఱి యధర్మంబు నట్లు
దగిలి పుట్టించుచుండు నత్యంతమహిమ. 154

వ. మఱియు ధర్మాధర్మవాసనాయుక్తంబు, విషయానురక్తంబు నైన చిత్తంబు గుణ
ప్రవాహంబులచేత వికారంబు నొంది, దేవతిర్యఙ్మనుష్యరూపంబు లైన దేహం

---

‡ ఈ పద్యము క. చ. ట. లలో లేదు. 1. నీవు విద్వాంసుఁడవై (హ. వా.) 2. చోద్య
మవిద్వాంసుఁడు పోలె (హ)

బుల ధరించుచుఁ, గాలప్రాప్తంబు లైన సుఖదుఃఖ తదుభయ ఫలంబుల ననుభవింపుచు, ననవరతంబు జీవునికింబ్రత్యక్షుం బగుచు, స్థూలసూక్ష్మరూపంబుల నుండు. స్వాంతంబు గుణరహితం బైన, ముక్తికారణం బగు. ఘృతవర్తులు గల దీపంబు సధూమశిఖలం బుట్టించు. ఘృతవర్తులు నాశంబు నొందిన స్వరూపంబుఁ బొందు. ఈ తెఱంగున, మనంబు గుణకర్మానుబంధం బైన జన్మాదులం బుట్టించు. గుణ కర్మంబులం బాసె నేనియుం బరతత్త్వంబు నొందు. జ్ఞానేంద్రియంబు లేనును విషయంబులమీఁదఁ దోఁచుబుద్ధులేను నభిమానంబు ననునేకాదశవృత్తులం గూడిన మనంబు జీవుని నసంఖ్యంబు లైన జన్మంబులం బొందించు. మనోవృత్తుల నతిక్రమించిన జీవుండు పరంజ్యోతి యైన నారాయణస్వరూపంబుగా నెఱుంగుము. స్థావరజంగమంబు లైన జీవులకుం బననుండు ప్రాణం బై యున్నచందంబున, నీశ్వరుండు సర్వభూతాంతర్యామి యగుచు జీవాత్మస్వరూపంబున నుండు. జీవాత్ముండు జ్ఞానోదయంబునంజేసి మాయ నెంతకాలంబు గెలువకుండు, నంతకాలంబు ముక్తసంగుండు గాఁడు. అరిషడ్వర్గంబును జయించి, పరతత్త్వంబు నెఱింగిన నీశ్వరుండగు. చిత్తం బెంతకాలంబు విషయాసక్తం బగు, నంత దడవు సంసారచక్రంబునందు సంచరించు. కావున మహావీరుం డైనను దనకు శత్రువైన మనంబు నప్రమత్తుం డై, యుపేక్షాబుద్ధిం జేసి యిచ్ఛావిహారంబున జరగనీక, పరమగురుం డైన శ్రీహరి చరణోపాసనాస్త్రంబునం జిత్తంబు గెలిచినం, బరతత్త్వంబు నొందు. అని విప్రుండు వలికిన, నతని మహిమకు వెఱఁగంది బ్రాహ్మణునకు నమస్కారంబు సేయుచు భూవరుం డిట్లనియె. 155

అధ్యాయము - ౧౨

ఉ. కారణవిగ్రహంబు నురుకాయము నీ యవధూతవేషముఁ
భూరి ధరామరత్వమును బూర్వసమాగమ మాత్మభావముం
జారు [1]విహార మత్యతుల శాంతిగుణంబును గూఢవర్తనం
బారయఁ గల్గు నీకు ననయంబును మ్రొక్కెదఁ బెక్కుభంగులఁ. 156

మ. జ్వరితార్తుం డగు రోగి కౌషధ మతీష్టం బైన చందంబున
న్నరయ న్నాతపతప్త దేహి గడు శైత్యం బైన తోయంబునుం
గరిమం గ్రోలినరీతి నెంతయు నహంకారాహిదష్టుండ నై
పరఁగు న్నాకును నీ వచోమృతము దప్పఁ మందు వేఱున్నదే? 157

---

1. విహారమున్నతుల (చ)

ఆ. విప్రవర్య! నేను వేడ్కతో నాసంశ
యంబు లెల్ల నిన్ను నడిగి తెలియఁ
దలఁచి యున్న వాఁడఁ దప్పక యెఱిఁగింపు
ముచితవృత్తిఁ దత్త్వయోగ మెల్ల. 158

వ. (అని యడిగిన యా రాజున కా విప్రుం డిట్లనియె). 159

తే. కానవచ్చిన ఫలములు కర్మమూల
[1]ము లగుటను జేసి సంసారములను జిత
మెపుడు వర్తించుచుండఁగా నెఱుఁగలేవు
తత్త్వయోగంబు మిగుల నిత్యం బటంచు. 160

వ. మఱియు, నీ వసుంధర నున్న చరణంబులకు నెక్కుడు జంఘలు నా మీఁద జానువు లా పొడవున నూరువు లందులకు నుపరిప్రదేశంబున మధ్యం బటమీఁద నుర మందుకునెక్కువ కంఠం బటమీఁద స్కంధం బందుల దారు వా దారువున శిబికయందు రాజ ననియెడి యభిమానంబు గలిగి నీవున్న వాఁడవు. ఇట్టి చోద్యం బైన కష్టదశం బొంది, జనుల దయలేక నిగ్రహించి, నీవు ప్రజాపాలనంబు సేయు చున్న వాఁడ నను గర్వంబున మావంటి మహాత్ముల సభలోనం బూజ్యుండు గాకయున్న వాఁడవు. ఈస్థావర జంగమంబులకు నివాసస్థానంబు వసుంధర యైన చందంబున, సత్క్రియలచేత నెఱుంగం దగిన జగత్కారణం బైన తత్త్వంబు నెఱింగించెద. పరమాణుసముదయం బీ ధరిత్రి యైన చందంబున, నవిద్యామనం బులచేతం గల్పితం బైన కృశ స్థూల బృహ దణు సదస జ్జీవాజీవ ద్రవ్య స్వభా వాశయ కాల నామ బుద్ధిరూపం బైన మాయచేత జగత్తు రెండవది యై కల్పింపంబడియె. బాహ్యాభ్యంతరంబులఁ గలిగి. స్వప్రకాశం బై. భగవ చ్ఛబ్ద వాచ్యంబు, విశుద్ధంబుఁ, బరమార్థంబు, జ్ఞానరూపంబు నైన బ్రహ్మం బొకటియె సత్యంబు. జగ త్తసత్యం బగు. అని పలికి మఱియు. 161

సీ. ధరలోన బ్రహ్మంబు తపమున దానంబులను గృహధర్మంబులను జలాగ్ని
సోమ సూర్యులచేత శ్రుతులచే నైనను బరమభాగవతుల పాదసేవఁ
బొందినమాడ్కిని బొందంగ రా దని పలుకుదు రార్యులు పరమమునులు
ఘన తపో బాహ్యసౌఖ్యములకు విముఖులు నై పుణ్యులు హరిగుణానువాద

తే. మోదితాత్ములు నగు బుధపాదసేవ
ననుదినంబును జేసిన నంతమీఁద
మోక్షమార్గంబునకును బద్ధాతునందుఁ
బట్టువడి యుండు నెప్పుడు పరఁగ బుద్ధి. 162

---

1. మగుటఁ జేసియు సంసారమందుఁ జిత్త (క. డ. తం)

వ. నరేంద్రా! యేను పూర్వంబున భరతుం డను రాజను. సర్వసంగ పరిత్యాగంబు
నేసి భగవదారాధనంబు నేయుచు మృగంబుతోడి స్నేహంబుకతన మృగంబ
నై పుట్టియు, నందును హరిభక్తి దప్పకుండి యిపుడు మనుష్యుండ నై జన
సంగంబున శంకితుండ నగుచు మనుష్యసంసర్గంబును బాసి యేకాకి నై చరియింపు
చున్న వాఁడ. నరుఁడు వృద్ధసంసేవం జేసి సంసారమోహంబును బాసి హరిధ్యాన
కథలచే లబ్ధజ్ఞానుం డై పుండరీకాక్షునిం బూజింపుచుం బరలోకంబును బొందు.
అని పలికి విప్రుండు మఱియు నిట్లనియె. 163

అధ్యాయములు - ౧౩; ౧౪

సీ. ధరణీశ! మాయచేతను దాఁటఁగారాని పథమునఁ బెట్టంగఁ బడ్డ జీవుఁ
డెలమిమై గుణకర్మములఁ జేయుచును లాభ మాశించి [1]తిరిగెడు నర్థ్యమాఢ్య
ఫల మపేక్షింపుచుఁ బాయక జీవుండు సంసారగహన సంచారి యగుచు
ననవరతము నుండు నా మహోవనమందుఁ గామలోభాది తస్కరులు గూడి

తే. ధరణి విజితేంద్రియుఁడు గాని నరునిఁ బట్టి
ధర్మమనియెడి యా మహాధనము నెల్ల
నరసి గొనిపోవుచుండుదు రనుదినంబుఁ
గాన సంసారమందు నాకాంక్ష వలదు. 164

క. అరయఁగ సంసారాటవిఁ, దరలక యీ పుత్ర మిత్ర దారాదు లనం
[2]బరఁగుచునుండెడు వృకములు, పరువడి [3]నర బస్తులను భక్షించు వడిన్. 165

తరల. మలసి సంస్కృతి ఘోరకానన మందిరంబుల నెల్లచోఁ
జెలఁగి గుల్మలతా తృణాదులచేత గహ్వర మైన ని
శ్చల నికుంజములందు దుర్జనసంజ్ఞలం గల మఱికం
బుల నిరోధము దమ్మి సోఁకినఁ బొందుచుందురు దుర్దశఁ. 166

ఆ. మఱియు నీ గృహస్థమార్గంబునం దెల్ల
విషయములను బొంది విశ్వమెల్ల
గణఁకతోడ నిట్లు గంధర్వనగరంబు
గాఁ దలంచి మిగుల మోద మందు. 167

---

1. తిరుగుబేహారిమాడ్కి (క) 2. బరగెడుమాయా వృకములు (క. చ. త.) బరఁగుగోమా
యువృకములు (హ) 3. మానవునిదిగిచి (ట)

ఆ. మరగి కాననమునఁ గొఅవిదయ్యముఁ గాంచి
యగ్నిఁ గోరి వెంట నరుగుమాడ్కిఁ
గాంచనంబుఁ గోరి కలవారి యిండ్ల పం
చలను దిరుగు నరుఁడు చలనమంది. 168

ఆ. బహుకుటుంబి యగుచు బహుధనాపేక్షల
నెండమావులఁ గని యేఁగు మృగము
కరణిఁ బ్రేమఁజేసి పరువులువాఱుచు
నొక్కచోట నిలువకుందు రెపుడు. 169

ఆ. మఱియు నొక్కచోట మత్తుఁ డై పవన ర
జోహతాత్ముఁ డగుచుఁ జూపు దప్పి
దిక్కులుంగ కొండుదిశ కేఁగు పురుషుని
కరణిఁ దిరుగు నరుఁడు నరవరేణ్య! 170

వ. మఱియు నొక్కచోట నులూక ఝిల్లీస్వనంబులతోడ సమానంబు లైన శత్రు రాజి తిరస్కారవచనంబులకు దుఃఖపడుచు, నొక్కచోట క్షుధార్దితుం డై యపుణ్యవృక్షంబుల నాశించుమాడ్కిఁ బాపకర్మ్ములు, ద్రవ్యహీనులు నగువారి నాశ్రయించుచు, నొక్కయెడం బిపాసాపరుం డై జలహీనం బైన నదికిఁ జనినరీతి నిరాపరదూరు లైన పాషండుల సేవింపుచు, మఱియు నొక్క ప్రదేశంబునం దగ్నిచేతఁ దప్తుం డైనవాఁడు దావాగ్నిం జేరి వ్యథ నొందురీతి నన్నార్థి యగుచు, దాయాదులం జేరి దుఃఖించుచు, మఱియు నొక్కచోట పరబాధంజేసి మున్ను గానక రాజ్యాభిలాషం బ్రాణసఖు లైన పితృ పుత్ర భ్రాతృ జ్యేష్ఠుల నైనను వధియింపుచు, మఱియు శూరులచేతం గొట్టువడి, సర్వధనంబును బోనాడి చింతాపరవశుం డై దుఃఖింపుచు నున్నంత, గంధర్వ నగర ప్రాయం బైన సంసారసుఖంబు లనుభవించి, మోదింపుచు, మఱియు నగారోహణంబు సేయు నరుండు కంటక పాషాణాదులవలనం బాదపీడితుం డగుచు దుఃఖించుచందంబున గృహాశ్రమోచిత మహానుష్ఠానంబునకు నుపక్రమించి, వ్యసనకంటక శర్కరాపీడితుం డై దుఃఖింపుచు, నొక్కచోటం జరరాగ్ని పీడితుం డై కుటుంబంబుమీఁద నాగ్రహింపుచు, వనంబున [1]నజగర గృహీతుం డై నిగీర్ణుం డైన చందంబున రాత్రి గృహాటవియందు నిద్రాపరవశుం డై యెఱుంగక యుండుచు, మఱియును వనంబునం దృణచ్ఛన్న కూపపతితుం

---

1. నజగరగిళితుం డై జీర్ణితుం డై (హ)

డగుచు సర్పదష్టుం డైన తెఱంగున సంసారి యై దుర్జనులచేత వ్యధిత హృదయుం డగుచు, నంధుం డై యజ్ఞానాంధకూపంబునం బడుచు, నొక్కయెడ జుంటితేనియకు నై మక్షికాబాధ నత్యంత దుఃఖితుం డైన మాడ్కిని సంసార కాముం డై పరదార ద్రవ్యాభిలాషి యగుచు, భూపాలకులచేత నైనను, గృహ పతి చేత నైనను, దాడితుం డై నరకంబునఁ బడుచుండు. యౌవనంబున సంపా దించిన ద్రవ్యంబులు పరులచేతం బోనాడిన విధంబున, శీతవాతా ద్యనేక ప్రయాసలబ్ధం బైన ధనంబులు వోనాడి, సంసారి, యతి చింతాక్రాంతుం డై యుండు. మఱియును వనంబున లుబ్ధకులు సంస్పృష్టం బైన యల్పామిషంబునకు నన్యోన్యవైషమ్యంబునం గలహించిన విధంబున, సంస్పృష్టవ్యవహారి యై, యల్ప ద్రవ్యంబులకుం బోరాడుచుండు. అని భూపాలునకు విప్రుండు సంసారాటవితెఱం గెఱింగించి వెండియు నిట్లనియె. 171

ఆ. అల్పధనుఁడు విశ్రమాస్థానములఁ దృష్టిఁ
బొంద కొరులధనముఁ బొందఁగోరి
యరిగి వారివలన నవమానములఁ బొంది
యధిక మైన దుఃఖ మనుభవించు. 172

ఆ. అంతఁ గొంద ఱల్ల నన్యోన్యవిత్తాది
వినిమయమునఁ గడుఁ బ్రవృద్ధ మైన
వైరములను బొంది పోరాట నొందుదు
రాత్మచింత లేక యనుదినంబు. 173

సీ. సంసారమార్గ సంచారుఁ డై యధికప్ర యాసంబునను గూర్చు నర్థములను
విహరింపుచును గొంద టిహలోకఫలములఁ గోరి మోక్షంబును గోర కంతఁ
జెడిపోవుచుందు రెప్పుడు గాని యందుకుఁ గడపటి యోగంబుఁ గానలేరు
మానవంతులు నసమాన శౌర్యులు నగు వారు మిక్కిలి యైన వైరబుద్ధి

తే. నాహవంబున మడియుదు రంతెకాని
మోక్షమార్గంబు గానరు మూఢవృత్తి
ననుచు సంసార గహన విహార మెల్లఁ
దెలిపి క్రమ్మఱ ననియె ధాత్రీసురుండు. 174

వ. మఱియుం గాలచక్ర నియంత్రితుం డై చక్రాయుధునిం గొల్వక, కాక గృధ్ర బక సమానుం లైన పాషండులతో సఖ్యంబునంజేసి వారలచేత వంచితుం డై, బ్రాహ్మణ కులంబునం జేసి శ్రౌత స్మార్త కర్మానుష్ఠానపరుం డై, విషయ సుఖం

బులందుఁ దగులంబడి కాలంబుతుద నెఱుంగక, [1]వృకంబులుం బోలె నైహికా
ర్థంబులయందుఁ దృష్ణగలిగి, మైథుననిమిత్తంబు సుత దారాదులయందు
స్నేహంబు సేయుచు, పథికుండు మాతంగంబులయందు భయంబున దీర్ఘ నిమ్న
కూపంబునం బడిన తెఱంగున, సంసార మృత్యుగజ భయంబున గిరికందర
ప్రాయం బైన యజ్ఞాన తమంబునం బడుం. కావున మాయచేత సంసారమార్గం
బైన రాజభావంబు విడిచి, సర్వభూతమైత్రి గలిగి, జితేంద్రియుండ వై జ్ఞానా
సిచే మార్గంబు కడపలఁ గనుము. అని పలికిన భూపాలుం డిట్లనియె. 175

క. అక్కట ! మానుషజన్మం, [2]బెక్కువ యై యుండు నెపు డభేదమతిఁ బెం
పెక్కిన యోగిసమాగమ, మక్కజముగఁ గలిగెనేని యఖలాత్ములకున్. 176

క. ధరణీసురవర ! నీ శ్రీ, చరణాంబుజ యుగళ రేణు సంస్పర్శము నా
దురితంబు లడఁచె నింతట, హరిభక్తియు మిగుల నాకు నధికం బయ్యెన్. 177

వ. మఱియు విప్రవరులయందు యోగీశ్వరు లవధూత వేషంబునం జరియింపు
చుందురు. కావున విప్రులు పిన్నలు పెద్ద లనక యందఱికి నమస్కారం బని స్తుతియిం
చిన, నా యోగీశ్వరుండును సింధుపతికిఁ గరుణాన్వితుం డగుచుఁ దత్త్వజ్ఞానం
బుపదేశించి. యా రాజుచేత వందితచరణుం డై, పూర్ణార్ణవంబునుం బోలె
సంపూర్ణ కరుణారసపూరిత స్వాంతుం డై, వసుంధరం జరియింపుచుండె. సింధు
భూపతియును సుజన సమాగమంబున లబ్ధ తత్త్వజ్ఞానుం డై దేహాత్మ భ్రమం
బాసె. అని పలికి శుక యోగీంద్రునకుఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 178

చ. అరయఁగ మఱికంబు వినతాత్మజుఁ గూడఁగలేని రీతి నీ
భరతుని సచ్చరిత్రములు ప్రస్తుతి సేయఁగ నీ వసుంధరన్
నరపతు లెల్ల నోపరు మనంబున నైనను నెంచ నింక నా
భరతుని పుణ్యవర్తనముఁ బ్రస్తుతిసేయఁగ నాకు శక్యమే? 179

వ. నరేంద్రా ! భరతుండు సుత దార రాజ్యాదులను పూర్వకాలంబునంద, విడిచి
భగవత్పరుం డగుచు, యజ్ఞరూపంబును, ధర్మ స్వరూపంబును, సాంఖ్యయోగం
బును, ప్రకృతిపురుష స్వరూపంబు నైన నారాయణునకు నమస్కారం బనుచు
మృగరూపంబునుం బాసె. అట్టి భరతుని చరిత్రం బెవ్వరు నెప్పిన, నెవ్వరు వినిన,
నట్టివారలఁ బుండరీకాక్షుండు రక్షించు. ఆయు రభివృద్ధియు. ధన ధాన్య
సమృద్ధియు నగుచుండ, స్వర్గోపభోగంబులం బొందుదురు. అని. 180

---

1. వృకంబులుంబోలె (క.చ.ట.) 2. ఎక్కువయైయుండు చాలహితమతితో (క.ట.త.జ.)
ము. పెక్కువయై (తం. వా.)

మ. †నర దేవాసుర యక్ష రాక్షస మునీంద్ర స్తుత్య ! దివ్యాంబరా
భరణాలంకృత ! భక్తవత్సల ! కృపాపారీణ ! వైకుంఠ మం
దిర ! బృందావన భాసుర ! ప్రియధరిత్రీనాథ ! గోవింద ! శ్రీ
కర ! పుణ్యాకర ! వాసుదేవ ! త్రిజగత్కళ్యాణ ! గోపాలకా ! 181

క. పరమపదవాస ! దుష్కృత, హర ! కరుణాకర ! మహాత్మ ! హతదితిసుత ! భా
సురగోపికా మనోహర !, సరసిజదళనేత్ర ! భక్తజననుత గాత్రా ! 182

మాలిని :— సరస హృదయవాసా ! చారు లక్ష్మీవిలాసా !
భరిత శుభచరిత్రా ! భాస్కరాబ్జారినేత్రా !
నిరుపమ ఘనగాత్రా ! నిర్మల జ్ఞానపాత్రా !
గురుతర భవదూరా ! గోపికా చిత్త చోరా ! 183

గద్య. ఇది సకల సుకవిజనానందకర బొప్పనామాత్యపుత్ర గంగనార్య ప్రణీతం బైన శ్రీ మహాభాగవత పురాణంబునందు ప్రియవ్రతుని సుజ్ఞాన దీక్షయు, బ్రహ్మ దర్శనంబును, ఆగ్నీధ్రాదుల జన్మంబును, ఉత్తమ తామస రైవతుల జన్మంబును, ప్రియవ్రతుండు వనంబునకుం జనుటయు, ఆగ్నీధ్రుం డప్సరఃస్త్రీనిఁ బరిగ్రహిం చుటయు, వర్షాధిపతుల జన్మంబును, ఆగ్నీధ్రుండు వనంబునకుం జనుటయు, నాభిప్రముఖుల రాజ్యంబును, నాభి యజ్ఞంబును, ఋషభుని జన్మంబును, ఋషభుని రాజ్యాభిషేకంబును, భరతుని జన్మంబును, ఋషభుండు తపంబు నకుం జనుచు సుతులకు నతుల జ్ఞానం బుపదేశించుటయు, భరతుని పట్టాభిషే కంబును, భరతుండు వనంబునకుం జనుటయు, భరతుండు హరిణపోతంబు నందుఁ బ్రీతిఁ జేసి హరిణ గర్భంబున జనించుటయు, మఱల విప్రసుతుం డై జనించుటయు, విప్రుండు చండికా గృహంబున బ్రతికి వచ్చుటయు, సింధుపతి విప్ర సంవాదంబును, అను కథలం గల పంచమ స్కంధంబునందుఁ బ్రథమా శ్వాసము సంపూర్ణము.

—❸—

† ఈ యాశ్వాసాంత పద్యములును గద్యయు తా. ప. ప్రతులలో లేవు. దీనిని బట్టి పంచమ స్కంధము నందలి రెండాశ్వాసములును గలిసి ఒకే యాశ్వాసముగా నుండినట్లు భావింపవలెను.

ఓమ్

శ్రీ మహా భాగవతము

పంచమ స్కంధము

ద్వితీయాశ్వాసము

క. †శ్రీకాంతా హృదయప్రియ!, లోకాలోకప్రచార! లోకేశ్వర! సు
శ్లోక భవభయనివారక!, గోకులమందార! నందగోపకుమారా! 1

అధ్యాయము - ౧౫

వ. †సకల పురాణార్థజ్ఞాన విఖ్యాతుం డగు సూతుం డిట్లనియె. 2

క. మునులార! బాదరాయణి, యనఘాత్మకుఁ డైన యుత్తరాత్మజునకు స
ద్వినయోక్తి భరతుచరితము, వినుపింపుచు మఱియు నిట్లు వినుపించెఁ దగన్. 3

ఆ. పార్థివేంద్ర! యట్లు భరతాత్మజుం డైన
సుమతి ధర్మవర్తనమునఁ దిరుగ
నది యొఱింగి దుష్టు లైన పాషండులు
దమ మతంబు మిగులఁ దలఁచి పొగడి. 4

క. ధరణీ వల్లభ! నిన్నును, నిరతంబును బుద్ధదేవునిం గొలిచిన యా
తెఱఁగునఁ గొలిచెద మని భా,సురమతి బోధించి రపుడు సుమతిం బ్రీతిన్. 5

వ. ఇట్లు పాషండబోధితుం డైన సుమతికి ధ్రువసేనయందు దేవతాజి త్తను
పుత్రుండు జనించె. వానికి దేవద్యుమ్నుం డను సత్పుత్రుం డాసురియం దుద
యించె. అ మ్మహాత్మునకు ధేనుమతియందుఁ బరమేష్ఠి జనియించె. అతనికి
సువర్చలయందు ప్రతీహుం డనువాఁడు సుతుం డయ్యె. అ ప్పరమపురుషుండు
సకల జనులకు బ్రహ్మోపదేశంబు సేసి, తాను శుద్ధాత్ముం డై, హరిస్మరణ సేయుచు
యజ్ఞకరణ నిపుణు లగు ప్రతిహర్త ప్రస్తోత ఉద్గాత యను సత్పుత్రులం గాంచె.
ఆ ప్రతిహర్తకు స్తుతియందు వ్యోమ భూమ నామక పుత్రద్వయం బుత్పన్నం

---

† తా. ప. ప్రతులలో లేదు.

బయ్యె. అందు భూమునకు ఋషికుల్యయందు నుద్గీథుం డను సుతుండు జనించె. అతనికి దేవకుల్యయందుఁ బ్రస్తోత గలిగె. ఆ ప్రస్తోతకు వరరుత్సయందు విభుం డను తనయుం డుద్భవించె. అతనికి భారతియందు పృథుషేణుం డుదయించె. అతనికి నాకూతియందు నక్తుండు గలిగె. ఆ నక్తునకు రాజర్షి శ్రేష్ఠుం డగు గయుం డను మహోకీర్తి సంపన్నుం డుదయించె. 6

ఆ. [1]ఆ గయుండు లీల నఖిలజీవులఁ బ్రోవఁ
దలఁచి సాత్వికప్రధాన మైన
యట్టి మేను దాల్చి యాత్మ తత్త్వజ్ఞానుఁ
డగుచునుండె హరి నిజాంశమునను. 7

వ. †(ఇట్టి మహనీయ సుగుణాకరుం డగు గయుని గాథానువర్ణనంబు పురావిదు లగు మహాత్ములచే నీ తెఱంగున నుతింపఁ బడుచున్నది. సావధాన మనస్కుండ వై యాలకింపుము. అని యిట్లనియె.) 8

సీ. ధర్మమార్గంబున ధారుణి జనులను బ్రేమతోఁ బోషణ ప్రేషణోప
లాలన శాసన లక్షణాదులచేతఁ బోషింపుచును యజ్ఞములను యజ్ఞ
పురుష నీశ్వరుఁ జిత్తమున నిల్పి సేవించి స్వాంతమం దున్న యీశ్వరునిఁ గాంచి
యఖిలజీవతతికి నానంద మొసఁగుచు [2]నిరభిమానంబున నేల యేలె

తే. సత్యమందు మిగుల సత్సేవయందును
ధర్మమందు యజ్ఞకర్మమందు
గయుఁడు వసుధలోనఁ గంజాతుఁడే కాని
మానవుండు గాఁడు మానవేంద్ర! 9

వ. అట్టి *(మహాపురుష గుణగణ పరిపూర్ణుం డగు) గయునికి (దక్షకన్యక లగు) శ్రద్ధా మైత్రి దయాదులు దమయంత వచ్చి కోరిక లొసఁగ, నతని ప్రజలకు వసుంధర కామధేను వై పితుక, వేదంబులు సకల కామంబుల నిచ్చుచుండ, సంగరంబున భంగంబు నొందిన రాజు లప్పనంబు లొప్పనంబు సేయ, విప్రులు ధర్మం బాఱవపాలు పంచి నిరంతర సోమపానంబును, శ్రద్ధాది శుద్ధభక్తి యోగంబునుం గలిగి యొనర్చు యజ్ఞంబుల నింద్రాదిదేవతలు తృప్తు లై యజ్ఞఫలంబుల నొసంగ, బ్రహ్మాది తృణ గుల్మ లతాపర్యంతంబు సకలలోకంబుల

---

1. అట్టిగయునివలన (హ) † ఈ వచనము వ్రాఁతప్రతులలో లేదు. హ. తం. వా. లలోకలదు. మూలములో 9 వ సీసపద్యము తరువాతఁ గలదు. 2. నిరభిమానత మెయి (తం. వా.)

* తా. ప. ప్రతులలో లేదు.

వారినిఁ దృప్తిం బొందింపుచు, శ్రీహరిం దృప్తిఁ బొందఁజేయుచు, గయుండు పెక్కుకాలంబు రాజ్యంబు నేలె. (అట్టి గయునికి జయంతియందుఁ జిత్రరథ, స్వాతి, అవరోధను లను మువ్వురు కొడుకులు పుట్టిరి. ఆ చిత్రరథునికి నూర్ణ యందు సమ్రాట్టును, వానికి [1]నుల్కయందు మరీచియు, ఆ మేటికి బిందు మతియందు బిందుమంతుఁ డనువాఁడును, ఆ బిందుమంతునకు *(సరఘు)యందు మధువును, మధువునకు (సుమన స్సనుదానియందు) వీరవ్రతుండును, ఆ వీర వ్రతునకు భోజయందు మన్యు ప్రమన్యు లను నిరువురును, నందు మన్యువునకు సత్యయందు భువనుండును, నతనికి దోషయందుఁ ద్వష్టయు, నా త్వష్టకు విరోచన యందు విరజుం డనువాఁడును జనించిరి. అంత. 10

క. ఆ విరజున కుదయించిరి, భూవినుత ! [2]విషూచియందుఁ బుత్రశతంబు
న్నావల నొక కన్యకయు, న్నా వేళ సమస్తజనులు హర్షం బందఁ. 11

క. ఘనుఁడు ప్రియవ్రతు వంశం,బునకుం దుద యైె విరజుఁడు భూవిభు వంశం
బును దా నలంకరించెను, విను మింద్రావరజుఁ డైన విష్ణుని మాడ్కిఁ. 12

అధ్యాయము - ౧౯

క. అని పలికిన శుక యోగిం, గనుఁగొని యభిమన్యు సుతుఁడు గడు మోదముతో
వనజదళాతుని మహిమలు, విని సంతసమంది యనియె వేడుక మటియుఁ. 13

వ. మునీంద్రా ! సూర్యరశ్మి యెందాఁకం బ్రవర్తిల్లు, నక్షత్రయుక్తంబు లైన చంద్ర కిరణంబు లెంతమేరఁ దిరుగు, నంతదూరంబు ప్రియవ్రతుని రథనేమి ఘట్టనలచేత సప్తద్వీపంబులును, సప్తసముద్రంబులు నయ్యె నని పలికితివి. ఆ ద్వీప సముద్రంబుల పరిమాణంబులు సవిస్తరంబులుగా నెఱింగింపుము. గుణమయంబును, స్థూలరూపంబును నైన శ్రీహరి శరీరం బగు నీ లోకంబు నందు నిలిపిన చిత్తం బగుణంబును, సూక్ష్మంబును, నాత్మజ్యోతియు, బ్రహ్మంబు నైన వాసుదేవునియందు నిల్పుం గావున, ద్వీపవర్షాది విస్తారంబు వినిపింపుము. అనిన శుక యోగీంద్రుం డిట్లనియె. 14

క. ధరణీవల్లభ ! విను శ్రీ, హరి మాయాగుణ విభూతు లగు జలనిధులుఁ
బరఁగిన దీవులు వర్షము, లరయంగాఁ గొలఁది వెట్ట నలవియె ! జగతిఁ. 15

ఆ. తెలిసినంత[3]వట్టుఁ దెలిపెద సంక్షేప
మునను జిత్తగించి వినుము దెలియ
ననుచుఁ జెప్పఁ దొడఁగె నభిమన్యు సుతునకు
[4]నింపుగాను శుకమునీంద్రుఁ డిట్లు. 16

---

1. ఉత్కళ (హ. తం. వా.) * తా. ప. ప్రతులలో లేదు. 2. జితారిలోక (క. చ. ట.)
3. నేను (హ. తం. వా.) 4. రమణతోడ బాదరాయణుండు (చ. ట. త. జ. డ. ద. బ.)

—: శుకయోగివరుం డుపదేశరూపముగాఁ దెలుపు భూగోళస్వరూపాది నిర్ణయము :—

వ. నరేంద్రా ! జంబూద్వీపంబు భూపద్మంబునకు మధ్యప్రదేశంబున లక్షయోజనంబుల వెడల్పు, నంతియ నిడుపునుం గలిగి, కమలపత్రంబునుం బోలె వర్తులాకారంబై (నవసహస్రయోజన పరిమితాయామంబు గల) నవవర్షంబులు నష్టమర్యాదాగిరులునుం గలిగి విభక్తం బై యుండు. అందు మధ్యమవర్షం బిలావృతవర్షం బగు. అందు మధ్యప్రదేశంబున సువర్ణమయం బై. 17

క. భూపద్మమునకు మేరువు, దీపించుచుఁ గర్ణికాకృతిని బెం పగుచుం
ప్రాపై కులగిరిరాజుగఁ, జూపట్టును సురగణాళి చోద్యం బందన్. 18

సీ. మఱియును ద న్మేరుగిరి లక్షయోజనోన్నత మగుచుండి యా [1]నడిమిదళము
విదిత మై పదియాఱువేల యోజనములు నంతియపాఁతు నై యతిశయిల్లు
నా మీఁద విస్తార మరయ ముప్పదిరెండు వేల యోజనముల వెలసియుండు
నా గిరి కుత్తరంబందు నీల శ్వేత శృంగపర్వతములు నింగిముట్టి

ఆ. యుండు రెండువేలయోజనంబుల దాఁకఁ
బఱపు గలిగి పూర్వపశ్చిమాయ
తంబు దక్షిణోత్తరంబును విస్తార
మగుచు మిగుల రమ్య మై నరేంద్ర ! 19

వ. ఇట్లు పూర్వపశ్చిమంబుల లవణసాగరాంతంబు లై యున్న సీమా పర్వతంబులయందు నీల శ్వేత శృంగవత్పర్వతంబులు నిడివిని †యథాక్రమంబున దశమాంశన్యూనప్రమాణ యోజనములు గలవిగా నుండు. వీని మధ్యప్రదేశంబున రమ్యక, హిరణ్మయ, కురువర్షంబులను నామంబులుగల వర్షంబులుండు. వాని విస్తారంబులు నవసహస్రయోజనంబులుగలిగి, లవణసముద్రాంతంబులై క్రమంబున నీలాదిపర్వత దీర్ఘపరిమాణంబుల నుండు. ఇలావృత వర్షంబునకు దక్షిణంబున నిషధ హేమకూట హిమవత్పర్వతంబు లను సీమా పర్వతంబులును, పూర్వపశ్చిమంబులు నిడుపును, దక్షిణోత్తరంబులు విశాలంబును నగుచు, నా నీలాది పర్వతంబులతీరున నుండు. ఆ గిరుల మధ్యప్రదేశంబున కింపురుషవర్ష హరివర్ష భారతవర్షంబు లను నామంబులు గల వర్షంబు లుండు. ఆ యిలావృత వర్షంబునకుఁ బశ్చిమంబున మాల్యవత్పర్వతంబును, పూర్వభాగంబున గంధమాదనంబును, సీమాపర్వతంబులు. పూర్వపశ్చిమంబులు నిడుపును, దక్షిణోత్తరంబులు విశాలంబులు నగుచు నీల

---

1. నడిమియిమ్మ (క. బ.)
† "ఉత్తరోత్తరో దశాంశా దధికాంశేన హ్రస్వ ఏవ హ్రాసంతి" (16-7)

పర్వత నిషధ పర్వతంబులం గదిసి, ద్విసహస్రయోజనంబుల విస్తారం బై యుండు మాల్యవత్పర్వతంబు పశ్చిమసముద్రాంతం బై కేతుమాలవర్షంబును, గంధమాదనపర్వతంబునకుఁ బూర్వభాగంబున సముద్రాంతం బగుచు భద్రాశ్వ వర్షంబును, మేరువునకుం దూర్పున మందరపర్వతంబును, దక్షిణంబున మేరు మందరపర్వతంబులును, బడమటి పార్శ్వంబుల నుత్తరమునం గుముదపర్వతంబు లను నామంబులు గలిగి, యయుతయోజనోన్నతంబు లై మేరునగం బను మధ్యోన్నత *(మేధి) స్తంభంబునకుం జతుర్ముఖంబుల హ్రస్వస్తంభంబులను బోలియుండు. నా చతుస్స్తంభంబులయందును పర్వతశిఖరంబుల వెలుఁగొందు కేతువులునుంబోలె చూత జంబూ కదంబ న్యగ్రోధంబు లను వృక్షరాజంబులును, క్రమంబున నొండొంటికి నేకాదశ శతయోజనాయతంబును, నంతియ విస్తా రంబునుం గలిగియుండు. మఱియు నా పర్వతశిఖరంబులఁ గ్రమంబునం బయో మధ్విక్షురస మృష్టజలంబులం గలిగి, శతయోజన విస్తారంబు లైన సరోవరంబులు తేజరిల్లు. అందు సుస్నాతు లగు వారలకు యోగైశ్వర్యంబులు స్వభావంబునం గలుగు. మఱియు నందన చైత్రరథ వైభ్రాజిక సర్వతోభద్రంబు లను నామంబులం గల దేవోద్యానంబు, ఆ పర్వతశిఖరంబుల వెలుఁగొందుచుండు. అందు దేవతాగణంబులు దేవాంగనలం గూడి గంధర్వుల గీతనృత్యంబులు గనుంగొనుచు విహరింతురు. 20

ఉ. మందరపర్వతంబు తుది మామిడిపం డ్లమృతోపమాన మై
మందరశై ల [1]శృంగక సమానము లై గిరిమీఁద రాల మా
కంద ఫలామృతంబు గలఁగంబడి జాఱి మహాప్రవాహ మై
యం దరుణోద నామమున నద్భుత మై విలసిల్లు నెంతయున్. 21

చ. కడు మధురంబునన్ సురభిగంధముచే నరుణప్రకాశత
వడిగొని మందరాచలము వంతల చెంతల జాఱి యంతలోఁ
దొడి తొడి నా యిలావృతముఁ దోఁచుచు వింతగఁ బూర్వవాహి యై
[2]నడుచుఁ దరంగసంతతుల నందఱి నచ్చటఁ జేయు ధన్యులన్. 22

ఆ. ఆ నదీజలంబు [3]లాడిన యచ్చటి
యంబికానుచరుల యంగగంధ
మంది పవనుఁ డంత మనుజేశ ! పదియోజ
నములు సుట్టు పరిమళముల నింపు. 23

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. శృంగముల మానము లై (ట. త. జ.)
2. అడరు (తం. వా.) నడచుతరంగలన్ సురగణంబుల ధన్యుల జేయుచుండగన్ (క.ద.)
3. .... ఆనినవారలు సుఖులు చటులపుణ్య శుభము వృద్ధిబొంది దివ్యగంధ మందంద శత యోజనముల బరిమళించు రమణతోడ (క. త. ద. బ.)

ఆ. మేరుమందరముల మీఁద జంబూఫలం
బులు మహాగజోపములుగ వ్రాలి
యవిసి యంతఁ ద ద్రసామృతం బల్లన
య మ్మహానగంబులందుఁ బొడమి. 24

క. అనుపమ మగు జంబూనది, యను పేరను వెలసి లీల నరుగుచు నంతం
ఘనత నిడువృతవర్ష ము, పనుపడఁ దలాపుచును ధరణిఁ బ్రవహించుఁ దగన్. 25

ఉ. ఆ నదినీటఁ దోఁగి [1]పద నై యటు మృ త్తనిలార్క సంగతిన్
బూని కడున్ విపాకమునఁ బొందుచు శుద్ధ సువర్ణ [2]జాతి జాం
బూనదనామ మొంది సురముఖ్యుల కెల్లను భూషణార్హ మై
మానుగ వన్నె మించి కడు మంచిది యై విలసిల్లు నెంతయున్. 26

వ. మఱియు సుపార్శ్వ నగాగ్రంబునందుఁ *(బంచవ్యామ పరీణాహ బంధురంబు)
లగు నై దు మధుధారా ప్రవాహంబులు పంచముఖంబుల వెడలి, సుపార్శ్వ నగ
శృంగంబులం బడి, యిలావృతవర్ష ంబు పశ్చిమభాగంబుఁ దడుపుచుం బ్రవహించు.
ఆ తేనియ యనుభవించువారల ముఖమారుత సుగంధంబు శతయోజన పర్యం
తంబు పరిమళించు. 27

సీ. §కుముదపర్వత శిఖాగ్రమున నుత్పన్న మై కనుపట్టు వటతరు స్కంధములను
నుపయించునట్టి పయో దధి ఘృత మధు గుడ విశిష్టాన్నంబు లొడిక మైన
యంబర శయ్యాస నాభరణాది వ స్తువులు గోరికలు దీర్చుచును గుముద
పర్వతాగ్రంబునఁ బడి యిలావృతవర్ష మున జనులకు నెల్ల భోగ్యములను
ఆ. వదల కొసఁగు వారి వళిపలితంబులు
[3]దలఁగు స్వేదగంధములును బాయు
మరణభయము ముదిమి బొరయ దెన్నఁడును శీ
తోష్ణబాధ చెందకుండు నధిప! 28

ఆ. దేవదానవులును దివ్యమునీంద్ర గం
ధర్వ లాదిగాఁగఁ దగిలి యాశ్ర
యించియుందు రా గిరీంద్రమూలమునందు
హర్ష మంది ఘన విహారలీల. 29

---

1. పదనై దగు మృత్తికలర్క సంస్పృశన్(డ) పదనందిన మేదినినర్క(బ) 2. కాంతి (క.చ. ట. డ. ద.) * తా. ప. ప్రతులలోలేదు. § కుముద నిరూఢో య శ్శతవల్కోనామ వట స్తస్య స్కంధేభ్యో నీచీనాః పయోదధి ఘృతమధు గుడాన్నా ద్యంబర శయ్యాసనాభరణోదయ స్సర్వ ఏవ కామదుఘా నదాః, (16-19) 3. తొలుగుదుష్ట (హ)

వ. నరేంద్రా! †మేరునగేంద్రంబునకుఁ బూర్వభాగంబున జఠర దేవకూటంబులుఁ బశ్చిమంబునం బవనపారియాత్రంబులు ననుపర్వతంబులు నాలుగు, నొండొంటికి దక్షిణోత్తరంబుల నష్టాదశసహస్ర యోజనంబుల నిడుపును, బూర్వపశ్చిమంబుల ద్విసహస్రయోజనంబుల వెడల్పును నగుచు దక్షిణంబునఁ గైలాస కరవీరంబులును, ఉత్తరంబునఁ ద్రిశృంగ మకరంబులును ననునామంబులు గల దక్షిణోత్తర పర్వతంబులు నాలుగును, బూర్వపశ్చిమంబుల నష్టాదశసహస్ర యోజనంబుల నిడుపును, దక్షిణోత్తరంబుల ద్విసహస్రయోజనంబుల వెడల్పును నగుచు, నగ్ని పురుషునకుం బ్రదక్షిణం బగుచున్న పరిస్తరణంబుల చందంబున మేరువునకుం బ్రదక్షిణంబుగా నష్టనగంబులు నిలిచియుండు. మేరుశిఖరంబున దశసహస్రయోజనంబుల నిడుపు, నంతియ విస్తారంబు నగుచు సువర్ణమయం బైన బ్రహ్మపురంబు తేజరిల్లుచుండు. ఆ పట్టణంబునకు నష్టదిక్కులయందును లోకపాలుర పురంబులుండు. 30

అధ్యాయము - ౧౯

క. పరమేష్ఠి పట్టణంబున, హరి మున్ను త్రివిక్రమణము లంద సర్వే
శ్వర చరణాగ్రనఖాహతిఁ, బరువడి నూర్ధ్వాండ మంతఁ బగిలె నరేంద్రా! 31

వ. ఇట్లు చరణ నఖస్పర్శం జేసి భేదింపంబడ్డ యూర్ధ్వకటాహ వివరంబువలన నంతఃప్రవేశంబు సేయుచున్న బాహ్యాజలధార శ్రీహరి పాదస్పర్శం జేయుచుం జనుదెంచి, సకలలోకజనంబుల దురితంబులు వాపుచు [1]భగవత్పది యను పేరందేజరిల్లు. దీర్ఘకాలంబు స్వర్గంబున విహరింపుచు విష్ణుపదంబున నుత్తానపాద పుత్రుండునుం, బరమభాగవతుండు నైన ధ్రువుండు తనకులదేవత యైన శ్రీహరి పాదోదకంబు ప్రతిదినంబును భక్తియోగంబున నిమీలితనేత్రుం డై, యానంద బాష్పంబుల రోమాంచితగాత్రుం డై యత్యాదరంబున నేఁడును శిరంబున ధరియింపుచు నున్నవాఁడు. అతనికి నధోభాగంబున నుండు మండలాధిపతులైన సప్తర్షులును హరి పాదోదక ప్రభావంబు నెఱింగి (తాము పొందు) తపస్సిద్ధి యాకాశ గంగాజలంబుల స్నాతులగుటయే యని సర్వభూతాంతర్యామియగు నీశ్వరునియందు భక్తి సలిపి, యితరపదార్థాపేక్ష సేయక మోక్షార్థి ముక్తిమార్గంబు బహుమానంబు సేయుతెఱంగున బహుమాన యుక్తంబుగాఁ దమ జటాజూటంబులయందు నేఁడును ధరియింపుచుండుదురు. 32

---

† కురంగ కురర కుసుంభ వైకంకత త్రికూట శిశిర పతంగ రుచక నిషధ శితివాస కపిల శంఖాదులైన పర్వతంబులు మేరుపర్వత కర్ణికకుఁ గేసరంబులై పరివేష్టించియుండు. (తం. వా.)

1. భగవత్పాది (హ. తం. వా.)

సీ. అంత నసంఖ్యంబు లైన దివ్యవిమాన సంకులంబులను విశాల మైన
దేవమార్గంబున దిగివచ్చి చంద్రమండలముఁ దోఁచుచు మేరునగ శిఖాగ్ర
మునను నా బ్రహ్మదేవుని పట్టణమునకు వచ్చి యందులఁ జతుర్ద్వారములను
వరుసతో దీర్ఘప్రవాహంబు లగుచును బ్రవహించి యమలప్రభావములను

ఆ. నరుగు లవణసాగరాంతంబులుగ నాల్గు
మోములందు ‡నాల్గునామములను
దన్నుఁ గన్నవారిఁ దనవారిఁ దోఁగిన
వారి కెల్ల నమృతవారి యగుచు. 33

వ. అందు సీత యనుపేర వినుతి నొందిన య మ్మహానదీ ప్రవాహంబు బ్రహ్మసదన పూర్వద్వారంబున వెడలి, కేసరావలయంబుం దడుపుచు గంధమాదనాద్రికిం జని, భద్రాశ్వవర్షంబుం బావనంబుసేయుచుఁ బూర్వ లవణసాగరంబునం బ్రవేశించు. చక్షు వనుపేరఁ దేజరిల్లెడు దీర్ఘప్రవాహంబు పశ్చిమద్వారంబున వెడలి, మాల్యవత్పర్వతంబునం బడి, కేతుమాలవర్షంబుఁ బవిత్రంబుసేయుచుఁ బశ్చిమ లవణార్ణవంబునం గలయు. భద్ర యనుపేర వెలుఁగొందిన యతుల ప్రవాహం బుత్తరద్వారంబున వెడలి, కుముద నీల శ్వేతాఖ్య పర్వతశిఖరంబులం గ్రమంబునఁ బ్రవహింపుచు శృంగనగంబునకుం జని, మానసోత్తరంబు లగు కురు భూములఁ బవిత్రంబుసేయుచు నుత్తర లవణసాగరంబుఁ జేరు. అలకనంద యని ప్రఖ్యాతిగాంచిన య మ్మహానదీ ప్రవాహంబు బ్రహ్మసదన దక్షిణద్వారంబున వెడలి, యత్యంత దుర్గమంబు లైన భూధరంబులఁ గడచి, హేమకూట హిమ కూట నగంబుల నుత్తరించి, యతివేగంబునఁ *(గర్మక్షేత్రం) బగు భారత వర్షంబుఁ బావనంబుసేయుచు దక్షిణ లవణాంబుధిం గలయు. 34

సీ. జగతిలో మేరు వాదిగఁ బర్వతములకుఁ బుత్రిక లైనట్టి పుణ్యతీర్థ
ములు వేలసంఖ్యలు గలవు జంబూద్వీప మందు భారతవర్ష మరయఁ గర్మ
భూమి తక్కినవర్షముల దివంబుననుండి భువికి వచ్చినవారు పుణ్యశేష
ములు భుజింపుచు నుండ్రు భూస్వర్గ మనఁదగు నా వర్షమున నుండునట్టి వార

ఆ. లయుతసంఖ్య వత్సరాయువు లయుత మా
తంగబలులు దేవతాసమాను
లతుల వజ్రదేహు లధికప్రమోదితు
లప్రమత్తు లార్య్య లనఘు లధిప! 35

---

‡ 'చతుర్భిర్నామభి శ్చతుర్ధిశ మభిస్యందంతీ, నదనదీ పతిమేవాభి విశతి సీతాఽలకనందా చతుర్థేతి' (మూలము 17-6)

వ. మటీయును సురతసుఖానందంబున మోహంబు నైననుం గైకొనక $సకృ
త్ప్రసూతు లగుచు ననవరతంబును త్రేతాయుగకాలంబునుం గలిగి ప్రవర్తింతురు.
ఈ యష్టవర్షంబులయందును దేవతాగణంబులు తమ భృత్యవర్గంబు లత్యుప
చారంబులు సేయుచుండ, నెల్లబుతువులయందుం గిసలయ కుసుమ ఫల భరితంబు
లైన లతాదుల శోభితంబు లగు వనంబులం గల వర్ష నిధి గిరిద్రోణులయందును,
గమలామోదితంబు లగు రాజహంస కలహంసలు గల సరోవరంబులయందును
జలకుక్కుట కారండవ సారస వినోదంబులు గలిగి, మత్తాళి ఝుంకృతి మనోహ
రంబు లై నానావిధంబు లైన కొలంకులయందును దేవాంగనల కామోద్రేక
జంబు లైన విలాస లీలా విలోకనంబులం దివియంబడిన మనోదృష్టులు గల దేవ
గణంబులు విచిత్రవినోదంబులం దగిలి యిచ్ఛావిహారంబులు సలుపుచుండుదురు.36

క. ఈ నవవర్షంబులయం, దా నారాయణుఁడు వచ్చి యనవరతము లో
కానుగ్రహమునకై సు, జ్ఞానం బీఁదలఁచి లీలఁ జరియించుఁ దగన్. 37

సీ. వసుధ నిలావృత వర్షాధిపతి యైన పురహరుం డా వర్షమున వనంబు
నందు నుండుటకు నా యంబికా శాపవశంబున నా వనస్థలమునందు
నెవ్వరు వచ్చిన నింతు లై యుందు రా వనమందుఁ బార్వతి యనుదినంబు
నంగనాజన సహస్రార్బుదంబుల తోడ నసమలోచనుఁ గొల్చు నతులభక్తి

ఆ. § నట్టి శివునిఁ గోరి యా యిలావృతవర్ష
మునఁ జరించు జనులు మోదమునను
గదిసి త త్ప్రకాశకము లైన మంత్ర తం
త్రములఁ బూజఁ జేసి తలఁతు రెపుడు. 38

అధ్యాయము - ౧౮

క. భద్రాశ్వ వర్షమందుల, $భద్రశ్రవుఁ డనెడి పేరఁ బరఁగుచుఁ దపనీ
యాద్రిసమ ధైర్యుఁ డగుచు స, ముద్రాంతం బైన జగతిఁ బొలుపుగ నేలున్. 1

క. ఆ నరవరునకుఁ బ్రియతముఁ, డైన హయగ్రీవమూర్తి ననవరతంబున్
ధ్యాన స్తోత్ర జపాను, ష్ఠానాదులఁ బూజఁ జేసి సజ్జను లంతన్. 40

$ "ఏకగర్భ కళత్రాణాం" (17-13)
"ఏకవర్ష శేషే ఆయుషి ధృత ఏకో గర్భోఽయోఃతాదృశాని కళత్రాణి యేషాం" (వ్యా)
§ 'హ', ప్రతిలో, అధోభాగమున ఈ క్రింది వాక్య మున్నది.
ఈ ఘట్టము మొదలుకొని యాయా వర్షములయందు వర్షాధిదేవతల నారాధించెను. వారలుపాసించెడు మంత్రములాంధ్రంబున విడువఁబడియున్నవి. వానినిసంస్కృత భాగవతముఁజూచితెలిసికోవలెను.
$ "భద్రశ్రవానామ ధర్మసుతః" (18-1)

ఆ. త త్ప్రకాశక ప్రధాన మంత్రార్థ సం
సిద్ధిఁ జేసి ముక్తిఁ జెంది రప్పు
డట్టి వర్షమందు నా హయగ్రీవునిఁ
దలఁచి కొలిచి మిగుల ధన్యులగుచు. 41

సీ. హరి వర్షపతి యైన నరహరి ననిశంబు నందున్నజనులు మహాత్ము లైన
దైత్య దానవకులో త్తములు ప్రహ్లాదాది [1]వృద్ధులఁ గూడి సంప్రీతితోడ
సుస్నాతు లై భక్తిఁ జూపుచునుందురు రమ్య దుకూలాంబరములు దాల్చి
త త్ప్రకాశక మంత్ర తంత్ర జప స్తోత్ర పాఠక ధ్యాన తపః ప్రధాన

తే. మైన సత్పూజలను జేసి యచలబుద్ధి
శ్రీనృసింహునిఁ జేరి పూజించి యతని
కరుణ నొందుచు నతుల ప్రకాశు లగుచు
భుక్తిముక్తులఁ గైకొండ్రు భూపవర్య! 42

వ. మఱియుఁ గేతుమాలవర్షంబునందు భగవంతుండు శ్రీదేవికి సంతోషంబు నొసఁగు
టకుఁ గామదేవరూపంబున నుండు. అ మ్మహాపురుషుని యస్త్ర తేజః ప్రకాశం
బునఁ బ్రజాపతి [2]దుహిత లగు రాత్ర్యధిదేవతల గర్భంబులు సంవత్సరాంతంబున
నిర్జీవంబు లై స్రవించు. ఆ కామదేవుండును దనగతి విలాస లీలావలోకన సుందర
భ్రూమండల సుభగవదనారవింద కాంతులం జేసి శ్రీరమాదేవిని రమియింపం జేయు.
భగవన్మాయారూపిణి యగు శ్రీదేవియుఁ, బ్రజాపతి పుత్రికలును, బుత్రులు
నైన *రాత్రింబగళ్ళుం గూడి, కామదేవ స్తోత్రపాఠక పూజా ధ్యానాదులం
బూజింపుచుండునంత. 43

క. విమలమతిఁ జిత్తగింపుము, రమణీయం బైన విమల రమ్యక మను వ
ర్షమునకు నధిదేవత దా, నమరంగా మత్స్యరూప మగు హరి దలఁపన్. 44

ఆ. అట్టి వర్షమునకు నధిపతి యగుచున్న
మనువు పుత్ర పౌత్ర మంత్రివరులఁ
గూడి మత్స్య మైన కుంభినీధరుఁ జిత్త
మతుల భక్తియుక్తి హత్తఁ గొలుచు. 45

---

1. పెద్దల (క. హ. బ.) 2. దుహితలునునగు అహోరాత్రాద్యధిపతుల గర్భంబులు (క. డ.)
* రాత్రులం బగళ్ళన్ (తం. వా.)

ఆ. త త్ప్రకాశక ప్రధానమంత్ర స్తోత్ర
ములను ధర్మకర్మములను హోమ
ములను జనులు సేసి పుణ్యు లై భుక్తిము
క్తులను బొందుచుండు రెలమితోడ 46

క. వినుము హిరణ్మయవర్షం, బునకుం గూర్మావతారమును దాల్చిన యా
వనజోదరుఁ డధిదేవత, యనఘుఁడు పితృపతి మహోత్ముఁ డర్యముఁడు నృపా!

క. ఆ వర్షమందు నర్యముఁ, డా వర్షజనంబుఁ గూడి హరిఁ జిత్తములో
భావించి సంస్తవంబులు, గావింపుచు [1]భుక్తి ముక్తి గాంచుఁ గడంకన్. 48

అధ్యాయము - ౧౯

క. †ఉత్తర కురుభూములకును, హత్తుకొని వరాహదేహుఁ డధిపతియైనన్
సత్తుగ భూసతి యతనిన్, జిత్తములో నిలిపి పూజసేయుచునుండున్. 49

క. అరయఁగ సీతాలక్ష్మణ, పరివృతుఁ డై వచ్చి రామభద్రుఁడు గడిమిం
బరఁగు నధిదేవతగఁ గిం, పురుష మహోవర్షమునకు భూపనరేణ్యా! 50

ఆ. అట్టి రామభద్రు నంజనీసుతుఁడు కిం
పురుషగణముఁ గూడి పూజచేసి
త త్ప్రకాశక ప్రధానమంత్ర స్తోత్ర
పఠనములను దగ నుపాస్తి సేయు. 51

సీ. భారతవర్షాధిపతి యగు బదరికాశ్రమమున నున్న నారాయణుండు
భూనాథ! యా మహాత్ముని నారదాదులు భారతవర్షంబు ప్రజలు ప్రేమఁ
బాయక చేరి యుపాస్తి సేయుచు సాంఖ్యయోగంబు నుపదేశ ముచితవృత్తి
నంది యందఱును గృతార్థు లై యట్టి నారాయణదేవు నారాధనంబు

ఆ. చేసి యాత్మఁ జాలఁ జింతించి త త్ప్రకా
శకము లైన మంత్రసంస్తవములఁ
బూజఁ జేసి ముక్తిఁ బొందుచు నుండుదు
రచల మైన భక్తి ననుదినంబు. 52

---

1. గాంతురతని కైవల్యంబున్ (హ)

† ఈ పద్యము (హ) లో లేదు. దీని తరువాత
క. ఆవర్షమందులను బ్రజ, లా విపుల వరాహమూర్తి ననవరతంబున్
సేవించి కొలిచి సంస్తుతిఁ, గావించుచుఁ గాంతు రంతఁ గైవల్యంబున్.
అను పద్యము (తం. వా.) లలోఁ గలదు. మూలమునను గలదు.

క. భారత వర్షమునందుల, సారాంశము లైన పుణ్యశైలంబులు గం
భీర ప్రవాహములు గల, వారయ నెటిఁగింతు వాని నవనీనాథా! 53

వ. మలయపర్వతమును, మంగళప్రస్థమును, మైనాకంబును, త్రికూటంబును, ఋషభ పర్వతంబును, గూటరమును, గోల్లమును, సహ్యాపర్వతంబును, వేదగిరియును, ఋశ్యమూక పర్వతంబును, శ్రీశైలంబును, వేంకటాద్రియును, మహేంద్రం బును, వారిధరంబును, వింధ్యపర్వతంబును, ఋక్షమత్పర్వతంబును, ఋష్యగిరియుఁ, బారియాత్రంబును, ద్రోణపర్వతంబును, చిత్రకూటంబును, గోవర్ధనాద్రియును, రైవతకంబును, గుకుంభంబును, నీలగిరియుఁ, గాకముఖంబును, నింద్రకీలంబును, రామగిరియు నాదిగాఁ గల పుణ్యపర్వతంబు లనేకంబులు గలవు. ఆ పర్వత పుత్రిక లైన చంద్రపటయుఁ, దామ్రపర్ణియు, నవటోదయుఁ, గృతమాలయు, వైహాయసియుఁ, గావేరియు, వేణియుఁ, బయస్వినియుఁ, బయోదయు, శర్కరా వర్తయుఁ, దుంగభద్రయుఁ, గృష్ణవేణియు, భీమరథియుఁ, గోదావరియు, నిర్విం ధ్యయుఁ, బయోష్ణియుఁ, దాపియు, రేవానదియు, శిలానదియు, సురసయుఁ, జర్మణ్వతియు, వేదస్మృతియు, ఋషికుల్యయుఁ, ద్రిసమయుఁ, గౌశికియు, మందాకినియు, యమునయు, సరస్వతియు, దృషద్వతియు, గోమతియు, సరయువును, భోగవతియు, సుషమయు, శతద్రువును, జంద్రభాగయు, మరుద్వృధయు, వితస్తయు, నసిక్నియు, విశ్వయు, నను నీ మహానదులును, నర్మద, సింధువు, శోణ యను నదంబులును నయిన మహాప్రవాహంబు లీ భారతవర్షంబునం గలవు. అందు సుస్నాతులైన మానవులు ముక్తిం జెందుదురు. మఱియు నీ భారతవర్షంబున జన్మించిన పురుషులు [1]శుక్ల లోహిత కృష్ణవర్ణ రూపంబు లగు త్రివిధకర్మంబులం జేసి క్రమంబుగ దేవ మనుష్య నరకగతు లను త్రివిధగతులఁ బొందుదురు. వినుము. రాగద్వేషాది శూన్యుఁడును(నవాఙ్మానస గోచరుఁడును, ననాధారుండు నగు శ్రీవాసుదేవమూర్తియందుఁ జిత్తంబునిలిపి, భక్తియోగంబున నారాధించెడు మహాత్ముల విద్యాగ్రంథిదహనంబుగావించుటం జేసి పరమభాగవతోత్తములు పొందెడు నుత్తమగతినిం జెందుదురు.కావున భారత వర్షంబు మిగుల నుత్తమం బని) మహాపురుషు లిట్లు స్తుతింపు చుండుదురు. 54

ఉ. భారతవర్ష జంతువుల భాగ్యము లేమని చెప్పవచ్చు! నీ
భారతవర్షమందు హరి పల్మఱు పుట్టుచు జీవకోటికిం
ధీరతతోడఁ దత్త్వ ముపదేశము సేయుచుఁ జెల్మిసేయుచు
న్నారయ బాంధవాకృతిఁ గృతార్థులఁ జేయుచునుండు నెంతయున్. 55

---

1. సాత్వికరాజసతామస (జ) * తా. ప. ప్రతులలో లేదు.

క. తన జన్మకర్మములనుం, గొనియాడెడివారి కెల్లఁ గోరిన వెల్లఁ
దనియఁగ నొసఁగుచు మోఁతుం, బనయముఁ గృపసేయుఁ గృష్ణుఁ డవనీనాథా!

వ. ఇట్లు భారతవర్ష ంబునందుల జనంబులకు నెద్దియు నసాధ్యంబు లేదు. నారాయణ స్మరణంబు సకల దురితంబుల నడంచు. తన్నామస్మరణ రహితంబులైన యజ్ఞ తపో దానాదులు దురితంబుల నడంపలేవు. బ్రహ్మకల్పాంతంబు బ్రతికెడి యితర స్థానంబునం బునర్జన్మభయంబున భీతిల్లుచు నుండుటకన్న, భారతవర్షంబు నందు తృణమాత్రంబు మనంబున సర్వసంగ పరిత్యాగంబు చేసిన పురుష శ్రేష్ఠునకు శ్రీమన్నారాయణ పదప్రాప్తి యతిసులభంబుగ సంభవించు. కావున నట్టి యుత్తమ మగు నీ భారతవర్ష ంబె కోరుచుండుదురు. మఱియు నెక్కడ వైకుంఠుని కథావాసన లేకుండు, నే దేశంబున సత్పురుషు లైన పరమభాగ వతులు లేకుండుదు, రే భూమిని యజ్ఞేశ్వరుని మహోత్సవంబులు లేకయుండు, నది సురేంద్రలోకం బైన నుండం దగదు. జ్ఞానానుష్ఠాన ద్రవ్య కలాపంబుచేత మనుష్యజాతిం బొంది, తపంబున ముక్తిం బొందకుండెనేని, మృగంబుల మాడ్కి నతండు దనకుం దానె బంధనంబు నొందు. భారతవర్ష ంబు నందుఁ బ్రజలచేత శ్రద్ధాయుక్తంబుగా ననుష్ఠింపంబడ్డ యజ్ఞ ంబులయందు వేల్పంబడ్డ హవిస్సులను బెక్కునామంబులం బుండరీకాక్షుం డంది, తనమీఁది భక్తి యధికంబుగాఁ జేయు. అట్టి భారతవర్ష ంబునందలి ప్రజల మీఁదం గరుణించి (సర్వేశ్వరుం) డిహ పర సౌఖ్యంబుల నొసఁగుచుండు. జంబూద్వీపంబున సగరాత్మజు లశ్వమేధాశ్వంబు నన్వేషింపఁ బూని భూఖననంబు సేయుటంజేసి స్వర్ణప్రస్థ, చంద్రశుక్ల, ఆవర్తన, రమణక, మందేహోరుణ, పాంచజన్య, సింహళ, లంక లను నెనిమిది యుపద్వీపం బులు గలిగె. 57

అధ్యాయము-౨౦

సీ. లక్షయోజనముల లవణాబ్ధి పరివృత మగుచు జంబూద్వీప మతిశయిల్లు
విను రెండులక్షలు విస్తృతముగను ప్లక్షద్వీప మిక్షురసాబ్ధిచేత
నావృత మై యుండు నారూఢముగ నందు వృక్షంబు ప్లక్షంబు విదితముగను
దనరు నా ద్వీపంబు తరునామ మహిమచే మిగులఁ బ్లక్షం బన మించి రహిని

అ. నందు సంచరించునట్టివారల కగ్ని
దేవుఁ డమరు నాదిదేవతయుఁగ
నందులోన నా ప్రియవ్రత సుతుఁ డగు
నిధ్మజిహ్వుఁ డను మహీవరుండు. 58

వ. నరేంద్రా! యీ యిధ్మజిహ్వుం డా ప్లక్షద్వీపంబు నేడువర్షంబులుగ విభజించి, యందు నా వర్షనామధారులుగా నుండు తన పుత్రు లగు శివ, యశస్య, సుభద్ర, శాంత, క్షేమ, అభయ, అమృతు లనియెడు నేడుగుర నేడువర్షంబుల కధిపతులం గావించి, తపంబునకుం జనియె. ఆ వర్షంబులయందు మణికూట, వజ్రకూట, ఇంద్రసేన, జ్యోతిష్మ, ద్రుద్రామవర్ణ, హిరణ్యగ్రీవ, మేఘమాల లను నామంబులం గల సప్త కులపర్వతంబులును, అరుణయు, నృమణయు, నంగిరసియు, సావిత్రియు, సుప్రభాతయు, ఋతంభరయు, సత్యంభరయు, నన సప్త మహానదులును, నా నదులయందు స్నాతు లగుచు గతపాపు లైన హంస, పతంగ, గోర్ధ్వాయన, సత్యాంగు లను నామంబులు గల చాతుర్వర్ణ్యంబును గలిగియుండు. అందుఁ బురుషులు సహస్రవత్సర జీవులును, దేవతాసములును, [1]దృష్టిమాత్రంబునఁ గ్లమస్వేదాది రహితం బగు నపత్యోత్పాదనంబు గలవారలు నగుచు వేదత్రయాత్మకుండును, స్వర్గద్వారభూతుం డును భగవత్స్వరూపియు నగు సూర్యుని వేదత్రయమున సేవించుదురు. ప్లక్షద్వీపం బాదిగా మీఁదటి ద్వీప పంచకమందలి పురుషులకు నాయు రింద్రియ పటుత్వంబులును, తేజో బలంబు

క. ప్లక్షద్వీపము ద్విగుణిత, లక్షేక్షురసాబ్ధి సుట్టి రా విలసిల్లు
న్నిక్షురసోద ద్విగుణం, బక్షయముగ శాల్మలీమహాద్వీప మిలఁ. 60

వ. అందు శాల్మలీవృక్షంబు ప్లక్షాయామం బై తేజరిల్లు. (ఆ వృక్షరాజంబునకు నధోభాగంబున) పత్త్రిరాజుగా నుండు గరుత్మంతుండు నిలుకడగా వసియించు. శాల్మలీవృక్షంబుపేర నా ద్వీపంబు శాల్మలీద్వీపం బన విలసిల్లు. ఆ ద్వీపపతియైన (ప్రియవ్రతాత్మజుం డగు)యజ్ఞబాహువు తనపుత్రు లగు సురోచన, సౌమనస్య, రమణక, దేవబర్హ, పారిబర్హ, ఆప్యాయన, అభిజ్ఞాతు లనియెడు వారిపేర నేడు వర్షంబుల నేర్పఱిచి యా వర్షంబులయం దేడ్వురఁ గుమారుల నభిషిక్తులం జేసె. ఆ వర్షంబులయందు స్వరస, శతశృంగ, వామదేవ, కుముద, ముకుంద, పుష్పవర్ష, శతశ్రుతు లను పర్వత సప్తకంబును, అనుమతియు, సినీవాలియు, సరస్వతియుఁ, గుహువును, [2]రజనియు, నందయు, రాకయు నను సప్తమహా నదులును గలవు. అందు శ్రుతధర, విద్యాధర, వసుంధర, ఇధ్మధర, సంజ్ఞు లగు నా వర్ష పురుషులు భగవత్స్వరూపుండును వేదమయుండును, నాత్మస్వరూపుండు నగు సోముని వేదమంత్రంబులచేత నారాధించుదురు. ఆ ద్వీపంబు లక్షచతుష్టయ పరిమిత యోజన విస్తృత మైన సురాసముద్రముచే నావృత మై తేజరిల్లు. అందు.

1.దృష్టిమాత్ర గరోభత్పత్తులగుదురు(క.చ.ట.)2.అజని(హ) 'సరస్వతీకుహూరజనీనందారాకేతి'(20–8)

సీ. భూనాథ ! యా సురాంభోధికిఁ జుట్టుగా నుండు కుశద్వీప మర్విమీఁదఁ
దోరమై తా ద్విచతుర్లక్ష యోజనంబులను విస్తార మై పొలుపు మిగులు
నందుఁ గుశ స్తంభ మనిశంబు దేవతా కల్పితం బై నట్టి కాంతిచేత
దిక్కులు వెలిఁగించు ద్వీపంబునకుఁ దన పేరను సత్కీర్తి పెంపుసేయు

తే. నట్టి దీవికి నధిపతి యగు ప్రియవ్ర
తాత్మజుండు హిరణ్యరేతసుఁ డనం ద
నరెడి భూపతి దనసుత నామములను
వర్షములు సేసె నత్యంత హర్ష మునను. 62

వ. ఇట్లు హిరణ్యరేతసుఁడు వసుదాన, దృఢరుచి, నాభి, గుప్త, సత్యవ్రత, విప్ర, వామదేవు లను నామంబులు గల పుత్రుల నామంబుల సప్తవర్షంబులం గావించి, యా కుమారుల నందు నిలిపి, తాను దపంబునకుం జనియె. ఆ వర్షంబునందు బభ్రు, చతుశ్శృంగ, కపిల, చిత్రకూట, దేవానీక, ఊర్ధ్వరోమ, ద్రవిణంబు లను నామంబులు గల సప్తగిరులును, రసకుల్యయు, మధుకుల్యయు, శ్రుతవిందయు, మిత్రవిందయు, దేవగర్భయు, ఘృతచ్యుతయు, మంత్రమాలయు నను సప్తమహానదులును గలవు. ఆ నదీజలంబులఁ గృతమజ్జను లగుచు భగవంతుం డగు యజ్ఞపురుషునిఁ గుశల, కోవిద, అభియుక్త, కులక సంజ్ఞలు గల వర్షపురుషు లారాధింపు చుందురు. 63

సీ. ఆ కుశద్వీపంబు నరికట్టుకొని యుండు నెనిమిదిలక్షల ఘనఘృతాబ్ధి
యా ఘృతసాగరం బవ్వల షోడశ లక్ష యోజనముల లలిత మగుచు
నుండుఁ క్రౌంచద్వీప మర్వీశ ! యందు మధ్యప్రదేశంబున నట్టి దీవి
పేరుగాఁ దనపేరిఁ బెద్దగాఁ జేసిన క్రౌంచాద్రి గల దా నగంబు మున్ను

ఆ. షణ్ముఖుండు దివ్యశరమున ఘననితం
బంబు [1]దూయనేయఁ బాలవెల్లి
గరిమఁ దడుపుచుండు వరుణుండు రక్షింప
నందు మిగుల భయము నొంద కుండె. 64

వ. సరేంద్రా ! యా క్రౌంచద్వీపపతి యగు ఘృతపృష్ఠుండు దన కుమారుల నా పేళ్ళుగల యామోద, మధువహ, మేఘపృష్ఠ, సుదామ, ఋషిజ్య, లోహితార్ణ, వనస్పతు లను వర్షంబుల కభిషిక్తులం జేసి, పరమ కళ్యాణగుణయుక్తుం డైన శ్రీహరి చరణారవిందంబులు సేవింపుచుం దపంబునకుం జనియె. ఆ వర్షంబుల

---

1. గాడనేయ (క. చ. ట.)

యందు శుక్ల, వర్ధమాన, భోజన, ఉపబర్హ్ణ, ఆనంద, నందన, సర్వతోభద్రము లను సప్తసీమా పర్వతంబులును, అభయయు, అమృతౌఘయు, ఆర్యకయు, తీర్థవతియు, తృప్తిరూపయు, పవిత్రవతియు, శుక్లయు నను సప్తనదులును గలవు. అందుల పవిత్రోదకంబు లనుభవింపుచు గురు, ఋషభ, ద్రవిణక, దేవక, సంజ్ఞలు గలిగి, వరుణ దేవుని నుదకాంజలులం బూజించుచున్న చాతుర్వర్ణ్యం బుండు. 65

సీ. జగతీశ ! వినుము క్రౌంచద్వీపమును జుట్టియుండు షోడశలక్ష యోజనముల
విస్తార మై పాలవెల్లి యందునను శాకద్వీప మతుల ప్రకాశ మొందు
దండి మై ముప్పది రెండులక్షల యోజనముల విస్తార మై యమరియుండు
నందున శాకవృక్షామోద మా ద్వీపమును సుగంధంబునఁ బెనఁగఁ జేసి

తే. యంతఁ దనపేర దీవి ప్రఖ్యాత [1]మగుటఁ
జేసి యందున మిగులఁ బ్రసిద్ధి కెక్కె
నందు మేధాతిథియుఁ గర్త యగుచునుండెఁ
దవిలి వేడుకఁ దనదు నందనులఁ జూచి. 66

వ. మఱియు నా ప్రియవ్రతపుత్రుం డైన మేధాతిథి తన పుత్రుల పేరం గల పురోజవ, మనోజవ, వేపమాన, ధూమ్రానీక, చిత్రరథ, బహురూప, విశ్వచార ములను సంజ్ఞలు గల సప్తవర్షంబులయందు వారలకుఁ బట్టంబు గట్టి, శ్రీహరి పాదసేవచేయుచుఁ దపోవనంబునకుం జనియె. ఆ శాకద్వీపంబునందు ఈశాన, ఉరుశృంగ, బలభద్ర, శతకేసర, సహస్రస్రోతో, దేవపాల, మహానసము లను సీమాగిరులును, అనఘ, ఆయుర్ద, ఉభయసృష్టి, అపరాజిత, పంచపది, సహస్ర స్మృతి, నిజధృతి యను సప్త నదులును గలవు. ఆ నదీజలంబు లుపయోగించి, యచ్చటి వారలు ప్రాణాయామంబు సేసి, విధ్వస్త రజస్తమోగుణు లై పరమ సమాధిని వాయురూపం బైన భగవంతుని సేవింతురు. ఋతవ్రత, సత్యవ్రత, దానవ్రత, సువ్రత. నామంబులు గల చాతుర్వర్ణ్యం బందుఁ గలిగియుండు. 67

సీ. అట్టి శాకద్వీప మరికట్టి త ద్ద్వమాణంబున దధిసముద్రంబు వెలుఁగు
నందుకుఁ బరివృతం బై పుష్కరద్వీప మిలఁ జతుష్షష్టి లక్షల విశాల
మ మ్మహాద్వీపమం దయుత కాంచన పత్రములు గల్గి కమలగర్భునకు నాస
నం బగు పంకేరుహాం బుండు నా ద్వీపమధ్యంబునను నొక్క మానసోత్త

---

1. మమరఁ (హ)

ఆ. రం బనంగఁ బర్వతం బుండుఁ దనకుఁ బూ
ర్వాపరముల నుండునట్టి వర్ష
ములకు రెంటి కిట్లు నిలిచిన మర్యాద
నగ మనంగఁ జాలఁ బొగడ నెగడి. 68

వ. ఇట్లు దనకు లోపలి వెలుపలి వర్షంబులు రెంటికి మర్యాదాచలంబునుం బోలి యున్న మానసోత్తర పర్వతం బయుత యోజన విస్తారంబును, నంతియ యొన్న త్యంబునుం గలిగియుండు. ఆ నగంబునకు నలుదిక్కుల యందును నాలుగు లోకపాలుర పురంబు లుండు. ఆ మానసోత్తర పర్వతంబు తుద సూర్యరథ చక్రంబు సంవత్సరాత్మకం బై యహోరాత్రంబులయందు మేరుప్రదక్షిణంబు సేయు. అందు నా పుష్కర ద్వీపాధిపతి యగు వీతిహోత్రుండు రమణక, ధాతక నామంబులు గల పుత్రుల నిరువుర వర్ష ద్వయంబునందు నభిషిక్తులం జేసి, తాను పూర్వజు లేఁగిన తెఱంగున భగవత్కర్మశీలుం డగుచుఁ దపంబు నకుం జనియె. అంత. 69

క. మనుజేశ్వర! యీ వర్షం, బున నెప్పుడు సంచరించు పురుషులు పద్మా
సనుఁ దగ సకర్మకారా, ధన సేయుదు రచలబుద్ధి తాత్పర్యమునన్. 70

క. ధరణీవల్లభ! వినుపు, ష్కర మను ద్వీపమున లేరు చాతుర్వర్ణ్యల్
పరఁగఁగ [1]నెక్కువ తక్కువ, [2]లెఱుఁగక సము లగుచు నుందు రెల్లజనంబుల్. 71

వ. మఱియు నా పుష్కరద్వీపంబు చతుష్షష్టి లక్షల యోజనవిస్తారం బైన శుద్ధోదక సముద్రముద్రితం బగుచుండు. అవ్వల లోకాలోకపర్వతం బుండు. శుద్ధోదక సముద్ర లోకాలోకపర్వతంబుల నడుమ రెండుకోట్ల యోజనవిస్తారం బైన నిర్జన [3](కాంచన) భూమి *(దర్పణోదర సమానం బై, దేవతా వాసయోగ్యం బుగా నుండు.) ఆ భూమిం జేరినపదార్థంబు మరలఁ బొంద నశక్యంబుగా నుండు. అటమీఁద లోకాలోకపర్వతం బెనిమిదికోట్ల యోజనంబులు. సువర్ణ భూమియు [4]సూర్యాదిధ్రువాంతంబు లగు జ్యోతిర్గణంబుల మధ్యంబున నుండుటం జేసి [5]లోకాలోకపర్వతం బనఁదగి యుండు. పంచాశత్కోటి (యోజనవిస్తృతం బగు) భూమండల (మానంబునకుఁ దురీయాంశ ప్రమాణంబు గల) లోకాలోక పర్వతంబు మీఁద నఖిలజగద్గురు వగు [6]బ్రహ్మచేతఁ (జతుర్దిశలయందు) బుషభ,

---

1. భేదములేకన్ (హ) 2. సరసత సములగుదు రందు సకలజనంబుల్ (హ. తం. వా.)
3. నిర్జనభూమి (హ. తం. వా.) 4. గ్రహతేజోంధతమో మధ్యంబున నుండుటంజేసి (క. చ. ట. త. డ. ద. బ.) 5. చక్రవాళ పర్వతంబు నాబది (ట. జ. డ. బ.) 6. బ్రహ్మచేత నిర్మితంబైన దిక్పాలుర పురంబులును దిక్పాల సమేతంబైన పట్టణంబులు నాల్గును (చ. ట. డ. ద. బ.)
* తా. ప. ప్రతులలో లేదు.

పుష్కరచూడ, వామన, అపరాజిత సంజ్ఞలం గల దిగ్గజంబులు నాలుగును లోకరక్షణార్థంబు నిర్మితం బై యుండు. మఱియును. 72

సీ. తనదు విభూతు లై తనరిన యా దేవబృంద తేజ శ్శౌర్య బృంహణార్థ
మై భగవంతుండు నాదిదేవుండును నై న జగద్గురుం డచ్యుతుండు
సరిలేని ధర్మవిజ్ఞాన వై రాగ్యాదు లై న విభూతుల నలరియున్న
యట్టి విష్వక్సేనుఁ డాదిగా వెలుఁగు పార్షదులతోఁ గూడి ప్రశ స్త మైన

తే. నిజ వరాయుధ దోర్దండ నిత్య సత్త్వఁ
డగుచు నా పర్వతంబుపై నఖలలోక
రక్షణార్థంబు కల్పపర్యంత మతఁడు
యోగమాయా [1]పరితుఁ డై యొప్పుచుండు. 73

వ. ఇట్లు వివిధ మంత్రగోపనార్థం బా నగాగ్రంబున నున్న భగవంతునికిఁ దక్క లోకాలోకపర్వతంబునకు నవ్వల నొరులకు సంచరింప నశక్యం బై యుండు. బ్రహ్మాండంబునకు సూర్యుండు మధ్యగతుం డై యుండు. ఆ సూర్యునకు నుభయపక్షంబులయందు నిరువదేనుకోట్ల యోజనపరిమాణంబున నండకటాహం బుండు. అట్టి సూర్యునిచేత నాకాశ దిక్స్వర్గాపవర్గంబులును, నరకంబులును నిర్ణయింపంబడు. దేవ తిర్య గ్మనుష్య నాగ పక్షి తృణ గుల్మ లతాది సర్వ జీవులకును సూర్యుం డాత్మ యగుచునుండు. 74

క. కర మనురాగంబున నీ, ధరణీ మండలము సన్నిధానం బెల్లన్
నరవర! యెఱుఁగం జెప్పితి, మఱి చెప్పెద వినుము దివ్యమానం బెల్లన్. 75

అధ్యాయము - ౨౧

—: భ గో ళ వి ష య ము :—

ఆ. కమలజాండ మధ్యగతుఁ డై న సూర్యుండు
[2]భరిత మైన యాతపంబుచేత
మూఁడులోకములను [3]ముంచి తపింపంగఁ
జేసి కాంతి నొందఁ జేయుచుండు. 76

వ. అట్టి [4]భాస్కరుం డుత్తరాయణ దక్షిణాయన [5]వై షువతంబు లను నామంబులు గల మాంద్య తీవ్ర సమానగతుల నారోహణావరోహణ స్థానంబులయందు దీర్ఘ హ్రస్వ సమానంబులుగాఁ జేయుచుండు. 77

---

1. విరచితుఁడై (హ.తం.వా.) 2. అధికమైన యాన మతడుచేయు (క.చ.) 3. మొనసి (బ)
4. భాస్కరుం డుదగయన దక్షిణాయన (జ.డ.) 5. విష్ణువులను (హ) విషువులను (తం. వా.)

ఆ. మేష తులలయందు మిహిరుం డహోరాత్రు
లందుఁ దిరుగు సమవిహారములను
పరఁగఁగ వృషభాది పంచ [1]రాసులను నొ
క్కొక్క గడియ రాత్రి దక్కి నడచు. 78

ఆ. మించి వృశ్చికాది పంచ [2]రాసులను నొ
క్కొక్కగడియ రాత్రి నిక్కి నడచు
దివములందు నెల్లఁ దిగఁజాఱు నొక్కొక్క
గడియ నెలకుఁ దత్ప్రకారమునను. 79

వ. మఱియు, నీ విధంబున దివసంబు లుత్తరాయణ దక్షిణాయనముల వృద్ధిక్షయం
బుల నొంద, నొక్క యహోరాత్రంబున [3]నేకపంచాశదుత్తర నవకోటి యోజ
నంబుల పరిమాణంబు గల మానసోత్తర పర్వతంబున సూర్యరథంబు దిరుగు
చుండు. ఆ మానసోత్తర పర్వతంబునందుఁ దూర్పున దేవధాని యను నింద్ర
పురంబును, దక్షిణంబున సంయమని యను యమనగరంబును, బశ్చిమంబున
నిమ్లోచని యను వరుణపట్టణంబును, నుత్తరంబున విభావరి యను సోముని పుట
భేదనంబును దేజరిల్లుచుండు. ఆ పట్టణంబులయందు నుదయ మధ్యాహ్నాస్త
మయ నిశీథంబు లనియెడు కాల భేదంబులను, భూతప్రవృత్తి నివృత్తి నిమిత్తం
బచ్చటి జనులకుం బుట్టింపుచుండు ‡సూర్యుఁ డెపు డింద్రనగరంబుననుండి గమ
నించు నదియాదిగాఁ బదియేను గడియలను రెండుకోట్లుఁ ముప్పదియేడు
లక్షల డెబ్బదియైదువేల యోజనంబులు నడుచు. ఇ విధంబున నింద్ర యమ
వరుణ సోమ పురంబులమీఁదఁ జంద్రాది గ్రహనక్షత్రంబులం గూడి సంచరిం
చుచుఁ బండ్రెండు డంచులు, నాఱు కమ్మ్మలును, మూఁడు [4]తొలులుం గలిగి,
సంవత్సరాత్మకం బై యేకచక్రం బైన సూర్యుని రథంబు ముహూర్త
మాత్రంబున [5]నష్టశతాధిక చతుస్త్రింశల్లక్ష యోజనంబులు సంచరించు. 80

సీ. ఇను రథంబున నున్న యిరు సొక్కటియ మేరు శిఖరంబునందును జేరియుండు
నొనరఁ జక్రము మానసోత్తరపర్వతం బందులఁ [6]దిరిగెడు నా రథంబు
నిరుసున నున్న రెండిరుసులు దగులంగఁ బవనపాశంబుల బద్ధమగుచు
ధ్రువమండలంబునందుల నంటి యుండఁగా సంచరించుచునుండు సంతతంబు

---

1. మాసముల (హ. తం. వా.); "వృషభాదిషు పంచసురాశిషు" (21-4) 2. మాసముల (హ. తం. వా.) 3. తొమ్మిది కోట్లయాబదియొక్క లక్ష (క. చ. త. ద.)

‡ ఇచ్చట మూలమున మఱికొంత విషయ మధికముగాఁ గలదు.

4. నాభులు (క. డ.) 5. ముప్పదినాలుగు లక్షల యెనమన్నూరు యోజనంబులు (చ.త.ద) 6. తిరుగాడు (క. ట.) తిరిగాడు (త. డ. ద. బ.)

తే. నట్టి యరదంబు ముప్పదియాఱులక్ష
లందు నంటిన కాఁడియు నన్ని యోజ
నముల విస్తార మై తురంగముల కంధ
రములఁ దగులుచు వెలుఁగొందు రమణతోడ. 81

వ. ఆ రథంబునకు గాయత్రీఛందం బాదిగా సప్తచ్ఛందంబులు నశ్వంబు లై సంచ రించు. భాస్కరునకు నగ్రభాగంబున నరుణుండు నియుక్తుం డై రథంబు గడపు చుండు. అంగుష్ఠపర్వమాత్ర శరీరంబులు గల యఱువదివేల వాలఖిల్యాఖ్యు లగు ఋషివరులు సూర్యునిముందట సౌరసూక్తంబుల స్తుతియింప, మఱియు ననేక మునులును గంధర్వ కిన్నర కింపురుష నాగాప్సరః పతంగాదులును నెలనెల వరుసక్రమంబున సేవింపఁ, దొమ్మిదికోట్లు న్నేఁబదియొక లక్ష యోజనంబుల పరిమాణంబు గల భూమండలంబునం (దొకక్షణంబున సూర్యుండు రెండువేలు న్నేఁబదియోజనములు సంచరింపుచు) నొక యహోరాత్రంబునందె యీ భూ మండల మంతయు సంచరించు. అనిన శుకయోగీంద్రునకుఁ బరీక్షి న్నరేంద్రుం డి ట్లనియె. 82

అధ్యాయము-౨౨

క. మునివర! మేరు ధ్రువులకు, నొనరఁ బ్రదక్షిణము దిరుగుచుండెడి [1]నజుఁ డా
యినుఁ డభిముఖుఁ డై రాసుల, కనుకూలత నేఁగు నంటి వది యెట్లొప్పున్?౧

క. అని పలికిన భూవరునిం, గనుఁగొని శుక యోగి మిగులఁ గరుణాన్వితుఁ డై
మనమున శ్రీహరిఁ దలఁపుచు, వినుమని క్రమ్మఱఁగ నిట్లు వినుపించెఁ దగన్.

వ. నరేంద్రా! (యతివేగంబునఁ) దిరుగుచుండు [2]కులాల చక్రంబునందుఁ జక్ర భ్రమణమునకు వేఱైన గతి నొంది, బంతి సాగి తిరిగెడు పిపీలికాదుల చందంబున, నక్షత్రరాసులతోఁగూడినకాలచక్రంబు ధ్రువమేరువులం ప్రదక్షిణంబు తిరుగు నపు డా కాలచక్రంబు [3]వెంట సంచరించు సూర్యాది గ్రహంబులకు నక్షత్రాంతరంబుల యందును, రాశ్యంతరంబులయందును, [4]మునికి గలుగుటం జేసి (సూర్యాది గ్రహం బులకుఁ జక్రగతిస్వగతులవలన గతిద్వయంబుగలుగుచుండు. మఱియు నాసూర్యుం డాదినారాయణమూర్తి యగుచు లోకంబుల యోగక్షేమంబులకు వేదత్ర

---

1. ఆ సూర్యునకును రాసుల కెదురయ్యును చందము తేటపడగ నెరిగింపు తగన్ (క. చ. ట. త. డ. ద.బ.) 2. కులాల చక్రంబుతోడనె తిరుగు పిపీలికాదులకు భ్రమణవేగంబున స్థానాంతరంబునందునికి దోచిన చందంబున (క. చ. ట. డ. త. ద. బ.) (తోఁపని-తం.) 3. నెదుర (హ) 4. ఉనికి దోచుగాని రాశికి నెదురు నడచుట లేదు (క-బ)

యాత్మకంబును, గర్మసిద్ధినిమి త్తంబును, దేవర్షి గణంబులచేత, [1](వేదాంతార్థంబుల
ననవరతంబు వితర్క్యమాణంబును నగుచున్న) తనస్వరూపంబును ద్వాదశ
విధంబులుగ విభజించి, వసంతాదిఋతువుల [2]నా యా కాలవిశేషంబులయందుఁ
[3]గలుగఁజేయుచుండు. (అట్టి పరమపురుషుని మహిమ నీ లోకంబున మహాత్ము
లగు పురుషులు వారి వారి వర్ణాశ్రమాచారముల చొప్పున వేదోక్తప్రకారంబుగా
భక్త్యతిశయంబున నారాధింపుచు క్షేమంబు నొందుచుందురు. అట్టి యాది
నారాయణమూర్తి జ్యోతిశ్చక్రాంతర్వర్తి యై, స్వకీయ తేజఃపుంజ దీపితాఖిల
జ్యోతిర్గణంబులు గలవాఁడై, ద్వాదశరాసులయందు నొక సంవత్సరంబున
సంచరింపుచుండు. అట్టి యాదిపురుషుని గమనవిశేషకాలంబును లోకులు అయన,
ఋతు, మాస, పక్ష, తిథ్యాదులచే వ్యవహరింపుచుందురు. మఱియు న ప్పరమ
పురుషుం డా రాసులయందు షష్ఠాంశసంచారంబు నొందిన సమయంబును
ఋతు వని వ్యవహరించుదురు. ఆ రాసులయందు నర్ధాంశసంచారమున రాశిషట్క
భోగం బొందినతఱి అయన మని చెప్పుదురు.) సమగ్రముగా రాసులయందు
సంచార మొందినయెడల, నట్టి కాలంబును సంవత్సరం బని నిర్ణయించుదురు.
ఇట్టి సమగ్ర రాశి సంచారమునందు శీఘ్రగతి, మందగతి, సమగతు లనియెడు
త్రివిధ గతివిశేషములవల్ల వేఱుపడెడు నా వత్సరంబును, సంవత్సరము, పరివత్స
రము, ఇళావత్సరము, అనువత్సరము, ఇద్వత్సర మని పంచవిధంబులఁ జెప్పుదురు.
చంద్రుండును, నీ తెఱంగున నా సూర్యమండలంబుమీఁద లక్షయోజనంబుల
నుండి సంవత్సర పక్ష రాశి నక్షత్ర భుక్తులు [4]గ్రహించుచు నగ్రచారి యై, శీఘ్ర
గతిం జరించు. అంత, వృద్ధిక్షయరూపంబునఁ బితృగణంబులకు (పూర్వప క్షాపర
పక్షంబులచేత నహోరాత్రంబులఁ గలుగఁజేయుచు) సకల జీవప్రాణుం డై
యొక్కనక్షత్రంబు త్రింశన్ముహూర్తంబు లనుభవింపుచు, షోడశకళలం గలిగి
మనోమ యాన్నమ యామృతమయ దేహుం డై, దేవ పితృ మనుష్య భూత
పశు పక్షి సరీసృప వీరుత్ప్రభృతులకుం ప్రాణాప్యాయనశీలుం డగుటంజేసి సర్వ
[6]మయుం డనఁ బడును. 85

క. చందురునకు మీఁదై యా, నందంబున లక్షయోజనంబులఁ దారల్
గ్రందుకొని మేరుశైలం, బంది ప్రదక్షిణము దిరుగు నభిజిద్భముతోఁ. 86

---

1. ధ్యానంబు సేయంబడ్డ దగుచు తన (క.డ.ద.) 2. నాకాశగతుండై (క.చ.ట.త.జ.బ.) 3. ద్వాదశ మాసంబులను ద్వాదశ రాశులను అనుభవించుచుండు (క. చ. ట. బ.) 4. పుచ్చుకొనుచు (హ) 5. భుక్తి నిచ్చుచు (క. బ.) 6. సముఁడు (హ. త. వా.)

సీ. అటమీఁదఁ దారల కన్నిటి కుపరి యై రెండులక్షల శుక్రుఁ డుండి భాస్క
రునికి ముందఱఁ బిఱుఁదను సామ్య మృదు శీఘ్ర సంచారములను భాస్కరుని
మాడ్కిఁ
జరియింపుచుండును జనులకు ననుకూలుఁ డై వృష్టి నొసఁగుచు నంతనంతఁ
జతురత వృష్టివిష్కంభక గ్రహశాంతి నొనరించువారల కొసఁగు శుభము

తే. లుండు నామీఁద సౌమ్యుండు రెండులక్ష
లను జరింపుచు రవిమండలంబుఁ బాసి
[1]కండ్లఁబడినను జనులకు క్షామ డాంబ
రాది భయములఁ బుట్టించు నతులమహిమ. 87

సీ. ధరణీతనూజుఁ డంతటిమీఁద రెండులక్షల నుండి మూడుపక్షముల నొక్క
రాశి దాఁటుచునుండుఁ గ్రమమున ద్వాదశ రాసులు భుజియించు రాజసమున
వక్రించి యైన నవక్రత నై నను దఱుచుగాఁ బీడలు నరుల కొసఁగు
నంగారకుని పట్టు కావల రెండు లక్షల యోజనంబుల ఘనత మించి

ఆ. యొక్కరాశి నుండి యొక్కొక్క వత్సరం
బనుభవింపుచుండు నమరగురుఁడు
వక్ర మందు నై న వసుధామరులకును
శుభము నొసఁగు నెపుడు నభినవముగ. 88

క. సురగురునకు మీఁదై భా,స్కర సుతుఁ డిరులక్షలను జగములకుఁ బీడల్
జరపుచుఁ ద్రింశన్మాసము, లరుదుగ నొక్కొక్క రాశియందు వసించున్. 89

క. ప్రాకటముగ రవిసుతునకు, నేకాదశ లక్షలను మహీసురులకు నీ
లోకులకు మేలుగోరుచు, జోకగ మునిసప్తకంబు సొంపు వహించున్. 90

క. మునిసప్తకమున కెగువం, దనరుచు నామీఁదఁ ద్రియుతదశ లక్షలఁ బెం
పున శింశుమార చక్రం, బనఁగా నన్నిటికి నుపరి యగుచుండు నృపా ! 91

అధ్యాయము – ౨౩

సీ. ఆ శింశుమారాఖ్య మగు చక్రమున భాగవతుఁడై న ధ్రువుఁ డింద్ర [2]వహ్ని కశ్య
ప ప్రజాపతి యమ ప్రముఖులతోఁ గూడి బహుమానముగ విష్ణుపదముఁ జేరి
కణక నిచ్చలుఁ బ్రదక్షిణముగాఁ దిరుగుచు జెలఁగియుండును గల్పజీవి యగుచు
ననఘుఁ డుత్తానపాదాత్మజుఁ డార్యుఁడు నై న యా ధ్రువుని మహత్త్వమెల్లఁ

---

1. కానఁబడినను (తం. వా.) 2. వరుణ (హ. తం. వా.)

తే. దెలిసి వర్ణింప బ్రహ్మకు నలవిగాదు
నే నెఱింగిన యంతయు నీకు మున్ను
తెలియఁ బలికితిఁ బ్రగ్మఱఁ దలఁచి కొనుము
జితరిపు వాత ! శ్రీ పరికిన్న రేంద్ర ! 92

వ. మఱియు నా ధ్రువుండు కాలంబుచేత నిమిషమాత్రం బెడలేక సంచరించు జ్యోతి ర్గ్రహ నక్షత్రంబులకు నీశ్వరునిచేత (ధాన్యాక్రమణంబునఁ బశువులకై యేర్ప అచిన మేధి స్తంభము తెఱంగున) మేటిగాఁ గల్పింపంబడి ప్రకాశింపుచుండు. గగనంబునందు మేఘుంబులును, శ్యేనాదిపక్షులును వాయువశంబునం గర్మసా రథు లై చరించు తెఱంగున, జ్యోతిర్గణంబులును బ్రకృతి పురుష యోగ గృహీ తాశు లై కర్మనిమిత్త గతిం గలిగి వసుంధరం [1]బడకుందురు. 93

క. పొందుగ జ్యోతిర్గణముల, నందఱ నా శింశుమార మందుల నుండం
గొందఱు దఱుచుగఁ జెప్పుచు, నుందురు నెఱిఁగింతు విను మహోన్నత చరితా !

క. తలక్రిం దై వట్రువ యై, సలలిత మగు శింశుమార చక్రమునందున్
నెలకొని పుచ్ఛాగ్రంబున, నిలిచి ధ్రువుం డుండు నెపుడు నిర్మల చరితా ! 95

వ. మఱియు నా శింశుమారచక్ర పుచ్ఛంబునఁ బ్రజాపతియును, నగ్నీంద్ర ధర్మ్మ లును, పుచ్ఛమూలమున ధాతృ విధాతలును, గటిప్రదేశంబున ఋషి స ప్తకం బును, దక్షిణావర్త కుండలీ *(భూత భూత) శరీరంబునకు నుదగయన నక్షత్రం బులును, దక్షిణ పార్శ్వంబున దక్షిణాయన నక్షత్రంబులును, బృష్ఠంబున దేవ మార్గంబును, నాకాశగంగయు, నుత్తర భాగంబునఁ బునర్వసు పుష్యంబులును, దక్షిణాయనంబున నార్ద్రాశ్లేషలును, దక్షిణ వామ పాదంబుల నభిజిదుత్త రా షాఢలును, దక్షిణ వామ నాసారంధ్రంబుల శ్రవణ పూర్వాషాఢలును, దక్షిణ వామ లోచనంబుల ధనిష్ఠా మూలలును, దక్షిణ వామ కర్ణంబుల మఘా ద్యష్ట నక్షత్రంబులును, వామపార్శ్వంబున దక్షిణాయనంబును, దక్షిణ పార్శ్వంబునఁ గృత్తికాది నక్షత్ర త్రయంబును, నుత్తరాయణంబును, వామ దక్షిణ స్కంధంబుల [2]శతభిషగ్ జ్యేష్ఠలును, నుత్తర హనువున నగస్త్యుండును, నపరహనువున యముం డును, ముఖంబున నంగారకుండును, †గుహ్యంబున శనైశ్చరుండును, మేఢ్రంబున బృహస్పతియును, వక్షంబున నాదిత్యుండును, నాభిని శుక్రుండును, జిత్తంబునఁ జంద్రుండును, స్తనంబున నశ్వినులును, ప్రాణాపానంబుల బుధుండును, సర్వాం గంబులను గేతు గ్రహంబులును, రోమంబునఁ దారలు నుండును. అది సర్వదేవ తామయం బైన పుండరీకాక్షుని దివ్యదేహంబు ‡(ధ్రువునింగా నెఱుంగుము.)

---

1. బడుదురు (హ) 2. శతభిష జ్యేష్ఠలును (హ)
† "శనైశ్చరః ఉరస్థ స్థలే-బృహస్పతిః ప్రకుది" అని మూలము (2౩-7)
‡ ధ్రువునింగా నెఱుంగుము (హ. తం. వా.)
'ధ్రువంబుగా' అని 'తం' ఫుట్‌నోటు. మూలమున ధ్రువుని ప్రస క్తి లేదు.

సీ. ఇట్టి దివ్యశరీర మెవ్వఁడు ప్రతిదినం బందు సంధ్యాకాల మతులభ క్తి
మనమందు నిలిపి యేమఱక మిక్కిలి ప్రయత్నంబున నియతుఁ డై తత్త్వబుద్ధి
మౌనవ్రతంబునఁ బూని వీఱింపుచు నీ సంస్తవంబుఁ దా నెంతో ప్రేమ
జపియించి కడుఁ బ్రశస్తమును మునీంద్రసేవ్యమును జ్యోతిస్స్వరూపమున వెలుఁగు

ఆ. విపుల శింశుమార విగ్రహంబునకు వం
దనము వందనంబు లనుచు నిలిచి
సన్నుతించె నేని సకలార్థ సిద్ధులఁ
బొందు మీఁద ముక్తిఁ జెందు నధిప! 97

అధ్యాయము - ౨౪

క. ఇనమండలంబునకుఁ గ్రిందను దశసాహస్ర యోజనంబుల స్వర్భా
నుని మండలంబు గ్రహ మై, ఘనత న్నపసవ్యమార్గ గతి నుండు నృపా! 98

క. అసురాధముఁ డగు రాహువు, బిసరుహ సంభవుని వరము పెంపున నెంతో
పసయగు నమరత్వంబున, నసమానం బైన గ్రహవిహారముఁ బొందెన్. 99

సీ. జననాథ! రాహువు జన్మకర్మంబులు వినుపింతు ముందఱ విస్తరించి
యయుత యోజన విస్తృ తార్కమండలము ద్విషట్సహస్ర విశాల చంద్రమండ
లముఁ బర్వకాలంబులను ద్రయోదశసహస్ర విశాల మై మీఁద రాహుఁ గప్పు
నది చూచి యుపరాగ మనుచును బలుకుదు రెల్లవారును స్వధర్మ్మ మగుచు

ఆ. నంతలోన నిన శశాంక మండలములఁ
గ్రుణఁ బ్రోవఁదలఁచి హరిసుదర్శ
నంబు [1]వచ్చు నను భయంబున నై దాఱు
గడియలకును రాహు [2]విడిచి తొలఁగు. 100

క. నరవర! యా రాహునకును, సరసత నాక్రింద సిద్ధ చారణ విద్యా
ధరు లయుత యోజనంబులఁ, దిరముగ వసియించి లీలఁ దిరుగుదు రచటన్. 101

క. పరికింప సిద్ధ విద్యా, ధరులకుఁ బదివేలు క్రింద దరలక యక్షుల్
మఱియును భూతప్రేతలుఁ, జరియింతురు రాక్షసులుఁ బిశాచులుఁ గొలువన్. 102

ఆ. వారిక్రిందఁ దగిలి వాయువశంబున
మలయుచుండు మేఘమండలంబు
మేఘమండలంబు మీఁదగుచుండు ‡భూ
మండలంబు క్రిందనుండు నధిప! 103

---

1. వచ్చు (తం) 2. నడికి తొలఁగు (తం. వా.)
‡ "తతోఽ ధస్తా చ్ఛత యోజనాంతరే ణేయం పృథివీ" అని మూ. (24-4)

వ. అట్టి భూమండలంబుక్రింద యోజనాయుతాంతరంబున (నండకటా హాయా
మంబు) గలిగి, క్రమంబున నొండొంటికిం గ్రిం దగుచు నతల, వితల, సుతల,
రసాతల, తలాతల, మహాతల, పాతాళలోకంబు లుండు. అట్టి బిలస్వర్గంబుల
యందు నుపరిస్వర్గంబున కధికం బైన కామభోగంబులను, ఐశ్వర్యానందములను,
సుసమృద్ధ భవనోద్యాన క్రీడావిహారస్థానంబుల నన్నుభవింపుచు, దైత్య దానవ
కాద్రవేయాది దేవయోనులు నిత్య ప్రముదితానురక్తు లగుచుఁ గళత్రాపత్య
సుహృద్బంధు దాసీదాస పరిజనులతోఁ జేరుకొని, మణిగణ ఖచితంబు లగు
నతిరమణీయ గృహంబులయందు నీశ్వరునివలనం జేటులేని కాయంబులం గలిగి,
వివిధ మాయావిశేష వినిర్మిత (నూతన కేళీసదన విహరణ మండప విచిత్రోద్యా
నాదులయందుఁ గేళీవినోదంబుల సలుపుచుం) జరియింతురు. అంత. 104

సీ. అట్టి పాతాళంబులందును మయకల్పితము లగు పుటభేదనములయందు
బహు రత్ననిర్మిత ప్రాకార భవన గోపుర సభా చైత్య చత్వరవిశేష
ములయందు నాగాసురుల మిథునములచే శుక పిక శారికానికర సంకు
లముల శోభిల్లు కృత్రిమభూములను గల గృహములచే నలంకృతము లగుచుఁ

ఆ. గుసుమ ఫల సుగంధి కిసలయ స్తబక సం
తతులచేత నవనతంబు లైన
[1]యతుల రుచిర నవ లతాంగనాలింగిత
విటపములను గలుగు విభవములను. 105

వ. మఱియు నానావిధ జలవిహంగమ మిథునంబులం గలిగి, నిర్మల జలపూరితంబు
లై మత్స్యకుల సంచారక్షుభితంబు లైన, కుముద కువలయ కల్హార నీలనీరజ
లోహితశతపత్రాదికంబులఁ దేజరిల్లెడు సరోవరంబులం గల యుద్యానవనంబుల
యందుఁ గృతనికేతు లై, స్వర్గభూముల నతిశయించిన వివిధ విహారంబులు గలిగి,
యహోరాత్రాది కాలవిభాగభయంబు లేక మహాహిప్రవరుం డైన శేషుని
శిరోమణిరోచులచే నంధకారోపద్రవంబు లేక యెల్లప్పుడు దివసాయమానంబుగా
నుండు నాలోకంబునందు నఖిలజనులు దివ్యౌషధిరస రసాయనంబుల ననవరతంబు
నన్నపానంబులుగా సేవించుటంజేసి యాధివ్యాధులును, వలితపలితంబులును,
జరారోగంబులును, శరీరవైవర్ణ్యంబులును, స్వేదదౌర్గంధ్యంబులునుఁ, గలుగక
పరమకల్యాణమూర్తు లగుచు హరిచక్రభయంబు దక్క నన్యం బగు మృత్యు
భయంబు నొందక యుందురు. అదియునుం గాక. 106

---

1. వృక్షరాజంబులందుల వెలయుచుండు, శారికా కీర పికములు సంతతంబు (హా)

తే. అట్టి పాతాళలోకంబునందు విష్ణు
చక్ర మెప్పుడేనియుఁ బ్రవేళంబు నొందు
నప్పు డెల్లను దైత్యకులాంగనలకు
గర్భసంపద లందంద కరఁగుచుండు. 107

చ. అతలములందు నమ్మయుని యాత్మజుఁ డైన బలాసురుండు స
న్మతిఁ జరియించు షణ్ణవతిమాయలఁ గూడి వినోద మందుచుఁ
గుతలములందు నేఁడు నొకకొందఱు నచ్చటి మాయఁ జెంది సం
తతముఁ జరించుచుండుదురు దప్పక మోహనిబద్ధచిత్తు లై. 108

వ. అట్టి బలుని యావలింతలను సైర్వరిణులు కామినులు పుంశ్చలు లను స్త్రీగణంబులు జనియించిరి. ఆ కామినీజనంబులు పాతాళంబుఁ బ్రవేశించిన పురుషునికి (హాటక రసం బనియెడు సిద్ధరసగుటిక నిచ్చి, రససిద్ధునిం గావించి, యతనియందు) స్వ విలాసావలో కానురాగ స్మిత సల్లా పోపగూహనాదుల నిచ్ఛావిహారంబు సల్పు చుండ, నా పురుషుండు మదాంధుం డై, తానె సిద్ధుండనియును, నాగాయుత బలుం డనియును దలంచి, నానావిధ రతిక్రీడలఁ బరమానందంబు నొందుచుండు.

సీ. హాటకేశ్వరుఁ డైన యంబికాధీశుండు వితలంబునందుల వేడ్క నిలిచి
తనదు పార్షద భూతతతులతో బ్రహ్మ స ర్గోపబృంహణమున కొక్కచోటఁ
భార్వతీసంభోగపరుఁ డగుచుండఁగా వారల వీర్యంబువలనఁ బుట్టి
నట్టిది హాటకి యనియెడు నది యని లాగ్నులు భక్షించి యంత నుమియ

తే. నదియు హాటక మనుపేర నతిశయిల్లి
వన్నెమీఱుచు శుద్ధసువర్ణ మయ్యె
నా సువర్ణంబు నా లోకమందు నున్న
జనులకెల్లను వినుత భూషణము లయ్యె. 110

సీ. ఆక్రింద సుతలంబునందు మహాపుణ్యుఁ డగు విరోచనపుత్రుఁ డై నయట్టి
బలిచక్రవర్తి యా పాకశాసనునకు ముద మొసంగఁగఁగోరి యదితిగర్భ
మున వామనాకృతిఁ బుట్టి యంతటఁ ద్రివిక్రమ రూపమునను లోకత్రయంబు
నాక్రమించిన దానవారాతిచేత ముందఱిన యూఁబడిన యింద్రత్వ మిట్లు

ఆ. గలుగువాఁడు పుణ్యకర్మసంధానుండు
హరిపదాంబు జార్చనాభిలాషుఁ
డగుచు శ్రీరమేశు నారాధనము సేయు
చుండు నెపుడు నతిమహోత్సవమున. 111

ఆ. ‡యంత నా విభుండు నఖిలలోకంబుల
సంహరింపఁ గోరి చండకోప
వశత సృజనఁజేయు వరుస నేకాదశ
రుద్రమూర్తు లనెడు రౌద్రమతుల. 121

ఆ. అట్టి రుద్రమూర్తు లతుల త్రినేత్రులు
నఖిలశూలహస్తు లగుచు నుందు
రందు నున్న ఫణికులాధిపుల్ శేషుని
పాదపంకజముల భక్తిఁ జేరి. 122

ఆ. నమ్రులగుచు ననుదినంబును మౌళిర
త్నములచేతఁ గడు ముదంబు నొంది
కోరికలు దలిర్ప నీరాజనంబుల
నిచ్చుచుందు రెపుడు మచ్చికలను. 123

వ. మఱియు నా సంకర్షణమూర్తిం జేరి [1]నాగకన్యకలు కోరికలుగలవార లగుచు, నొప్పెడి శరీరవిలాసంబులంజేసి యగరు చందన కుంకుమ పంకంబులను లేప నంబులు సేయుచు, సంకర్షణమూర్తి దర్శనస్పర్శనాదుల నుద్భోధిత మకరధ్వజా వేశిత చిత్తంబులు గలిగి, చిఱునవ్వు లొలయ నధికాభిలాషంజేసి స్మితావలోక నంబుల సవ్రీడిత లై యవలోకింపుచుండ, ననంతగుణంబులం గల యనంతదేవుం డుపసంహరింపంబడిన క్రోధంబుఁ గలిగి, లోకంబులకు క్షేమంబు గోరుచు సురా సుర సిద్ధ గంధర్వ విద్యాధర మునిగణంబు లనవరతంబు ధ్యానంబు సేయ, సంతత సంతోషాతిశయంబున [2]భ్రూభ్గన్ను వెట్టుచు, సలలిత గీతవాద్యంబుల నానందంబు నొందుచుఁ, దన పరిజనంబుల నతిస్నేహంబున నవలోకింపుచు, నవ తులసీ గంధ పుష్పరసామోదిత మధుకరవ్రాత మధురగీతంబులు గల వైజయంతీ వనమాల ధరియింపుచు, నీలాంబరధరుండును, హలధరుండును నగుచు, నితండు మహేంద్రుండో హరుండో యనుచు జనంబులు వలుకుచుండఁ గాంచనాంబర ధరుం డై ముముక్షువులు ధ్యానంబులుసేయ, నధ్యాత్మవిద్యాయుక్తం బైన యానందహృదయ గ్రంథిని భేదించు. అట్టి శేషుని స్వాయంభువుం డగు నారదుండు తుంబురుప్రభృతు లగు ఋషిశ్రేష్ఠులతోఁ జేరుకొని కమలాసనుని సభాస్థానంబునందు నిట్లు స్తుతియించుచుండు. 124

---

‡ 'దేరియుండు బ్రహ్మదేవుని దైనందిన ప్రళయమునందు నాగవిభుని వలన నుదయమైన వార లేకాదశ రుద్రమూర్తు లధిక రౌద్రమతులు.' (క. చ. ట.) 1 నాగకన్నియలు (హ)
2. భ్రూఁగన్ను (తం. వా.)

సీ. ఓలిమై నెవ్వని లీలావినోదముల్ జన్మ సంరక్షణ క్షయములకును
హేతువు లగుచుండు నెవ్వనిచూపుల జనియించె సత్త్వ రజ స్తమంబు
లెవ్వని రూపంబు లేకమై బహువిధం బులను జగత్తులఁ బ్రోచుచుండు
నెవ్వనినామంబు లెఱుఁగక తలఁచిన యంతన దురితంబు లడఁగుచుండు

తే. నట్టి సంకర్షణాఖ్యుండు నవ్యయుండు
నైన శేషుని వినుతిసేయంగఁ దరమె?
తలఁప నెప్పుడు వాఙ్మనంబులకు నింక
మూఁడులోకంబులందును భూతతతికి. 125

ఆ. మఱియుఁ బెక్కుగతుల మాబోఁటివారలఁ
బ్రోవఁదలఁచి శేషమూర్తి సాత్త్వి
కస్వభావ మొందెఁ గణఁకతో నట్టి శే
షునకు ప్రొక్కుచుందు ననుదినంబు. 126

వ. మఱియు నా శేషుని నెవ్వండేనియు నాకస్మికంబుగ నైనను, నార్తుం డగుచు నైనను స్మరించినమాత్రమున నఖిలపాపంబులం బాసి సకల శ్రేయస్సులం బొందు. అట్టి శేషుని నే ముముక్షువు లాశ్రయించి (ధ్యానం బొనర్చి భవబంధ నిర్ముక్తు లగుదురు.) అతని ఫణంబులయందు భూగోళం బణుమాత్రం బగుచు నుండు. అతనిమహిమలు గణుతింప సహస్రజిహ్వాలు గల పురుషుఁ డైన నోపం డని పలుకుచుందురు. ఆ యనంతుండు పాతాళంబున నుండి సకలలోక హితార్థంబు భూమిని ధరియించు. అని లోక తిర్య గ్మనుష్య గతులను, లోకస్థితియును శుకయోగీంద్రుండు వినుపించి, యింక నేమి వినుపింతు నెఱింగింపుము. అనినం బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 127

క. మునివర! లోకచరిత్రం, బనుపమము మహావిచిత్ర మగునట్లుగ నా
కును వినుపించితి వంతయుఁ, బనుపడి నా చిత్తమందుఁ బాయక నిలిచెన్. 128

వ. అనిన శుకయోగీంద్రుం డిట్లనియె. 129

ఆ. జంతుజాలములకు శ్రద్ధలు త్రిగుణాత్మ
కములు గాన వారి కర్మగతుల
తారతమ్యములును దగిలి యిన్నియు వివి
ధంబు లగుచు సంతతంబు నుండు. 130

వ. నరేంద్రా! ప్రతిషిద్ధలక్షణం బగు నధర్మం బాచరించు *(నరుని శ్రద్ధ విపరీత ముగాఁ బ్రవర్తిల్లు. అట్టివానికిఁ గలిగెడు కర్మఫలంబును విపరీతంబుగానె యుండు. కావున ననా ద్యవిద్యా కామప్రవర్తనలవల్లఁ బెక్కుతెఱంగులఁ గలిగెడు కర్మగతుల సంగ్రహంబుగ నెఱింగించెద.· అనిన శుకునితోఁ బరీక్షి న్నరేంద్రుం డిట్లనియె. 131

ఆ. మునివరేణ్య! నరకములు ముజ్జగంబుల
యందొ? యంతరాళమందొ? వెలినొ?
యదియుఁ గాక దేశమం దుండు భూవిశే
షములయందొ? తెలుపు సంతసమున. 132

వ. అనిన శుకయోగీంద్రుం డిట్లనియె. 133

అధ్యాయము — ౨౬

—: శుకయోగి పరీక్షిత్తునకు నరకలోకవర్ణనము దెలుపుట :—

క. ఎడతెగక ముజ్జగంబుల, కడపల న య్యామ్యదిశను గదలక [1]నిలుచుఁ
గడు ఘోరములుగ నరకము, లడరంగా నంతరాళమందుల నధిపా! 134

వ. మఱియును దక్షిణంబున నగ్నిష్వాత్తాది పితృగణంబులు తమ గోత్రజులకు (మేలు గలుగుట కొఱకు సత్యంబు లగు నాశీర్వాదంబుల నొసంగు చుండుదురు. అచ్చటి పితృపతి యగు శమనుండు తన లోకంబునకుం జనుదెంచు జంతువుల కర్మంబులకుం దగిన ఫలంబుల నిచ్చి శిక్షింపుచునుండు. నరక ప్రశంస వినుము. తామిస్రంబును, అంధతామిస్రంబును, రౌరవంబును, మహారౌరవంబును, కుంభీపాకంబును, కాలసూత్రంబును, అసిపత్రవనంబును, సూకరముఖంబును, అంధకూపంబును, క్రిమిభోజనంబును, సందంశమును, తప్తోర్మియును, వజ్రకంటక శాల్మలియు, వైతరణియు, పూయోదమును, ప్రాణరోధంబును, విశసనంబును, లాలాభక్షణమును, సారమేయాదనంబును, అవీచిరయంబును, రేతఃపానంబును ననునేకవింశతి మహానరకంబులును, మఱియును, శూకరకర్దమంబును, రక్షోగణ భోజనంబును, శూలప్రోతమును, దందశూకంబును, అవట నిరోధనంబును, అపర్యావర్తనంబును, సూచీముఖంబు నన (సప్తవిధ నరకంబుల తోడి) యష్టావింశతి నరకంబులు గల వని కొందఱు నొడువుదురు. అందు 135

క. [2]పర విత్త కళత్రంబులఁ, [3]బరికింపక యపహరించు పాపాత్ముఁడు దు
ష్కర పాశబద్ధుఁ డై యమ,పురుషులచే నధికబాధఁ బొందుచునుండున్. 136

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. నిలిచె, ప్పుడుబాయకుండు నరకము (క. ట. త. డ. ద. బ.)
2. పరపుత్ర (హ. తం. వా.) 3. బరికింపఁగ నపహసించు (హ. తం. వా.)

వ. మఱియు ని వ్విధంబున బాధితుం డగుచుఁ దామిస్రనరకంబునం బడి యనళ నాద్రి పాతన దండతాడన తర్జనాది బాధలం జెంది, కడుభయంబున మూర్ఛలం బొందుచుండు. 137

క. పరకాంత నెవ్వఁ డేనియుఁ, బురుషుం డుండంగ మొఱఁగి పొందిన యమకిం
కరు లతనిఁ బట్టి వడిఁ ద, త్తరమునఁ బడవై తు రంధతామిస్రమునన్. 138

వ. నరేంద్రా ! యెవ్వఁడేనియుఁ గుటుంబపోషణార్థంబు పరులకు ద్రోహంబుసేయు, నా నరుండు రౌరవనరకంబునం బడు. (ఎవ్వం డిహలోకంబునందు స్వేచ్ఛా విహారంబున సంచరించుచుఁ బరోపద్రవ పరాఙ్ముఖంబులై యుండు పశు పక్షి మృగాదుల బాధించు, నా యా మృగంబులు రురు రూపంబులఁ దాల్చి యట్టి పాపిజనుల నానావిధయాతనల)బాధించుటంజేసి రౌరవ, మహారౌరవ నరకంబులం బడు. ఎవ్వఁ డేనియు దేహపోషణార్థంబు పశుమృగాదుల ప్రాణనిరోధంబుఁ జేసి వధించు, నా నిష్కరుణుం డైన పురుషునిం గుంభీపాక నరకంబులయందుఁ గల తప్త తైలంబులం బెక్కు బాధలం బొందింతురు. 139

సీ. తల్లి దండ్రులకును ధరణీ సురులకును నహితంబుఁ జేసిన యట్టివాఁడు
కాలసూత్రం బను కడుఁ దీవ్రనరకంబు నందున నందంద యయుతయోజ
నాయత [2]తామ్రపాత్రాదుల సూర్యుండు మీఁదఁ గ్రింద వహ్ని మిగుల మండ
నత్యంత తృట్పిపాసాదులచేతను బాధితుం డగుచుండుఁ బాయ కెపుడు

ఆ. పరువు వెట్టుచున్నఁ బడియున్న నిలిచినఁ
గదలకున్నఁ జాల నొదిఁగియున్న
బాధఁ బొందుచుండుఁ [3]బశువు రోమము లెన్ని
వరుస నన్ని వేల వత్సరములు. 140

వ. మఱియు వేదమార్గంబు విడిచి పాషండమార్గంబు లాచరించు పురుషుని నసిపత్ర వనంబునందు యమకింకరులు తఱిట్ల నడుచుచుఁ బరిహసింపుచుం దోలునెడ నా యసిపత్రంబు లిరుగెలంకుల శరీరంబు దెంపుచుండ నడుగడుగున మొఱఁబెట్టు చుండ బాధింపుచుండుదురు. 141

క. దండింపఁ దగనివారల, దండించిన విప్రవరుల తనువులు ముట్టం
దండించిన దుర్మతులం, †దండింతురు కాలసూత్ర నరకము లందున్. 142

---

1. మూషకాదుల బిల (హ) 2. పాత్రాదులందుల (హ. తం. వా.) 3. బశురోమము లెక్క, వరుస నపరిమేయ వత్సరములు. (హ. తం. వా.)

† "సూకరముఖం"— అని మూలము. దీని కనువుగా (దండింతురు సూకరముఖ నరకము లందున్" అని యుండవచ్చును.

ఆ. మఱియు నట్టి దుష్టమానవుఁ గింకరుల్
[1]విఱిచి చెఱుకుఁగోల [2]విఱిచినట్లు
బాధ పెట్టు చుండఁ బడి మూర్ఛఁ జెందుచు
[3]మొఱలు వెట్టుచుండు భూపవర్య ! 143

వ. నరేంద్రా ! యెవ్వండేనియు నీశ్వర కల్పిత వృత్తిఁ గల జంతువుల హింసించుఁ నట్టివాని నంధకూపం బను నరకంబునం బడవై చిన (నందు నతండు దొల్లి తాను జేసిన) భూతద్రోహంబున నచ్చట వివిధ క్రూర పక్షి, మృగ, పశు, సర్ప, మశక, మత్కుణ, మక్షికాదులచేత హింసం బొందుచు, మహాంధకారంబునందు నిద్రానుభవ సుఖలేశంబును లేక కుశరీరంబునందుల జీవుండునుం బోలె (మృత ప్రాయుం డై యుండు. 144

క. తన కలిమి నెవ్వఁడేనియుఁ, దన బాంధవవరులఁ గూడి తగఁ గుడువక తా
నును వాయసంబు భక్షిం,చిన మాడ్కిన్ దిన్న వాఁడు శీఘ్రమె యచటన్. 145

క. క్రిమిభోజన మనియెడి నర,కమునం బడి క్రిములె కూడుగాఁ గుడుచుచుఁ దాఁ
గ్రిమి యగుచు లక్షపరిమా,ణము గల క్రిమిగుండమందు నాటుక యుండున్.

వ. మఱియు నీ భూలోకంబున నెవ్వఁడేనియు నవిపన్నుం డై చౌర్య బలోద్వృత్తుల బ్రాహ్మణాదుల హిరణ్యరత్నాది ద్రవ్యంబుల [4]నపహరించు, నట్టి పురుషుని [5]నగ్ని వర్ణంబు లగు నయఃపిండంబుల (న్నగ్నితప్తంబు లగు శూలంబుల న్నతని) శరీరంబునం దివియుచుండుదురు. మఱియును మదనాతురు లగుచు స్త్రీపురుషు లగమ్యాగమనంబులు సేసిరేని, నట్టివారి యమలోకంబున (నతితీక్ష్ణ కశాతాడి తులం)జేసి, యగ్నిమయంబు లై న యుక్కు ప్రతిమల నాలింగనంబు సేయింతురు.

ఆ. [6]సర్వజంతుజాల సంగమ మొందెడు
వానిఁ బట్టి కట్టి వజ్ర దంష్ట్రి
కములు గలుగునట్టి ఘనతర శాల్మలీ
తరువులందుఁ జేర్చి దంతు రెపుడు. 148

---

1. కరచి (క. త. డ. ద. బ.) 2. నరకినట్లు (క. త. డ. ద. బ.) 3. పొరలు వెట్టుచుండు (హ. క. చ. ట. త.)

4. నపహరించినను బ్రాహ్మణుఁ డితరజాతివారల హిరణ్య ద్రవ్యంబుల నపహరించిన నట్టి పురుషుని (క. ట. త. డ. ద. బ. తం.) 5. ఇనప తండసంబుల (క. చ. ట. త. జ. డ. ద. బ.) 6. పర్వకాలములను పణతుల బొందిన (క. ట. త. డ. ద. బ.)

ఆ. పార్థి వేంద్ర! నరుఁడు పాషండ దర్శనుఁ
డగుచు ధర్మమార్గ మడఁచెనేని
వాఁడు నరకమందు వై తరణీ నది
నుడుగ కెపుడుఁ బొరలి పడుచునుండు. 149

వ. మఱియు నట్టి వై తరణీ నదియందు జలగ్రాహంబులు దిగిచి భక్షింపం బ్రాణం బులు నిర్గమింపఁ దన పాపంబు లుచ్చరింపుచు వి ణ్మూత్ర పూయ శోణిత కేశ నఖాస్థి మేదో మాంస వసా వాహినిఁ దప్తుం డగుచునుండు. విప్రుండు శూద్ర కామినులం బొంది శౌచాచారంబులం బాసి గతలజ్జుం డై పశువునుం బోలి చరియించెనేని, నతండు నరకంబునుం బొంది యందు పూయ వి ణ్మూత్ర లాలా శ్లేష్మ పూ ర్ణా ర్ణవం బందు (ద్రొబ్బంబడి) యతి బీభత్సితంబు లగు నా ద్రవ్యంబుల భుజింపుచుండు. 150

క. శునకములఁ బెంచి యెవ్వం, డనయంబును వేఁట సలిపి యాత్మార్థముగా
వనమృగములఁ జంపును నా, మనుజాధము నస్త్రములను మర్దింతు రొగిఁ. 151

ఆ. [1]ద్రవ్యలోభమునను దంభార్థ మై పశు
వులను జంపి జన్నములను జేయు
వానిఁ బట్టి యముని వారలు గోయుచు
నుందు రెపుడు మిగుల సందడిలుచు. 152

వ. కామమోహితుం డై యెవ్వఁడేనియుఁ దనభార్యచేత రేతఃపానంబు సేయించు, నా పాపాత్ముని రేతోహ్రదంబునం ద్రోచి యా రేతంబునె పానంబు సేయించు దురు. రాజభటు లైనను, చోరులైనను ధనిక గ్రామంబులపైఁ బడి యందు గృహదాహంబు సేయువారలను, విషంబు పెట్టువారలను, వజ్రదంష్ట్రులు గల వింశత్యుత్తర సప్తశత శునకంబు లెడతెగక తిగిచి భక్షింపుచుండు. 153

సీ. లంచంబుఁ గొని సాక్షి వంచించి యనృతంబుఁ బలికెడు పాపాత్మఁ బట్టి కట్టి
యంత మానక వీచి యను నరకమునందు శతయోజనోన్నత శైలశిఖర
మునఁ దలక్రిందుగా నునిచి యధోముఖంబుగఁ బడద్రొబ్బిన బొబ్బ లిడుచు
కల్లోలములు లేని కమలాకరము వోలె [2]చటుల మై యున్న పాషాణమందు

తే. పడినయంతన దేహంబు పగిలి వెక్కు
తునుక లై పాసి యది గూడికొనుచు నుండు
[3]నుండి [4]యాకులమును నొందుచుండుఁ గాని
చావు లేకుండు నా దుష్టజంతువునకు. 154

---

1. జృంభణమున నరుడు దంభార్థమై పశు (ట.డ.ద.బ.) 2. చదరమై (క.త.డ.బ.తం.వా.)
3. దండియాపద నొందుచునుండుగాని (క) 4. యాకులతను (తం. హా.)

ఆ. †సోమయాజిభార్యఁ గామించి పొందిన
వానిఁ గపట మద్యపాన సోమ
పాన మనుదినంబుఁ జానంబు సేయు విట్
క్షత్త్రియులను బట్టి సంభ్రమమున. 155

ఆ. ఱొమ్మ ద్రొక్కి మోము ఱిమ్మ వట్టఁగ మోది
యనల ముఖమునందు నగ్ని వర్ణ
ముగను గాఁచి వక్త్రిమున నిండఁగా నుక్కు
నీరు వోతు రేచి నిష్ఠురముగ. 156

వ. మఱియు నీచవర్ణుండు నిష్ఠ సలుపుచుం దపో దాన విద్యాచారంబులం బెద్దల కవ
మానంబు సేయువాఁడు క్షారకర్దమం బను నరకంబునందు నధోముఖుం డగుచు
బాధలం బొందు. స్త్రీపురుషు లెవ్వరేనియు శరీర రక్షణార్థంబు పశువుల,
మానవుల బలి యిచ్చిరేనియు, వారలను నిరయంబునందు యమకింకరులు సురి
యలం దునిమి, తద్రక్తంబు పానంబు సేయుచుఁ బాఱాడుచుండుదురు. గ్రామా
రణ్యంబులయందు జంతువుల శూలప్రోతంబులం గావించి హింసింపుచు హర్షించు
చున్న వారలను, శూలప్రోతం బను నరకంబు నందు శూలప్రోతులం జేసిన,
క్షుత్పిపాసా పరు లగుచుండఁ గంక గృధ్రాదులు (తీక్ష్ణ తుండాగ్రంబునఁ)దిగిచి
భక్షింపుచుండు. మఱియు ధూర్తస్వభావంబునఁ జంతుపీడనంబుఁ గావించెడు
పాపాత్ముల దందశూకం బను నరకంబునందు నైదు నేడు ముఖంబుల సర్పం
బులు గఱచుచు నుండు.‡ 157

ఆ. ఎనయ దొడ్లలోన నిండ్లలో నైనను
బశు పతంగ హరిణపంక్తి నెల్లఁ
బట్టి హింససేయు పాపాత్ము విషవహ్ని
ధూమశిఖల ద్రొబ్బుదురు నృపాల! 158

క. తన యింటికి వచ్చిన [1]మను,జుని నతిథిం గ్రోధదృష్టిఁ జూచిన వానిం
గనుఁగవల వజ్ర దంష్ట్రలఁ, దనరిన యూ కంక గృధ్రతతి భక్షించున్. 159

---

† "యస్త్విహవై విప్రో రాజన్యో వై శ్యో వా సోమపీథ స్తత్కళత్రం వా సురాం వ్రతస్థో వా పిబతి ప్రమాదతః"—అని మూలము (26-28)

‡ 'కన్యకారత్నంబు నొరులకు ప్రదత్తంబుచేసి మరొక వరునకు నొసగు పాపకర్ముని బట్టి కొట్టియు వాని వక్త్రంబున హాలాహలంబు పోసి నిగ్రహింతురు మరియు' (చ. ట. జ. డ. బ.)

1. భిక్షుని, నతిథిని (చ. త. జ. డ.)

మ. ధనవంతుం డగు మానవుండు గడఁక ధర్మోపకారంబులన్
ఘనతం జేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం
బను నా దుర్గతిఁ బట్టి త్రోచి [1]నిధికాపై యున్న భూతం బటం
చును బాశంబులఁ బట్టి కట్టి వడితో నొప్పింతు రత్యుగ్రు లై. 160

ఆ. నరవరేణ్య! యిట్టి నరకముల్ యమలోక
మందుఁ గలవు మఱి సహస్ర సంఖ్య
లందు శమనదూత లనిశంబు బాధింతు
రవని ధర్మదూరు లైన నరుల. 161

ఆ. ధర్మవంతులెల్లఁ దప్పక స్వర్గంబు
నందు భోగసమితిఁ బొందుచుందు
రెలమిఁ బుణ్యపాపముల శేషములవల్లఁ
బుట్టుచుందు రవనిఁ బుణ్యచరిత! 162

వ. నరేంద్రా! మోక్షమార్గంబు మున్నె వినుపించితి. ఇప్పుడు నీకు నెఱింగించిన వెల్లను బ్రహ్మాండకోశంబునం జతుర్దశకోశంబు లని పురాణంబులు వలుకుచుండు. అట్టి బ్రహ్మాండంబు శ్రీమన్నారాయణుని స్థూలశరీరం బగుటంజేసి బ్రహ్మాండం బెవ్వరు వర్ణింతు, రెవ్వరు విందురు, వారలకు సకలశ్రేయస్సులుం గలుగు. ఈశ్వర స్థూలశరీరంబు దెలిసినవారికి శ్రద్ధాభక్తులం జేసి సూక్ష్మదేహంబు నెఱుంగవచ్చు. భూ ద్వీప వర్ష సరి దద్రి నభ స్సముద్ర పాతాళ దిఙ్నరక తారాగణ లోక సంస్థితం బైన సకల జీవనికాయం బై యద్భుతం బైన శ్రీహరి స్థూలశరీరంబు వినుపించితి. [2]అని 163

చ. జలజభవాది దేవముని సన్నుత! తీర్థపదాంబుజాత! నిర్మల నవరత్నమూపుర విరాజిత! కౌస్తుభభూషణాంగ! యు
జ్జ్వల తులసీ [3]కురంగ మద వాసనవాసిత దివ్యదేహ! శ్రీ
నిలయ శరీర! కృష్ణ! ధరణీధర! భానుశశాంకలోచనా! 164

క. శ్రీతరుణీ హృదయస్థిత!, పాతకహర! సర్వలోకపావన! భువనా
తీత గుణాశ్రయ! యతి వి, ఖ్యాత! సురార్చితపదాబ్జ! కంసవిదారీ! 165

---

1. యిదిగాపై యున్న (హ. తం. వా.) 2. స్థూలదేహంబు (హ. తం. వా.)"పరమాత్మన ఉపగేయం హ్యనిష్టమపి శ్రద్ధాభక్తి విశుద్ధ బుద్ధిర్వేద" (28–38) 3. మరంద (హ)

మత్తకోకిల. దండితారిసమూహా ! భక్తనిధాన ! దానవిహార ! మా
ర్తాండమండల మధ్యసంస్థిత ! తత్త్వరూప ! గదాసి కో
దండ శంఖ సుదర్శనాంక ! సుధాకరార్క సునేత్ర ! భూ
మండలోద్ధరణార్తపోషణ ! మత్త దైత్యనివారణా ! 166

గద్య. ఇది శ్రీ సకల సుకవిజనానందకర బొప్పనామాత్య పుత్ర గంగనార్య ప్రణీతం బైన శ్రీమద్భాగవత పురాణంబునందు భరతాత్మజుం డైన సుమతికి రాజ్యాభిషేకంబును, పాషండదర్శనంబును, సుమతి పుత్ర జన్మవిస్తారంబును, గయుని చరిత్రంబును, గయుని సంస్తుతియు, భూ ద్వీప వర్ష సరి ద్గ్రి నభ స్సముద్ర పాతాళ ది జ్నరక తారకాగణ సంస్థితియును ననుకథలు గల పంచమస్కంధంబు నందు ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

ఓమ్

శ్రీ మహా భాగవతము

—•—

షష్ఠ స్కంధము

శా. † శ్రీవత్సాంకిత కౌస్తుభస్ఫురిత లక్ష్మీచారు వక్షస్థ్సల
శ్రీవిభ్రాజితు నీలవర్ణు శుభరాజీవాతుఁ గంజాతభూ
దేవేంద్రాది సమస్తదేవ మకుటోద్దీప్తోరు రత్నప్రభా
వ్యావి ద్ధాంఘ్రిసరోజు నచ్యుతుఁ గృపావాసుం బ్రశంసించెదఁ. 1

ఉ. నిండుమతిం దలంతుఁ గమనీయభుజంగమరాజమండలీ
మండనుఁ జంద్రఖండ పరిమండితమస్తకుఁ దారమల్లికా
పాండురవర్ణుఁ జండతరభండను హేమగిరీంద్రచారుకో
దండు మహేశు గంధగజదానవభంజను భక్తరంజనుఁ. 2

ఉ. హంసతురంగముం బరమహంసము నంచితదేవతా కులో
త్తంసము నాగమాంత విదిత ధ్రువ పుణ్యరమావతంసముం
గంసజిఘాంసు నంశమును గర్భురసూత్ర సమావృ తాంసముఁ
[1]హింస నడంచు బ్రహ్మము నహీనశుభంబులకై భజించెదన్. 3

ఉ. మోదకహస్తునిఁ సమదమూషకవాహను నేకదంతు లం
బోదరు నంబికాతనయు నూర్జితపుణ్యు గణేశు దేవతా
హ్లాదగరిష్ఠు దంతిముఖు నంచిత భక్త ఫల ప్రదాయకుఁ
మోదముతోడ హస్తములు మోడ్చి భజించెద నిష్టసిద్ధికిఁ. 4

---

† ఈ పద్యము క. ట. డ. బ. లలో లేదు. 4140 క. లో ఈ క్రిందిపద్య మున్నది.

క. శ్రీరామనామ : పావన, కారుణ్య సరోజనేత్ర : కౌసల్యసుతా
భారతిపతి మునిసేవిత :. చారుకృపాలోల : రామచంద్ర నృపాలా :

ఆంధ్రసాహిత్య పరిషత్తు (15) 1533, 4168 లలోను, జ. ట. డ. బ. లలోను ఈక్రింది పద్య మున్నది.

క. శ్రీ విశ్వభారభరణా, ప్రౌఢిమ్య విభాసమాన ఫణిరాణ్మణిభ బా
హా విపుల విజయ దోహల, రావణ మదకరి మృగేంద్ర; రామనరేంద్రా !

1. హింస నడంచు నబ్జభవు నెల్లసుఖంబులకై భజించెదన్ (చ)

ఉ. కల్లతనంబు గాక పొడగట్టిన పూర్వపురీతి నేఁడు నా
యుల్లమునందు నుండుము సమున్నత తేజముతోడ భక్తి రం
జిల్లిన చూపుగూడ విధిఁ జెందిన ప్రౌఢ బుధాళి నీడ మా
తల్లి దయామతల్లి ప్రణతద్రుమకల్పకవల్లి భారతీ! 5

క. విలస త్కంకణరవరవ, కలితం బగు నభయ వరద కరములు బెరయం
జెలరేఁగి భక్తులకు నల, కలుములు దయసేయు జలధికన్యకఁ దలఁతున్. 6

క. కాళికి బహుసన్నుత లో, కాళికి కమనీయ వలయ కరకీలిత కం
కాళికి తాపస మానస, కేళికి వందనము సేసి కీర్తింతు మదిన్. 7

8

వ. అని యిష్టదేవతా ప్రార్థనంబు సేసి.

చ. పరమసమాధిధుర్యుఁ బటు పావనకర్మ విధేయు దేవతా
వర నర వంద్యు సద్వివిమలవాక్యు జనార్దన కీర్తన క్రియా
భరణ సమర్థు వేద చయ పారగు భవ్యుఁ ద్రికాలవేది భా
సురమతిఁ గొల్చు టొప్పు బుధశోభితుఁ బుణ్యుఁ బరాశరాత్మజున్. 9

క. వ్యాసుని భగవ త్పదసం, వాసుని నాగమ పురాణ వర విష్ణుకథా
వాసుని నిర్మల కవితా, భ్యాసుని పదపద్మయుగము భావింతు మదిన్. 10

సీ. వరకవి తోద్రేకి వాల్మీకిఁ గొనియాడి భాగవతార్థ వైభవముఁ బలుకు
శుకమంజులాలాపు శుకయోగిఁ బ్రార్థించి బాణ మయూరుల ప్రతిభ నొడివి
భాస సౌమిల్లక భారవి మాఘుల ఘన సుధా మధుర వాక్యములఁ దలఁచి
కాళిదాసుఁ గవీంద్ర[1]కల్పవృక్షముఁ గొల్చి నన్నపాచార్య వర్ణనలఁ బొగడి

తే. వెలయఁ దిక్కన సోమయాజుల భజించి
యెల్లనామాత్య భాస్కరు నిచ్చ [1]నునిచి
సుకవిసోముని నాచనసోము నెఱఁగి
కవిమనోనాథు శ్రీనాథు ఘనత మెచ్చి. 11

ఉ. ఎమ్మెలు నెప్పనేల? జగ మెన్నఁగఁ బన్నగరాజశాయికిన్
సొమ్ముగ వాక్యసంపదలు సూఱలు చేసినవాని భక్తి లో
నమ్మినవాని భాగవత నైష్ఠికుఁ డై తగువానిఁ బేర్మితో
బమ్మెర పోతరాజు కవిపట్టపురాజుఁ దలంచి మ్రొక్కెదన్. 12

వ. అని సకల సుకవి నికరంబులకు ముకుళిత కరకమలుండ నై. 13

---

1. గొలిచి (తం. వా)

ఉ. ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు విభూతికారణం
బెయ్యది స న్మునీంద్రులకు నెల్లఁ గవిత్వసమాశ్రయంబు ము
న్నెయ్యది సర్వమంత్రముల నేలిన దెయ్యది మోక్షలక్ష్మిరూ
పెయ్యది దానిఁ బల్కెద సుహృద్యము భాగవ[1]తాఖ్య మంత్రమున్. 14

వ. అని శ్రీమహాభాగవత పురాణంబునందు షష్ఠస్కంధం బంధ్రభాష రచియింపం
బూని† మదీయ కవితామహాలక్ష్మికి నారాయణుండె నాథు డగుటంజేసి యీ
కృతి కృష్ణార్పణంబుఁ జేసితి. అది యెట్లనిన, నేను విద్యాభ్యాసంబునం దగిలి
కొండుక నై యుండ నొక్కనాఁడు దివంబున. 15

చ. కలిత విశేషవస్త్రములు గట్టి హిమాంబు సుగంధ చందనం
బలఁది వినూత్న భూషణము లారయఁ దాల్చి వినోదలీల నిం
పుల మృదుశయ్య నిద్రఁ దగఁ బొందినచోఁ గనుపట్టె పల్మఱుం
[2]గలయఁ దటిద్విలాసములు గట్టిగ నొక్కట నిల్చు పోలికన్ 16

సీ. ఉరవడి ప్రాగ్వీథి నుదయించు మార్తాండ కోటిబింబచ్ఛాయ గూడినట్లు
హరి హర బ్రహ్మల యాత్మలలో నుబ్బి కరుణ యొక్కట మూర్తి బెరసి నట్లు
ఖరకర కర తీవ్ర గతినిఁ గరంగుచు హేమాద్రి [3]సోగ పె ల్లెగసినట్లు
ఫణిరాజ ఫణరాజి మణిగణ విస్ఫూర్తి సుషిరంపు వెలిదల చూపినట్లు

తే. ఉట్టిపడ్డట్లు కట్టెఱు నూఁదినట్లు
తేజ మెసఁగంగ నా బ్రహ్మోల దివ్యవాణి
పూని సాక్షాత్కరించి సంపూర్ణదృష్టిఁ
జూచి యిట్లని పలికె మంజులముగాను. 17

ఉ. ఆటలు పాటలుం జదువు లద్భుతముల్ విన నొప్పు వాద్యముల్
సాటి దలంపరాని బలుసాములు మున్నగు విద్యలెల్ల నీ
కాటలు పాట లయ్యె విను మన్నిటికిన్ మెఱుఁ గిడ్డభంగి నా
చాటునఁ జాటుకారపద సాధుకవిత్వముఁ జెప్పు మింపుగన్. 18

వ. అని యానతిచ్చు జగన్మాత కృపావలోకన సుశ్లోకుండ నై యే నొక శ్లోకంబు
నాఱుణంబ నొడివితి. అది యెట్టి దనిన. 19

---

1. భాగవతార్థ (హ) † యీ కృతికిం బతిగా నద్దేవుండు గలండని వితర్కించి నాకుం గవిత్వ మహత్త్వంబు సంప్రాప్తంబగు కాలంబుఁ దలంచి నారాయణుండె దైవంబని యెఱింగి మనోరథంబు సఫలం బయ్యెనని యీ కృతిఁ గృష్ణార్పణంబు చేసితి. తా. ప. ప్రతులలో నిట్లున్నది.

2. దలమునఁ గ్రమ్మ్రొక్కొమ్మెఱుఁగు తండము రూపున (హ. తం. వా.) శి.చెంత (తం. వా.) చెంగ (క. ట. జ. డ. బ)

శ్లోకము. హంసాయ సత్త్వనిలయాయ [1]సదాశ్రయాయ
నారాయణాయ నిఖలాయ నిరాశ్రయాయ
స త్సంగ్రహాయ సగుణాయ నిరీశ్వరాయ
సంపూర్ణ పుణ్యపతయే హరయే నమ స్తే. 20

వ. ఈ శ్లోకం [2]బ ద్దేవి యంగీకరించె. అంత మేలుకాంచి యానందభరితుండ నై. నాఁటనుండి, చంద్రానుగత యగు చంద్రికయుం బోలె, నారాయణాంకితం బైన కవిత్వ తత్త్వజ్ఞానంబు గోచరం బయ్యె. దానికి ఫలంబుగా గోపికావల్లభుని నుల్లంబున నిడుకొని. 21

ఆ. పలుకఁ గలిగె మొదల భాగవతార్థంబు
భర్త కృష్ణుఁ డాయె భాగ్య మొదవె
నమృతరసము గోర నలరు చింతామణి
పాత్ర సంభవించు భంగి నిపుడు. 22

ఆ. భాగవతము తేటపఱుప నెవ్వఁడు సాలు?
శుకుఁడు దక్క నరుని సకుఁడు దక్క
బుద్ధిఁ దోఁచినంత బుధులచే విన్నంత
భక్తి నిగిడినంత పలుకువాఁడ. 23

ఉ. పుట్టిననాఁటి నుండియును బుట్టద యెట్టియ దట్టు నైనఁ జే
పట్టి నుతింపఁ జిత్తము శుభం బగు మద్వరవాక్యసీమకుం
బట్టము గట్టినాఁడ హరిఁ బాయక త త్కథనామృతంబు నే
నట్టిపడంగఁ జెప్పుదు బుధోత్తము లానుఁడు శ్రోత్రపద్ధతిఁ. 24

వ. అని. 25

సీ. శ్రీవత్స గోత్రుండు శివభక్తి యుక్తుఁ డా పస్తంబ సూత్రుఁ డపార గుణుఁడు
నేర్చారి శాసనుం డెల్లనప్రెగ్గడ పుత్రుండు వీరన పుణ్యమూర్తి
కాత్మజుం డగు నాదెయామాత్యునకుఁ బోలమాంబకు నందను లమితయశులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి సింగధీమణియు నంచితగుణాఢ్యు

తే. లుద్భవించిరి తేజంబు లూర్జితముగ
సొరిది మూర్తిత్రయం బన శుభ్రకీర్తిఁ
బరఁగి రందులఁ గసువన ప్రభువునకును
ముమ్మడమ్మను సాధ్వి యిమ్ములను వెలసె. 26

---

1. సమాశ్రయాయ (హ) 2. అ ద్దేవుం డంగీకరించె (హ.)

ఉ. †ఆడదు భర్తమాట కెదు రాడదు వచ్చినవారి వీడఁగా
నాడదు పెక్కుభాష లెడనాడదు వాకిలి వెళ్ళి కల్ల మా
టాడదు మిన్న కేని సుగుణావళి కిందిరగాక సాటి యే
చేడియ [1]లేదు చూరికులశేఖరుకస్వయ ముమ్మడమ్మకున్. 27

క. ఆ కసుపయమంత్రికిఁ బు, ణ్యాకల్పశుభాంగి ముమ్మడమ్మయు మును న
వ్యాకులచిత్తుల నిరువుర, శ్రీకర గుణగణులఁ బుణ్యశీలురఁ గాంచెన్. 28

క. అంగజసమ లావణ్య శు, భాంగులు హరి దివ్యపదయుగాంబుజ విలస
ద్భృంగాయమాన చిత్తులు, సింగయ తెలగయలు మంత్రిశేఖరు లనఁగన్. 29

క. అం దగ్రజుండ శివపూ, జం దనరినవాఁడ విష్ణుచరితామృత ని
ష్యంది పటు వాగ్విలాసా, నందోచిత మానసుఁడను నయకోవిదుఁడన్. 30

వ. కావునం గృష్ణపాదారవింద సందర్శ నాదర్శతలాయమాన చిత్తుండ నై. 31

—: ష ష్ట్యం త ము లు :—

క. శ్రీపతికి మత్పతికి నుత, గోపతికిఁ ద్రిలోకపతికి గురుజనబుధ సం
తాప నివారణ మతికిని, ద్రాపితసనకాది తతికి బహుతర ధృతికిన్. 32

క. హరికి గురు కలుషకుంజర, హరికి బలాభీలహరికి నంతస్థిస్థిత గ
హ్వరికి నరహరికి రక్షిత, కరికిఁ గరాగ్రస్థగిరికి ఘనతరకిరికిన్. 33

క. గుణికి సమాశ్రిత చింతా, మణికి మహేంద్రాది దివిజమండల చూడా
మణికిఁ బ్రకల్పితశయ్యా, ఫణికి నురోభాగ కౌస్తుభ ప్రియమణికిన్. 34

క. [2]కంసాసుర సంహరున, కంసాంచిత కర్ణకుండ లాభరణునకున్
హింసాపర పరమస్తక, మాంసకరాళిత గదాభిమత హస్తునకున్. 35

క. వర యోగిమాన సాంతఃకరణ సుధాంబోధి భావకల్లోల లస
త్పరతత్త్వ శేషశాయికిఁ, జిరదాయికి సకలభక్త చింతామణికిన్. 36

—: క థా ప్రా ర ం భ ము :—

వ. సమర్పితంబుగా నా యొనర్పంబూనిన షష్ఠస్కంధంబునకుం గథా ప్రారంభ క్రమం బెట్టిదనిన, హరి చరణస్మరణ పరిణామ వినోదులయిన శౌనకాదులకు నిఖిల పురాణేతిహాస నిర్ణయ విఖ్యాతుం డైన సూతుం డి ట్లనియె. 37

---

† 27, 28 పద్యములు (ద) లో లేవు. 1. లేరు చూరికులశేఖరు-అని యుండనగును.
2. కంసమద దమన దనుజ కంసాంచిత కర్ణకుండలాభరణునకున్ (చ. ట. త.)

ఆధ్యాయము - ౧

క. శ్రీరమణీ రమణకథా, పారాయణ చిత్తుఁడగుచుఁ బలికెఁ బరీక్షి
ద్భూరమణుఁ డాదరంబున, సూరిజ నానందసాంద్రు శుకయోగీంద్రున్. 38

సీ. షడ్గు ణైశ్వర్య శాశ్వతమూ ర్తి వై నట్టి మునినాథ ! దయతోడ ముక్తిపదము
మున్నుగా నే మార్గమున వినుపించితి వారయ నపవర్గ భూరిమహిమఁ
గ్రమ యోగసంభవ బ్రహ్మంబు [1]తోడన యనువొంద నగు నని వినుతికెక్క
మఱియు సత్త్వ రజ స్తమః ప్రభావంబుల కడిఁది యై యున్నట్టి కర్మచయము

తే. నప్పటప్పటి కణఁగని యట్టి ప్రకృతిఁ
గలుగు పురుషుని భోగార్థఘటన దేహ
కార ణారంభరూప మార్గంబు మొదలు
మాటిమాటికి నన్నియుఁ దేటపడఁగ. 39

వ. మఱియు ననేక పాపలక్షణంబు లగు నానావిధ నరకంబులును, వాని కాద్యంతం
బులును, స్వాయంభువ సంబంధియగు మన్వంతరంబును, బ్రియవ్ర తోత్తాన
పాదుల వంశంబును, ద చ్చరిత్రంబును, ద్వీప వర్ష సము ద్రాద్రి న ద్యుద్యాన
వనస్పతులును, భూమండల సంస్థానంబును, వాని పరిమాణంబును, జ్యోతిశ్చక్ర
చలన ప్రకారంబును, విభుం డైన పరమేశ్వరుం డెవ్విధంబున నిర్మించె, నా విధం
బంతయు నెఱింగించినాఁడవు. ఇప్పుడు 40

తే. కడిఁది వేదనలకుఁ గారణం బై యుండు
గుఱుతులేని నరక కూపరాశి
పాలుగాక నరుఁడు బ్రతికెడు మార్గంబు
పరమపుణ్య ! తెలియఁ బలుకవయ్య ! 41

వ. అనినం బరీక్షిన్న రేంద్రునకు శుకయోగీంద్రుం డి ట్లనియె. 42

క. కట్టా ! త్రికరణ [2]ములచేఁ, బుట్టిన దురితముల నపుడ పొలియింపని యా
కట్టిఁడి దేహం బుడిగినఁ, గొట్టాడును బిట్టు నరకకూపంబులలోఁ. 43

ఉ. కావునఁ గాలకింకర వికారముఁ గానకమున్న మృత్యు దు
ర్భావన చిత్తము [3]వెడఁగుపాటును జెందకమున్న మేనిలో
జీవము వెల్గుచుండి తన చెల్వము దప్పకమున్న మున్నుగాఁ
బావనచిత్తుఁ డై యఘముఁ బాయు తెఱం గొనరింపఁగాఁ దగున్. 44

---

1. తోఁగూడ (తం.వా.) 2. మెఱుఁగక (హ. తం. వా.) 3. జెడుగుపాటుగఁ జేయకమున్న (హ)

క. కాలం బెడగని పాపము, మూలముఁ జెఱుపంగవలయు మును రోగములఁ
దేలిన దోషము నెఱుఁగుచు, వాలాయము దాని నడఁచు వైద్యునిభంగిఁ. 45

సీ. అనవుడు నాతని కనియె భూకాంతుండు కనుకలి వినుకలి గలిగినట్టి
పాపము దనకు నొప్పని దని కని చాలఁ బరితృప్తుఁ డయ్యుఁ గ్రమ్మఱ నొనర్చు
మూఢాత్మునకు దోష మోచనం బెయ్యది ? యూరయ నెఱిగింపు మదియుఁ గాక
కలుష మొక్కొకచోటఁ గావించు నొకచోటఁ గావింపకుండుఁ దత్కర్మ మెఱిఁగి

తే. యట్టి జనుఁడు పుణ్య మేరీతిఁ జేసిన
నది ఫలింపనేర దని తలంతు
సలిలమందు మేని మలినంబు [1]వోవంగ
గజము గ్రుంకువెట్టు గతియుఁ బోలె. 46

వ. అనిన శుకుం డి ట్లనియె. 47

క. కర్మము కర్మముచేతను, నిర్మూలము గాదు తెలియనేరక తా నే
కర్మము సేసినఁ ద త్ప్రతి, కర్మం బొనరింపవలయుఁ గలుషవిదూరా ! 48

క. హితముగల కుడుపు మఱి రు, గ్వితతులఁ బొడమంగనీని విధమున నతిస
ద్వ్రతుఁ డైనవాఁడు [2]నిర్మల, మతిచే నఘరాశి నెల్ల మట్టముసేయున్. 49

చ. తపమున బ్రహ్మచర్యమున దానములన్ శమ స ద్దమంబులన్
జపముల సత్య శౌచముల స న్నియమాది యమంబులన్ గృపా
నిపుణులు ధర్మవ ర్తనులు నిక్కము హృ త్తను వాక్యజంపుఁ బా
పపుగుదిఁ ద్రుంతు రగ్ని శతపర్వ వనంబుల నేర్చుకైవడిన్. 50

వ. అదియునుం గాక. 51

ఉ. కొందఱు పుణ్యవ ర్తనులు గోపకుమార పదారవింద జా
నంద మరందపాన కలనా రత షట్పదచిత్తు లౌచు గో
వింద పరాయణుల్ విమలవేషులు దోష మడంతు రాత్మలం
జెందిన భ క్తిచేత రవి చేకొని మంచు నడంచుకైవడిన్. 52

క. హరిభ క్తిచేతఁ గొందఱు, బరిమార్తురు మొదలు ముట్టఁ బాపంబుల ని
ష్ఠురతర కరముల సూర్యుం, డరుదుగఁ బెనుమంచు[3]పించ మణఁచినభంగిన్. 53

క. దంతిపురనాథ ! వినుమొక, మంతన మెఱిఁగింతు శమ దమంబులు నంహో
వంతు శుభవంతుఁ జేయవు, కంతునిగురు భ క్తి ముక్తిఁ గలిగించుగతిన్. 54

---

1. వోకుండ (తం. వా.)
2. తాలిమి, కతమున తత్త్వంబుకొఱకు కల్పించుజుమీ (క) 3. పీచమణచిన (ట)

సీ. హరికి నర్థముఁ బ్రాణ మర్పితంబుగ నుండువాని కైవల్య మెవ్వనికి లేదు
వనజలోచను భక్తవరుల సేవించినవాని కైవల్య మెవ్వనికి లేదు
వైకుంఠ నిర్మల వ్రతపరుం డైనట్టివాని కైవల్య మెవ్వనికి లేదు
సరసిజోదరు కథా శ్రవణ లోలుం డైనవాని కైవల్య మెవ్వనికి లేదు

తే. లేదు తపముల బ్రహ్మ-ర్యాది నియతి
శమ దమాదుల సత్యశౌచముల దాన
ధర్మ మఖముల సుస్థిరస్థాన మైన
వైష్ణవజ్ఞాన జనిత నిర్వాణపదము. 55

తే. అరయ నెన్నఁడుఁ జేటు లేనట్టి ముక్తి
వర్త్మ మీ లోకమందు నెవ్వనికిఁ గలదు ?
సాధులును బుణ్యశీలురు సజ్జనులును
హరిపరాయణ తత్పరు [1]లగుటఁ గాక. 56

క. అరుదుగ నరహరి భక్తిం, బొరయని యా పురుషు సుకృత పుంజంబులు వే
మఱు పుణ్యఁ జేయ నేరవు, నరవర మధుఘటముఁ బెక్కు నదులుం బోలెఁ.57

చ. సతతముఁ గృష్ణ పాదజలజంబులయందు మనంబు నిల్పు సు
వ్రతులు తదీయ శుద్ధ గుణరాగులు కాలుని యుగ్రపాశ సం
హతుల ధరించు తత్సుభటవర్గములం గలలోనఁ గానరే
గతులను దుష్టకర్మములు గైకొని వారలఁ జెందనేర్చునే ?

వ. కావున నీయర్థంబునకుం బురాతనంబగు నొక్క యితిహాసంబు గలదు. అది విష్ణు దూత యమదూత సంవాదం బనంబడు. దాని నెఱింగింతు. ఆకర్ణింపుము.

—: అజామిళోపాఖ్యానము :—

సీ. నరనాథ ! వినుము కన్యాకుబ్జపురమునఁగలఁడు బ్రాహ్మణుఁ డజామిళుఁ డనంగఁ
బాతకుం డతుల నిర్భాగ్యుం డవజ్ఞుండు నష్టసదాచారి కష్టరతుఁడు
జూదంబులందు దుర్వాదంబులందును జౌర్యంబునందు మచ్చరము గలిగి
[2]తొత్తును బత్నిగా మత్తుఁ డై వరియించి కొడుకులఁ బదుగురం బడసి చాల

తే. మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీర
బాల లాలనాది లీలఁ దగిలి
పెద్దకాల మతఁడు పెంపార సుఖయించి
[3]బలిత మెల్లఁ దొలఁగి పలితుఁడయ్యె. 60

---

1. లైనఁగాక (తం. వా.) 2. తొత్తాత్మ పత్నిగా (హ. తం. వా.) 3. ఫలిత మెల్ల వదలి పతితుఁడయ్యె (హ. తం. వా.)

సీ. [1]నిర్మలం బనఁ జాలనెఱయు చిత్తం బన నల్లని వెండ్రుకల్ తెల్లనయ్యెఁ
దగు మోహపాశ బంధంబు జాటీనమాడ్కిఁ [2]బొదలినయంగంబు వదల వ్రాలె
నింద్రియంబుల కోర్కె లిఁక నొల్ల ననుభంగి నుడుగక తల చాల వడఁకఁ జొచ్చెఁ
దమకంబు ప్రాయంబు [3]దగిలి పోయిన మాడ్క లోచనంబుల చూడ్క నీచ మయ్యె

తే. వగరు పుట్టె నంతఁ బెగలె దంతంబులు
నుక్కసయును దగ్గుఁ బిక్కటిల్లె
శిరసు నొవ్వుఁదొడఁగెఁ జెదరె మనం బంతఁ
గడిఁది యైన ముప్పుకాలమునను. 61

తే. ఎనయ నతని కెనుఁబ దెనిమిది వర్షంబు
లంత నరుగుటయును భ్రాంతుఁ డగుచుఁ
గోరి పిన్నకొడుకు నారాయణాఖ్యుండు
బాలుఁ డగుట మిగుల భక్తిఁ జేసి. 62

క. తన సతియుఁ దానుఁ గూరిమి, మనమునఁ బెనఁగొనఁగ నక్కుమారుని ననిశం
బును ముద్దు సేయుచుండెను, జనవర ! వాత్సల్య మాత్మ సందడిఁ గొనఁగన్. 63

క. బాలునిఁ [4]గలభాషణ జన,పాలుని (?) నిజ జనక బంధు పరిణామ కళా
శీలుని లోలతఁ గనుఁగొని, యాలరి బ్రాహ్మణుఁడు నందితాత్ముం డగుచున్. 64

క. అత్యంత పాన భోజన, కృత్యంబులఁ బొత్తు గలిగి క్రీడలఁ ద ద్దాస్యం
గత్యంబు వదల కాగత, మృత్యువుఁ గన నేరఁ డయ్యె మిక్కిలి జడుఁ డై. 65

తే. తెలియ కీ రీతి నతఁడు వర్తింపుచుండ
భయద మగు మృత్యుకాలంబు ప్రాప్త మైన
భూరి వాత్సల్యవృత్తి న ప్పుత్రుఁ దలఁచి
[5]యాత్మఁ బ్రలపించు నారాయణా యటంచు. 66

వ. అప్పుడు.

క. కింకరుల ధర్మరాజ వ, శంకరుల దురంత దురిత సమధిక జన నా
శంకరుల సకలలోక భ,యంకరులం గనియె నింద్రియాకులుఁ డగుచున్. 68

క. ఘాతకుల దండ దండిత, పాతకుల మహోగ్ర కర్మ భర నిష్కరుణా
జాతకులఁ బ్రేతనాయక, దూతక సంతతుల నతఁడు దూరమునందున్. 69

---

1. నిర్మలంబని చాల నెరయుచిత్తంబున (హ); నిర్మలంబయి (?) 2. పొదలిన యంగముల్ వదలి వ్రేలె (తం. వా.) 3. తలగి పోయిన (క); తరిగిపోయిన (ద) 4. అర్థవచోబుజుఫాలుని (చ) ముగ్ధవచో (తం. వా.) 5. అదరి కలవించు నారాయణాహ్వాయునిని (చ)

మ. కనియెఁ బ్రాహ్మణుఁ డంత్యకాలమున వీఁక రోషనిష్ఠ్యూతులఁ
ఘన పీనోష్ఠ వికారవక్త్ర విలస ద్గర్వేక్షణోపేతులఁ
జన సంత్రాసక రోద్యతాయత సుపాశ శ్రేణికా హేతులఁ
హనన వ్యాప్తి విభీతులఁ ముపుర నాత్మానేతలఁ దూతలఁ. 70

వ. ఇట్లతి వికృత తుండ గండభాగ విషమ వివృత్త నేత్రులు, నతి పుష్ట నిష్ఠుర తనుయష్టి సంవేష్టిత మహోర్ధ్వరోములు, నభ్యస్త సమస్త జీవాపహరణ కరణ ప్రశస్త హస్త విన్యస్త పాశధారులు నగు యమభటుల ముప్పురం గనుంగొని యజామిళుండు వికలేంద్రియుండును, వికంపిత ప్రాణుండును, వికృత లోచనుండును, విహ్వలాత్మకుండు నై. 71

క. దూరమున నాడు బాలుఁడు, బోరనఁ దన చిత్తసీమఁ బొడగట్టిన నో
నారాయణ! నారాయణ!, నారాయణ! యనుచు నాత్మనందను నొడివెఁ.

చ. మరణపువేళ నద్దనుజమర్దను సంస్మరణంబు సేయఁ ద
త్పరిసరవర్తు లాత్మపరిపాలకు నామము నాలకించి ని
ష్ఠురగతి నేఁగుదెంచి పొడసూపి యదల్చిరి కాలుదాసులఁ
ఖరతరభాషులఁ వికట కల్పిత వేషుల దీర్ఘరోషులఁ. 73

క. దాసీభర్త నజామిళ, భూసురుఁ డత్తనువువలన బోరన వెలికిం
[2]దీసెడు యమభటులను బోఁ, ద్రోసిరి శ్రీవరుని కూర్మిదూతలు కడిమిఁ. 74

—: విష్ణుదూత యమదూతల సంవాదము :—

వ. ఇట్లు విష్ణుదూతలవలన నిర్ధూత ప్రయత్నుఁ లై యమదూత లిట్లనిరి. 75

క. ఎవ్వనివారలు మాతోఁ, జివ్వకుఁ గత మేమి? యిట్లు చిక్కినవానిం
గ్రొవ్వున విడిపించితి రిఁక, నవ్వులకో? జముని శాసనంబులు జగతిఁ. 76

సీ. ఎవ్వరు మీ రయ్య! యీ భవ్యరూపముల్ కన్నుల కద్భుతక్రమ మొనర్చె
[3]దివ్యోపదివ్యులో? దేవతాప్రవరులో? సిద్ధులో? సాధ్యులో? చెప్పరయ్య!
దళిత పాండుర పద్మదళ దీర్ఘ నేత్రులు వర పీత కౌశేయ వాసు లరయ
గండమండల నట త్కుండల ద్వయులును బటు కిరీటప్రభా భాసితులును

తే. భూరి పుష్కర మాలికా చారువతులు
లమిత కోమల నవయౌవ నాధికులును
బాహు కేయూర మణిగణ ప్రాజమాన
ఘన చతుర్భుజు లభ్రసంకాశ రుచులు. 77

---

1. విశ్రుత (హ) 2. దీసి యమ భటులఁ బారన్ (హ) 3. దివిజులో భువిజులో (హ·తం·వా·)

క. ధనువులు నిషంగచయములు, కన దంబుజ శంఖ చక్ర ఖడ్గ గదా సా
ధనములు ధరియించిన మీ, తనువులు లోకముల కద్భుతం బొనరించెఁ. 78

క. శాంతంబు లైన మీ తను, కాంతులు జగములను దిశలఁ గలిగిన బహుళ
ధ్వాంతములఁ బాఱఁదోలుచు, సంతస మొనరించె నిపుడు సర్వంకష మై. 79

వ. ఇట్లఖిల లోకానందకర [1]క్రమాకారులు, నఖిల విభ్రాజమాన తేజో దుర్నిరీక్ష్య మాణులును, నిఖిల ధర్మపాలురు నగు మీరు ధర్మపరిపాలుర మమ్ము నడ్డపెట్టం గతం బేమి? అనిన మందస్మిత కందళిత ముఖారవిందు లై గోవిందుని కందువ మందిరంబు కావలివారలు వారివాహ గంభీర నిర్ఘోష పరిపోషణంబు లైన విశేష భాషణంబుల నిట్లనిరి. 80

ఉ. మీరు పరేతనాయకుని మేలిమి దూత లటేనిఁ బల్కఁ డా
తోరపుఁ బుణ్యలక్షణము, దుష్కృతభావము, దండకృత్యముం,
బీరముతోడ నీతని కభీష్టనివాసము, పూని దండ్యు లె
వ్వారలు? సర్వభూతములొ? వారక కొందఱు పాపకర్ములో? 81

వ. అనిన యమభటు లిట్లనిరి. 82

క. వేద ప్రణిహితమే యను, మోదంబుగ ధర్మ మయ్యె మున్ను త దన్యం
బేది యగు నది యధర్మం, బాదియు హరిరూపు [2]వేద మన వినుకతనఁ. 83

సీ. * ఎవ్వనిచేఁ దన యిరవొందు త్రిగుణ స్వభావ మైనట్టి యీ ప్రాణిచయము
లనుగుణ నామ[3]క్రియారూపములచేత [3]నెంతయుఁ దమయంత నెఱుఁగఁ బడును
నర్యముం డనలంబు నాకాశమును ప్రభంజనుఁడు గోచయమును శశధరుండు
సంధ్యలు దివములు శర్వరీచయములు కాలాంబు వసుమతీ జాలములును

తే. దేహధారికి సాక్షు లై తెలుపుచుండు
దండన స్థాన విధము ‡సద్ధర్మగతియుఁ
†దగుల మీ రి క్రమానురోధనము చేసి
యఖిలకర్ములు దండార్హ్వా లరయ నెపుడు. 84

తే. కోరి కర్మంబు నడపెడువారి కెల్ల
గలిత శుభములు నశుభముల్ గలుగుచుండు
నరయఁగా దేహి గుణసంగి యైనయపుడె
పూని కర్మంబు సేయక మానరాదు. 85

---

1. సుందరాకారులు(క.చ.జ.డ.బ.) 2. వేదమని(క.జ.) 3. నేర్పడుగతిఁ దాన నెఱుఁగఁ బడును (హ)

* ఈ పద్యమున కన్వయము సరిగాఁ గుదురుటలేదు.

‡ "ఏతై రధర్మో విజ్ఞాతః, స్థానం దండస్య యుజ్యతే"—మూలము.(1—43)

† "సర్వే కర్మానురోధేన దండమర్హంతి కారిణః"—మూలము (1—43)

క. ప్రకృతమునఁ దా నొనర్చిన, సుకృతము దుష్కృతము నెంత చూడఁగ నంతే
[1]వికృతిఁ గని యనుభవించు, న్నకృతమతిఁ ద త్ఫలంబు నతినిపుణుం డై. 86

వ. మఱియు వినుండు. *జన్మంబు శాంత ఘోర మూఢ గుణంబులచేత నై నను, సుఖ దుఃఖ గుణంబులచేత నయినను, ధార్మికాది గుణంబులచేత నై నను, సకల భూతంబులు త్రైవిధ్యంబు నే ప్రకారంబునం బొందు, నా ప్రకారంబున జన్మాంతరంబునం బొందుచుండు. దేవుం డై న యముండు సర్వ జీవాంతర్యామి యై ధర్మాధర్మయుక్తం బై న పూర్వరూపంబులను మనస్సుచే విశేషంబుగఁ జూచుచుండి, వాని కనురూపంబులఁ జింతింపుచుండు. అవిద్యోపాధి జీవుండు తమోగుణయుక్తుం డై ప్రాచీనకర్మంబుల నేర్పడ్డ వర్తమాన దేహంబు, నే నని తలంపుచుండి, నష్ట జన్మస్మృతి గలవాఁ డై పూర్వాపరంబు లెఱుంగం జాలకుండు. మఱియుఁ గర్మేంద్రియములచేతఁ గర్మంబులఁ జేయుచుండి, జ్ఞానేంద్రియంబుల చేతఁ దమోవిషయంబు లయిన శబ్ద స్పర్శ రూప రస గంధంబుల నెఱుంగుచుండి, పదియాఱవది యైన మనంబుతోఁ గూడి, పదియేడవవాఁ డగుచుండి, షోడశోపాధ్యంతర్గతుం డై యొక్కరుం డై న జీవుండు, సర్వేంద్రియ విషయ ప్రతిసంధానంబు కొఱకు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనోవిషయంబులం బొందుచుండి, షోడశకళలం గలిగి, లింగ శరీరం బనం బరఁగి, గుణత్రయకార్యం బను నిమిత్తంబున హర్ష శోక భయంబుల నిచ్చుచున్న సంసారంబు ధరియింపుచుండు. [2]అజిత షడ్వర్గుం డై న దేహి [3]కర్మంబు లొల్లని బుద్ధి నెఱింగియు, వినియుఁ, గర్మంబులు సేయుచుండి, తన సంచారకర్మంబునం జుట్టుకొన్న పసిరికాయ పురువునుంబోలె నిర్గమోపాయం బెఱుంగక నాశంబు నొందుచుండు. వర్తమాన వసంతాది కాలంబు, భూత భావి వసంతకాల యోగ్యం బై న పుష్ప ఫలాదులు తత్కాల జ్ఞాపకంబు నెట్లు సేయు, నట్లు భూత భావి జన్మంబులకు ధర్మాధర్మంబులు నిదర్శనంబులు సేయుచుండు. ఒక్కనరుండు నొక ఋణంబును గర్మంబుఁ జేయకుండువాఁడు లేఁడు. పూర్వ సంస్కారంబులం గల గుణంబులచేతఁ బురుషుం డవశుండుగావునఁ బలిమిఁ గర్మంబులు సేయింపంబడుచుండు. అవ్యక్త నిమిత్తంబు నొంది త దనురూపంబు లై న స్థూల సూక్ష్మ శరీరంబులు మాతా పిత్రు సదృశంబులగుచుండు. ఇట్టి విపర్యయంబు పురుషునికిఁ బ్రకృతిసంగమంబునం గలుగుచుండు. ఆ ప్రకృతి పురాణపురుషుం డై న య ప్పరమేశ్వరుని సేవించినఁ దలంగుచుండు.

---

1. వికృతగతి (త. బ.) * ఇహజన్మని (వ్యాఖ్య) ఈ జన్మంబున
2. విజిత (హ. తం. వా.) 3. కర్మంబు లొల్లనని (చ. బ)

సీ. కావున నితఁడు సత్కర్మ వర్తనమున భూదేవకులమునఁ బుట్టినాఁడు
దాంతుఁ డై శాంతుఁ డై ధర్మసంశీలుఁ డై సకలవేదంబులఁ జదివినాఁడు
అనయంబు గురువుల నతిథులఁ బెద్దలఁ జేరి శుశ్రూషలు చేసినాఁడు
సర్వభూతములకు సమబుద్ధి యై చాల బహు మంత్రసిద్ధులఁ బడసినాఁడు

తే. సత్యభాషణ నియమంబు జరపినాఁడు
నిత్య నై మి త్తికాదుల నెఱపినాఁడు
దండి లోభాది గుణములఁ దరపినాఁడు
మంచిగుణములు దనయందు మరపినాఁడు. 88

క. సతతాచార సమంచిత, మతి యై సుజ్ఞానమునకు మరగెడి తఱి నా
యత [1]గతి నాతని కంగజ, మత మై నవయౌవనాగమం బెడ సొచ్చెఁ. 89

సీ. కడకంట యౌవనగర్వంబు వొడ గట్టె మదిలోన నుద్రేకమదము దొట్టె
కడు మేనఁ గామవికారంబు దలసూపె ముఖమునఁ జిఱునవ్వు మొలక లెత్తె
నతిపుష్టి నిష్ఠురం బయ్యె దేహం బెల్ల గచభారమున నెఱికప్పు మెఱసె
కటిభారమున నూరుకాండముల్ జిగి [2]మిఱె బాహుశాఖలు దీర్ఘభంగిఁ దోఁచె

తే. నురము విపుల మయ్యె నుల్లస ద్వరకాంతి
పూర మంగకమునఁ బొందుపడియె
భూరితేజుఁ డై న భూసురాన్వయునకు
[3]నభినవై క యౌవనాగమమున. 90

క. హృదయమునఁ బొడము యౌవన, మదము వెలిం దోఁచుభంగి మానితరుచిఁ ద
ద్వదనమున నూఁగుమీసలు, పొదలుచుఁ గప్పడరి చూడఁ బొంకం బయ్యెఁ. 91

వ. మఱియును. 92

క. తమ్మివిరిమీఁద వ్రాలిన, తుమ్మెద పంక్తియును బోలెఁ దోరపులీలం
గ్రమ్మికొని విప్రతనయుని, నెమ్మొగమునఁ గానఁబడియె నెఱిమీసంబుల్. 93

వ. అంత ననంగబ్రహ్మతంత్రంబునకు వసంతుం డొనర్చు నంకురార్ప ణారంభం
బునుం బోలె [4]లలిత కిసలయ విసర ప్రసార భాసుర బహు పాదపాది పురోపవన
పవన జవనప్రభావ పరికంపిత విట విటీజన హృదయ ప్రఫుల్ల పల్లవ ఛల్లంబును,
అనూన ప్రసూన నిర్భర గర్భావిర్భూత సురభి పరాగపటల పటఘటిత నభో
మండలంబును, అమంద నిష్యంద మరంద బిందుసందోహ కందళిత చిత్త మత్త

---

1. మతి (క. చ. త. బ.) 2. మించె (క. చ. త. జ. బ.) 3. అభినవీన (హ) 4. అసిత (హ)

మధుప సంకుల ఝంకార ముఖరిత సకల దిశావలయంబును, నిరంతర ధారాళ రసభరిత పరిపక్వ ఫలానుభవ ప్రభవ సమ్మోదవాద శుకప్రముఖ పతంగ కోలాహలంబు నైన మధుమాసంబు సర్వజన మనోహరంబు నై నిఖిల వనపాద పంబుల నలంకరించె. అ య్యవసరంబున నజామిళుండు పిత్రనిర్దేశంబునం గుశ సమి త్పుష్ప ఫలార్థంబు వనంబున కరిగి, తిరిగి వచ్చు సమయంబున నొక్క లతాభవనంబున. 94

క. బద్ధానురాగ యై స్మర, యుద్ధంబున కలరు బుద్ధి [1]నరు కామకళా
సిద్ధ యగు వృషలితోఁ బ్రియ, వృద్ధిం దగఁ గూడియున్న విటు నొరు గాంచెఁ. 95

క. భటునిఁ రతిశాస్త్ర కళా, ర్భటునిఁ వర యౌవనానుభవ మదవిభ వో
ద్భటునిఁ సురతేచ్ఛా సం, ఘటునిఁ విగతాంబరోరుకటునిన్ విటునిఁ. 96

శా. హేలా ఘూర్ణిత నేత్రతో మదన తంత్రారంభ [2]సంరంభతో
[3]ఖేలాపాలన యోగ్య భూవిభవతోఁ గీర్ణాలకాజాలతో
హేలాలింగన భంగి వేషవతితో నిచ్ఛావతీమూర్తితోఁ
గేళిం దేలుచునున్న వానిఁ గనె పుంఖీభూత రోమాంచుఁ డై. 97

క. [4]కలికి వగ మదన కదనపుఁ, బలుకుల కలకలము బెడఁగు వడు మేఖల ము
వ్వల రవళిఁ దగిలి గతిగొనఁ, గలకంఠి రతంబు సలుపు గమకముఁ గనియెఁ. 98

క. [5]కవకవ నై పదనూపుర, [6]రవరవ లాగుబ్బుకొన్న రతిపతి గతులం
జివచివ నై [7]విటు చెయ్వుల, రవళిఁ రతిసల్పు రతుల గవరవఁ గనియెఁ. 99

చ. కురు లళికంబుపై నెగయఁ గ్రొమ్ముడి వీడఁగ గుబ్బదోయిపై
సరములు చౌకళింపఁ గటిసంగతి మేఖల తాళగింప స
త్కర వర కంకణావళులు గర్జిలఁ గౌ నసియాడ మీఁదుగా
మరుని వినోదముల్ సలిపె మానిని యౌవన గర్వరేఖతోన్. 100

క. మవ్వపు సుకుమారాంగిని, జవ్వని నుపగూహనాది సముచిత రతులఁ
నివ్వటిలుదానిఁ గని మది, నువ్విళ్ళూరంగ మన్మథోద్దీపనుఁ డై. 101

తరళ. బహుళ దృ క్పరిపాక మోహ నిబద్ధుఁ డౌచు మనంబులో
సహజ కర్మము వేదశాస్త్రము సాత్త్వికంబుఁ దలంచి త
న్నిహిత చిత్తము వట్టి పట్టఁగ నేరఁ డయ్యె సదా మనో
గహనమందు మరుండు పావకు కైవడిఁ జరియింపఁగాఁ. 102

---

1. నుద్ధతకేళిం, బద్ధయగు (హ) 2. సంసిద్ధితో (క. జ. బ) 3. ఖేలాపాటన కోటరీ విభవతో (క. చ. డ. బ.) 4. కలికివరు (తం. వా.) 5. కవకవలై (క. చ. జ.) 6. రవరవమై గుబ్బుకొన్న (హ) 7. విటుచెవులకు (హ. వా.)

శా. ఆ లీలావతి గండపాళికలపై హాస ప్రసాదంబు పై
నాలోలాలకపంక్తిపై [1]నొసలిపై [2]నాకర్ణ దృగ్భాతి పై
హేలాపాది కుచద్వ యోరు కటిపై నిచ్చల్ పిసాళింపఁగా
జాలిం బొందుచు నాత్మఁ గుందుచు మనోజా తానలోపేతుఁ డై. 103

గీ. మఱి కులాచార వర్తన [3]మాలు చేసి
పరఁగు పిత్రర్థములు దాని పాలు చేసి
సాధులఋణ గుణవృత్తిఁ జాలు చేసి
లోలలోచన [4]పసఁ జెంది లోలుఁ డయ్యె. 104

క. శ్యామఁ గుసుమాస్త్ర ఖేలన, [5]కామఁ గులస్త్రీలలామఁ గమనీయగుణ
స్తోమ నిజభామ నొల్లక, [6]ధామంబున డించి క్రించుఁదనమునఁ [7]బొడ వై. 105

ఉ. [8]బంధులఁ దిట్టి సజ్జనుల బాధలఁ బెట్టి యనాథకోటిఁ బెఁ
బందెలు సుట్టి [9]యీరములు పట్టి పథంబులు గొట్టి దిట్ట యై
నిందల కోర్చి [10]సాధుకుల నిందితుఁ డై గడియించు విత్త మా
సుందరి కిచ్చి మచ్చికలు [11]సొం పెనఁగూర్చి వసించెఁ ద త్కృపన్.

సీ. సముచిత శ్రుతిచర్చ చర్చింప నొల్లక సతి కుచద్వయచర్చ చర్చసేయుఁ
దర్క కర్కశ పాఠ తర్కంబు గాదని కలికితోఁ బ్రణయ తర్కంబు సేయు
స్మృతి పదవాక్య సంగతిఁ గాక తత్సతి పద వాక్య సంగతిఁ బరఁగఁ జేయు
నాటకాలంకార నైపుణం బుడిగి తన్నాటకాలంకార పాటిఁ దిరుగుఁ

గీ. బరఁగఁ జిరకాల మీ రీతిఁ బాపనీయతి
రమణ [12]దాసీ కుటుంబ భారము వహించి
యది కుటుంబిని గాఁగఁ బాపాత్మఁ డగుచు
నశుచియును దుష్టవర్తనుం [13]డై మెలంగె. 107

క. అటు గానఁ బాపకర్మునిఁ, గుటిలుని సుజనార్తు ధూర్తుఁ గ్రూరుని [14]నే మా
వటమునఁ గొని యేఁగెద మం,తట దండమువలన నితఁడు ధన్యత నొందున్.108

---

1. నళికపై (హ. తం. వా.) 2. నాకీర్ణ (క. బ) 3. మాటు (హ. వా.) మాల (చ)
4. వెస (ద) 5. కామన్ సుగుణాభిరామ (హ) 6. ధామమున నటించె (హ) 7. జడుఁడై (హ)
8. బందుగులట్టి (హ) బందులబట్టి (ట. త. జ. బ) 9. యాతములుకట్టి (జ)
10. సాధులకు (హ. తం. వా.) 11. సొంపెదఁగూర్చి (తం. వా.) 12. దాని (క. చ. బ.)
13. డగుటఁజేసి (హ) 14. నే మా, రటమున (హ)

అధ్యాయము - ఎ

వ. ఇట్లు పలుకుచున్న యమదూతల వారించి, సయకోవిదు లైన భగవ ద్దూత లిట్లనిరి. 109

క. అవురా ! ధర్మవివేక, ప్రవరుల సభఁ గానఁబడియెఁ బాపము పుణ్యో
ద్భవుల నదండ్యుల దండన, వివరం బొనరింపఁ బడియె విధి యెఱుఁగమిచే. 110

చ. సములును సాధులు విహితశాసనులు సుదయాళురున్ శుభో
త్తమ గుణులైన యట్టి తలిదండ్రులు బిడ్డల కెగ్గు సేయుచోఁ
గ్రమమున వార లెవ్వరికిఁ గైకొని కుయ్యిడఁ జాలువారు [1]సం
భ్రమమున మీ మనంబులఁ దిరంబుగఁ జర్చ యొనర్చి చూడుఁడా ! 111

గీ. ఎఱుక గలుగు నాతఁ డేది యొనర్చిన
నదియ చేతు రితరు లైన వార
లతఁడు సత్య మిట్టి దనెనేని లోకంబు
త త్ప్రవర్తనమునఁ దగిలి యుండు. 112

గీ. నెమ్మిఁ దొడలమీఁద నిద్రించు చెలికాని
నమ్మఁదగినవాఁడు నయము విడిచి
ద్రోహబుద్ధిఁ జంపఁ దొడరునే ? యెం దైనఁ
భీతి లేక ధర్మదూతలార ! 113

గీ. చిత్తమెల్ల నిచ్చి చెలితనంబున వచ్చి
నచ్చి కలయ [2]మెచ్చి నమ్మువానిఁ
గరుణ గలుగువాఁడుఁ గడుసౌమ్యుఁ డగువాఁడుఁ
జింత సేయ కెట్లు సెఱుప నేర్చు. 113

వ. అదియునుం గాక. 115

ఉ. ఈతఁడు కోటిసంఖ్యలకు నెక్కుడు పుట్టువులందుఁ [3]జెంది యా
యాతము లైన పాప నివహంబుల నన్నిటిఁ బాఱఁ దోలఁ బ్ర
ఖ్యాతమతిఁ మహామరణ కాలమునఁ హరిపుణ్యనామ సం
భూత సుధామ యాద్భుత విభూతిక రాశుగ సంగ్రహంబునఁ. 116

సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని కీలలు హరినామ కీర్తనములు
గురుతల్ప కల్మష క్రూరసర్పములకుఁ గేకులు హరినామ కీర్తనములు
తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య కిరణముల్ హరినామ కీర్తనములు
మధుపాన కిల్బిష మదనాగ సమితికిఁ గేసరుల్ హరినామ కీర్తనములు

---

1. సంభ్రమగతి (క. చ. డ.) సంభ్రమమతి (ట) 2. నొచ్చి (హ) 3. బుట్టి (హ)

గీ. మహిత యోగోగ్ర [1]నిత్యసమాధి విధుల
నలరు బ్రహ్మాది సురులకు నందరాని
భూరి నిర్వాణసామ్రాజ్య భోగభాగ్య
ఖేలనంబులు హరినామ కీర్తనములు. 117

సీ. ముక్తికాం తైకాంత మోహన కృత్యముల్ కేలిమై హరినామ కీర్తనములు
సత్యలో కానంద సౌభాగ్యయుక్తముల్ కేలిమై హరినామ కీర్తనములు
మహిత నిర్వాణ సామ్రాజ్యాభిషిక్తముల్ కేలిమై హరినామ కీర్తనములు
బహుకాల జనిత తపఃఫల సారముల్ కేలిమై హరినామ కీర్తనములు

గీ. పుణ్యమూలంబు లనపాయ పోషకంబు
లభిమతార్థంబు లజ్ఞాన హరణ కరము
లాగమాం తోపలబ్ధంబు లమృతసేవ
లార్తశుభములు హరినామ కీర్తనములు. 118

క. కామంబు పుణ్యమార్గ, స్థేమంబు మునీంద్ర సాంద్ర చేతస్సరసీ
ధామంబు జిష్ణు నిర్మల, నామంబుఁ దలంచువాఁడు నాథుఁడు గాఁడే ? 119

క. డెందంబు పుత్రు వలనఁ, జెందిన దని తలఁప వలదు [2]శ్రీపతిపే రే
చందమున నైనఁ బలికిన, నందకధరుఁ డందె కలఁడు నాథుం డగుచుఁ. 120

గీ. బిడ్డపేరుఁ బెట్టి పిలుచుట విశ్రామ
కేళి నైన మిగుల గేలి నైన
పద్య గద్య గీత భావార్థముల నైనఁ
గమలనయనుఁ దలఁపఁ గలుషహరము. 121

ఉ. కూలినచోటఁ గొట్టుపడి కుందినచోట మహాజ్వరాదులం
బ్రేలినచోట సర్పముఖ పీడల నందినచోట నార్తు లై
తూలినచోట విష్ణు భవదూరునిఁ బేర్కొనిరేని మీఁద న
క్కాలుని యాతనావితతిఁ గానరు పూనరు దుఃఖభావముల్. 122

సీ. అతిపాపములకుఁ బ్రయత్నపూర్వకముగఁ దనుపాపములకు మితంబుగాఁగ
సన్ముని వరులచే [3]సంప్రోక్త మై యుండు నిర్మలం బగు పాప నిష్కృతములు
క్రమరూపమున నుపశమనంబు లగుఁ గాని [4]తత్క్షణంబున నవి దరువలేవు
సర్వకర్మంబుల సంహార మొనరించి చిత్తంబునకుఁ దత్త్వ సిద్ధి [5]నొసఁగు

---

1. మార్గ (క. చ. ట. త.) 2. రే, చందమున (ల) ఁబలుకఁ గలిగిన (క. చ. ట. జ. తం)
3. సంపాద్య (హ. తం. వా) 4. తదన్యచయములఁ దఱుపలేవు (హ); తత్పాపచయములు దలఁపలేవు (హ. తం. వా.) 5. నెపుడు (హ)

గీ. [1]నొనర నీళు సేవ యోగిమానస సరో
వాసు సేవ [2]హేమవాసు సేవ
వేదవేద్య సేవ వేదాంత విభుసేవ
పరమపురుష పాదపద్మ సేవ. 123

క. హరి నెఱుఁగని యా బాలుఁడు, హరిభక్తులతోడఁ గూడి హరి యనువాఁడుఁ
సరి యై దోషము లడఁచును, గరువలితో నగ్ని తృణముఁ గాల్చిన భంగిన్. 124

ఉ. అరయఁగ వీర్యవంత మగు నౌషధ మెట్లు యదృచ్ఛఁ గొన్నఁ ద
చ్చారు గుణంబు రోగములఁ జయ్యనఁ బాపినమాడ్కిఁ బుణ్య వి
స్ఫారుని నంబుజోదరునిఁ బామరుఁ డజ్ఞుఁ డవజ్ఞఁ బల్కినఁ
వారక తత్ప్రభావము ధ్రువంబుగ నాత్మగుణంబుఁ జూపదే! 125

క. ధృతి దప్పిన తలపునిఁ బురా,కృతమునఁ గా కెట్లు దోఁచుఁ గేశవుఁడు మదిఁ
మితిలేని జగముఁ దాల్చిన, యతఁ డొక్కని మనములోన నణఁగెడు వాఁడే?

మ. నిరతం బై నిరవద్య మై నిఖల చి న్నిర్మాణ మై నిత్య మై
నిరహంకార గుణాఢ్య మై నియమ మై నిర్దోష మైనట్టి శ్రీ
హరి నామస్మర ణామృతం బితఁడు ప్రత్యూషంబు సేవించెఁ దా
మరణాంతంబున నిట్టి సజ్జనుని ధర్మం బేల వ్యర్థం బగున్? 127

వ. అని యిట్లు భగవ ద్భూతలు భాగవతధర్మంబు నిర్ణయించి, యీ యర్థంబున మీకు సంశయంబు గలదేని మీ రాజు నడుఁగుడు. పొండు. అని పలికి బ్రాహ్మణుని నతిఘోరం బై న యామ్య పాశ బంధ నిర్ముక్తునిం గావించి, మృత్యువువలని యెడరు వాపిరి. అంత నా యమదూతలు చేయునది లేక యమలోకంబునకుం జని, పితృపతికి సర్వంబును నెఱింగించిరి.అంత. 128

క. అతఁడును బాశచ్యుతుఁ డై, గతభయుఁ డై ప్రకృతి నొంది కడు నుత్సవసం
గతిఁ జూచి బ్రమొక్కి మదిలో, నతులిత ముద మొదవి పొదలి హరిదాసులకుఁ.

తే. నిలిచి కేలు మొగిచి పలుక నుద్యోగించి
చెలఁగుచున్న లోని తలఁపుఁ దెలిసి
చక్రధరుని కూర్మిసహచరు లరిగి ర
దృశ్య లగుచు దేవదేవు కడకు. 130

క. వేదత్రయ సంపాద్యము, మోదంబు గుణాశ్రయంబు మును భగవ ద్ధ
ర్మాదేశం బగు త దృట, వాదంబు నజామిళుండు [3]వదలక వినుచున్ 131

---

1. నొసఁగునట్టి పుణ్యయోగ (హ) 2. రుచిర (క. ద.) 3. వాడక (క. ప. బ.)

V.R. MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

క. శ్రీమ న్నారాయణ పద, తామరస ధ్యానసలిల ధౌత మహోఘ
స్తోముం డై సద్భక్తికి, ధామం బగుచుండెఁ దెలిసి తత్క్షణమాత్రఁ. 132

క. బరవసమున నరికట్టిన, దురితంబులఁ దలఁచి తలఁచి తుదిఁ దాపమునఁ
హరి నీకు నాశ్రయింపుచుఁ, బరితాపము నొంది పలికె బ్రాహ్మణుఁ డాత్మఁ. 133

సీ వృషలియం దనురాగ వృద్ధి బిడ్డలఁ గని కులము గోదావరిఁ గూలఁద్రోచి
రచ్చల కెక్కి పెఁ రజ్జుసేఁతల సరివారిలోపలఁ దలవంపు చేసి
కట్టిఁడిముదుక నై కర్మబంధంబుల పుట్ట నై నిందల బ్రోవ నగుచుఁ
దరుణుల రోఁతలఁ [1]దవిలి భోగించిన కడిఁది నా జన్మంబు [2]గాలిపోయెఁ

తే. జదువు చట్టువడియె శాస్త్రంబు మ న్నయ్యె
బుద్ధి [3]పురువుమేసెఁ బుణ్య మణఁగె
నీతి [4]మట్టుపడియె నిర్మలజ్ఞానంబు
[5]మొదలి కుడిగె బోధ మూరిఁబోయె. 134

క. చిక్కని చక్కని చన్నుల, మక్కువయిల్లాలి విడిచి మాయలుగల యీ
వెక్కసపు మద్యపానపు, డొక్కపస్ఁ దగిలి దుర్విటుఁడ నై చెడితిన్. 135

ఉ. అక్కట! ఘోర దుష్కృత మహానలకీలలు నన్ను ముట్టి వే
రుక్కణఁగింప కిట్లు ధృతి నుండఁగ నిచ్చె నహో! దురాత్మునిం
గ్రక్కునఁ దల్లిదండ్రుల నకల్మషచిత్తులఁ బెద్దలఁ మఱే
దిక్కును లేనివారిఁ బెను [6]తీపులఁ బెట్టుచుఁ బాఱఁదోలితిఁ. 136

క. అకృతజ్ఞుఁడ నై విడిచితిఁ, బ్రకృతిం గల బంధువులను [7]బాల్యమున ననుఁ
వికృతిఁ జనకుండఁ బెంచిన, సుకృతుల మ జ్జనకవరుల శోభనకరులఁ. 137

వ. అప్పుడు. 138

తే. పెక్కు పాతకముల భృశదారుణం బై న
దొడ్డ నరకమందుఁ బడ్డ నన్ను
నాపదలకుఁ బాపి యరికట్టి రక్షించి
రిట్టి ధర్మపురుషు లెందు వారొ? 139

శా. చోద్యం బై కలవోలె నీ ఋణమునం జూడంగఁ బ్రత్యక్ష మై
వేద్యం బయ్యెను నన్ను నీడ్చిన మహావీరుల్ భృశోదగ్రు లా
యుద్యోగంబులవారు పాశధరు లీ యుత్సాముల్ మాని సం
పాద్యానేక వికారరూప కుటిల ప్రఖ్యాతు [8]లెం దేఁగిరో? 140

---

1. ద్రవ్వి(క.ట.జ.) 2. గాలిబోయె(ద.బ.) 3. పూరి(ట.ద.) 4. కట్టు(క.చ.త.జ.బ.) 5. ముట్టనుడిగె (క.త) 6. త్రిక్కుల (తం. వా.) 7. బాల్యమునను దు,ర్వికృతి (తం.త.) 8. లెవ్వారలో(హ)

ఉ. దారుణ పాశబంధన విధానములఁ నరకార్ణవంబులోఁ
గూరినవాని నన్నుఁ జెడకుండ నొనర్చిన పుణ్యవంతు లం
భోరువనేత్రు లుజ్జ్వల నభోమణితేజులు లోచనోత్సవుల్
చారు దయా [1]సమంచిత విచారులు నల్వురు నెందుఁ బోయిరో ? 141

మ. నను రక్షించిన పుణ్యవంతులు కన న్నాశీకపత్రాతు లం
జనసంకాశులు శంఖచక్రధరు లాజానూరుబాహుల్ స్మితా
నను లాలంబిత కర్ణ వేష్టన సువర్ణచ్ఛాయ దివ్యాంబరుల్
ఘన కారుణ్య రసైకపూర్ణులు సమగ్రస్ఫూర్తి [2]నెం దేఁగిరో ? 142

వ. పాతకుండ నగు నాకు ని ర్విబుధోత్తమ దర్శనంబు పురాకృత మదీయ పుణ్య
విశేషంబునం గాని పొంద శక్యంబు గాదు. త త్సందర్శనం బాత్మకు నతి
సుప్రసన్నం బై యొప్పు. అట్లు గాకుండె నేనిఁ గలుషవర్తనంబుల వృషలీభర్త
నై యుండి మృతిం బొందుచున్న నాదు జిహ్వాకు శ్రీమ న్నారాయణ నామ
గ్రహణంబు సంభవింపనేరదు. మఱియును. 143

తే. పాతకుఁడను జడుఁడ బ్రహ్మఘాతకుఁడను
మాన లోభ మోహ మత్సరుండ
నాకు నెట్లు దొరకు ? నారాయణుని దివ్య
నామ విమల కీర్తనంబు మదికి. 144

సీ. దారుణ మోహాంధకార పూరితుఁడను హరి విస్మయ స్మరణార్హమతినె ?
పంచ మహాతీవ్ర పాతకోపేతుఁడ హరి విస్మయ స్మరణార్హమతినె ?
కౌటిల్య కితవ వికార పారీణుండ హరి విస్మయ స్మరణార్హమతినె ?
అఖిల దుఃఖైక ఘోరార్ణవ మగ్నుండ హరి విస్మయ స్మరణార్హమతినె ?

తే. నిందలకు నెల్ల నెల వైన నిర్గుణుండ
మందభాగ్యుండ నే నేడ ? మధువిదారి
దివ్య గుణనామ కీర్తన తెఱఁ గ దేడ ?
పూర్వ సుకృతంబు లే కెట్లు పొందఁ గలుగు ? 145

వ. అని వితర్కించి. 146

మ. యత చిత్తేంద్రియ మారుతుండ నగుచున్ యత్నం బొనర్తు హరి
వ్రత సంపత్తికిఁ బుణ్యవృత్తికిఁ జిదావాసోన్ముఖాసక్తికిఁ
యుత నిర్వాణ పదానురక్తికి సుఖోద్యోగ క్రియాశక్తికిఁ
ధృతి లబ్ధోత్తమ [3]ముక్తికిఁ సకల ధాత్రీధుర్య సద్భక్తికిఁ. 147

---

1. సమన్విత (క. చ. ట. త. బ.) 2. నెవ్వారలో (హ) 3. మూర్తికిన్ (హ. వా. ట. బ.)

క. విడిచితి భవబంధంబుల, నడఁచితి మాయావిమోహ మయిన తమంబు
నొ్నడిచితి నరివర్గంబులఁ, గడచితి నా జన్మదుఃఖ కర్శణవముఁ 148

క. యోషి ద్రూపంబున ననుఁ, నేషణ ముఖగహ్వారమున నెగ్రమింగి కడుఁ
ద్వేషమునఁ గోఁతిఁ జేసిన, దోషద యగు నాత్మ మాయ తొలఁగం గంటిఁ. 149

వ. అని యిట్లు వైష్ణవ జ్ఞానదీపం బాత్మస్నేహంబునం దోఁచిన బ్రాహ్మణుండు. 150

మ. భగవ ద్ధర్మపరాయ ణోత్తముల సంభాషైక మంత్రంబులఁ
మిగులన్ జ్ఞానము వుట్ట మోహ భవ సమ్మి శ్రాత్మ బంధంబులఁ
దెగ ఖండించి సబంధు మిత్ర సుత పత్నీ మోహ విశ్రాంతుఁ డై
జగతీనాథు రమేశుఁ గృష్ణుని దయైశ్వర్యంబులం గోరుచున్. 151

క. హరిభక్తులతో మాటలు, ధర నెన్నఁడుఁ జెడని పుణ్యధనముల మూటల్
వర ముక్తికాంత తేటలు, నరిషడ్వర్గంబు చొరని [1]యరుదగు కోటల్. 152

సీ. అనుచు నా బ్రాహ్మణుం డతిత త్త్వ వేది యై భవబంధముల నెల్లఁ బాఱఁదోలి
మొనసి గంగాద్వారమున కేఁగి యచ్చటఁ బ్రబ్బిన దేవతాభవనమందు
నాసీనుఁ డై యోగ మాశ్రయించి [2]చెలంగు దేహేంద్రియాదుల తెరువువలనఁ
దనుఁ బాపుకొని పరత త్త్వంబుతోఁ గూర్చి మానుగా [3]యోగసమాధిచేత

ఆ. గుణగణంబుఁ బాసి కొమరొప్పిన భగవ
దనుభవాత్మయందు నాత్మఁ గలిపి
రమణఁ దన్ను మొదల రక్షించినట్టి యా
పురుషవరులఁ గాంచి పొసఁగ మ్రొక్కి. 153

వ. అ ట్లజామిళుండు యోగమార్గంబున దేహంబు విడిచి, పుణ్య శరీరుం డై యగ్ర భాగంబునం బ్రా గుపలబ్ధు లైన మహాపురుష కింకరులం గాంచి, సమంచిత రోమాంచిత చల చ్ఛటా పింజరిత స్వేదబిందు సందోహ మిష నిష్యంద మహా నందవల్లికా మతల్లికాంకుర సంకుల పరిశోభిత తనుండును, హర్ష నికర్ష మాణ మానసోద్యోగ యోగప్రభా వోత్సాహ విస్మయ మందస్మిత ముఖారవింద కందళితుండును, [4]నిఖల జగ జ్జేగీయమా నాఖండ శుభప్రద శుభాకార సందర్శన సమాసాదిత కుతూహల మానసుండును నై, ప్రణామంబు లాచరించుచు భాగీరథీ తీరంబునఁ గళేబరంబు విడిచి, తత్క్షణంబున హరిపార్శ్వావర్తను లైన దాసవరుల స్వరూపంబుఁ దాల్చి, యా విష్ణుసేవకులతోఁ గూడి (దివ్య మణి

---

1. అరుగుల (హ. ట. బ.) 2. వెలుంగు (హ) 3. నాత్మ (హ)
4. లోచనోత్సవ కరాకార సందర్శమాన ధౌరేయుండును (క)

గణ ఖచితం బగు సువర్ణమయం బయిన (యసమాన) విమానం బెక్కి, నిఖిలా నంద భోగభాగ్యానుభ వాకుంఠితం బై న వై కుంఠంబున శ్రీమ న్నా రాయణ పాదారవింద సేవా చరణ పరిణామ స్థితికిం జనియె. ఇట్లు విప్లావిత సర్వధర్ముం డై న దాసీపతి, గర్హిత కర్మంబులచేతఁ బతితుండును, హతవ్రతుండును నై నర కంబునం గూలుచుండి, భగవన్నామ గ్రహణంబున సద్యోముక్తుం డయ్యె. కావున. 154

క. కర్మంబులెల్లఁ బాయను, మర్మము దలఁపంగ లేదు మధురిపు పేరే
పేర్మిని నొడువుటకంటెను, దుర్మదమునఁ జిత్త మెన్నిత్రోవలఁ జన్నఁ. 155

ఉ. పాండవవంశ పాలన! నృపాలక! యీ యితిహాస మెవ్వఁడే
నొండొక భక్తి లేక విను నొప్పుమెయిం బఠియించు నాతఁ డు
ద్దండత ముక్తి కామినికిఁ దానక మై దనుజారిలోకమం
దుండు మహావిభూతి యమదూతల చూడ్కి కగోచ రాకృతిఁ. 156

తే. అరయ పుత్రోపచారిత మైన విష్ణు
నామ మవసానకాలంబుననను భజించి
శార్జినిలయంబుఁ జేరె నజామిళుండు
నిట్లు సద్భక్తిఁ దలఁచిన నేమిచెప్ప? 157

క. కోరినవారల కెల్లను, జేరువ కై వల్యపదము సిరివరుని మదిం
గోరనివారల కెల్లను, దూరము మోఁక్షా ప్తి యెన్నిత్రోవల నై నఁ. 158

అధ్యాయము - 1

వ. అనినం బరీక్షిన్న రేంద్రుం డి ట్లనియె. మునీంద్రా! ఆజ్ఞాభ్రష్టుం డై యమధర్మ రాజు శ్రీవిష్ణు నిర్దేశకులచేత విహతు లై న భటులచేత వర్ణింపంబడ్డ నారాయ ణుని నామప్రభావం బాకర్ణించి, వారల కే మనియె? మఱియు, నెన్నఁ డేనియు యమదండంబు విఫలం బై పోయిన తెఱంగు గలదేని వినవలయు. ఈ సందేహంబుఁ బాప మహాత్మా! నీవు దక్కఁ దక్కినవారలు సమర్థులు గా రని తలంచుచున్నవాఁడ. చిత్తంబును బ్రసాదాయత్తంబుగా భవదీయ వచన సుధా ధారలఁ బ్రసాదింపవలయు. అనిన శుకుం డి ట్లనియె. 159

క. శ్రీకృష్ణభటులచేత ని, రాకృతు లయి యామ్యభటులు యమునకు నాత్మ
స్వీకృత విప్రకథాక్రమ, మీ క్రియ మఱఁ దెలిపి రదియు నెఱుఁగింతుఁ దగఁ.

తే. చేరి త్రివిధకర్మలఁ జేయు జీవతతికిఁ
గర్మఫలములఁ దెలిపెడు కారణులుగ
నగుచు శిక్షించువార లీ యవనిమీఁద
దేవ! యెందఱు గలరయ్య? తెలియవలయు. 161

క. దక్షిణదిశాధినాయక!, శిక్షం దగఁ జేయువారు క్షితిఁ బెక్కండ్రే
నీ క్షయము న్నక్షయమును, సాక్షాత్తుగ రెండు నెండు సంపన్న మగుఁ? 162

తే. దట్ట మైనట్టి కర్మబంధముల నెల్ల
నాజ్ఞ పెట్టెడువారు పె క్కైనచోట
నకట! శాస్త్రీయ ముపచార మయ్యెఁ గాదె!
శూరు లై నట్టి మండలేశులకుఁ బోలె. 163

ఉ. కావున నీవ యొక్కఁడవ కర్తవు మూఁడుజగంబులందు సం
భావిత భూతకోటిఁ బరిపాకవశంబున శిక్షసేయఁగా
నీ వర శాసనం బఖిలనిర్ణయ మై తనరారుచుండ నేఁ
డీవలఁ గ్రమ్మఱింప మఱి యెవ్వఁడు శక్తుఁడు? ధర్మపాలనా! 164

క. చండకర తనయ! యొరులకు, దండధరత్వంబు గలదె? తగ జగమున ను
ద్దండధరవృత్తి నొత్తిలి, దండింతువు నిన్ను దండధరుఁ డని పొగడన్. 165

సీ. ఇట్టి నీ దండంబ యీ మూఁడుజగములఁ దెగువమై నేఁడు వర్తిల్లుచుండ
మనుజలోకంబున మహితాద్భు తాకార సిద్ధుల మిగులఁ బ్రసిద్ధు లై న
వారు నల్వురు వేగ వచ్చి నిర్దేశంబు భంగించి మ మ్మంతఁ [1]బాఱఁదోలి
మీ శాసనంబున మే మిడ్చికొని వచ్చు క్రూరచిత్తునిఁ బుచ్చికొని యదల్చి

తే. పాశబంధంబు లీసునఁ బట్టి త్రెంచి
బలిమి మిగులంగ మమ్మునుఁ బాఱఁదోలి
యిచ్చఁ జనినారు వారు దా మెచటివార
లాదరమ్మున నేఁడు మా కానతిమ్మ. 166

వ. అనిరి. అని మఱియు శుకుం డి ట్లనియె. అట్లు దూతలు పరితాప సమేతు లై పలికిన, దండధరుండు పుండరీకాక్షుని చరణకమలంబులు మానసంబున సన్నిహితంబులుగఁ జేసి, వందనం బాచరించి, పరమభక్తిపరుం డై వారల కి ట్లనియె.

---

1. చెంగఁదోలి (క. తం. వా.)

సీ. కలఁడు మ దన్యుండు ఘనుఁ డొక్కఁ డతఁ డెందు వెలికిఁ గానఁగరాక విశ్వమెల్ల
నతిలీన మై మహోద్భుత సమగ్రస్ఫూర్తి నుండుఁ గోకందు నూలున్నభంగి
దా మెనఁ బళువులు దగిలి యుండెడుమాడ్కి నామసంకీర్తనస్థేమమతుల
విహరించు నెవ్వఁడు విలసిత మత్పూజ లెవ్వని పదముల నివ్వటిల్లుఁ

తే. గనుట మనుట చనుట గల్గు నెవ్వనిలీల
లందు లోక మెవనియందుఁ బొందు
నెన్నఁబడుచుఁ బుడమి నెవ్వని నామముల్
కర్మబంధనముల వేర్మి నడఁచు. 168

తరళ. వినుఁడు నేను మహేంద్రుఁ డప్పతి వీతిహోత్రుఁడు రాక్షసుం
డనిలుఁ డర్కుఁడు చంద్రుఁడుం గమలాసనుండు మరుద్గణం
బును మహేశుఁడు రుద్రవర్గము భూరి సంయమి సిద్ధులుఁ
మొనసి కన్గొనఁజాల నెవ్వనిమూర్తి విశ్రుతకీర్తి మై. 169

క. సత్త్వేతర గుణపాళ వ, శత్వంబునఁ బొంద వీరు జలజాతు సదై
కత్వంబు గాననోపరు, సత్త్వప్రాధాన్య లితర జనులకుఁ దరమే? 170

చ. అభవు నమేయు నవ్యయు ననంతు ననారతుఁ బూని మేనిలో
నుభయము నై వెలుంగు పురుషోత్తముఁ గానరు చిత్త కర్మ వా
గ్విభవ గరిష్ఠు లై వెదకి వీటిఁడి ప్రాణులు; సర్వవస్తువుల్
శుభగతిఁ జూడనేర్చి తనుఁ జూడఁగనేరని కంటిపోలిక. 171

చ. పరముని భక్తలోక పరిపాలనశీలుని దుష్టలోక సం
హరుని పతంగపుంగవ విహారుని కూరిమిదూత లా మనో
హరులు సురేంద్రవందితులు నా హరి రూప గుణ స్వభావు లై
తిరుగుచునుందు రెల్లెడల దిక్కులఁ దేజము పిక్కటిల్లఁగ. 172

ఉ. లెక్కకు నెక్కు వై కసటులేని మహోద్భుత తేజ మెల్లెడం
బిక్కటిలం జరింతు రతి భీమబలాఢ్యులు విష్ణుదూత లా
చక్కని ధర్మశాంతు లతిసాహసవంతులు దేవపూజితుల్
గ్రిక్కిఱి సీ జగంబునను గేశవసేవక రక్షణార్థ మై. 173

క. నావలనను మీవలనను, దేవాసుర గణములవలనఁ ద్రిజగంబులలో
నే వగలఁ బొందకుండఁగఁ, గావం గలవారు పుడమిఁ గల వైష్ణవుల. 174

క. భగవ త్ప్రణిహిత ధర్మం, బగపడ దెవ్వారి మతికి ననిమిష గరుడో
రగ సిద్ధ సాధ్య నర సుర, ఖగ తాపస యక్ష దివిజ ఖచరుల కైన. 175

క. ఎన్నఁడుఁ దెలియఁగ నేరరు, పన్నగపతిశాయి తత్త్వభావము మేనం
గన్నులవేల్పును డాపల, [1]చన్నమరిన వేల్పు [2]ముదుకచదువుల వేల్పుఁ. 176

సీ. వర మహోద్భుత మైన వైష్ణవజ్ఞానంబు తిరముగా నెవ్వరు తెలియఁగలరు?
దేవాదిదేవుండు త్రిపురసంహరుఁ డొండెఁ గమలసంభవుఁ డొండెఁ గార్తికేయ
కపిల నారదు లొండె గంగాత్మజుం డొండె మను వొండె బలి యొండె జనకుఁ
డొండెఁ
బ్రహ్లాదుఁ డొండె నేర్పాటుగా శుకుఁ డొండె భాసురతరమతి వ్యాసుఁ డొండెఁ

తే. గాక యన్యుల తరమె? యీ లోకమందు
నీ సుబోధంబు సద్బోధ మీ పదార్థ
మీ సదానంద చిన్మయ మీ యగమ్య
మీ విశుద్ధంబు గుహ్యంబు నీ శుభంబు. 177

క. ఈ పన్నిద్దఱు తక్కఁగ, నోపరు త కొ్కరులు తెలియ నుపనిష దుచిత
[3]శ్రీపతినామ మహోద్భుత, దీపిత భాగవతధర్మ దివ్యక్రమమునఁ. 178

తే. ఏది జపియింప నమృత మై యెసఁగుచుండు
నేది సద్ధర్మపథ మని యెఱుఁగఁ దగిన
దదియె సద్భక్తి యోగంబు నలవరించు
మూర్తిమంతంబు దా హరికీర్తనంబు. 179

తే. కంటిరే మీరు సుతులార! కమలనేత్రు
భవ్య మగు నామకీర్తన ఫలము నేఁడు
తవిలి మృత్యువు పాశబంధములవలన
జాణతనమున వీడె నజామిళుండు. 180

ఉ. ఏటికి జాలిఁ బొందు? నరు లీ క్రియఁ గృష్ణుని కీర్తనంబు పా
పాటవులం దహింపఁగల దౌటకు సందియ మేల? యిప్పు డీ
తూఁటరి దోసకారి పెనుదోషి యజామిళుఁ డంత మొందుచుం
బాటిగ విష్ణునామమును బల్కుచుఁ గేవల ముక్తి కేఁగఁడే? 181

క. ఇంతయును దథ్య మని మది, నెంతయుఁ దెలియంగలేరు హీనాత్ములు దు
ర్దాంతతర ఘటిత మాయా, క్రాంతాత్యంత ప్రకాశ గౌరవ జడు లై. 182

---

1. సన్నుతిగల (హ) 2. ముదురు (హ) 3. శ్రీపరిణామ (ద)

మంగళమహాశ్రీవృత్తము.

† ఈవిధమునఁ బిబుధు లేకతమ చిత్తముల నేకతము లేక హరి నీశుఁ
భావమున నిల్పి తగు భాగవతయోగ పరిపాకమున నొందుదురు వారిఁ
దేవలదు దండనగతిఁ జనదు మాకు గుఱుతింప నఘముల్ దలఁగు మీఁదఁ
శ్రీవరుని చక్రము విశేషగతిఁ గాఁచు సురసేవితులు ముక్తిఁ గడుఁ బెద్దల్. 184

ఉ. ఎవ్వరు సిద్ధ సాధ్య ఖచరేశ లసత్పరిగీత గాథులం
దెవ్వరు ముక్తిభోగతల హేమ మనోహర చంద్రశాలురం
దెవ్వరు శంఖ చక్ర గురుహేతి గదా రుచిరోగ్రపాణు లా
మవ్వపు రూపవంతు లసమానులు వో ధరలోని వైష్ణవుల్. 185

సీ. శ్రుత్యంత విశ్రాంత మత్యనుక్రమణీయ భగవ త్ప్రసంగతుల్ భాగవతులు
[1]సనకాదిముని యోగిజన సదానందైక పరమ భాగ్యోదయుల్ భాగవతులు
కృష్ణపద ధ్యాన కేవ లామృతపాన పరిణామ యుతులు శ్రీభాగవతులు
బహుపాత కానీక పరిభవ ప్రక్రియా [2]పరుషోగ్ర మూర్తులు భాగవతులు

తే. భావ తత్త్వార్థ వేదులు భాగవతులు
బ్రహ్మవా దానువాదులు భాగవతులు
సిరులు [3]దనరంగ నెన్నఁడుఁ జేటులేని
పదవి నొప్పారువారు వో భాగవతులు. 186

క. అది గాన విష్ణుభక్తులఁ, గదియఁగఁ జనవలదు మీరు కరివరదు లస
త్పదపద్మ వినతి విముఖులఁ, దుది నంటఁగఁ గట్టి తెండు ధూర్తులు వారల్. 187

సీ. ఎకసక్కెమున కైన నిందిరారమణునిఁ బలుకంగలేని దుర్భాషితులను
కలలోన నైన శ్రీకాంతుని సత్పాద కమలముల్ సూడని [4]కర్మఠుల
నవ్వుచు నైనఁ గృష్ణప్రశంసకుఁ జెవిఁ [5]దార్పనేరని దుష్కథా ప్రవణుల
యాత్రోత్సవంబుల నైన నీశుని గుడిత్రోవఁ ద్రొక్కఁగలేని దుష్పదులను

---

† వ్రాఁత ప్రతులలో ఈ క్రింది లయగ్రాహి యున్నది. ఇందు ప్రాసయతినియమము లేదు.

లయగ్రాహి :— ఈ విధమునన్ విబుధు లేచి తమ చిత్తముల నేకతము లేక పరమేశు హరి నీశున్
భావమున నిల్పి తగు భాగవత యోగ పరిపక్వమున నొందుదురు పాలుపడివారిన్
దేవలదు దండనగతిం జనడు మాకు గణుతింప నఘము ల్దొలగు దెల్లమగు మీదన్
శ్రీవరుని చక్రము విశేషగతిఁ గాచుసురసేవితుల ముక్తిఁ గడుఁ జెందుదురు పెద్దల్.

1. సకల సన్ముఖ (హ) 2. పరుషాగ్ర్య (హ) 3. దొలఁకంగ (తం) 4. కర్మదృశుల (చ. ట. త. తం.) 5. దాలవెయ్యని దుష్కథాభిరతుల (హ)

తే. బరమ భాగవతుల పాదధూళి సమస్త
తీర్థసార మనుచుఁ దెలియలేని
వారి వారివారి వారిఁ జేరినవారిఁ
దొలుతఁ గట్టి తెండు దూతలార ! 188

తే. ఎల్ల పాపములకు ని ల్లైన యింటిలో
బద్ధ తృష్ణు లగుచు బుద్ధిఁ దగిలి
పరమహంస కులము గుఱితప్పి వర్తించు
ధూ ర్తజనులఁ దెండు దూతలార ! 189

తే. అరయఁ దనదు జిహ్వ హరిపేరు నుడువదు
చి త్త మతని పాదచింతఁ జనదు
తలఁపఁ దమకు ము క్తి తంగేటి జున్నొకో ?
సకల విష్ణుభక్తులకును బోలె. 190

ఆ. పద్మనయను మీఁది భ క్తి యోగం బెల్ల
ము క్తి యోగ మనుచు మొద లెఱుంగు
వారి వారివారి వారిఁ జేరినవారి
[1]బోవఁ బోవవలదు దూతలార ! 191

వ. అని పలికె నని చెప్పి మఱియు శుకుం డి ట్లనియె. శ్రీ కృష్ణనామ సంకీ ర్త నంబు జగన్మంగళం బనియును, జగన్మోహనం బనియును, జగజ్జేగీయమానం బనియును, నిఖిల మాయాగుణ విచ్ఛేదకం బనియును, ఉద్దామంబు లగు హరి వీర్యంబుల నాకర్ణించువారల చి త్తంబు లతినిర్మలంబు లగు భంగిం దక్కిన వ్రతాచరణంబులుం గా వనియు, శ్రీకృష్ణ పదపద్మంబులు హృత్పద్మంబుల నిలుపువార లన్య పాపకర్మంబు లగు నవిద్యా వ్యసనంబులం బొరయనేర రని యును, నిజస్వామి యైన యమధర్మరాజు చేతఁ గీ ర్తింపఁ బడ్డ భగవ న్మహా త్మ్యంబు నాకర్ణించి, వి స్మితు లై కాలకింకరులు నాఁటనుండియు వైష్ణవజనం బులం దేఱిచూడ వెఱతురు. నరేంద్రా ! పరమగుహ్యం బగు నీ యితిహాసం బును బూర్వకాలంబున సకల విజ్ఞానగోచరుం డైన కుంభసంభవుండు సకల దుఃఖవిలయంబును, సకల పుణ్యనిలయంబును నైన మలయంబునఁ బురాణ పురుషుం డైన పురుషోత్తము నారాధనంబు సేయుచుండి నా కెఱిఁగించెను.

---

1. తలఁపవలదు (జ. తం.)

అధ్యాయము - ౪

అని చెప్పిన విని విస్మయానంద హృదయుం డై పరీక్షి జ్జనపాలుం డి ట్లనియె.

క. స్వాయంభువ మనువేళల, నో యయ్య! సురాసు రాండ జోరగ నర [1]వ
ర్గాయత సర్గముఁ దెలిపితి, పాయక యది వి స్తరించి పలుకం గదవే! 193

క. ఉత్తర కొడు కి ట్లడిగిన, [2]యుత్తరమును న మ్మునీంద్రుఁ డుత్తమ చేతో
వృత్తి ముదమంది పలికెను, దత్తరపా టుడిగి వినుఁడు తాపసులారా! 194

సీ. పూని ప్రచేతసు పుత్రులు పదుగురు ప్రాచీనబర్హి ప్రాఖ్య గలుగు
వారు మహోంభోధి వలన వెల్వడి వచ్చి తగ వృతువృత మైన ధరణిఁ జూచి
మేదినీజములపై మిక్కిలి కోపించి మదిలోన దీపితమన్యు లగుచు
వక్త్రంబులను మహావాయు సంయుతమైన యనలంబుఁ గల్పించి యవనిజములఁ

తే. బెల్లువడఁ గాల్పఁ దొడఁగినఁ దల్లడిల్లి
వారి కోపంబు వారించువాఁడ పోలెఁ
బలికెఁ జందురుఁ డో మహాభాగులార!
దీనములు వృతుములమీఁదఁ దెగుట తగునె? 195

తే. మొదల వర్ధిష్ణు లగు మిమ్ము సదయ హృదయు
లగు ప్రజాపతు లనుచు సర్వాత్ముఁ డనియె
నట్టి మీరు ప్రజాసృష్టి కై న వార
లీ వనస్పతితతుల దహింపఁ దగునె? 196

సీ. ఆదికాలంబున నా ప్రజాపతి [3]పతి యయిన లోకేశ్వరుం డచ్యుతుండు
పద్మనేత్రుఁడు [4]వనస్పతుల నోషధిముఖ్యజాతంబు †నిషము ‡నూర్జంబుఁ గోరి
కల్పించె నందు ముఖ్యం బై న యన్నంబు నచరంబు లై నట్టి యపద మెల్లఁ
బాదచారులకును బాల్వెట్టి యిరుగాళ్ళు చేతులు గలిగిన జీవతతికి

తే. [5]హస్తములు లేని యా చతుష్పాదు లెల్ల
నన్నముగఁ బూని కావించె నదియుఁ గాక
నా మహాభాగుఁ డచ్యుతుఁ డాదరమున
మీకు ననఘాఖ్య విఖ్యాతి జోకపటీచె. 197

---

1. సర్గాయతము గలిగెనంటివి (క. ద.) 2. ఉత్తరమున కమ్మునీంద్రు (హ) 3. తండ్రి (ట)
4. వనస్పతుల నోషధీ జాతంబు (చ) † ఇషము = అన్నము ‡ ఊర్జము = భక్ష్యము
5. పాణులొగిలేని (తం. వా)

క. నిజముగ దేవాధీశ్వరుఁ, డజుఁడు ప్రజాసర్గమునకు ననఘుల మిమ్మున్
సృజియించె నిట్టివారికిఁ, గుజదహనము సేయ నెట్లు కోరిక యొడమెఁ? 198

చ. సతత మహాత్త్వ సత్త్వగుణ సత్పురుష [1]స్మృతిఁ బొందరయ్య! మీ
పితరులునుం బితామహులుఁ బెద్దలు నెన్నఁడుఁ బొందనట్టి దు
ష్కృతమత మైన కోపమునఁ గిల్బిష భావము మానరయ్య! సం
భృత కరుణావలోకమున భీత తరుప్రకరంబుఁ జూచుచుఁ. 199

ఉ. తప్పక యర్భకావళికిఁ దల్లియుఁ దండ్రియు నేత్రపంక్తికిఁ
జొప్పలు నాతికిం బతి నరేంద్రుఁడు లోకుల కెల్ల [2]నర్థికి
న్నొప్ప గృహస్థు మూఢులకు నుత్తము లెన్నఁగ వీరు బంధువుల్
ముప్పునఁ గావలేని కడుమూర్ఖులు [3]గారు నిజాల బంధువుల్. 200

సీ. అఖిలభూతముల దేహాంతస్థ మగు నాత్మ యీశుఁ డచ్యుతుఁడని యెఱుఁగవలయు
నెఱిఁగి సర్వం బైన యిందిరారమణు లోచూపునఁ దనివిగాఁ జూడవలయుఁ
జూచిన చిద్రూప శుద్ధాత్ము లగు మిమ్ము నెనసిన వేడ్కతో నిచ్చ మెచ్చు
మెచ్చిన సర్వాత్ము మీ రెఱింగినచోటఁ గోపగుణంబులఁ బాపవలయుఁ

ఆ. బాపి దగ్ధశేష పాదపజాలంబుఁ
దియ్య మెసఁగ బ్రతుకనీయవలయు
ననఘులార! మీర లస్మదీయ ప్రార్థ
నంబు పరఁగ జేకొనంగవలయు. 201

క. ఇదె వృత్రసముద్భవ యగు, మదిరేక్షణ నాప్సరసిఁ గుమారిక నిత్తున్
వదలక బత్నిఁగఁ జేకొని, ముద మందుఁడు పాదపముల మోసము వాయన్. 202

వ. అని యి ట్లామంత్రణంబు సేసి, మారిష యను కన్యకను వారల కిచ్చి చంద్రుండు
సనియె. అప్పుడు 203

క. వారలు పర్యాయంబున, నీరేజముఖిఁ వరించి నెఱి రమియింపన్
ధీరుఁడు ప్రాచేతసుఁ డై, వారక దక్షుండు వుట్టె వనజజ సముఁడై. 204

క. ఎవ్వని సంతానంబులు, నివ్వటిలెఁ వసుధ నెల్ల నెఱి నా దక్షుం
డి వ్వలన జగము లన్నిటఁ, బ్రవ్వ జలము నిలిపినట్లు ప్రజఁ బుట్టించెఁ. 205

---

1. శ్రుతిబొందిరయ్య (హ) 2. నర్థికిం, బొప్ప (తం. వా.) 3. సుమ్మి సమస్త బంధువుల్ (హ. తం.)

ఉ. వారని వేడ్కతో దుహితృవత్సలదక్షుఁడు దక్షుఁ డాత్మచేఁ
గోరి సృజించెఁ గొన్నిటి నకుంఠిత వీర్యముచేతఁ గొన్నిటిం
భోరున ఖేచరంబులను భూచరముఖ్య వనేచరంబుల
న్నీరచరవ్రజంబు రజనీచరజాల దివాచరంబులన్. 206

క. నరసుర గరు డోరగ కి, న్నర దానవ యక్ష పక్షి నగ వృక్షములం
దరమిడి సృష్టి యొనర్చెను, దిరముగ దక్షప్రజాపతి [1]వితత కీర్తిన్. 207

క. బహువిధముల బహుముఖముల, బహురూపము లైన ప్రజల బహులోకములన్
బహుళముగఁ జేసి మదిలో, బహుమానము నొందఁ డయ్యెఁ బ్రఖ్యాతముగన్.

తే. [2]అప్రజాసర్గ బృంహితం బైన జగము
దక్షుఁ డీక్షించి మదిలోనఁ దాప మొంది
మఱియు జననంబు నొందించు [3]మతము రోసి
పరమపురుషుని నారాధియింపంగఁ దలఁచె. 209

వ. ఇట్లు దక్షప్రజాపతి ప్రజాసర్గంబు చాలక చింతించి మంతనంబున లక్ష్మీకాంతుని సంతుష్టుం జేయువాఁ డై. 210

క. మోదం బై పరిదూషిత, ఖేదం బై శాబరీద్ధ కిలికించిత దృ
గ్భేదం బై బహుసౌఖ్యా, పాదం బై యొప్పు వింధ్యపాదంబునకున్. 211

వ. అరిగి, యం దఘమర్షణం బను తీర్థంబు సర్వదురితహరం బై యొప్పుదాని ననుసవనంబు సేవించి, యతిఘోరం బైన తపంబు సేయుచు హరిం బ్రసన్నుం జేసి, హంసగుహ్యాం బను స్తవరాజంబున ని ట్లని స్తుతియించె. 212

—: దక్షుఁడు కావించిన హంస గుహ్యాం బను స్తవరాజము :—

తే. పరమునికి వందనము సేతుఁ బరిఢవించి
మున్నవితథానుభూతికి మ్రొక్కికొందు
మెఱయు గుణములఁ దేలు నిమిత్తమాత్ర
బంధుఁ డైనట్టి వానికిఁ బ్రణుతి సేతు. 213

ఆ. తవిలి గుణముచేతఁ దత్త్వబుద్ధులచేత
నిగిడి కానరాని నెలవువాని
మొదలఁ దాన కలిగి ముక్తి మానావధి
రూప మైనవాని ప్రాపుఁ గొందు. 214

---

1. స్ఫుటకీర్తిన్ (హ) 2. ఆ ప్రజాసర్గ (తం. వా.) 3. మమత దగిలి (టి. త. జ.)

తే. ఎల్లతనువులందు నిరవొంది తనతోడఁ
బొందు సేసినట్టి పొందుకాని
పొందు వొందలేఁడు పురుషుండు గుణముఁ దా
గుణినిఁ బోలె నట్టి గుణి భజింతు. 215

ఉ. పూని మనంబులుం దనువు భూతములుఁ మఱి యింద్రియంబులుఁ
బ్రాణములుఁ వివేకగతిఁ బాయక యన్యముఁ దమ్మి నె మ్మెయిం
గానఁగనేర వా గుణనికాయములం బరికించునట్టి స
ర్వానుగతుఁ సమస్తహితు నాదిమపూరుషు నాశ్రయించెదఁ. 216

వ. మఱియు బహువిధ నామ రూప నిరూప్యం బగు మనంబునకు దృష్టస్మృతుల నాశంబువలనఁ గలిగెడు నుపరామం బగు సమాధియందుఁ గేవల జ్ఞానస్వరూపం బునఁ దోఁచు నిర్మల ప్రతీతిస్థానం బైన హంసస్వరూపికి నమస్కరింతు. దారువందు నతిగూఢం బైన వీతిహోత్రుని బుద్ధిచేతం బ్రకాశంబు నొందించు భంగి, బుద్ధి మంతులు హృదంతరంబున సన్ని వేశుం డైన [1]పరమపురుషుని నాత్మశక్తిత్రయం బులచేతం దేజరిల్లం జేయుదురు. అట్టి దేవుండు, సకల మాయావిచ్ఛేదకం బైన నిర్వాణ సుఖానుభవంబులం గూడి యుచ్చరింపం గొలఁది గాని శక్తిగల విశ్వరూపి నాకుం బ్రసన్నుం డగుం గాక. వా గ్బుద్ధీంద్రియ మానసంబులచేతం జెప్పను, నిట్టి దని నిరూపింపను, నలవి గాక ఎవ్వని గుణరూపంబులు వర్ణించు, నెవ్వఁడు నిర్గుణుండు, సర్వంబు నెవ్వని వలన నుత్పన్నం బగు, నెవ్వని వలన స్థితిం బొందు, నెవ్వని వలన లయం బగు, నట్టి పరాపరంబులకుం బరమం బై, యనన్యం బై (సర్వవ్యాపకం బై) యదియ బ్రహ్మం బై, యాదికారణం బై, యున్న తత్త్వంబు నాశ్రయింతు. ఎవ్వని ప్రభావంబు మాటలాడెడు వారలకు, వాదంబు సేయువారలకు వివాదస్థలం బగుచు, నప్పటప్పటికి మోహంబు నొందింపుచుండు, నట్టి యనంతగుణంబులు గల మహాత్మునకుం బ్రణామంబు సేయుచు, నస్తి నాస్తి యను వస్తుద్వయ నిష్ఠలం గలిగి, యొక్కటనఁ గలిగియుండి, విరుద్ధధర్మంబులుగ (నుపాసనాశాస్త్ర) సాంఖ్యశాస్త్రంబులకు సమం బై, వీక్షింపఁదగిన పరమంబు నాకు ననుకూలం బగుం గాక. ఎవ్వఁడు నామరూపంబులు లేకుండియు, జగ దనుగ్రహంబుకొఱకు జన్మకర్మంబులచేత నామరూపంబులు గల్గి తేజరిల్లు, నట్టి యనంతుం డైన భగవంతుండు సుప్రసన్నుం డగుఁగాక. ఎవ్వఁడు జనుల పురాకృత జ్ఞానపదంబుచేత నంతర్గతుం డై, మేదినిం గలుగు గంధాది గుణంబుల నాశ్రయిం

---

1. పరమపురుషుని శక్తులైన అపద్రవ్యంబులచేతను (ట); నవద్రవ్యంబుల చేతను (జ. డ. ద.) "స్వ శక్తిభిః నవభిశ్చ త్రివృద్భిః" (అని మూలము) 4-27

చిన వాయువుభంగి మెలంగుచుండు నా పరమేశ్వరుండు మదీయ మనోరథంబు సఫలంబు సేయుం గాక. అనుచు భక్తిపరవశుండై యుక్తివిశేషంబున స్తుతియింపు చున్న దక్షునికి భక్తవత్సలుం డైన శ్రీవత్సలాంఛనుండు ప్రాదుర్భావంబు నొంది ప్రత్యక్షుం బయ్యె. అంత 217

సీ. భర్మాచలేంద్ర ప్రపాతద్వయంబునఁ గలిగిన నీలంపుఁ గను లనంగ
మొనసి తార్క్ష్యుని యిరుమూఁపుపై నిడినట్టి పదముల కాంతులు పరిఢవింపఁ
జండ దిఙ్మండల శుండాల కరముల కై వడి నెనిమిది కరము లమరఁ
జక్ర కోదండాసి శంఖ నందక పాశ చర్మ గదాదుల సరవిఁ బూని

తే. నల్లమేను మెఱయ నగుమొగం బలరంగఁ
జల్లచూపు విబుధసమితిఁ బ్రోవఁ
బసిడికాసెఁ బూని బహుభూషణ కిరీట
కుండలములకాంతి మెండుకొనఁగ. 218

సీ. కుండల మణి[1]దీప్తి గండస్థలంబులఁ బూర్ణేందురాగంబుఁ బొందుపఱుప
దివ్యకిరీట ప్రదీప్త లంబర రమాసతికిఁ గౌసుంభవస్త్రంబు గాఁగ
వక్షస్థలంబుపై వనమాల మాలికల్ శ్రీవత్స కౌస్తుభ శ్రీల నొఱయ
నీలాద్రిఁ బెనఁగొని నిలిచిన విద్యుల్లతలభాతిఁ గనకాంగదములు మెఱయ

తే. నఖిలలోక మోహనాకార యుక్తుఁ డై
నారదాదిమునులు చేరి పొగడఁ
గదిసి మునులు పొగడ గంధర్వ కిన్నర
సిద్ధ గానరవము సెవుల నలర. 219

క. సర్వేశుఁడు సర్వాత్ముఁడు, సర్వగతుం డచ్యుతుండు సర్వమయుం డై
సర్వంబు చేరి గొలువఁగ, సర్వదుఁ డై దక్షునకుఁ బ్రసన్నుం డయ్యెన్. 220

వ. ఇట్లు ప్రసన్నుం డైన సర్వేశ్వరుని సర్వంకషం బై మహా దాశ్చర్యధుర్యం బై తేజరిల్లు దివ్యరూపంబుం గాంచి, భయంబును, హర్షంబును, విస్మయంబును జిత్తంబున ముప్పిరిగొని చొప్పు దప్పింపం దెప్పిఱి, కప్పరపాటునఁ బుడమిపై నిడుసాగిలంబడి, దండప్రణామంబు లాచరించి, కరకమలంబులు మొగిడ్చి, నెలయేఱులతోఁ గొట్టువడి, యిట్టట్టు పట్టుచాలక నిట్టవొడిచి, మున్నీరు దన్ని నిలిచిన పెన్నీరునుం బోలె, సర్వాంగంబులుం దొంగలింపఁ, జిత్తంబు నాత్మా యత్తంబు సేసి, పిక్కటిల్లిన సంతోషంబుచేత భగవంతుం బలుకను, నత్యంత

---

1. దీప్త....స్థలంబులు....బొనుఁగు పఱుప (తం. త.)

మంగళసందో హోపాదకంబు లైన తన్నామంబు లుగ్గడింపను, నతి నిర్మలంబు లైన తదీయ కర్మంబులు దడవను, విబుధ హర్షకరంబు లైన తత్పౌరుషంబులు పొగడను, నాత్మీయ మనోరథంబు వాక్రువ్వను నోపక ప్రజాకాముం డై యూరకున్న ప్రజాపతిం జూచి, సర్వజీవ దయాపరుండును, సర్వసత్త్వ హృదంత రస్థుండును, సర్వజ్ఞుండునుం గావున నతనిభావంబు దెలిసి, జగన్నాథుం డార్త పోషణంబుల భాషణంబుల నిట్లనియె. 221

క. మెచ్చితి ప్రాచేతస! తప, మిచ్చట ఫలసిద్ధి యయ్యె నిట్లతిభక్తిన్
హెచ్చగు మ ద్వరవిభవము, నచ్చుపడం బొంద నెవ్వఁ డర్హుఁడు? జగతిన్.222

తే. తపము చాలు నింకఁ దగ భూతతతికి వి
భూతు లొనరుఁ గాక పొందుపడఁగ
నిదియ సుమ్ము మాకు నిచ్చలోఁ గల కోర్కె
పొసఁగ నీదువలనఁ బొందుపడియె. 223

వ. వినుము. బ్రహ్మయు, భర్గుండును *(ప్రజాపతులును) మనువులును, నింద్రులును, వీరలు నిఖిలభూతంబులకు భూతిహేతువు లైన మ ద్భూతివిభవంబులు. మఱియు నాకు (యమ నియమాది సహిత సంధ్యావందనాది రూపం బగు) తపంబు హృదయంబు. సాంగ జపవ ద్ధ్యానరూపం బగు విద్య శరీరంబు. ధ్యానాది విషయ పుంవ్యాపారంబుగా నుండు భావనాది శబ్దవాచ్యం బగు క్రియ యాకృతి. క్రతు జాతంబు లంగంబులు. ధర్మం బాత్మ. దేవతలుప్రాణంబులు. నిగమంబు మ త్స్వ రూపంబు. జగదుత్పత్తికి నాదియందు నే నొక్కండన తేజరిల్లుచుంటి. బహిరంత రంబుల వేఱొక్కటియు లేదు. సుషుప్త్యవస్థయందు సర్వంబు లీనం బగుటంజేసి సంజ్ఞానమాత్రుండును, నవ్యక్తుండునుఁగా నుండు జీవునిభంగి నొక్కఁడన యుండుదు. అనంతుండ నయి యనంతగుణంబు వలన గుణవిగ్రహం బగు బ్రహ్మాం డంబును, నయోనిజుఁడు, స్వయంభవుం డగు బ్రహ్మయును నుదయించిరి. మదీయ వీర్యోపబృంహితుం డై మహాదేవుం డగు నా బ్రహ్మ యసమర్థునిఁబోలె నకృ తార్థం మన్యమాన మనస్కుఁ డై, సృజింప నుద్యమించుతఱి తపం బాచరింపు మని నాచేత బోధితుం డై, యఘోరం బైన తపం బాచరించి, తొలుత సృష్టి కర్తృత్వము వహించిన మిమ్ము సృజించె. అంతఁ బంచజనుం డను ప్రజాపతి తనూజ యగు నసిక్ని యను పేరిట వినుతి నొందియున్న యి క్కన్యకను నీ కిచ్చితి. దీనిం బత్నిగాఁ గైకొని మిథున వ్యవాయధర్మంబు గలవాఁడ వై,

---

* తా. ప. ప్రతులలో లేదు.

మిథునవ్యవాయ ధర్మంబు గల యీ నాతియందుఁ బ్రజాసర్గంబు నతి విపులంబుగ గావింపంగలవాఁడవు. మఱియు నీకుఁ బిదప నిదే క్రమంబున నిఖలప్రజలును మ న్మాయా మోహితు లయి, మిథునవ్యవాయ ధర్మంబునఁ బ్రజావృద్ధి నొందించి, మ దారాధనపరు లై యుండఁగలవారు. అని పల్కి, విశ్వభావనుం డైన హరి, స్వప్నోపల బ్ధార్థంబునుం బోలె నంతర్ధానంబు నొందె.

అధ్యాయము - ౫

అప్పుడు దక్షుండు విష్ణుమాయోపబృంహితుం డై పాంచజని యగు నసిక్ని యందు హర్యశ్వ సంజ్ఞుల వినుతిఁ బెందియున్న యయుతసంఖ్యా పరిగణితు లైన పుత్రులం గాంచె. అప్పు డా ధర్మశీలు లైన దాక్షాయణులు, పితృనిర్దేశంబునం బ్రజాసర్గంబుకొఱకుఁ దపంబుసేయువా రై పశ్చిమదిశకుం జని, యచ్చట సింధు సముద్రసంగమంబున సమస్త దేవ ముని సిద్ధగణ సేవితం బై, దర్శనమాత్రంబున నిర్ధూత కల్మషులను, నిర్మలచిత్తులం జేయుచున్న నారాయణసర స్సనం బరఁగు తీర్థరాజంబున నవగాహనంబుఁ జేసి, నిర్మలాంతరంగు లై, పరమహంసధర్మంబు నందు నుత్పన్నమతు లై ప్రజాసర్గంబుకొఱకుఁ దండ్రి యనుమతంబున నుగ్ర తపంబు సేయుచుండ, వారికడకు నారదుండు వచ్చి యి ట్లనియె. 224

సీ. మీ రతిమూఢులు మీఁదటి గతి గాన రెన్నంగఁ బసిబిడ్డ లన్నలార!
పుడమిఁ దా నింతని కడ పరికింపరు ప్రజలఁ బుట్టించ నేప్రతిభ కలదు?
అచ్చైన నొక్క మహాత్ముఁడు పురుషుండు బహురూపములు గల భామ యొకతె
[1]పుంశ్చలీభ ర్తయుఁ బురణింప నుభయ ప్రవాహంబు గల నది వలెలఁ గదల

తే. నంచ యొకటి యిరువదై దింటి మహిమలఁ
గలిగియుండు తెరువు గానరాక
వ్రజనిబిడ మగుచు వరుసఁ దనంతన
తిరుగు [2]రాష్ట్రబిలము దేటపడఁగ. 225

క. వినుఁ డందుల యనురూపము, ననువొందఁగ నెఱుఁగ కాత్మ నాత్మగురూ క్తిం
గొనసాగించెద మను మి, మ్మున నేమియు లేదు మూఢు లని తెలిసి తగన్. 227

వ. అని నారదుండు బోధించిన హర్యశ్వులు సహజబుద్ధిచేత నారదవాక్యంబులను దమలో నిట్లని వితర్కించిరి. 228

---

1. పుంశ్చలి గర్తయు (హ); ....గర్మంబు (తం): ....గర్తంబు (వా) 2. కాష్ఠబిలము (హ. తం. వా.)

తే. సొరిది క్షేత్రజ్ఞు డన నతిసూక్ష్మ[1]బుద్ధి
నరయ నజ్ఞానబంధనం బగుచు లింగ
దేహమున నెద్ది గల దది దెలియకున్న
గలదె? మోక్షంబు దుష్కర్మగతులచేత. 226

తే. కలడు జగదేక సన్నుత కారణుండు
స్వామి భగవంతు డభవుండు స్వాశ్రయుండు
పరము డాతని జూడక బ్రహ్మ కైన
గలుగునే? ముక్తిపదము దుష్కర్మగతుల. 227

ఆ. పురుషు డెట్టులేని పూని బిల స్వర్గ
గతుడు వోలె వర్తకంబు మాను
నట్టి బ్రహ్మ మెఱుగు నయ్యకు స్వర్భోగ
కర్మగతుల నేమి కానబడును? 228

శా. తన్నిష్ఠాగతి లేనివానికి నసత్కర్మ ప్రచారంబుచే
మున్నే మయ్యెడి నాత్మబుద్ధి గుణసమ్మోహంబునం దోచుచున్
వన్నెల్ వెట్టుక వింతబాగుల తటిల్ వర్తించు దౌర్గణ్య సం
పన్న [2]స్త్రీయునుబోలె నెల్లగతులం బ్రఖ్యాత మై యుండగన్. 229

సీ. అనువొంద సృష్టి నవ్యయముగ జేయుచు బ్రచుర ప్రవాహ సంపతిత మైన
నెఱయ గూలం బను నిర్గమ స్థానంబు నందు వేగముగల క్రందు మాయ
[3]గదలి యహంకార గతివశంబున జాల వివశు డై బోధకు విపరి యైన
వానికి నీరీతి వలవంత కర్మ ప్రచారంబులను మీద జిక్క నైన

ఆ. జన్మ మరణ ముఖ్య జాడ్యంబుతో బాసి
యఖిల సౌఖ్య పదవి నరసి కర్మ
మార్గ మైనయట్టి మహనీయ ధామంబు
చిత్త [4]మార నెట్లు చేర గలఁడు? 230

తే. దాని సంసర్గ గుణములు దప్పి నడచు
కుచ్చితపు భార్య జేకొన్న కుమతివోలె
తివిరి సుఖదుఃఖముల గూడి తిరుగు జీవ
రూప మెఱుగని వారికి బ్రాపు గలదె? 231

---

1. మంది (హ) 2. శ్రీ (తం. వా.) 3. కడగి (ట) 4. చిత్తమలర (ద)

మత్తకోకిల. పంచవింశతి తత్త్వరాశి కపారదర్పణ మయ్యుఁ దాఁ
గొంచె మై పురుషుండు తత్త్వముఁ గోరి పట్టఁగ నేర కే
[1]మంచుఁ గించుఁ దలంచువార లమార్గ కర్మము సేయఁగా
మంచిలోకము వారి కేటికి మానుగా సమకూరెడిఁ ? 234

క. బంధానుమోఘణ క్రమ,సంధా నైశ్వర్యధుర్య శాస్త్రసమగ్ర
గ్రంథంబు మాను చిద్రూ,పాంధునకు నకర్మ గతుల నగునే శుభముల్. 235

మత్తకోకిల. చూడ నీ జగమంతయుఁ వెసఁ జుట్టి పట్టుక లీల నే
జోడులేక రయంబునం గుడి చుట్టినట్టి స్వతంత్రముం
గూడి యుండిన కాలచక్రముఁ గోరిచూడని వారి కే
జాడఁ గల్గు [2]నకర్మ సంగతిఁ జారుమోఘ పదం బిలఁ. 236

తే. జన్మ హేతు వైన జనకనిర్దేశంబు
తనకుఁ జేయ రాని దనుచుఁ దెలిసి
గుణమయ ప్రవృత్తి ఘోరాధ్వ నిశ్వాస
నిరతుఁ డగుచుఁ జేయ నేరఁ డతఁడు. 237

వ. అని తమలో వితర్కించి యా కుమారు లప్పుడు. 238

సీ. వినవయ్య ! భూపాల ! మునివరేణ్యుని మాట లనువొందఁ దలపోసి వినయ మలర
వలగొని యతనికి వందనం బొనరించి తిరిగి యొన్నఁడురాని తెరువు వట్టి
చయ్యన నేఁగిరి సహజ [3]స్వర బ్రహ్మ మయ మైన పంకజనయను పాద
పద్మ మరందంబు పానంబు సేయుచు మత్తిల్లి నిలిచిన మానసాళి

తే. పరిణమింప విష్ణుఁ బాడుచుఁ ద త్కీర్తి
సరణి ప్రేమోయ మహతి సంఘటించి
నారదుండు గుణవిశారదుం డెందేనిఁ
జని యొ జగము దన్ను సన్నుతింప. 239

క. అప్పుడు దఱుఁడు తనయులు, దప్పి మహాపథము గనుట తగ నారదుఁడే
చెప్పినఁ గప్పిన శోకము, ముప్పిరిగొని చిత్తవృత్తి మూరిం బోవఁ. 240

---

1. మంచుఁ గించు దలంచువాఁడు కదధ్వకర్మము సేయఁగా....వానికేటికి(వా)....వార మమార్గ కర్మము.....వారికేటికి (తం)
మంచుఁ దలఁచుచు నుండి పాయ కుమార్గ (హ)
"పంచవింశతి తత్వానాం పురుషో ఽద్భుత దర్పణమ్
ఆధ్యాత్మ మబుధస్యేహ కి మసత్కర్మభి ర్భవేత్" (5-17)
2. ను (హ. తం. వా.) 3. సత్త్వ (హ. తం. వా.)

చ. అడలుచునున్న వచ్చి కమలాసనుఁ డూఱడిలంగఁ బల్కె ముఁ
బడసిన లీలఁ బుత్రుల నపారగుణాఢ్యులఁ గాంచు మన్న నా
పడఁతుక [1]వల్నఁ గ్రమ్మఱను బల్వురఁ దా, శబళాశ్వ సంజ్ఞలం
బెడఁగగు వారి పుణ్యములఁ బేర్చినవారి సహస్ర సంఖ్యులన్. 241

క. పుట్టించిన జనకుని మదిఁ, బుట్టిన తలఁ పెఱిఁగి వారు పూనిక ప్రజలం
బుట్టించు వ్రతముఁ గైకొని, గట్టిగఁ దప మాచరింపఁగాఁ జనిరి వెసఁ. 242

వ. ఇట్లు శబళాశ్వులు ప్రజాసర్గంబుకొఱకుఁ దండ్రి పంపునం దపంబు సేయువా రై యే తీర్థంబు తీర్థరాజం బై సకల తీర్థఫలంబులు నాలోకన మాత్రంబున ననుగ్రహించుచు సకల పాపంబుల నిగ్రహించు, నే తీర్థప్రభావంబున నగ్రజన్ములు ఫల సిద్ధిం బొందుదు, రట్టి నారాయణ సర స్సను పుణ్యతీర్థంబునకుం జని, త దుప స్పర్శ మాత్రంబున నిర్ధూత మలాశయు లై. 243

శా. బ్రహ్మాండ్రాదులు నందనేరని పరబ్రహ్మంబుఁ జింతింపుచుఁ
బ్రహ్మానందముఁ బొంది జిహ్వికలపై బ్రహ్మణ్య మంత్రంబు స
ద్బ్రహ్మోలోకన వాంఛతో నిలుపుచుఁ బ్రహ్మం బితం డంచు ముఁ
బ్రహ్మజ్ఞాన గురున్ హరిం దపమునం బాటించి ర బ్బాలకుల్. 244

సీ. ఏకపాదాంగుష్ఠ మిలమీఁద సవరించి నిశ్చల కాయు లై నిక్కి నిలిచి
కరములు గీలించి సరవి మీఁదికి నెత్తి గుఱుతుగాఁ బెనుబయల్ గుట్టిపట్టి
నిడివిగాఁ గ్రూర మై నిగిడిన చూడ్కులఁ గడు తీవ్రభానునిఁ [3]బొదివిపట్టి
వడిఁ గొంతకాలంబు వాయువు భక్షించి యంతనుండియు నిరాహారు లగుచు

తే. సకల లోకములకు సంహారకరమును
బేర్చి దేవతలకు భీతికరముఁ
గాఁగ ఘోరతపముఁ గావింపఁ దొడఁగిరి
మహిత చిత్తు ల క్కుమారవరులు. 245

—: నారదుండు శబళాశ్వులకు నివృత్తి మార్గంబు నుపదేశించుట :—

వ. ఇ ట్లతి భయంకరం బై న తపంబు సేయుచు, నెడతెగక భగవ న్మంత్రంబుల నొడువుచుఁ, బ్రజాసర్గ కాము లై యున్న య చ్చిన్న బాలుర కడకు నార దుండు సనుదెంచి, పూర్వవిధంబునం బలుకుచు ని ట్లనియె. భ్రాతృ వత్సలు లై

---

1. పడఁతుకయందుఁ బల్వురను బన్నుగఁ దా (తం.) వల్ల (వ్రా. ప్ర.) 2. దలపులన్ (త)
3. పొడిచి (తం. వా.)

యున్న మీరలు వేదాంతసారంబు వలుకుచున్న నా వచనంబు లాదరించి, తోఁబుట్టువులు సనిన మార్గంబు చనుండు. ఎవ్వఁడేనియుఁ దన యగ్రజులు గన్న మార్గంబునం దానునుం దప్పక వర్తించు, నట్టివాని విశేషధర్మం బెఱింగిన వాఁ డంద్రు. సతతంబును బుణ్యబంధువు లైన దేవతలం గూడి సుఖంబుండుండు అని పల్కి నారదుండు సనియె. వారలు సర్వకర్మంబుల యందు నిర్మోహితు లై పరమపదంబునకు నాస్పదంబు లైన దేవర్షి వాక్యంబుల నాశ్రయించి. 246

ఉ. అప్పుడు లజ్జతోడ శబళాశ్వులు పూర్వజు లేఁగినట్టి యా
చొప్పున నెన్నఁడుం దిరిగి చూడని త్రోవ విశేషపద్ధతిం
దప్పక పోయి రయ్య! గుణధాములు నేఁడును మళ్ళరేమి నేఁ
జెప్పెదఁ గాక ‡రాక [1]కడఁజేరిన రాత్రులఁ బోలి భూవరా! 247

క. దఱుచున కా కాలంబున, లక్షిత మై యుండెఁ బెక్కు లాగుల నుత్పా
త క్షోభంబులు వానికి, రూఢివ్యథ నొంది యా పురుష నాశమునన్. 248

క. నారదకృత మని యెఱిఁగి మ,హా రోషముతోడ నేఁగి యాతనిఁ గని దుఃఖారూఢ చిత్తుఁ డై మది, నూఱడిలం దెరువు లేక యుగ్రుం డగుచున్. 249

తే. మోము జేవురింప ముడివడ బొమదోయి
చూపు వెంట మంట సుడిగొనంగఁ
బెదవు లదరఁ బండ్లు పెటపెటఁ గొఱుకుచు
దక్షుఁ డాగ్రహించి తపసిఁ బలికె. 250

చ. నెఱయఁగ సాధురూపమున నీ వతిబాలుర కాత్మజాళికిం
గఱకున భిక్షుమార్గ మగు కందువ సెప్పితి వేల? ధూర్త వై
మఱుఁగక యుండవచ్చునె? [2]కుమారుల నీ దురితంబు వొంద ని
న్నొఱలఁగఁ ద్రోతు నాదు సమదోగ్ర మహాగ్రహ శాపవహ్నులన్. 251

—: దక్షుండు నారదుని శపియించి ప్రజాసర్గం బొనరించుట :—

వ. అది యెట్లంచేని, దేవర్షి పితృ ఋణంబులు దీర్చక † అమీమాంసిత కర్మంబులు గల బాలురకు బుద్ధిఁ జెఱిచి, వారలకు నుభయ లోకంబుల శ్రేయోహాని నొన

---

‡ నాద్యాపితే నివర్తంతే పశ్చిమా యామినీ రివ (5-33)

1. 'కడచేరిన' అనియుండ నగును.

2. కుమారకు లీ దురితంబు నేఁడు. (హ)

† మీమాంసిత .... (తం.); కర్మవిచారంబు సేయని బాలుర మనంబులకు నైహికేచ్ఛలయందు నైరాశ్యము గలుగంజేసి నివృత్తిమార్గం బుపదేశించి (హ. వా.)

ర్చితివి. ఇట్టి పాతకంబున భాగవతోత్తములలో లజ్జాహీనుండ వై యళో హానిం బొంది చరింపుదువుగాక! (నిరపరాధు లై వైరంబు లేని నాపుత్రుల పట్లు ద్రోహకృత్యం బొనర్చిన నీవు తప్పఁ దక్కిన భాగవతోత్తములు)సకల భూతానుగ్రహ పరవశులు. అతి కుతూహలంబున నీ చేత స్నేహపాశ నికృంతనం బైన మిత్రభేదంబె కాని త దుపశమనంబు గాకుండెడు. ఇంతనుండియుఁ బురుషుండు విషయ తీక్ష్ణత్వంబు లనుభవింపక కాని తెలియ కుండెడు. జ్ఞానంబు తనంతనె కాని యొరులచే బోధింపఁబడి తెలియరాకుండెడి. నిరంతరంబును లోకసంచారి యైన నీకు నే లోకంబున న్ననికిపట్టు లేకుండుఁగాక. అని నిర్దయుండై శాపం బిచ్చె. అంత నారదుండు త త్క్రోధవాక్యంబుల కలుగక యట్ల కాని మ్మని సమ్మతించి చనియె. ఇట్టి శాంతభావం బెవ్వనివలనం గలుగు, నతండు సర్వాతీతుం డై సర్వేశ్వరుం డనంబడు.

అధ్యాయము - ౬

వ. మఱియు, దక్షుండు తన మనోరథంబు విఫలం బగుటం జేసి యతి దుఃఖిత మనస్కుం డై పొగులుచున్న పితామహుండు చనుదెంచి, మఱియుఁ బ్రజాసర్గోపాయం బుపదేశించిన, నా ప్రజాపతి ప్రియభామ యైన యసిక్నియందుఁ బితృవత్సల లై న పుత్రికల [1]నఱువదుంద్రం బుట్టించి, వారిలో ధర్మునకుం బదువురను, గశ్యపునకుం బదముగ్గురను, జంద్రునకు నిరువదేడ్గురను, భూతునకు, నాంగిరసునకుఁ, గృశాశ్వునకు నిద్దఱేసి చొప్పున నార్గురను, తార్క్ష్యుఁ డను నామాంతరము దాల్చిన కశ్యపునకు మరలఁ గడమ నల్గుర న్నీ క్రమంబున నిచ్చె. వారి నామంబులాకర్ణింపుము. 252

ఆ. ఎట్టి పుణ్యవతులో? యీ చేడియలు సెప్ప
సవతు లేనియట్టి సవతు లయ్యుఁ
గడుపు వడసి రెట్టి కడుపునఁ బుట్టిరో
కడిఁది త్రిజగ మెల్లఁ గడుపు గాఁగ. 253

వ. వార లెవ్వ రనిన భానువును, లంబయుఁ, గకుప్పును, జామియు, విశ్వయు, సాధ్యయు, మరుత్వతియు, వసువును, ముహూర్తయు, సంకల్పయు ననం బదుగురు ధర్మునకుఁ బత్ను లై కొడుకులం బడసిరి. వా రెవ్వ రంచేని భానువునకు వేదబుషభుండు వుట్టె. ఆతనికి నింద్రసేనుండు నుదయించె. లంబకు విద్యోతుండు గలిగె. అతనికి స్తనయిత్నువు లనువారు వుట్టిరి. కకుద్దేవికి

---

1. నరువదింటిని(హ)

సంకుటుండు వుట్టె. సంకుటునకుం కీకటుండు వుట్టె. కీకటునకు దుర్గాభిమానిను లైన దేవతలు జన్మించిరి. జామిదేవికి దుర్గభూముల కధిష్ఠానదేవతలు జనియించిరి. వారికి స్వర్గుండును, నందియు జన్మించిరి. విశ్వ యనుదానికి విశ్వేదేవతలు జన్మించిరి. వార లపుత్రకు లనం బరఁగిరి. సాధ్యయనుదానికి సాధ్యగణంబులు వుట్టె. వానికి నర్థసిద్ధి యనువాఁడు వుట్టె. మరుత్వతి యనుదానికి మరుత్వతుండు, జయంతుం డనువార లుదయించిరి. అందు జయంతుండు వాసుదేవాంశజుం డైన యుపేంద్రుం డనంబడి, వినుతి నొందె. ముహూర్త యనుదానికి సకల భూతంబులకు నా యా కాలంబులఁ గలిగెడు నా యా ఫలంబుల నిచ్చు మౌహూర్తికు లనియెడు దేవగణంబులు వుట్టిరి. సంకల్ప యను దానికి సంకల్పుం డుదయించె. ఆ సంకల్పునకు కాముండు జనించె. వసు వను దానికి ద్రోణుండును, ప్రాణుండును, ధ్రువుండును, నర్కుండును, నగ్నియును, దోషుండును, వస్తువును, విభావసుండు ననునెనమండ్రు వసువు లుదయంబు నొందిరి. అందు ద్రోణునకు నభిమతి యను భార్యయందు హర్ష శోక భయాదులు వుట్టిరి. ప్రాణునకు భార్య యైన యూర్జస్వతియందు సహుండును, నాయువును, బురోజవుఁడనువారును గలిగిరి. ధ్రువుని భార్యయగు ధరణియందు వివిధు లగు పురు లనువారు జనించిరి. అర్కునికి భార్య యగు వాసనయందు తర్షాదు లుదయించిరి. అగ్నికి భార్య యైన వసోర్ధారయందు ద్రవిణకాదులు వుట్టిరి. మఱియుఁ [1]గృత్తికలకు స్కందుండు గలిగె. ఆ స్కందునకు విశాఖాదు లుదయించిరి. దోషునకు శర్వరి యను భార్యయందు హరికళ యగు శింశు మారుం డుదయించె. వస్తువునకు నాంగిరసయందు విశ్వకర్మ యను శిల్పాచార్యుం డుదయం బందె. ఆ విశ్వకర్మకు నాకృతి యను సతియందు చాక్షుషుం డను మనువు జనించె. ఆ మనువువలన విశ్వులు, సాధ్యులు ననువారలు వుట్టిరి. విభావసునకు నుష యను భార్యయందు వ్యష్టియు, రోచిస్సును, నాతపుండును జనించిరి. అందు నాతపునికిఁ బంచయాముం డను *(దివసాభిమాన దేవత జనించె. శంకరాంశజుం డైన భూతునకు సురూప యను భార్యయందుఁ గోట్ల సంఖ్య లైన రుద్రగణంబు లుదయించిరి. రైవతుండు, నజుండు, భవుండు, భీముండు, వాముండు, నుగ్రుండు, వృషాకపియు, నజైకపాత్తును, నహిర్బు ధ్న్యుండును, బహ్మరూపుండును, మహోంతుండును ననువారలును, రుద్ర పారిషదు లును నతిభయంకరు లైన ప్రేతలును, వినాయకులును బుట్టిరి. అంగిరసుం డను ప్రజాపతికి స్వధ యను భార్యయందుఁ బితృగణంబులు వుట్టిరి.

---

1. కృత్తికకు (హ) * తా. ప. ప్రతులలో లేదు.

సతి యను భార్యకు నధర్వవే దాభిమాన దేవతలు వుట్టిరి. కృతాశ్వునకు అర్చి స్సను భార్యయందు ధూమ్రకేశుం డను పుత్రుం డుదయించె. వేదశిరస్సుకు ధిషణ యను భార్యయందు దేవలుండును, వయునుండును, మనువునుం బుట్టిరి. తార్క్ష్యునకు వినత, కద్రువ, పతంగి, యామిని యను నలువురు భార్యలు. అందుఁ బతంగికిఁ బక్షులు వుట్టె. యామినికి శలభంబులు వుట్టె. వినతకు సాక్షాత్కరించిన యజ్ఞాధిపతికి వాహనం బైన గరుడుండును, సూర్యునకు సారథి యైన యనూరుండును జనియించిరి. కద్రువకుఁ బెక్కు (తెఱంగుల) భుజంగమంబులు వుట్టె. చంద్రునకుఁ గృత్తికాది నక్షత్రంబులు భార్యలు. వారలయందుఁ జంద్రుడు రోహిణియందు మాత్రము మోహితుం డగుటంజేసి దక్షశాపంబున క్షయ రోగగ్రస్తుండై సంతానంబు వడయనేరఁ డయ్యె. అంత దక్షప్రసాదంబున క్షయ పీడితంబు లగు కళల మరలం బొందె. మఱియును. 254

సీ. కామితప్రదుఁ డైన కశ్యపు కౌఁగిట ముచ్చట దీర్తు రే ముద్దరాండ్రు
అఖిల లోకములకు నవ్వ లై జగమెల్లఁ బూజింప నుందు రే పూవుబోండ్లు
బలియు రై పుత్రులుఁ బౌత్రులు ద్రిజగంబు లేలంగఁ జూతు రే యిందుముఖులు
ముంగొంగు పసిఁడి యై మూల్గు పుణ్యంబుల విఱ్ఱవీగుదు రెట్టి వింతరాండ్రు

తే. వారి కలగంప కడుపుల [1]నేరుపఱుప
నరిది బిడ్డలఁ బడసిన బిరుదుసతుల
నామములు నన్వయంబులు నీమనంబు
పూనఁ జెప్పుదు వినవయ్య! మానవేంద్ర! 255

తరల. అదితియుం దితి కాష్ఠయుం దను వ య్యరిష్టయుఁ దామ్రయు
న్నదనఁ గ్రోధవశాఖ్యయుఁ సురసాఖ్యయుఁ సురభిఁ మునిఁ
మొదలుగాఁ దిమియు [2]న్నిళప్రియముఖ్య యా సరమాదిగా
ముదిత లెన్నఁగఁ గన్నసంతతి ముజ్జగంబుల భూవరా! 256

సీ. చాలంగఁ దిమికిని జలచరంబులు వుట్టె [3]శ్వాపదంబులు వుట్టె సరమయందు
సురభికి మహిషాది సురభులు జనియించెఁ దామ్రకు శ్యేన గృధ్రములు గలిగె
మునికి నప్సరసల మూఁకలు జనియించె నిళ గనె భూరుహములను గ్రోధ
వళ కుద్భవిల్లె దుర్వార సర్పంబులు సరి యాతుధానులు సురస కరయ

తే. నుప్పతిల్లిరి గంధర్వు లొక్కమొగి న
రిష్టకు సుతుల్ దనువునకుఁ ద్రిదళ[4]రిపులు
పదియు నెనమండ్రు నై నట్టి విదితబలులు
వారి నామాన్వయంబులఁ గోరి వినుము. 257

---

1. నేరుపరుల (హ) 2. న్నిళాఖ్య సుముఖ్య (తం. వా.) 3. మరి కిరాతులు సరమకును బ్రజలు (క. బ. హ.) 4. ముఖులు (హ)

వ. ద్విమూర్ధుండును, శంబరుండును. అరిష్టుండును, హయగ్రీవుండును, విభావసుండును, అయోముఖుండును, శంకుశిరుండును, స్వర్భానుండును, కపిలుండును, అరుణియును, పులోముండును, వృషపర్వుండును, ఏకచక్రుండును, అనుతాపకుండును, ధూమ్రకేశుండును, విరూపాక్షుండును, విప్రచిత్తియు, దుర్జయుండును వారలు. వీరలలోన స్వర్భానునకు సుప్రభ యను కన్యక వుట్టె. దాని నహుషపుత్రుం డైన యయాతి పెండ్లి యయ్యె. వైశ్వానరునకు నుపదానవి, [1]హయశిర, పులోమ, కాలక యను నలువురు పుత్రిక లుదయించిరి. అందు నుపదానవి హిరణ్యాక్షునకుం బత్ని యయ్యె. హయశిరను గ్రతువు వివాహం బయ్యె. పులోమా కాలక లను నిరువురను గశ్యప్రజాపతి చతుర్ముఖుని వాక్యంబునం గైకొనియె. ఆ యిరువురకును సమరకోవిదు లైన దానవులు పౌలోమ కాలకేయు లనం బుట్టిరి. మఱియు నా యిరువురకు నఱువది వేల రాక్షసులు జన్మించిరి. వారు యజ్ఞకర్మంబులకు విఘాతకు లై వర్తింప, వారి నింద్రునకుం బ్రియంబుగా నీ పితామహుం డగు నర్జునుండు వధించె. మఱియు, విప్రచిత్తి, సింహిక యను దానియందు రాహుప్రముఖంబుగా గల కేతు శతంబును బడసె. వారలు గ్రహత్వంబుఁ గైకొనిరి. మఱియుం బురాణపురుషుం డైన శ్రీమన్నారాయణుండు దన యంశంబునఁ బరమభాగ్యవతి యైన యదితి గర్భంబున నుదయించె. ఆ యదితి వంశంబును విదితంబుగా వినుపించెద. సావధానుండ వై వినుము. వివస్వంతుండును, అర్యముండును, పూషుఁడును, త్వష్టయు, సవితయు, భగుండును, ధాతయు, విధాతయు, వరుణుండును, మిత్రుండును, శక్రుండును, ఉరుక్రముండును నను ద్వాదశాదిత్యులు జన్మించిరి. అందు వివస్వంతునకు శ్రాద్ధదేవుం డను మనువు సంజ్ఞాదేవియందు నుదయించె. మఱియు యముండు, యమియు నను నిరువురు మిథునంబుగా నుదయంబు నొందిరి. మఱియు నా సంజ్ఞాదేవి బడబాస్వరూపంబు నొంది యశ్వి దేవతలం గనె. ఛాయాదేవియందు శనైశ్చరుండును, సావర్ణి యను మనువును, దపతి యను కన్యకయుం బుట్టిరి. ఆ తపతిని సంవరణుండు వరియించె. అర్యమునకు మాతృక యను పత్నియందు చర్షణు లుదయించిరి. వారిమూలంబున మనుష్య జాతి యీలోకంబున స్థిరంబుగా నుండునట్లు బ్రహ్మదేవునిచేఁ గల్పింపంబడె. పూషుండు భర్గునిం జూచి దంతంబులు వికృతంబులుగా నగిన, నతండు క్రోధించి దంతంబు లూడనడిచిన, నాఁటనుండియు భగ్నదంతుం డై, యనపత్యుం డై

---

1. హయశిరస (తం. వా)

పిష్టాదుల భక్షింపుచుండె. త్వష్టకు దైత్యానుజ యైన రచన యను కన్యకకు నధికబలాఢ్యుం డగు విశ్వరూపుండు పుట్టె. అంత నా దేవతలు బృహస్పతిం గోపింప, నతఁడు తలఁగిపోయినం దమకు నా విశ్వరూపుని నాచార్యునింగా వరియించిరి. అని చెప్పిన విని శుకయోగీంద్రునకుం బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె.

అధ్యాయము - ౮

సీ. అరయంగ యోగీంద్ర! యద్భుతం బయ్యెడు సురలపై నేఁటికి సురగురుండు
కోపించె? నీతండు గురుభావమున దేవతల కేమి యాపదఁ దలఁగఁ జేసె?
నెఱిఁగింపు మనవుడు నింద్రుండు త్రిభువ నైశ్వర్య మదంబున సత్పథంబు
గానక వసు రుద్ర గణములు నాదిత్య మరు దశ్వివేవాది మండలములు

తే. సిద్ధ చారణ గంధర్వ జిహ్మగాది
సురులు మునులుఁను రంభాది సుందరాంగు
లాడఁ బాడంగ వినుతిసేయంగఁ గొలువ
నొక్క భద్రాసనంబున నుక్కుమీఱి. 259

సీ. నిండు పున్నమనాఁడు గండరించిన చంద్రు మండల శ్రీలతో మాఱుమలయ
భద్ర విద్యోతాతపత్రంబు గ్రాలంగ మిన్నేటితరఁగల మేలుకొలుపఁ
గలిత దివ్యాంగనా కరతల చాతుర్య చామర శ్రేణులు జాడపడఁగఁ
జింతామణి స్ఫుట కాంత రత్నానేక ఘటిత సింహాస నాగ్రంబునందు

తే. నూరుపీఠంబుపై శచి యుండ నుండి
వరుస దిక్పాలకాది దేవతలు గొలువ
సాటి చెప్పంగరాని రాజసముతోడ
నింద్రుఁ డొప్పారె వైభవసాంద్రుఁ డగుచు. 260

వ. అ య్యవసరంబున. 261

క. గురుతర ధర్మక్రియ నయ, గురుఁడు [1]మరున్మంత్ర విషయ గురుఁడు వచశ్శ్రీ
గురుఁడు సమస్తామరగణ, గురుఁడు గురుండరుగుదెంచెఁ గొల్వునకు నృపా! 262

చ. అమిత తపఃప్రభావుఁ గరుణాత్ముని గీష్పతిఁ జూచి రాజ్యదు
ర్దమ మదరేఖ నింద్రుఁడు వృథా తనగద్దియ లేవకుండె నె
య్యమున నెదుర్కొనం జనక యాసన మియక గౌరవోప చా
రములఁ బ్రసన్నుఁ జేయకఁ దిరంబుగ దివ్యసభాంతరంబునన్. 263

---

1. గురుఁడు వ[illegible]

క. అప్పుడు సురపతి గన్నులఁ, గప్పిన సురరాజ్య మదవికారంబునకుం
జప్పుడు సేయక గృహమున, క ప్పుణ్యుఁడు దిరిగిపోయె నతిఖిన్నుం డై. 264

చ. ఎఱుఁగమిఁ జేసినట్టి గురుహేళన మంత నెఱింగి యింద్రుఁ డ
చ్చెరుపడి భీతినొంది యతిచింతితుఁ డై తలపోసి పల్కె న
ప్పరమపవిత్రు లోకనుతభవ్యచరిత్రు విశేష పాదపం
కరుహముఁ బూజసేయక యకర్మముఁ జేసితి [1]నల్పబుద్ధి నై. 265

క. త్రిభువన విభవ మదంబున, సభలో మ ద్గురువునకుఁ బ్రసన్ననకు లస
త్ప్రభువునకు నెగ్గు సేసితి, శుభములు దొలఁగంగ నే నసురభావమునన్. 266

ఆ. †పారమేష్ఠ్య మయిన పదవి నొందిన భూపు
లెట్టివారి కైన లేవవలదు
విబుధు లిట్లు సెప్పు విధ మెన్న వారలు
ధర్మవేత్త లనుచుఁ దలపఁబడరు. 267

తే. కుపథవర్తు లగుచుఁ గుత్సిత దుర్వచో
నిపుణు లైనవారు [2]నిడివి దెలిసి
తొలఁగలేక తా రథోగతిఁ బడుదురు
తప్పులేక రాతితెప్ప భంగి. 268

ఉ. కావున లోకవందితుని కార్యవిచారుని యింటి కేఁగి త
త్పావన పాదపద్మములపై మకుటంబు ఘటిల్ల ప్రొక్కి త
త్సేవ యొనర్చి చిత్తము వశించి ప్రసన్ననిఁ జేతు నంచు న
ద్దేవవిభుండు వోయె నతితీవ్రగతిం గురు ధామసీమకున్. 269

సీ. ఈరీతిఁ దనయింటి కేతెంచు దేవతాపతి రాక యా బృహస్పతి యెఱింగి
యధ్యాత్మమాయచే నడఁగి యదృశ్యుఁ డై పోయె నప్పుడు దేవపుంగవుండు
సకలంబుఁ బరికించి జూడ గానక గురుఁ జింతించి తలపోసి చిన్నఁబోయెఁ
బోయిన విధమెల్ల దాయలు రాక్షసవీరులు వేగులవారివలనఁ

తే. దెలిసి మిక్కిలిఁ దమలోనఁ దెలివినొంది
యందఱును గూడి భార్గవు నాశ్రయించి
తత్కృపాదృష్టిఁ దమళక్తి దట్ట మైన
దేవతలమీఁది దాడికిఁ దెరువు వెట్టి. 270

---

1. నల్పబుద్ధినై (వా)

† ఈ క్రింది పద్యము క. చ. ట. త. లలో నున్నది. ముద్రిత ప్రతులలోఁ గానరాదు.
"పారమేష్ఠి కరుణ పదవి నొందినవారు, లెస్స వారి కెదురు లేదు రనుచు
విబుధ వరుల వలన వినబడె నేనియు, నదియ పరమ ధర్మమంద్రు బుధులు."2. నియతి విడిచి(తం)

—: దేవాసురయుద్ధ ప్రారంభము :—

క. ధూర్తులు సమస్త కిల్బిష, మూర్తులు వర ధర్మ కర్మ మోచిత మార్గా
వర్తులు దుర్ణయ నిర్మిత, కీర్తులు దానవులు సనిరి గీర్వాణులపై. 271

స్రగ్ధర. దండిం గోదండకాండోద్ధత రథ హయ వేదండ తండంబుతోడ
దండెత్తెఁ మెండుగా నద్దనుజనికరముల్ దైవవర్గంబుమీఁదం
జండ బ్రహ్మాండభే ద్యోచ్ఛ్రయ జయరవముల్ సర్వదిక్ క్షోభగా ను
ద్దండ ప్రఖ్యాతలీలఁ దలపడిరి సురల్ దర్పు లై వారితోడఁ. 272

చ. మదమున దేవదానవులు మచ్చరముల్ గడుఁ బిచ్చలింప సం
పదలను గోరి పోరునెడ భార్గవ మంత్రకళా విశేషు లై
[1]యెదురులు వాలి యస్త్రముల నేయ మహాసురు లేచి యేచి పెం
గుదులుగఁ గ్రువ్వ దేవతలు కో ల్తల కోర్వక పాటి ర య్యెడఁ. 273

ఆ. దనుజవీరు లేయు దారుణ దివ్యాస్త్ర
దళితదేహు లగుచుఁ దలలు వీడ
నోడి పాటి రద్భుతోపేత బలు లై న
త్రిదశవరులు బిట్టు [2]దిట్టినట్లు. 274

క. ఒకమొగము గాక దివిజులు, తికమక గొని వైరు లెల్ల దీకొనఁ దమ్ముం
[3]బకపక లై నకనక లై, లుకలుకఁ బరువెత్తి రోడి లోఁగొను భీతిఁ. 275

చ. దనుజుల గర్వరేఖయును దానవవీరుల యంపజోకయుఁ
మనుజవిశేష భోజనుల మచ్చరికంబు నిశాటకోటి యే
చిన బలశౌర్యముం దమకు సిగ్గును హాని మహాభయంబు [4]ని
ర్గుణతను జేయ నుమ్మలికఁ గోల్తల కోపక [5]పాటి రార్తు లై. 276

క. అమరులు విసృష్ట [6]దానవ, సమరులు శరభిన్న దేహ సంతాపగుణ
భ్రమరులు దైత్య కిరాతక, చమరులు కమలజుని కడకుఁ జనిరి భయార్తిఁ. 277

ఉ. ధాతకు దేవతా విభవదాతకుఁ బుణ్యజ నానురాగ సం
ధాతకు సర్వలోక హితదాతకు వైదిక ధర్మమార్గ ని
ర్ణేతకు నుల్లస ద్విభవ నేతకు సర్వజగ జ్జయాంగజ
భ్రాతకుఁ బుణ్య యోగిజన భావవిజేతకు ప్రమొక్కి ర య్యెడన్. 278

---

1. అదరులువాఁయి నస్త్రముల నార్చి మహాసురులేర్చి యేసి పెం (తం. వా.)
2. దిట్టునట్లు (తం) 3. బకపకనగ (తం) 4. నిర్గుణతఁ జేయు నుమ్మలిక (తం. వా.)
5. విగి రయ్యెడన్ (క. చ. ట. జ. డ.) 6. దారుణ (ట. తం)

క. ఆఖండలుండు మొదలుగ, లేఖానీకముల బ్రహ్మ లేనగవున ని
త్యాఖండ సత్కృపారస, శేఖర వాక్యముల వారి సేదలు దేర్చెఁ. 279

వ. ఇట్లు బ్రహ్మదేవుండు దేవేంద్రప్రముఖు లైన దేవతల కనుకంపాతివిభవంబున నభయం బొసంగి యి ట్లనియె. 280

ఉ. నెట్టనఁ బాపకర్మమున నేఁగమిఁ జేసితి రేమి చెప్ప! మీ
పుట్టిన నాఁటనుండియును బుద్ధులు సెప్పి జగంబు లేలఁగాఁ
బట్టముఁ గట్టి పెంచిన కృపానిధి బ్రహ్మకళా విధిజ్ఞుఁ జే
పట్టక గుట్టు జాఱి సిరిపట్టునఁ దొట్టిన పొట్టక్రొవ్వునన్. 281

వ. బ్రహ్మిష్ఠుఁ డైన బ్రాహ్మణు నాచార్యుం గైకొనక గురుద్రోహంబుఁ జేసితిరి. త ద్దోషం బిపుడు మీకుఁ జేసేత శత్రుకృతం బై యనుభవింపం జేసె. అతి బలవంతు లైన మిమ్ము నతిక్షీణులైన రాక్షసులు జయించుట, తమ యాచార్యుం డైన శుక్రు నారాధించి త న్మంత్రప్రభావంబునఁ బున ర్లబ్ధవీర్యు లగుటచేతనే. ఇప్పుడు మదీయం బైన నిలయంబు నాక్రమింపం గలవా రై మదోద్రేకంబున నెదురులేక వర్తిల్లుచున్న రక్షోనాయకులకుఁ ద్రిదివంబుఁ గొనుట తృణప్రాయంబు. అభేద్య మంత్రబలంబు గల భార్గవునకు వారు శిష్యు లగుటంజేసి విప్ర గోవింద గవేష్య రానుగ్రహంబు గలవారలకుఁ దక్కుం దక్కిన రాజుల కరిష్టం బగు. కావున మీ రిప్పుడు త్వష్ట యను మనుపుత్రుం డగు విశ్వరూపుం డగు మునినిశ్చల తపోమహత్త్వ సత్త్వస్వభావుం డగు నతని నారాధించిన, మీకు నభీష్టార్థంబు నతండు సంఘటిల్లఁ జేయు. ఎట్టి దుర్ధశల నైన నతం డడఁచు. అని చెప్పిన దిక్పాలకాదులు డెందంబుల డిందుపడి, కమలగర్భుని వీడ్కొని, విశ్వరూపు కడకుం జని యి ట్లనిరి. 282

తే. అన్న! మేలగు నీకు ని న్నడుగఁ గోరి
వచ్చినారము భవదీయ వనమునకును
దండ్రులకు నేఁడు సమయోచితంబు లైన
కోర్కె లొనఁగూడఁ జేసి చేకొనుము యళము. 283

క. సుతులకుఁ బితృభక్తిభూషణ, మతిపుణ్యము సేయుచుండు నాత్మజులు గుణో
న్నతి బ్రహ్మచారు లైనను, మతితో గురుసేవకన్న మఱియుం గలదే? 284

వ. అదియునుం గాక. 285

సీ. అరయ నాచార్యుండు పరతత్త్వరూపంబు దండ్రి తలంపంగ ధాతరూపు
రూపింప భ్రాత మరుత్పతి రూపంబు దెలియంగఁ దల్లి భూదేవిరూపు
భగిని కరుణరూపు భావంబు ధర్మస్వరూపంబు దా నర్థిరూపు మొదల
నభ్యాగతుఁడు మున్న యగ్ని దేవునిరూపు సర్వభూతములుఁ గేశవునిరూపు

తే. గానఁ దండ్రి! వేగఁ గడు నార్తు లగు పితృ
జనుల మైన మమ్ముఁ జల్లఁ జూచి
పరభయంబు వాపి నిరుపమం బగు తపో
మహిమచేత మెఱసి మనుపవయ్య! 286

వ. ఇప్పుడు బ్రహ్మనిష్ఠుండ వైన నిన్ను నాచార్యునిఁగా వరించి, భవదీయ తేజో విశేషంబుచేత వైరివీరులం బరిమార్చెదము. ఆత్మీయార్థం బైన యవిష్ఠ పాదాభి వందనంబు నిందితంబు గాదని వేదవాక్యంబు గలదు. కావున నీకు నమస్కరించు చున్న దేవతలం గైకొని పౌరోహిత్యంబు సేయుము. అనిన బ్రహసిత వదనుం డై య మ్మునీశ్వరుం డి ట్లనియె. 287

ఆ. బ్రహ్మవర్చసున్న వోయెడి ప్రార్థనంబు
ధర్మగుణ గర్హ్యతం బని తా నెఱింగి
సొరిది ననుబోఁటి తపసి యీ సురలచేతఁ
బ్రకట మధురోక్తి నేటికిఁ బలుకఁబడియె. 288

వ. విశేషించి. 289

క. గురుధనము గూర్పనేటికి, గురుశిక్షం దగిలి మంత్రకోవిదు లై స
ద్గురుధర్మ నిరతులేనియు, గురువులకును శిష్యవరులె కూర్చిన ధనముల్. 290

సీ. అరయ నకించను లై నట్టివారికిఁ [1]దగు శిలోంఛనవృత్తి ధనము సుమ్ము
దానిచే నిర్వర్తిత ప్రియ సాధు సత్క్రియలు గలవార లై ప్రీతినొందె
దరు గాన స ద్గర్హ్యాచార మైన యాచార్యత్వ మిపుడు మీ శాసనమునఁ
గై కొంటి గురువుల కామంబు ప్రాణార్థ వంచనములు లేక వడి నొనర్తు

ఆ. ననుచు విశ్వరూపుఁ డనియెడి ముని ప్రతి
జ్ఞోక్తిఁ బలికె వారి నూఱడించి
మహిత మైన త త్సమాధిచే గురుభావ
మమరఁజేసె దేవసమితి కపుడు. 291

---

1. పంబినట్టి శిలోంఛనంబె ధనము (తం)

క. భార్గవవిద్యా గుప్త, స్వర్గశ్రీ ద్విగుణ దనుజ సమధిక సంప
ద్వర్గముల విష్ణుమాయా, నర్గళగతిఁ దెచ్చి యింద్రునకు నిచ్చె నృపా! 292

క. ఏవిద్యచేత రక్షితుఁ, డై వజ్రి దురంబులోన నసురులఁ ద్రుంచెఁ
భావింప నట్టి విద్యను, శ్రీవరమాయామతంబుఁ [1]జెప్పెను హరికిఁ. 293

అధ్యాయము - ౯

ఉ. నావుడు పాండవాన్వయుఁడు నమ్మినభక్తి జగన్నివాసు రా
జీవదళాక్షుఁ గృష్ణుఁ దన చిత్తమునం భజియించి పల్కఁ నో
దేవగణార్చితాంఘ్రియుగ! దివ్యమునీశ్వర! విశ్వరూపుఁ డ
ప్పావన మైన విద్య సురపాలున కేక్రియ నిచ్చెఁ? జెప్పవే! 294

ఉ. ఎందును రక్షితుం డగుచు నింద్రుఁడు లీలయ పోలె వైరిసే
నం దునుమాడి దేవతలు నమ్మి సుఖింపఁగ నిష్టసంపదం
జెంది సమస్తలోకములుఁ జేకొని యేలె మునీంద్ర! దాని నే
విందు సుఖంబుఁ గందు నిఁక వీనులు సంతస మందఁ బల్కవే! 295

—: శ్రీమన్నారాయణ కవచ ప్రారంభము :—

క. వర నారాయణకవచము, నరిభీకర వజ్రకవచ మాశ్రిత సంప
త్పరిణామ కర్మ సువచము, పురుహూతున కెట్లు మౌని బోధించెఁ? దగన్. 296

వ. అనినం బరీక్షి జ్జనపాలునకు మునినాథుం డి ట్లనియె. 297

సీ. వినవయ్య! నరనాథ! మునినాథుఁ డింద్రున కనువొంద నారాయణాఖ్య మైన
కవచంబు విజయసంకల్పంబు నప్రమేయ స్వరూపంబు మహా [2]ఫలంబు
మంత్రగోప్యము హరి మాయావిశేషంబు సాంగంబుతోడ నెఱుంగఁజేసె
దాని నే వినిపింతుఁ బూని త దేకాగ్ర చిత్తంబుతోడుతఁ జిత్తగింపు

తే. మొనర ధౌతాంఘ్రిపాణి యై యుత్తరంబు
ముఖముగా నుత్తమాసనమున వసించి
కృత నిజాంగ కరన్యాస మతిశయిల్ల
మహిత నారాయణాఖ్య వర్మము నొనర్చె. 298

వ. ఇట్లు నారాయణకవచంబు ఘటియించి, పాదంబులను, జానువులను, ఊరువులను, ఉదరంబునను, హృదయంబునను, ఉరంబునను, ముఖంబునను, శిరంబున

---

1. చెప్పెరఁ జెప్పెన్ (హ) 2. బలంబు (క. చ ట. జ.).

ని ట్లష్టాంగంబులం బ్రణవపూర్వకం బైన యష్టాక్షరీ మంత్రరాజంబు న్యాసంబుఁ
జేసి, ద్వాదశాక్షర విద్యచేత కరన్యాసంబు చేసి, మంత్రమూర్తి యై (ప్రణవాది
యకారాంత మగు మహామంత్రంబుచేత నంగు ళ్యంగుష్ఠ పర్వసంధులయందు
న్యసించి, మటీయు హృదయంబున ఓంకారము, వికారంబు మూర్థంబున,
షకారంబు భ్రూమధ్యంబునందు, ణకారంబు శిఖయందు, వేకారంబు నేత్రంబుల
యందు, నకారంబు సర్వ సంధులయందు, మటీయు నస్త్రము నుద్దేశించి మకారం
బును న్యసించెనేని మంత్రమూర్తి యగు. మటీయును అస్త్రాయ ఫట్ అను
మంత్రంబున దిగ్బంధనంబు చేసి, పరమేశ్వరునిఁ దన భావంబున నిల్పి)భగవ చ్ఛబ్ద
వాచ్యంబును, విద్యామూర్తియుఁ, దపోమూర్తియు నగు (షట్చక్తిసంయుతం
బైన) నారాయణ కవచాఖ్య మైన మంత్రరాజంబు నిట్లని పఠించె. 299

చ. గరుడుని మూఁపుపై పదయుగంబు ఘటిల్లఁగ శంఖ చక్ర [1]చ
ర్మ రుచిరశార్ఙ్గ ఖడ్గ శర రాజితపాశ గదాది సాధనో
త్కర నికరంబు లాత్మకరకంజములం ధరియించి భూతిసం
భరిత [2]మహోష్టబాహుఁడు కృపామతితో ననుఁ గాచుఁ గావుతఁ. 300

ఆ. [3]ప్రకట మకర వరుణ పాశంబులందుల
జలములందు నెందుఁ బొలియకుండఁ
గాచుఁగాక నన్ను ఘనుఁ డొక్కఁ డైనట్టి
మత్స్యమూర్తి విద్యమానకీర్తి. 301

క. వటుఁడు సమాశ్రిత మాయా, నటుఁడు బలి ప్రబల శోభన ప్రతిఘటనో
ద్భటుఁడు త్రివిక్రమదేవుఁడు, చటుల స్థలమందు నన్ను సంరక్షించుఁ. 302

చ. అడవుల సంకటస్థలుల నాజిముఖంబుల నగ్నికీలలం
దెడరుల నెల్ల నాకు నుతి కెక్కఁగ దిక్కగుఁగాక శ్రీనృసిం
హుఁడు [4]కనకాక్ష రాక్షస వధోగ్రుఁడు విస్ఫురి తాట్టహాస వ
క్త్రుఁడు ఘన దంష్ట్రపావక విధూత దిగంతరుఁ డప్రమేయుఁ డై. 303

చ. అరయఁగ నెల్లలోకములు నంకిలి నొంద మహార్ణవంబులో
నొరగి నిమగ్న మైన ధర నుద్ధతిఁ గొమ్మున నెత్తినట్టి యా
కిరిపతి [5]యజ్ఞకల్పుఁ డురుఖేలుఁడు నూర్జిత మేదినీమనో
హరుఁడు కృపావిధేయుఁడు సదాధ్వముల న్ననుఁ గాచుఁ గావుతఁ. 304

---

1. వర్మ (హ. తం. వా.); నిర్భరతర (క) 2. మహాప్రభావుఁడు (హ) 3. వరుస జలధికూప వరుణ పాశము అందు (త. బ.) 4. సుర శత్రు యూథప వధోగ్రుఁడు (తం. వా) 5. యగ్ని (హ)

క. రాముఁడు రాజకులైక వి, రాముఁడు భృగు సత్కులాభిరాముఁడు సుగుణ
స్తోముఁడు నను రక్షించును, శ్రీమహితోన్నతుఁడు నద్రిశిఖరములందుఁ. 305

సీ. తాటక మర్దించి తపసి జన్నముఁ గాచి హరువిల్లు విఱిచి ధైర్యమున మెఱసి
ప్రబలు లైనట్టి విరాధ కబంధోగ్ర ఖరదూషణాది రాక్షసులఁ దునిమి
వానరవిభు నేలి వాలిఁ గూలఁగ నేసి జలరాశి గర్వంబుఁ జక్కఁజేసి
సేతువు బంధించి చేరి రావణ కుంభకర్ణాది వీరులఁ గడిమిఁ ద్రుంచి

తే. యల విభీషణు లంకకు నధిపుఁ జేసి
భూమిసుతఁ గూడి సాకేతపురమునందు
రాజ్యసుఖములు గైకొన్న రామవిభుఁడు
వరుస ననుఁ బ్రోచుచుండుఁ బ్రవాసగతుల. 306

వ. మఱియు నఖిలప్రమాదంబు లైన యభిచార కర్మంబులవలన నారాయణుం డును, గర్వంబువలన నరుండును, యోగభ్రంశంబువలన యోగనాథుం డైన దత్తాత్రేయుండును, గర్మబంధంబువలన గణేశుం డైన కపిలుండును, గామదేవుని వలన సనత్కుమారుండును, మార్గంబుల *(దేవహేళనంబుఁ జేయుటవలన) శ్రీ హయగ్రీవమూర్తియును, దేవతానమస్కార తిరస్కార దేవపూజా చ్ఛిద్రంబుల వలన నారదుండును, నశేష నిరయంబువలనఁ గూర్మంబును, నపథ్యంబువలన భగవంతుం డైన ధన్వంతరియును, ద్వంద్వంబువలన నిర్జితాత్ముం డైన ఋష భుండును, జనాపవాదంబువలన యజ్ఞదేవుండును, †జనన మరణాదులం గలుగఁ జేయు కర్మంబులవలన బలభద్రుండును, గాలంబువలన యముండును, సర్పగణం బుల వలన శేషుండును, అప్రబోధంబువలన వ్యాపాయనుండును, పాషండ సమూహంబు వలన బుద్ధదేవుండును, శనైశ్చరునివలన గల్కియును నై, ధర్మ రక్షణపరుం డైన మహావతారుండు నన్ను రక్షించుఁగాత. ప్రాత స్సంగమ ప్రాహ్ణ మధ్యా హ్నపరాహ్ణ సాయంకాలంబు లను ప్రదో షార్ధరా త్రాపరరాత్ర ప్రత్యూ షానుసంధ్య ప్రభాతంబు లను గదాద్యాయుధంబుల ధరియించి, కేశవ, గోవింద, నారాయణ, విష్ణు, మధుసంహర, త్రివిక్రమ, వామన, హృషీకేశ, పద్మనాభ, శ్రీవత్సధామ, సర్వేశ్వరేశ, జనార్దన, విశ్వేశ్వర, కాలమూర్తి యను నామరూపంబులు గల దేవుండు నన్ను రక్షించు. ప్రళయకాలాన లాతితీక్ష్ణ సంభ్రమ భ్రమణ నిర్వక్రవిక్రమ క్రమ [1]వక్రీకృత దనుజచక్రం బై న సుదర్శననామ చక్రంబ! మహావాయు ప్రేరితుం డై హుతాశనుండు నీరస

---

† "తత్కృతానో న్న బలఃꣳ అని మూలము" (8-18) 1. వశీకృత (తం)

తృణాటవుల భస్మీభూతంబు సేయుభంగి భగవ త్ప్రయుక్తంబ వై మ ద్వైరి సైన్యంబుల దగ్ధంబులు గావింపుము. జగ త్సంహారకాల పటు ఘటిత చటుల మహోత్పాత గర్జారవ తర్జన దశదిశాభివర్జిత ఘనఘనాంతర నిష్ప్యాత నిష్ఠుర కోటి శతకోటి సంస్పర్శ స్ఫుర ద్విస్ఫులింగ నిర్గ మానర్గళ భుగభుగాయమాన మూర్తివిస్ఫూర్తి! నారాయణ కరకమల వర్తి! గదాయుధోత్తమ! మదీయ వైరితండోపతండంబుల భండనంబులం జండగతిం బిండిగాఁ, గూశ్మాండ వైనాయక రక్షో భూత గ్రహంబులం జూర్ణంబులుగాఁ గొండొక వినోదము సలుపుము. దరేంద్రంబ వైన పాంచజన్యంబ! సర్వలోక జిష్ణుం డైన శ్రీకృష్ణుని నిఖలపుణ్యైకసదన వదననిష్ప్యూత నిశ్వా [1]సాధరవేణు పరిపూరితంబ వై యున్మత్త భూత ప్రేత పిశాచ విప్రగ్రహాది క్రూర దుర్గ్రహంబులు విద్రావ ణంబులుగా, నస్మత్పరవీర మండలంబుల గుండియలతోఁ దదీయ మానినీ దుర్భర గర్భంబులు గర్భ స్థార్భక [2]వివర్జితంబులుగా నవియ, బ్రహ్మాండభాండ భీకరం బైన భూరి నాదంబున మోదింపుము. అతి శీఘ్రధారా దళిత నిశాటకోటి కఠోరకంఠ కరాళ రక్తధారా ధౌత మలీమస విసరంబ వైన నందక మహాసి శేఖరంబ! జగదీశ ప్రేరితంబ వై మ ద్విద్వేషి విషమవ్యూహంబులు బెండువడ మెండు గడికండలుగ ఖండించి చెండాడుము. నిష్కళంక నిరాతంక నిశ్శంక సాంద్రచంద్రమండల పరిమండిత సర్వాంగ [3]రక్షణ విచక్షణ ధర్మ నిర్మితంబ వైన చర్మంబ! దుర్మద మ ద్వైరిలోక భీకరాలోకంబులను సమాకుల నిబిడ నీరంధ్ర నిష్ఠుర తమఃపటల పటు ఘటనంబులం గుటిలపఱుపుము. నిఖిల పాప గ్రహంబులవలనను, సకల నర మృగ సర్ప క్రోడ భూతాదులవలనను నగు భయంబులు భగవ న్నామ రూప యాన దివ్యాస్త్రంబులవలనం బొందకుండుఁ గాక! బృహ ద్రథంతరాది సామంబులచేత స్తోత్రంబు చేయంబడుచున్న ఖగేం ద్రుండు రక్షణదక్షుం డై నన్ను రక్షించుం గాక. శ్రీహరి నామ రూప వాహన దివ్యాయుధ పారిషదోత్తమ ప్రముఖంబు లస్మదీయ బుద్ధీంద్రియ మనఃప్రాణం బుల సంరక్షించు. భగవంతుం డైన శేషుండు సర్వోపద్రవంబుల నాశంబు సేయు. జగ దైక్యభావం బైన ధ్యానంబు గలవానికి, వికల్పరహితుం డై భూషణాయుధ లింగాఖ్య లగు శక్తులం దన మాయచేత ధరియించి, తేజరిల్లు చుండు లక్ష్మీకాంతుండు వికల్ప విగ్రహంబులవలన నన్ను రక్షించుఁ గాక. లోకభయంక రాట్టహాస భాసుర వదనగహ్వరుం డగుచు, సమస్త తేజోహరణ ధురీణ తేజఃపుంజ సంజాత దివ్య నృసింహావతారుం డగు న ప్పరమేశ్వరుండు,

---

1. అధర్వణ (క. బ.) 2. నిర్భేదనంబులుగా (క. ద. బ.) 3. లక్షణ (హ)

సర్వ దిగ్భాగంబులవలన, సమస్త బహిరంతరంబులవలన నను రక్షింపుచుండుఁ
గాక. అని నారాయణాత్మక కవచప్రభావం బితిహాసరూపంబున నింద్రుండు
దెలిసికొని, ధ్యానంబు చేసి, త ద్విద్యాధారణ మహిమవలన నరాతుల నిర్జించె.
కావున, నెవ్వరేని నిర్మలాత్మ లగువార లేత ద్విద్యాధారణు లై యనుదినం
బును బఠియించిన, నతిఘోర రణంబుల, [1]నత్యుత్కట సంకటంబులను, సర్వగ్రహ
నిగ్రహకర్మ మారణకర్మాది దుష్కర్మజన్య క్లేశంబులను వదలి, అవ్యాకుల
మనస్కు లై విజయంబు నొందుదురు. మఱియును, సర్వరోగంబులకు నగమ్య
శరీరు లై సుఖంబు నొందుదురు. అదియునుం గాక. 307

సీ. అతిభక్తిఁ గౌశికుండను బ్రాహ్మణుఁడు దొల్లి యీ విద్యధరియించి యెలమి మించి
మరుభూమియందు నిర్మలచిత్తుఁ డై యోగ ధారణంబున బిట్టు తనువు విడిచె
దానిపై నొకఁడు గంధర్వవరేణ్యుండు చిత్రరథాఖ్యుఁ డజేయుఁ డొంటిఁ
జదలఁ జనంగఁ ద చ్ఛాయ త దస్థిపైఁ గదిసిన నాతఁడు గళవళించి

ఆ. యువిద పిండుతోడ నవ విమానముతోడఁ
దనదు విద్యతోడ ధరణిఁ ద్రెళ్ళి
తిరిగి లేవలేక తికమక గుడువంగ
వాలఖిల్యమౌని వానిఁ జూచి. 308

క. నారాయణకవచ సమా, ధారణ పుణ్యాస్థి దీని దగ్గఱ నీకుం
గూరెడినె ? విష్ణుభక్తుల, వారక చేరంగ నెట్టివారికిఁ దరమే ? 309

ఇంద్రవజ్రము. సంధించి నీ యంగక సంధు లెల్లన్
బంధించి త న్మంత్రబలంబు వేర్మిఁ
[2]అందంబు మాన్పింపఁ ద దన్య మేదీ ?
సింధుప్రవా హోన్నతిచేతఁ దీరుఁ. 310

వ. కావున నీ పుణ్యాశల్యంబులు భక్తియుక్తుండ వై కొనిపోయి (ప్రాఙ్ముఖంబునఁ
బ్రవహించెడు) సరస్వతీజలంబుల నిక్షేపణంబు సేసి, కృతస్నానుండ వై యాచ
మనంబు చేసిన, నీ సర్వాంగబంధనంబు లుడుగు. అనిన నతం డట్లు చేసి, తన
విమానం బెక్కి నిజస్థానంబున కరిగె. కావున. 311

క. అనుదినము దీని నెవ్వరు, వినరేని పఠించరేని విస్మయ మొదవఁ
ఘన భూతజాల మెల్లను, మునుకొని వారలను గాంచి మ్రొక్కుచునుండుఁ.

---

1. అరిసంకట ప్రదేశంబుల 2. అందంబు (వ

ఆ. విశ్వరూపువలన నైశ్వర్యకర మైన
యిట్టి విద్య దాల్చి యింద్రుఁ డపుడు
మూఁడులోకములకు [1]ముఖ్య మైనట్టి శ్రీ
ననుభవించి మించె నధికమహిమ. 313

అధ్యాయము - ౯

సీ. భూపాల ! మా విశ్వరూపున కరు దై న తలలు మూఁ డనువొందఁ [2]దగిలియుండు
సొరిది సురాపాన సోమపానంబులు [3]ననాద మనఁగను నమరవరుల
తోఁ గూడి భుజియించి తూకొని వారితో యజ్ఞ భాగంబు ప్రత్యక్షమొంది
కై కొనుచుండి దుష్కర్ముఁ డై యా యజ్ఞ భాగంబు రాక్షస ప్రవరులకును

ఆ. దల్లిమీఁదఁ గలుగు తాత్పర్యవశమున
దివిజవరుల మొఱఁగి [4]తెచ్చి యిచ్చె
నది యెఱింగి యింద్రుఁ డతిభీతచిత్తుఁ డై
[5]తనకుఁ గాని యతని తలలు ద్రుంచె. 314

క. [6]భాసురుఁ డనక మహాత్మ, ద్రగేసరుఁ డన [7]కతఁడు పూర్వకృత కర్మగతిన్
[8]వేసరఁ డనక మహేంద్రుఁడు, భూసురు తల లపుడు రోషమునఁ దెగ నడిచెన్.

వ. ఇ ట్ల య్యింద్రుండు క్రోధంబు సహింపంజాలక విశ్వరూపు తలలు ఖడ్గంబునం దెగనడిచిన, సోమపానంబుచేయు శిరంబు కపింజలం బయ్యె. సురాపానంబు చేయు శిరంబు కలవింకం బయ్యె. అన్నంబు భక్షించు శిరంబు తి త్తిరి యయ్యె. ఇట్లు త్రివిధ పక్షిస్వరూపంబు దాల్చి, బ్రహ్మహత్య యే తెంచి, యిం ద్రునిఁ జుట్టుకొని, తమ్ముఁ బరిగ్రహింపు మని నిర్బంధింప, నపు డింద్రుం డతిభీతచిత్తుం డై త్రిలోకనాయకుం డైనం దానిం దప్పించుకొనఁజాలక యంజలియొగ్గి, యమ్మహాదోషంబుఁ గైకొని, త ద్దోషం బొక్కసంవత్సరం బనుభవించి, యంతం బాపుకొనువాఁ డై భూ జల వృక్ష స్త్రీలం ద్రార్థించి, మ ద్దురితంబు చతుర్విధంబులం బుచ్చుకొనుం డనిన, భూమి తనయందుఁ జేయంబడ్డ ఖాతంబు తనంతన పూడునట్టి వరంబును, జలంబు సర్వంబు దనయందుఁ ద్రక్షాళితం బై నం బావనం బగు నను వరంబును, వృక్షంబులు భేదింపంబడి పునఃప్రరోహంబు గలుగు నను వరంబును, స్త్రీ లెల్లప్పుడుం దమకుఁ గామసుఖంబు గలుగు నను వరంబును

---

1. మూదలై నట్టి (తం.) 2. గలిగియుండు (క. డ. బ. తం.) 3. అన్నంబు మొదలుగా (క.బ.) 4. తెచ్చియిచ్చు (హ.తం.వా.) 5. తన కరాసి నతని తలలు [illegible]చె (క. డ. బ.) 6. భూసురు (క.బ.) 7. కమర విభుఁడు ప్రియకర్మ [illegible]తిన్(హ) సురతతి[illegible]న్(చ.డ.) 8. వేసరి యనఁగ(ద)

గోరిన, నతం డట్లకాక యని యొసంగిన, నతని దుష్కృతంబు ధరణి [1]యిరిణ విధంబునను, నుదకంబు బుద్బుద ఫేన రూపంబునను, మహీరుహాంబులు నిర్యాస భావంబునను, నింతులు [2]రజోవికారంబునను నిట్లు చతుర్భాగంబులం బంచికొనిరి. అంత. 316

—: వృ త్రా సు ర వృ త్తా ం త ము :—

మ. హతపుత్రుం డగు విశ్వరూపజనకుం డా త్వష్ట దుఃఖాయ తో
ద్ధత రోషానల దహ్యమానుఁ డగుచుం దా నింద్రుపై మారణ
క్రతు [3]హోమంబు నొనర్ప నందుఁ బొడమెం గల్పాంత కాకార వి
శ్రుత కీలానల నిష్ఠు రేక్షణ గుణ త్రుభ్య త్త్రిలోకోగ్రుఁ డై. 317

సీ. యుగము [4]గ్రుంగెడునాఁడు జగములు వొలియించు నంతకుమూ ర్తిపై
నింత యగుచుఁ
బఱపును నిడుపును బ్రతిదినంబును నొక్క శరపాత మంగంబు విరివిఁ గొనుచుఁ
గడు దగ్ధ శై లసంకాశ దేహమునందుఁ గరము సంధ్యారాగకాంతి [5]బెరయ
మును కాఁక [6]రాగి చేగను మించు మించుల కఱకుమీసలు కచాగ్రములు మెఱయఁ

తే. జండ మధ్యాహ్న మార్తాండ మండలోగ్ర
చటుల నిష్ఠుర లోచనాంచల విధూత
దశ దిశాభాగుఁ డుజ్జ్వలతర కరాళ
భిదుర సునిశిత దంష్ట్రోరు వదనగుహుఁడు. 318

ఉ. నింగికి నేలకుం బొడవు నిట్టల మై శిఖలందుఁ బర్వ ను
త్తుంగ త రాగ్నిజాలములఁ దొట్రిలుచుం గ్రహపంక్తి జాఱ ని
స్సంగ కరాళ శాత ఘన స ద్ఘృణిమండల చండ శూల ము
ద్యాంగుచుఁ గేల లీలఁ గొని భూమి చలింపఁగ సోలి యాడుచున్. 319

సీ. [7]వదలక విరివిగా వదనంబు దెఱచుచు నాకాశమంతయు నప్పళించుఁ
[8]గడు నాల్క నిగుడించి గ్రహతారకంబుల నయమెల్లఁ దిగజాఱ నాకి [9]విడుచు
నలవోకయును బోలె నట్టహాసము చేసి మెఱసి లోకములెల్ల ఱింగఁ జూచుఁ
దనరు దిగ్దంతి దంతములు [10]చెక్కలువాఱ నుగ్రదంష్ట్రలు ద్రిప్పు నుక్కుమిగిలి

I. నెరియ యూషరక్షేత్రంబుల (హ); యూరిణ విధంబునను (తం); నెరియ విధంబునను (క. చ. జ. బ.); యూషరరూపంబున (ద) 2. రజస్వల (హ) 3. కర్మం బొనరింప (త. ద.) 4. ద్రుంగెడు (తం. వా.) 5. మెఱయ (హ) 6. రాగిచేఁ గనుమించు (హ. తం. వా.) 7. పదపడి (హ) 8. కడనాల్క (తం. వా.) 9. కొనుచు (హ) 10. చెక్కులు (హ)

తే. త్వష్ట బలితంపుఁ దపమునఁ [1]బుట్టినొంది
యఖిల లోకంబులెల్లఁ దా నాక్రమించి
వృత్రనామాఖ్య దేవతాశత్రుఁ డగుచు
దారుణాకారుఁ డఖిలదుర్దముఁడు మెఱసె. 320

మత్తకోకిల. అట్టి వృత్రునిమీఁద దేవత లల్కతోఁ బెను మూఁక లై
చుట్టుముట్టి మహాస్త్రవిద్యలు సూపి యేపున నేయ నా
గొట్టువీరుఁడు వార లేసిన క్రూరశస్త్రము లన్నియుం
జుట్టి పట్టుక మ్రింగి శూరతఁ [2]జోక నార్చె మహోగ్రుఁ డై. 321

క. భక్షిత దివ్యాస్త్రుం డగు, రక్షోనాయకుని నమరరాజ ప్రముఖుల్
వీక్షింప వెఱచి పఱచిరి, రక్షకుఁ జింతించికొనుచు రయ మొప్పారన్. 322

వ. ఇట్లు సర్వసాధనంబులతోడ సాధుజనంబుల వృత్రాసురుండు మ్రింగిన, నచ్చెరువడి చేయునది నేరక తత్తేజోవిశేష విభవంబునకు భయంబు నొంది, కందిన డెందంబునం గుందుచుఁ, బురందర ప్రముఖు లార్తరక్షకుండగు పుండరీకాక్షునకుం గుయ్యిడువార లై. 323

లయగ్రాహి. వీడు కడుదుర్దముఁడు వాఁడి మనకై దువులు
[3]పోఁడి సెడఁగా మెసఁగి యీడు గనకున్నాఁ
డేడ బ్రతుకింకఁ? బెను కీడు వొడమెఁ
మనకుఁ దోడుపడ నొక్కరుఁడు లేఁడు హరి దక్కఁ
వేఁడుదము శ్రీధరునిఁ గూడుదము [4]సద్భటులఁ
బాడుదము గీతములఁ జూడఁబడు నంతఁ
[5]వీఁడు చెడు త్రోవ దయతోడ నెటిఁగించు
ఘనుఁ డోడక సురాలయము పాడువడ దింకఁ. 324

క. అని తలపోయుచుఁ దమలో, మునుకుచుఁ దికమకలు గొనుచు మురరిపుకడకుఁ
గునుకుచుఁ దినుకుచు నేఁగిరి, ఘనరాక్షసుఁ గన్న కన్నుఁగవ బెగ్గిలఁగఁ. 325

వ. ఇట్లు భయార్తు లై యమర్త్యబ్రాతంబు చనిచని, ముందట నభంగ భంగ రంగ దుత్తుంగ డిండీరమండల సముద్ధం డాడంబర విడంబిత నారాయణ నిరంతర కీర్తిలతా కుసుమగుచ్ఛ స్వచ్ఛంబును, అనవరత గోవింద చరణారవింద సేవా

---

1. సృష్టి (హ) 2. చూపియార్చె (త. బ.) 3. వాడిచెడఁగా మొనగి(హ) 4. తద్భటుల (క) 5. వాడి (హ)

సమాకుల కలకలఫలిత మహాపుణ్య ఫలాయమాన సముద్దీపి తావ ర్తవ ర్తిత దక్షిణా
వ ర్త రుచిర శంఖమండల మండితంబును, నతినిష్ఠుర కఠిన పాఠీన పృథురోమ
[1]రాజీవ శకుల తిమి తిమింగిల కర్కట కమఠ కచ్ఛప మకర నక్ర వక్రగ్రహ
గ్రహణ ఘుమఘుమారావ దారుణగమన విషమిత విషమ తరంగఘట్టన ఘట్టిత
[2]సముద్ధూత శీకరనికర నీరంధ్ర తారకిత తారాపథంబును, మహోచ్ఛయ
శిలోచ్చయ శిఖరాగ్ర ప్రవహిత దుగ్ధనిర్ఝర సమ్మార్జిత పురాణపురుష విశుద్ధ
శుద్ధాంత విహరణధురీణ నవసుధాధౌత ధావళ్య ధగద్ధగాయమాన రమ్య హర్మ్య
నిర్మాణ కర్మంబును, అతిపవిత్రగుణ విచిత్ర నిజకళత్ర ప్రేమానంద సందర్శిత
ముకుంద పరిష్వ దంతరంగ కరుణారస పరిమిళిత భావబంధుర విద్రుమ వల్లీ
మతల్లికాంకుర శోభితంబును, ప్రసిద్ధ సిద్ధర సాంబువాహసంగమ సముత్థిత గంభీర
ఘోష పరి[3]పూరిత సకల రోదోంతరాళంబును, సముద్రమేఖ లాఖిలప్రదేశ విలసిత
నవీన దుకూలాయమానంబును, హరిహరప్రముఖ దేవతానిచయ పరిల బ్ధామృత
‡మహాదై శ్వర్య దానధౌరేయ మహానిధానంబును, వైకుంఠపుర పౌరవార
మనోహర కామ్యఫలిత మందార పారిజాత సంతాన కల్పవృక్ష హరిచందన
ఘన వనానుకూల కూలంబును నై యొప్పుచుఁ గుబేరు భాండాగారంబునుంబోలె,
బద్మ, మహాపద్మ, శంఖ, మకర, కచ్ఛప, ముకుంద, కుంద, నీల, వర సమగ్రం
బై, విష్ణు కరకమలంబునుంబోలె సుదర్శనావ ర్త ప్రగల్భం బై, కైలాస మహీ
ధరంబునుం బోలె నమృతకళాస్థానశేఖరపదార్పణం బై, యింద్రవైభవంబునుం
బోలె కల్పవృక్ష కామధేను చింతామణి జనితవిశేషం బై, సుగ్రీవ సైన్యంబునుం
బోలె నపరిమిత నిబిడ హరిసంచారం బై, నారాయ ణోదరంబునుంబోలె నిఖిల
భువన భారభరణ సమర్థం బై, శంకరు జటాజూటంబునుం బోలె గంగాతరంగిణీ
సమాశ్రయం బై, బ్రహ్మలోకంబునుంబోలెఁ బరమహంసకుల సేవ్యం బై, పాతాళ
లోకంబునుంబోలె ననంతభోగి భోగయోగ్యం బై, నందనవనంబునుం బోలె
నై రావత మాధవీ రంభాది సంజననకారణం బై, సౌదామినీ నికరంబునుం బోలె
నభ్రంకషం బై, విష్ణునామ కీర్తనంబునుం బోలె నిర్మలస్వభావం బై, క్రతుశత
గతుండునుం బోలె హరిపదభాజనం బై, యొప్పుచున్న దుగ్ధవారాశి డాసి,
శ్వేతద్వీపంబున వసియించి, యందు సకలదిక్పాలకాది దేవతలు దేవదేవు నాశ
యించి యిట్లని స్తుతియించిరి. అంత. 326

---

1. రాజిసంకుల (హ) 2. సముత్తుంగ (హ) 3. దూషిత (హ)
‡ మహైశ్వర్య (తం. వా.)

సీ. పంచమహాభూత పరినిర్మితం బైన ముజ్జగంబుల కెల్ల నొజ్జ యైన
బ్రహ్మయు నేమును బరఁగ నందఱుఁ గూడి యెవ్వనికై పూజలిత్తు మెపుడు
నట్టి సర్వేశ్వరుం డాగమవినుతుండు సర్వాత్మకుఁడు మాకు శరణ మగును
అతిపూర్ణ కాము నహంకారదూరుని సముని శాంతునిఁ [1]గృపాస్పదుని గురుని

తే. మాని యన్యుని సేవింపఁ బూనునట్టి
కపటశీలుని నతి పాపకర్మబుద్ధి
శునకవాలంబు వట్టుక ఘనతరాబ్ధిఁ
దరియఁ జూచుట గాదె! తాఁ దామసమున. 327

చ. ఉదకమయంబునన్ వసుధ నోడఁగఁ జేసి తనర్చు కొమ్మునన్
వదలక యంటఁగట్టి మనువల్లభుఁ గాచిన మత్స్యమూర్తి స
మ్మదమున మమ్ముఁ బ్రోచు ననుమానము మానఁగ వృత్రుచేతి యా
పదఁ దొలఁగించి నేఁడు సురపాలుర పాలిటి భాగ్య[2]దేవతై. 328

మత్తకోకిల. రంతు సేయుచు వాతధూత కరాళ భంగుర భంగ దు
ర్దాంత సంతత సాగరోదక తల్ప మొంది వసించి బ్ర
హ్మాంతవానిని బొడుఁదమ్మిని నాచి కాచిన నేర్పు రిం
తంతవాఁ డనరాని యెంటరి యాదరించు మముం గృపఁ. 329

తే. దేవతల మైన మే మిట్టి దేవదేవు
సర్వలోక శరణ్యుని శరణు చొచ్చి
బలిత మైనట్టి వీని యాపదలఁ బాసి
మీఱి శుభములఁ జేకొనువార మిపుడు. 330

వ. ఇట్లు స్తుతియించుచున్న దేవతలకు భక్తవత్సలుం డైన వైకుంఠుండు ప్రసన్నుం
డయ్యె. అప్పుడు. 331

సీ. తగు శంఖ చక్ర గదా ధరుం డగువాని శ్రీవత్స కౌస్తుభ [3]చిహ్నవానిఁ
గమనీయ మాణిక్య ఘన కిరీటమువాని దివ్యవిభూషణ దీప్తివాని
మండిత [4]కోటీర కుండలంబులవాని సిరి యురస్థ్సలమునఁ జెలఁగువానిఁ
దనుఁబోలు సేవకతండంబు గలవాని జిలుఁ గైన పచ్చని వలువవానిఁ

---

1. మదాస్పదుని (క. డ. ద. బ.) 2. దైవమై (తం. వా.) 3. శ్రీలవాని (తం. వా.)
4. కేయూర (హ)

ఆ. దెల్లఁదమ్మివిరులఁ దెగడు కన్నులవాని
నవ సుధా[1]ద్రవంబు నవ్వువానిఁ
గనియె వేల్పుపిండు కప్పరపాటుతోఁ
గన్నులండు నున్న కఱవు దీర. 332

సీ. తన సేవకులలోనఁ దడఁబడు రూపంబు శ్రీవత్స కౌస్తుభశ్రీలు దెలుప
వికచాబ్జములతోడ వీడ్వడు కన్నుల కడల దై వాఱెడు కరుణ దెలుప
నెల్ల లోకములకు ని ల్లైన భాగ్యంబుఁ గాఁపురం బుండెడు కమల దెలుప
మూఁడుమూర్తులకును మొద లైన తేజంబు ధాతఁ బుట్టించిన తమ్మి దెలుప

ఆ. బుద్ధిఁ బోల్పరాని పుణ్యంబుఁ ద త్పాద
కమల జనిత యైన గంగ దెలుప
నప్రమేయుఁ డభవుఁ డవ్యక్తుఁ డవ్యయుఁ
డాదిపురుషుఁ డఖిలమోది యొప్పె. 333

వ. ఇట్లు జగన్మోహనాకారుం డైన నారాయణుని కృపావలోక నాహ్లాద చకిత స్వభావ చరితు లై సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, ఫాలభాగ పరికీలిత కరకమలు లై యిట్లనిరి. 334

ఆ. దుర్గమంబు లైన స్వర్గాది ఫలములఁ
బుట్టఁజేయఁ జాలునట్టి గుణము
గలిగి మెలఁగుచున్న ఘనుఁడ వైనట్టి నీ
కరయ ప్రొక్కువార మాదిపురుష ! 335

సీ. దండంబు యోగీంద్రమండల నుతునకు దండంబు శార్ఙ్గకోదండునకును
దండంబు మండిత కుండలద్వయునకు దండంబు నిష్ఠుర భండనునకు
దండంబు మత్తవేదండ రక్షకునకు దండంబు రాక్షసఖండనునకు
దండంబు పూర్ణేందుమండల ముఖునకు దండంబు తేజఃప్రచండునకును
దండంబు మద్భుత పుణ్యప్రధానునకును
దండంబు ముత్తమ వైకుంఠధామునకును
దండ మార్శిత రక్షణ తత్పరునకు
దండ మురు భోగినాయక తల్పునకును. 336

---

1. ద్రవంపు (తం. వా.)

ఉ. చిక్కిరి దేవతావరులు చిందఱవందఱ లైరి ఖేచరుల్
క్రుక్కిరి సాధ్యసంఘములు సోలిరి పన్నగు లాజి భూమిలో
క్రమ్మిరి దివ్యకోటి కడు క్రమ్మగిరి యఱులు వృత్రుచేత నీ
చిక్కినవారి నైన దయసేయుము నొవ్వకయుండ నో హరీ! 337

క. మొదలాటిన [1]రక్కసులకు, మొద లై మా కాపదలకు మూలం బగుచుం
దుద మొదలు లేని రక్కసు, తుదిఁ జూపఁగదయ్య! తుదకుఁ దుది యైన హరీ!

తే. అకట! దిక్కుల కెల్ల దిక్కైన మాకు
నొక్క దిక్కును లేదు కా లూన నైన
దిక్కు గావయ్య! నేఁడు మా దిక్కుఁ జూచి
దిక్కు లేకున్న వారల దిక్కు నీవ. 339

క. నీ దిక్కు గానివారికి, నే దిక్కును వెదక నుండ దిహపరములకుఁ
మోదింపఁ దలఁచువారికి, నీదిక్కే దిక్కుసుమ్ము! నీరజనాభా! 340

తే. అరయ మా తేజములతోడ నాయుధములు
క్రమ్మి భువన త్రయంబును క్రమ్మచున్న
భీకరాకారు వృత్రునిఁ బీఁచ మణఁచి
యెల్ల భంగుల మా భంగ మీఁగు మభవ! 341

ఆ. పరమపురుష! దుఃఖభంజన! పరమేశ!
భక్తవరద! కృష్ణ! భవవిదూర!
జలరుహాక్ష! నిన్ను శరణంబు వేఁడెద
మభయ మిచ్చి కావు మయ్య! మమ్ము. 342

వ. *(2నమస్తే భగవ! న్నారాయణ! వాసుదేవ! ఆదిపురుష! మహానుభావ!
పరమమంగళ! పరమకళ్యాణ! దేవ! పరమ కారుణికు లైన పరమహంస లగ
పరివ్రాజకులచేత నాచరితంబు లగు పరమ సమాధి భేదంబుల పరిభావిత
స్ఫుటం బైన పరమహంస ధర్మంబు3చేత నుద్ఘాటితం బగు తమఃకవాట
బున నపావృతం బైన యాత్మలోకంబున నుపలబ్ధమాత్రుండ వై, ని
భవుండ వై యున్న నీ వాత్మసమవేతంబు లై యుపేక్షింపం బడని
రంబులకు నుత్పత్తి స్థితి లయకారణుండ వై యుండుదువు. గుణ సర్గ పతితుండ

---

1. దేవతలకు (చ. ట. త. బ.) * తా. ప. ప్రతులలో లేదు
2. మఱియు నోభగవన్ (హ) 3. ననువాదితంబగు పరమ కపాల ద్వారంబు నావృతంబైన (హ)

వై యపరిమిత గుణగణంబు లున్న నీవు, దేవదత్తునిమాడ్కిఁ [1]బారతంత్ర్యంబున స్వాకృతంబు లైన కుశలా కుశల ఫలంబుల ననుభవింతువు. షడ్గుణైశ్వర్య సంపన్నుండ వైన నీ వాత్మారామ స్వభావుండ వై, యపరిమిత గుణగణంబులు గలిగి, యీశ్వ రాహ్వ యానవగాహ్య మాహాత్మ్యంబందు నర్వాచీన వికల్ప వితర్క విచార ప్రమాణాభాసంబు లగు తర్కశాస్త్రంబులఁ గర్కశంబు లైన ప్రజ్ఞలు గలిగి, దురవగాహవాదు లయిన విద్వాంసుల [2]వివాదావసరంబుల యందు [3]నుపరతంబు లగు అస్తి నాస్తి త్యాది వాక్యంబుల సమస్త మాయామయుండ వై, నిజ మాయచేతఁ గానంబడక యుక్తిగోచరుండవై, సమ విషమ రూపంబులఁ బ్రవర్తింతువు.) దేవా! రజ్జువునందు సర్పభ్రాంతి గలుగునట్లు, ద్రవ్యాంతరంబులచేత బ్రహ్మం బైన నీ యందుఁ బ్రపంచభ్రాంతి గలుగుచుండు. సర్వేశ్వరా! సర్వజగ త్కారణ రూపంబవై న నీవు సర్వభూత ప్రత్యగాత్మ వగుటం జేసి, సర్వగుణావభా సోపలక్షితుండ వై కానంబడుచుందువు. లోకేశ్వరా! భవ న్మహిమ మహోమృతసముద్ర విప్రు ట్సీక రాణ మాత్రంబున సంతుష్ట చిత్తు లై, నిరంతర సుఖంబున విస్మారిత దృష్ట శ్రుత విషయసుఖ లేశాభాసు లైన పరమ భాగవతులు, భవ చ్చరణకమల సేవాధర్మంబు విడువరు. త్రిభువనాత్మ భవన! త్రివిక్రమ! త్రిణయన! త్రిలోక మనోహరానుభావ! భవదీయ వై భవ విభూతి భేదంబు లైన దనుజాదులకు ననుపక్రమ సమయం బెఱింగి, నిజమాయా బలంబున సుర నర మృగ జలచరాది రూపంబులు ధరియించి, తదీయావతారంబుల ననురూపం బైన విధంబున శిక్షింతువు. భక్తవత్సలా! భవ న్ముఖకమల నిర్గత మధుర వచనామృత కళావిశేషంబుల, నిజదాసుల మైన మా హృదయతాపం బడంగింపుము. జగ దుత్ప త్తి స్థితి లయ కారణ ప్రధాన దివ్య మాయా వినోదవర్తి వై సర్వ జీవనికాయంబులకు బాహ్యాభ్యంతరంబుల యందు బ్రహ్మ ప్రత్యగాత్మ స్వరూప ప్రధానరూపంబుల, దేశ కాల దేహావస్థాన విశేషంబులఁ, ద దుపాదానానుభవంబులు గలిగి, సర్వప్రత్యయ సాక్షి వై, సాక్షా త్పర బ్రహ్మ స్వరూపుండ వై యుండెడి నీకు నేమని విన్నవించు వారము? జగదాశ్రయం బై, వివిధ వృజిన సంసార పరిశ్రమోపశమనం బై న భవదీయ దివ్యచరణ శతపలాశ చ్ఛాయ నాశ్రయించెదము. అని పెక్కువిధంబుల వినుతించి యిట్లనిరి.

---

1. పరతంత్రంబును నిచ్చిన కుశల ఫలంబుల ననుభవించి చింతింతువు (హ) 2. "వివాదానవసరే వివాదస్య అనవసరే=అగోచరే" (శ్రీ-కృ) 3. అనుపరతంబులగు (వ్రా. ప్ర.)

†క. తేజంబు నాయువును వి, భ్రాజిత దివ్యాయుధములుఁ బరువడి వృత్రుం
డాజి ముఖంబున ద్రుంగెను, మా జయ మిం కెందుఁ? జెప్పుమా! జగదీశా!344

వ. అని యి ట్లతిమనోహర చతుర వచనంబుల భక్తిపరవశు లై వినుతి సేయుచున్న దేవతలం జూచి, య ప్పరమేశ్వరుం డమృతప్రాయంబు లగు గంభీరభాషణంబుల ని ట్లనియె. 345

క. మ దుపస్థానం బగు మీ, సదమల సుజ్ఞానమునకు సంతోషమునం
బొందలె మది ప్రీతి నొందితి, వదలక నా భక్తి యొడమి వ్యర్థం బగునే? 346

వ. మఱియు, నతిప్రీతుండ నైన నాయందు భక్తులకుం బొందరాని యర్థంబు లేదు. విశేషించి నాయందు నేకాంతమతి యైన తత్త్వ విదుం డన్యంబులం గోరకుండు. గుణంబులయందుఁ దత్త్వ జ్ఞానగోచరుం డైనవాఁడు విషయ నివృత్త చిత్తుం డై సంసార మార్గంబు నిచ్ఛయింపఁడు. కావున మీకు శుభం బయ్యెడు. దధీచి యను ఋషిసత్తముండు గలండు. అతని శరీరంబు మ ద్విద్యాతిశయ మహత్త్వంబునం, దేజో విశేషంబున సారం బై యున్నయది. అతని నడిగి, త చ్ఛరీరంబుఁ బుచ్చికొనుండు. అతండు పూర్వకాలంబున నశ్వినీ దేవతలకు నశ్వశిరోనామం బను బ్రహ్మస్వరూపం బగు నిష్కళంకం బైన విద్య నుపదేశించిన, వారలు జీవన్ముక్తిత్వంబు నొందిరి. మఱియుఁ, ద్వష్టృ పుత్రుం డైన విశ్వరూపునకు మ దాత్మకం బైన యభేద్య కవచంబు నిచ్చె. కావున నతం డతివదాన్యుండు. అశ్వినీదేవతలచేత యాచింపంబడి, దేహంబు వంచింపక మీ కిచ్చు. ఆతని శల్యంబులు విశ్వకర్మ నిర్మితంబు లై, శతధారలు గల యా యుధ శ్రేష్ఠం బై, మ త్తేజోబృంహితం బై, వృత్రాసుర శిరోహరణ కారణం బై యుండు. దానంజేసి మీరు పున ర్లబ్ధ తేజోఽస్త్రాయుధ సంపదలు గలిగి వెలింగెదరు. విశేషించియు మ ద్భక్తవరు లైనవార లేలోకంబుల నెవ్వరికి నజేయులు. కావున మీకు భద్రంబయ్యెడు. అని భూతభావనుం డైన భగవంతుం డదృశ్యం డయ్యె. అప్పుడు దేవతలు దధీచిముని కడకుం జనిన నత్తటి యింద్రుం డి ట్లనియె. 347

---

‡ మూలమున నుండుటచే ఈ భాగము (తం. వా.) ప్రతులనుండి గ్రహింపఁబడినది.
దీని తరువాత మూలమున
"హంసాయ దగ్రహ నిలయాయ" ఇత్యాది శ్లోకమున్నది.
1. అయ్యెడుమని (తం. వా.)

అధ్యాయము-౧౦

ఆ. దేహి సుఖముఁ గోరు దేహంబు ఘటియించి
దేహి విడువలేఁడు దేహ మెపుడు
దేహి! యస్మదీయ దేహంబుకొఱకు నై
దేహ మీఁగదయ్య! దేవతలకు. 348

ఉ. ఎక్కడ నెల్లలోకముల నెవ్వరుఁ గోరని కోర్కి నేఁడు మా
తెక్కలిపాటుకై తివిరి దేహము వేడఁగ వచ్చినార మే .
మెక్కడ! తీవ్ర కర్మగతి యెక్కడ! దైవకృతంబు గాక! యీ
[1]త్రొక్కుడు దాన మీ వరుస రోయక వేఁడుదురే జగంబులఁ? 349

క. నీచగతి యెల్లభంగుల, యాచన యని తెలిసి తగని దడుగుదు రేనిఁ
యాచక వర్గము లోపల, [2]నీచకు లనఁబడరె? యెంత నేర్పరు లైనఁ. 350

క. అడుగంగరాని వస్తువు, లడుగరు బతిమాలి యెట్టి యర్థులు నిను నే
మడిగితిమి దేహ మెల్లను, గడు నడిగెదు వానికేడ గరుణ? మహాత్మా! 351

ఉ. నావుడు నా దధీచియు మనంబున సంతసమంది నవ్వి సం
భావిత వాక్య పద్ధతులఁ బల్కుచు నిట్లనెఁ బేర్మితోడ నో
దేవతలార! ప్రాణులకుఁ దెక్కలి మృత్యు భయంబు పూనుచే
భావములం దలంపరు కృపామతి నెన్నఁడు మీ మనంబులఁ.* 352

ఆ. ఎలమి బ్రతుక నిచ్ఛయించిన వారికి
దేహ మెల్లభంగిఁ దీపు గాదె?
యచ్యుతుండు వచ్చి యర్థించె నేనియు
తన్ను నిచ్చునట్టి దాత గలఁడె? 353

వ. అదియునుం గాక. 154

సీ. అర్థంబు వేఁడెడు నర్థులు గలరు గా కంగంబు వేఁడెడి యర్థి గలఁడె?
తగఁ గోరికల నిచ్చు దానశీలుఁడు [3]గల్గుఁ దన దేహ మీ నేర్చు దాత గలఁడె?
యీ నేర్చువాఁడు ద న్నిచ్చిన రోయక చంపెడునట్టి యాచకుఁడు గలఁడె?
చంపియుఁ బోవక శల్యంబు లన్నియు నేఱి పంచుక బోవువాఁడు గలరె?

---

1. రొక్కపు (తం. వా.) 2. నీచక యాచకము గాదె నిర్ణయ మతికిన్ (క) 3. గాక (ట)

* అపి బృందారకా యూయం నజానీధ శరీరిణామ్
సంస్థాయాం యస్త్వభిద్రోహో దుస్సహ శ్చేతనాపహః (10. 3.)

ఆ. రమణ లోక మెల్ల రక్షించు వారికి
హింస సేయుబుద్ధి యెట్టు లొడమె?
భ్రాంతి యైనయట్టి ప్రాణంబుపైఁ దీపు
తమకుఁ బోలె నెదిరిఁ దలఁప వలదె? 355

వ. అనిన దేవత లి ట్లనిరి. 356

తే. సర్వ భూతదయాపర స్వాంతులకును
బుణ్యవర్తను లగు మిమ్ముబోఁటి వారి
కమిత సత్కీర్తి కాముల కలఘుమతుల
కియ్యరాని పదార్థంబు లెవ్వి గలవు? 357

ఆ. అడుగరాని సొమ్ము లడుగరా దని మానఁ
డడుగువాని మాట లడుగ నేల?
భ్రాంతి నడుగుచోటఁ బ్రాణంబు లేనియు
నిచ్చువాఁడు దాపఁ డిచ్చుఁగాని. 358

వ. అని పరసంకటంబు దలంపక నిలింపులు కార్యపరత్వ సవినయ వాక్య పరంపరలం
బ్రార్థించిన, నతండు దరహసిత వదనుం డై, యఖిల లోకధర్మం బెఱింగియు
నొక్కింత కాలంబు ప్రతివాక్యం బిచ్చితి. దీని సహింపం దగుదురు. మీయట్టి
వారలకుం బ్రియం బగునేని నెప్పుడైనన్ విడువందగిన శరీరంబు విడుచుట
యేమిదుర్లభంబు? అధ్రువం బైన యీ దేహంబుచేతం గీర్తి సుకృతంబుల
నెవ్వం డార్జింపకుండు నతండు పాషాణాదులకంటె నతి కఠినుండు. మీ యట్టి
పుణ్యశ్లోకులచేత నాకాంక్షింపంబడిన శరీరం బప్రమేయ ధర్మార్జితంబు. ఏదేహంబు
చేత నైనను సకలభూతంబులు శోకానుభవంబున శోకించు, హర్షానుభవంబున
హర్షించు, అట్టి మహాకష్ట దైన్యాకరం బైన యీ శరీరంబు కాక శునక సృగా
లాదులపాలు గాకుండ మే లయ్యె. అని నిశ్చితాత్మం డై దధీచి, తత్త్వావలోక
నంబుచేత నిరసిత బంధనుం డై, బుద్ధీంద్రియ మానసంబులతోఁ గూడిన క్షేత్ర
జ్ఞుని పరబ్రహ్మ స్వరూపం బైన భగవంతునందు నేకీభూతంబుఁ జేసి, యోగజ్ఞానం
బున శరీరంబు విడిచె. అప్పు డింద్రుఁ డతని శల్యంబుల విశ్వకర్మ నిర్మితం బై,
నిశిత శతధారా సమావృతం బై వెలుంగు వజ్రాయుధంబు గైకొని, భగవ
త్తేజోప బృంహితుం డై, యైరావతారూఢుం డై, సకలదేవోత్తమ, గరుడ
గంధర్వ, ఖచర, కిన్నర, కింపురుష, సిద్ధ, సాధ్య, విద్యాధర పరిసేవితుం డై, సకల
మునిజనంబులు వినుతింపఁ ద్రిలోక హర్షకారి యై, భగవ దనుగ్రహసంప్రాప్త
మహోత్సాహ వికసిత వదనారవిందుం డై వృత్రాసురుపై నడచె. అప్పుడు.

ఉ. వృత్రుఁడు [1]దానవాన్వయ పవిత్రుఁడు లోక జిఘాంసక క్రియా
సూత్రుఁడు [2]నిగ్రహోగ్రహణ సుస్థిర వాక్య వివేక మానచా
రిత్రుఁడు దేవతోరగ దరీకృత వక్త్రుఁడు రోష దూషితా
మిత్రుఁడు శత్రు రాకఁ గని మిక్కిలి యైన [3]యుగాంత కాకృతిన్. 360

క. మెండు గల దనుజ నాయక, మండలములు గొల్వ నడచె మహిమోద్ధతి వే
దండముల నడుమఁ జను నడ, గొండయునుం బోలె నిబిడ కోపోద్ధతుఁ డై. 361

క. కాలగళుఁ డడరి కడువడిఁ, గాలుని పైఁ గవయు మాడ్కి ఖరతర రవ సం
చాలిత పూర్వ దిగంతరుఁ, డై లీల మహేంద్రమీఁద నతఁ డరిగె నృపా! 362

వ. ఇట్లు రుద్రగణంబులు, మరుద్గణంబులు, నాదిత్యగణంబులు, నశ్వినీదేవతలు, పితృ దేవతలు, విశ్వేదేవులు, వహ్నియు, ఋభువులు, వరుణ, వాయు, కుబే, రేశానాదులు, సిద్ధ సాధ్య కిన్నర కింపురుష గరుడ గంధర్వ ఖేచర ప్రముఖంబు లగు నింద్రసైన్యంబులతోడ *నముచియు, శంబరుండును, ననర్వుండును, ద్విమూర్ధుండును, వృషభుండును, నంబరుండును, హయగ్రీవుండును, శంకుశిరుండును, విప్రచిత్తియు, నయోముఖుండును, పులోముండును, వృషపర్వుండును, హేతియు, ప్రహేతియు, నుత్కటుండును, ధూమ్రకేశుండును, విరూపాక్షుండును, కపిలుండును, విభావసుండును, నిల్వలుండును, పల్వలుండును, దందశూకుండును, వృషధ్వజుండును, గాలనాభుండును, మహానాభుండును, భూతసంతాపనుండును, వృకుండును, సుమాలియు, మాలియు మున్నగు దైతేయ దానవ యతు రాతుసాద్యసంఖ్యంబు లగు వృత్రాసురు బలంబులు దలపడి సమరంబుం జేసిరి. అప్పుడు. 363

చ. అసురులకుఁ సురావలికి నయ్యె మహారణ మప్పు డొండొరుల్
ముసల గదాసి కుంత శర ముద్గర తోమర భిండివాల [4]ప
ట్టస పటుశూల చక్రముల డంబము చూపి యదల్చి యార్చుచుఁ
మసలక కప్పి రస్త్రముల మార్కొని మంటలు మింట నంటఁగఁ. 364

క. ఒండొరులఁ గడవ నేసిన, కాండము లాకాశపథముఁ గప్పి మహోల్కా
[5]తండములఁ బోలి నిష్ఠుర, భండనముఖ మొప్పెఁ జూడఁ బ్రళయోచిత మై. 365

---

1. మానవాన్వయ (తం. వా.) 2. విగ్రహ గ్రహణ (తం. వా.) 3. యుగాంతరాకృతిన్ (తం)
4. పట్టిస..... తెవలుసూపి (తం. వా.) 5. దండంబు లొలసి (తం. వా.)
* వాక్యము కూర్పిచ్చట సరిగా లేదు.

చ. సురవరు లేయు బాణములు సూడ్కి కగోచర మై నభస్థ్సలం
బరిమురిఁ గప్పి [1]రేసి దివసాంతముఁ జేసిన లీల నా సురే
శ్వర బలయూథ వీరు లురు సాయక పంక్తులచేత వాని రూ
పఱు [2]శతధూళి సేసి పఱుపైన తమం బొనరించి రార్చుచున్. 366

చ. సమరమదాంధు లై సుర నిశాచర వీరులు సైనికాంఘ్రి సం
క్రమిత మహీపరాగములు గ్రమ్మిన నుమ్మలికంపుఁ జీఁకటుల్
దమ కనుదోయి కడ్డముగఁ దార్కొనినం జల మేది పోరి రా
క్రమిత నిజాంతరంగ పరిఘట్టిత రోష మహాగ్ని పెంపునన్. 367

క. అతిగళిత రక్తధారా, హతములతోఁ గానఁబడిరి సైనికులు మహో
ద్ధత రోషవహ్ని కీలలు, వితతం బై పిక్కటిల్లి వెడలెడు భంగిన్. 368

సీ. రవళించు శింజినీ టంకార రవములు భట సింహనాదంబుఁ బరిభవింప
భీషణోత్తమ హయ హేషావిఘోషంబు కరి బృంహితస్ఫూర్తిఁ గ్రందుకొలుప
సమర నిశ్శంకాంక శంఖనినాదంబు నేమి స్వనంబుల నిహ్నవింపఁ
దుముల మై చెలఁగెడు దుందుభిధ్వానంబు లట్టహాసంబుల నాక్రమింప

తే. ఘటిత శస్త్రాస్త్ర నిష్ఠుర ఘట్టనోత్థ
ఖర కఠోర రోరు విస్ఫులింగంబు లడరి
దివ్య కోటీర మణిఘృణి ధిక్కరింప
సమర మొనరించి రసురులు నమరవరులు. 369

వ. ఇట్లు ప్రళయసంరంభ విజృంభిత సముత్తుంగ రంగ త్తరంగిత భైరవారావ నిష్ఠ్యూత మహార్ణవంబుం బోలె, యుగాంత సంక్రాంత ఝంఝూపవన పరికంపిత దీర్ఘ నిర్ఘాత నిబిడ నిష్ఠుర నీరదంబులుం బోలె, నుభయసైన్యంబులుం గలసి సంకుల సమరంబు సలుపు సమయంబున, యుగాంత కృతాంత సకలప్రాణి సంహార కారణలీలయుం బోలెఁ, బదాతి రాహుత్త [4]గజారోహక రథిక మహారథిక వీరు లొండొరులు చండగతిం గాండంబులఁ బఱపుచుఁ, గదలం జదుపుచుఁ, గత్తులఁ గత్తళంబులఁ జినుగం బొడుచుచు, నడిదంబుల నడుచుచుఁ, గుంతంబులం గ్రుచ్చుచుఁ, గుఠారంబుల ద్రెచ్చుచు, ముసలంబుల మోదుచు, ముద్గరంబులం బాదుచుఁ,జక్రంబులం ద్రుంచుచుఁ, [5]బరిఘంబుల నొంచుచు,సురియల మెఱుముచు, శూలంబులఁ [6]గ్రుమ్మచు, వాజుల కుఱికియు, వాలంబుల నఱికియుఁ, దొడలు

---

1. లేని (ట) 2. శరధూళి (క. చ. ట. త) 3. పెల్లగిల్లి వెలికురుళంగిన్ (హ)
3. మావంత (హ) 5. సబళంబుల (తం. వా.) 6. దుఱుముచు (తం. వా.)

తుండించియుఁ, దుండంబుల ఖండించియు, [1]నుదురు వెడలించియు, [2]మెదళ్ళు
గెడలించియు, నడుములు ద్రుంచియు,నాసికలఁ ద్రెంచియుఁ, పదంబుల విఱిచియు
భార్శ్వంబులం జెఱిచియు, గజంబులఁ బఱపియు, గాత్రంబుల నుఱిపియుఁ,
గుంభంబులఁ బగిలించియుఁ, గొమ్ములఁ బెకలించియు,హస్తంబులఁ దుండించియు,
నంగంబులఁ జించియు, రథంబుల నలియించియు, రథికులం బొలియించియు,
సారథులం జంపియు. సైంధవంబులం దంపియు, శిరంబులు నొగిలించియు,
సీసకంబు లగిలించియు, ఛత్రంబుల నుఱుమాడియుఁ, జామరంబులం దును
మాడియు, సైన్యంబులఁ జదిపియు, సాహసుల మెదిపియుఁ, బరస్పర గుణ
విచ్ఛేదనంబును, ననోన్య కోదండఖండనప టుత్వంబును, నుభయ సైంధవ ధ్వజ
సారథి రథిక రథ వికలనంబును, నొండొరుల పాద జాను జంఘా హస్త మస్తక
నిర్దళనంబును, రక్తమాంసమేదః పంకసంకలిత సమరాంగణంబును గా నతిఘోర
భంగిం బెనంగిరి. అప్పుడు. 370

చ. సమజయముఁ సమాపజయ సామ్య పరిశ్రమముఁ సమోరువి
క్రమము సమాస్త్రశస్త్రబల గర్వము నై కడు ఘోరభంగి నా
నముచి[3]విరోధి సైన్య గణనాథులతోడ నిశాచరేశ్వరో
త్తములు దురంబుసేసి రొగిఁ దార్కొని వృత్రబలంబు ప్రాపునఁ. 371

వ. అప్పుడు. 372

లయగ్రాహి. మొత్తముగఁ బాఱు పెను నెత్తురు మహానదుల
[4]దత్తఱముతో నుఱికి కుత్తుకలు మోవన్
జిత్తముల నుబ్బి వెస నెత్తుకొను భూతముల
నత్తుకొని శాకినులు జొత్తిలెడి మాంసం
బుత్తలముతో మెసఁగి నృత్తములు సేయు
మదమత్త ఘన డాకినులు నృత్తగతిఁ బ్రేవుల్
బిత్తరములం దిగిచి మెత్త మెదడుల్ మొనసి
గుత్తగొనుచుండ భయవృత్తిఁ గల నొప్పెఁ. 373

వ. ఇట్లు దేవదానవులు నర్మదాతీరంబునఁ గృతయుగంబునం దలపడి, త్రేతాయు
గంబుఁ జొచ్చు నంత కాలంబుఁ బోరు దారుణంబుగాఁ జేయుచుండ, నంత
వృత్రాసురు భుజబలంబు పెంపునఁ దెంపుఁ జేసి కంపింపక నిలింపులపై [5]రక్కసులు
గుంపు లై పెంపుచూపి, మహోవృక్ష పాషాణ గిరిశిఖరంబులు వర్షించిన. 374

---

1. మెడలెడయించియు (తం. వా.) 2. మెదళ్ళు గెడయించియు (తం.వా.) 3. హరాగ్ర (ట)
4. మొత్తములలో (హ) 5. దిగిచికొని (త) 6. రక్కసుల గుంపులు సొంపు పెంపు చూపి (తం.వా.)

మ. గిరి పాషాణ మహీజముల్ గురియఁగా గీర్వాణు లన్నింటి ని
ష్ఠుర నారాచపరంపరల్ పఱపుచుఁ జూర్ణంబు గావింప ని
ర్భరలీలం దమచేయు సత్వములు దోర్భంగంబు లై పోవఁగాఁ
దెరలెఁ రాక్షస యోధవీరుల మదోద్రేకంబు సంఛిన్న మై. 375

క. ప్రచురముగ రాక్షసావళి, ఖచరులపై నేయు నిబిడకాండావళి దు
ర్వచనుఁ డెడ నాడు మాటలు, సుచరిత్రునియందుఁ బోలెఁ జూరవయ్యె నృపా!

వ. అప్పుడు. 377

వనమయూరము. అంత సుర లేయు నిబిడాస్త్రములపా లై
పంతములు దక్కి హత పౌరుషముతో ని
శ్చింతగతి రక్కసులు సి గ్గుడిగి భూమిం
గంతుగొని పాఱి రపకారపరు లార్వఁ. 378

క. కొండలఁ బోలెడు రక్కసు, లొండొరులం గడవఁ బాఱి [1]రుక్కఱి పటు కో
దండముఖ సాధనంబులు, భండనమున వై చి దివిజపతు లార్వంగఁ. 379

వ. ఇట్లు సమరతలంబు వాసి, తన ప్రాపుదూసి, తీసి పఱచుచుండు దండనాయకులం
జూచి, యకుటిలమతిం బకబక నగి, వృత్రాసురుం డి ట్లనియె. 380

ఉ. తుల్లకవృత్తి మీ కగునె? శూరుల కి మ్మెయి కీర్తి భోగముల్
గొల్లగఁ జేయు చావు మదిఁ గోరినవారల [2]కైనఁ గల్గునే?
తల్లడ మంది యీ సమరధర్మము మాని తలంగఁ బాడియే?
మల్లుఁడు దుర్దయ ప్రథనమత్తుని వృత్రుని [3]ప్రా పెఱుంగరే? 381

క. చావు ధ్రువ మైన ప్రాణికిఁ, జావులు రెం డరసికొనుఁడు సమరము నందుఁ
భావింప యోగమందును, జావంగాలేని చెడుగుచావుం జావే? 382

అధ్యాయము - ౧౧

వ. అని వాసుదేవ తేజోవిశేష విశేషితు లై దవానలకీలలం బోలె వెలుంగుచు
వెఱచి వెన్నిచ్చి పాఱెడు నసురుల వెనుకొని తఱుము సురవీరులం జూచి
హుంకరించి, స్వర్గానుభవంబున నిచ్చ లేకుండెనేని మ దవలోకన స్పర్శన
మాత్రంబు ముందర నిలుతురుగాక. అని యేచి కల్పాం తానల్ప ఘనఘనా
టోపంబునుం బోలెఁ గఠోరకంఠ హుంకార తర్జనంబులం గర్జిల్లుచుఁ, బ్రళయకాల
పవనపరిభావిత మహోశిఖ శిఖావళులం ధృణీకరించు కుటిలావ లోకనంబుల నాలో

---

1. ఉక్కటపటు (త) 2. కేను గల్గనీ (తం. వా.) 3. పాఱెఱుంగరే (హ)

కించుచుం, గాల పరిపక్వ లీలాలోలుం డైన శూలిపోలిక నాభిలమూర్తి యై,
సకల జీవభార చరణ దుర్భర భగ్న బ్రహ్మాండభాండ మహోధ్వానంబుభంగి
నాస్ఫోటించిన. 383

ఉ. కూడె జగంబు లన్నియును గ్రుంకిరి సూర్య సుధాంశు లద్రు లూ
టూడె నభస్థ్సలం బగిలె నంబుధు లింకె నుడుగ్రహాళి ప
ట్టూడె వడిం దిశ ల్వగిలె నుర్వర గ్రుంగె నజాండభాండ మ
ల్లాడె విధాత బెగ్గడిలె నార్చుచు వృత్రుఁడు బొబ్బవెట్టినన్. 384

లయగ్రాహి. కూలిరి వియచ్చరులు సోలిరి దిశాధిపులు
వ్రాలి రమరవ్రజము దూలి రురగేంద్రుల్
వ్రేలిరి [1]మరుద్గణము జాలిగొని రశ్వినులు
కాలుడిగి రుద్రు లవలీలఁ బడి రార్తిన్
వ్రేలిరి దినేశ్వరులు కీ లెడలినట్లు సురజాలములు
పె న్నిదుర పా లగుచు ధారా
భీల గతి తోడఁ దమ కేలిధనువు ల్విడిచి
నేలఁబడి మూర్ఛలను దేలిరి మహోత్సా! 385

వ. ఇట్లు కఠోర కంఠనాదం బొనర్చిన, నభనిపాతంబునం గూలు ప్రాణిచయంబు
భంగి నంగంబు లెఱుంగక, రణరంగంబునం బడి, బిట్టు మూర్ఛిల్లిన, దివిజరాజ
సైన్యంబుల వృత్రాసురుండు సంగరరంగ దుర్దముం డై, మహీవలయంబు పదా
హతంబుల గజగజ వడంక, నిశితశూలంబు కేల నంకింపుచు, మదించిన భద్రమా
తంగంబు కమలవనంబు సొచ్చి, మట్టి మల్లాడు విధంబున నిమిలితాక్షుం డగుచుఁ,
బదతలంబుల రూపంబులు మాయం జమురుచు, వెక్కసంబునఁ గ్రీడించు వానిం
గని వజ్రి వజ్రశతోపమ నిష్ఠుర గదాదండం బాభీలభంగిఁ బ్రళయకాల
మార్తాండ చండపరివేష [2]ఘోరంబుగాఁ ద్రిప్పి వైచిన. 386

మ. అది మింటం బెనుమంట లంటఁ బఱ పై యాభీల వేగంబునన్
గదియన్ వచ్చిన లీల [3]వామకర సంక్రాంతంబు గావించి బె
ట్టిదుఁ డై చేరి సురారి దానిఁ గొని కాఠిన్యోరుపాతంబులం
జదియన్ మోదె గజేంద్ర మస్తకము నుత్సాహైక సాహాయ్యుఁ డై. 387

---

1. దివౌకసులు(జ.డ.); మరుత్తులెద(తం.దా) 2.ప్రేరితంబుగా(హ) 3. తోడ కరసంగ్రాహంబు (హ)

ఆ. అ గ్గజంబు కులిశహతిఁ గూలు కులమహీ
ధ్రంబు వోలె ర క్తధార లురల
మ స్తకంబు వగిలి మదమఱి జిరజిర
తిరిగి [1]విఱుగు సూపి తెరలి పఱచె. 388

ఉత్సాహవృత్తము. గజము దెరలి దాని కొఱలి [2]గర్జ లిడుచుఁ బాఱఁగా
[3]భజన నింద్రుఁ డంకుశమునఁ బట్టి బిట్టు నిల్పుచున్
[4]నిజ సుధార సైకపాన నిర్ణ యార్ద్ర కరమునన్
[5]ఋజుత మీఱ నిమిరె నపుడు [6]రూఢి మెఱసి క్రమ్మఱన్. 389

వ. ఇ ట్లిభంబున నై రావతంబును సేదదేర్చుచు, నెదుర నిలుచున్న భిదురపాణిం
గని, తోఁబుట్టువుం జంపిన తెంపు దలంచి, మోహశోకంబున విపర్యాసంబుగా
నవ్వుచు, నాహవకామ్యార్థి యై వృత్రుం డి ట్లనియె. 390

శా. నాకుం బెద్దయు నీకు సద్గురువు దీనత్రాత రక్షోఘ శు భా
లోకుం జంపితి విట్లు పాపమతి వై లోభంబుతో ని య్యెడన్
లోకుల్ [7]నవ్వఁగ మ ద్భుజాపటిమకున్ లో నై తి వీ శూలమం
దాకంపింపఁగ నిన్నుఁ గ్రుచ్చి ఋణముక్తాత్ముండ నై పేర్చెదన్. 391

క. ఎట్టి తులు వై నఁ గానీ, నెట్టనఁ దన బ్రతుకుకొఱకు నీవలె గురువుం
జుట్టమునుఁ బుణ్య బ్రాహ్మణుఁ, బట్టి వధింపంగఁ గలఁడె? పశువుం బోలెన్.

చ. దయయును సత్యమున్ విడిచి ధర్మము మాని యశంబుఁ [9]బాసి శ్రీ
జయములఁ బాఱఁదోలి పురుషత్వము గానక లోకనిందితా
హ్వాయుఁ డగువాని చావునకు నార్యులు గుందుదురే? సృగాలముల్
ప్రియమున నంటునే శవముఁ? బ్రేలక చేరునె? కంక గృధముల్. 393

క. నిక్క మగు పాపములచేఁ, జిక్కితివి నిశాత శూల శిఖరాగ్రమునన్
క్రమ్మించి నీదు మాంసము, [10]నక్కలుఁ గుక్కలును జేరి నమలఁగఁ జేతున్. 394

ఉ. దీకొని నీకు నేఁ డిచట దిక్కని వచ్చిన వారు గల్గిరే
నేకమతిం బిశాచముల కెల్లను దృప్తిగ మ న్నిశాత శూ
లైక మహాగ్నికీలల ననేకవిధంబుల సోమయాజి నై
మేకలఁ జేసి వేల్చెద నమేయ మదోద్ధతి వ్రాలి యి య్యనిన్. 395

---

1. భీతితోడ (చ. ట. డ.) 2. కంపమొందిపారగా (క) 3 బలిమి నింద్రుఁ డంకుశమున (హ) ఇచ్చట ప్రాసభంగము. 'భజన నింద్రుఁ....' అని క. తం. వా. ప్రతులలో. పాఠము (చూ. పద్యము 408) 4. నిజసుధారసార్ద్రహస్త నిభృతమైన కరమునన్ (చ. ట. త. జ.) 5. ఋజువు (హ) 6. రీతి మెఱసి (తం) 7. జూడగ (క) 8. బలిమికిన్ (హ) 9. మాసి (హ) 10. కుక్కలు నక్కలును బెట్టికొని తినఁజేతున్ (తం)

క. కాక నను గులిశధారల, దీకొని నిర్జింప గలిగి తేనియు భూతో
ద్రేకంబు సేసి శూరుల, ప్రాకట పదపద్మ ధూళి [1]భాగం బగుదున్*. 396

సీ. సందేహ మేటికి? జంభారి! వేవేగ భిదురంబు ప్రేయు మాభీలభంగి
నతిలోభి నడిగిన యర్థరాశియుఁ బోలెఁ [2]గడపకు మిది వృథ గాదుసుమ్ము
మురమర్దనుని తేజమున నా దధీచి [3]వి ర్యాతిశయంబున నధిక మైన
యది గాన హరిచే నియంత్రి తోన్నతుఁడ వై గెలువుము శత్రుల గీ టణంచి

ఆ. యెందు గలఁడు విష్ణుఁ డందు జయశ్రీలు
[4]పొందు గాఁగ వచ్చి పొందుచుండుఁ
గాన భక్తవరదుఁ గమలాతు సర్వేశు
పదములందు మనము పదిలపఱుతు. 397

వ. [5]ఇట్లు వజ్రధారలం దెంపంబడిన విషయభోగంబులు గలవాఁడ నై శరీరంబు విడిచి, భగవద్ధామంబునుం బొందెద. నారాయణుని దాసుండ నైన నాకు స్వర్గ మర్త్య పాతాళంబులం గల సంప ద్భోగంబులు నిచ్చయింపంబడవు. త్రైవర్గి కాయాస రహితం బైన మహైశ్వర్యంబు ప్రసాదించుం గావున ననుపమేయం బైన భగవ త్ప్రసాదం బన్యుల కగోచరంబు. అ ద్దేవుని పాదైక మూలంబుగా నుండు దాసులకు దాసానదాసుండ నై యున్నవాఁడ. అని య ప్పరమేశు నుద్దేశించి. 398

చ. అరయఁగ భక్తపాలనము లైన భవ చ్చరితంబు లాత్మ సం
స్మరణము సేయ వాక్కు నిను సన్నుతి సేయ శరీర మెల్లఁ గిం
కర పరివృత్తి సేయ మదిఁ గాంక్ష యొనర్చెదఁ గాని యెల్ల నే
నరిది ధ్రువోన్నత స్థలము నబ్జజు [6]పట్టము నింద్ర భోగమున్. 399

ఉ. ఆఁకలి గొన్న క్రేపులు రయంబున నీఁకలు రాని పశుబుం
దికొని తల్లికిన్ మటి విదేశగతుం డగు భర్త కంగజ
వ్యాకులచిత్త యైన జవరాలును దత్తఱ మందు భంగి నో
శ్రీకర! పంకజాక్ష! నినుఁ జేరఁగ నామది గోరెడుం గదే! 400

క. నాకును సఖ్యము పుణ్య, శ్లోకులతోఁ గాని తత్త్వశూన్యులు సంసా
రైక విమోహులతోడం, గాకుండ నొనర్పు మయ్య! కంజదళాక్షా! 401

వ. అని పలుకుచు. 402

---

1. భజియింతు దగన్ (క) 2. గడవలేనిది (హ) 3. వి,ద్యాతిశయంబున (క)
4. యొందుదాన (హ) 5. ఇపుడు (తం. వా.) 6. పట్టణ మింద్ర (హ. తం. వా.)

* దీని తరువాత తం.లో అని మఱియు వాసుదేవ కృపాలబ్ధ దుర్నిరీక్ష్యుం డైన వజ్రహస్తునిం గని యి ట్లనియె. అను వచనము కలదు.

అధ్యాయము-౧౨

మహాప్రస్థర. హరిపై సర్వాత్మపై నత్యగణితగుణపై నంతరంగంబు పర్వన్
సరి మే నుప్పొంగఁ జావుం జయమును సరిగా సంతసం బందుచుం భీ
కరుఁ డై కాలాగ్నివోలెన్ గనలుచుఁ గవిసెన్ [1]గర్వదుర్వారుఁ డై దు
ర్భరలీలం భూమి గంపింపఁగ దిశ లద్రువన్ భండనోద్దండవృత్తిన్. 403

క. దొరకొని ప్రళయోదకమున, హరిపైఁ గైటభుఁడు గవియు హంకారమునన్
సురనాథు మీఁద వృత్రా, సురుఁడు మదోద్వృత్తి నడచె శూలాయుధుఁ డై.

శా. కల్పాంతాగ్నియుఁ బోలె నుల్క లెగయంగాఁ ద్రిప్పుచున్ దీన నో
రల్పా! [2]పొల్సితి వంచు శూలము రయంబారంగఁ బై వైచినం
బోల్పం గోటిరవి ప్రకాశత దివిం బోవంగ వీక్షించి యా
[3]వేల్పు ల్వ్యాంగఁగ వజ్రధారఁ దునిమెన్ విన్నాణ మొప్పారఁగన్. 405

ఆ. శూల మప్పు డతఁడు స్రుక్కఁగ ఖండించి
పూని తోన కదిసి భుజముఁ ద్రుంచె
నసుర గనలి యేకహస్తుఁ డై పరిఘుంబు
గొని మహేంద్రుఁ గిట్టి హనువు [4]లడిచె. 406

వ. ఇట్లు ప్రళయకాల భీషణ పరివేష పోషంబుగా రోషంబునం బరిఘుంబు ద్రిప్పి, కుప్పించి, గజ కుంభస్థలంబు భగ్నంబు సేసి, యింద్రు హనుప్రదేశంబులు నిష్ఠురా హతి నొప్పించిన. 407

క. గజము మదముడిగి తిరుగుచు, గుజగుజ నై గీఁకవెట్టఁ గులిశము నేలన్
[5]భజన చెడి విడిచె నింద్రుఁడు, గజిబిజితోఁ బెగడె నసురకడిమి జగంబుల్. 408

క. గరుడుఁడు వొదివిన నాగము, కరణిఁ వృత్రాసురేంద్రు కడిమికి లో నై
తిరుగుడు వడ్డ హరిం గని, పురపుర నాహా! యటంచుఁ బొగిలె జగంబుల్. 409

వ. అప్పుడు. 410

తే. గజముపాటుఁ జూచి కడు దీనగతిఁ జూచి
[6]పవి కరంబు [7]జాటి పడుటఁ జూచి
యుద్ధధర్మ మెఱిఁగి యున్న శత్రునిఁ జూచి
సిగ్గుతోడ వజ్రి శిరము వంచె. 411

---

1. ఖర్వగర్వోన్నతిం (హ) 2. చావుమటంచు (క) 3. వేల్పుప్పొంగుచు (చ) 4. విఱిచె (బ) 5. బలిమిచెడి (హ. చ. బ.) ఈ పాఠమున ప్రాసభంగము. క. తం. వా. ప్రతులలో 'భజనచెడి' అను పాఠము. మఱియు సూ.ని. 'భజన'(=ధైర్యము)క్రింద, 'భజనచెడి' అనుపాఠముతోనే యీ పద్యము నిచ్చియున్నది. 6. పరికరంబు (హ. వా.) 7. జూచి (చ-బ)

వ. ఇట్లు యుద్ధంబున శత్రుసన్నిధిం గరంబు జాఱిపడిన వజ్రంబుఁ బుచ్చికొనక నివ్వెఱపడి, లజ్జించి యున్న పాకశాసనుం జూచి, వృత్రుం డి ట్లనియె. 412

క. దురమునఁ గైదువు [1]వదలిన, శర ణన్నను వైరిజనులఁ [2]జంపము మది ని
వ్వెఱగొంద నేల? కులిశము, కర మరుదుగఁ బుచ్చికొనుము కాచితి నింద్రా!

సీ. వజ్రంబు గైకొని వైరి ని ర్జింపు మి ట్లడలంగ వేళ గా దమరనాథ!
[3]యరయ దేహోధీను లైన మూర్తుల కెల్ల నీశు లక్ష్మీశు సర్వేశుఁ బాసి
కడతేఱ జయములు గల్గునె యెం దైనఁ దలపోసి చూడుమా! తత్త్వదృష్టి
నీ లోకపాలురు నెవ్వని వశగతి వలఁ బడ్డ పశుల వర్తనమునఁ

తే. జిక్కి చేష్టలు సేయుచుఁ జింతసేతు
†రట్టి మృత్యు బలంబుల నాత్మజయము
తమది గాఁ గోరి యజ్ఞాన తంత్రు లగుచుఁ
గమలలోచను లీలావికారములను. 414

తే. మెఱయ యంత్రమయం బైన మృగముభంగి
దారునిర్మిత మైనట్టి [4]తరుణిపోల్కి
శక్ర! యెఱుఁగుమ యీ భూతజాల మెల్ల
[5]దళిత పంకేరుహోత్తు తంత్రంబు గాఁగ. 415

వ. మఱియు ‡భూతేంద్రి యాంతఃకరణంబులును, ప్రకృతిపురుషులును, భగవంతుని యనుగ్రహంబు లేమి సర్గాదులయందు సమర్థంబులు గావు. అవిద్వాంసుం డైన వాఁ డనవరతంబుఁ దన్ను స్వతంత్రునిగాఁ దలంపుచుండు. భూతంబుల వలన భూతంబులుం బుట్టుచుండును. ఆ భూతంబులు భూతంబులచేత భక్షింపఁ బడుచుండు. పురుషున కాయువు, శ్రీయును, కీర్తియు, నైశ్వర్యంబు మొద లయినవి యనుభవింప నెంతకాలంబు ప్రాప్తం బంత కాలంబు నివసించు. ఆ ప్రాప్తంబు దీఱినఁ బురుషుండు జాలిం బొందిన నవి యుండక పోవుచుండు. కావున గుణంబు, నవగుణంబును, గీర్త్యపకీర్తులును, జయాపజయంబులును,

---

1. వైచిన(తం) 2. చంపరు వైరిన్, వెఱగొందనేల (హ) చంపరువీరుల్ (వా) 3. అమర(హ)

† "సకాల ఇహకారణం, ఓజస్సహో బలం ప్రాణ మమృతం మృత్యుమేవ చ
తమజ్ఞాయ జనో హేతు మాత్మానం మన్యతే జడమ్॥" (12-8, 9)

4. తరణి (హ. తం. వా.) యథా దారుమయీనారీ (12-10). 5. ధవళ) తం.

‡ భూతంబులచేత, నింద్రియంబులచేత నవశుం డైన పురుషుండు ప్రకృతిచేత వేరుసేయం బడిన యాత్మం బరమేశ్వరానుగ్రహంబు వాసి, సుఖయింపుచుండు) (హ. తం. వా.)

సుఖదుఃఖంబులును, జావుబ్రతుకులును, సమంబు లై కలుగుచుండు. అజ్ఞాని యైన వానికి సత్త్వ రజ స్తమోగుణంబులు గలిగియుండు. అట్టివానికి గుణ మయంబు లైన యింద్రియాదులే యాత్మ యని తోఁచుచు నుండు. కావున వాఁ డా గుణంబులచేత బద్ధుం డగు. ఆ గుణంబులకు సాక్షిమాత్రం బై న శరీరంబు వేఱని యెవ్వం డెఱుంగనోపు, వాఁ డా గుణంబులచేత బద్ధుండు కాఁడు. కావున గుణంబులును, గుణియును, భోక్తయును, భోగ్యంబును, జయంబు, నపజయంబును, హర్తయును, హన్యంబును, నుత్పత్తి స్థితి లయ కర్త యై, సర్వోత్కృష్టుం డై న య ప్పరమేశ్వరుండే కాని యన్యంబు లేదు. ఇప్పు డొక్క హస్తంబు నాయుధంబును బోయినను భవ త్రాణాపహర ణంబునకు సమర్థుండ నగుచున్న నన్నుం జూడుము. అని మఱియు ని ట్లనియె.

తే. వాహనంబులు సారెలు వాడిశరము
లూర్జి తాఱుము లసువులు నొడ్డణములు
గాఁగఁ బోరెడి నీ ద్యూతకర్మమందు
నెసఁగ జయమును నపజయ మెవ్వఁ డెఱుఁగు ? 417

చ. అనవుడు వృత్రుమాటలకు నద్భుత మంది సురేంద్రుఁ డెంతయుం
దనమదిఁ గుత్సితం బుడిగి దై వముగా నతనిన్ [1]భజించి కై
కొనియెఁ గరంబునం దిగువఁ గూలిన వజ్రము, నప్పు డాత్మలోఁ
దనరె జగంబు లన్నియు ; ముదంబును బొందిరి ఖేచరావళుల్. 418

క. రాహుగ్రహ వక్త్ర [2]మహో, గేహాంతము వాసి వచ్చి కిరణావళి స
ద్బాహుళ్య మొప్ప వెలిఁగెడు, నా హరిదశ్వుండు వోలె హరి యొప్పె నృపా!

వ. ఇట్లు కరకలిత వజ్రాయుధ రుజ్మండల మండిత దిఙ్మండలుం డై జంభారి గంభీర వాక్యంబుల విస్మయ మందస్మిత ముఖారవిందుం డై వృత్రున కి ట్లనియె. 420

క. ఓ దానవేంద్ర ! నీ మతి, వేదాంతము వోలె తత్త్వవిజ్ఞాన కళా
మోదము ; నీ వతిభక్తుఁడ, వాదిమ పురుషునకు హరికి నజ్ఞాతునకున్. 421

ఉ. లోకములెల్ల నిండి తన లోనుగ సర్వముఁ జేసి ప్రాణులఁ
దీకులఁ బెట్టి యెల్లెడలఁ దీపులు సూపెడి విష్ణుమాయ నేఁ
డేకమతిం దలంచి తిది యేల ? మహాసుర రూపు మాని సు
శ్లోకు పురాణపూరుషుని శోభనమూర్తి ధరింపు మింపునఁ. 422

---

1. దలంచి (తం. వా.) 2. గుహా (తం. వా.)

ఉ. ఏ నియమంబు సల్పితివొ! యెట్టి మహోతప మాచరించితో!
పూని రజోగు ణాభిరతిఁ బొందిన నీ మది శాంత దాంత స
న్మాన సమాన సానుభవ మత్త మరాళు [1]ప్రసన్న భావ స
న్మాను నమేయు నా దనుజమర్దను భక్తి పొసంగె నెంతయున్. 422

క. నారాయణ రూ పామృత, పారావారమునఁ దేలు భక్తుఁడు దా భూ
[2]దారకృత ఖాత కోదక, పూరంబుల నేల తృప్తిఁ బొందు? మహాత్మా! 423

వ. ఇట్లు వలుకుచున్న యింద్రు నుపలక్షించి, వృత్రాసురుం డాయోధన దుర్మర్ష సంహర్ష మాణ మానసుం డై వైరిం బురికొల్పుకొని, వామహస్తంబునఁ బరిఘంబు ద్రిప్పుచు, [3]మత్సరంబునం గుప్పించుచు, బ్రహ్మాండకర్పరంబు నిష్ఠుర భైర వారావంబునం బగిలించుచు, సముత్తుంగ మత్త మాతంగ పుంగవంబు వృష భంబు పైఁ గదియుభంగి సురవృషభు పేరుర ముపలక్షించి, భీషణాశని నిపాత వేగంబునఁ గొట్టిన, నింద్రుండు కులిశధార న ప్పరిఘంబుఁ దునిమి, తోడనే శేష ఫణా విశేష భాసురం బైన బాహుదండంబు ఖండించె. అప్పుడు వృత్రుండు భిన్న బాహుద్వయుం డై, రక్తధారలం దోఁగుచు వజ్రిచేతఁ బఱుపరహితం బై దివంబుననుండి జాఱుచున్న కులపర్వతంబునుంబోలెఁ జూపట్టి, ప్రళయకాల సంహార నిటల చ్ఛటచ్ఛటార్భట కఠోర కీలాభీ లాగ్నిసమాన క్రూర కుటిల నిరీక్షణ దుర్నిరీక్షుఁ డై, భూ నభో మండలంబులఁ గ్రింది మీఁది దౌడల హత్తించి, నభోమండలంబునుం బోలెఁ దుది మొద లెఱుంగరాక, వికృతంబుగా వక్త్రంబు దెఱచి, మందర మథన మథ్యమాన విషధరజనిత విష విషమ జిహ్వా భీలం బగు నాలుక నభంబు నాకుచుఁ, గాలసంహార కారణుం డైన కాలుని భుజదండ మండిత కాల దండంబునుం బోలెడి దంష్ట్రలచేత జగత్త్రయంబును మ్రింగెడువానిం బోలె నతిమాత్ర మహాకాయుం డై, పర్వతంబులం దలంగ మీటుచు, నడగొండయుం బోలె నభోభాగ భూభాగంబుల నాక్రమించి, యప్పుడు. 424

ఉ. కాలమునాఁటి మృత్యువు ముఖంబునఁ బోలెను విస్ఫులింగముల్
గ్రాలఁగ దేవసంఘములు కంపమునొంద జగంబు లెల్ల నా
హా[4] లుఠి తారవం బెసఁగ నభ్రగజంబును నాయుధంబుతో
నాలుకఁ జుట్టి పట్టి సురనాథుని మ్రింగె మహోద్భ తాకృతిన్. 425

---

1. నిరోధ (హ); ని, లోకభావ (తం); అరోషభావ (వా) 2. ఈ రి త్ర ఖాతకోదక (త); 3 ఉప్పరంబునకు (తం. వా.) 4. లులితారవం (తం., వా.)

ఆ. లోక మెల్ల నపుడు చీకాకు పడెఁ దమం
బడరె నుడుగణంబు లవనిఁ బడియె
[1]సోనవానఁ గురిసె సూర్యచంద్రాగ్నుల
రశ్మి [2]లుడిగె దిశలు [3]రభస మయ్యె. 426

వ. అప్పుడు. 427

ఉ. కందఁడు భీతిఁ గుందఁడు ప్రకంపిత మొందఁడు పెద్దనిద్దురం
జెందఁడు తత్తఱింపఁడు విశేషము [4]చెప్పఁడు వైష్ణవీ జయా
నందపరైక విద్యయు మనంబునఁ దాల్చుచు నుండెఁ గాని సం
క్రందనుఁ డా నిశాచరుని గర్భములో హరిరక్షితాంగుఁ డై. 428

వ. ఇట్లు కవచరూప శ్రీనారాయణ కృపాపాలితుం డై యోగబలంబున బలభేది యతని యుదరంబు వజ్రాయుధంబున భేదించి, యైరావణసహితుం డై వెడలి, యతని కంధరంబు తెగనడువ వజ్రంబు ప్రయోగించిన, నతినిష్ఠురవేగంబున వృత్రహరణార్థంబుగం దిరుగుచు సూర్యాది గ్రహ నక్షత్రంబులకు దక్షిణోత్తర గతిరూపం బైన సంవత్సరసంధియందు నహోరాత్ర మధ్యంబున వృత్రు శిరంబు పర్వతశిఖరంబునుం బోలెఁ ద్రుంచి, కూలం ద్రోచె. అప్పుడు. 429

మ. మొరసెం దుందుభు లంబరంబునఁ గడుఁ మోదించి గంధర్వులున్
సురలుఁ సిద్ధులు సాధ్యులుఁ మునివరుల్ సొంపార వృత్రఘ్ను భీ
కర తేజోవిభవ ప్రకాశకర విఖ్యా తైక మంత్రంబులం
దిర మొప్పం బఠియింపుచుం గురిసి రెంతేఁ గ్రొత్త పూ సోనలఁ. 430

ఆ. ఏమిచెప్ప నప్పు డింద్రారి తనువున
నొక్క దివ్యతేజ ముబ్బి వెడలి
లోక మెల్లఁ జూడ [5]లోకంబు చూడని
లోక మరిగి విష్ణులోను సొచ్చె. 431

అధ్యాయము - ౧౭

వ. ఇట్లు లోకభీకరుం డైన వృత్రాసురుండు గూలిన, నఖిలలోకంబులుఁ బరితాపంబులుడిగి సుస్థితిం బొందె. దేవ ఋషి పితృగణంబులు దానవులతోడం గూడి, యింద్రునకుం జెప్పక తమతమ స్థానంబులకుం జనిరి. అనిన విని, పరీక్షి న్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 432

---

1. రక్తవృష్టి గురిసె రవిచంద్ర వహ్నుల ప్రభలు మాసె(తం.) 2. అడఁగె(క.తం.వా.) 3. భస్మమయ్యె (క) 4. తప్పడు (క) ఁజొప్పడు (వా.) 5. లోకులు సూడనీ, లోక మరసి (హ. తం. వా.)

తే. ఏమి కారణమున నింద్రుతోఁ బలుకక
సురలు వోయి? రట్టి సురగణంబు
లెందుచేత సుఖముఁ జెందిరి? వజ్రికిఁ
జేటు గలుగు చెట్లు? [1]చెప్పు మయ్య! 433

వ. అనిన శుకుం డి ట్లనియె. వృత్రపరాక్రమ చకితు లైన నిఖలదేవతలును, మహర్షి గణంబులును, మున్ను వృత్రవధార్థం బింద్రునిం బ్రార్థించిన, నతండు బ్రహ్మ హత్య చేయఁజాలక, తొల్లియు విశ్వరూపునిం జంపిన పాపంబు స్త్రీలయందును, భూమియందును, జలంబులందును, ద్రుమంబులందును విభజించి పెట్టితి. ఇపు డీ హత్య యేరీతిం బాపుకొనువాఁడ? నా కభక్యంబు అనిన మహర్షు లశ్వమేధ యజ్ఞంబు సేయించి, యజ్ఞపురుషుం డైన శ్రీ నారాయణదేవుని సంతుష్టునిం జేసి, యీ హత్య బాపంగలవారము. స్వభావంబున బ్రాహ్మణ పితృ గో మాతృ సజ్జన హంత లైనవార లే దేవునిం గీర్తించి శుద్ధాత్ము లగుదు, రద్దేవుని నశ్వమేధ మహామఖంబున శ్రద్ధాన్వితుండ వై మాచేత ననుష్ఠితుండ వై సేవించిన నీకు ఖలుం డైన యి ద్దురాత్ముని హింసించిన హత్య యేమి సేయంగలదు? అని యొడంబఱచిన, నింద్రుండు వల్లెయని యీ విధంబున శత్రుఁ బరిమార్చి, బ్రహ్మహత్యం బొంది, [2]యత్తాపంబు భరియింపనోపక దుర్భళం బొందె. అప్పుడు. 434

సీ. పాపంబుఁ జండాలరూపంబు గలదాని ముదిమిచే నొడలెల్లఁ గదలుదానిఁ
ఱుయ కుష్ఠ రోగసంచయకృతం బగుదాని నురు రక్తపూరంబు దొరఁగుదాని
నెరసిన వెంట్రుకల్ బెరసిన తలదాని నట పోకు పోకుండు మనెడుదానిఁ
గదురు కంపునఁ బ్రేవు లదరఁజేసెడుదానిఁ దా నెందుఁ బాఱినఁ దఱుముదాని

ఆ. నా గుణంబులెల్ల భోగింప కేరీతి
నరుగ నెంతవాఁడ వనెడుదాని
బిట్టు దిరిగి చూచి భీతిల్లి సిగ్గుతో
దేవనాయకుండు [3]దెఱలి పఱచె. 435

వ. ఇ ట్లతివిక్రతరూపంబుతో బ్రహ్మహత్య వెనుతగుల నింద్రుండు నభోభాగ భూభాగ దిగ్భాగంబు లెల్లం దిరిగి, చొరం దెరువులేక దీర్ఘ నిర్ఘాతాటోప నిశ్శ్వాస దూషితుం డై, యీశాన్యభాగంబునకుం బఱచి, య ద్దెస నమేయ పుణ్యగణ్యం బైన మానససరస్సుం బ్రవేశించి, యందు నొక్క కమల నాళంబు సొచ్చి,

---

1. చెప్పవయ్య (ట) 2. యప్పాపంబు (తం. వా) 3. దెగచి (తం)

యందుఁ దంతువులం గలసి, రూపంబులేక యలబ్ధభోగుం డై, బ్రహ్మహత్యా విమోచనంబుఁ జింతించికొనుచు సహస్రవర్షంబు లుండె. ఆ చండాలియు నది పరమేశ్వర దిగ్భాగం బగుటంజేసి యందుం జొరరాక కాచియుండె. అంత కాలంబుఁ ద్రిదివంబున నహుషుండు విద్యాబల తపోబల యోగబలంబులం శాలింపుచుండి, సంప దైశ్వర్య మదాంధుం డై, యింద్రపత్నిం గోరి, యింద్రుండు వచ్చునందాఁక నాకుం బత్నివి గ మ్మనిన, నా శచీదేవియును బృహస్పతి ప్రేరిత యై, బ్రహ్మర్షి వాహ్యశిబికంబు నెక్కివచ్చి, నన్ను భోగింపు మనిన, నతం డట్లు చేసి, కుంభసంభవ శాపహతుం డై, యజగర యోనియందుఁ బుట్టె. అంత నింద్రుండు బ్రహ్మర్షి గణోపహూతుం డై, త్రిదివంబునకు వచ్చె. అంతకాలంబు నారాయణ చరణారవింద ధ్యానపరుం డై యుండుటంజేసియుఁ, దిశాధినాయకుం డైన శంకరుచేత రక్షింపబడ్డవాఁ డై యుండుటంజేసియుఁ, ద ద్దోషబలంబు దటీగి, సహస్రాతుం బీడింపలే దయ్యె. అప్పు డింద్రుండు నిజైశ్వర్యంబునుం బొంది, బ్రహ్మర్షి పరివృతుం డై, మహాపురు షారాధనంబు చేసి, హయమేధాధ్వరంబునకుం దీక్ష గైకొని, బ్రహ్మర్షులచేతం జేయింపంబడు చున్నవాఁ డై, సర్వదేవతామయుం డైన నారాయణుం బరితృప్తుం జేసి, మంచు విరియించు మార్తాండునిచందంబునఁ ద్వాష్ట్రవధరూప పాపంబును నాశంబు నొందించి, సకల దివిజ యక్ష గంధర్వ సిద్ధ మునిజన సంస్తూయమానుం డై, త్రిభువ నైశ్వర్య భోగభాగ్యంబులం గైకొనియె. అప్పుడు. 436

చ. సతత మరీచిముఖ్య మునిసంఘముచేత యథోచితంబుగాఁ
గృత ఘన వాజిమేధమునఁ గేశవు నీశుఁ బురాణపూరుషున్
హితు జగదీశు యజ్ఞపతి నిష్టఫలప్రదు నంతరంగ సం
గతు భజియించి వజ్రి గతకల్మషుఁ డై నెగడెఁ మహీశ్వరా! 437

సీ. మఱియుఁ బుట్టింపంగ మనసు వెట్టినయట్టి క్రూరక ర్తాంభోధి కుంభజుండు
అంగారములు సేయ నాహుతిఁ గన నోపు బహు పాపకానన పావకుండు
కందక డిగ్రమింగి గట్టునం ద్రేపంగఁ గల్మషగరళ గంగాధరుండు
ఘన గుహాంతరములఁ గాలూన నియ్యని కలుష దుస్తర తమో [1]గ్రహవిభుండు

ఆ. సకల ముక్తిలోక సామ్రాజ్య సమధిక
సహజ భోగ భాగ్య సంగ్రహైక
కారణాప్రమేయ కంజాక్ష సర్వేశ
కేశవాది నామ [2]కీర్తనంబు. 438

---

1. గ్రహవిభుండు (క) 2. కీర్తనుండు (క)

సీ. అఖిల దుఃఖైక సంహారాది కారణం బఖిలార్థ సంచ యాహ్లాదకరము
విమల భక్త్యుద్రేక విభవ సందర్శనం బనుపమ భక్త వర్ణనరతంబు
[1]విబుధర్ష భానేక విజయ సంయుక్తంబు గ్రస్తామరేంద్ర మోక్షక్రమంబు
బ్రహ్మహత్యానేక పాప నిస్తరణంబుఁ గమనీయ సజ్జన కాంక్షితంబు

తే. నైన యీ యితిహాసంబు నధికభక్తి
వినినఁ జదివిన వ్రాసిన ననుదినంబు
నాయు రారోగ్య భాగ్య భోగాభివృద్ధి
కర్మనాశము సుగతియుఁ గలుగు ననఘ! 439

అధ్యాయము - ౧౪

సీ. నావుడు యోగీంద్ర! నా మనం బీ వృత్రు వివరంబు నీచేత విన్న మొదలు
కడు నద్భుతంబునఁ గళవళం బందెడుఁ గోరి రజస్తమోగుణములందు
వర్తించు నీ పాపవర్తికి నేరీతి మాధవ పదభక్తి మది వసించె?
సత్త్వ స్వభావు లై సమబుద్ధు లై తపో నియమ ప్రయత్ను లై నిష్ఠచేత

తే. నిర్మలాత్మకు లైనట్టి ధర్మపరుల
కమరులకుఁ బుణ్యమునులకు నంబుజాక్షు
భూరి కైవల్యసంప్రాప్తి మూల మైన
భక్తి వీనికిఁ బోలె నేర్పాటు గాదు. 440

సీ. [2]ఉర్వరఁ గల రేణువులకన్న దట్ట మై కడు నొప్పు జీవసంఘములు గలవు
ఆ జీవములలోన నరయ ధర్మాయతమతి వసించినవారు మనుజజాతి
యా మనుష్యులలోనఁ గామంబు లెడఁబాసి మోక్షార్థు లగువారు మొదల నరిది
మోక్షమార్గం బాత్మమూలంబుగా నుండువారిలో ముక్తులు లేరు తఱచు

తే. ముక్తు లైనట్టివారిలో యుక్తిఁ దలఁపఁ
జాల దుర్లభుఁ డమిత ప్రశాంతిపరుఁడు
పరమ సుజ్ఞాననిరతుండు భద్ర[3]గుణుఁడు
రమణ శ్రీవాసుదేవ పరాయణుండు. 441

తే. సకల లోకోపకారి దుస్సంగతుండు
వృత్రుఁ డేక్రియ సుజ్ఞాన నిరతుఁ డయ్యె?
సమరమునఁ బౌరుషంబుచే నమరవిభుని
నెట్లు మెప్పించె? దీని నా కెఱుఁగఁజెపుము. 442

---

1. విబుధహర్ష్యానేక (హ) 2. భూస్థలి (తం. వా.) 3. యశుడు (త)

—: చిత్రకేతూపాఖ్యానము :—

వ. అని పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రు నడిగె. అని సూతుండు శౌనకాది మునులకుం జెప్పి, మఱియు ని ట్లనియె. అట్లు గజపురవల్లభుండు సంప్రశ్నంబు సేసినఁ బాదరాయణి హరిస్మరణ శ్రద్ధాపరుం డై యి ట్లనియె. తొల్లి కృష్ణ ద్వైపాయన నారద దేవల మహర్షులు నా కెఱింగించిన యితిహాసంబు గలదు. దాని నెఱింగించెద. సావధానుండ వై యాకర్ణింపుము. అని యి ట్లనియె.443

చ. అమితవిభూతిఁ జాల నమరాధిపుఁ బోలుచు శూరసేన దే
శములకు భర్త యై ప్రజలు సంతస మందఁగ సార్వభౌముఁ డై
తమ దన కెల్లకాలమును గామదుహంబుగఁ జిత్రకేతు నా
మమునఁ బ్రసిద్ధి కెక్కి గుణమండనుఁ డంచిత కీర్తికాముఁ డై. 444

సీ. మానిత తారుణ్య మదనతురంగులు కందర్పవిజయైక ఖడ్గలతలు
మదనసమ్మోహన మంత్రాధిదేవతల్ పంచశిలీముఖ బందెకత్తె
లసమాస్త్రఁ డఖిలంబు నడకించు బొమ్మలు నాత్మసంభవుని కట్టాయితములు
పుంజేతకోదండు భూరితేజంబులు శంబరవిద్వేషి సాయకములు

తే. నాగఁ బొలుపారు నొకకోటి నళినముఖులు
దనకుఁ బత్నులు గాఁగ నత్యంతవిమల
కీర్తివై భవ సన్మార్గవర్తి యగుచు
జగతిఁ బాలింపుచుండె నా జనవిభుండు. 445

తే. [1]కడిమి వేవేలు భార్యలు గలిగియుండఁ
బరఁగ సంతతి యొకరునిఁ బడయలేక
చిత్తమునఁ జాలఁ బాయని చింత వొడమి
బడలఁజొచ్చెను వేసవి మడువువోలె. 446

ఉ. రూపము సత్ప్రతాపము మరుత్పతిభోగము యౌవనంబు సం
దీపిత చారువర్తనము దిగ్విజయంబును సత్యముం జగ
ద్వ్యాపిత కీర్తియున్ సతులు వై భవముఖ్యము లెల్ల మాన్పఁగా
నోపకయుండె నా నృపతి నొందిన సంతతిలేని దుఃఖమున్. 448

వ. ఇట్లు సంతతి లేక యతిదుఃఖ మానసుం డైన యా నరేంద్రుని మందిరంబున కంగిరసుం డను మహాముని వచ్చి, యతనిచేత నతిథిసత్కారంబులు వడసి,

---

1 కలిమి....గలిగియుండి (వా)

కుశలం బడిగి, రాజ్యంబు భవ దధీనంబు కదా! పృథివ్యప్తేజో వాయ్వాకాశ మహదహంకారంబు లనియెడి యేడింటిచేత రక్షింపఁబడిన జీవుండునుం బోలె, నమాత్య జనపద దుర్గ ద్రవిణసంచయ దండ మిత్రంబు లనెడి సప్తప్రకృతులచేత రక్షితుండ వై, ప్రకృతిపురుషులయందు భారంబు వెట్టి, రాజసుఖంబు లనుభవింతువు కదా! మటీయు దార ప్రజామాత్య భృత్య మంత్రి పౌర జానపద భూపాలురు నీకు వశవర్తులు గదా! సర్వంబునుం గలిగి సార్వభౌముండ వైన నీ వదనంబు విన్నఁదనంబు గలిగి యున్నయది. కతం బేమి? అనిన నా ముని ప్రవరునకు నతండు, మీ తపోబలంబున మీకు నెఱుంగరాని యదియుం గలదే? అని తలవంచి యూరకున్న, నతని యభిప్రాయం బెఱింగి, యా భగవంతుం డైన యంగిరసుండు దయాళుం డై, పుత్రకామేష్టి వేల్చి యజ్ఞ శేష మతని యగ్రమహిషి యైన కృతద్యుతి కిచ్చి, నీకుం బుత్రుండు గలిగెడి. అతనివలన సుఖదుఃఖంబు లనుభవింపంగలవు. అని చెప్పి చనియె. ఆ కృతద్యుతి యను దేవి గర్భంబు ధరియించి, నవమాసంబులు నిండినం గుమారునిం గనియె. ఆ కాలం బున రాజును, సమస్త భృత్యామాత్య జనంబులును బరమానందంబునం బొందిరి. అపుడు చిత్రకేతుండు కృతస్నానుం డై, సకల భూషణభూషితుం డై, సుతునకు జాతకర్మంబు నిర్వర్తించి, బ్రాహ్మణులకు నపరిమిత హిరణ్య రజత దానంబులును, వస్త్రాభరణంబులును, గ్రామంబులును, గజంబులును, వాహనంబులును, ధేనువులును, నాఱేసి యర్బుదంబుల ద్రవ్యంబును, †దానంబు సేసి, ప్రాణిసముదయంబునకుం బర్జన్యుండునుం బోలెఁ దక్కినవారలకు నిష్టకామంబులు వర్షించి, పరమానంద హృదయుం డై యుండె. ‡అంతం బుత్ర మోహంబునం గృతద్యుతియందు బద్ధానురాగుం డై మహీధవుండు వర్తింపుచుండం, దక్కినభార్యలు సంతాన సంతోషవికల లై, యా మోహంబునకుం గారణంబు పుత్రుండ యని యీర్ష్యం జేసి దారుణచిత్త లై, కుమారునకు విషం బిడిన, సుఖనిద్రితుండునుం బోలె బాలుఁడు మృతిఁ బొందె. అప్పుడు వేఁగుటయు దాది బోధింపం జని, యా కుమారుని వికృతాకారంబుఁ జూచి, విస్మయ శోక భయార్త యై పుడమిం బడి యాక్రందించె. అప్పుడు. 448

తరల. పుడమి నిట్టక నిల్వునం బడి పొక్కుచుం గడు దీన యై
యడఁకు వేమియు లేని వాక్కుల నావు రంచు విలాపమం
దెడరు తోఁప భృశాతురోన్నతి నేడ్చినఁ విని భీతితోఁ
గడుపు బిట్టవియంగ భూపతికాంత గ్రక్కున నేఁగుచున్. 449

---

† "ధేనూనా మర్బుదాని షట్" (మూలము 14-35) ‡ కుమారుండును మాతృపితృ బంధు జనులకు సంతోషంబు సేయుచు దినదిన ప్రవర్ధమానుం డై పెరుఁగుచుండె (తం. వా.)

ఆ. బాలుఁ డొక్కరుండు పరిణామశీలుండు
వంశకర్త తపసి వరము వలనఁ
బుట్టి మిన్న కట్లు పొలిసియున్నట్టి యా
కొడుకుఁ జూచి తల్లి యడలఁ జొచ్చె. 450

ఉ. కుంకుమరాగ రమ్య కుచకుంభములఁ గడు కజ్జలంబుతోఁ
బంకిల మైన బాష్పములఁ బాల్పడ మజ్జన మాచరింపుచున్
కంకణపాణి పల్లవయుగంబున వక్షము మోదికొంచు నా
పంకరుహాక్షి యేడ్చెఁ బరిభావిత పంచమ సుస్వరంబునఁ. 451

క. ఆ యార్తరవమునకు భూ,నాయకుఁడు భయంబు నొంది నయ ముడిగి సుతుం
డాయఁగ వేగంబునఁ జని, పాయని మోహంబుతోడ బాలుని మీఁదఁ. 452

స్రగ్విణి. వ్రాలి యో పుత్ర! నీ వార్త దంభోళి యై
కూలఁగా వ్రేయ కీ కొద్ది న న్నేటికిఁ
జాలినొందించె? నా జాడ యిం కెట్టిదో?
తూలు మీ తల్లి కిన్ దుఃఖ మె ట్లాఱునో? 453

ప. అని తల మొల యొఱుంగక పలవించుచు, భృత్యామాత్య బంధుజనంబులం గూడి
యడలుచునున్న యా రాజు దుఃఖం బెఱింగి, యంగిరసుండు నారదునితోడం
గూడి చనుదెంచి, మృతుం డై న పుత్రుని పదతలంబున మృతుండునుం బోలి పడి
యున్న యా రాజునుం గనుంగొని యి ట్లనియె.

అధ్యాయము - ౧౫

సీ. నీకు వీఁ డెవ్వఁడు? నీ వెవ్వనికి శోక సంతాప మందెదు సార్వభౌమ
పుత్ర మిత్రాదులు పూర్వజన్మంబున నెవ్వని వారలో యెఱుఁగఁ గలరె?
మొదల నదీవేగమున నాడ కాడకు సికతంబు గూడుచుఁ జెదరుచుండు
నారీతిఁ బ్రాణుల కతికాల గతిచేతఁ బుట్టుట సచ్చుట పొసఁగుచుండుఁ

ఆ. గాన భూతములకుఁ గలుగు భూతంబులు
మమత తోడ విష్ణు మాయఁ జేసి
దీని కడల నేల? ధృతిఁ దూలఁగా నేల?
బుద్ధిఁ దలఁప వలదె? భూత సృష్టి. 455

వ. మఱియు నీవు, నేమును, దక్కిన వారలును ప్రవర్తమానకాలంబు గలిగి,
జన్మంబు నొంది, మృత్యువువలన విరామంబు నొందంగలవార మై యిపుడ

లేకపోపుదుము. చావుపుట్టువులకు నిక్కువంబు లేదు. ఈశ్వరుండు దన మాయ చేత భూతజాలంబులవలనం భూతంబులం బుట్టించు. వాని నా భూతంబుల చేతనే రక్షించు. వాని నా భూతంబులచేత నపహరించు. స్వతంత్రంబులేని తన సృష్టిచేత బాలుండునుం బోలె నపేక్ష లేకయుండు. దేహి యైన పిత్రదేహంబు చేత దేహియైన పుత్రదేహంబు మాతృదేహంబు వలనం గలుగుచుండు. ఆ ప్రకారంబున బీజంబువలన బీజంబులు వుట్టుచునుండు. దేహికి నివి శాశ్వతం బై జరుగుచునుండు. పూర్వకాలంబున సామాన్యవిశేషంబులు సన్మాత్రం బైన వస్తువులం దేవిధంబునం గల్పింపంబడియె, నా ప్రకారంబున దేహంబునకు జీవునకు నన్యోన్య విభాగంబు పూర్వకాలంబున నజ్ఞాన కల్పితం బయ్యె. జన్మఫలంబులను జూచుచున్న వారికి దహనక్రియల నగ్ని పెక్కురూపంబులం గానంబడు భంగి, నొక్కండై న జీవుండు పెక్కుభంగుల వెలుంగుచుండు. ఇవి యన్నియు నాత్మజ్ఞానంబు చాలక దేహి దేహ[1]సంయోగంబున స్వప్నంబునందు భయావహం బైన ప్రయోజనంబు నడపుచుండి, మేలుకాంచి, యా స్వప్నార్థం బైన ప్రయోజనంబు తనది గాదని యెఱుంగుభంగి, జీవుండే తా నని జ్ఞానగోచరుం డైనవాఁ డెఱుంగు. కావున నన్నియును మనోమాత్రం బని తెలిసి, మోహతమంబు వాసి, భగవంతుం డైన వాసుదేవునియందుఁ జిత్తంబు వెట్టి, నిర్మలాత్ముకుండ వగుము. అని బోధించినం జిత్రకేతుండు లేచి వారల కిట్లనియె. 456

సీ. యతివేషములు వూని యతి గూఢగతి నిందు నేతెంచినట్టి మీ రెవ్వరయ్య?
కడఁగి నఁ బోలిన గ్రామ్యబుద్ధుల నెల్ల బోధింప వచ్చిన పుణ్యమతులొ?
రమణఁ గుమార నారద ఋభు లంగిరో దేవ లాసితు లను ధీరమణులొ?
వ్యాస వసిష్ఠ దూర్వాస మార్కండేయ గౌతమ శుక రామ కపిల మునులొ?

తే. యాజ్ఞవల్క్యుఁ దరణియు నారుణియును
చ్యవన రోమశు లాసురి [2]జాతుకర్ణ
దత్త మైత్రేయ వర భరద్వాజ బోధ్య
పంచ శిఖులొ? పరాశర ప్రభృతి మునులొ? 457

క. వీరలలో నెవ్వరు? సుర, చారణ గంధర్వ సిద్ధ సంఘంబులలో
వారలొ? యీ సుజ్ఞానము, కారణ మై యెవరియందుఁ గలదు? తలంపఁ.

క. పొందుగ గ్రామ్య పశుత్వముఁ, బొంది మహోన్నతమముఁ బొందిన నాకుఁ
ముందఱ దివ్యజ్ఞానముఁ, జెందించిన వారి మిమ్ముఁ జెప్పుడు తెలియఁ. 459

---

1. సంయోగంబు (హ. తం. వా.) 2. చత్వదేవ (హ)

వ. అనిన నంగిరసుం డిట్లనియె. పుత్రకాంక్షి వైన నీకుం బుత్రుం బ్రసాదించిన యంగిరసుండ. ఇతండు, బ్రహ్మపుత్రుం డైన నారదభగవంతుండు. దుస్తరం బైన పుత్రశోకంబున మగ్నుండ వైన నిను ననుగ్రహించి, పరమజ్ఞానం బుప దేశింప వచ్చితిమి. నీ దుఃఖం బెట్టింగి, పుత్రు నిచ్చితి మేని, పుత్రవంతు లైన వారి తాపంబు నీచేత ననుభవింపంబడు. ఈ ప్రకారంబు లోకంబున సతులును, గృహంబులును, సంపదలును, శబ్దాదు లయిన విషయంబులును, రాజ్యవైభవం బును, జంచలంబులు. మఱియు రాజ్యంబును, భూమియు, బలంబును, ధనం బును, భృత్యామాత్య సుహృజ్జనంబులును, మొదలయినవి శోక మోహ భయ పీడలం జేయుచుండుం గాని సుఖంబుల నీ నేరవు. గంధర్వ నగరంబునుంబోలె, స్వప్న లబ్ధ మనోరథంబునుం బోలె, నర్థంబు బాసి కానంబడుచు, మనోభవంబు లయిన యర్థంబులం గూడి స్వార్థంబు లై కానంబడ నేరవు.[1] కర్మంబులచేత ధ్యానంబులు సేయుచుండు మనంబులు నానాకర్మంబు లగుచునుండు. ఈ దేహి దేహంబు ద్రవ్య జ్ఞాన క్రియాత్మకం బై, దేహికి వివిధక్లేశ సంతాపంబులం జేయు చుండు. కావున నిర్మలం బైన మనంబుచేత నాత్మగతి వెదకి, ద్వైత భ్రాంతి విడిచి, ధ్రువం బైన పదవి నొందు మనియె. అప్పుడు నారదుం డిట్లనియె. ఉపనిషద్గోప్యం బగు నే నిచ్చు మంత్రం బెవ్వఁడేని సప్తరాత్రంబులు పఠియించు, నతండు సంకర్షణుం డైన భగవంతునిం జూచు. ఎవ్వని పాదమూలంబు సర్వా శ్రయం బై యుండు, నట్టి శ్రీమన్నారాయణుని పాదంబులు సేవించి, యీ మోహంబు వదలి యతి శీఘ్రంబున నుత్తమపదంబు సొరుము.

అధ్యాయము – ౧౬

ఇప్పు డిక్ష్వాకునకు, నీకుం బ్రయోజనంబు గలదేని చూడుము. అని నారదుం డా పుత్రుని కళేబరంబుఁ జూచి, ఓ జీవుండ ! నీకు శుభం బయ్యెడు. మీ తల్లిదండ్రుల, బంధుజనులం జూచి, వీరల దుఃఖంబు లార్చి, కళేబరంబునందుఁ బ్రవేశించి, ఆయుశ్శేషంబు ననుభవించి, పిత్రధీనం బైన రాజ్యాసనంబునఁ గూర్చుండుము. అనిన న బ్బాలుం డి ట్లనియె. 460

తే. కర్మవశమున నెందు సుఖంబు లేక
దేవ తిర్య గ్మ్న ఓనులఁ దిరుగు నాకు
వెలయ నే జన్మమందునొ వీరు తల్లి
దండ్రు లై నారు? చెప్పవే! తాపసేంద్ర! 461

---

1. దృశ్యమానా వినార్థేన న దృశ్యంతే మనోభవాః (15.28.)

తే. బాంధవ జ్ఞాతి సుతులును బగతు లాత్మ
వరు లుదాసీన మధ్యస్థ వర్గములును
సరవిఁ గనుచుందు రొకొక్కఁ జన్మమునను
నెఱయఁ బ్రాణికి నొకవావి నిజము గలదె? 462

తే. రత్నములు హేమములు ననురాగలీల
నమ్మకంబుల నీవల నావ లైన
భంగి నరులందు జీవుండు ప్రాప్తిఁ డగుచు
నెలమిఁ దిరుగుచు నుండు దా నెందుఁ జెడఁడు. 463

సీ. ఒక్కఁ డై నిత్యుఁ డై, యెక్కడఁ గడలేక సొరిది జన్మాదుల శూన్యుఁ డగుచు
సర్వంబునం దుండి సర్వంబుఁ దనయందు నుండంగ సర్వాశ్రయుం డనంగ
సూక్ష్మ మై స్థూల మై సూక్ష్మాదికములకు సామ్య మై స్వప్రకాశమున వెలిఁగి
యఖిలంబుఁ జూచుచు నఖిలప్రభావుఁ డై యఖిలంబు దనయందు నడఁచికొనుచు

తే. నాత్మ మాయాగుణంబుల నాత్మమయము
గాఁగ విశ్వంబు దనసృష్టి [1]ఘనతఁ జెందఁ
జేయుచుండును సర్వసంజీవనుండు
రమణ విశ్వాత్మఁ డై న నారాయణుండు. 464

క. [2]పతు లెవ్వరు? సతు లెవ్వరు?, సుతు లెవ్వరు? మిత్ర శత్రు సుజనప్రియ సం
గతు లెవ్వరు? సర్వాత్మక, గతుఁ డై గుణసాక్షి యైన ఘనుఁ డొక్కనికిన్.

—: చిత్రకేతుండు తపమాచరించి భగవత్ప్రసాదంబు నొందుట :—

వ. మఱియు, సుఖదుఃఖంబులం బొందక, సర్వోదాసీనుం డై, పరమాత్మ యై యుండు న ప్పరమేశ్వర రూపుండ నై న నాకును, మీకు నెక్కడి సంబంధంబు? మీకుదుఃఖంబునకుం బనిలేదు. అని పలికి, యాజీవుండు వోయినం, జిత్రకేతుండును, బంధువులు నతి విస్మిత చిత్తు లై, శోకంబులు విడిచి, మోహంబులం బాసి యమునా నదియందు న క్కుమారునకు నుత్తరక ర్మంబులు నిర్వర్తించిరి. చిత్ర కేతుండు, [4]గాఢపంకంబునం బడిన యేనుంగునుంబోలె గృహాంధకూపంబు వెడలి, కాళిందీనదికిం బోయి, యందు విధిపూర్వకంబుగఁ గృతస్నానుం డై, మౌనంబు తోడ నారదునకు నమస్కరించిన, నతండు ప్రసన్నుం డై, భగవన్మంత్రంబు

---

1. ఘటన నొంద (చ. త. జ. డ. బ.) 2. సతులెవ్వరు సుతులెవ్వరు పతులెవ్వరు మిత్ర శత్రు బంధు ప్రియ సం (క. చ. ట. త. బ.) 3. బాలహంతలై న రాజభామినులు బ్రాహ్మణ ముఖంబున నబాలహత్య నివారణంబుగా నొక్క వ్రతంబు సల్పుచుండి రనంతరంబ (చ .త. డ. బ.)

విధిపూర్వకంబుగా నతనికి నుపదేశించి, యంగిరసుతోడం గూడి, బ్రహ్మలోకంబునకుం జనియె. చిత్రకేతుండును, నారదోపదేశమార్గంబున నిరాహారుం డై, సమాధినియంతు డై, నారాయణరూపం బైన విద్య నారాధించి, సప్తరాత్రాంతంబున నప్రతిహతం బైన విద్యాధ రాధిపత్యంబును, భాస్వ ద్రత్న దివ్య విమానంబును, నారాయ ణానుగ్రహంబునఁ బొంది, మనోగమనంబునఁ [1]జరియింపుచుండఁ గొన్ని దినంబులకు నొక్కచోట. 466

సీ. తార హార పటీర ధవళ దేహమువాని రమణీయ నీలాంబరంబువాని
మణికిరీట స్ఫుర న్మస్తకంబులవానిఁ గంకణ కేయూర[2]కములవానిఁ
గర్బురమయ దీప్త కటిసూత్రములవానిఁ దరళ యజ్ఞోపవీతములవాని
నతి సుప్రసన్న వక్త్రాంబుజంబులవానిఁ దరుణ వివృత్త నేత్రములవాని

ఆ. సిద్ధమండలంబు సేవింపఁ బుణ్యప్ర
సిద్ధి వెలసినట్టి యిద్ధచరితుఁ
బద్మలోచనునకుఁ బాదపీఠం బైన
ఘనునిఁ బన్న గేంద్రుఁ గాంచె నతఁడు. 467

ఆ. కన్నమాత్ర నతఁడు కల్మషంబులఁ బాసి
విమలచిత్తుఁ డగుచు విశదభక్తి
నిట్టరోమములకుఁ బట్టగు చానంద
బాష్పనేత్రుఁ డగుచుఁ బ్రణుతి సేసె. 468

క. సంతోషాశ్రులచేత న, నంతునిఁ బరిషిక్తుఁ జేసి యతఁడు ప్రమోదం
బెంతయు నరికట్టిన నొక, కొంతయుఁ బలుకంగలేక కొండొక వడికిన్. 469

చ. మది నొకయింత మాత్రము సమంబుగఁ జేయుచు బాహ్యావర్తనం
గదిసిన యింద్రియంబుల నొకంతకుఁ దెచ్చి [3]మనంబు వాక్కునుం
గుదురుగఁ ద్రోచి తత్త్వమునఁ గూర్చుచు [4]సాత్త్వత విగ్రహంబు నా
సదయుఁబ్రశాంతు లోకగురు సన్నుతిఁ జేయఁ దొడంగె నిమ్ములన్. 470

క. అజితుఁడ వై భక్తులచే, విజితుఁడ వై నాఁడ విపుడు వేడుక వారున్
విజితులు నీచేఁ గోర్కులు, భజియింపనివారు నిన్నుఁ బడయుటను హరీ! 471

---

1. త్రిజగంబులఁ జరించుచుండ (తం. వా.) "జగామ దేవదేవస్య శేషస్య చరణాంతికమ్." (మూ. 16-29) 2. కరము (హ. తం. వా.) 3. వచోవిలాసము (క. చ. ట. జ. బ.)
4. శాశ్వత (హ. తం. వా)

ఉ. నీ విభవంబు లీ జగము నిండుట యుండుట నాళ మొందుటల్
నీ విమ లాంశజాలములు నెమ్మి జగంబు సృజించువార లో
దేవ ! భవ ద్గుణాంబుధుల తీరముఁ గానక యీళ ! బుద్ధితో
వావిరిఁ జర్చ సేయుదురు వారికి వారలు దొడ్డవార లై. 472

క. పరమాణువు మొదలుగఁ గొని, పరమము తుది గాఁగ మధ్య పరికీర్తనచే
స్థిరుఁడవు [1]త్రయీవిడఁడ వై, [2]సరి-సత్తా ద్యంత మధ్య సద్ధ్రువగతి వై. 473

తే. ఉర్వి మొద లగు నేడు నొండొంటికంచె
[3]దళగు ణాధిక మై యుండు దాని నండ
[4]కోశమందు రజాండంబు కోటు లెవని
యందు నణుమాత్ర మగు ! ననంతాఖ్యుఁ డతఁడు. 474

వ. మఱియు నొకానొకచోట విషయతృష్ణాపరు లైన నరపశువులు పరతత్త్వంబ వైన నిన్ను మాని, యైశ్వర్యకాము లై తక్కిన దేవతలం భజియించుదురు. వా రిచ్చు సంపదలు రాజకులంబునుం బోలె వారలం గూడి నాశంబునం బొందుచుండు. విషయకాము లైనను నిన్ను సేవించినవారు, వేఁచిన విత్తనంబునుం బోలె, దేహాంతరోత్పత్తి నొందకుండుదురు. *(నిర్గుణుండ వై జ్ఞానవిజ్ఞానరూపంబు నొందియున్న నిన్ను గుణసమేతునిఁగా నజ్ఞానులు భావించుదురు.) నీ భజనం బే రూపున నైన మోక్షంబు ప్రసాదించు. జితమతి వైన నీవు భాగవతధర్మం బే ప్రకారంబున నిర్ణయించితి, వా ప్రకారంబున సర్వోత్కృష్టుండ వైన నిన్ను సనత్కుమారాదులు మోక్షంబుకొఱకు సేవింపుచున్నారు. ఈ భాగవతధర్మంబు నందు జ్ఞానహీనుం డొకండును లేఁడు. అన్య కామ్యధర్మంబులందు విషమబుద్ధి చేత నేను, నీవు, నాకు, నీకు, నని [5]వచియింపుచున్న వాఁ డధర్మనిరతుం డై తుయింపుచుండు. స్థావర జంగమ ప్రాణిసమూహంబునందు సమం బైన భాగవత ధర్మంబుల వర్తింపుచున్న మనుజునికి భవ ద్దర్శనంబు వలనఁ బాపంబు తుయిం చుట యేమి చిత్రంబు ? ఇపుడు భవ త్పాదావలోకనంబున నిరస్తాశయమలుండ నై తి. మూఢుండ నైన నాకుఁ బూర్వకాలంబున నారదుం డనుగ్రహించి, భగవ ద్ధర్మంబు దయసేసె. అది నేఁడు నాకు వరదుండ వైన నీ కతంబున దృష్టం బయ్యె. ఖద్యోతంబులచేత సూర్యుండు గోచరుండు గాని మాడ్కి, జగదాత్మకుండ వైన నీ మహత్త్వంబు మనుజులచేత నాచరింపఁబడి, ప్రసిద్ధం బైనది కాదు.

---

1. ఁద్రిగుణహరుండవు (హ) 2. సరసత్త్వాద్యంత మధ్య సర్వసుగతివై (హ) సరి....మధ్య సదృశగతుఁడవై (వా) 3. దళగుణాధిక్య మయ్యుండు దానంద (హ) 4. నాశమొందెడు నాయంశ కోటులెన్న (హ) * తా. ప. ప్రతులలో లేదు. 5. రచియింపబడుచున్న (ట. త)

ఉత్పత్తి స్థితి లయకారుఁడ వై భగవంతుండ వైన నీకు నమస్కరించెద. అని మఱియును. 475

తే. అరయ బ్రహ్మాదు లెవ్వని ననునయించి
భక్తియుక్తుల [1]మనమునఁ బ్రస్తుతింతు
రవని యెవ్వని తలమీఁద నావగింజఁ
బోలు నా వేయిశిరముల భోగిఁ గొల్తు. 476

క. ఈ విధమున వినుతింపఁగ, నా విద్యాధరుల భర్త కనియె ననంతుం
డో విమలబుద్ధి! నీదగు, ధీ విభవనంబునకు మెచ్చితిం బ్రియమారఁ. 477

ఆ. అరయ నారదుండు నంగిరసుండును
తత్త్వ మొసఁగినారు దానికతన
నన్నుఁ జూడఁ గలిగె నాభక్తిమదిఁ గల్గె
నాపథంబు నీకు నమ్మఁ గలిగె. 478

సీ. పూని నా రూపంబు భూతజాలంబులు [2]భూతభావనుఁ డని పొందు పడఁగ
బ్రహ్మంబు మఱియు శబ్ద బ్రహ్మమును శాశ్వతం బైన తనువులు దగిలె నాకు
నఖిల లోకంబులు ననుగతం బై యుండు లోకంబు నాయందుఁ జోకఁ డెందు
నుభయంబు నాయందు నభిగతం బై యుండు [3]నఖిలీనమగుదు నయ్యుభయమందు

తే. వెలయ నిద్రించువాఁ డాత్మ విశ్వమెల్ల
జూచి మేల్కాంచి తానొక్క చోటువాని
గా వివేకించుమాడ్కి నీ [4]జీవుఁ డీశు
మాయ దిగనాడి పరమ ధర్మంబుఁ దెలియు. 479

ఆ. నిద్ర యోపు వేళ నిరతుఁడై దేహి తా
నెట్టి గుణముచేత నింద్రియములఁ
గడచినట్టి సుఖముఁ గను నట్టి బ్రహ్మంబుఁ
కడిమి మెఱయ ననున్నుఁగా నెఱుంగు. 480

తే. స్వప్నమందు నెట్లు సంచార మొనరించు
మేలుకాంచి దృష్ట [5]మెల్ల నెఱుఁగు
నుభయ మెఱుఁగు నట్టి యుత్తమజ్ఞానంబు
తత్త్వ మట్టి దైన తలఁపు నేను. 481

---

1. భయమున (క. బ.) 2. భూతపావనుఁడని (హ) 3. నదిలీనమయ్యె (హ) 4. జీవితేశ (తం. వా.) జీవదేశ (హ) 5. మోలి (తం. వా.)

సీ. అరయంగ నెవ్వని కలవి గానట్టి యీ సలలిత మానుషజాతిఁ బుట్టి
యాత్మత త్త్వజ్ఞాన హేతుఁ డై నవానికిఁ గలుగునే? యందు సుఖం బొకింత
వెలయఁ బ్రవృత్తి నివృత్తి మార్గంబుల సుఖమును దుఃఖంబు సొరిదిఁ దెలిసి
పనిచెడి సంకల్ప ఫలమూలమునఁ బాటి కడు సుఖదుఃఖ మోహములకొఱకు

ఆ. †దంపతిక్రియామతంబు వర్తింతురు
దాన మోహ మేల దక్కి యుండు?
నఖల దుఃఖహేతు వైన యీ కర్మంబు
నెఱిఁగి నన్నుఁ [1]దలఁప రిచ్చలోన. 482

వ. మఱియు విజ్ఞానాభిమాను లైన మనుష్యులకు నతిసూక్ష్మం బైన *యాత్మ గతిని స్థానత్రయ విలక్షణం బైన చతుర్థాంశంబు నెఱింగి, యైహి కాముష్మిక విషయంబులచేతను, వివేకబలంబుచేతను, నిర్ముక్తుం డై, జ్ఞాన విజ్ఞాన సంతృప్తుం డైన పురుషుండు నా భక్తుం డగు. ఈ విధంబు గలవారలు, యోగ నైపుణ బుద్ధి గలవారలు నై, స్వార్థం బైన యాత్మచేతం బరమాత్మను దెలియు చుందురు. నీవు నీ క్రమంబున మ ద్భక్తి శ్రద్ధాపరుండ వై విజ్ఞానసంపన్నం బైన వాక్కులచేత నన్ను స్తోత్రంబు చేసి ముక్తుండ వైతివి. అని, యా శేష

భగవంతుండు విద్యాధరపతి యైన చిత్రకేతుం బలికి, యతని కదృశ్యం డై పోయె. ఏదిక్కున సర్వాత్మకుం డైన యనంతుం డంతర్ధానంబు నొందె, నా దిక్కునకు విద్యాధరభర్త నమస్కరించి, గగనచరుం డై చని, లక్షల సంఖ్య లైన దివ్యవర్షంబు లవ్యాహత బలేంద్రియుం డై, పరమ [2]యోగి పురుషులును, దివ్యమునీంద్ర సిద్ధ చారణ గంధర్వులును, [3]వినుతి సేయం గుల శైల ద్రోణు లను, రమ్య ప్రదేశంబులను, సంకల్ప సిద్ధ ప్రదేశంబులను, వినోదింపుచు, శ్రీ నారాయణ దత్తం బగు దివ్యవిమానంబునందుఁ జరియింపుచు నుండె. 483

శా. ఆడించుఁ హరి దివ్యనాటక గుణవ్యాపార నృత్యంబులం
బాడించుం జలజాతనేత్ర బిరుద ప్రఖ్యాత గీతంబులం
గూడించుఁ సతతంబు జిహ్వాల తుదిఁ గోవింద నామావళుల్
క్రీడం గిన్నెర యక్షకామినులచేఁ గృష్ణార్పిత స్వాంతుఁ డై 484

---

† "కుర్వాతే దంపతీ క్రియాః" (16-60) 1. వదల రిచ్చలోన (చ. బ.)
* "ఆత్మనశ్చ గతిం సూక్ష్మాం స్థానత్రయ విలక్షణామ్" (తురీయామ్) 16-61.
ఆత్మగతి నిజస్థాన త్రయలక్షణంబునఁ జతుర్థాంశంబు నెఱింగి (తం. వా.)
2. యోగీంద్ర పురుషులును (హ) 3. వినుతిసేయంగల శైల ద్రోణులను (హ)
కులద్రోణాది శైలంబులను (తం. వా.); "కులాచలేంద్ర ద్రోణిషు" (17-3)

సీ. వాసించు నాత్మలో వైష్ణవజ్ఞానంబు నాశించు భాగవతార్చనంబు
భూషించు నే ప్రొద్దుఁ బుండరీకాక్షుని భాషించు హరికథాప్రౌఢి మెఱసి
ఘోషించు హరినామ గుణని కాయంబులు పోషించు పరతత్త్వబోధ మరసి
సేవించు శ్రీకృష్ణ సేవకనికరంబు సుఖమునఁ జేయు నీశునకు బలులు

తే. పాడుఁ బాడించు వైకుంఠ భర్త నటన
రూపవర్తన గుణనామ దీపితోరు
గీతజాత ప్రబంధ సంగీత విధులఁ
గేశవప్రీతిగాఁ జిత్రకేతుఁ డెపుడు. 485

విద్యాధరాధిపతి యగు చిత్రకేతుం డీశ్వరధిక్కారంబున గౌరిచే శాప మొందుట.

మ. హరిఁ గీర్తింపుచు నల్లనల్ల మదిలో నబ్జాక్షు [1]సేవింపుచుం
బరమానందము నొందుచున్ జగములన్ ప్రఖ్యాతి వర్తింపుచున్
సురరాజోపమమూర్తి యతఁగణముల్ సొంపార విద్యాధరా
ప్సరసల్ గొల్వఁగఁ బాడఁగా సితగిరి ప్రాంతంబున న్నేఁగుచున్. 486

శా. ఆ విద్యాధరభర్త గాంచె హర నీహా రామృ తాహాసమున్
శ్రీవిభ్రాజితమున్ నిరస్త గిరిజాసేవాగతాయాసమున్
దేవానీకవికాసమున్ శుభ మహాదే వాంఘ్రి సంవాసమున్
భూ విఖ్యాత విలాసముం ద్రిభువనీభూతంబుఁ గైలాసమున్. 487

క. ఆ రజతభూధరంబున, నీరేజభ వామరాది నికరము గొల్వన్
వేరోలగమున నుండిన, గౌరీయుతుఁ డైన హరునిఁ గనియె నరేంద్రా! 488

సీ. †తన నిజరూప మింతం తని తెలియక వాదంబు [2]సేసెడి వేదరవము
కరుణావలోకనా కాంక్షితు లై యున్న బ్రహ్మాది సనక [3]సప్రణుతి రవము
సార శివానంద సల్లాపముల నొప్పు ప్రమథగణాళి యార్భటరవంబు
డమరు మృదంగాది ధమధమ ధ్వనితోడి పటు భృంగి నాట్య విస్ఫార రవము

తే. మానుగాఁ జామరలు వీచు మాతృకాది
కామినీజన మహిత కంకణ రవంబు
మెండుఁ జెలఁగంగఁ గన్నులపండు వయ్యెఁ
గొండరా చూలి పెనిమిటి నిండు కొల్వు. 489

---

1. నీక్షింపుచుఁ (త) † 'తనదగు' అనుట యుచితము 2. సేసెడు (తం) 3. సంప్రణుతి రవము (తం. వా.)

వ. ఇట్లు బ్రహ్మాది సురనికర సేవితుం డై యూరుపీఠంబున నున్న భవానిఁ గౌఁగిటం జేర్చికొని, యొడ్డోలగంబున నున్న పరమేశ్వరుం జూచి, చిత్రకేతుండు పకపక నగి, య ద్దేవి వినుచుండ ని ట్లనియె. 480

సీ. కొమ రొప్పఁగా లోకగురుఁడును గడలేని ధర్మస్వరూపంబుఁ దాన యగుచు
జడలు ధరించియు సరిలేని తపమునఁ బొడ వైన యీ యోగిపుంగవులును
బ్రహ్మవాదులుఁ గొల్వ భాసిల్లు కొల్వులో మిథునరూపంబున మెలఁత తోడఁ
బ్రాకృతుండును బోలె బద్ధానురాగుఁ డై లాలితుం డయ్యె [1]నిర్లజ్జత నిట

ఆ. నకట ! ప్రకృతిపురుషుఁ డైనఁ దా నేకాంత
[2]మందు సతులతోడ నలరుఁ గాని
యిట్లు ధర్మసభల నింతులతోఁ గూడి
పరిఢవింపఁ [3]దగదు భ్రాంతి నొంది. 491

క. అన విని సర్వేశ్వరుఁ డా, తని నేమియు ననక నవ్వోఁ ద త్సభవారుం
గనుఁగొని యూరక యుండిరి, మనుజేశ్వర ! యీశు ధైర్యమహి మెట్టిదియో!

వ. ఇట్లు తన పూర్వకర్మవిశేషంబున నింద్రియజయుండ నని పుట్టిన యహంకారం బున జగద్గురువుం బెక్కు ప్రల్లదంబు లాడుచున్న చిత్రకేతుం జూచి, భవాని యి ట్లనియె. 493

క. మముబోఁటి లజ్జ లుడిగిన, కుమతులకుం గ ర్త యగుచుఁ గోపింపంగా
నమితాజ్ఞా నిపుణుం డగు, శమనుండా ? నేఁడు వీఁడు జగముల కెల్ల. 494

క. భృగు నారద కపిలాదులు, నిగమాంతజ్ఞులును యోగనిర్ణయ నిపుణుల్
త్రిగుణాతీతు మహేశ్వరు, నగ రెన్నఁడు వారు ధ ర్మనయ మెఱుఁగరొకో ?

సీ. ఎవ్వని పదప ద్మ మింద్రాది విబుధుల చూడాగ్ర పంక్తుల నీడ చూచు
నెవ్వని త త్త్వం బ దెనయంగ బ్రహ్మాది యోగి మానసపంక్తి నోలలాడు
నెవ్వని రూపంబు నేర్పాటు గానక వేదంబు లందంద వాద మడుచు
నెవ్వని కారుణ్య మీ లోకముల నెల్లఁ దనిపి యెంతయు ధన్యతమముఁ జేయు

తే. నట్టి సర్వేశు పాపసంహారు ధీరు
శాశ్వతైశ్వర్యు నా త్మసంసారు నీశు
నెగ్గు వల్కిన పాపాత్ముఁ డెల్లభంగి
దండనార్హుండు గా కెట్లు తలఁగఁ గలఁడు ? 496

---

1. నిర్లజ్జతోడ (హ) 2. సీమసతులతోడ జెలగుగాక (క. చ. ట. డ. ద. బ.) 3. వలదు (హ) లేఁడు (తం. వా)

తే. నిఖిల లోకాశ్రయంబు సన్నిహిత సుఖము
సకల భద్రైక మూలంబు సాధుసేవ్య
మైన కంజాతు పాదప ద్మార్చనంబు
ననుచరింపంగ ఖలుఁడు వీఁ డర్హుఁ డగునె ? 497

వ. కావున నోరి దురాత్మక ! యీ పాపంబునం బాపస్వరూపం బైన రాక్షస యోనిం బుట్టుము. అని శపియించి, యింతనుండి మహాత్ములకు నవజ్ఞ సేయకుము. అని పల్కినఁ, జిత్రకేతుండు విమానంబు డిగ్గివచ్చి, య ద్దేవికిం దండప్రణామంబు లాచరించి, కరకమలంబులు దోయిలించి, యి ట్లనియె. ఓ జగన్నాత ! భవ చ్ఛాపవాక్యంబు లట్ల కైకొంటి. ప్రాచీన కర్మంబులం బ్రాప్తం బైన సంసార చక్రంబుచేత నజ్ఞాన మోహితు లై తిరుగుచున్న జంతువులకు సుఖదుఃఖంబులు నై జంబు లై ప్రవర్తిల్లుచుండు. ఇందులకుఁ బరతంత్రు లైనవా రాత్మ సుఖ దుఃఖంబులకు నెవ్వరు కర్తలు ? ఈ గుణంబుల నిమిత్త మై శాపానుగ్రహం బులును, స్వర్గనరకంబులును, సుఖదుఃఖంబులును, సమంబులు. భగవంతుం డొక్కండు దనమాయచేత జగంబులు సృజియింపుచుండు. వారివారికి [1]బద్ధా రాగంబులు గలుగఁ జేయుచుఁ, దాను వానికి లోనుగాక [2]నిష్కళుం డై యుండు. ఈ విధంబునఁ బుట్టుచున్న నరునకుం బత్నీ బంధు శత్రు మిత్రో దా సీనంబు లెక్కడివి ? వారివారి కర్మవశంబునం బరమేశ్వరుండు కల్పించుచుండు. సర్వసముం డై యుండు న ప్పరమేశ్వరునకు సుఖదుఃఖంబులచేత రాగంబు లేదు. రాగానుబంధం బైన రోషంబును లేదు. అతని మాయాగుణ విసర్గంబు జంతువులకు సుఖదుఃఖంబులను, బంధమోక్షంబులం గల్పించుచుండు. కావున నీకు నమస్కరింపుచున్న నన్ను ననుగ్రహింపుము. శాపభయ శంకితుండం గాను. జగన్నాత వై న నిన్నుఁ బలికిన దోషంబునకు శంకింపుచున్న వాఁడ. అని దండ ప్రణామంబు లాచరించి, పార్వతీపరమేశ్వరులం బ్రసన్నులం జేసి, తన విమానం బెక్కి చనియె. అప్పుడు పరమేశ్వరుండు బ్రహ్మాది దేవర్షి దైత్య దానవ ప్రమథ గణంబులు వినుచుండఁ బార్వతికి ని ట్లనియె. నీకు నిప్పుడు దృష్టం బయ్యెఁ గదా నారాయణ దాస దాసానుచరుల నిస్పృహభావంబు ! హరితుల్యార్థ దర్శను లై నిస్పృహు లై న భాగవతులకు స్వర్గాపవర్గ నరక భేదభావంబులు లేవు. ప్రాణులకు దేహ సంయోగంబువలన నారాయణలీలం జేసి యుండి ద్వంద్వాది సుఖదుఃఖంబు లాత్మయందు నజ్ఞానంబునం భేదంబు సేయంబడియె.

---

1. బంధాదిరాగంబులు (తం. వా.) "బంధంచ మోక్షంచ" (18-22) 2. నిష్కర్మ్మండై యుండు (హ); నిష్కళంకుండై యుండు (తం) మూ. "నిష్కళః" (18-22)

ఇట్టి విపర్యయంబులు భగవంతుం డైన వాసుదేవుని భక్తిగలవారిం జెందవు. 498
మటీయును.

ఉ. నేనుఁ గుమార నారదులు నీరజగర్భుఁడు దేవసంఘముల్
మానిత యోగివర్య ముని[1]మండలి మున్నగు వార మెల్ల నా
దానవ విద్విదండ † జనితంబుల మయ్యెఁ దదీయ తత్త్వముం
గానఁగనేర మీశ! ఘన గర్వమునం దలపోసి చూచుచుఁ. 499

క. ఆతనికినిఁ బ్రియుఁ డప్రియుఁ, డే తెఱఁగున లేఁడు నఖిల మెల్లను దా నై
భూతముల కాత్మ యగుటయు, భూతప్రియుఁ డొక్కఁ డాదిపురుషుఁడు తన్వీ!

ఆ. అరయఁ జిత్రకేతుఁ డతిశాంతుఁ డతిలోక
సమునఁడు విష్ణుభక్తి సంగతుండు
నితని నేమిచెప్ప? నీశుండ నగు నేను
నువిద యచ్యుతప్రియుండఁ జుమ్మ! 501

క. కావున భగవద్భక్తుల, భావమునకు విస్మయంబు పనిలేదు మహో
ధీవిభవ శాంతచిత్తులు, పావన పరతత్త్వ నిపుణ భవ్యులు వారల్. 502

వ. అనిన విని యద్రినందన విస్మయంబు మాని, శాంతచిత్త యయ్యె. అట్లు పరమ భాగవతుం డైన చిత్రకేతుం డ ద్దేవికిం బ్రతిశాపం బియ్య సమర్థుం డయ్యును, మరల శపింపక యతి శాంతరూపంబునఁ ద చ్ఛాపంబు శిరంబున ధరియించె. ఇట్లు సాధులక్షణంబులు నారాయణపరాయణులై న వారలకుంగాక యెరులకుం గలుగనేర్చునే? ఇపుడు శాపహతుం డైన చిత్రకేతుండు త్వష్ట సేయు యజ్ఞం బున దక్షిణాగ్నియందు దానవయోనిం బుట్టి, వృత్రాసురుం డన విఖ్యాతుం డై భగవద్ జ్ఞానపరిణతుం డయ్యె. కావున. 503

సీ. నరనాథ! యీ వృత్రునకు రాక్షసాకృతి గలిగిన యీ పూర్వకారణంబు
చిరపుణ్యుఁ డైనట్టి చిత్రకేతు మహోను భావంబు భక్తితోఁ బరఁగ విన్నఁ
జదివిన వారికి సకల దుష్కర్మముల్ శిథిలంబు లగుచును జెదరిపోవు
సకల వైభవములు సమకూరుఁ దమయంత తొల్కాడు కోర్కులతోడఁ గూడి

ఆ. నిర్మలాత్మ లగుచు నిత్య సత్య జ్ఞాన
నిరతు లగుచు విగత దురితు లగుచు
బంధు మిత్ర పుత్ర పౌత్రాదులను గూడి
యనుభవింపుచుందు రధిక[1]ఫలము. 504

---

1. మండల మిట్లగు) † జనితాత్మలమయ్యె(కొన్ని వ్రా. ప.) 2. సుఖము (తం. వా.)

అధ్యాయము - ౧౯

—: సవిత్రవంశాది ప్రవచనకథ :—

సీ. వినవయ్య ! నరనాథ ! విశదంబుగాఁ ద్వష్ట్ర వంశంబు సెప్పితి వాని వెనుక
‡సవిత్రుండు పృశ్నియు సావిత్రి వ్యాహృతి యను భార్యలందు నింపారు వేడ్క
నగ్నిహోత్రంబుల నరయంగఁ బశు సోమ పంచయజ్ఞంబులఁ బరఁగఁ గనియె
భగుఁడు సిద్ధిక యను భార్యకు [1]మహిమానుఁ బ్రభువును విభునిఁ దాఁ బడసె
మువురఁ

తే. దనయ నొకతెఁ గాంచెఁ ద దనంతరమున నా
తరళనేత్ర [2]స ద్వ్యతైకధామ
పుణ్యశీల సుగుణపూరిత చారిత్ర
యఖిలలోక పూజ్య యాశిషాఖ్య. 505

వ. మఱియు ధాతకుఁ †(గల కుహూ సినీవాలీ రా కానుమతు లనియెడు నలువురు భార్యలలోఁ గుహూదేవి) సాయ మను సుతునిఁ గాంచె. సినీవాలి దర్శాఖ్యునిఁ బడసె. రాక ప్రాతరాఖ్యునిఁ గాంచె. అనుమతి పూర్ణమాఖ్యునిఁ గనె. విధాత క్రియ యను భార్యయందు నగ్ని పురీష్యాదులం గనియెఁ. వరుణునకు జ్వరణి యను భార్యయందుఁ బూర్వకాలంబున బ్రహ్మపుత్రుం డైన భృగువును, వల్మీకంబునం జనించిన వాల్మీకియు నుదయించిరి. మిత్రావరుణులకు నూర్వశి సన్నిధియందు రేతఉద్గమం బైన, నదియుఁ గుంభంబునం బ్రవేశింపఁ జేయ, నందు నగస్త్యుండును, వసిష్ఠుండును జనియించిరి. ప్రత్యేకంబ మిత్రునకు రేవతియందు నుత్సర్గసంభవు లైన యరిష్టయు, పిప్పలుండు ననువారలు జనియించిరి. శక్రునకు పౌలోమియందు జయంత, ఋషభ, విదుషు లన ముగ్గురు వుట్టిరి. వామనుం డైన యురుక్రమదేవునకుఁ గీర్తి యను భార్యయందు బృహచ్ఛ్లోకుండు వుట్టె. ఆ బృహచ్ఛ్లోకునకు సౌభగాదులు పుట్టిరి. మఱియు మహానుభావుం డైన కశ్యప ప్రజాపతికి నదితియందు శ్రీనారాయణుం డవతరించిన ప్రకారంబు వెనుక వివరించెద. దితిసుతు లైన దైతేయుల వంశంబు నెఱ్ఱేద. ఆ దైతేయవంశమం

---

‡ "పృశ్నిస్తు పత్నీ సవితుః సావిత్రీం వ్యాహృతి త్రయం
అగ్నిహోత్రం పశుం సోమ చాతుర్మాస్యాన్ మహామఖాన్." (18–1)

1. మహిమానుభవుల విభవులఁ దాఁబడసె (హ.తం.వా.); మహిమాను ప్రభవ విభవ(ట)
"మహిమానం విభుం ప్రభుమ్" అని మూలము (18-2)
మూలము ననుసరించియు 'ట' పాఠమును బట్టియు పూర్వపాఠము సవరింపఁ బడినది.

2. సద్వ్రత స్వధామ (తం. వా.) † తా. ప. ప్రతులలో లేదు.

డైనను ప్రహ్లాదబలులు పరమభాగవతు లై, దైత్య దానవ వందితు లై, వెలసిరి. దితి కొడుకులు హిరణ్యకశిపు, హిరణ్యాక్షు లనఁ బ్రసిద్ధి నొందిరి. అందు హిరణ్య కశిపునకు జంభాసుర తనయ యైన దత్తకు ప్రహ్లాద, అనుహ్లాద, సంహ్లాద, హ్లాదు లను నలుగురు కొడుకులును, సింహిక యను కన్యకయుం జన్మించిరి. ఆ సింహికకు రాహువు జనియించె. ఆ రాహువు శిరం బమృతపానంబు సేయ హరి దన చక్రంబునం ద్రుంచె. సంహ్లాదునకు గతి యను భార్యయందు పంచజనుండు పుట్టె. హ్లాదునకు దమని యను భార్యయందు వాతాపిల్వలులు పుట్టిరి. వారల నగస్త్యుండు భక్షించె. అనుహ్లాదునకు నూర్మి యను భార్యయందు బాష్కల, మహిషులు గలిగిరి. ప్రహ్లాదునకు దేవి యను భార్యయందు విరోచనుండు పుట్టె. అతనికి బలి జన్మించె. ఆ బలికి నళన యను భార్యయందు బాణుండు జ్యేష్ఠుం డుగా నూర్గురు కొడుకులు పుట్టిరి. ఆ బలిప్రభావంబు వెనుక వివరించెద. బాణాసురుండు పరమేశ్వరు నారాధించి, ప్రమథగణంబులకు ముఖ్యుం డయ్యె. మఱియు నా దితిసంతానంబు లగు మరుత్తు లేకోన పంచాశ త్సంఖ్యగలవార లందఱు ననపత్యు లై యింద్రుతోఁగూడి, దేవత్వంబు నొందిరి. అనిన విని పరీక్షి
న్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 506

ఆ. ఏమి కారణమున నింద్రున కీ మరు
[1]చ్చయము లాప్తు లగుచు శాంతి నొంది?
రరయఁ దత్సమాను లగుచు వర్తించిరి?
దీని వినఁగవలయుఁ దెలుపవయ్య! 507

వ. అనిన శుకుం డిట్లనియె. 508

సీ. నరనాథ! విను తన నందను లందఱు నమరేంద్రుచే హతు లగుచునుండఁ
గోప శోకంబులఁ గ్రుళ్ళుచుఁ దనలోన మండుచు దితి చాల మఱుఁగఁదొడఁగె
భ్రాతృ[2]హంతకు నతిపాతకు నింద్రునిఁ జంపక నా కేల సొంపుగలుగు?
వీని భస్మము సేయువానిఁ గా నొక సుతుఁ బడసెద ననిచాల భర్తఁ గోరి

ఆ. ప్రియము సేయఁ దొడఁగెఁ బెక్కు భావంబుల
భాషణముల నధిక పోషణముల
భక్తియుక్తిచేతఁ బరిచర్య గతిచేత
నుతులచేత నతుల రతులచేత. 509

---

1. చయము లాప్తమగుచు శాంతినొంది యరయఁ దత్సమాన మగుచు వర్తించెను (తం)
2. ఘాతుకు (వా)

చ. కలికి కటాక్ష వీక్షణ వికారములఁ హృదయానురాగ సం
కలిత విశేష వా జ్మధుర గర్జనలఁ లలి తాననేందుమం
డల పరిశోభి తామృత విడంబిత సస్మిత సుప్రసన్న తా
ఫల రుచిర ప్రదానముల భామిని భర్తమనంబు లోఁగొనెఁ. 510

తే. అఖిల మెఱిఁగిన కశ్యపు నంతవాని
హితవు తలకెక్కు రతుల సంగతులచేత
నవకుఁ గావించె ప్రేమ్మిడి నబ్జవదన
పతుల భ్రమియింపనేరని సతులుగలరె? 511

క. ఏతలఁ పెఱుఁగక [1]నిలిచిన, భూతంబులఁ జూచి [2]ధాత పురుషుల మనముల్
[3]ప్రీతి గొలుపంగ యువతీ, వ్రాతంబు సృజించెఁ బతులు వారల కరుదే? 512

వ. ఇట్లు నిజసతిచేత నుపలాలితుం డైన కశ్యపప్రజాపతి, యా సతికిం బరమప్రీతుం డై యి ట్లనియె. ఓ తన్వి! నీకుఁ బ్రసన్నుండనై తి. వరంబు గోరుము. ఇచ్చెద. నాథుండు ప్రసన్నుం డైన స్త్రీలకుం గోరిక సంభవించుట కేమి గొఱంత? సతికిం బతియె దైవంబు. సర్వభూతంబుల మానసంబులకు వాసుదేవుండె భర్త. నామ రూప కల్పితు లైన సకల దేవతామూర్తులచేతం, బురుషులచేతను భర్తృ రూపధరుం డైన భగవంతుండు సేవింపంబడుచుండు. విశేషించి స్త్రీలచేతఁ బతిరూపంబున భజియింపంబడుచుండు. కావునఁ బతివ్రత లైన సుందరులు శ్రేయస్కామ లై యేకచిత్తంబున నాత్మేశ్వరుం డైన య ప్పరమేశ్వరుని భర్తృభావంబున సేవింపుచుండుదురు. ఏనును నీ కీ భావంబున వరదుండ నైతి. దుశ్శీల లైన వనితలకుం బొందరాని వరంబు నీ కిచ్చెద. వేఁడుము. అనిన కశ్యపునకు దితి యి ట్లనియె. 513

ఆ. వరము గోర నాకు వరదుండ వేనియు
నింద్రుఁ ద్రుంచునట్టి యిద్ధ బలుని
నమిత తేజుఁ దనయు నమరత్వ సంప్రాప్తు
నెందుఁ జెడనివాని నిమ్ము నాథ! 514

వ. అనవుడు. 515

క. ఉట్టిపడునట్టి వర మీ, కట్టిఁడి న న్నెట్టు వేఁడెఁ? గటకట! యనుచుఁ
మిట్టిపడి యతఁడు మదిలోఁ, బుట్టిన తల్లడముతోడఁ బొక్కుచు నుండెఁ. 516

---

1. నిలిచెను (హ) 2. యాత్మ (హ) 3. భీతి (తం. వా.) 'ప్రీతి' అని సవరణ యయా పుంసాం మతి ర్ష్ణ్యా (మూలము. 18.30.)

చ. ప్రకృతినిఁ గర్మపాశముల బద్ధుఁడ నైతిఁ గదయ్య! నేఁడు నీ
వికట సతీస్వరూపమున వేఁదుఱు గొల్పిన మాయ నింద్రియా
ధికమతి యైనవాఁడు దన పెంపునఁ జిత్తము వెచ్చఁ బెట్టి పా
తకములఁ గూలకున్నె ? నను దైవము నవ్వదె ? లోలితాత్మునిఁ. 517

సీ. ఖండశర్కరతోడఁ గలహించు పలుకులు పద్మవిలాస మేర్పఱుచు మోము
తుహినాంశు కళలతోఁ దులఁదూఁగు చెయ్యులు చెమటఁ గ్రొన్నెత్తురు
సేయు మేను

నిలువెల్లఁ గరఁగించు నేర్పుల యింపులు పువ్వుల కరుదైన ప్రోదిసేఁత
తమకంబు వుట్టించు తరితీపు తలఁపులు నెనసిన మదిలోని యిచ్చగింత

ఆ. కలిగి కఱవనున్న కాలాహిపోలికిఁ
జెలఁగుచున్న సతుల చిత్తవృత్తిఁ
దెలియవశమె యెంత ధృతి గలవారికి,
నాకె కాదు నిఖిల లోకములకు. 518

ఆ. కోరి సతుల కెల్లఁ గూర్చెద రెవ్వరు
పతుల నైన సుతుల హితుల నైన
బలిమిఁజేసి యైనఁ బరహస్తమున నైన
హింస సేతు రాత్మహితముకొఱకు. 519

వ. అని చింతించి, దీనికి నేమని ప్రతివాక్యం బిచ్చువాఁడ? మ ద్వచనం బెందు నమోఘంబు. త్రిలోక పరిపాలనశీలుం డైన భిదురపాణి వధార్హుండె? ఐనను దీనికి నైనయది యొకటి కల్పించెద. అని దితిం జూచి, యో తనుమధ్య! నీకు నట్ల దేవబాంధవుం డైన యింద్రహంత యగు పుత్రుండు గలిగెడు. ఒక్క సంవత్సరం బీ వ్రతంబు చరియింపుము. దీని ప్రకారంబు వినుము. ఎల్లజీవుల వలన హింసాభావంబు లేక, యతిధ్వనివాక్యంబు లుడిగి, కోపంబు మాని, యన్యతంబులు వలుకక, నఖ రోమ చ్ఛేదనంబు సేయక, యస్థి కపాలాదు లైన యమంగళంబుల నంటక, నదీ నద తటాకాదుల నవగాహన స్నానంబ కాని ఘటోదక కూపోదకంబుల స్నానంబు సేయక, దుర్జన సంభాషణంబులు వర్జించి, కట్టిన కోకయును, ముడిచిన పువ్వులును, గ్రమ్మఱ ధరియింపక, భోజనంబుల యందు నుచ్ఛిష్టాన్నంబును, చండికానివేది తాన్నంబును, గీళ ఋనక మార్జార కంక క్రిమి పిపీలికాది విదూషి తాన్నంబును, సామిషాన్నంబును, వృషలా హృతాన్నంబును, నను నీ పంచవిధ నిషిద్ధాన్నంబులు వర్జించి, దోయిట

నీళ్లు ద్రావక, యుచ్ఛిష్ట గాక, సంధ్యాకాలంబుల ముక్తకేశి గాక, మితభాషిణి యై, యలంకారవిహీన గాక, వెలుపలం దిరుగక, పాదప్రక్షాళనంబుఁ జేసికొని కాని శయనింపక, యార్ద్రపాద యై పవ్వళింపక, పశ్చిమ [1]శిర స్సయ్యును, నగ్న యయ్యును, సంధ్యాకాలంబుల నిద్రింపక, నిత్యంబును ధౌత వస్త్రంబులఁ గట్టి, శుచి యై, సర్వమంగళసంయుక్త యై, ప్రాతఃకాలంబునఁ దూర్పు మొగం బై, లక్ష్మీనారాయణుల నారాధించి, యావాహ నార్ఘ్య పా ద్యోపస్పర్శన సుస్నాన వాస ఉపవీత భూషణ పుష్ప ధూప ది పోపహారా ద్యుపచారంబుల నర్చించి, హవిశ్శేషంబు గా ద్వాదశాహుతుల వేల్చి, దండప్రణామంబు లాచ రించి, భగవ న్మంత్రంబును దశవారంబు లనుసంధించి, స్తోత్రంబు చేసి, గంధ పుష్పాక్షతల ముత్తైదువులం బూజించి, పతిని సేవించి, పుత్రుం గుఱిగతుం గా భావించి, యి ద్విధంబున మార్గశీర్ష శుద్ధ ప్రతిప దారంభంబుగా నొక్క సంవత్స రంబు సలిపి, యా ద్వాదశ మాసాంత్యదివసంబున విధ్యుక్తంబుగా నుద్యాప నంబు సేయవలయు. నీ వీ పుంసవనం బనియెడి వ్రతంబు ద్వాదశమాస పర్యంతం బేమఱక సల్పిన, నీవు కోరిన కుమారుండు గలిగెడు. అనిన దితి యా వ్రతంబుతోడనె గర్భంబు ధరియించి, వ్రతంబు సలుపుచునుండ, నింద్రుండు మాత్రభిప్రాయం బెఱింగి, యా యమ్మ నహారహంబును రహస్యంబున సేవింపుచు, వ్రతంబునకుం దగిన పుష్ప ఫల సమి త్కుశ పత్రాంకురంబులు మొద లైన వస్తు వితతిం ద్రికాలంబులం దెచ్చి యిచ్చుచుఁ, బుండరీకంబు హరిణికిం బొంచియున్నభంగి, [2]నా యమ్మ వ్రతభంగంబున కై కాచి, శుశ్రూష చేయుచు, నాయమ్మ గర్భంబున ధరియించిన తేజోవిశేషంబునకు [3]బెగ్గలింపుచుఁ, గృశింపుచు నుండె. అంత నొక్కనాఁడు. 520

సీ. వామాక్షి యనుదిన వ్రత ధారణోన్నత పరిచర్యవిధులచేఁ బడలి యలసి
యొంటి సంధ్యావేళ నుచ్ఛిష్ట యై పద ప్రక్షాళ నాదులఁ బాసి మఱచి
తన కర్మ మోహంబు తవిలి నిద్రింపంగ నింద్రుండు చయ్యన నెడరు గాంచి
యోగమాయా బలోద్యుక్తుఁ డై యా యింతి యుదరంబుఁ జొరఁబడి
యుగ్రుఁ డగుచుఁ

---

1. శిరస్క (తం. వా.)
2. తద్వ్రత భంగంబు (తం. వా.) 3. దిగులు గుడుచుచు (తం)

తే. దివిరి దేదీప్యమాన మై తేజరిల్లు
నర్భకుని వజ్రధారల నడిచె నేడు
దునుకలుగ వాఁడు దునిసియుఁ దునుకఁ దునుకఁ
జెడక నొక్కొక్క బాలుఁ డై చెలఁగుచున్న. 521

క. వారేడ్వు రగుచుఁ గుయ్యిడ, †నో రేడ్వకు మనుచుఁ ద్రుంచె నొక్కొక్కని నా
[1]శూరుం డేడేసి దునుక, గా రయమున వారు సెడక ఖండితు లయ్యెన్. 522

క. ఖండము లన్నియు నందఱు, చండాంశు సమప్రకాశ శాశ్వతు లగుచున్
మెండుకొని నిల్చి యని రా, ఖండలునకుఁ గరుణ పుట్టు గతి మదిఁ దోఁపన్. 523

వ. అందఱు ముకుళిత కరకమలు లై, నీకుం దోడఁబుట్టువులము. మమ్ము హింసింపం
బనిలేదు. నీకు బారిషదుల మై, మరుద్గణముల మై నిన్ను సేవించెదము. మమ్ము
రక్షింపుము. అనిన నారాయణ ప్రసాదంబునఁ జెడని మరుద్గణంబుల పలుకులకుఁ
గృపాళుం డై, యింద్రుండు వారల సహోదరులుగాఁ గైకొని మఱి హింసింపక
మానె. అశ్వత్థామ శరాగ్నివలన నారాయణ రక్షితుండ వైన నీవునుంబోలెఁ,
గులిశధారల శకలంబు లైన [2]కుమారు లన్ని రూపంబు లై, సంవత్సరంబునకు
నొక్కింత కడమగా హరిం బూజించిన నుద్భవించిన వారు గావున, నింద్రుతోడం
గూడ నేకోనపంచాశ ద్దేవత లైన మరుద్గణంబులు దితిగర్భంబు వెలువడిరి.
అంత దితి మేల్కాంచి, యనల ప్రకాశు లై యింద్రుతోడం గూడి వెలుంగు
చున్న కుమారులం జూచి సంతోషించక, యింద్రుం జూచి, నీకు మృత్యురూపం
బైన పుత్రుం గోరి, దుస్తరం బైన వ్రతంబు సలిపితి. సంకల్పించిన పుత్రుం
డొక్కరుండే సప్త సప్త సంఖ్యలం గల కుమారు లగుట కేమి కతంబు? నీ
వెఱింగిన భంగి తథ్యంబుఁ బలుకుము. అనిన నింద్రుం డిట్లనియె. ఓ తల్లి! భవ
ద్వ్రతంబుఁ జింతించి, సమయ విచ్ఛేదనంబునం గర్భంబుఁ జొచ్చి, పాపచిత్తుండ
నై వజ్రధారల గర్భంబు విదళనంబు చేసిన, నా శకలంబులు సెడక, మహోత్క
ర్ష్యంబుగా ని ద్విధంబునం గుమారకు లైరి. మహాపురుష పూజాసంధి కారణ

---

† 'ఓరి+ఏడ్వకు' అని సంధి. ఓరి యఱువకనుచుఁ ద్రుంచె (వా)

1. శూరుండేడ్గురిఁ దునకలుగా (హ. వా.)
2. కుమారుఁ డన్ని రూపంబులై (తం. వా.)

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

నుషంగి గాకుండునే? భగవ దారాధనంబు గోరికలం బాపి యెవ్వరు గావిం తురు, వా రిహపరంబుల సర్వార్థ కుశలు లగుదురు. అ మ్మహాపురుష వ్రత సముత్పన్న తేజంబు నడంప నెవ్వండోపు? కావున దుర్మదంబున బాలిశ స్వభా వుండ నై దోషంబు చేసిన నా దౌర్జన్యకర్మంబు సహింపఁ దల్లి కన్న నెవ్వరు సమర్థులు? పాపాత్ముండ నగు నన్నుం గావుము. నేను వీరల తోడివాఁడ. అని నిష్కపటంబుగాఁ బ్రార్థించిన, న ద్దేవి యట్లకాక యని, శాంతచిత్త యయ్యె. ఇంద్రుండును వారలం గూడి త్రిదివంబునకుం బోయి, సోమపాన, హవిర్భాగం బులు వారలకుం బంచిపెట్టి, కూడి, సుఖం బుండె. అని చెప్పి, పరీక్షి న్న రేంద్రు నకు శుకయోగీంద్రుండు వెండియు ని ట్లనియె. 524

క. హరి వరదుఁ డైన వ్రత మఁట, హరివంశజు లగుచు నెగడు నమరుల జన్మ స్ఫురణం బఁట, పఠియించిన, నరయఁగ నురు దీర్ఘ [1]కర్మహర మగు టరుదే?

వ. అని విష్ణు కథాశ్రవణ కుతూహలాయమాన మానసు లైన శౌనకాది మహా మునులకు సూతుండు నెప్పె. అని శుకయోగీంద్రుండు పరీక్షి న్న రేంద్రునకుఁ జెప్పె. అనుటయు. 526

క. [2]రాజీవరాజ పూజా, శ్రీజిత గోపీకటాక్ష సేవాంతర వి భ్రాజితమూ ర్తి! మదోద్ధత రాజకులోత్సాద! రామరాజాఖ్య నిధీ! 527

తరల. మురవిదారణ! ముఖ్య కారణ! మూలతత్త్వ విచారణా!
దురిత తారణ! దుఃఖవారణ! దుర్మదాసుర మారణా!
[3]కిరివిహారణ! కీర్తిపూరణ! కీర్తనీయ మహా రణా!
ధరణి ధారణ! ధర్మ తారణ! తాపస స్తుతి పారణా! 528

తోటకము. కరుణాకర! శ్రీకర! కంబుకరా!
శరణాగత సంగత జాడ్యహరా!
పరిరక్షిత శిక్షిత [4]భక్తమురా!
కరిరాజ శుభప్రద! కాంతిధరా! 529

---

1. పాప (హ) 2. రాజీవ రాజపూజ వి, రాజిత (క) 3. గిరి (తం) 4. భక్తహరా(హ)

గద్య. ఇది శ్రీ సకల సుకవిజన మిత్ర శ్రీవత్సగోత్ర పవిత్ర కసువయామాత్య పుత్ర బుధజన ప్రసంగానుషంగ సింగయనామధేయ ప్రణీతం బైన శ్రీ మహాభాగ వత పురాణంబునందు నజామిళోపాఖ్యానంబును, బ్రచేతసులఁ జంద్రుం డా మంత్రణంబు సేయుటయు, దక్షోత్పత్తియుఁ, బ్రజాసర్గంబును, దక్షుండు శ్రీహరిం గూర్చి తపంబు సేయుటయు, నతనికి న ప్పరమేశ్వరుండు ప్రత్యక్షం బగుటయు, హర్యశ్వ శబలాశ్వుల జన్మంబును, వారలకు నారదుండు బోధించు టయు, నారదు వచనప్రకారంబును, వారు మోక్షంబు నొందుటయుఁ, ద ద్వృత్తాంతంబు నారదు వలన విని, దక్షుండు దుఃఖాక్రాంతుం డగుటయుఁ, ద దనంతరంబ బ్రహ్మవరంబున దక్షుండు శబళాశ్వసంజ్ఞుల సహస్రసంఖ్యాకులగు పుత్రులం గాంచుటయు, సృష్టి నిర్మా ణేచ్ఛా నిమిత్తంబున దక్షుపంపున వార లగ్రజన్ములు సిద్ధిం బొందిన తీర్థరాజం బయిన నారాయణ సరస్సునకుం జనుటయు, వారికి నారద భగవంతుండు బ్రహ్మజ్ఞానంబు నుపదేశించుటయు, వారు పూర్వజు లేఁగిన ప్రకారంబున మోక్షంబు నొందుటయుఁ, ద ద్వృత్తాం తంబును దక్షుండు దివ్యజ్ఞానంబున నెఱింగి, నారదోపదిష్టం బని తెలిసి, నార దుని శపించుటయు, నారదుండు దక్షుశాపంబు ప్రతిగ్రహించుటయు, దక్షునకు మఱల బ్రహ్మవరంబున సృష్టివిస్తారంబు కొఱకు కూఁతు లఱువది మంది జన్మించుటయు, నందుఁ గశ్యపునకు నిచ్చిన పదుమువ్వుర వలన సకల లోకంబులు నిండుటయు, దేవాసుర, నర, తిర్య, ఙ్మ్మగ, ఖగాది జన్మంబు లును, దేవేంద్ర తిరస్కారంబున బృహస్పతి యధ్యాత్మ మాయచేతం గానరా కుండుటయు, ద ద్వృత్తాంతంబు రాక్షసులు విని శుక్రోపదిష్టు లై వచ్చు టయును, దేవాసుర యుద్ధంబును, నాచార్య తిరస్కారంబున దివిజ రాజ పలాయనంబును, బలాయమాను లై దేవతలు బ్రహ్మ సన్నిధికిం జనుటయు, బ్రహ్మ వాక్యంబున ద్వష్టృ కుమారుం డైన విశ్వరూపు నాచార్యునింగా దేవ తలు వరించుటయు, విశ్వరూపు ప్రసాదంబున నింద్రుండు నారాయణ వర్మం బను కవచంబు ధరియించి రాక్షసుల జయించుటయుఁ, బరోక్షంబున రాక్షసులకు ననుకూలుం డైన విశ్వరూపు నింద్రుండు వధించుటయు, విశ్వ రూపు వధానంతరంబున నింద్రునకు బ్రహ్మహత్య సంప్రాప్తం బైన, నింద్రుండు స్త్రీ, భూ, జల, ద్రుమంబులయందుఁ బంచి పెట్టుటయు, విశ్వరూపుండు హతుం డగుటకు త్వష్ట కోపించి యింద్రవధార్థంబు మారణహోమంబు సేయ వృత్రాసురుండు జనియించుటయు, వృత్రాసుర యుద్ధంబునఁ బరాజితు లై యింద్రసహితు లైన దేవతలు శ్వేతద్వీపంబునకుం జనుటయు, నందు శ్రీహరి

ప్రసన్నుం డై దధీచివలన భిదురంబు గైకొనుటయు, నింద్రుండు వజ్రాయు
ధంబున వృత్రుని సంహరించుటయు, నింద్రుండు బ్రహ్మహత్యా పీడితుం డై
మానస సరస్సం బ్రవేశించుటయు, నహుషుండు శతాశ్వమేధంబులం జేసి,
యింద్రాధిపత్యంబు వడయుటయు, నహుషుం డగస్త్య శాపంబున సుర
రాజ్య చ్యుతుం డై, యజగరయోనిం బుట్టుటయు, నింద్రాగమనంబును,
నశ్వమేధంబును, నింద్రుండు త్రిలోకాధిపత్యంబు వడయుటయును, జిత్రకే
తూపాఖ్యానంబును, మరుద్గణంబుల జన్మప్రకారంబును ననుక్రమంబున గల
షష్ఠ స్కంధము సంపూర్ణము.

BCi

BC

AOVA105B159

AOUA105B159	রেজিস্ট্রেশন নম্বর
ইউনিভার্সিটি অফ আগরতলা02	ডাক বিভাগ
31 December 2025	তারিখ
	মোট প্রাপ্ত নম্বর
	মোট প্রাপ্ত নম্বর
359	অঙ্কে মোট
	চূড়ান্ত গ্রেড অঙ্কে
	গ্রেড অঙ্কে
	কাজের অভিজ্ঞতা
	চূড়ান্ত প্রাপ্ত নম্বর
	ফলাফল
SARANYA	নাম
	পিতার নাম
	মাতার নাম
	স্বাক্ষর
9000	তারিখ

রেজিস্ট্রেশন সার্টিফিকেট পরীক্ষা